First time in Telugu Literature

Western Classics Series - 4

John Milton's

PARADISE LOST

పారడైజ్ లాస్ట్

స్వేచ్ఛానువాదం

డాక్టర్ లంకా శివరామప్రసాద్

Paradise Lost

John Milton



స్వేచ్ఛానువాదం

డాక్టర్ లంకా శివరామప్రసాద్

Paradise Lost

John Milton

Translated by

Dr. Lanka Siva Rama Prasad

May 2012

All rights reserved

Translation Copyright @ 2012
by **Dr. Lanka Siva Rama Prasad**

Published by:

Dr. Lanka Siva Rama Prasad
Srijana Lokam / Writer's Corner
Prasanthi Hospital
Sivanagar, WARANGAL
Andhra Pradesh - 506 002, INDIA
Mobile : 8897849442, 9177646501
Email: lankasrprasad@gmail.com

Available at :

Vishalandhra Book House
All Branches

Price : ₹ **300** **$ 10**

Cover Design & Post Script
Gannu Suresh & P. Prakash

Printed at :

Vasavi Printers
J.P.N. Road, Warangal. ✆ 0870-2426364

This book is presented to...

Bibliography

1. John Milton - **Paradise Lost**
2. John Milton - **Paradise Regained**
3. **The Reader's Digest Bible**
4. పవిత్ర గ్రంథం – క్యాతలిక్ అనువాదం
5. **Christ and the Fine Arts** - Cynthia Pearl Maus
6. **Holy Bible**
7. **The use and value of Anthologies** - Dr. Richerol Garnet
8. **Jeuseus Survey of the Old Testament** - Gensen
9. **Greek Trilogy** (Telugu) - Dr. Lanka Siva Rama Prasad
10. **Wikipedia**

ప్రస్తావన

పాశ్చాత్య వాఙ్మయానికి తలమానికాలైన హోమర్ రచించిన ఇలియాడ్, ఒడెస్సీలను వాటిని ఇముడ్చుకున్న ఎపిక్‌సైకిల్ (ఇతిహాసచక్రం)ను తెలుగు సాహిత్య చరిత్రలోకి మొట్టమొదటిసారిగా వెలుగులోకి తీసుకువచ్చిన సృజనలోకం ఈసారి జాన్‌మిల్టన్ రచించిన పారడైజ్ లాస్ట్, పారడైజ్ రిగెయిన్డ్ (Paradise Lost & Paradise Regained) లను సవినయంగా అందిస్తున్నది. మిల్టన్ కావ్యాలు శ్రావ్యంగా, కర్ణపేయంగా ఉండడమే గాక, అంతర్నేత్రాన్ని అద్భుత వర్ణనాదృశ్యాలతో అలరింపజేస్తాయి.

శ్రీ కడియాల రామమోహనరాయ్ గారి సూచనతో అనుకున్నదానికన్నా ముందుగా ఈ అపురూప కావ్యాలు తెలుగు ప్రజల ముందుకు వస్తున్నవి. వారికి నా కృతజ్ఞతలు.

ఇంగ్లండ్ రాజు ఛార్లెస్-I ఉరితీయబడిన తర్వాత, ప్యూరిటన్–ఆలివర్ క్రామ్‌వెల్ పాలన, ఆతడు మరణించిన తర్వాత, ఛార్లెస్-II రాజుగా తిరిగి రాజరికం పునరుద్ధరించబడడం (Restoration)– అటువంటి కల్లోల కాలంలో రాజరికానికి వ్యతిరేకులైన ఒక మహా పండితుడి కావ్యం పారడైజ్ లాస్ట్ కాగా, ఒక సాధారణుడైన వ్యక్తి నుంచి పెల్లుబికిన కావ్యం – ద పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్. కవిత్వంలో జాన్‌మిల్టన్, వచనంలో జాన్‌బ్యునన్‌లు అప్పటికీ ఇప్పటికీ 'నెంబర్ ఒన్'లుగా, సాటిలేని వారుగా ప్రసిద్ధికెక్కినారు. జాన్‌మిల్టన్‌కు సమకాలీనుడైన జాన్‌బున్యన్ వ్రాసిన మార్మిక ప్రతీకాత్మక కావ్యం 'తీర్థయాత్రికుని ప్రగతి' (The Pilgrim's Progress) ప్రస్తుతం అచ్చులో ఉన్నది.

పారడైజ్ లాస్ట్, పారడైజ్ రిగెయిన్డ్ రెండు కావ్యాలను తెలుగు పాఠకుల సౌలభ్యార్థం ఒకే గ్రంథంగా ఇస్తున్నాము. ఇంగ్లీషు పాఠకులకోసం 'వికీనోట్స్' – చివరగా ఇవ్వబడుతున్నది. వర్జిల్ – ఈనీడ్; డాంటే–డివైన్ కామెడీలు త్వరలో తెలుగు పాఠకుల ముందుకు రాబోతున్నవి.

అందరినీ విశేషంగా అలరించిన గ్రీకు వాఙ్మయంలానే (ఇలియాడ్, ఒడెస్సీ, ఇతిహాసచక్రం) ఈ కావ్యాలూ ఆకట్టుకుంటాయని సృజనలోకం మనసారా ఆశిస్తున్నది.

– డాక్టర్ లంకా శివరామప్రసాద్

విషయసూచిక

1. పాండెమోనియంలో సాతాను, అతని అనుయాయుల సమావేశం 1
2. నూతన లోకాన్వేషణలో సాతాను దీర్ఘప్రయాణం 20
3. సాతాను ప్రయాణాన్ని పసిగట్టిన దేవాధిదేవుడు 41
4. ఈడెన్ తోటలో ప్రవేశించిన సాతాను. 56
5. ఆదాంను హెచ్చరించిన రాఫెల్ 75
6. సాతానుపై అవతారపురుషుని (Messiah) విజయం 90
7. దేవదేవునిచే నూతనలోక సృష్టి..... 105
8. ఆదాంను హెచ్చరించి రాఫెల్ నిష్క్రమణ 114
9. సాతాను బోధతో జ్ఞానఫలాన్ని రుచిచూసిన ఈవ్ 124
10. అవిధేయతానంతర పరిణామాలు..... 144
11. భవిష్యదర్శనం 163
12. పారడైజ్ నుంచి ఆదాం, ఈవ్‌ల బహిష్కారం 179

1. పాండెమోనియంలో సాతాన్, అతని అనుయాయుల సమావేశం

దైవాజ్ఞను ధిక్కరించిన మానవుని అవిధేయతకు శిక్షగా అతడు, తన సహచరితో సహా స్వర్గం నుంచి బహిష్కరింపబడడంతో ఈ కథాఘట్టం ప్రారంభమవుతుంది. ఆదిమానవుని పతనానికి కారణమైన మహాసర్పం లేదా సర్పాన్ని ఆవహించిన సాతాన్, తనను అనుసరించిన దేవదూతల సైన్యంతో దేవునిపై తిరుగుబాటు చేయగా, మహాశక్తివంతుడైన ప్రభువులకే ప్రభువు సాతాన్‌ను సర్వసైన్య సమేతంగా పెంజీకటి అగాధంలోకి తరిమివేయడం (అప్పటివరకింకా ద్యులోకం (Heaven), భూమి (Earth) సృష్టింపబడలేదు. ఆ కటిక చీకటి అగాధాన్నే కేయాస్ (Chaos) – గందరగోళస్థితి – అవ్యక్తస్థితి) అన్నారు.

ఆ అగాధపు అడుగున పాతాళ జ్వాలాసరోవరం (Burning lake)లో ప్రచండమైన పిడుగుల వర్షపుధాటికి అచేతనంగా పడివున్న సాతాన్ కొన్నాళ్లకు తేరుకున్నాడు. తానూ, తన వాళ్లూ ఉన్న దుర్భరమైన స్థితికి ఖిన్నుడై, తన అనుచరుల్ని మేల్కొల్పి వారికి అర్హతలను బట్టి పదవులను, బాధ్యతలను అప్పజెప్పుతూ సంగ్రామానికి సన్నద్ధులను చేస్తూ, తిరిగి స్వర్గాన్నెలా వశపరచుకోవాలో వివరిస్తూ, త్వరలో సృష్టించబడనున్న నూతన ప్రపంచాన్ని, నూతన జీవజాతి గురించి చెబుతాడు. అనాదిగా చెప్పబడుతున్న జోస్యంగా, కనబడుతున్న సృష్టికన్నా దేవదూతలు ఆద్యులన్న విషయాన్ని ఋజువు చేయడానికి సంపూర్ణ సమావేశాన్ని ఏర్పరుస్తాడు. ఆ క్షణంలోనే అగాధం నుంచి ఆవిర్భవించిన సాతాను నిలయమైన పాండెమోనియం (Pandemonium) లో పాతాళ నరకపు పెద్దలంతా తమతమ స్థానాల్లో ఆసీనులౌతారు. సమావేశం ప్రారంభమవుతుంది.

Of man's first disobedience,
and the fruit of that forbidden tree,
whose mortal taste brought death into the world,
and all our woe with loss of Eden,
till one greater man restore us,
and regain the blissful seat.

ఇది మానవుని తొలి దైవధిక్కారమూ, అవిధేయత గురించి,
నిషేధ వృక్షపు ఫలాన్ని రుచిచూసి

ప్రపంచంలోని మృత్యువునూ, కష్టాల కడగండ్లనూ మన ప్రాప్తం చేసి
ఈడెన్ స్వర్గ ఉద్యానవనాన్ని కోల్పోవడం నుంచీ...
మరల ఓ మహా మనీషి జన్మించి మర్త్యులకు
సచ్చిదానంద స్వరూపమైన ఆ స్థానాన్ని పునఃప్రాప్తింపజేయడం వరకూ...

"గానం చేయి! ఓ సకలకళాధిదేవతా! మ్యూజ్!
ఒరెబ్, సినాయ్ (Oreb, Sinai) రహస్యతలాలపై
నడయాడిన ఆ గొర్రెల కాపరి (Shepherd)
ఎన్నిక చేయబడ్డ సంతతికి ఎరుక చెప్పిన విషయం!
కేయాస్ (Chaos) గందరగోళం నుంచి
భూ, ద్యు (Earth, Heaven) లోకాలు ఎలా వెలువడ్డాయో,
సియాన్ (Sion) పర్వతరాజం, సిలోవా (Siloa) సెలయేరు, కోనేరు
దైవ సంకల్పంతో ఎలా ఆవిర్భవించాయో వివరించు తల్లీ!
నేను వ్రాయబోతున్న ఈ అద్భుత సాహస గీతానికి
నీ స్ఫూర్తికై ప్రార్థిస్తూ, సకల కళాధిదేవతల పుట్టినిల్లైన
యవన పర్వత శిఖరాగ్రాన్ని (Ionian Mount) అందుకునేలా
ఇంతవరకెవ్వరూ సాహసించని నూతన కవితామార్గాన పయనించేలా
స్వచ్ఛమై, పవిత్రమై, ప్రశాంతమైన సమస్త దేవాలయాల సాక్షిగా
నా మానస సరోవరంలోకి నీ అనంత శక్తిని ప్రచోదించుము, తల్లీ!

సమస్తమూ తెలిసిన దానివి నీవు.
ఏ అపూర్వశక్తి ఈ అంతులేని అగాధంపై
విప్పారిన రెక్కలతో విహరించిన పావురమై
పొదిగి దానిని ఫలవంతము చేసినదీ నాకెరుకపరుచు తల్లీ!
నాలో ఉన్న అజ్ఞానపు చీకట్లను తొలిగించి
జ్ఞాన జ్యోతిని వెలిగించి, ప్రకాశవంతం చేసి
తద్వారా నేనిప్పుడు రచించనున్న పరమ శాశ్వత సత్యాన్నీ,
భగవానుని దివ్య లీలావిశేషాల్నీ ఈ మానవులకి అందించేట్లు
నన్ను ఆశీర్వదించుము! మాతా!

I may assert Eternal Providence
and Justify the ways of God to Man.

ప్రథమంగా ఈ విషయాన్ని నాకు విశదపరుచుము తల్లీ!
వెలుగులోకంలోనైనా, నరక కూపంలోనైనా

ఏ సంగతీ నీ నిశిత దృష్టిని దాటిపోలేదు.
మరి, మాతా! ఎందుకు ఆ దేవదేవుని ఆనతి జవదాటి తొలి దంపతులు
అద్భుతమైన స్వర్గాన్ని, ఆ మహా మహిమాన్వితుడైన సృష్టికర్తనూ,
విడిచి బహిష్కృతులై తలదించుకు వెడలవలసి వచ్చింది?
ఎవరు వాళ్లను ప్రలోభపెట్టి పతనం చెందించారు?
ఆ పాతాళ నీచసర్పం దేవదేవునిపై పగ సాధించబూని
అసూయ ద్వేషాలు తన కుటిలబుద్ధికి అండకాగా
మానవుల ఆదిమాత 'అవ్వ' (Eve) ను ఎందుకు మోసం చేసాడు?

అతిశయించిన గర్వం, అహంకారం అతని స్వర్గచ్యుతికి కారణమైనా
తిరగబడిన దేవదూతల సహాయ సహకారాలతో
ఒక మహాసేనా నివహానికి నాయకుడిగా ప్రకటితమై
తనకు తాను దేవదేవునికి సమఉజ్జీగా భ్రమించి
రాజాధిరాజు, ప్రభువులకు ప్రభువైన భగవానునితో
మహాసంగ్రామానికి తలపడి మట్టికరిచాడు.

అత్యున్నతుడు, మహా శక్తిమంతుడైన ఆ దేవదేవుడు
ఆ తిరగబడ్డ దేవదూతలను ససైన్యంగా
ప్రచండ జ్వాలావీచికలతో చుట్టచుట్టి
వెలుగులోకపు అంచుల నుంచి అడుగులేని పాతాళ బిలాల్లోకి
అడమాంటైన్ (Adamantine) సంకెళ్లతో బంధించి
అత్యంత దుస్సహాగ్నిజ్వాలల్లో మండి, మాడి, కృంగి, కృశించేలా విసిరికొట్టాడు.
ఆ సర్వవ్యాపకుడు, శక్తిశాలిని ఎదిరించి ఎవరు నిలువగలరు?
Who durst defie the Omnipotent to arms ?
దుస్సాహసం చేసినవాడు.
మానవులకు రాత్రింబవళ్లైన కాలానికి తొమ్మిదిరెట్లు
ఆ కరాళకార్చిచ్చులలో తన సైన్యంతో సహా కొట్టుమిట్టాడుతున్నాడు.
అమరులు కాబట్టి మరణం లేదు.
కాని పరాజయ అవమానభారం వాళ్లను మరింత కృంగదీస్తోంది.

స్వర్గ సౌఖ్యాలకు దూరమై, అంతులేని నరకయాతన అనుభవించవలసి రాగా మొక్కవోని అహంకార గర్వాలు ఆతని మనసును కలిచివేస్తున్నాయి. ఆతని నిశిత దృక్కులు తామున్న దుర్భరస్థితిని అంచనావేస్తున్నాయి. అగ్నిజ్వాలలు వెదజల్లుతున్నా వెలుగులేని ఆ అంధకార కూపంలో ఎక్కడచూసినా విషాదమే! రోదనలు, దుఃఖాల నీడల చీకటి ప్రదేశమే! శాంతికి విశ్రాంతికి చోటులేని ఆశారహిత

గుయ్యారమది. అక్కడ కనిపించేదల్లా అంతులేని దారుణ చిత్రహింసల ఆటస్థలం. ఆ ప్రజ్వరిల్లే మహోగ్రజ్వాలలకు ఆజ్యంగా అక్షయగంధకపు గనులు. తిరుగుబాటు దారులకు శాశ్వత న్యాయస్థానము ఏర్పరచిన చీకటి చెరసాల. తేజోమయుడైన దేవదేవునికి, వెలుగులోకానికి కడుదూరంలో విసిరివేయబడ్డ కటిక చీకటి ప్రదేశం.

భూమధ్య రేఖనుంచి ధృవాలకున్న దూరానికి మూడురెట్లు దూరంలో ఆ దుర్భర మురికి నరకకూపంలోకి వాళ్లు నెట్టివేయబడ్డారు. ప్రళయ మహోగ్ర జ్వాలావృత సుడిగుండాలూ, హోరుగాలి కెరటాలూ వాటి మధ్య నిస్సహాయంగా పడివున్న తనవాళ్లను గమనించాడు ఆ మహాసేనాని.

తన దగ్గర్లోనే మరోవ్యక్తి.

నేరాల్లో, పాపాల్లో, శక్తియుక్తుల్లో, క్రౌర్యంలో దాదాపు తనంతటివాడు. భవిష్యత్ పాలస్తీనాలో 'బీల్‌జెబబ్' (Beelzebub) గా ప్రసిద్ధికెక్కనున్నవాడు.

అతడిని గమనించి, నరకలోకపు నిశ్శబ్దాన్ని భంగపరిచే స్వరంతో స్వర్గలోకపు ప్రధాన శత్రువు 'సాతాన్' (Satan)* ఇలా పలికాడు.

"ఎటువంటి వాడితడు? ఎలా పడిపోయి ఉన్నాడు?
అనంతమైన కాంతివలయాలు పరివేష్టించివుండగా
వెలుగులు విరజిమ్ముతూ నాతో కలిసి, కోటి ఆశలు, ఆలోచనలతో
ఓ మహత్తరమైన సాహసకృత్యంలో పాలుపంచుకున్నవాడు,
ఈనాడు నాతోకూడి అంతులేని దుఃఖాన్ని అనుభవిస్తున్నాడు!
భయంకరమైన ఆయుధ సంపత్తితో యుద్ధరంగాన్ని వణికించినవాడు.
అంతెత్తు నుంచి అగాధపు గోతిలోకి పతనం చెందినాడు!
మా శత్రువు, ఈనాటి విజేత తన ప్రచండమైన ఉరుములతో, పిడుగులతో
మాకీ హీనస్థితిని కలిగించేంత వరకు ఈతడు పరాజితుడు
కాగలడని ఎవరన్నా అనుకున్నారా? లేదే!
వెనకటి బాహ్యపు మెరుపు, వన్నెతగ్గినా
ఆ దృఢ నిశ్చయం, మహా అలక్ష్యం, ఓటమిని అంగీకరించని
ధీరత్వం వాటిలో మార్పురాదు.
మా ప్రతిద్వంద్విపై అనంతసేనావాహినితో
స్వర్గలోకపు పొలిమేరలో యుద్ధానికి దిగి

*Satan - (Greek - Satan = Adversary; Hebrew - Satan-an enemy; oppose, plot against;) In the Bible, the great adversary of God and tempter of mankind; the Devil (ho diabolous), Identified with Lucifer who in Semitic Mythology, led a revolt against God, was defeated by the archangel Michael and cast into hell as punishment for his pride.

ఆతని సింహాసనాన్ని, ఏకఛత్రాధిపత్యాన్ని వణికించలేదా!
ఒక యుద్ధంలో ఓడిపోగానే ఏమవుతుంది?
ఇదే ఆఖరి పరాజయం కాదు.
మొక్కవోని ఆత్మవిశ్వాసం, ప్రతీకారేచ్ఛ,
నిత్యాగ్నిహోమంలా ప్రజ్వరిల్లే ద్వేషం, లొంగుబాటు మాటెత్తని
తెగువ... వీటిని ఎవరు లొంగదీయగలరు? ఓడించగలరు?
ఆతనికా కీర్తి దక్కనివ్వం!
ఆతని ముందు మోకరిల్లి, ఆతని కీర్తిని శ్లాఘిస్తూ
మేమెన్నటికీ ఆతనికి దాసోహమనబోము!
మా భయంకరమైన ఆయుధ సంపత్తితో, శక్తియుక్తులతో
ఆతని సర్వంసహా సామ్రాజ్యాధికారాన్నే ధిక్కరించామే!
అయినా ప్రారబ్ధవశాన మాకీ స్థితి దాపురించింది.
సిగ్గు, లజ్జ, పరాభవాగ్ని మమ్మల్ని హతాశుల్ని చేసినా
దెబ్బకు దెబ్బతీస్తాం.
ఇంతకుమించిన శక్తి సామార్థ్యాలతో, మరింత ముందుచూపుతో
మెరుగైన ఆశావహ దృక్పథంతో
శక్తితోనో, యుక్తితోనో, కుట్రతోనో, కుతంత్రంతోనో
ఆతనిపై నిరంతర నిత్య యుద్ధాన్ని ప్రకటిస్తున్నాము.
మా శాశ్వత శత్రువు ఇప్పటి తాత్కాలిక విజయానికి పొంగిపోనీ.
స్వర్గానికి ఏలికగా, నియంతగా, సంతోషంగా పరిపాలించుకోనీ!"

స్వర్గ భ్రష్టుడైన ఆ దేవదూత బాధ, అవమానం, కాంక్ష, విషాదం కలబోసిన భావాలతో తన మనసులోని ఆవేదనను వెళ్ళగక్కాడు.

నమ్మకస్తుడూ, విధేయుడూ, అత్యంత ధైర్యశాలి అయిన ఆ సేనాని వినయంగా బదులు పలికాడు.

"రాకుమారా! బహు సింహాసనాధినేతా! తమ అదుపాజ్ఞలలో దేవదూతలు, స్వర్గానికి ప్రస్తుత ప్రభువైన దేవాధిదేవుని ఢీకొని అతని శక్తికి పరీక్షను పెట్టారు. బలం వల్లనో, అవకాశం కలిసి రావడం వల్లనో, విధి ప్రేరేపణతోనో ఆతడు తన సింహాసనాన్ని కాపాడుకోగలిగాడు. మనం పరాజితులమై స్వర్గాన్ని కోల్పోయి, ఈ దుర్భర నరకకూపంలోకి నెట్టివేయబడడం నేను కళ్లారా చూసాను. అయినా మా మనసులు, ఆత్మలు పరాజయాన్ని అంగీకరించడం లేదు. కోల్పోయిన సత్తువ మనకు

తిరిగి వస్తుంది. మన భోగభాగ్యాలు, కీర్తిప్రతిష్ఠలు అడుగంటి, మనం నిరంతర యాతనారూప నరకంలో మగ్గవలసి వచ్చినా, మంచికాలం రానున్నది.

మనల్ని ఓడించిన సర్వశక్తిమంతుడు (Almighty), ఎందుకంటున్నానంటే అత్యంత శక్తివంతులమైన మనల్నే నిలువరించగలిగిన ఆతని శక్తి దొడ్డదే నిస్సందేహంగా! ఆతని ప్రతీకారాగ్నిజ్వాలల్లో మనం అంతులేని బాధల్ని అనుభవించడమే ఆతని అభిమతమా! లేక సమర విజేతగా తనకు సంక్రమించిన అధికారంతో మనల్ని ఈ నరకాగ్నికూపంలో పలు బాధలు పెట్టి, ఊడిగం చేయించుకోవడం ఆతని ఉద్దేశమా! లేక ఇక్కడే ఈ దుర్భర నరకయాతననుభవిస్తూ శాశ్వతంగా కృంగి కృశించవలెనా? ఏది మన కర్తవ్యం? ఏది దారి?"

ఆ ప్రశ్నలకు మహావంచకుడిలా సమాధానమిచ్చాడు.

"ఆరూఢ పతితుడవైన దేవదూతా! O Fallen Cherube! నిస్త్రాణ ఒక దురవస్థ! ఎదురుతిరగాలో, బాధపడాలో ఏదో ఒహటి ఖచ్చితంగా నిశ్చయించుకోవాలి. అతడు అనుకునే మంచిగా ఉండడం మన అభిమతం కారాదు. మన శత్రువు చేసే ప్రతి పనికీ అంతరాయం కలిగించడమో, దుష్కీర్తిపాలు చేయడమో మన కర్తవ్యం కావాలి. మన చెడునడవడి ఆతడు తలపెట్టిన కార్యాలకు అంతిమంగా శుభాన్ని చేకూర్చేటట్లయితే అటువంటి ముగింపు రాకుండా మనం కుట్రలు పన్నాలి. మంచిపనుల్లో కూడ చెడుత్రోవలు పసికట్టి వాటిని బహుకృతం చేసి ఆతడిని, ఆతడి ఆంతరంగిక మిత్రుల్ని అష్టకష్టాలపాలు చేసి వాళ్ల అంతిమలక్ష్యం నెరవేరకుండా అడ్డుపడాలి.

అయితే గమనించు! ఆగ్రహంతో ఊగుతున్న విజేత తన ప్రతీకారాగ్ని జ్వాలా సేనల్ని స్వర్గద్వారాలవేపు ఉపసంహరించుకున్నాడా, లేదా! మనపై పెనుతుఫానులా విరుచుకుపడ్డ గంధకపు వడగళ్లవాన నెమ్మదించిందా, లేదా! స్వర్గలోకపు అగ్నిపర్వత చరియల నుంచి వెలువడి మనల్ని ఈ నరక కూపంవేపు నెట్టివేసిన ఘోరాగ్నిజ్వాలలు ఉపశమించినవా, లేవా! ఆ ప్రళయభయంకర ఉరుములు, పిడుగులు, వాటికి రెక్కల్లా అమరిన మెరుపుతీగెలు ఆతని వింటినుండి వెలువడిన బాణాలై మనల్ని పరాజితుల్ని చేసిన ఆ అస్త్రశస్త్రాలింకా మిగిలి ఉన్నవా, లేవా! ఆతని కోపాగ్ని కానీ; తిరస్కారపు హేళనా జ్వాలలుకానీ, ఏ సందర్భాన్నీ మనం వదిలేది లేదు.

ఈ నిశ్శబ్ద నీరవ నిబిడాంధకారపు నరకకూప మైదానాల్ని అవలోకించు! ఈ కాంతివిహీనపు జ్వాలల్లో కనిపిస్తున్న దుర్భర విషాదఘట్టాల్ని, సొమ్మసిల్లిన మన

సేనావాహిని సత్తువను అంచనావేయి! ఎక్కడైనా కాసింత ఉపశమనం కలిగేచోటులో మన వాళ్లను విడిది చేయించి పునఃశక్తిని పొందేలా చూడు. ఎలా మనం ఈ గండం నుంచి, ఈ దురవస్థ నుంచి బయటపడాలో చర్చించు. అందరం కలిసి మన శత్రువునెలా ఎదిరించాలో, ఎలా మన చేజారిన స్వర్గాన్ని రాబట్టుకోవాలో, ఈ నిరాశా నిస్పృహల నుంచి బయల్పడి ఆశావహ దృక్పథంతో ఎలా ముందడుగు వేయాలో ఆలోచించి కార్యోన్ముఖుల్ని చేయి. ఈ పనిని తక్షణం చేబట్టు!"

అలా సాతాన్ తన ఆంతరంగిక సేనానికి కర్తవ్యబోధ చేసాడు. తనను ఆవరించి ఉన్న ప్రళయాగ్నిజ్వాలా కెరటాలపైన తన మహోగ్రమైన శిరస్సు నిలిపి, అగ్నిగుండాల్లా మెరుస్తున్న కళ్ల నుంచి విస్ఫులింగాలు వెలువడగా విశాలమైన అతని శరీరభాగాలు వరదకెరటాల్లా విప్పారి పురాణగాధల్లో పేర్కొనబడిన బ్రహ్మాండమైన వికృతాకారంతో ఆతడు జోవ్ (Jove-Zeus-వెలుగుదేవుడు) దేవుని ఎదిరించిన దైత్యునిలా (Titanian or Earth-born); ప్రాచీన టార్సస్ (Tarsus) చే శోధించబడిన శతబాహువు బ్రయారియాస్ లేదా టైఫాన్ (Briarios or Typhon)లా, దేవునిచే సృజింపబడిన జంతువులలోకెల్లా అతిపెద్ద సముద్ర రాకాసిమృగం లెవియాథాన్ (Leviathan)లా (ఈ మృగం నార్వే సముద్రజలాల్లో విశ్రమిస్తున్నపుడు ఒక ద్వీపంలా కనపడగా, అనుభవంలేని నావికులు తమ పడవలను లంగరువేసి నిలిపి ఉంచి మోసపోతారు) – సాతాన్ తన భయంకర వికృత రూపంతో మండుతున్న జ్వాలా సరోవరంపైన ఎడమాంటైన్ సంకెళ్లతో బంధించబడి ఆగ్రహంతో ఊగిపోతున్నాడు. అత్యున్నత దైవన్యాయస్థానం, ఆ స్వర్గభ్రష్టుడైన దేవదూతను అతని దురాలోచనలతో, దుష్కర్మలతో ఆతని గోతిని ఆతడే తవ్వుకునేలా స్వేచ్ఛనిచ్చి ఆతని పాపకార్యాల ఫలితంగా కరుణ, దయ, మంచితనం మానవ ప్రపంచంలో మరింత పరిఢవిల్లుతాయని భావించి సాతాన్ చెడు నడతకు సాతానే భాధ్యుడయ్యేలా నిర్ణయించింది.

దానితో మరింత ఉగ్రుడైన 'సాతాన్' మూడురెట్ల ఆగ్రహం, పగ, ప్రతీకారాలతో సంకెళ్లు తెంచుకుని నిటారుగా నిలబడి, తన చేతులకున్న అగ్నిజ్వాలలు కెరటాల్లా తన వెనక ప్రజ్వరిల్లుతుండగా, తానున్న మురికి గుంట నుంచి ఒక్కుమ్మడి ఎగిరి, విప్పారిన రెక్కలతో (పెలొరస్ (Pelorus) పర్వతం నుంచి విరిగిపడి ప్రచండమైన గాలిలో దూసుకుపోతున్న కొండచరియలా, ఎయిట్నా (Aetna) అగ్నిపర్వతం నుంచి వెలువడ్డ 'లావాలా) ఎగిసిపడ్తూ అక్కడికి దగ్గరలో – దావాగ్ని ధూమ ప్రభంజనానికి తోడుకాగా, ప్రవహించిన ప్రదేశాన్నంతా దహించి నల్లగా మాడ్చి విషవాయు పొగల్తో, దుర్వాసనలతో నింపిన ప్రదేశంలా ఉన్న ప్రాంతంలో అడుగుబెట్టాడు. అతని వెనుక ఆతని నమ్మినబంటు! ఇద్దరూ స్టిజియన్ వరదలను

(Stygian floods - Stygian -Pertaining to river Styx, hence infernal; dark and gloomy) అతిక్రమించ గలిగినందుకు గర్వపడ్డారు. దేవదూతలు కావడం వల్ల వారికి వారి శక్తులు తిరిగి వచ్చాయి, అంతేకాని అతీతశక్తి వారికి అనుజ్ఞ ఇవ్వడం వలన కాదు.

ఆ ప్రదేశాన్ని చూసి స్వర్గచ్యుతుడైన దేవదూత – "ఇదా మన సాహసానికి కానుకగా దొరికిన ప్రదేశం? స్వర్గానికి బదులు నరకం! దివ్యకాంతి స్థానానికి బదులు శోకభరిత అంధకారం! మంచిది. ఇప్పటి విశ్వాధినేతకేది యిష్టమో అలానే జరగనీ! అతనికి ఎంతదూరంగా ఉంటే అంత మంచిది. శుభం!

సంతోషం ఎల్లడలా సంచరించే ఆ ఆనంద మైదానాలకు వీడ్కోలు!
భయం, భీతి తిరుగాడే ఈ నరకకూప ప్రపంచానికి స్వాగతం!
ఓ గాడాంధకార నరకలోకమా! నీ అధినేతను ఆహ్వానించు!
కాలం, స్థలం మార్చలేని నిశ్చిత మనసున్న నాయకుణ్ణి సమ్మానించు!
అవును! మనసనే ప్రదేశమే స్వర్గాన్ని నరకంలా, నరకాన్ని స్వర్గంలా మారుస్తుంది.
ఎక్కడైనా నేను నేనే! ఎవరికీ ఏ శక్తిలోనూ తీసిపోను!
ఉరుముల మెరుపుల శక్తి ఆతడిని నాకన్నా ఉన్నతుణ్ణి చేసి ఉండవచ్చునుగాక!
కాని నాకిక్కడ స్వేచ్ఛ ఉంది! ఇక్కడ్నుంచి మనల్నెవరూ తరిమేయలేరు.
నా యిష్టప్రకారం ఇక్కడ నేను పరిపాలన సాగించవచ్చును.
స్వర్గంలో ఊడిగం కన్నా నరకంలో స్వేచ్ఛాపాలన నాకిష్టం.
'Better to reign in Hell, than serve in Heaven'
మిత్రమా! నీవు మన అనుయాయుల్ని, సైనిక సమూహాల్ని
మనతో కష్టనష్టాలను అనుభవిస్తున్నవాళ్లను సమాయత్తపరచు.
ఈ దుఃఖ ప్రాసాదంలో, సమావేశమై స్వర్గంపై దండెత్తి
ఎంత పొందగలం, నరకంలో ఏం కోల్పోవగలం – ఆలోచిద్దాం!"

అలా 'సాతాన్' పలుకగా, 'బీల్‌జెబబ్' సమాధానమిచ్చాడు.

"అద్భుత సేనావాహినికి అధినేతా! సర్వశక్తిమంతుడైన (Omnipotent) ఆతడొక్కడే నీ ప్రణాళికలకు అడ్డు నిలవగలిగాడు. అయినా ఏ ఆజ్ఞాస్వరం ఈ సమస్త సేనావాహిని వీనుల ప్రతిధ్వనించి భయాల్లో, ఆపదల్లో కూడా యోధుల ప్రతిజ్ఞను నిలిపి ఉంచిందో, గడచిన సంగ్రామపు అంతిమ ఘడియల్లో సైతం చలింపకుండా నిలిపిందో ఆ తమ ఆజ్ఞాస్వరాన్ని వినగానే మన సమస్త సేనావాహిని తిరిగి శక్తిని, ధైర్యాన్ని పుంజుకుని స్వస్థత చెందుతుంది. స్వర్గలోకపు అంచుల నుంచి పాతాళబిలాల్లోకి పతనం చెంది జ్వాలాసరోవరంలో అచేతనులై నిశ్చేష్టులై పడివున్న మన సైన్యం మేలుకొని, తమ ఆజ్ఞకోసం ఎదురుచూస్తున్నది."

అతనింకా ముగించక మునుపే సైతాను దిగ్భ్రమ చెందే రూపంతో జ్వాలా సరోవర తీరాన్ని చేరుకున్నాడు. ఆతని వీపుపై ఉన్న పెద్ద డాలు పూర్ణచంద్రునిలా గుండ్రంగా ప్రకాశిస్తూ ఉండగా, ఆ డాలు అంచు ధగద్ధగాయమానంగా మెరుస్తూ ఫెసొలె (Fesole) లేదా వాల్‌డార్నో (Valdarno) కొండకొమ్మల నుండి టుస్కాన్ గెలిలియో తన అద్దాల గుండా దూరాన ఉన్న కొండలు, గుట్టలు, నదీ, నదాల్ని సాయంకాల సమయంలో వీక్షిస్తున్న దృశ్యాన్ని తలపింపజేస్తున్నది.

మహాకాయుడైన ఆతని చేతిలోని బల్లెం (Spear) నార్వేజియన్ కొండలపై పెరిగే అతిపెద్ద పైన్ (Pine tree) వృక్షంలా, ఓ పెద్ద నౌకకు తెరచాప కొయ్యగా ఉండే దూలంలా ఉండగా, ఆతడు దానిని ఓ చిన్న మంత్రదండాన్ని పట్టుకున్నట్లు పట్టుకుని అక్కడి మండుతున్న గరువునేల (Marle)పై జారకుండా ఉండడానికి పట్టుగా వాడుతూ సాగుతున్నాడు. అది స్వర్గలోకపు అజూర్ బ్లూ (Azure) నీలి మైదానం కాదుకదా మరి! తీక్షణమైన ఎండవేడిమి శరీరాన్ని కాల్చివేస్తుండగా భరిస్తూ భారంగా అడుగులు వేస్తూ ఆతడు జ్వాలాసరోవరం అంచులు దాటి తీరాన్ని చేరుకుని తన సైనిక సమూహాన్ని ఎలుగెత్తి పిలిచాడు. అక్కడ ఆ అశేషసేనావాహిని ఆకురాలు కాలంలో (Autumn) రాలిన ఆకులు సెలయేళ్లను కప్పినట్లుగా ఆ ప్రదేశమంతా చెల్లాచెదరుగా పడి ఉన్నారు. ఆ దృశ్యం వాలొంబ్రొసా (Vallombrosa) విహార స్థలంలో ఎట్రూరియన్ (Etrurian) వనాల్లో చెట్ల నీడల్లా, ఒరియాన్ (Orion)* వేటగాడు ప్రచండగాడ్పుల్ని ఆయుధాలుగా చేబూని విరుచుకుపడ్డప్పుడు నేలకొరిగిన తుంగమొక్కల్లా, బుసిరిస్ (Busiris) ఆతని మెంఫియన్ యోధులు Memphian Chivalry), గోషెన్‌లో** నివాసముంటున్న ఇజ్రాయెల్ ప్రజల్ని అసూయాద్వేషాలతో హతమార్చబూనినప్పుడు ఎర్రసముద్రం (Red Sea) ఉప్పొంగి వచ్చిన వరదల ధాటికి ఛిన్నాభిన్నమైన రథాలు, తేలుతున్న సైనికుల శవాల గుట్టల్లా – పడివున్న తన సైన్యానివహాన్ని చూసి సాతాన్ నరకకూపపు అంతర్బిలాలు ప్రతిధ్వనించేలా కేకపెట్టాడు.

"రాజకుమారులు, రాజముఖ్యులు, వీరాధివీరులు, స్వర్గలోక ప్రసిద్ధ పుష్పాలుగా గణుతికెక్కిన శూరులు, మిత్రులారా! ఒకప్పుడు మీది, ఈనాడు చేజారిన స్వర్గమది. ఈ ఆకస్మిక మార్పు మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచి అచేతనుల్ని గావించిందా! లేక మీ అంతట మీరే పరాజయాన్ని ఒప్పుకుని ఈ మురికిగుంటలో చిరకాలం ఉండదలుచుకున్నారా? బడలికలో వీరత్వం నీరసించగా, స్వర్గమైదానాల్లో శయనించినట్లు ఇక్కడా గాఢనిద్రలోకి జారుకున్నారా? లేక ఇలా కూలబడి ఆ విజేతకు

---

* Orion - a giant hunter who pursued the Pleiades and was killed by Diana, according to Greeko-Roman Mythology. He was placed among the stars by Diana as a Constellation.

** Goshen - A land of plenty; a district in Egypt occupied by Israelites

అమందానందాన్ని కలిగించదలుచు కున్నట్లున్నారు! శభాష్! స్వర్గ సింహాసనారక్షకులైన ఛెరుబె, సెరాఫ్ (Cherube, Seraph)లు రెక్కలు తెగి, రాజలాంఛనాలు విరిగి వరదల్లో కొట్టుకుంటుండగా స్వర్గ ద్వారాల వద్ద వీక్షించిన స్వర్గాధినేత అనుచరులు మనపై ఉరుములు, మెరుపులు కురిపించి స్వర్గం నుంచి నరకానికి నెట్టి పిడుగులతో మనల్ని అగాధపు లోతులకు కట్టివేయగలిగారు. ఆ సంకెళ్లను తెంపుకుని లేవండి! మేలుకొనండి! లేదా శాశ్వతంగా పతనమైపోతాం!

"Awake, arise or be for ever fallen!"

ఆ ఉత్తేజకరమైన పిలుపు వినబడగానే ఆ యోధులంతా ఒక్కుమ్మడి లేచి నిలబడ్డారు. మానవులు కనీసం కలలో కూడ చూడటానికి ఇష్టపడని భయంకర సేనా నివహం, తామున్న దారుణ స్థితిని, తీవ్రతరమైన బాధలను లెక్కచేయకుండా తమ అధినాయకుని గొంతు వినగానే సావధానులై ఆతని ఆజ్ఞ అమలుపరచేందుకు సంసిద్ధులైనారు.

ఈజిప్ట అశుభదినం నాడు అమ్రామ్ కుమారుడు (Amram=Abraham) 'మోసెస్' తన మహిమాన్వితమైన మంత్రదండాన్ని ఊపినప్పుడు, దట్టమైన మబ్బులా మిడతల దండు (Cloud of Locusts) తూర్పుగాలితో కలిసి, నైలునదీ ప్రాంతాన్ని కమ్మి, పట్టపగలు కటిక చీకటిని సృష్టించి, ఈజిప్ట ప్రభువు ఫారో (Pharaoh) రాజ్య వైభవాన్ని మసకబార్చాయో, ఆ మిడతల దండులా ఈ తిరగబడ్డ దేవదూతలు అసంఖ్యాకంగా నరకకూపపు పైకప్పు దిగువ టపటప కొట్టుకుంటున్న రెక్కల్తో ఎగుర్తూ తమను చుట్టుముట్టిన త్రేతాగ్నులను లెక్కచేయకుండా తమ అధినేత సుల్తాన్ చేతిలోని మహాబల్లెం పైకెత్తబడగా ఆతడు ఇచ్చే సందేశంకోసం ఉద్విగ్నతతో ఎదురుచూస్తున్నారు.

వారి నడక ఇప్పుడు స్థిరమైన గంధకపు రాతి మైదానం వేపు సాగింది. ఆ అశేష సేనావాహిని – రెనె (Rhene), డానా (Danaw)లు దాటిన ఉత్తరధ్రువపు మంచు దక్షిణం వేపు వరదలా పొంగి జిబ్రాల్టర్ (Gibraltor) నుంచి లిబియన్ (Lybian) ఇసుక మైదానాల వరకు కమ్మిన హిమపాతంలా ఉండగా – సాతాన్ అనుచరులు ముందుకు సాగుతున్నారు.

దళాలు, స్క్వాడ్రన్ల నాయకులు వారివారి అర్హతలను బట్టి ప్రాధాన్యతా క్రమంలో, మానవులకుండని దివ్యవర్చస్సుతో, దేవతలుగా మునుపటి శక్తిసామర్థ్యాలు రాగా తమ నాయకుని అనుసరిస్తున్నారు. వారిప్పుడు దేవలోకపు పుస్తకాలనుంచి చెరిపివేయబడ్డారు. జీవగ్రంథాలలో (Books of Life)లో వారి పేర్లు లేవు. ఇంకా ఉద్భవించని భూమిపై 'ఈవ్– (అవ్వ) కుమారుల మధ్య వారు నామకరణం

చేయబడలేదు. మానవుని పరీక్షాకాలంలో వాళ్లు కుహనా ప్రవక్తలై, వంచకులై, మాయమాటలతో, చేతలతో, మానవజాతిని మోసపుచ్చి పక్కదారులు పట్టించి, సృష్టికర్తయైన భగవానుడ్ని, ఆతని వైభవాన్ని కాదని, ఓ వంచకుడి విగ్రహానికి, రూపానికి, స్వర్ణరజత రత్నవైడూర్య మణిమాణిక్యాలతో అలంకరించి ఆడంబరంగా ఉత్సవాలు జరుపుతూ దేవతల స్థానే దయ్యాలను (Devil) ప్రతిష్ఠించి కొంగొత్త మతాలను సృష్టించి దైవమార్గాన్ని తప్పించి, మానవుడ్ని భ్రష్టుడిగా చేస్తారు.

మ్యూజ్! సకల కళాధిదేవతా! వివరించు తల్లీ!
ఆ మోసగాళ్ల పేర్లూ, చలామణీ కాబోయే దేవుళ్ల పేర్లూ!
ఈ గంధక మైదానంలో తమ అధినేత సాతాన్ ముందు మోకరిల్లిన
నరకయోధుల్లో ఎవరు శక్తిశాలి? ఎవరు మహా మాయావి?
రేపు ఏర్పడబోయే భూ ప్రపంచంలో వారు ధరించబోయే పాత్రలేమిటి?
భూమిపై వేటకు దిగి ఎవరెవర్ని వాళ్లు తమ అదుపాజ్ఞలలో ఉంచుకుంటారు?
దేవాలయాల్లో తమ ప్రతిమలకు పూజలు జరిపించుకుంటూ
దేవుని హోమగుండాలు, బలిపీఠాల చెంతనే తమ వాటిని ప్రతిష్ఠించుకుని
ఛెరుబిమ్ (Cherubim)ల మధ్య ఉన్న సింహాసనంపై కూర్చుని
సియాన్ (Sion) కొండల నుండి ఉరుముతున్న జెహోవా (Jehova)ను కాదని
దేవాధిదేవుని మందిరాల్లోనే తమ ఆలయాల్ని నిర్మించుకుని
అసహ్యమైన, రోత, చీదర పుట్టించే ఆచారాల్ని, తంతుల్ని అమలుజరుపుతూ
భగవానుని పవిత్ర పూజా విధానాల్ని, పండుగల్ని ధిక్కరిస్తూ
ఆ మహాదేవుని కాంతిపుంజాలపై చీకటి తెరలను కప్పే వాళ్లెవరు?

మ్యూజ్! సకల కళాధిదేవతా! వివరించుము తల్లీ!

"మొదటిగా మోలోక్ (Moloch) లేదా మోలెక్ (Molek)-
శిశుబలుల్తో నరమేధాలతో రక్తమంటిన దుష్టదేవుడు!
ఎంతోమంది తల్లుల కన్నీళ్లు, రోదనలు
ఆ జాతర డప్పులు, డోలు చప్పుళ్ల సందడిలో సమసిపోయాయి.
రబ్బా (Rabba) నీటిమైదానాలలో అమ్మోనైట్లు (Ammonites)
ఆర్గాబ్ (Argob), బాసన్ (Basan) నుండి ఆర్నాన్ (Arnon) ఏటివరకూ
అంతేకాక చక్రవర్తి సోలోమాన్ (Solomon) జ్ఞానిని కూడా దారి మళ్లించి
భగవానుని ఆలయం ఎదురుగా మోలెక్ గుడిని కట్టించేట్లు చేయగలిగారు.
మలినమైన ఆ కొండపై, ఒక వనాన్ని పెంచి
సుందరమైన ఆ 'హిన్నామ్' లోయను (Hinnom Valley)

మృత్యులోక ముఖద్వారంగా, నల్ల గెహెన్నా (Black Gehenna)గా చేసారు.
తరువాత క్రమంలో వచ్చేది కెమోస్ (Chemos) లేదా పెయోర్ (Peor)
ఈతడు మోయబ్ (Moab) ప్రజల దేవుడు.
అరొయర్ (Aroer) నుంచి నెబొ (Nebo) వరకు,
అబారిమ్ (Abarim) దక్షిణ అటవీ ప్రాంతం
హెసెబాన్ (Hesebon), హోరొనైమ్ (Horonaim), సియోన్స్ (Seons) రాజ్యాలూ
సిబ్మా (Sibma) పూల, ద్రాక్షవన ప్రాంతమూ
ఎలియెలె (Eleale) నుంచి ఆస్ఫాల్టిక్ (Asphaltic) మడుగు వరకూ
పూజింపబడే ఈ తుచ్ఛదేవుడే నైలునదీ ప్రాంతం నుంచి వస్తున్న
ఇజ్రాయెల్ ప్రజల్ని సిట్టిమ్ (Sittim) వద్ద మాయలో పడవేసి
వాళ్లతో దుష్ట క్రతువులు గావించి, ప్రభువు దారితప్పించి,
వాళ్లు దేవదేవుని ఆగ్రహానికి గురై కడు ఇడుముల పాలయ్యేట్లు చేసినాడు.
మోలెక్ నల్లగెహెన్నా వనం దగ్గర్లోనే జాతర్లు, బలులు జరుపుతున్నపుడు
ప్రభుసేవకుడు జోసయ్య (Josaiah), మోలెక్, కెమోస్ దుష్టదేవుళ్లకు
సోలోమాన్ కట్టించిన దేవాలయాల్ని ధ్వంసం చేసి నరకానికి నెట్టినాడు.
మరో నీచ దేవతలు బాలిమ్ (Baalim), అష్టారొత్ (Ashtaroth)
యూఫరేట్స్ (Euphrates) వరద ప్రాంతం నుంచి, సిరియా (Syria)
ఈజిప్టు (Egypt) లను వేరుచేసే నది వరకూ వీరి ప్రాబల్యం!
స్త్రీగా, పురుషుడిగా, ఏ రూపం కావాలంటే ఆ రూపంలోకి మారిపోగల శక్తి
బహుమాయలూ, సిద్ధులూ వాళ్ల స్వంతం.
వీళ్ల మాయా మహేంద్రజాలానికి మైమరచి పలుమార్లు ఇజ్రాయెల్ ప్రజలు
భగవానుని సన్నిధి విడిచి ఆ దుష్టదేవతల
పాదాలకు శిరసులాన్చి పరాజితులయ్యారు.

ఈ వరసలో వచ్చేదే ఫొనిషియన్ల (Phoenicians) దేవత
వాళ్ల స్వర్గపు రాణి, చంద్రవంక అస్తొరె (Astarte)!
సిడొనియన్ (Sidonian) కన్యలామెకు మొక్కుబడులు చెల్లించుకుంటారు.
సియాన్ (Sion) ప్రజలూ ఆమె ఆకర్షణకు లోనుకాగా
సొలొమాన్ ప్రభువు తన ప్రియురాళ్ల మోజులో ఆమెకు కూడ
దేవాలయాన్ని కట్టించి వాళ్ల ముద్దుముచ్చట తీర్చి ప్రభువు
కోపానికి గురైనాడు.

మరొహడు లెబనాన్ (Lebanon) ప్రాంతపు దేవుడు తమ్ముజ్ (Thammuz)
ప్రతి సంవత్సరం ఆతని గుర్తుగా వేసవికాలంలో

సిరియన్ (Syrian) మహిళలు పాడే శృంగార విషాద గీతాలకు
సియాన్ స్త్రీలు కూడ పరవశించి కాముకులై దారితప్పేవారు.
ఎడొనిస్ (Adonis) శిలల్నుంచి స్రవించిన నీళ్లు ధూమ్రవర్ణమై రాగా (Purple)
దాన్ని ఆ స్త్రీలు తమ్ముజ్ గాయం నుంచి స్రవించిన
రక్తంగా భ్రమించి రోదనలతో ఆ ప్రాంతాన్ని విషాదభరితం చేసేవారు.
సియాన్ స్త్రీల కాముకత్వానికి ఈ పాటలు కారణంగా
ఎజెకిల్ (Ezekiel) తన కలల్లో (Visions) దర్శించాడు.

తర్వాత వచ్చేది మత్స్యావతారుడైన డాగన్ (Dagon)
మానవ శరీరంపైన, క్రింద చేప ఆకారం!
దివ్యనౌక (Ark) తగిలి విగ్రహం తల, చేతులు ధ్వంసమై
తన గుడి గడప వద్దే నేలకూలి తన భక్తుల్ని సిగ్గులో ముంచినవాడు.
ఆతని బృహద్దేవాలయాలు, అజొటస్ (Azotus)
పాలస్తీనా (Palestine) తీరాలలో, గాథ్ (Gath), అస్కలాన్ (Ascalon)
అక్కారన్ (Accaron), గాజా (Gaza) సరిహద్దుల వరకు ప్రసిద్ధికెక్కాయి.
ఇప్పుడు డమాస్కస్ (Damascus) నగర దేవుడు రిమ్మాన్ (Rimmon) గురించి.
అబ్బానా (Abbana), ఫార్‌ఫర్ (Pharphar) సెలయేళ్ల గట్టులపైన
వెలసిన తుఫాను దేవుడు (Strom-god, Thunderer) రిమ్మాన్.
సిరియన్ సైన్యాధికారి నామన్ (Naaman) తాను లెప్రసీ
(Leprosy) వ్యాధి నుంచి విముక్తుడైనందుకు కృతజ్ఞతగా
ఇజ్రాయెల్ నుంచి రెండు కంచరగాడిదల బండి నిండా మట్టి
తెప్పించి భగవానుని పూజాగృహం–'అల్తార్'ను రిమ్మాన్ గుడిలోనే ప్రతిష్ఠించాడు.
కాని మిగతా దేవతలకిచ్చే రోతపుట్టే బలుల్తో ఆతడూ దేవుని దృష్టిలో
పాపకర్ముడై శత్రువుగా మారినాడు.

వీళ్ల తర్వాత ప్రసిద్ధికెక్కిన పాతతరం ఈజిప్ట (Egypt) దేవుళ్లు.

ఒసిరిస్ (Osiris), ఐసిస్ (Isis), హోరస్ (Orus), మిగతా చిల్లరదేవుళ్లు. రాక్షస మృగాల మొహాలతో, మాయామంత్రాలతో భయంకరంగా కన్పిస్తారు. వీళ్ల ప్రభావం నుంచి ఇజ్రాయెల్‌లు తప్పించుకోలేకపోయారు. ఓరెబ్ (Oreb)లో ఆవుదూడ స్వర్ణప్రతిమ దాని ప్రభావమే. రెబల్‌కింగ్ (Rebel King- Jeroboam) రెండింతలు తప్పుచేసి రెండు స్వర్ణధేనువుల్ని బెతెల్ (Bethel), డాన్ (Dan) నగరాల్లో ప్రతిష్ఠించి, గడ్డిమేసే జంతువుని, సృష్టికర్తతో సమంగా పూజించి భంగపడ్డాడు.

ఆఖరుగా బెలియాల్ (Belial = Wicked, abominable)
స్వర్గం నుంచి పతనం చెందినవాళ్లల్లో అత్యంత నీచుడు, మోసగాడు.
ఇతనికి గుళ్లూ గోపురాలు లేవు. హోమగుండాల్లో బలులు రావు.
కాని పూజారులు హేతువాదులుగా మారినప్పుడు
ఎలీ (Ely) కుమారులు దేవుని సన్నిధిని కామక్రౌర్యాలకు విడిది చేసినట్లు
రాజసభల్లో, ప్రాసాదాల్లో బెలియాల్ రాజ్యం చేస్తాడు.
విలాసవంతమైన నగరాల్లో హింసాధ్వనుల్ని అంబరానికెక్కిస్తాడు.
చీకటి రాత్రుళ్లలో చిందులాడే బెలియాల్ సంతతి దుష్టులు
మధుపానంతో కైపెక్కి నగర వీధుల్ని దుడుకు చేష్టలతో రక్తమయం చేస్తారు.
సోడోమ్ (Sodom) వీధుల్లో, గిబియా (Gibeah)లో
అత్యాచారం, మానభంగాలు గుర్తుకు తెచ్చుకోండి.
ఇప్పుడు యవనదేవతలు (Ionian Gods) వాళ్ల గుంపు గురించి–
ఆకాశం, భూమి (Heaven and Earth) వాళ్ల ఆది తల్లిదండ్రులు.

వాళ్లిద్దరికి పన్నెండుమంది టైటాన్లు (Titans=దైత్యులు) సంతానం. అందరికంటె చిన్నవాడు శనిదేవత (Saturn=Cronus), రియా (Rhea) అనే దైత్యురాలిని పెండ్లాడి తండ్రిని తొలగదీసి రాజవుతాడు. అతని అడుగుజాడల్లో నడిచిన పుత్రరత్నం 'జోవ్' (Jove-Zeus) పితృదేవుణ్ణి ఓడించి తానే దేవాధిదేవుడౌతాడు.

క్రెటె (Crete), ఇడా (Ida) ద్వీపాల్లో మొదలైన ఈ దేవతల రాజ్యం మంచుతో నిండిన ఒలింపస్ (Olympus) పర్వతమే వాళ్ల స్వర్గం కాగా డెల్ఫి శిఖరాగ్రం (Delphian Cliff), డొడొనా (Dodena) గుట్టలు, డొరిక్ దేశం (Doric land) – శాటరన్ పారిపోయి తలదాచుకున్న ఎడ్రియా (Adria) నుంచి హెస్పెరియన్ పొలాలు (Hesperian fields), సెల్టెక్ ద్వీపాల వరకూ (Celtic Isles) ఈ ప్రకటిత చిల్లర దేవుళ్లూ, మిగతావాళ్లూ తామరతంపరగా ఇప్పుడు దేవదూతల రూపంలో ఉన్నవాళ్ళు ఆ గంధక మైదానం వేపు వస్తూ తమ అధినేతను గాంచి ఉత్తేజితులైనారు. ఆతని వదనంలో సర్వనాశనమయ్యామన్న నీడ లీలామాత్రంగా వారికి కనిపించినా, ఆతని మొక్కవోని గర్వం, ఆత్మాభిమానం ప్రస్ఫుటం కాగా, వారి మనసుల్లో ఏ మూలనో దాగివున్న భయం తొలగి పోగొట్టుకొన్న ధైర్యం తిరిగి పుంజుకున్నది.

సంగ్రామ భేరీభాంకారాలు, కొమ్ముబూరల యుద్ధనాదాలు ఉధృతం కాగా, అజాజెల్ (Azazel)=ఛెరుబె (Cherube) ప్రతీహారీ రాజలాంఛనాల పతాకను చేబట్టి నాయకుని కుడిపక్క కొలువుదీరగా గాలిలో దూసుకువస్తున్న తోకచుక్కలా ఆ పతాక వజ్ర వైడూర్యాది నానామణిమయ శోభితమై, స్వర్ణకాంతులతో మెరుస్తుండగా సమర

సన్నాహధ్వనులు సకల దిక్కులకు వ్యాపించగా ఆ సర్వసేనాని పెట్టిన భయంకరమైన అరపు, నరకలోకాన్ని దద్దరిల్లజేసి ఇతర లోకాలకు దూసుకుపోతూ అలనాటి పెంజీకటిరాత్రిలో కేయాస్ (Chaos) గందరగోళ రాజ్యాలను వణికింపజేసింది. గాలిలో కెగిరి రెపరెపలాడ్తున్న పదివేల వివిధ వర్ణపతాకలు, దట్టమైన అరణ్యాన్ని తలపిస్తున్న పదునైన బల్లేలు, గుంపులు గుంపులుగా మెరుస్తున్న శిరస్త్రాణాలు, గాఢంగా అల్లుకున్న ఇనుప కంచెలా డాళ్లూ, కవచాలతో ఆ ప్రచండ సైన్యసమూహం పటాలాలుగా, ఒక క్రమపద్ధతిలో డోరియన్ వేణునాదాల, మంద్రస్వర భేరీభాంకార నినాదాల ననుకరిస్తూ సాగుతున్నది. వన్నెతగ్గిన ఆగ్రహాన్ని శౌర్యపరాక్రమాల వెలుగు ఆక్రమించగా, మరణభీతి, వెనుకంజ రీతి, పిరికి ఆలోచనలు, అనుమానం, భయం, దుఃఖం, బాధ ఇవేమీ వాళ్ల మనసుల్ని కలతపెట్టని స్థితిలో ఆ సమస్త సేనావాహిని నిశ్శబ్దంగా ఒకేమాట, ఒకే ఆలోచనగా, ఆ కాలుతున్న గంధకం మైదానంపై వేస్తున్న ప్రతి అడుగూ తీవ్రమైన బాధను కలిగిస్తున్నా లెక్కచేయకుండా వాళ్లు ముందుకు సాగినారు. ఆ అనంతసేనా వాహిని యావత్తూ ఎదురుచూస్తున్నది తమ నాయకుడి తిరుగులేని ఆజ్ఞకోసం!

ఆ అధినేత నిశిత వీక్షణాలు ఆ మహోత్తుంగ తరంగ సముద్రంలా విప్పారిన సైన్యాన్ని, వ్యూహక్రమాన్ని, పరిశీలించి తృప్తిచెందాయి. ఆతని హృదయం గర్వంతో ఉప్పొంగింది. శౌర్యం మరింత కఠినమై పదునెక్కగా మానవ సృష్టికి ముందెప్పుడూ కానరాని మహోజ్వల ఘట్టమిది.

ఆనాడు ఫ్లెగ్రా మహాకాయులు (Giant brood of Phlegra) హీరోల దండుతో (Heroic race) కలిసి థెబెన్ (Thebes), ఇలియం (Ilium)ల యుద్ధభూముల్లో ఇరుపక్షాల్లోనూ చేరిన దేవుళ్లతో కలిసి జరిపిన పోరాటాల్లో పాల్గొన్న సేనావాహినిలా...

ఉథర్ పుత్రుడు (Uther's son) ఆర్థర్ (Arthur) తన బ్రిటిష్, ఆర్మొరికన్ శూరులతో ఏస్ప్రామాంట్ (Aspramont), మోంటాల్బాన్ (Montalban), డమాస్కస్ (Damasco), మొరాకొ (Moracco), ట్రెబిసాండ్ (Trebesond) ప్రదేశాల్ని చుట్టుముట్టిన మహాసైన్యంలా...

ఛార్లమైన్ (Charlamain) తన సేనతో ఫొంటారబ్బియా (Fontarabbia) చేతిలో ఓడిపోతున్నపుడు బైసెర్టా (Biserta) ఆఫ్రికాతీరం నుంచి పంపిన యోధానుయోధుల బృందంలా...

పోలికకే రాని ఈ మర్త్యసైన్యాలన్నీటినీ మించిన తన మహాసైన్యాన్ని గాంచిన ఆ మహాసేనాని రూపులో, శక్తి సామర్థ్యాలలో చూపరులకు భీతికొలుపుతూ ఓ గొప్ప కోట బురుజులా, మునుపటి అద్భుత వర్చస్సు పూర్తిగా రాకపోయినా, సమాంతర

మంచుగాడ్పుల మధ్య వెలుగారిన కొత్త సూర్యుడిలా, గ్రహణం పట్టిన చంద్రుడిలా సగం రాజ్యాలపై ప్రమాద సంధ్యాకాంతులను, మహాచక్రవర్తి మనస్సులో రాజ్యభ్రష్ట గుబుళ్లను కలిగించేలా ఉన్నాడు. స్వర్గం నుంచి కురిసిన పిడుగుల ధాటికి ఏర్పడిన గాయాల చారికలు ఆతని వదనంపై గాట్లలోయలను సృష్టించినా ఆతని కనుబొమల తీరు, ఎప్పటికీ తగ్గని ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని, గర్వాన్ని ప్రస్ఫుటిస్తూ ఆతనిలో రేగిన ప్రతీకారేచ్ఛను బయల్పరుస్తున్నది. తనవాళ్లు పడ్తున్న అంతులేని బాధలను చూస్తున్న కళ్లు వెనకటి దయాదృక్కుల స్థానే క్రూర వీక్షణాలను సారిస్తున్నాయి. తన నిర్ణయానికి, తన క్రూర కార్యానికి తోడువచ్చి, అత్యంత దారుణమైన శిక్షలననుభవిస్తూ కూడ తన ఆజ్ఞకోసం అప్రమత్తులై ఎదురుచూస్తున్న అశేష సైనికులను చూసి అతని మనసు కలతచెందింది. స్వర్గలోకపు జ్వాలాగ్ని, ఉరుములు పిడుగులై దట్టమైన అరణ్యంలోని ఓక్ (Oak) వృక్షాలను, పర్వతాలపైన పైన్ (Pine) వృక్షాలను కాల్చి మోడులను చేయగా వెనకటి సౌందర్యాన్ని కోల్పోయిన వనసమూహంలో, కీర్తికాంతుల్ని కోల్పోయిన నల్లని మోడుల్లా నిలబడ్డ తన సైన్యసమూహాన్ని అన్నివేపులా పరికిస్తూ ముమ్మారు ముచ్చటగా మూడుసార్లు వాళ్లతో మాట్లాడబోయి కన్నీరు కమ్ముకురాగా, గొంతు మూగవోగా, చివరకు అతిప్రయత్నంతో నిట్టూర్పుల్ని చీల్చుకుని మాటలు పెగలగా ఆ సేనాని ఇలా పలికాడు.

"ఓ అసంఖ్యాక అమరవీరులారా! తిరుగులేని శక్తులున్న శూరులారా! ఆ మహాశక్తివంతుడితో జరిగిన యుద్ధం మనకు అవమానంగా భావించవద్దు. కానీ ఏ ద్రష్ట అయినా భూత, భవిష్యత్, వర్తమానాల్లోకి తొంగిచూసి ఇంత శక్తివంతమైన అమరుల సైన్యం యిలా పరాజయం పాలవుతుందని ఊహించాడా! అమిత పరాక్రమవంతులు, అమేయ బలసంపన్నుల శ్రేణి, స్వర్గచ్యుతితో ఆ లోకాన్నే ఖాళీగా చేసిన అశేష అమర సేనావాహిని, మరల విజృంభించి పైకెగసి, పోయిన గౌరవాన్ని, స్థానాన్ని పొందలేదా! నేను ఆతని శక్తిసామర్థ్యాలు కళ్లారా వీక్షించాను. తెలుసుకున్నాను. ఆ విజేత అప్పటివరకు గత వైభవంతోనో, అందరి ఒప్పుదల వల్లనో, ఆచారాలు, కట్టుబాట్ల వల్లనో సింహాసనాన్ని అధిష్టించినట్లు కనిపించి, తన ప్రచండమైన శక్తిని దాచివుంచి, మన తిరుగుబాటును ప్రోత్సహించి చివరిక్షణంలో మనల్ని నరకానికి పతనం చెందించాడు. ఇప్పుడాతని శక్తియుక్తులు పూర్తిగా మనకు తెలుసును. వెంటనే ఆతనిని ఎదిరించి మరో సంగ్రామానికి తలపడేకన్నా, మనందరం కలిసి ఉమ్మడి వ్యూహంతో, మోసంతో, కుట్రలతో ఆతనిపై విజయాన్ని సాధించాలి. బలంతో సాధించలేనిదాన్ని ఉపాయంతో చేజిక్కించుకోవాలి. గత యుద్ధంలో ఆతడు మనల్ని పూర్తిగా గెలవలేదని, ఆతడి విజయం కేవలం సగమేనని ఆతడు గ్రహించాలి.

కేయాస్ (Chaos) గందరగోళస్థితి నుంచి క్షణక్షణం అధికమవుతున్న స్థలంలో కొత్త ప్రపంచాలు ఉద్భవించవచ్చు. ఇప్పటికే దైవలోకంలోఅంతర్లీనంగా వినవస్తున్న వాక్యం, ఆతడు ఏదో కొత్త జాతిని సృష్టించే ప్రయత్నంలో ఉన్నాడని, వారిని తనను పోలిన వారుగా, దైవకుమారులకు ధీటుగా రూపొందిస్తున్నాడట. కానివ్వండి! వేచిచూద్దాం! అక్కడో, మరెక్కడో ఒక్కసారి ఉవ్వెత్తున మనం ప్రచండ కెరటాల్లా ప్రభవిద్దాం! ఈ మాయదారి నరకకూపమో చీకటి అగాధమో మన దివ్యాత్మలను ఎల్లకాలం బందీగా ఉంచలేదు. ముందు ఈ ఆలోచనలు భావాలు పరిపక్వం చెందాలి. లొంగుబాటు వల్ల వచ్చే శాంతి మనకు అక్కర్లేదు. బాహాటయుద్ధమా లేక వ్యూహాత్మక సమరమా! తేల్చుకోవాలి!"

అతని మాటలు ముగియగానే అంగీకారసూచనగా దేవదూతల చేతుల్లో పైకెగసిన జ్వాలోద్ధృత ఖడ్గాల కాంతి వెలుగుకు నరకలోకమంతా తళుక్కుమని ప్రకాశించింది. స్థిరంగా పట్టుకున్న కత్తుల్ని డాళ్లపై మోదుతూ చేస్తున్న లోహపు చప్పుళ్లకు యుద్ధరంగం ప్రతిధ్వనించగా దేవాధిదేవుని ధిక్కరిస్తూ చేస్తున్న తిరుగుబాటు దేవదూతల ప్రతిఘటనా సంరంభం స్వర్గలోకపు పైకప్పు వేపుకు దూసుకుపోసాగింది.

ఆ సైనిక సమావేశ స్థలికి దగ్గర్లోనే నిప్పులు కక్కుతూ పొగలు చిమ్ముతున్న శిఖరాగ్రంతో, గంధకపు జ్వాలల వల్ల పక్కలు నునుపుదేలి లోపల ఏదో ప్రశస్తమైన లోహాన్ని దాచుకున్న ఓ అగ్నిపర్వతం ఉన్నది. దాన్ని గమనించిన నిపుణులైన బృందం మామ్మన్ (Mammon) అనే వాస్తుశిల్పి నాయకత్వాన పలుగు పారలతో ఆ ప్రదేశానికి బయల్దేరారు. వాళ్లకు కందకాలు తవ్వడం, కోటలు కట్టడం వెన్నతో పెట్టిన విద్య. మామ్మన్ మామూలు దేవదూత కాదు! స్వర్గంలో ఉన్నప్పుడు కూడ ఆతని కళ్లు, ఆలోచనలు ఎప్పుడూ స్వర్గలోకపు బంగారు కాలిబాటల అందాల్ని, ప్రాశస్త్యాన్ని కొలుస్తూ, మైదానాల అడుగున ఉన్న లోహసంపదను అంచనావేస్తూ ఉండేవి. బహుశా మానవులు గూడ ఆతని ప్రోద్బలంతోనేనేమో నిధులకోసం భూమాత శరీరాన్ని చీల్చి లోపలి ప్రేవుల్ని చెల్లాచెదరు చేసేది. త్వరత్వరగా మామ్మన్ సిబ్బంది ఆ పర్వతానికి గాయంచేసి పక్కటెముకల్లాంటి స్వర్ణపట్టీలను వెలికిదీయ సాగినారు. అయినా నరకలోకపు సంపదల్ని మెచ్చుకోనక్కర్లేదు. అక్కడ పడే బాధల ముందు అవి అల్పతరమైనవి. మానవుల కళాకౌశలాన్ని, నైపుణ్యాన్ని పొగిడేవాళ్లు బాబెల్ (Babel) అద్భుత నిర్మాణాల్ని, మెంఫియన్ రాజుల (Memphian Kings) కళాతృష్ణనూ గానం చేసేవాళ్లు, ఇక్కడ మామ్మన్ (Mammon) బృందపు కళాకౌశల్యానికి అబ్బురపడిపోక తప్పదు. గంటలో వాళ్లు గంధకపు ఉపరితలంపై అనేక రంధ్రాలు చేసారు. వాటి క్రింద జ్వలిస్తూ ప్రవహిస్తున్న ద్రవాగ్ని...

రెండో బృందం ముడిలోహాన్ని వెలికిదీసి వాటిలోని కల్మషాన్ని తొలగదీసి స్వచ్ఛమైన లోహాన్ని వేరుచేయసాగినారు.

మూడో బృందం ఆ లోహద్రవాన్ని వేర్వేరు అచ్చుల్లో పోస్తుండగా, అది ఒక్కసారి గాలి ఊదగానే అన్ని గొట్టాలగుండా, రంధ్రాల గుండా ప్రవహించి సంగీతాన్ని సృష్టించినట్లు, ఆ లోహ ద్రవం, అచ్చులగుండా ప్రవహించి ఆ శిల్పులు అనుకున్న రూపాన్ని ధరించసాగింది.

అంతే! క్షణంలో ఓ అద్భుతమైన దేవాలయం లాంటి రాజప్రాసాదం, నేలనుంచి ఉచ్ఛ్వాసంలా పైకుబికి, శ్రావ్యమైన సంగీత ధ్వనుల మధ్య, కలకల స్వనాల మధ్య అందమైన వస్త్రవిశేషంలా తళుకులీనసాగింది.

గోడలో చేర్చిన అపురూప స్తంభాలు (Pilasters), అద్భుతమైన డోరిక్ స్తంభాలు (Doric Pillars), వాటిపై అందంగా అమర్చబడ్డ స్వర్ణదూలాలు (Architrave), చూరు పీఠాలు (Cornices), శిల్పాలు స్వర్ణతాపడం చేయబడ్డ పైకప్పు... అంతా స్వర్ణమయమే!

బాబిలోన్ (Babylon) కాదు, ఆల్‌కైరో (Alcairo) కాదు కాదు, బెలస్ (Belus); సెరాపిస్ (Serapis)లున్న ఆ దేవాలయాలు మహా భాగ్యవంతులైన ఈజిప్టు, అస్సిరియా రాజులచే నిర్మించబడి ప్రసిద్ధికెక్కినవి కూడా ఈ భవనం కాలిగోటికి సరిపోవు. ఆ మహాభవనపు తెరచుకున్న సౌధద్వారాలు లోపలి విశాలమైన ప్రాంగణాన్ని, పైకప్పు నుంచి వేలాడుతున్న నక్షత్రాల సముదాయం లాంటి దీపాల వరుసల్ని, నాఫ్తా (Naphtha=రాతినూనె) ఆస్ఫాల్ట్ (Asphalt-బంక)తో ఉజ్వలంగా వెలుగుతున్న అఖండ దీపాల్ని ప్రస్ఫుటంగా చూపిస్తున్నాయి.

అచ్చెరువుతో చూస్తున్న ఆ మహాసేనావాహిని ఆ మహాశిల్పి కళానైపుణ్యాన్ని మెచ్చుకుంటూ, అభినందిస్తూ అతనిని పొగడసాగినారు. అతడు దేవలోకంలో కూడ అత్యద్భుతమైన భవనాలను నిర్మించినవాడు. అనేకమంది దేవదూతలు, దేవకుమారులు ఆ మహాశిల్పి నిర్మిత దివ్య ప్రాసాదాలలో నివసిస్తూ దేవాధిదేవుడు వారికప్పగించిన బాధ్యతలను నెరవేర్చే వారు.

ప్రాచీన గ్రీసు, అసోనియన్ (Greece, Ausonian lands) ప్రాంతాల్లో ఆ మాయాశిల్పిని 'మల్సిబర్' (Mulciber) అని పిలుస్తారు. గ్రీకులేం చెబుతారంటే వాళ్ల 'జోవ్' (Jove) దేవుడు స్ఫటికకోట బురుజు మీంచి ఆ శిల్పిని నెట్టివేస్తే ఓ వేసవికాలం రోజు సూర్యాస్తమయ సమయాన తోకచుక్కలా లెమ్నాస్ (Lemnos), ఏజియన్ ద్వీపాలలో (Aegean isles) రాలి పడ్డాడని, కాని అది నిజం కాదు.

ఆతడు అనాదికాలంలోనే తిరుగుబాటు చేసిన దేవదూతలతో పాటు నరకానికి నెట్టివేయబడి అక్కడ 'సాతాను' అధినాయకుడికి భవన నిర్మాణాలు కావిస్తున్నాడు. ఇంతలో ప్రతీహారులు కొమ్ముబూరలు, బాకాల శబ్దాల మధ్య కాసేపట్లో 'పాండెమోనియం' అని పిలువబడే (Pandemonium) నరకలోకపు రాజధానిలో అత్యవసర సమావేశం జరగనున్నదని చాటింపు వేసినారు.

క్షణాల్లో ప్రతి దళం నుంచి దళనాయకులు, ముఖ్య నాయకులు వందలు, వేలుగా ముందుకు రాగా ద్వారాలన్నీ కిటకిటలాడి సభాప్రాంగణం ఇసుక వేస్తే రాలనట్లుగా నిండిపోయింది. ప్రాణమున్నంతవరకు పోరాడే యోధులు, ఆయుధాలు లేకుండా, కేవలం బల్లేలను పూని క్రీడారంగానికి పోతున్నట్లు వాళ్లు సభాస్థానానికి వెళ్తున్నారు.

భూమ్యాకాశాలు నిండిన మిడతల దండులా రెక్కల చప్పుళ్లు, ధ్వనుల కోలాహలాలతో, వసంతకాలంలో సూర్యుడు వృషభరాశిలో ఉన్నపుడు, తియ్యని మకరందాన్ని సేకరించుకుని పుష్పాలకు తేనెపట్టుకు మధ్య ఎడతెగని సంచారం చేస్తూ కనిపించే అసంఖ్యాక తేనెటీగల గుంపులా ఉన్న ఆ మహాసైన్యం, మానవలోకంలోని మహాకాయులకు మరిన్ని రెట్లు భారీకాయులున్న ఆ శూరులు, ఆశ్చర్యం! ఒక్కక్షణంలో అతిచిన్న మరుగుజ్జు వాళ్లలా మారిపోయారు. ఇండియన్ పర్వతాలకావలి మరుగుజ్జు జాతిలా, వనాల్లో, జలపాతాల నీటిబుగ్గల దగ్గర ఉండే వనకన్యలు అప్సరసలు, దేవకన్యలను ఏ సాధారణ మానవుడో చూసినప్పుడు ఆతడు అది కలయో? భ్రాంతియో! అని తర్కించుకునే లోపలే, ఆ అపురూప లావణ్యవతులతో పాటు వినిపించిన అలౌకిక సంగీతమూ ఆతనిలో సంతోష భయద్వయాలను కలిగించగా ఆతని గుండెచప్పుడు మరింత ఎక్కువవుతుండగానే వారు అతి సూక్ష్మంగా మారినట్లు, సాతాను మహాసైన్యం అతి చిన్న ఆకార, పరిమాణాల్లో పాండెమోనియన్ సభాస్థలిలో నిండిపోగా, సేనా నాయకులు సెరాఫిక్ ప్రభువులు, చెరుబిమ్‌లు, వేయిమంది చిల్లరదేవుళ్లు తమతమ స్థానాలలో ఆసీనులైనారు. కాసేపు అంతటా నిశ్శబ్దం. సభాకార్యక్రమ వివరణ అనంతరం ఆ మహాసభ ప్రారంభమయ్యింది.

2. నూతన లోకాన్వేషణలో సాతాను దీర్ఘప్రయాణం

వాడి వేడి చర్చలతో సభ ప్రారంభమయ్యింది. మరో యుద్ధానికి సాహసించాలా, వద్దా. కొందరు అటూ కొందరు ఇటూ! మరి మూడో మార్గమేమిటి? సాతాను ముందే తెలిపిన జోస్యం ప్రకారం నూతనలోకం సృష్టింపబడనున్నదా! ఆ కొత్త జాతి శక్తియుక్తులు తమతో సమానమా లేక తక్కువా! ఈ విషయాన్ని శోధించడానికి వెళ్లగల సామర్థ్యం ఎవరికుంది? అధినేత సాతాను తానే వెళతాననడంతో ఆ మహాసభలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

సభ ముగిసింది. సాతాను వచ్చేవరకు మిగిలిన వాళ్లంతా తమకున్న నైపుణ్యాలు, ఆసక్తులకు తగిన పనులు, ఆట పాటల్లో నిమగ్నమై ఉండేలా నిర్ణయించుకున్నారు. సాతాను ఆ మహా కార్యాన్వేషణలో ప్రయాణిస్తూ నరకలోకపు వాకిళ్ల వద్దకు చేరుకుని ఆ మూసివున్న తలుపులను చూసి ఖిన్నుడైనాడు.

ఎవరు ఆ ద్వారపాలకులు? ఆ తలుపులు తెరిపించడానికి సాతాను ఎంత ప్రయత్నించవలసి వచ్చింది? తీరా తలుపులు తెరచుకున్నాక స్వర్గ నరకాల మధ్య ఉన్న మహా అగాధం ఎటువంటిది? కేయాస్ (Chaos=గందరగోళం) దారి చూపగా ఎంత కష్టం మీద ఆతడు అగాధాన్ని దాటి నూతన ప్రపంచాన్ని చూసాడు?

మ్యూజ్! సకల కళాధిదేవతా! వివరించు తల్లీ!

తన రత్నఖచిత స్వర్ణ సింహాసనంపై కొలువుదీరిన నరకలోక పరిపాలకుడు– ఆర్మస్ (Armus), హిందూ (Ind) ప్రభువులు, భూప్రపంచంలో అత్యంత భాగ్యవంతులై ముత్యాల రాశులు, స్వర్ణాభరణాల్లో మునిగితేలేవాళ్లు – వాళ్లందరికన్నా అనేకరెట్ల సిరి, వైభవం, పరాక్రమం కల మహా నాయకుడు 'సాతాన్' (Satan) తన శక్తి సామర్థ్యాల వల్ల ప్రస్తుత స్థానానికి ఎన్నిక చేయబడ్డవాడు, నిరాశతో కూడిన ఆగ్రహం వల్ల అత్యున్నత పీఠంవేపు దృష్టిసారించినవాడు, దేవాధిదేవునిపై సమరానికి దిగి ఓడినా గుణపాఠం నేర్వనివాడు, మొక్కవోని గర్వం చుట్టూ మొలిచిన ఊహానిర్మిత విజయానికై ఉవ్విళ్లూరుతున్నవాడు, ఇలా పలికాడు–

"మహాశూరులూ, అధినేతలూ, స్వర్గలోకపు దేవతలూ, మిత్రులారా! ఏ నిబిడాంధకార అగాధమూ మనలోని ఈ మరణంలేని పౌరుషాన్ని నిలువరించలేవు. ఈ తాత్కాలిక పరాజయం, ఈ భంగపాటు మనం స్వర్గంపై ఆశ వదులుకున్నామన్న భ్రమను కలిగించరాదు. ఈ ఓటమినుంచే ప్రశస్తమైన విజయాలుద్భవించి, అవి

మరింత ప్రకాశవంతంగా, మరింత భయానకంగా ఈనాటి మన దురవస్థకు తిరుగులేని జవాబుగా ఉండాలి!

స్వర్గలోకపు న్యాయాల్ని, చట్టాల్నే ఇక్కడ ప్రతిష్ఠించినా ఏకగ్రీవంగా మీరు నన్ను నాయకునిగా ఎన్నుకున్నారు. ఈ గౌరవం ఈ పోటీలేని ఆధిపత్యం, నా శక్తి సామర్థ్యాలపై మీకున్న నమ్మకాన్ని తెలియజేస్తూ, నా మనసులో గూడుకట్టుకున్న అంతులేని బాధకు కొంత ఉపశమనాన్నిస్తున్నది.

స్వర్గంలోని సింహాసనాధిపత్యం గౌరవప్రదమైనదే అయినా అది పోటీ తత్వాన్ని, అసూయను, ... తక్కువవారిలో కలిగించి ఆందోళనకు దారితీస్తుంది. ఇక్కడ అటువంటి అసూయాద్వేషాలకు తావేలేదు. ఎందుకంటే ఆ స్వర్గాధినేత, ఆ పర్జన్యాధిపతి, ఉరుములు, పిడుగులు ఆయుధాలైన విజేత గురి అంతా నాపైననేకదా! ఆతడు కలిగించే నరకయాతనలో అధికభాగాన్ని భరిస్తున్నది నేనే కదా! అందుకే ఈ నరకలోకపు సింహాసనానికి పోటీదారులుండరు. ఆధిపత్య ధోరణుల వల్ల వచ్చే చీకాకులుండవు. ఈ ప్రయోజనంతో మనందరం కలిసి, ఒక దృఢమైన నమ్మకంతో, సరైన నిర్ణయాన్ని గైకొని మనదైన హక్కును మనం తిరిగి సాధించుకోవాలి. అప్పటి సౌభాగ్యవంతమైన జీవితంకన్నా ప్రశస్తమైనదాన్ని యుద్ధంతోనా, లేక కుయుక్తి, కుట్రలతోనా ఏ మార్గాన సాధించుకోవాలి అనేదాన్ని మనం ఇప్పుడు చర్చించి ఒక నిర్ణయానికి రావాలి!"

ఆతని వాగ్ధాటి ముగియగానే మోలోక్ (Moloc) రాజు తన రాజదండాన్ని పైకెత్తి నిలబడ్డాడు. స్వర్గపోరాటంలో పాల్గొన్న వారిలో అసమాన శూరుడూ, శతృ భయంకరుడూ. నిరాశతో కూడిన చీకటి వల్ల మరింత భీకరంగా కనిపిస్తున్నవాడు, తన శక్తి సామర్థ్యాలపై అపార నమ్మకం కలిగి, స్వర్గాన్ని నరకాన్ని దేన్నీ సరకు చేయనివాడు. గంభీరమైన గొంతుతో పలకసాగినాడు.

"నా నిర్ణయం బహిరంగయుద్ధమే! కుట్రలూ, కుయుక్తులూ నాకు చేతకావు. ఆ అవసరం వచ్చినప్పుడు వాటిలో సమర్థులు వాటిని ఉపయోగించవచ్చును. కాని ఇప్పటి మన కర్తవ్యం యుద్ధరంగంలో శత్రువును మట్టికరిపించడమే. యుక్తులు పన్నే నేర్పరులు ఈలోగా ఒకమూల చేరి ఆ పన్నాగాలను దోషరహితంగా రచించవచ్చు. ఈ ఆయుధపాణులైన మిలియన్ల సైనికులు, ఉవ్వెత్తున విజృంభించడానికి ఒకే ఒక్క సూచనకై ఎదురుచూస్తున్నవాళ్లు, స్వర్గలోకపు కాందిశీకులు, ఈ లజ్జాపూరిత చీకటి గుయ్యారాల్లో, ఆ నియంత మనల్ని నిర్భంధించిన కారాగారంలో అంతులేని బాధలనుభవిస్తూ ఎంతకాలం ఇలా జీవచ్ఛవాలుగా ఉండగలరు? మన ఆలస్యం ఆతనికి శక్తిని పుంజుకునే అవకాశాన్నివ్వదా! పదండి! నరకలోకపు అగ్నిజ్వాలలు మన కరవాలాలకు కరాళపు అంచులై ప్రజ్వలించగా, మనం పడ్తున్న ఈ దుస్సహ

బాధలు భయంకరమైన ఆయుధాలు కాగా, ఉవ్వెత్తున లేచి స్వర్గలోకపు బురుజుల్లోకి చొచ్చుకునిపోదాం!

మన సైనికులు చండప్రచండ బ్రహ్మాండ భేద్యోచ్ఛయా జయరవములతో సర్వదిక్‌శోభను కావించుచుండగా, ఆ సర్వశక్తిమంతుడు (Almighty) తన ప్రచండ ఉరుములు, మెరుపులకు ప్రతిగా మనం ప్రయోగించే నల్లని శీతాగ్ని, భీకర ప్రహారాలకు ఆతని దూతలూ, సింహాసనమూ గజగజ వణికిపోవాలి! ఆతడు మనపై ప్రయోగించి నానా యాతాన పెడ్తున్న ఈ టార్టారియన్ గంధకమూ (Tartarean Sulphur), ఈ విచిత్ర జ్వాలలే ఆతని సైన్యంపై వింత ఆయుధాలుగా విరుచుకుపడాలి. నేను చూపిస్తున్న దారి మనకన్నా శక్తిమంతుడిలా కనిపిస్తున్న శత్రువుపై దాడికి అసాధ్యంగా కనిపించవచ్చు. మళ్లీ బెనూమ్ (Benuum) సరస్సుదాటి పైకెగసి స్వర్గానికెగబాకి, ఓడిపోయి మరల పతనం చెందితే ఏమవుతుందన్న భయం ఉండవచ్చు. క్రితంసారి ఆ భయంకర శత్రువు మనల్ని వెంబడిస్తూ మన సైన్య సమూహపు వెనకభాగాన్ని చిందరవందర చేసినప్పుడు మనల్ని ఈ దుస్సహమైన అంధకారపు నరకకూపంలోకి నెట్టినప్పుడు, అవి గుర్తుకువస్తే స్వర్గానికెగరడం తేలికే కాని, పతనం బహు దౌర్భాగ్యంగా బాధాపూరితంగా అనిపించవచ్చు.

ఈ నరకం కన్నా భయంకరమైనది భయం. దాన్ని ధ్వంసం చేస్తే చాలు! అంతటి ఆనందకరమైన స్వర్గాన్ని వదిలి ఈ నరకకూపంలోకి వచ్చిపడ్డాము. ఈ ఆరిపోని మంటల నుంచి, అంతంకాని బాధలనుంచి బయటపడే మార్గం మనకిప్పుడు కావాలి! అతని కోపాగ్ని మనల్ని చుట్టుముట్టి ప్రాయశ్చిత్తం చేయించే స్థితి మనకక్కర్లేదు. అప్పుడు మనం మరింత చచ్చి నామరూపాలు లేనివాళ్లమవుతాం. ఈ బతుకుకన్నా ఆతడి ఆగ్రహాన్ని మరింత ప్రజ్వలింపచేసి కాలిబూడిదైతే మరీ సంతోషం! అమరులమైయుండి ఈ దుర్భర అవస్థలను భరించే దుస్థితి తప్పుతుంది. మనకున్న సాహసపరాక్రమాలతో స్వర్గంపై దండెత్తగలిగితే, మార్గం దుష్కరమైనా, ఆ సింహాసనం చేజిక్కటం దుర్లభమైనా, విజయం లభించకపోయినా, పోరాడామన్న కీర్తి దక్కుతుంది. ప్రతీకారేచ్ఛ నెరవేరి మనసు కుదుటబడ్తుంది"

కనుబొమలు, భృకుటి ముడివడుతుండగా ఆతని వదనం దేవతలపై భీకర యుద్ధాన్ని ప్రకటింపజేస్తున్నది. ఆతడు కూర్చోగానే ఆవలివేపు నుంచి బెలియల్ (Belial) నిలబడ్డాడు. ఆతని ప్రవర్తన సౌకుమార్యంగా, మానవుల తీరులో ఉన్నది. జ్ఞానవంతుడిగా, హుందాగా పైకి కనిపిస్తున్న ఆతడు వాస్తవానికి మాయలమారి, తేనెపూసిన కత్తి. ఆతని మాటలు చక్కెరగోళీల్లా ఉండి మహా విద్వాంసులను, నిపుణులను బురిడీ కొట్టించగలవు. అల్పబుద్ధీ, పిరికితనం, సోమరితనపు ఆలోచనలకు అందమైన ముసుగులు కప్పి వీనులకింపుగా తోచే మధురస్వరంతో ఆతడు మాట్లాడసాగినాడు.

"బహిరంగ యుద్ధమే నాకూయిష్టం, మిత్రులారా! పగ ప్రతీకారం నాకేమీ తక్కువలేవు. తక్షణ సమర సంరంభాలకన్నా నన్నెక్కువ కలవరపెడ్తున్నది ఆ వ్యూహంలోని లొసుగులు, లోటుపాట్లు. అసమాన పరాక్రమవంతుడైన మన మిత్రుడిందాక నొక్కివక్కాణించిన పునఃదాడి ప్రయత్నం ఇప్పటి నిరాశ నిస్పృహల పునాదులపై నిర్మించబడి ఉన్నదని. ఎందుకంటే ఆతని గురి అంతా ప్రతీకారం, రివెంజ్ (Revenge)పై ఎక్కుపెట్టబడి ఉంది.

ఏం ప్రతీకారం? ఎలా? స్వర్గలోకపు బురుజులు ఎంత దుర్భేధ్యంగా ఉంటాయో మనకు తెలిసిందే. నిరంతరం ఆయుధపాణులైన దేవతాసైనికుల కాపలాలో అవి దుర్నిరీక్ష్యాలు కదా! ఆ వెలుగులోకపు ఎత్తులనుంచీ, రాత్రి చీకటి అంచుల వరకూ నిశితంగా పరికిస్తూ వాళ్లు స్వర్గలోకాన్ని శత్రుదుర్భేధ్యంగా మలిచారు.

సరే! మనం ఒక్కుమ్మడి ఈ నరకలోకపు కటిక చీకట్ల తెరలతో ఉవ్వెత్తున లేచి స్వర్గంపై దండెత్తి దట్టంగా కమ్మినా, స్వర్గాన్ని ఆవరించివున్న కాంతివలయం విజృంభించి స్వర్గంపై మరక కూడా పడనీయకుండా, నరకాగ్నిని మరల వచ్చిన చోటికి నెట్టివేయదా! తన సింహాసనంపై స్థిమితంగా కూర్చున్న విజేత కనీసం దాన్ని గమనించదు కూడా కదా! మరల నరక గంధకమైదానంపై కూలి చతికిలపడి మనం సాధించేదేమిటి? ఈ రుగ్మతకు ఆ వైద్యం మంచిదంటారా? భయంకర రోగానికి విషాద నిదానమా! మన శత్రువు తనకున్న ఆగ్రహాన్నంతా వెళ్లగక్కి మనల్ని ఇంతకన్నా దారుణమైన గాఢాంధకారంలో, ఇంకా సృష్టింపబడని రాత్రిగర్భంలో మనల్ని స్పర్శా చలనం లేకుండా బంధించడం ఉచితమంటారా? అయినా ఎవరికి తెలుసు మనకీ శిక్ష ఎన్నాళ్లున్నదో! లేక అంతిమ సమయం వరకూ పొడిగించబడినదో! అనంతమో! మనల్ని ఇలా శిక్షించిన ఆతను ఆమాత్రం తెలుసుకోలేడా! మనమీద ఆగ్రహజ్వాలల్ని వెళ్లగక్కి మనల్ని ఈ బాధలనుండి విముక్తిచేసి, మనం అనుకున్నట్లు తాను ప్రవర్తించి, అనంతకాలం వరకు నరకయాతనలు పడాలన్న తన నిర్ణయాన్ని తానే రద్దుచేసుకునేంత అమాయకుడా ఆ విశ్వవిజేత? మనల్ని భస్మీపటలం చేసి ఆతడు సాధించేదేమిటి?

యుద్ధానికి అర్రులు చాస్తున్న వాళ్లకు నేనోవిషయం చెబుతాను. ఒకవేళ మనకు విధించిన శిక్ష ఈ నరకకూపంలో ఇలానే అనంతంగా యాతనలు పడాలని ఉంటే, విధికూడ అలానే వ్రాసిపెట్టి ఉంటే దానిని మనం ఎలా మార్చగలం? ఈ శిక్షకన్నా దారుణమైనదేమిటి? ఇదే అత్యంత దారుణమైన శిక్ష అనుకుంటున్నామా? అలా అయితే మన శత్రువు ఆ భయంకరమైన మెరుపులు పిడుగులతో మనల్ని ధ్వంసం చేస్తూ వేటాడుతున్నపుడు మనకు మనమే గదా ఈ నరకకూపపు ఆశ్రయంలోకి పరుగులెత్తింది? ఆ ఆయుధాల దెబ్బలకు దూరంగా రక్షణనిచ్చింది ఈ నరకకూపమే కదా! ఆ జ్వాలాసరోవరంపై సంకెళ్లతో అచేతనంగా పడివున్న స్థితికన్నా ఇప్పుడున్న

స్థితి ఎంతో మేలు కదా! ఎవరు ఊదిన ఊపిరి నరకాగ్నిని ప్రజ్వలింపజేసిందో ఆతడు దానిని ఏడురెట్లు ఎక్కువ అధికం చేస్తే ఆ మంటల్లో మనం మరింత ఉడికిపోమా? స్వర్గపు ఎత్తుల నుంచీ అప్పుడప్పుడూ ఆతడు తన మండుతున్న కుడిచేత్తో ప్రచండ రోషాగ్నిపిడుగులు విసురూ ఉంటే మన పరిస్థితి ఎలా ఉండేది? లేదా ఈ నరకలోకపు అడుగున ప్రవహించే భయంకర లావా ద్రవపు నదులన్నీ కలిసి విస్ఫోటించి మనపై అగ్నివర్షాన్ని కురిపిస్తే మన గతి ఏమిటి?

మనం ఇలా యుద్ధ ప్రయత్నాలలో ఉన్న సంగతి పసికట్టి ఆతడు భయంకరమైన తుఫానును, ప్రచండమైన సుడిగాలుల్నీ పంపి మనల్ని సంకెళ్లతో బంధించి కట్టకట్టి ఆ మరుగుతున్న మహాసముద్రంలో ముంచేస్తే ఏం చేస్తాం. ముక్కుతూ ములుగుతూ అక్కడే ఎల్లకాలమూ క్షమా, జాలీ, దయా కరవై అనంతకాలము అలాగే పడి ఉందామా? అంతకన్నా క్రూరమైన శిక్షపాలౌతామో ఏమో, ఎలా చెప్పగలం! కాబట్టి, నాదృష్టిలో యుద్ధం బహిరంగమైనా, రహస్యమైనదైనా ఫలితం ఒక్కటిగానే ఉంటుంది. నా గొంతు వద్దని చెబుతోంది. బలమైనా, యుక్తి అయినా సర్వజ్ఞుడూ, సమస్తాన్నీ చూడగలిగినవాడూ ఆతడి దృష్టిని తప్పించుకుని ఎలా మనగలుగుతుంది! స్వర్గలోకపు ఎత్తులనుంచి వీక్షించే ఆతడు మన ఎత్తులను పసిగట్టలేనివాడా! ఆ మహాపరాక్రమశాలి మన బలాన్ని, బలగాన్ని, వ్యూహాల్ని నిర్ధారణ చేసి పిడుగుపాట్లతో మనల్ని మరింత అధఃపాతాళానికి తొక్కివేస్తే ఏమిటిగతి మనకు! విధి మనకు పరాజయాన్ని వ్రాసిపెట్టి ఉన్నపుడు విజేత ఆజ్ఞను శిరసావహించడం న్యాయం కాదా! ఒక గొప్ప శత్రువును ఎదుర్కునేముందే పరిణామాల్ని అంచనా వేయడం తెలివిగలవాళ్ల లక్షణం. కత్తితో, బల్లెంతో కదనుతొక్కే వాళ్ల ఆవేశం చూస్తే నాకు నవ్వు వస్తున్నది. వాళ్ల ప్రయత్నం విఫలమైతే భయంతో ముడుచుకుపోరూ! అంతకన్నా బహిష్కారమో, అవమానమో, దాస్యమో, బాధాపూరిత జీవితమో ముందే నిర్ణయించుకుని ఉంటే, సిద్ధంగా ఉంటే ఇంత వ్యధ ఉండదు. విజేత మనకు విధించిన శిక్ష యిది. ఇది మన ప్రాప్తం. కాలం గడిచినకొద్దీ ఆతడి ఆగ్రహం ఉపశమించినకొద్దీ వీళ్లకీ శిక్ష చాలు అనుకోవచ్చు. ఈ మండుతున్న అగ్నులు చల్లారనూవచ్చు. మన స్వచ్ఛమైన శక్తులు ఈ విషవాయుధూమాల్ని అణచివేయగా మనం పడ్తున్న బాధల నుంచి విముక్తి దొరకవచ్చును. ఈ భరించరాని అగ్నికీలలు మనకు వెచ్చదనాన్నివ్వగా, ఈ భీభత్స దృశ్యాలణగి, చీకట్లు తొలగి, అంతులేని నరకయాతనల నుంచి బయటపడి మనం ఎదురుచూస్తున్న స్వేచ్ఛాప్రపంచం మనకు లభించవచ్చును! ఎవరు చెప్పగలరు. ఇక్కడ మనం కాస్త జబ్బుబారిన పడినట్లున్నా, యుద్ధానికిపోయి కొనితెచ్చుకునే కష్టాల కొలిమికన్నా ఈ చితుకుల మంట క్షేమమే కదా!"

ఈ విధంగా బెలియల్ (Belial) మాటలకు సహేతుక వివరణా వస్త్రాలు తొడిగి అక్కడి వేడెక్కిన వాతావరణంలో కొంత శాంతి కలిగించాడు. ఆతని తరువాత మామ్మన్ (Mammon) మాట్లాడసాగినాడు.

"మన యుద్ధం ఇప్పటి స్వర్గాధిపతిని తొలగదీయడానికైనా లేదా కోల్పోయిన మన హక్కుల్ని పునరుద్ధరించుకోడానికైనా ఉపయోగపడాలి. ఆతడిని తొలగదీయాలంటే శాశ్వతమైన విధి నిర్ణయాన్ని, చంచలమైన అవకాశం (Chance) అధిగమిస్తేనే అది సాధ్యం. అప్పుడే అవ్యక్తస్థితి కేయాస్ (Chaos), కష్టాల్ని బేరీజు వేస్తుంది. మన హక్కుల్ని పునరుద్ధరించుకోడానికన్నట్లయితే స్వర్గాధిపతిని ఓడించకుండా మనకు స్వర్గంలో చోటెక్కడ దొరుకుతుంది? ఒకవేళ ఆతడు పశ్చాత్తాపపడో మెత్తబడో మనందరకూ స్వేచ్ఛనిచ్చినా, క్షమాభిక్ష పెట్టినా ఏ మొహం పెట్టుకుని మనం మరలా ఆతనిముందు చేతులు కట్టుకుని వినయంగా, ఆతని ఆజ్ఞలను శిరసావహిస్తూ, ఆతనిని, ఆతని సింహాసనా వైభవాన్ని కీర్తనలతో స్తుతిస్తూ, మనకు ఇష్టంలేని హలెలూయా (Halleluiah) గీతాలతో పొగుడుతూ ఆతడు సింహాసనంపై ఠీవిగా ఆసీనుడైయుంటే మనం అర్పించే హోమద్రవ్యాలు, కానుకలు, ఫలపుష్పాలు అమృతంలా దివ్య పరిమళాలు వెదజల్లుతుంటే, కట్టుబానిసల్లా తలవంచుకుని బతకాలా! ఎవరినైతే మనం ద్వేషిస్తామో ఆతనిచెంత ఇలా బతకడమెంత బాధాకరం!

మనం గెలవలేని యుద్ధాన్నో, చేయలేని బానిస బతుకును గురించో ఆలోచించక మనం మనంగా ఎలా బతకగలమో, మనకేది మంచిదో దాన్ని ఆచరిద్దాం. ఈ తిమిరాంధకార కూపంలో మనకు స్వేచ్ఛ ఉన్నది. ఎవరికీ జవాబుదారీలం కాము. ఈ కఠినతరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యం కావాలో, సుఖప్రదమై, విలాసవంతమైనా కాడెద్దు బతుకు కావాలో మనం తేల్చుకోవాలి. అప్పుడు మన గొప్పతనం బయటపడ్తుంది. చిన్నవాటి నుంచి గొప్ప విషయాలు, కష్టతరమైన కార్యాల్లోంచి ఉపయోగపడే వ్యవహారాలు, నష్టాల నుంచి లాభాలు ప్రస్ఫుటమౌతాయి. శ్రమ, ఓర్పు, సహనాలు కష్టాల్లోని బాధను తీసివేయగా ఈ నరకకూపమే స్వర్గతుల్య మవుతుంది. ఈ చీకటికొట్టాన్ని చూసి మనం భయపడ్తున్నామా! ఎన్నిసార్లు ఆ స్వర్గాధిపతి సింహాసనం చుట్టూ కాలమేఘాలు కమ్మి ఉరుములు మెరుపుల్తో, భయంకరమైన పిడుగుల శబ్దాలతో కంపింపజేస్తున్నా ఆతడు కించిత్తయినా తొణికాడా! ఆతను ఆ కాసేపన్నా నరకాన్ని తలపించిన స్వర్గాన్ని వదిలి జారుకున్నాడా! లేదే! అతడు మనకు చీకటిలాంటివాడైతే మనం ఆతడికి వెలుగులా దారి చూపలేమా? ఈ ఎడారి నేల తనలోని స్వర్ణ, మణి మాణిక్యాలను దాచుకోవాలనుకోవడం లేదు. మనలోని కళాతృష్ణకూ, శిల్ప నైపుణ్యానికి కొదవలేదు. ఈ నరకలోకాన్నే స్వర్గంగా మారుద్దాం. ఇంతకంటే స్వర్గం మనకేమివ్వగలదు అధికంగా! మనం పడుతున్న

పీడనా క్లేశాలే రేపటికాలంలో మనకు మూలక విశేషాలు కావచ్చును. ఈ అగ్నిజ్వాలలే మనకు బాధా నివారణా లేపనాలుగా మారవచ్చును. ఇప్పుడు మనందరం చర్చించ వలసింది మనమున్న ఈ దుస్థితి నుంచి ఎలా మనల్ని మనం ఉద్ధరించుకోవాలీ, మన పూర్వవైభవాన్ని ఇక్కడే ఎలా పునఃప్రతిష్ఠించుకోవాలీ అన్నదే. అంతేకాని ఏ రకంగానూ సమయోచితం కానిది, మళ్లా మనల్ని కష్టాల కొలిమిలోకి నెట్టే యుద్ధ క్రీడ గురించి కాదు"

ఆతడు ముగింపుకు వచ్చేసరికే నెమ్మదిగా కొద్దిగా మొదలైన గుసగుసలు ఆ నరకలోక ప్రాంగణమంతా వ్యాపించి – రాత్రంతా సముద్రాన్ని అల్లకల్లోలం చేసిన హోరుగాలి కెరటాలు కొండగుహల్లోకి చొచ్చుకుపోగా ప్రతిధ్వనిస్తున్న శబ్దాల్లా, తుఫాను తాకిడికి గురైన నౌకలలో తల్లడిల్లుతున్న నావికులు అదృష్టవశాత్తు, ఎగుడుదిగుడుగా ఉన్న రేవులో ఎలాగోలా లంగరు వేసి 'హమ్మయ్య' అని ఊపిరి తీసుకుని హర్షధ్వానాలు చేసినట్లు – ఆ నరకలోక సభాప్రాంగణం యావత్తూ చప్పట్లతో మారుమ్రోగింది.

మామ్మన్ చెప్పిన మాటల్లోని యథార్థం వాళ్లందరకూ నచ్చింది. వాళ్లలో అధిక సంఖ్యాకులు శాంతినే కోరుకుంటున్నారు. వారికెవ్వరికీ ఇప్పటి నరకం కన్నా నికృష్టమైన స్థలానికి పోయే ఉద్దేశం లేదు. వాళ్లపై ధారాపాతంగా కురిసిన ఉరుములు, మెరుపులు, పిడుగుల వల్ల కలిగిన భయం, మైఖేల్ (Michael) ఖడ్గపు మృత్యునృత్యం వాళ్లకింకా మరపుకురాలేదు.

ఏమో కాలగమనంలో ఈ నరకలోకం కూడ స్వర్గానికి సమమైన గౌరవ ప్రతిష్ఠలు పొందవచ్చును కదా!

వాళ్లందరి ఆలోచనలను గమనిస్తున్న బీల్‌జెబబ్ (Beelzebub) గౌరవంలో 'సాతాను' తర్వాత స్థానమున్న మహావీరుడు, నరకలోక భవనానికి ఒక ఆధారస్తంభం లాంటివాడు, అందరి క్షేమాన్ని కాంక్షించేవాడు, రాజఠీవితో వెలుగొందుతూ, శిధిలాల మధ్య చెక్కుచెదరని భవనంలా గంభీరంగా ఉన్నవాడు, తన అట్లాంటియన్ (Atlantean) భుజాలపై మహా సామ్రాజ్యాలను మోయ గలిగినవాడు, తన తీక్షణ వీక్షణాలతో వేసవి మధ్యాహ్నం లేదా రాత్రి వీచే సముద్రపు గాలిలా సభను నిశ్శబ్దం గావించి ఇలా పలికాడు–

"రాజులు, సర్వంసహా చక్రవర్తులు, దైవకుమారులు, స్వచ్ఛమైన సుగుణాల రాశులు – ఈ కీర్తికిరీటాల్నిక త్యజించడం ఉచితమనుకుంటాను. మారిన కాలానికి అనుగుణంగా మనల్ని నరకలోకపు రాకుమారులుగా అభివర్ణించుకోవడం సమంజసం. ఎక్కువమంది సభికుల అభిప్రాయం మనం ఇక్కడే ఉండడం వేపు మొగ్గుచూపింది. కనుక మనం ఇక్కడే ఓ మహాసామ్రాజ్యాన్ని విస్తరింపజేద్దాం. అయినా మనం ఈ

విషయాన్ని మరువరాదు. స్వర్గాధినేత కరకు చెరసాలగా ఈ లోకాన్ని భావించాడు గాని, మనకు విడిదిగృహంగా దీనిని అప్పజెప్పలేదు. స్వర్గలోకపు న్యాయహస్తాలకు దూరంగా తిరుగుబాటు దారుల్ని విసిరేసినా వాళ్లు తనకు బానిసలుగా ఉండేట్లు జాగ్రత్తలు తీసుకుని ఉంటాడన్నది సత్యం. ఎంత దూరంలో ఉన్నా, దగ్గరలో ఉన్నా, పైన ఉన్నా, క్రింద అగాధంలో ఉన్నా తన మహా సామ్రాజ్యంలో ఏ ఒక్కరూ తిరుగుబాటు చేయడాన్ని సహించని నియంత అతడు. తన అదుపులో ఉన్న మనల్ని ఉక్కుదండంతో నియంత్రిస్తూ, స్వర్గలోకపు వాసుల్ని బంగారు బెత్తంతో అదిలిస్తుంటే మనం ఇక్కడ తీరిగ్గా కలలుగంటూ యుద్ధమా! శాంతియా! అంటూ చర్చలు చేద్దామా! యుద్ధమే గదా మనకు ఒక కఠినమైన దారిని లక్ష్యాన్ని ఇచ్చింది. ఓటమితో మన శక్తి కోలుకోలేనంత అణిగినా శాంతి ప్రతిపాదనలు మనం అంగీకరించేదా? ఎవరు ప్రతిపాదిస్తారు శాంతిని? ఆ శాంతి ఒప్పందపు షరతులేమిటి? పరాజితులకిచ్చే ఒడంబడికలో బానిసబతుకు ఛాయలేకాని వెట్టిచాకిరి, కష్టాలు లేని సుఖమయ సూత్రాలుంటాయా? మనలో ప్రజ్వలిస్తున్న ప్రతికూలత, ద్వేషాలతో, తొలగని అసమ్మతితో, కాస్త నెమ్మదించినా వేడితగ్గని ప్రతీకారాగ్నితో, మన ప్రణాళికలను మనం వేస్తుంటే ఆ విజేత తన విజయఫలాన్ని ఆస్వాదించడా! ఆస్వాదిస్తూనే తన జాగ్రత్తలో తానుండడా! మనకు తెలుసు స్వర్గలోకపు రక్షణా దుర్గాలు ఏ విధమైన ముట్టడికీ, దొంగచాటు దెబ్బలకూ లొంగనివని. అటువంటప్పుడు అసాధ్యమైన యుద్ధం కన్నా సుసాధ్యమైన యుక్తి మేలుకదా!

ప్రాచీన జోస్యం తప్పుకాకుండా ఉంటే ఇప్పుడో కొత్తలోకం ఉద్భవిస్తున్నది. దానిపై మానవులుగా (Man) పిలువబడే నూతనజాతి సృష్టింపబడనున్నది. శక్తి సామర్థ్యాలలో మనకన్నా కాస్త తక్కువశ్రేణిలో ఉన్నా ఆ మానవతెగ స్వర్గాధిపతికి ఇష్టమైనది. ఆ వార్త అతని నోటిగుండా వినగానే స్వర్గలోకం వణికిందట. ఆ జాతి ఎటువంటిది? రూపురేఖలు, తెలివితేటలు, బలం, బలహీనతలు ఎటువంటివి? వీటిని మనం క్షుణ్ణంగా శోధించాలి. స్వర్గం మనకందనంత దూరంలో ఉన్నపుడు, ఆతనికి దూరంగా ఉండి మనకు సమీపంలో ఉన్న ఈ లోకాన్ని, స్వర్గలోకపు అంచు చివర ఉండి దాని రక్షణాబాధ్యత అక్కడ నివసించే వాళ్లపైననే ఉన్న ఈ బలహీనపు లోకాన్ని మన వశం చేసుకునే ఆలోచనలు చేద్దాం! నరకాగ్నిని ప్రజ్వలింపజేసి ఒక్కుమ్మడిగా మనం స్వర్గచ్యుతులైన విధంగానే ఈ నూతన జాతిని వాళ్ల లోకం నుంచి తరిమివేసి స్వర్గాధిపతి సృష్టిని అభాసుపాలు చేద్దాం! లేదా ఆ జాతిని మన మాయాజాలంతో వశపరచుకుని వాళ్ళ సృష్టికర్తతోనే విరోధాన్ని కల్పించి ఆతడే ఈ జాతిని సృష్టించినందుకు చింతిస్తూ వాళ్లని నాశనం చేసేలా యుక్తులు పన్నుదాం! ఇది అసాధారణమైన ప్రతీకారం. మనల్ని గెలిచి విజయగర్వంతో ఊగిపోతున్న ఆతనికిది

అశనిపాతం కాగలదు. మనం సృష్టించే ఈ గజిబిజిని, అస్తవ్యస్త స్థితిని సరిదిద్దడానికి ఈ కొత్తలోకంలో అడుగుబెట్టే దైవకుమారులు మనతో కలిసి ఆతనిని నిందిస్తుంటే ఆతని విజయగర్వం పటాపంచలు కావాలి! మీరు ఇప్పుడు చెప్పండి యుక్తితో కూడిన ఈ పద్ధతి మంచిదా లేక చీకట్లో కూర్చుని యుద్ధంతో మనం గెల్చుకునే ఊహాసామ్రాజ్యాల దారి మంచిదా? మీరే నిర్ణయించండి"–

అలా బీల్‌జెబబ్ (Beelzebub) తన వాదాన్ని, సాతాను మనసులోని భావాన్ని పదునైన మాటలతో వెలిబుచ్చాడు.

ఏనాడయితే దుష్టకార్యాల రచయిత మానవజాతిని క్షోభపరిచే కుయుక్తిని తలపోసాడో, తన ప్రతీకారాగ్నికి కొత్తజాతిని సమిధలుగా వాడుకొని విజేతపై కొత్త యుద్ధాన్ని ప్రకటించాలనుకుంటున్నాడో, నరక, భూలోకాల్ని ఏకం చేసి దేవదేవుని సృష్టిని అపహాస్యం చేసి ఆతనిపై ప్రచ్ఛన్న యుద్ధాలతో చీకాకు పరచాలనుకున్నాడో ఆనాడే కొత్తయుద్ధానికి నాంది పలికింది. ఆ పన్నాగాలే దేవదేవుని కీర్తిని మరింత ప్రకాశవంతం చేస్తాయి. ఆనాటి నరకసభలో ఉన్న వాళ్లందరి మనస్సులూ ఆ వ్యూహానికి ఆనందపరవశం కాగా, వాళ్ల కళ్లు సంతోషంగా మెరుస్తుండగా, అందరూ హర్షాతిరేకంతో తమ సమ్మతిని తెలిపారు.

బీల్‌జెబబ్ (Beelzebub) తన ప్రసంగాన్ని కొనసాగించినాడు. "మహాసభలో పాల్గొన్న మిత్రులారా! మీ శక్తియుక్తులు విశదమైనాయి. మంచి నిర్ణయాలు తీసుకున్నారు! దీర్ఘమైన చర్చలు ముగింపుకు వచ్చినాయి. జటిలమైన సమస్యలకు పరిష్కారాలు దొరికాయి. వాటిననుసరించి మనం మనల్ని ఉన్నత స్థితికి తీసుకువెళ్లే ప్రయత్నాలు చేద్దాం. మనం నూతనలోకాల్ని వశపరచుకుని మెల్లమెల్లగా మన అంతిమలక్ష్యమైన స్వర్గసింహాసనాన్ని చేజిక్కించుకునే దిశగా సాగుదాం! లేదా ఇంకా దేవలోకపు వెలుగు చేరని మధ్యలోకంలో, తూర్పు కిరణాలు ప్రవేశించగా తోకముడిచిన చీకటిని చూస్తూ, ఒక చల్లని గాలికెరటం మన శరీరాలపై కాలిన గాయాలను మాన్పుతుండగా సేదదీరుదాం!

ఈ నూతన లోకపు జాడకోసం ఎవరు వెళతారు? ఆ శక్తిసామర్థ్యాలు ఎవరికున్నాయి? ఎవరు ఈ అట్టడుగులేని కటిక చీకటి అగాధం నుంచి దారి వెదుక్కుంటూ, అలుపు సొలుపులు లేకుండా చాపిన రెక్కల్తో ఎగుర్తూ ఆ కొత్తలోకాన్ని చేరుకోగలరు? వేయికళ్లతో కావలికాస్తున్న లోకరక్షకుల్ని దేవదూతల దృష్టినీ తప్పించుకుని ఈ కార్యాన్ని చేయగల సమర్థుడెవ్వడు? మన తొలి, ఆఖరి ఆశాకిరణం ఆతడే కాగలడు! ఎవరు ఈ కార్యాన్ని సమర్థవంతంగా నిర్వహించగలవాడు?"

అలా పలికి అతను తన స్థానంలో ఆసీనుడై తన వాదాన్ని సమర్థించడం లేదా వ్యతిరేకించడం చేయడానికి ఎవరైనా ముందుకు వస్తారేమోనని ఆత్రుత నిండిన

కళ్లతో గమనించసాగినాడు. అత్యంత ప్రమాదకరమైన ఆ కార్యనిర్వహణలో ఎదురయ్యే ఆటంకాలను ప్రమాదాలను ఊహిస్తూ సభికులంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు. కొందరి మొహాల్లో ఆశ్చర్యం, కొందరిలో ఉలికిపాటు, ఇలా భావాలు వెలువడుతున్నా ఈ సాహస ప్రయాణానికి ఒంటరిగా వెళ్లడానికి ఎవరూ ముందుకు రాలేదు. చివరకు మహానేత 'సాతాన్' స్వయంగా లేచి తనచుట్టూ కాంతివలయాలు వెలుగులు విరజిమ్ముతుండగా, చక్రవర్తి ఠీవితో, గంభీరంగా ఇలా చెప్పినాడు–

"ఓ స్వర్గ సంతానమా! సామ్రాజ్యాధినేతల సమూహమా! ఈ నిశ్శబ్దానికి కారణం మనమూహించగలిగినదే! ఈ దారి బహు కష్టతరమైనది. ప్రమాద భూయిష్టమైనది. మనమున్న చెరసాల దుర్భేధ్యమైనది. నరకాగ్ని వలయంతో రక్షింప బడియున్నది. తొమ్మిదిరెట్ల రక్షణతో, మండుతున్న సూదంటురాయి (Adamantine) తో చేయబడ్డ ద్వారాలతో బయటకు పో వీలులేని కారాగారమిది. ఒకవేళ ఆ ద్వారాలను దాటినా కటిక చీకటి రాత్రి ఆ సాహసికుణ్ణి ఆహ్వానించి దారితెన్నూ లేని అగాధంలోకి నెట్టివేస్తుంది. దాన్ని తప్పించుకుని ఎలాగోలా ఆ కొత్తలోకంలోకి వెళితే అక్కడ ఎటువంటి ప్రమాదాలున్నాయో ఎవరికి తెలుసు?

మిత్రులారా! ఈ మహా సామ్రాజ్యానికి అధినేతగా, ఈ రత్నఖచిత సింహాస నాధిపతిగా, సాహస పరాక్రమాలలో శక్తియుక్తులలో సాటిలేని నేతగా, మీరు నాకిచ్చిన గౌరవానికి నేను కృతజ్ఞతలు చెబుతూ, అతి దుర్లభమైన ప్రయాణానికి నేనేనడుము బిగిస్తున్నాను. ఏ ప్రమాదమూ, అడ్డంకీ నన్ను భయపెట్టలేదు. మీ అందరికీ నేతగా ఉన్నపుడు, అత్యధిక గౌరవాన్ని పొందుతున్నపుడు, కష్టాల్లో కూడ అత్యధిక భాగాన్ని పంచుకోవడం ఉచితమేకదా! అందుకే చెబుతున్నాను, మహావీరులారా! స్వర్గాన్ని వణికించే శూరులారా! ఎన్ని కష్టాలూ, బాధలున్నా ఈ నరకమే ప్రస్తుతానికి మన ఇల్లు. మంత్రమో, తంత్రమో, మాయయో, మహేంద్రజాలమో ప్రయోగించి ఈ బాధలు, నరకయాతనలు నెమ్మదించేలా ప్రయత్నిద్దాం!

నేను లేనప్పుడు మీరు మెలకువగా ఉండాలి సుమా! సదా జాగరూకుడైన విజేతను నిరపేక్షించవద్దు. నేను ఏదోవిధంగా ఈ పెనుచీకటి గుయ్యారాల్ని దాటి ఒంటరిగా మనకు తరుణోపాయాన్ని శోధిస్తాను. ఈ సేనావాహిని ప్రస్తుతం నాతో రానవసరం లేదు"

అని పలికి ఆతడు తనస్థానం నుంచి సభ ముగిసిందనడానికి సూచనగా లేచి నిలబడ్డాడు. ఇంకెవ్వరూ మాట్లాడే అవకాశం ఇవ్వలేదా అధినేత. అతనితో వాదించే సాహసం ఎవరికున్నది! అలా సాహసించి ఆతనితో విరోధం కొనితెచ్చుకో గలిగిన వారెవ్వరు? అందుకనే అందరూ అతనితోపాటు లేచి నిలబడి ఆతని నిర్ణయానికి హర్షధ్వానాలు చేస్తూ తమ ఆమోదాన్ని తెలిపారు. ఆతనికి సాష్టాంగ నమస్కారాలు

చేస్తూ స్వర్గాధిపతికి సమానుడిగా కీర్తించసాగినారు. అందరిక్షేమం కోసం ఒంటరిగా అత్యంత సాహసం చేయబోతున్న తమ నాయకుడి ధీరోదాత్తతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తరపు గాలి నెమ్మదించినపుడు పర్వత శిఖరాగ్రాన్ని చుట్టుముట్టిన నల్ల మబ్బులు స్వర్గలోకపు మంచుమైదాన వదనంపై చిరచిరలాడుతున్న కోపంలా కనిపిస్తున్నపుడు, ఆ మబ్బుల చాటు నుంచి వెలువడ్డ సాయం సూర్యుని కిరణాలతో హర్షించిన పొలాలు, కిలకిలా రావాలు చేస్తున్న పక్షులు, సంతోషంతో అరుస్తున్న పశువుల మందలు వీటితో కొండలు లోయలు ప్రతిధ్వనిస్తున్నట్లు నరకలోకపు సేనా వాహినీ సంరంభం కన్పడసాగింది.

మానవులు సిగ్గుపడాల్సిన విషయమిది! డెవిల్ (Devil)– దెయ్యాల ప్రభావానికి లోనై వీళ్లు వివేకాన్ని కోల్పోతారు. స్వర్గలోకపు కరుణను, దేవదేవుని శాంతి ప్రతిపాదనను తిరస్కరించి, అసూయా ద్వేషాలలో, కష్టాల జడివానల్లో తడుస్తూ లేస్తూ క్రూరాతి క్రూరమైన యుద్ధాల్లో తలమునకలౌతారు. ఒకరినొకరు చంపుకుంటూ భూమిని నిర్వీర్యం చేస్తూ, తమ నాశనం కోసం రేయింబవళ్ళు శ్రమిస్తున్న నరకవాసుల ఎత్తుగడలను గమనించక సృష్టికర్తనే తూలనాడుతూ దైవానుగ్రహానికి దూరంగా జారిపోతుంటారు"

స్టిక్స్ నదీ పరివాహక ప్రాంతంలోని నరకకూపపు మహాసభ ఆవిధంగా ముగిసింది. ముందుగా మహానేతలు, మధ్యలో వారి ప్రభువు – స్వర్గశత్రువు, నరకలోక నేత, ఆడంబరాల్లో ఐశ్వర్యంలో దేవాధిదేవుని తలపిస్తూ, ఆతని చుట్టూరా మండుతున్న గోళంలా సెరాఫిమ్ (Seraphim) దేవదూతల వలయం, వారి చేతుల్లో ధగద్ధగాయ మానంగా మెరుస్తున్న ఆయుధాలు, పతాకలు, వారు బయటకు నడుస్తుంటే సభ ముగింపుకు సూచనగా ఉవ్వెత్తున మోగిన భేరీభాంకారనాదాలు, జయజయధ్వానాలు, నాలుగుదిక్కులకు తిరిగిన నలుగురు ఛెరుబిమ్‌లు (Cherubim) కొమ్ముబూరలతో నాదాలు చేస్తుండగా, ప్రతీహారుల హెచ్చరికలు, నినాదాలతో ఆ నరకలోకం ప్రతిధ్వనిస్తుండగా, మనసులు కుదుటబడ్డ ఆ మహాసైన్యవాహిని, ఆశలు చిగురిస్తుండగా ఎవరిదారిన వారు వెళ్లిపోతూ తమ అధినేత తిరిగి వచ్చేంత వరకు ఏం చేయాలో నిర్ణయించుకుంటున్నారు.

మనసులు ప్రశాంతపడగా, చిగురించిన కొత్త ఆశలతో, ఆ సేనావాహిని గుంపులు గుంపులుగా తలొకదారిని పోతున్నారు. కొందరు మైదానాల్లోకి, కొందరు గాల్లో ఎగుర్తూ ఒలింపిక్ క్రీడల్లో (Olympic games) లేదా పిథియన్ పొలాల్లో (Pythian fields) పరుగులు తీస్తున్న జవనాశ్వాల్లా, పోటీలో పాల్గొంటున్న రథాల్లా, వడివడిగా పోతుండగా...

కొందరు ప్రసిద్ధ నగరాల మధ్య ఆకాశ యుద్ధాలు జరిగినప్పుడు మబ్బుల్లో దాక్కొని ఒకరినొకరు ఎదుర్కొంటున్న వీరుల దళాల్లా, శూరుల దండులా–

మరికొందరు టైఫోయన్ (Typhoean) అగ్నిపర్వతం బద్దలై లావా ప్రవాహం కొండల్ని గుట్టల్ని చీల్చుకుంటూ, సుడిగాలుల్ని సృష్టిస్తూ సాగుతున్నట్లుగా– ఆ ప్రచండ ఘోషకు నరకలోకమే ప్రతిధ్వనిస్తుండగా...

ఒయిఖేలియా నదిని ఓడించి విజయగర్వంతో ఉన్న ఆల్‌సైడెస్ (Alcides= Hercules) తాను ధరించిన విషవస్త్రం, రక్తమాంసాలను పీల్చేస్తూ అమితమైన బాధ పెడ్తుండగా ఆగ్రహంతో పెడబొబ్బలు పెడుతూ థెస్సాలియన్ (Thessalian) పైన్ వృక్షాలను, కూకటివేళ్లతో పెకలించి ఆ వస్త్రాన్ని తెచ్చిన తన సేవకుడు 'లైకాస్'ను ఒయిటా (Oeta) మైదానం మీదుగా యుబొయిక్ సముద్రం (Euboic Sea)లో విసిరివేస్తున్నప్పుడున్న భీకర శబ్దాలతో – మరికొందరు...

కొందరు నిశ్శబ్ద లోయల్లోకి వారి సాహసకృత్యాలను గీతాలుగా పాడుకుంటూ విధి తమకు మరల పాత వైభవాన్నిస్తుందని ఆశిస్తూ, ఆ గీతాల మధురిమ పాతరోజుల్ని గుర్తుకుతేగా మౌనంగా సాగుతున్నారు.

కొందరు కొండగుట్టలపైన కూర్చుని విధి, పూర్వజ్ఞానం, ఇచ్ఛాశక్తి, సంకల్పం, అదృష్టం, విచక్షణ, పూర్వనిర్ణయం, కర్మ – ఇటువంటి అంతంలేని చర్చలలో కొట్టుకు పోతున్నారు. మంచీచెడూ, సుఖదుఃఖాలు, రాగద్వేషాలూ, జయాపజయాలు, కీర్తి అవమానాలూ, జ్ఞాన అజ్ఞానాలు వాటిపై కుహనా వేదాంత సూత్రాల్ని చర్చిస్తూ తమ బాధల్ని మరచిపోతున్నారు.

మరికొందరు సాహసికులు దళాలుగా మారి ఆ నరకకూపంలోని వింతలూ విశేషాల్ని అన్వేషిస్తూ తాము సుఖంగా బ్రతకడానికున్న వనరులకై అన్వేషిస్తూ ముందుకు సాగుతున్నారు. కాని ఆ దుర్గంధపూరిత జ్వాలా ఎడారుల్లో నివాసయోగ్య ప్రదేశ మెక్కడుంది? అక్కడున్న నాలుగు నదులు తమ ప్రవాహ జలాన్ని జ్వాలాసరోవరంలోకి కక్కేందుకు సాగుతున్నాయి.

అందరూ అసహ్యించుకునే ద్వేషాల వరద వెల్లువ – స్టిక్స్ (Styx) నది, నల్లగా, లోతుగా వుండే దుఃఖ విషాదాల – ఎఖెరాన్ (Acheron) ప్రవాహం, రోదనలు ఏడ్పులు ప్రతిధ్వనించే – కొసిటస్ (Cocytus) నది, మంటలు వెదజల్లే ఆగ్రహ – ఫ్లెగెటాన్ (Phlegeton) ప్రవాహం – వీటన్నిటికీ దూరంగా నెమ్మదిగా, నిశ్శబ్దంగా ప్రవహిస్తూ మరపు కలిగించే– లెథె (Lethe) నది. (ఈ నది నీళ్లు తాగితే పాత సంతోష విషాదాలు, సుఖాలు, బాధలు మరచిపోతారు.) వీటి తరువాత వచ్చేది ఘనీభవించిన చీకటి ఖండం. తుఫానులు, సుడిగాలులు, వడగళ్ల వర్షాలతో మంచు గడ్డలు గుట్టలుగా ఏర్పడి ఎక్కడచూసినా మంచుకొండలే, లోయలే! అవి

సెర్‌బోనియన్ (Serbonian) చిత్తడి నేలల్లా, డమియేటా (Damiata), కాషియస్ (Casius) కొండల మధ్య ఊబిలా ఉండి, పటాలాలకు పటాలాల సైన్యాల్ని మింగివేసిన ప్రదేశాల్లా ఉన్నాయి. అక్కడ వీచే చల్లటి గాలులు అగ్నిమంటల్లా గాలిని మాడ్చేస్తూ శరీరంపై బొబ్బల్ని కలిగిస్తున్నాయి. ఆగ్రహదేవతలు– 'ఫ్యురీస్' (Furies) నాట్యం చేసే ప్రదేశాల్లా అవి అతి శీతలాన్ని, అతి ఉష్ణాన్ని కలిగిస్తూ మంచుమైదానాల్ని, అగ్నిక్షేత్రాల్ని పక్కపక్కనే సృష్టిస్తున్నాయి. దిబ్బల్లా తేలియాడుతూ అవి మంచుగడ్డల్లా ఘనీభవించి, మరల అగ్నికీలల్లో చిమిడిపోతూ వేడిని కలిగిస్తూ అటుయిటూ ఇటూ అటూ కదుల్తూ లెథియన్ (Lethean) శబ్దాలతో పక్కనే వున్న ప్రవాహాల్లో చేరేందుకు ఉత్సాహపడ్తున్నాయి. ఒక్కోసారి అంత మంచుగడ్డా అక్కడి వేడిమికి ఒక్కక్షణంలో చిన్ని నీటిబిందువుగా మారి ప్రవాహాన్ని చేరేలోపలే అదృశ్యమైపోతోంది. ఆ నీళ్లను అందుకుందామన్నా అవి టాంటాలస్ (Tantalus) పెదాలకందని నీళ్లులా తప్పించుకు పోతున్నాయి. వాటికి కాపలాగా భయంకరమైన గార్గొనియన్ (Gargonian) మెడుసా (Medusa) ఎవ్వరినీ ఆ నీటి దగ్గరికే రానీదు.

ఆ సాహసికులు రోదనల ప్రదేశాన్ని, కటిక చీకటిలోయలను, శీతల మైదానాల్ని, మండే పర్వతాల్ని, కొండల్ని, గుహల్ని, సరస్సుల్ని, మడుగుల్ని, ఊబి ప్రదేశాల్ని, చిత్తడి నేలల్ని, చీకటి గదుల్నీ, మృత్యునీడలు ముసురుకున్న మృత్యు ప్రపంచాన్ని చూసి భయపడినారు. ఆ ప్రదేశం దేవదేవుని శాపంతో సృష్టించబడి, కీడుతో నిండిఉన్న క్రీడాస్థలి. అక్కడ జీవం మరణిస్తుంది. చావు వర్ధిల్లుతుంది. ప్రకృతి భూతప్రేతాలకు, రాక్షసులకు, వికృతాకారులకు, విభ్రాంతికరమైన వినాశకారులకు జన్మనిస్తుంది. ఇతిహాసాల్లో, కథల్లో పేర్కొనబడ్డ గార్గాన్లు (Gorgons), హైడ్రా (Hydra), కిమెరా (Chimera)ల కన్నా భయంకర మృగాలు సంచరించే ప్రదేశం అదే!

ఈలోగా దేవునికి, మానవునికి విరోధి సాతాన్ తన ప్రణాళికను ఆలోచనా జ్వాలలు చుట్టుముట్టగా, ఒంటరిగా నరకద్వారాల వేపు, విప్పారిన రెక్కల్తో ఎగురుతూ తన అన్వేషణను ప్రారంభించాడు. కొంతసేపు కుడివేపు, కొంతసేపు ఎడమకు, ఒక్కోసారి నరకలోకపు లోయల అడుగుకు, మరోసారి పైకప్పు వేపు – బెంగాలా (Bengala) వేపు నుంచి వస్తున్న నౌకలు గాలుల వత్తిడికి సముద్రంలో దూరాన మబ్బులతో కలిసి కనిపించినట్లు, లేదా టెర్నేట్ (Ternate), టిడొరె (Tidore) ద్వీపాల్నుంచి మసాలా దినుసులూ, మందులూ తెస్తున్న వ్యాపార నౌకలు ఇథియోపియన్ (Ethiopian) విశాలతీరం, భూ అగ్రం (Cape) నుండి ధృవం వేపు శీతలగాలికి ఎదురుగా దూసుకుపోతున్నట్లుగా – సాతాన్ నరకద్వారాల వేపు సాగిపోగా, పోగా చివరకు నరకలోకపు అంచుల దగ్గర భీకరంగా ఉన్న పైకప్పు కింద మూడు మూడింతలున్న ద్వారాలు, తలుపులు – మూడు ఇత్తడిచే (Brass),

మూడు ఇనుముతో (Iron), మూడు ఎడమాంటైన్ (Adamantine) శిలలతో చేయబడ్డవి, అగ్నిజ్వాలలు నిప్పులు కక్కుతూ దుర్భేధ్యంగా కనిపించాయి. ఆ ద్వారాల ముందు ఇరుపక్కలా భయంకరమైన ద్వారపాలకులున్నారు. ఒక మృగం నడుం వరకు అందమైన స్త్రీలా ఉండి క్రింద భయంకరమైన పొలుసులున్న మహాసర్పంలా అసహ్యంగా, చేతిలో మృత్యుకొండి (Mortal Sting) ఆయుధంగా, పక్కనే భీకరంగా విరామం లేకుండా మొరుగుతున్న నరకలోకపు జాగిలాలు, తమ విశాలమైన సెర్‌బెరియన్ (Cerberean) నోళ్లను తెరిచి అసహ్యాన్ని, జుగుప్సను కలిగిస్తూ, ఏమాత్రం అలికిడి అయినా తమ నివాస ప్రదేశమయిన ఆమె గర్భాశయంలోకి చేరిపోయి అక్కడ్నుంచి కనపడకుండా మొరుగుతూ భయాన్ని కలిగిస్తున్నాయి. ఆమె ఎంత భయంకరంగా ఉందంటే ట్రినాక్రియన్ (Trinacrian) తీరాన్నీ, కాలాబ్రియా (Calabria)ను వేరుచేసే సముద్రంలో తిరుగాడే స్కిల్లా రాక్షసికన్నా (Scylla), తమ మంత్రశక్తితో చంద్రగ్రహణం గావించే లాప్‌లాండ్ (Lapland) మంత్రగత్తెల ఆహ్వానం మేరకు ఆకాశంలో ఎగుర్తూ పసిబిడ్డల రక్తపు వాసన విరజిమ్ముతూ వచ్చే అనాకారుల్లో అనాకారి ముసలి మంత్రగత్తె (Night Haag) కన్నా వికృతంగా పరమ అసహ్యంగా ఉన్నదామె.

రెండోవేపున ఇంకో వికృతాకారుడు. ఏ రూపమో వర్ణించలేనంత రోతగా ఉండి, ఏది కాలో, ఏది చేయో, ఏది కీలో, ఏది ఏముకో గుర్తుపట్టలేము. కటిక చీకటికన్నా నల్లగా, ఆగ్రహాధి దేవతలు – ఫ్యురీస్ (Furies) పదిమందికి పెట్టుగా, నరకమంత భయంకరంగా, శిరస్సుపై రాజోచితమైన కిరీటాన్ని ధరించి చేతిలో భయంకరమైన బాణాన్ని (Dart) కదిలిస్తూ బీభత్సంగా ఉన్నాడతడు.

తన చేతికందేంత దూరంలో ఉన్న 'సాతాన్'ను చూడగానే కూర్చున్న చోటునుంచి వడిగా లేచి కాళ్లకింద నేల దద్దరిల్లేలా అడుగులు వేస్తూ, ప్రతి అడుగు ఒత్తిడికి నరకలోకం కంపిస్తుండగా ఆతడు సాతాన్‌ను నిలువరించాడు. అతణ్ణి చూసి కనీసం బెదరనైనా బెదరని సాతాన్ తన శత్రువైన దేవదేవుణ్ణి మనసులో మెచ్చుకున్నాడు. కాని కించిత్ తొణకకుండా తనకెదురుగా ఉన్న భయంకర వ్యక్తిని తిరస్కారంగా చూసి ఇలా మాట్లాడాడు.

"నువ్వెవరో, ఏమిటో, బహురోతగా కనిపిస్తున్నావు. నీ భయంకర రూపంతో ఈ ద్వారం దగ్గర నా మార్గానికి అడ్డువచ్చావు. నేను వీటిని దాటిపోవడానికి నీ అనుమతి తీసుకోదల్చుకోలేదు. వెంటనే దారి తప్పుకొని పక్కకు తొలుగు, లేదా దారుణమైన ఫలితాన్ననుభవిస్తావు. నరకలోకపు ప్రాణీ! స్వర్గలోకపు దేవదూతలతో వైరం పనికిరాదు. పో! తప్పుకో!"

ఆ మాటలకు ఆగ్రహించిన ఆ గోబ్లిన్ (Goblin) సమాధానమిచ్చాడు.

"ఓ తమరా! స్వర్గరాజ్యపు ద్రోహులైన దేవదూతలు కదా! దేవలోకంలో శాంతిని భంగపరచి, విశ్వాసానికి తూట్లు పొడిచి దేవకుమారులలో మూడోవంతు మందిని తమవేపు తిప్పుకుని, దేవాధిదేవునిపై తిరుగుబాటు చేసింది తమరేకదా! ఆ విజేత ఆగ్రహానికి గురై స్వర్గం నుంచి బహిష్కరింపబడి ఈ నరకకూపంలో అనంతకాలం వరకు నానాయాతనలు పడేలా శిక్షింపబడింది! ఇంకేం సాధిద్దామని మళ్లా బయటకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నావు! మళ్లీ ఆ దేవదేవునికి ఆగ్రహం తెప్పించే ఏ కుట్ర మొదలెట్టావు? పో! పోయి నీకిచ్చిన శిక్షననుభవించు! ఓ కుహనా కాందిశీకుడా! ఈ మృత్యుబాణంతో నీ విప్పారిన రెక్కల్ని శక్తివిహీనం చేసి క్షణంలో నిన్ను మట్టికరిపించగలను. నా ఈ బాణంతో నీ వంటిని విషపూరితం చేసి అంతులేని బాధల్తో నిన్ను అణగదొక్కగలను! పో!" అంటూ ఆ భయంకర రాకాసి తన శరీరాన్ని పదిరెట్లు మహోగ్రంగా, భయంకరంగా పెంచుతూ ఛీత్కరించసాగాడు.

ద్వారాలకు లోపలివేపు సాతాన్ అవమానంతో ఉగ్రుడై తోకచుక్కలా మండిపడ సాగినాడు. అప్పుడతడెలా ఉన్నాడంటే ఉత్తర నక్షత్రరాశి అయిన ఒఫియుకస్ (Ophiucus)ను ఆక్రమించి, ఆర్కిటిక్ ఆకాశమండలాన విషవాయువుల్ని వెదజల్లుతూ చీడపీడల్నీ, యుద్ధాల్ని సమీప ప్రాంత ప్రజలపై విరజిమ్ముతున్న దీర్ఘ ధూమకేతువులా అగుపడ్డాడు. ఆ భయంకర యోధులిద్దరూ కాలమేఘాల్లా, ఒకరిపై ఒకరు తిరస్కార దృక్కుల్ని నిలుపుతూ ఒక్కదెబ్బతో శత్రువు నేలకూలేలా శిరస్సులపై గురి నిలిపి, కాస్పియన్ సముద్రంపై ప్రళయభీకరంగా గర్జిస్తున్న పర్జన్యాల్లా ఆకాశమార్గాన ఒకరినొకరు ఢీకొనడానికి సిద్ధమై నరకలోకాన్ని మరింత చీకటి చేస్తూ ముందుకు దూసుకు రాబోతున్నపుడు ఆ సర్పరూపపు మాంత్రికురాలు, నరకద్వారపు బీగాల రక్షకురాలు, వాళ్లను ఆగమని పెద్దపెట్టున కేకపెడ్తూ ఇద్దరి మధ్యకు చేరుకున్నది.

"ఓ తండ్రీ! నీ కుమారుడిపైనే చేయినెత్తుతున్నావా? ఓ కుమారుడా! నీ తండ్రిపైనే ఆ మృత్యుబాణాన్ని వదలదల్చుకున్నావా? ఏమిటీ విపరీతం! ఎందుకీ అనాలోచిత సమర సన్నాహం! అయినా ఎవరికోసమీ యుద్ధం? అక్కడ స్వర్గంలో హాయిగా నవ్వుతూ కూర్చున్న విజేత తన ఆగ్రహాన్ని చట్టంగా న్యాయంగా భావించి తండ్రీకొడుకుల మధ్య తగాదా పెట్టి ఇద్దర్నీ నాశనం చేసే ఎత్తుగడలో మీరిద్దరూ చిక్కుకున్నారే! ఇకచాలు ఆపండి!"

ఆమె మాటలకు ఆశ్చర్యపోయిన సాతాన్ అడిగాడు– "నీ అరుపులు, మాటలు నాకు అమితాశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. నన్ను తండ్రిగా, ఈ అసహ్యమైన ఆకారాన్ని నా కుమారుడిగా పేర్కొంటూ నీవు నాకు తెలీని రహస్యాన్ని చెబుతున్నావు. వికృతాకారులైన నిన్నూ, ఆతడినీ నేనెప్పుడూ చూడనైనాలేదే!"

నరకలోక కాపలాదారిణి ఇలా అన్నది– "నన్ను నీవు మర్చిపోయావు. ఆ రోజుల్లో నా రూపమిలా ఉండేది కాదు కదా! గుర్తు తెచ్చుకో! స్వర్గంలో నీవు కొందరు దేవదూతలతో కలిసి స్వర్గాధిపతిపై కుట్ర పన్నుతున్నప్పుడు అకస్మాత్తుగా నీకు భరించలేని శిరోవేదన కలిగి కళ్లు మసకబారి, వళ్లు తిరుగుతున్నపుడు, కటిక చీకటిలో కూడ నీ శిరస్సు నుండి వెలువడిన అగ్నిజ్వాలల్లో ఎడమపక్క నుంచి అందంగా, మనోహరంగా, నీలాగే ప్రకాశిస్తున్న వదనంతో ఓ దేవత, నీ శిరస్సు నుంచే బయల్పడిన ఆ అందాల రాశి, ఆమెను చూసి అందరూ నిశ్చేష్టులై వెనుకంజవేసి నన్ను 'సిన్' (Sin=పాపం) అని పిలిచారు. ఉత్పాతాలే నా చిహ్నాలుగా, మిమ్మల్నందరినీ, ముఖ్యంగా నిన్ను ఆకర్షించి నీలో, నీతో కలిసిపోగా నా గర్భాన పెరిగినవాడీ వికృత రూపుడు.

ఇంతలో పేట్రేగిన యుద్ధంలో మన శత్రువు సంపూర్ణ విజయాన్ని కైవసం చేసుకుని మనల్ని ఈ నరకకూపంలోకి నెట్టివేస్తూ నరకలోకపు ద్వారాలను తెరిచే తాళపుచెవిని నా చేతిలో ఉంచి, ఎట్టిపరిస్థితుల్లోనూ నరకద్వారం తెరవవద్దని ఆజ్ఞాపించి ఆ విజేత నన్నిక్కడ ఒంటరిగా కాపలాకు నియమించాడు.

పశ్చాత్తాపంతో కుములుతూ ఒంటరిగా ఇక్కడ ఉన్న నాకు గర్భంలో ఉన్న నీ శిశువు నన్ను నానాయాతనలు పెడ్తూ, నా పేవుల్ని పెకలించివేస్తూ, నన్ను కురూపిని జేస్తూ, నా నుంచి బయటపడ్డాడు. మరుక్షణం నుంచి తన బాణాన్ని నాపై గురిపెట్టి నామీద కోరికతో నా వెంటబడ్డాడు. నేను పారిపోతుంటే అడ్డుపడగా నేను ఆతడిని 'మృత్యువు' (Death)గా సంబోధిస్తూ తప్పించుకోబోయాను. ఆతడి పదఘట్టనలకు నరకలోకమే వణికిపోగా నేనాతనికి దొరికినప్పుడు నన్ను తన తల్లినైనా తలవకుండా బలవంతంగా అనుభవించి ఈ నరకలోకపు జాగిలాలకు, క్షణం ఆపు అదుపులేకుండా మొరిగే ఈ సెర్‌బెరియన్ (Cerberean) శునకాలకు జన్మనిచ్చేలా చేసాడు. అవి లోపల్నుంచి బయటకు, బయట నుంచి లోపలికి తిరుగుతూ నా గర్భాశయంలోకి చేరి నా పేగుల్ని కొరుక్కుతింటూ, అస్తమానం అరుస్తూ నన్ను నరకయాతన పెడుతూ ఉంటే విశ్రాంతి, ఆటవిడుపు లేక నేను పూర్తిగా నిర్వీర్యమైపోయాను.

నా కళ్లముందు, నాకెదురుగా ఉండే నా పుత్రుడూవాడే! శత్రువూ వాడే!ఆతడే మృత్యువు. నన్నెప్పుడో ఆతడు కబళించివేస్తాడు. కాని అతడికి తెలుసు అతని అంతం నాతో ముడిపెట్టబడి ఉందని. అతనికి నేను మింగుడుపడని ముద్దగా, శాపంగా పరిణమిస్తాను. అదే విధి నిర్ణయం కావాలి. తండ్రీ! నిన్ను హెచ్చరిస్తున్నాను. నీవు ఈతడి బాణానికి అందకుండా చూసుకో! లేకుంటే ఆ విజేత తప్ప ఇంకెవ్వరూ దాని బారి నుంచి తప్పించుకోలేరు"

ఆమె ముగించేసరికి 'సాతాన్'కు అర్థమయ్యింది. ఇదంతా తన ఘనకార్యమేనని. కొంచెం మెత్తబడి ఆమెతో అన్నాడు.

"ప్రియపుత్రికా! నీవంటున్నావు నేనే నీ భర్తనని, ఆతడు మన సంతానమని. స్వర్గంలో మన ఆనందానికి ఫలితం దురదృష్టవశాత్తూ ఈనాడు ఇలా పరిణమించిందనీ. ఇది మనం ఊహించని ఉపద్రవం. అనుకోని ఆపద. నేను ఇక్కడకు శత్రువుగా రాలేదు. ఈ ఘోర నరకం నుంచి మీ ఇద్దరినీ, ఇంకా అసంఖ్యాక దేవదూతల్నీ స్వర్గచ్యుతులైన మనందరం కోల్పోయిన గౌరవాన్ని, చేజారిన స్వర్గాన్ని తిరిగి పొందేందుకు నేను చేస్తున్న ప్రయత్నం ఇది. నా ఈ ఒంటరి పోరాటం, ఒంటరి ప్రయాణం ఏనాడో చెప్పబడిన కొత్తలోకం గురించి, కొత్త జాతి గురించి అన్వేషణకు మాత్రమే! స్వర్గాధిపతి మనం విడిచిపెట్టిన స్థానాన్ని ఈ కొత్తజాతితో నింపదలుచుకున్నాడా! ఆ లోకమేమిటి? ఎక్కడ ఉన్నది! ఆ కొత్త జాతి తీరుతెన్ను లేమిటి? శక్తిసామర్థ్యాలేపాటివి! అవి తెలుసుకుని మరుక్షణమే నేను వెనక్కి మరలి వస్తాను. ఆనక మీ ఇద్దరూ హాయిగా సంతృప్తిగా తిరుగాడగలిగే చోటుకు, సుగంధమై, సుప్రీతిని కలిగించే వాయువులు వీచే చోటుకు, మీరు కోరుకున్న అనంతమైన ఆహారం లభించే ప్రదేశానికి మిమ్మల్ని తీసుకువెళ్తాను"

తన వాగ్దానాలకు ఇద్దరూ సంతోషపడడాన్ని గమనించిన సాతాను మాట్లాడడం ఆపగానే మృత్యువు వదనాన భీకరమైన చిరునవ్వు విరిసింది. తన ఆకలి కరువు తీరే సమయం వస్తున్నందుకు ఆతడు సంబరపడ్డాడు. ఆతని తల్లికూడ అంతే ఉత్సాహంతో అన్నది–

"ఈ నరకలోకపు తాళంచెవి స్వర్గాధిపతి ఆజ్ఞతో నాకివ్వబడింది. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఈ ఎడమాంటైన్ శిలాద్వారాల్ని తెరవరాదని శాసనం చేయబడింది. నన్ను ద్వేషించి, నాపై ఆగ్రహంతో నన్ను స్వర్గాన్నుంచి విసిరేసి, ఈ టార్టారస్ (Tartarus) నరకకూపానికి కావలిగా ఉంచి, నాకిష్టంలేని పనికి నియోగించి, నిరంతరం బాధలు, దుఃఖాలు, భయాలు, భీకరధ్వనుల మధ్య, నా సంతానమే నా పేవులను కొరుకుతూ చేసే భయంకర అరుపులు, బాధల మధ్య చస్తూ బతుకుతూ ఉండే జీవనాన్ని శిక్షగా విధించిన – దేవదేవుడే కావచ్చును – కాని ఆతని మాటనెందుకు నేను పాటించాలి. ఓ తండ్రీ! నీవు నాకు జన్మనిచ్చావు. నీవే నా జీవన గ్రంధరచయితవు. నాకు రూపాన్నిచ్చావు. నేనెవరి మాట వింటాను నీ అభిమతాన్ని కాదని. వెళ్లు! వెళ్లి ఆ సుందరమూ సౌఖ్యమూ, సౌభాగ్యవంతమైన ఆ కొత్తలోకాన్ని అన్వేషించి, నీ వశం చేసుకో! ఆ లోకానికి అధిదేవతగా నీవుండగా మన దేవతల మధ్య నేను భోగలాలసమైన నీ కుడిహస్తమై నీ కుమార్తెగా, నీ ప్రియురాలిగా అనంతంగా సుఖిస్తాను"

అలా చెబుతూ ఆమె తన దగ్గర ఉన్న ఆ తాళపుచెవిని మన దుఃఖాలకు మూలమైన ఆ పనిముట్టును తీసుకుని తనవెంట నరకలోకపు జాగిలాలు పరుగు లిడ్తుండగా తాళపు రంధ్రాన్ని కప్పి ఉన్న మందపాటి రేకును, తాను తప్ప నరకలోకంలోని ఏ శక్తీ కదిలించలేనంత బరువైన దాన్ని పైకి లేపి, తాళపుచెవిని రంధ్రంలోకి జొనిపి తిప్పగానే ఆ బ్రహ్మాండమైన శిలాద్వారాలు, లోహద్వారాల్లోని ప్రతి చీల, గడియ కదిలి ద్వారాలు, తలుపులు తెరచుకున్నాయి. ఆ ద్వారాలు తెరుచుకున్నప్పటి కీచుమన్న శబ్దాలు భయంకరమైన ఉరుములు, పిడుగుపాట్లలా ఉండి, భూమి నరకలోకాల మధ్య ఉండే 'ఎరెబస్' (Erebus) ప్రాంతమంతా కంపించింది.

ఆ ద్వారాల తలుపుల్ని తెరవడం కన్నా మూయడంలో ఆమె ఎంత శక్తివంతురాలో మనకర్థమవుతుంది. ఆ ద్వారాలు ఎంత వెడల్పుగా ఉన్నాయంటే ఓ మహాధినేత సమస్త రాజలాంఛనాలతో, పతాకలతో, రథాలతో, అశ్వాలతో ఊరేగింపుగా వెళ్తున్నప్పుడు కూడ ఆ ప్రదేశం ఇంకా విశాలంగానే కన్పడుతుందన్నమాట. అంతేకాక అది చూపరులకు నిప్పులు కక్కుతున్న పొగలతో, అగ్ని కీలలతో తెరచుకున్న మహోలోహపు కొలిమి నోరులా అగుపడ్తుంది. అక్కడ్నుంచి చూసేవాళ్లకు అగాధంలోని రహస్యాలు, అంతులేని సముద్రం కొలతలకందనిది– పొడవు, వెడల్పు, ఎత్తూ, కాలం, స్థలం ఇవన్నీ ఎక్కడ అదృశ్యమవుతాయో – ఎక్కడైతే చీకటి (Night), కేయాస్ (Chaos= అవ్యక్తస్థితి) – ఈ చరాచర ప్రకృతికి మూలపురుషులు – అనంతంగా అరాచకంగా వ్యవహరిస్తాయో, ఎక్కడ అంతంలేని యుద్ధనాదాలు, ప్రచండ శబ్దాల మధ్య గందరగోళపు స్థితి నిలిచి ఉన్నదో, ఎక్కడ శీతల, ఉష్ణ, తేమ, పొడి అనబడే పోటీదార్ల మధ్య రసవత్తరమైన పోటీ జరిగి అణుగర్భాలు విచ్ఛేదింపబడ్తాయో, వాటివాటి పతాకచ్ఛాయల క్రింద ప్రతి గుంపూ, ప్రతి తెగా, నానారకాల ఆయుధపాణులై అసంఖ్యాకంగా, బార్కా (Barca) సిరెనె (Cyrene) మండే ఎడారుల్లోని ఇసుకరేణువులు వడిగా వీస్తున్న వేడిగాలుల్తో తలపడ్తున్నట్లుగా, వాటి మధ్య న్యాయనిర్ణేతగా కేయాస్ (అవ్యక్తస్థితి) తన సామ్రాజ్యాన్ని ఏలుతుండగా, ఛాన్స్ (Chance) – యదృచ్ఛ లేదా అవకాశం రెండోస్థానంలో తనవంతు నిర్ణయం చేస్తూన్న ఆ గజిబిజి గందరగోళ ప్రదేశమైన ఆ అగాధం – ప్రకృతి జన్మస్థానమో లేక స్మశానస్థలమో, నీరు, నేల, గాలి, అగ్ని ఇంకా తయారుకాని ఆదిమరస రూపంలో, అణువులు కలుస్తూ విడిపోతూ కొత్తకొత్త రూపాలను పొందుతూ క్షణక్షణం మారుతున్న ఆ స్థితినుంచి, ఆ దేవదేవుడు తన సంకల్పంచే కొత్తలోకాలను సృజించకపోతే ఈ అయోమయస్థితి అనంతంగా అలా కొనసాగుతూనే ఉంటుంది.

అటువంటి అగోచర, అయోమయ, అగాధాన్ని సాతాన్ నరకలోకపు అంచు నుంచి అవలోకించి, చెవులు చిల్లులు పడ్తున్నట్లున్న ఆ అగాధపు ధ్వనులు బెల్లోనా (Bellona) పెనుతుఫానులు నగరాలపై విరుచుకుపడి విధ్వంసం కావిస్తున్నప్పుడు వెలువడే శబ్దాల్లా), భూలోకపు ఇరుసును తొలగదోసేంత భీకరంగా ప్రతిధ్వనిస్తుండగా, ఆతడు తన విశాలమైన రెక్కల్ని విప్పార్చి నేలనదిమిపెట్టి తనచుట్టూ కమ్ముకున్న ధూళి మబ్బులను చీల్చుకుంటూ ప్రచండ శబ్దాలతో పైకి దూసుకుపోబోయాడు. ఆ ఎగరడంలో ఆతడు ఓ విశాల శూన్యంలోకి చొచ్చుకుపోవడంతో వేగం తగ్గి, రెక్కల రెపరెపలు శక్తివిహీనం కాగా పదివేల ఫాతమ్ (Fathom= ఆరు అడుగులు= 6 Feet) ల లోతుకు పడిపోతూ, పోతూండగా అనుకోని అవకాశం సంక్షోభిత మేఘరూపంలో అడ్డుపడి అగ్నిమెరుపు శక్తులతో ఆతనిని మరల అనేక మైళ్ల ఎత్తుకు విసిరేసింది.

ఆతడు పడ్డ ప్రదేశం సైర్టిస్ (Syrtis) చిత్తడినేలలా అటు సముద్రమూ, ఇటు నేల కాకుండా అస్తవ్యస్తంగా ఉన్నది. సాతాన్ కాసేపు నడుస్తూ, కాసేపు ఎగుర్తూ, తన రక్షణలో ఉన్న బంగారాన్ని కాజేసి పారిపోతున్న అరిమాస్పియాన్ (Arimaspian) ను వెంబడిస్తున్న గ్రిఫాన్ (Gryfon)లా వడివడిగా అంగలేస్తూ కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటుతూ, తల, చేతులూ, కాళ్లు రెక్కలు ఆసరాగా, ఈదుతూ, మునుగుతూ, తేల్తూ, పాకుతూ, దూకుతూ, ఎగుర్తూ, తనచుట్టూరా అనేక రకాల వికృత ధ్వనులు, విపరీత శబ్దాలు అరుపులు కర్ణభేరీలను బద్దలు గొడుతున్నా ఏమాత్రం చలించకుండా, చెక్కుచెదరకుండా సాతాన్ ఆ వింత ప్రదేశానికి అధినేత ఎవ్వరో తెలుసుకోగోరి అతగాడు కనిపిస్తే కొత్తలోకానికి దారి కనుక్కోవచ్చునన్న తలంపుతో, ముందుకు సాగినాడు. అతడికి వెలుగు చీకటిలోకాల మధ్య అగాధంలో ఉన్న అవ్యక్త స్థితి – కేయాస్ (Chaos), కేయాస్‌తో కలిసి ఆ సింహాసనాన్ని అధిష్ఠించే నల్లని చీకటి రాత్రి (Night) ఆ ఆదిదంపతులు, వారి దగ్గర ఉండే ఒర్కస్ (Orcus), ఏడ్స్ (Ades), అతిభయంకరమైన రాక్షస గార్గాన్ (Demogorgon) రూమర్–పుకారు (Rumor), ఛాన్స్ (Chance=అవకాశం), సంక్షోభం (Tumult), గజిబిజి (Confusion– గందరగోళం–రచ్చ) వీటన్నిటినీ మించి వంద నోళ్లుగల కలహం (Discord-అభిప్రాయభేదం) అల్లంతదూరంలో సాతాన్‌కు దర్శనమిచ్చారు. వారిని చూసి నిర్భయంగా సాతాన్ ఇలా అడిగాడు–

“ఈ అంతంలేని అగాధాన్ని పరిపాలించే మహాశక్తులైన కేయాస్ మరియు ఆదిరాత్రి దేవతలారా! నేనిక్కడకు విరోధం కోరి రాలేదు. వేగు గానూ రాలేదు. మీ సామ్రాజ్యపు రహస్యాలు తెలుసుకునే తలంపులూ నాలో లేవు. నేను వెళ్లాల్సిన లోకానికి దారిలో మీ సామ్రాజ్యం ఉండటం వల్ల దారితప్పిన బాటసారిగా నేను ఇటు వచ్చాను.

నేను చేరుకోవాలనుకుంటున్న ఆ కొత్త లోకానికి దగ్గరదారి ఏమిటి? ఆ లోకాన్ని స్వర్గాధిపతి మీ సామ్రాజ్యం నుంచే గెలుచుకున్నాడా! నేను ఆ కొత్తలోకాన్ని చీకటిమయం చేసి, ఆ విజేత చేత అగాధంలోకి నెట్టివేయించి దానిపై మరల ఆదిరాత్రి (Night) పతాకను ఎగరవేస్తాను. నేను విజయుణ్ణైతే లాభం మీకు, ప్రతీకార గర్వం నాకు"

సాతాన్ మాటలు విన్న ఆ ఆదిదేవతలు తడబడుతున్న మాటలతో, దృష్టి మందగించిన చూపులతో సమాధానమిచ్చారు.

"ఓ పరదేశీ! నీవెవరో నాకు తెలుసు. ఆ స్వర్గాధిపతిపై తిరుగుబాటు చేసిన ప్రముఖ దేవదూతవు నీవు. పరాజయం ముంచుకురాగా ఈ అగాధాన్ని చీల్చుకుంటూ మహోత్పాతంలా, శిధిలాలపై శిధిలాల్లా, చెల్లాచెదురుగా, రచ్చరచ్చగా, తిరగబడ్డ దేవతలందరూ స్వర్గ ద్వారాల్నుండీ నరక కూపంలోకి విసిరేయబడ్డం నేను చూసాను, ఆ కథనం విన్నాను. మిమ్మల్ని వెంటాడి వేటాడుతున్న మిలియన్లకొద్దీ దైవసైన్యాన్ని చూసాను.

ఇక్కడ నాకు మిగిలిన ఈ అగాథాన్ని క్రమేపీ పలచబడుతున్న చీకటి సామ్రాజ్య పతాక ఛాయను సంరక్షించుకుంటూ మేమిక్కడ నివాసముంటున్నాము. మా క్రింద ఉన్నది మీరుంటున్న నరకకూపం. పైన భూలోకం (Earth), ఇంకా పైన స్వర్గం (Heaven) ఆ భూలోకం స్వర్గపు ద్వారాల వద్ద మిమ్మల్ని నెట్టివేసిన ప్రదేశం నుంచీ బంగారు గొలుసుల్తో స్వర్గానికి అనుసంధానం చేయబడి వున్నది. అటువేపే వెళ్లడం నీ ఉద్దేశమయితే ఇదే దారి. వేగంగా వెళ్లు. విధ్వంసం, దోపిడీ, శిధిలాలు నా సొత్తగు గాక"

ఆతడు ముగించగానే సమాధానమిచ్చేందుకు ఆగకుండానే సాతాన్ తన అంతుదొరకని సముద్ర ప్రయాణంలో తీరం కన్పిస్తున్నందుకు సంతోషపడి ఇనుమడించిన శక్తితో, జవసత్త్వాలతో మండుతున్న జ్వాలాగ్ని శిఖరంలా, అంతరిక్షంలోకి ఎగిసి, సంఘర్షిస్తున్న మూలకాల గుండా దూసుకుపోసాగినాడు. బోస్పోరస్‌లోని (Bosporus)లోని కదిలే పర్వతాల మధ్య దూసుకుపోయిన 'ఆర్గాస్' (Argos) నౌకలా, కారిబ్డిస్ (Charybdis) సుడిగుండాన్ని తప్పించుకుని వేగంగా సాగిన యులిసిస్ (Ulysses)లా, కష్టాల నధిగమిస్తూ లక్ష్యానికి చేరుకున్నాడు.

ఆతడు మానవలోకానికి చేరుకోవడం, వెనువెంటనే తొలి మానవుని పతనం. పాపదేవత, మృత్యువు సాతాన్ వచ్చిన బాట వెంబడే కొత్తలోకంలోకి ప్రవేశించడం. అదే దైవ నిర్ణయం కావడం గమనార్హం. నరకలోకం నుండి భూలోకానికి విశాలమైన నలుగురూ నడిచే దారి, ప్రజ్వలిస్తున్న అగాధంపై ఎంతో పొడవున్న వంతెన నిర్మాణం కాగా, నరకలోకం నుంచి దుష్టఆత్మలు అటుయిటూ ప్రయాణించి మానవుల్ని

మాయచేసి, క్షోభపెట్టి తమ బానిసలుగా చేసుకోవడం; దైవభక్తులు, భగవానుని కరుణవల్ల దేవదూతల రక్షణలో శాంతినొందడం నిత్యకార్యాలైనాయి.

స్వర్గలోకపు కాంతులు వ్యాపించగా ప్రకృతి పరిధవిల్లి, కేయాస్–అవ్యక్తస్థితి వెనక్కుతగ్గగా అగాధంలో కొంత ప్రశాంతత ఏర్పడి తక్కువ శ్రమతో (తుఫాను గాడ్పుల్ని తప్పించుకుని నౌక చేరుకున్న రేవులా) సుదూరాన ఉన్న స్వర్గాన్ని అందుకునే ప్రయాణంలో రెక్కలకు విశ్రాంతి కోసం ఆగిన మజిలీలా, ఉన్న కొత్తలోకానికి సాతాన్, వేగంగా చేరుకున్నాడు.

నీలిరంగు ఓపల్ (Opal) బురుజులతో, కోటలతో సజీవ నీలమణిలా మెరుస్తున్న తన ఒకప్పటి నివాస స్థలం, దానికి బంగారు గొలుసుతో పతకంలా (Pendant) వేలాడుతూ చిన్నపాటి నక్షత్రమంత పరిమాణంలో, చంద్రునికి దగ్గరగా వెలుగుతున్న కొత్తలోకంలో నిలబడి స్వర్గాధిపతిపై ప్రతీకారం తీసుకునే మార్గాలను ఆలోచిస్తూ ఆ మహానేత, కుయుక్తులలో తనకు తానే సాటి, సాతాన్, ఆ దుష్ట ఘడియలలో తన దృష్టిని స్వర్గంవేపు సారిస్తున్నాడు.

3. సాతాను ప్రయాణాన్ని పసిగట్టిన దేవాధిదేవుడు

స్వర్గ సింహాసనంపై ఆసీనుడైన సర్వజ్ఞుడు, మహా శక్తివంతుడు ఆ దేవాధిదేవుడు, సాతాను కొత్తలోకం దిశగా దూసుకురావడాన్ని గమనించాడు. తన కుడిపక్క కూర్చుని ఉన్న కుమారుడికి సాతానును చూపిస్తూ, భవిష్యత్తులో మానవజాతిని దారిమళ్లించే ప్రయత్నం విజయవంతమవుతుందని జోస్యం చెబుతాడు. మానవుడు స్వేచ్ఛాజీవిగా సృష్టించబడ్డాడు కనుక ప్రలోభపెట్టే సాతాను బోధలకు లొంగకుండా ఉండాల్సిన బాధ్యత ఆతనికే ఉన్నదిగా తెలిపి దైవ న్యాయాన్ని, జ్ఞానాన్ని విశదీకరిస్తాడు. అయినా మానవుల మీద కరుణ ఎందుకంటే వాళ్లు సాతాను లాగా కుట్ర పన్నకుండా సాతాను మాయలకు లొంగి వక్రమార్గాన్ని పడ్తారు కనుక. దైవకుమారుడు తండ్రి మానవులపై చూపిన కరుణకు ఆనందపరవశుడై ఆతనిని స్తుతిస్తాడు. దేవాధిదేవుడు మరల హెచ్చరికగా చెబుతాడు– మానవునిపై చూపే కరుణ, దైవన్యాయం చట్టం పరిధుల్లో ఉంటుంది. మానవుడేనాడైతే తనను తానే దేవుడిగా ప్రకటించుకుంటాడో ఆనాడే అతని సంతానం మృత్యువుకు ఎర కావించబడ్తుంది. దైవద్రోహం తీవ్రమైన నేరం కనుక అది క్షమించబడాలంటే ఎవరో ఒకరు ఆ నేరాన్ని తనపై వేసుకుని శిక్ష అనుభవించాలి.

దైవకుమారుడు మానవునికి మారుగా ఆ శిక్షననుభవించడానికి తాను సిద్ధమని ప్రకటిస్తాడు. దేవాధిదేవుడు దానికి అంగీకరించి, ఆతడిని భూలోకాన జన్మించ వలసిందిగా అనతిచ్చి, స్వర్గ మర్త్యలోకాల్లో అందరి పేర్లకన్నా ఆతని నామం ముందుండేటట్లు, దేవదూతలందరూ ఆతనిని శ్లాఘించేట్లు శాసిస్తాడు. దేవదూతలు ఆ ఆజ్ఞను శిరసావహించి తండ్రి, కుమారులను పొగుడుతూ కీర్తనలను గానం చేస్తారు.

ఈలోగా సాతాను స్వర్గలోకపు చివరి కక్ష్య అయిన అహంభావ కారాగార **(Limbo of Vanity)** ప్రదేశం, అక్కడనుంచి స్వర్గలోకపు ద్వారాల దగ్గర, గగన మండలంపైన ప్రవహించే జలాల్ని **(Water above the firmament)** దాటి సూర్యుని కక్ష్య **(Orb of the Sun)**– వలయంలో దాని అధికారి **(Regent)** యురియెల్ **(Uriel)**తో తనను సాధారణ దేవదూతగా పరిచయం చేసుకుని – దేవాధిదేవుడు ఇటీవలే సృష్టించిన కొత్తలోకాన్ని, మానవుణ్ణి చూడాలన్న తన కోరికను వెలిబుచ్చి, దారి తెలుసుకుని వడివడిగా ఎగుర్తూ, నిఫేటస్ **(Niphates)** పర్వతంపై దిగుతాడు.

"స్వర్గలోకపు ప్రథమ పుత్రుని సంతానమా! దివ్యకాంతి ప్రకాశమా! నీకు జయం
ఓ శాశ్వత సహకాంతిపుంజమా! నిన్ను నిందించకనే నేను వివరిస్తాను ఈ నిజాన్ని
భగవానుడే కాంతి! ఆతడే స్వయం ప్రకాశకుడు!
అనంతంలోని అగోచరమైన కాంతిలో, ఇప్పుడు నాలో,
కాంతిసారమైన కాసారంగా అత్యంత ప్రకాశవంతంగా,
స్వచ్ఛమైన లలితకాంతి ప్రవాహంగా నీవు
వెలువడింది ఏ బుగ్గ (Fountain) నుంచో ఎవరు చెప్పగలరు?
దైవాజ్ఞచే, సూర్యుని కన్నా, స్వర్గం కన్నా ముందు జనించి
శూన్యం నుంచి, రూపరహిత స్థితి నుంచి
పైకుబుకుతున్న జలప్రపంచానికీ కప్పిన కాంతివస్త్రం నీవు!
స్టిజియన్ ప్రవాహం (Stygian Pool)లో చిరకాలం బంధించబడి
ఆనక తప్పించుకుని చేస్తున్న నా ఈ ప్రయాణంలో
చీకటి రాత్రుల్లో వినవచ్చే ఆర్ఫియన్ వీణావాద్యపు (Orphean Lyre)
సంగీత ధ్వనుల్లో నేను
అవ్యక్తస్థితి, శాశ్వతరాత్రి (Chaos & Eternal Night)
గురించి గానం చేస్తున్నాను.
దైవలోకపు సకలకళాధిదేవత మ్యూజ్ (Muse) నాకిచ్చిన
ప్రేరణతో కటిక చీకటి లోకాల్లోకి దిగుతూ, ఊర్ధ్వ
లోకాలకు ఎగబాకుతూ ప్రశస్తమైన జీవదీపాన్ని తాకుతున్నాను.

వృధాగా అటూయిటూ చలించే ఈ నయనాలకు
ఏ సంధ్యాకాంతులూ, తీక్షణ కిరణాలు కనిపించవు!
ప్రశాంతత నిండిన కళ్లల్లో రంగులు మసకబారినా
నేను కళాధిదేవతలు విహరించే స్వచ్ఛమైన సెలయేళ్లనూ
ఫలపుష్పవనాలనూ, నీరెండలో వెలిగే కొండగుట్టలనూ
అంతర్నయనాలతో వీక్షిస్తూ, పవిత్ర గీతాలపై ప్రేమకు లోబడి
స్వర్గలోకపు (Sion) పూల సెలయేళ్లు నీ పాదాలను అభిషేకిస్తుండగా
ప్రతిరాత్రి నేను ఆ ప్రవాహాల్ని గమనిస్తుంటాను.
ఒక్కోసారి నా స్థితిలోనే ఉన్న ఆ ఇద్దరినీ మరిచి
థమ్రిస్ (Thamyris), మీయొనైడెస్ (Maeonides) అంధగాయకుల్లా
వృద్ధ ప్రవక్తలు టిరెసియాస్ (Tiresias), ఫినెయస్ (Phineus)లా
కనీసం కవనంలోనైనా వారంత ప్రసిద్ధికావాలని ఆశపడ్తున్నాను.

ఆలోచనలే ఆహారంకాగా, సంఖ్యలే సంగీతమై జాలువారగా
చీకటివనాల్లో రెమ్మల చాటున దాక్కున్న పక్షికోయిల రాత్రిపాటలు పాడుతున్నట్లు
కాలగమనాన ఋతువులు మారి, ఋతువులు వస్తున్నా
పగలూ, రాత్రీ, సాయంవేళా, ఉదయం ఏవీ నాకు కనిపించక
వసంత పుష్పాలు, వేసవి గులాబీలూ,
పక్షుల గుంపులూ, పశువుల మందలూ, మనుషుల ముఖాలూ
ఏవీ కానరాక, అంతా మబ్బుమబ్బుగా,
కటిక చీకటి నన్ను చుట్టుముట్టి
నిత్యజీవన సంతోషాలు నీడలై దూరంకాగా
జ్ఞాన పుస్తకంలోని పేజీలు ఖాళీ కాగితాలుగా మారి
ప్రకృతి శోభలన్నీ చూడలేనివిగా ప్రకటించబడి
జ్ఞానము బయటి ద్వారం వద్దనే నిలువరింపబడగా
ఓ దివ్యకాంతిపుంజమా! నీవు నా అంతర్నయనాల నుంచి
మనసులోకి జొరబడి, అక్కడే ప్రకాశిస్తున్న కనుల కవలవై
చీకటి తెరలను తొలగించి, ఆవలకు నెట్టి
నాకు దివ్యదృష్టి నొసంగి, సాధారణ దృష్టికి కానరాని
అద్భుత విషయాలను నాకు చెబుతున్నావు, చూపిస్తున్నావు.
ఓ దివ్యకాంతి ప్రవాహమా! నీకు జయమగుగాక!"

అక్కడ ఆ మహాశక్తివంతుడు, అందరికీ తండ్రి
తన స్వర్గ సింహాసనంపై కూర్చుని తన సృష్టి పరంపరను
వీక్షించేందుకు అన్ని లోకాలపై దృష్టి సారించాడు.
ఆతని చుట్టుపక్కల స్వర్గలోకపు పవిత్ర ప్రదేశాలు
సుందర నక్షత్రాలై మెరుస్తుండగా వాటికి దివ్య ఆశీస్సులనిచ్చి
కుడివేపు తన ఏకైక కుమారుడు స్వచ్ఛమైన కాంతితో ప్రకాశిస్తుండగా
ఆతని చూపులు భూలోకంలోని మానవ ఆది దంపతులపై నిలిచిపోయాయి.
వాళ్లు ఆ ఆనందకరమైన ఫలపుష్పవనంలో
అమర ఫలాలైన సంతోషము, ప్రేమలను పండిస్తూ
అనంతమైన ఆనందంలో, పోటీలేని ప్రేమలో
పరమానందకరమైన ఏకాంతంలో ఉండగా వారిని గమనించాడు.
ఆ తరువాత ఆతని దృష్టి నరకలోకంపైకి మళ్లగా, ఆతని చూపులు
స్వర్గనరకాల మధ్య ఉన్న అగాధం వేపు

రాత్రి కీవలవైపువున్న స్వర్గలోకపు గోడలపై ఎగబాకుతున్న
సాతానుపై నిలిచి నిశ్చలమై పోయాయి.
ఆ సాతాను స్వర్గానికి ఆవలవేపు అతిదగ్గర్లో
సముద్రమూ, గాలీ ఇదమిత్థంగా తెలీని గగనమండలంపై (Firmament)
నిలబడి అలసిన రెక్కలు, ముందుకు దారితీస్తున్న కాళ్లతో
ఏ క్షణమైనా స్వర్గం వేపు దూకడానికి సిద్ధంగా ఉన్నపుడు
ఆ విషకీటకాన్ని తన కుమారుడికి చూపిస్తూ
సర్వోన్నతుడు, త్రికాలజ్ఞుడు అయిన దేవదేవుడు ఇలా అన్నాడు–

"ప్రియ కుమారా! అటుచూడు! మన విరోధిని
ఏ ఆగ్రహజ్వాల పురికొల్పిందో, ఏ ఆజ్ఞలూ, అడ్డంకులూ
లెక్కచేయకుండా, నరకయాతనలను శృంఖలాలను తెంచుకుని
మహా అగాధాన్ని నిర్భయంగా దాటి ప్రతీకారేచ్ఛతో
ఉవ్విళ్లూరుతూ వస్తున్నాడు. కాని ఆతని ప్రయత్నం
ఆతనికే తిప్పికొడ్తుందని గ్రహించని మొండివాడితడు.
ఇప్పుడు అన్ని నిర్భంధాలు వీడిపోగా విప్పారిన రెక్కల్తో
చీకటి గుయ్యారాల నుంచి బయటపడి వెలుగులోకం దగ్గర్లో
సృష్టించబడిన కొత్తలోకం వేపు దారితీస్తున్నాడు.
ఆ లోక నివాసి మానవుణ్ణి వీలైతే బలప్రయోగంతో
లేకుంటే కుయుక్తులు, కుట్రలతో వశం చేసుకోవాలని!
ఎందుకంటే మానవుడు మాయమాటలకు సులభంగా లొంగిపోతాడు.
తేలికగా సాతాను ఆధిపత్యాన్ని అంగీకరించి విధేయుడౌతాడు గనుక!
అలా మానవుడూ అతని వారసులూ అధఃపతనమౌతారు.
ఎవరి తప్పు అది? స్వయంకృతమే కదా!
ఇక్కడ అతనికి సర్వసౌభాగ్యాలనిచ్చినా కృతఘ్నుడై
నేనిచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని దురుపయోగం చేసుకుని
పతనమైతే దానికి ఎవరిది బాధ్యత?
నా సృష్టిలోని అన్ని ఆత్మలకూ, శక్తులకూ స్వేచ్ఛనిచ్చాను.
నిలబడేవాళ్ళు నిలబడతారు. పతనమయ్యేవాళ్లు పతనమౌతారు!
వాళ్ల నిజమైన విధేయతకు ప్రమాణం
అవిచ్ఛినమైన విశ్వాసం, ప్రేమే కదా!
దానికి వాళ్లు చేయవలసిందల్లా వాళ్లకు నిర్దేశించిన
బాధ్యతలే కాని, వారి ఇచ్ఛాపూర్తి ప్రవర్తన కాదు!

చెడు నడవడికవల్ల వాళ్లు పొందే ప్రశంసలు గాని
నేను పొందే సంతోషం కాని ఏమి ఉంటుంది?
ఇచ్ఛాశక్తి (Will), సతర్కం లేదా కారణం (Reason) ఉపయోగపడనప్పుడు
రెండింటి స్వేచ్ఛ దురుపయోగపరచినప్పుడు
వాళ్ల అవసరాలకు అనుగుణంగా వాటిని వ్యాఖ్యానిస్తున్నపుడు
నేను సహించేది లేదు.
వాళ్లు ఎందుకు ఎలా సృష్టింపబడ్డారో అలాగే నడుచుకోవాలి.
అంతేకాని వాళ్ల దుష్కృత్యాలకు సృష్టికర్తనో ప్రకృతినో,
విధినో నిందించి, ఇది ముందుగానే నిర్ణయించబడ్డది (Predestination)
నాదేం తప్పులేదు అని తప్పుకోజూడడాన్ని నేను అంగీకరించను.
వాళ్ల తిరుగుబాటును వాళ్లే నిర్ణయించుకున్నారు.
దాన్లో నా ప్రమేయమేమున్నది?
భవిష్యత్ జ్ఞానం (Fore knowledge) వాళ్ల తప్పులను ప్రభావితం
చేయదన్న సంగతి నాకు ముందే తెలిస్తే ఏం ఋజువయ్యేది?
వాళ్లు విధికి సంబంధంలేని, నేను దృష్టిపరచని మార్గాల్లో
హద్దులు మీరి, తమ జీవితగ్రంథాలకు తామే రచయితలై
నిర్ణయాలు వాళ్లే తీసుకుని వాటిపై న్యాయాన్నీ వాళ్లే చెబుతారు.
వాళ్లని నేను స్వేచ్ఛా జీవులుగా సృష్టించాను.
స్వేచ్ఛగానే వాళ్లు జీవించాలి వాళ్లకు వాళ్లే దాసోహం
అయ్యేంతవరకూ! కానప్పుడు నేను శాశ్వతమైన,
మార్పులు లేని ఉన్నతమైన దైవచట్టంతో
ఎలా స్వేచ్ఛను వాళ్లకు ప్రసాదించానో, అలాగే పతనాన్నీ
వాళ్లు కోరుకున్నదే ప్రయోగిస్తాను.

మొదటివాళ్లు ఆ తిరగబడ్డ దేవతలు స్వంత ప్రేరేపణలతో భ్రష్టులై పతనం చెందారు
మానవులు వీళ్ల మాయమాటలకు లోబడి పతనం కానున్నారు.
అందుకే మానవులు భగవంతుని నిర్వ్యాజ కృపను అందుకోవాలంటే
స్వర్గభూలోకాల్లో దేవుని దయ (Mercy), దైవన్యాయం (Justice)
అవసరం. ముఖ్యంగా నా దయ, సానుభూతి మాత్రమే
వీళ్లను రక్షిస్తుంది. స్వర్గలోకపు కీర్తికాంతుల్ని మరింత ప్రకాశింపజేస్తుంది"

ఆ విధంగా దేవదేవుడు తన వాక్కులను వినిపిస్తున్నపుడు
అమృత సుగంధపరిమళం దేవలోకం ఎల్లెడలా వ్యాపించసాగింది.

కొంగ్రొత్త సంతోషపు భావన పరివ్యాప్తం కాగా
దేవకుమారుని వదనం మరింత ప్రకాశవంతమై
దివ్యకారుణ్యం ప్రస్ఫుటించగా, ఎల్లలు లేని ప్రేమ,
కొలతలు వీలుకాని కరుణ, కిరణాల్లా విరియుచుండగా
అసమానుడై, మహిమాన్వితుడైన ఆతడు ఇలా పలికాడు–

"ఓ దయాళువైన తండ్రీ! మీరు తమ ఆజ్ఞలో మానవుడు భగవానుని దయకై తనంతట తాను ప్రయత్నించవలసి వస్తుందని, స్వర్గ భూలోకాలు గీతాలతో, ప్రార్థనలతో, పవిత్ర స్తోత్రాలతో దైవస్తుతి చేయడం ద్వారా స్వర్గ సింహాసనం వద్ద ఆ ప్రతిధ్వనులు వినబడగా వాళ్లు తమ దయకు ప్రాప్తులౌతారని వివరించినారు. కాని తమ కనిష్ఠ సంతానమైన మానవుడు తన స్వంత ఆలోచనల వల్లనో, ఎవరో మాయావుల దుర్బోధల వల్లనో దారితప్పి, తమనుంచి దూరంగా పోతున్నప్పుడు, ఓ మహాన్యాయనిర్ణేతా! మన విరోధి మిమ్మల్ని పరోక్షంగా చీకాకుపెట్టదలుచు కున్నప్పుడు, మానవుని తన కుయుక్తులతో, బలంతో వంచించి తన వశం చేసుకున్నపుడు, మీరు సృష్టించిన ఆ మానవజాతిని మీరే నశింపజేయబూనడం న్యాయమా! కారుణ్యమూర్తివి, సర్వ శక్తిమంతుడవైన మీ ప్రకాశవంతమైన ఘనతకది మచ్చకాదా! తండ్రీ!"

దేవకుమారుని ఆ ప్రశ్నకు సృష్టికర్త సమాధానమిచ్చినాడు.

"కుమారా! ఎవరిని చూసి నా హృదయం గర్వంతో ఉప్పొంగుతుందో, నా ఆత్మ దేదీప్యమానంగా ప్రకాశిస్తుందో, ఎవరైతే నా వాక్కు, జ్ఞానం, సామర్థ్యం, ఆలోచనలకు ప్రతిరూపమో, ఆ నీవు – నా ఆలోచనల్నే మాటలుగా వెలిబుచ్చినావు. మానవుడు ఆతని స్వయంశక్తి వలన కాదు, నా అనుగ్రహం వలన రక్షింపబడతాడు. నీ విజ్ఞప్తితో మరొక్కసారి నేను ఆతని నుండి తీసివేసిన శక్తుల్ని, పాపాల వల్ల, దుష్కార్యాలవల్ల నశించిన శక్తుల్ని తిరిగి ఇస్తాను. మరొక్కసారి వాళ్లు చదునైన నేలపై విరోధికెదురుగా నిలబడనీ! వాళ్లకర్థం కావాలి వారు ఎటువంటి దయనీయమైన స్థితిలో ఉన్నారో! నేనొక్కణ్ణే వాళ్లను గట్టెక్కించగలననీ వాళ్లకు స్పష్టంగా తెలియాలి.

వారిలో కొందరు నా అనుగ్రహంచేత మిగిలినవారికన్నా ఉన్నతంగా ఉంటారు. మిగతావాళ్లకు అప్పుడప్పుడూ నేను వాళ్లున్న పాపభూయిష్టమైన స్థితి గురించి హెచ్చరిస్తూ వాళ్ల మనసులనావరించిన అంధకారాన్ని తొలగిస్తూ, శిలా హృదయాలను కరిగించి ప్రార్థన, పశ్చాత్తాపం, విధేయతలతో మెలగవలసిందిగా ఆజ్ఞాపిస్తాను.

సద్భావనతో ప్రార్థన, పశ్చాత్తాపం, విధేయతలతో మెలిగే వారిని అందరినీ నేను నియమించిన అంతరాత్మ (Conscience) ప్రతిక్షణం జాగరూకతతో గమనిస్తూనే

ఉంటుంది. నా చెవి నెమ్మదించదు, నా కన్ను మూతపడదు. ఎవరైతే వీటిని వ్యతిరేకించడం, అశ్రద్ధ చేయడం చేస్తారో వారు అంతిమదినం నాడు నా దయాప్రాప్తులు కాలేరు. కఠిన హృదయులు మరింత కఠినులై, అంధులు మరింత అంధులై అట్టడుగుకు జారిపోతారు. మానవుని అవిధేయత, అవిశ్వాసం స్వామిభక్తిని ధ్వంసించి, దేవాధిదేవుని ధిక్కరిస్తూ ఆతడు చేసే పాపకార్యాలు దైవాగ్రహాన్ని రేకెత్తించగా, ఆ స్వామిద్రోహానికి పాపపరిహారం ఇంకేముంటుంది? అతడు తన వారసులతో సహా నశించడంకన్నా! అదే దైవచట్టం! ఇంకెవరైనా మానవుని పాపాన్ని తనపై వేసుకుని మనస్ఫూర్తిగా మృత్యువుకు మృత్యువును ఆహ్వానిస్తే, దైవశక్తులు సంతృప్తిపడితే మానవుడు రక్షింపబడతాడు, కాని ఎవరు, మీలో ఎవరు ఆ తుచ్ఛమానవుల పాపకార్యాలను భుజాన వేసుకుని వారి శిక్షను మీరనుభవిస్తూ వారికి అనంతమైన ప్రేమను పంచగలుగుతారు? ఎవరు ప్రియకుమారా?"

దేవదేవుని ఆ ప్రశ్నకు అక్కడ ఉన్న వారందరూ మౌనం వహించారు. అంతా నిశ్శబ్దం. మానవుని తరపున మాట్లాడేవారు గానీ, సమర్థించేవారు గాని అక్కడ లేరు. అంతేకాక మానవునికి మారుగా తాము అనుభవించాల్సి వచ్చిన శిక్ష, శుల్కం గురించి తెలిసినాక ఎవరు ముందుకు వస్తారు? మానవజాతి యావత్తు విముక్తి లేక మృత్యువు పాలై నరకానికి శాశ్వతంగా నెట్టివేయబడే పరిణామాన్ని, ఊహించిన దేవకుమారుడు, స్వచ్ఛాతిస్వచ్ఛమైన ప్రేమస్వరూపుడు, దివ్యప్రేమ తనలో అణువణువూ ప్రవహిస్తున్నవాడు దేవాధిదేవునితో ఇలా పలికాడు–

"దయామయుడైవైన తండ్రీ! శాశ్వతమైన నీ వాక్కుననుసరించే మానవుడు నీ అనుగ్రహానికి ప్రాప్తుడౌతాడు. ఆ కరుణ నీ వార్తావాహకులందరికన్నా వేగంగా నీ సృష్టిలోని సమస్త జీవరాశుల్ని ఏ అడ్డంకులు లేకుండా, కోరనవసరం లేకుండానే చేరుకుంటుంది. కాని మానవుడు మృత్యువుపాలై, సమసిపోతే మాత్రం ఎవరో ఒకరు ఆ పాపాన్ని తన భుజాలపై వేసుకుని ఆతడిని విడుదల చేస్తేనే కాని కారుణ్యనది ఆతనిని చేరలేదు.

తండ్రీ! నేను ఆతనికి బదులు శిక్షననుభవిస్తాను. అతని ప్రాణానికి నా ప్రాణం అడ్డువేసి తమ ఆగ్రహాన్ని ఉపశమింపజేస్తాను. మానవుడి కోసం నేను తమ సన్నిధిని వదిలి, ఈ ప్రశాంతకాంతిని విడిచి, నేను మరణిస్తాను. మృత్యువు సంతోషంగా నాపై విలయతాండవం చేయనీయండి! కాని ఆ చీకటి శక్తితో నన్నెక్కువకాలం పరాజితుణ్ణిగా ఉంచలేదు. ఈ అమరత్వం తమరు నాకు ప్రసాదించారు. మృత్యువుకు నేను తాత్కాలికంగా లొంగి, మానవుని ఋణాన్ని నా జీవంతో తీర్చినపుడు నన్ను సమాధిలో వడలిపోనివ్వకండి. నా స్వచ్ఛమైన ఆత్మ ఆ కలుషితమైన ప్రపంచంలో

తిరుగాడకుండా అనుగ్రహించండి. కాని నేను విజేతనై, పునరుజ్జీవుడనై, నా విరోధిని ఓడించి, ఆతని గర్వాన్ని పటాపంచలు చేస్తాను. మృత్యువుకు మృత్యుగాయాలు తగిలి, ఆతని చేతిలోని మృత్యుబాణం నిర్వీర్యం కాగా ఆతడు అవమానభారంతో తలవంచుకుని నిష్క్రమిస్తాడు. విజయవీచికలు విజృంభిస్తుండగా నరకలోకపు, చీకటిరాజ్యపు హద్దుల్ని నేను తెలియజేస్తాను. ఇవన్నీ మీ దృష్టిలోకి రాగా, నేను శత్రువుల్ని సర్వనాశనం చేస్తూ చివరగా మృత్యువు కళేబరంతో సమాధిని పూడ్చి ప్రాయశ్చిత్తం పొందిన అశేష జన సమూహంతో, బహుకాలం దూరంగా ఉన్న నా ప్రియమైన స్వర్గలోకానికి తిరిగి వస్తాను. వచ్చి తమ వదనంపై ఆగ్రహచ్ఛాయలు అదృశ్యం కాగా, శాంతి ఎల్లెడలా ప్రభవిస్తుండగా, కోపం, విరోధాలు అదృశ్యమై మైత్రి వెల్లివిరియ, పరమానందమూర్తి అయిన తమని చేరుకుంటాను."

– ఆతని మాటలు ముగిసాయి. విధేయతతో మూర్తీభవించిన ఆతని ఔన్నత్యం, నిశ్శబ్దమే మాట్లాడే ఆతని ప్రశాంతత, మర్త్య మానవులపై ఆతనికున్న అనంతమైన ప్రేమ ఊపిరిగా, ఆతడు ప్రవచించిన ఆత్మబలిదానం, తండ్రి నిర్ణయ మార్గంలో నడిచే ఆ దేవకుమారుణ్ణి చూసి దేవలోకం మెచ్చుకోళ్లతో, ప్రశంసలతో పులకరించింది. ఆ ఆశ్చర్యంలో వారుండగానే దేవాధిదేవుడిలా పలికాడు–

"నాకత్యంత సంతోషాన్నిచ్చిన ప్రియకుమారా! ఈ భూ, స్వర్గలోకాల్లో మానవుని కోసం పరితపించి దైవాగ్రహ జ్వాలల్నుంచి ఆతనికి శాంతిని ప్రసాదించేందుకు సిద్ధపడినవాడా! నీకు తెలుసు నేను సృజించిన పనులపై నాకెంత ప్రేమో, మక్కువో! మానవునిపై నాకేమీ తక్కువ ప్రేమలేదు. ఆతనికోసం నా దక్షిణహస్తం, హృదయం అయిన నిన్ను కొంతకాలం కోల్పోయినా నీవలన ఓ జాతి మొత్తం రక్షింపబడడం నాకూ సంతోషమే! వాళ్ల పాప విమోచనం కోసం వాళ్ల స్వభావం నీ స్వభావంలో కలిసేందుకు, మనుష్యుల మధ్యలో మనిషిగా, కన్యాగర్భాన జన్మించిన అద్భుతానివై నీ మాటను నిలబెట్టుకొందువుగాని. మానవజాతికి ఆదితండ్రి అయిన ఆదాము (Adam) తప్పిదం వల్ల ఆతని వారసులు పతనమైతే, నీవల్ల మరల వాళ్లు ఉద్ధరించ బడతారు. ఆతని తప్పిదం మానవులందర్నీ పాపుల్ని చేయగా, నీ బలిదానం మరల వారినందర్నీ పునీతుల్ని చేయగలదు. నీ ఔన్నత్యం వారిలోని మంచీచెడుల్ని తొలగించి కొత్త జీవితాన్నిస్తుంది. మానవుడిగా మానవులచేత శోధించబడి, తీర్పు చెప్పబడి, మరణించి, మరల పునరుత్థానము చెంది, తోటి మానవ సోదరులను పాప విముక్తుల గావించి, ప్రాణాన్నే పణంగా, శుల్కంగా చెల్లించి నరకలోకపు ద్వేషాన్ని స్వర్గలోకపు ప్రేమతో ఓడించి విజేతగా స్వర్గానికి రాగలవు.

దేవుని కరుణకు అర్హులు కానివారికి మృత్యు ఆలింగనం తప్పదు. నీవు కూడా నీ అర్హతలకన్నా తక్కువైన మానవజన్మను కోరుకుని, మానవులను పాపవిముక్తుల

చేయడానికి స్వర్గభోగాలను త్యజించి దైవకుమారుడిగా వారసత్వం కన్నా, యోగ్యతల వల్ల దివ్యసింహాసనానికి అర్హత సంపాదించుకున్నావు. కీర్తి కన్నా ప్రేమకు ప్రాధాన్యతనిచ్చి వినయగుణ సంపన్నుడవైన నీవు దేవతలకు మానవులకు అధినేతగా, దేవతలకు మానవులకు పుత్రుడిగా రాజ్యమేలుతూ విశ్వ చక్రవర్తిగా అభిషేకింప బడనున్నావు. సమస్త రాజ్యాలను, సింహాసనాలను, శక్తులను, లోకాలను పాలించే అధికారం నీకివ్వబడి, ముల్లోకాల్లోని జనులందరూ నీముందు మోకరిల్లగా, నీవు ఆకాశాన ప్రత్యక్షమై, దేవదూతలు నీ సభాసమావేశాన్ని ప్రకటిస్తూ, జీవించి ఉన్నవారిని, గడచిన కాలంలో మృతులైన సమస్త జనుల్ని అంతిమదినం నాడు మేల్కొల్పుతారు. సాధుసంతులు సమావేశం కాగా నీవు దుష్ప్రవర్తకులైన మానవులు, దేవదూతలపై అంతిమతీర్పు చెప్పగలవు. పాపులతో నిండిన నరకకూపం ఆనాడు శాశ్వతంగా మూసివేయబడ్తుంది. ఈ ప్రపంచమంతా జ్వాలల్లో భస్మీపటలమై, ఆ బూడిదనుంచి కొత్త స్వర్గం, భూలోకం ఉద్భవించగా సన్మార్గులు తమ వ్యధలన్నీ దూరం కాగా స్వర్ణయుగంలోని అద్భుత కార్యాల్ని, ఫలాల్ని చవిచూస్తూ సత్యమార్గాన నడుస్తారు. అప్పుడు నీ చేతిలోని రాజదండాన్ని పక్కకుబెడతావు. అందరిలోనూ దేవుడుండగా రాజదండపు అవసరమేమున్నది?

మీ దేవతలందరూ ఆతనిని ప్రేమిస్తారు, శ్లాఘిస్తారు. ఈ బృహత్కార్యాన్ని సాధించడానికి మరణించబోయే దైవకుమారుణ్ణి ప్రేమించండి! నన్ను కీర్తించినట్లే ఆతనినీ గౌరవించండి!"

పరమేశుడు అలా తెలుపగానే అసంఖ్యాకమైన దేవదూతలు, సంఖ్యలతో గణించడానికి వీల్లేనంత సంఖ్యలమంది హర్షపులకాంకితులై చేస్తున్న జయజయ ధ్వానాలతో స్వర్గలోకం పొంగిపోయింది. దైవస్తోత్రాల ఘోషతో (Hosanna) ఆ లోకమంతా ప్రతిధ్వనించగా దేవదూతలు తమ కిరీటాన్ని తీసి చేతిలో పట్టుకుని శిరస్సులు వంచి అభివాదాలు తెలుపసాగినారు. ఆ సువర్ణ కిరీటాలు, అమరాంత్ (Amarant) పారిజాత పుష్పాల (ఒకప్పుడవి జీవవృక్షం (Tree of Life) పక్కనే ఉండేవి. ఆదిమానవుని తప్పిదం వలన అవి స్థానాన్ని మార్చబడినవి, జీవధార (Fountain of Life) నుంచి జాలువారే ఆనంద నదీప్రవాహం (River of Bliss) స్వర్గలోకం మధ్యనుండి ఎలిషియన్ (Elisian) పొలాల్లోకి సాగుతూ దివ్యాత్మలు సంచరించే ఆ ప్రదేశాన్ని సస్యశ్యామలం చేస్తున్నది) తో అలంకరించబడగా వారు దేదీప్యమానమైన తమ శిరోజాలకు కిరణాలతో వాటిని అమర్చుకున్నారు. పూలదండల కాంతులు కాలిబాటలపై సూర్యకాంతిమణుల్లా మెరుస్తూ దేవలోకపు గులాబీలతో శోభిస్తున్నాయి. వారు మరల కిరీటాలను తమ తలలపై అమర్చుకుని బంగారు

హార్ప్ (త్రికోణాకారపు వీణ) వాయిద్యాలపై మధురమైన సింఫనీ (Symphony-స్వర సమ్మేళనం)లను, పవిత్ర గీతాలను గానం చేయసాగినారు.

మొదటగా సర్వవ్యాపకుడు, శాశ్వతుడు, పరంధాముడు, అనంతుడు, జనన మరణ వర్జితుడైన ప్రభువును స్తుతించినారు.

"ఓ సమస్త జీవనిర్జీవ పదార్థ నిర్మాణ రచయితా! కాంతిస్థానమా! అనంత కాంతి ప్రకాశంలో ఉండే అగోచరమైనవాడా! దుర్నిరీక్షమై, ఎవరికీ అందని సింహాసనాన్ని అధిష్టించినవాడా! మహాశక్తివంతమైన కిరణాలు, మేఘాలగుండా వస్తూ తమచుట్టూ పూజామందిరపు (Shrine) వలయంలా ఏర్పడగా మీ రూపం అత్యంత కాంతివంతమై, మాకు గోచరించి స్వర్గాన్ని మిరుమిట్లు గొల్పుతుండగా ఆ కాంతిని అత్యున్నతమైన దేవదూత (Seraphim) తన రెక్కలతో తమ నయనాలపై మేలిమి వెండితెరలా కప్పుతుంది"

అలా వారు సమస్త సృష్టి నిర్మాతను, సృష్టిని శ్లాఘించిన తరువాత ఆ సర్వవ్యాపకుని కుమారుడు, దివ్యత్వానికి ప్రతినిధి, మేఘాలు లేకనే తన రూపాన్ని, వదనాన్ని ప్రస్ఫుటించువాడు, మహా శక్తివంతుడైన తండ్రి (Almighty Father)కి ప్రతిరూపమై దైవకుమారుని స్తుతించినారు.

"ఓ కరుణామయుడా! సర్వవ్యాపకుడు, దుర్నిరీక్ష్యుడు అయిన ప్రభువు కాంతి మీలో ఇమిడి ఉన్నది. ఆతని దివ్యాత్మ మీ ద్వారా ప్రకటితమవుతున్నది. ఊర్ధ్వలోకాలు, వాటిలోని శక్తులు మీ సృష్టిజనకాలే. మీరే వాటిని నశింపజేయగల సమర్థులు. చెల్లాచెదురైన తిరుగుబాటు దేవతల కుత్తుకలపై తమ రథపు జ్వాలావలయిత చక్రాలను పోనిస్తున్నపుడు తమ తండ్రిగారి ఉరుముల మెరుపుల (Thunder) వజ్రాయుధాలు కూడ ఉద్దీప్తమైనాయి. విరోధుల్ని తరిమికొట్టి మీరు విజేతగా విచ్చేసినప్పుడు స్వర్గలోకమంతా సంతోషాల పండుగ జరుపుకున్నది.

న్యాయమూర్తీ! కరుణా సముద్రుడవైన నీవు మానవజాతిపై దయజూపు! నీకు అత్యంత ప్రియతముడైన దైవకుమారుడు మానవుని నేరాన్ని తన మరణంతో సరిదిద్దుతున్నాడు. కరుణించు తండ్రీ!

"ఓ ప్రేమసముద్రుడా! నీవు కురిపించే దివ్యప్రేమ ఎక్కడనూ ఎవ్వరికీ లభించదు. దైవకుమారా నీకు జయమగుగాక! నీ నామము ప్రార్థనాగీతమై స్తుతించ బడును గాక! నా చేతియందలి వీణావాయిద్యము సమస్త వేళలయందు నీ నామమును, నీ తండ్రి ఘనతను వేనోళ్ల పొగుడునుగాక!"

అలా దేవదూతలు గగనమండలపైని స్వర్గలోకంలో ప్రభుస్తుతి గానాలతో కీర్తనలతో తమ సమయాన్ని ఆనందంగా గడుపుతున్నారు.

అదే సమయంలో కేయాస్ (Chaos) అవ్యక్తస్థితి మరియు గాఢాంధకారానికి, వెలుగులోకపు అంచుల మధ్య ఉన్న అపారదర్శకమైన ఉబ్బెత్తు ఉపరితలం మీద ఘనత వహించిన సాతాను సాగుతున్నాడు. అప్పుడు సుదూరంగా కనిపించి, ఇప్పుడు ఎంత వేగంగా పోయినా తరగని విశాల భూభాగంలా చీకటితో నిండిన శీతల ఎడారిబీడులా ఉండి అవ్యక్తస్థితి యొక్క నిరంతర పెనుతుఫాన్లు ఆకాశాన్ని కమ్మి ప్రతిక్షణం గర్జిస్తుండగా, స్వర్గపు కాంతిరేఖలు ప్రతిఫలించినంత మేరకు కాసింత ప్రశాంతంగా ఉన్న ఖాళీప్రదేశం వేపు, సాతాను నడక సాగించాడు.

నరకలోకపు అడుగున ఉండే టార్టారస్ (Tartarus)లో పెరిగిన రాబందు (Vulture) అక్కడ ఆహారం దొరకక గంగానది (Ganges) లేదా హైడాస్పెస్ (Hydaspes) నదీతీరాల్లో, కొండలవద్ద పెరిగే గొర్రె, మేకపిల్లలను భక్షించేందుకు ఆవురావురుమని పోతున్నపుడు మధ్యలో ఆగిన సెరికానా (Sericana) బీడు మైదానంలో (చైనాదేశపు నావికులు తమ తేలికపాటి నావలలో పయనించే తుఫాను సముద్రపు తీరప్రాంతం) అటూఇటూ తిరుగుతున్నట్లుగా సాతాను ఆ ఖాళీప్రదేశంలో ఒంటరిగా పచార్లు చేస్తూ తనకు కావాల్సిన ఎరకోసం వెదకుతున్నాడు. కాని అక్కడ ఇంకా ఏ జీవనిర్జీవ పదార్థమూ సృజింపబడలేదు. పొగమంచు ఆవిర్లు పైకెగయగా అన్నీ తాత్కాలిక వ్యర్థపదార్థాలు తయారై మాయమైపోతున్నవి.

ఆడంబరం, పాపం మానవకార్యాల్లో నిండగా, ఆ శూన్య పదార్థాల్లోంచే శాశ్వతకీర్తిని, ఆనందాన్ని ఈ లోకంలోగాని, వేరే లోకంలోగాని, ఈ జన్మలోగాని, వచ్చే జన్మలో గాని పొందగలమని భావించేవారు, ఈ జన్మలో చేసిన పనులకు ఇక్కడే ప్రతిఫలం దొరుకుతుందని, మూఢవిశ్వాసాలతో, గుడ్డి నమ్మకంతో, తోటి మనుషుల మెప్పుదలకై ఆరాటపడుతూ మోక్షానికై అర్రులు చాస్తారు. అంతా వృధా!

ప్రకృతిలోని అసంపూర్తి కార్యాలన్నీ వికృతరాక్షసరూపంలో ఉన్నా అంతిమ దినం వరకూ నివాసం ఈ స్థలంపైననే. కొందరు కలగన్నట్లు కనిపించే చంద్రునిపై కాదు. అక్కడ పవిత్రులైన సాధుసంతుల ఆత్మలు, దేవదూతలు, మానవుల దివ్యాత్మలతో సంచరిస్తూ ఉంటాయి.

ఈ కొత్తలోకంలో తొలుదొల్త పాత ప్రపంచపు మహాకాయులు (Giants) అనేక గొప్పకార్యాలు చేసినవారిగా ప్రసిద్ధికెక్కి కాలగర్భంలో కలిసిపోతారు.

సెన్నార్ (Sennar) మైదానాల్లోని బాబెల్ (Babel) లాంటి గోపురాలను అనేకం నిర్మించినవాళ్లూ అలానే రూపుమాసిపోతారు. ఒంటరిగా వచ్చిన ఒక మహాకాయుడు దేవునిలాంటివాడు ఎట్నా (Aetna) జ్వాలలో దూకి అదృశ్యమౌతాడు. ప్లాటో (Plato) చెప్పిన ఎలిషియం (Elysium)ను అందుకోవాలనుకున్న ఎంపెడోక్లిస్ (Empedocles) సముద్రంలోకి దూకుతాడు. క్లియోంబ్రొటస్ (Cleombrotus) లాంటి పిండాలు, మూర్ఖులు, మునులు, సన్యాసులు (Embryos, Idiots, Hermits, Friars) శ్వేత, కృష్ణ, గోధుమవర్ణం వాళ్లూ వాళ్ల నిరర్థక భాషణాలతో పాటుగా నిష్క్రమిస్తారు.

గోల్గోతా (Golgotha)లో మరణించి స్వర్గంలో ఉన్న దైవకుమారునికై వెదికే స్వర్గపథగాములు (Pilgrims) విశ్వాసులు మరణానంతరం ప్రభువుకు సంబంధించిన దుస్తులను (Weeds of Dominic) ధరించి గాని, ఫ్రాన్సిస్‌కన్ సన్యాసుల్లా (Franciscan) గాని మారువేషధారులై సప్తగ్రహాలను దాటి, స్ఫటికగోళాన్ని వదిలి సెయింట్‌పీటర్ (Saint Peter) ఉన్న స్వర్గద్వారం వద్దకు చేరుకుంటారు. స్వర్గలోకంలోకి తొలిఅడుగు పెట్టేలోపలే ఓ ప్రచండమైన గాడ్పు వీచి వారిని పదివేల లీగుల (League- సుమారు మూడుమైళ్లు)దూరం విసిరివేస్తుంది. ఆ గాలివేగానికి ముసుగులు, టోపీలు, అంగీలు వాటితోపాటు వారిని ధరించినవాళ్లు, వాళ్ల వస్త్రాలు, చిహ్నాలు, జపమాలలు, పాపపరిహారపత్రాలు, పంపకాలు, క్షమాపణలు, శ్రీముఖాలు అన్నీ గాలికెగిరిపోగా వాళ్లు లింబో (Limbo-అజ్ఞాతవాస ప్రదేశం) అనే మూర్ఖుల స్వర్గం (The Paradise of Fools)లో ఉంచబడతారు.

నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రాంతాన్ని కూడా దాటి సాతాను పోగాపోగా ఒక్కచోట కాసింత వెలుగు కనిపించగా త్వరితగతిని అక్కడకు చేరుకుని ఓ అద్భుత దివ్యహర్మ్యాన్ని చూసాడు. ఆ రాజప్రసాద సింహద్వారము స్వర్ణమణిమయ శోభితమై నానారత్న విరాజితమై, నగీషీలు చెక్కబడి ఏ లోకంలోనూ, ఏ చిత్రకారుడూ, శిల్పీ ఇంతవరకూ చిత్రించని రీతిగా ఉన్నది. ఆ భవనానికున్న మెట్లు జాకబ్ స్వప్నంలో చూసినట్లున్న – దేవదూతలు పైకి క్రిందకు తిరుగుతున్న మెట్లలా ఉండినాయి. లుజ్ (Luz) పొలంలో పదాన్–ఆరమ్ (Padan-Aram) కు తాను ఇసావు (Esau) నుంచి పారిపోయేప్పుడు చూసిన ప్రకాశవంతమైన రక్షకదళాన్ని జాకబ్ గుర్తించాడు. నీలాకాశం క్రింద పడుకుని రాత్రి కలలుకంటూ తెల్లవారగానే మేల్కొని జాకబ్ అరిచాడు– "ఇదే స్వర్గద్వారమని! ఆ ప్రతిమెట్టూ క్రిందకు దించబడి, మరల స్వర్గం వేపు లాగబడినప్పుడు ఒక్కోసారి దృశ్యరహితంగా, ఒక్కోసారి ప్రకాశవంతమైన నీలిసముద్రమో, ముత్యాల జలసమూహమో కనిపిస్తుంది. భూలోకం నుంచి వచ్చిన

స్వర్గపధగాములు అక్కడ దేవదూతలున్న నౌకలలోగాని, భీకరమైన అశ్వాలులాగే రథాల్లోగాని ప్రయాణం చేస్తారు.

మరల మెట్లు క్రిందకు రాగానే సాతాన్ వాటిపై వెళ్లాలా వద్దా! స్వర్గచ్యుతుడైన తన రాక మరింత సమస్యను కొనితెస్తుందేమోనని తర్జనభర్జన చేస్తూండగానే స్వర్గానికి కొత్తలోకానికి మధ్య ఉన్న విశాలమైన రహదారి ఆతని కంటపడింది. ఆ దారి తర్వాత కాలంలో స్వర్గానికి సయాన్ (Sion) పర్వతానికి ఉన్న దారికన్నా, తన ప్రియమైన తెగల ప్రజల్ని చూడడానికి భగవానుడు ప్రత్యక్షమయ్యే–ఎంచుకున్న ప్రదేశం (Promised Land) వైపు ఉన్న దారికన్నా పెద్దదిగా ఉన్నది. జోర్డాన్ నదీప్రవాహ స్థానమైన పనియాస్ (Paneas) నుంచి బీర్‌సబా (Beersaba) వరకు, ఈజిప్టు (Egypt), అరేబియన్ తీరాల వరకు (Arabian shores) విస్తరించి చీకటిని చీలుస్తూపోయే ఆ రహదారిలో దేవదూతలు వస్తూపోతూ ఉంటారు.

స్వర్ణఖచితమైన ఆ మెట్లను చూస్తూ ఆఖరిమెట్టుపైన ఉన్న సాతాన్ కొత్తలోకాన్ని చూసి – రాత్రంతా దారితెన్ను తెలియక తిరిగిన బాటసారికి తెల్లవారంగానే కొండగుట్టపై నుంచీ కోటబురుజులు, గోపురాలున్న నగరం కనిపించి ఆనంద పరవశుడైనట్లు – ఆనందపడినా వెంటనే ఆతని మనసును అసూయామేఘాలు కమ్మివేసాయి. ఆతడు ఆ ప్రదేశాన్నంతా కలయచూస్తున్నపుడు తూర్పున తులారాశి (Libra), ఏండ్రొమెడా (Andromeda) నక్షత్ర సమూహం, ఆకాశపు అంచులు దాటిన అట్లాంటిక్ మహాసముద్రమూ, ధృవం నుంచి ధృవం వరకూ, వాయువీచికల గుండా, నక్షత్రాలగుండా కనిపిస్తున్న ప్రదేశాల్ని ఆతడు నిశితంగా పరిశీలించసాగినాడు. ప్రఖ్యాతిగాంచిన హెస్పెరియన్ (Hesperian gardens) ఫలపుష్ప వనాల్లాంటి అనేక తోటలు కనిపించినా అక్కడెవరున్నారో అతనికి అంతుపట్టలేదు.

ఆ తోటలపై ప్రకాశిస్తున్న బంగారురంగు సూర్యుడు (Sun), ఆతను ప్రయాణించే ప్రశాంత గగనమండలం (Firmament), ఆ అంతరిక్షంలో అనేక విధాలుగా పరిభ్రమిస్తున్న గ్రహాలూ, నక్షత్రాలూ, వాటివల్ల గణించబడే కాలమానం – దినాలు, నెలలు, సంవత్సరాలు – సూర్యకిరణాలచే వేడెక్కబడే సమస్త విశ్వమూ, విశ్వాంతరాళాలూ – ఉన్న ఆ ప్రాంతానికి సాతాను చేరుకున్నాడు. అది ఏ ఖగోళ పరిశోధకుని దుర్భిణికీ కానరానిది, మండుతున్న లోహవర్ణంలో సగం స్వర్ణం, సగం రజతంలా ప్రకాశిస్తూ, సూర్యకాంతమణిలా, కెంపులా (Ruby) క్రైసొలైట్ (Chrysolite- పాలాశయనం)లా, గోమేధికం (Topaz)లా, ఆరన్ (Aaron) రొమ్ముఫలకంపై (Breast Plate) ఉన్న పన్నెండు రత్నాల్లా, అందరికీ తెలిసి ఎవ్వరూ

చూడని పరశువేది (Philospher's stone)లా, ఆ మణులు తమ శక్తితో హెర్మెస్ (దేవదూత, రసవాద విద్యల అధిపతి – Hermes)నే బంధించగా ఆతడు సముద్రపు వృద్ధుడు (The old man of the sea - Proteus) ప్రొటియస్‌లా అనేక రూపాలకు మారుతూ అలెంబిక్ గాజుకుప్పె (Alembic) ద్వారా బయటకు వచ్చి యధారూపం పొందినట్లు, అక్కడి ప్రదేశాలు స్వచ్ఛమైన ఎలిక్సిర్ (Elixir= లోహాలను బంగారంగా మార్చడానికి వాడే ద్రావకం)ను ఊపిరిగా విడుస్తూ, నదుల నిండా సువర్ణం ప్రవాహమై పారుతుండగా మహాశాస్త్రజ్ఞుడైన సూర్యుడు తన స్పర్శతో అనేక లోహాలను, మణుల్నీ, విలువైన రాళ్లనీ తయారుచేస్తున్నాడు. ఆ అద్భుత ప్రదేశంలో వెలుగే తప్ప ఏమాత్రం నీడ జాడలేని అక్షరేఖాప్రాంతంలో, సాతాను దృష్టికి, జాన్ (John) చూసిన మహిమాన్వితుడైన దేవదూత కనిపించాడు.

శిరస్సుపై బంగారు కిరీటం, మెరుస్తున్న శిరోజాలు భుజాలపై కదలాడుతూ, రెక్కలు సున్నితంగా కదులుతుండగా అటువేపు తిరిగి నిలబడ్డ ఆ దేవదూతను అడిగి మానవుడున్న స్వర్గప్రదేశానికి (The Paradise the happiest seat of Man) దారి తెలుసుకోదలచినాడు సాతాను. అక్కడితో సాతాను ప్రయాణం ముగుస్తుంది కాని మన మానవుల కష్టాలు మొదలవుతాయి.

నిజరూపంతో వెళితే గుర్తింపబడతాడన్న భయంతో 'సాతాను' బాల్యం తొణికిసలాడ్తున్న చిన్నారి దేవదూత రూపాన్ని దాల్చి పాలుగారుతున్న బుగ్గలతో, సుకుమారమైన శరీరంతో, ఇంకా సంపూర్ణాకారాన్ని పొందని యువకుడిలా, వివిధ వర్ణ శోభితమైన రెక్కలపైని స్వర్ణధూళి నక్షత్రాల్లా మెరుస్తుండగా, రజతమంత్రదండ హస్తభూషణుడై నిశ్శబ్దంగా ఆ దేవదూతను సమీపించేసరికి ఆతడు ఇటువేపు తిరిగాడు. దేవదేవుని సింహాసనం పక్కనే ఉండి ఆతని ఆజ్ఞలకై వేచిఉండే సప్తదేవదూతలలో ఒకడై తన నిశితమైన దృక్కులతో స్వర్గ భూలోకాల్ని, సముద్రాలు, మైదానాల్ని శోధిస్తూ ఉన్న యురియెల్ (Uriel)ను సాతాన్ (Satan) చూసినాడు.

"యురియెల్! దేవదేవుని సన్నిహిత సప్తదేవదూతలలో ముఖ్యుడా! కాంతివంతుడా! ఈ అద్భుతమైన కొత్తలోకం ఎలాంటిది? దేవదేవుడు ఏ విశేషాలతో దానిని సృజించాడు! కొత్తజాతి రూపురేఖలేవిటి? ముఖ్యంగా మానవుడి గురించి తెలుసుకోవాలన్న కోరిక, జిజ్ఞాస నన్ను దైవకూటమి (Quires of Cherubim) నుంచి ఇక్కడకు తీసుకువచ్చింది. మానవుడి నివాస స్థావరం నిర్ణయించబడిందా లేక ఈ కక్ష్యలన్నిటిలోనూ ఆతడు తిరుగాడే స్వేచ్ఛ ఉన్నదా? ప్రభువు కరుణకు పాత్రుడైన మానవుడు, తరిమివేయబడ్డ దేవదూతల స్థానాన్ని నింపేందుకు సృష్టింప బడ్డాడన్న వార్త నిజమని ఋజువు చేసుకొని, ఆ దేవదేవుని విధానాలన్నీ లోక

కళ్యాణదాయకాలే (Wise are all his ways)– అని ఆ మహిమాన్వితుడైన దేవదేవుని వేనోళ్ల పొగుడుతూ, కీర్తిస్తూ నేను మరలిపోగలను"

అలా ఆ మాయావి, మానవుల్ని దేవతల్ని వశం చేసుకోగల వంచనాశిల్పంతో 'యురియెల్'ను ఆకట్టుకున్నాడు. దేవుడొక్కడే వంచకుల నిజస్వరూపాన్ని వెంటనే పసిగట్టగలడు. జ్ఞానం మెలకువగా ఉన్నప్పుడు అనుమానం నిద్రిస్తుంది. జ్ఞాన ద్వారాల వద్ద నిరాడంబరతకు విలువ ఉంటుంది. మంచితనపు దృష్టికి చెడుమచ్చలు కానరావు. ఆ విధంగా సూర్యుని అధికారప్రతినిధి (Regent) యురియెల్, దేవదూత సాతాను వంచనకులోనై ఈ విధంగా సమాధానమిచ్చాడు.

"పరిశుద్ధుడవైన దేవదూతా! దేవదేవుని సృష్టిని శోధించి, బహుగా స్తుతించ బూనడం శ్లాఘనీయమైన విషయమే! దైవప్రాసాదాలను విడిచి ఒంటరిగా ఇంతదూరం వచ్చి ఆ అద్భుతమైన నూతన సృష్టిని స్వయంగా చూడదలుచుకోవడం గొప్ప సంగతే! బుద్ధి ఎప్పుడూ సంఖ్యాపరంగా ఆలోచిస్తుంది. జ్ఞానం వాటి గుణగణాలను శోధిస్తుంది. దేవదేవుని ఆజ్ఞతో రూపంలేని ఈ పదార్థం ఓ గుట్టగా పోగుపడగా, గందరగోళపు స్థితి, బ్రహ్మాండనాదం, అనంతాన్ని వ్యాపించి ఉండగా, రెండవసారి ఆతని ఆజ్ఞతో చీకటి తొలిగి అంతటా వెలుగు నిండినది. కల్లోలం నుంచి క్రమస్థితి రాగా మూలకాలు, పంచభూతాలైన భూమి, నీరు, గాలి, అగ్ని, దేవలోకపు ఆకాశతత్వం అన్నీ కలిసి అనేక రూపాలు పదార్థాలు ఏర్పడ్డాయి. గ్రహాలు, నక్షత్రాలు వాటి వాటి కక్ష్యలలో పరిభ్రమిస్తూ విశ్వనిర్మాణ రచనను విశదం చేస్తున్నాయి. క్రిందనున్న ఈ గోళం పరావర్తనం చెందిన కాంతితో వెలుగుతున్నది చూడూ – అదే భూమి (Earth). మానవుని నివాస స్థానం. సూర్యుని కాంతి పడిన అర్ధభాగంలో పగలు, మిగతాభాగంలో రాత్రి. చంద్రికాకాంతులు (Moon) రాత్రివేళల్లో నెలనెలా వృద్ధిక్షయాలుగా వెన్నెలలు విరజిమ్ముతూ కాంతివంతం చేస్తాయి. నేను నీకు చూపిస్తున్న ఈ ప్రదేశమే ప్యారడైజ్ (Paradise-స్వర్గం). అదే ఆదిమానవుడు ఆదాం (Adam) నివాసం. ఆ నీడలోని లతాగృహంలో ఆతడు ఉన్నాడు. ఇది సూటిగా అక్కడికి వెళ్లే దారి"

అలా వివరించి వెనుతిరిగిన ప్రధాన దేవదూతకు గౌరవంతో శిరఃప్రణామం చేసి శలవు తీసుకొని భూగోళం వేపు సాతాను బయల్దేరాడు. ఆతడు కూడా దేవతా ప్రముఖులకివ్వాల్సిన గౌరవాన్ని విస్మరించలేదు. సూర్యకాంతివృత్తం (Eclipse) నుంచి బయల్దేరిన సాతాను విజయాన్ని సాధించగలనన్న ఆత్మవిశ్వాసంతో, ఏ వాయు చక్రాల్లోనూ ఆగకుండా సరాసరి నిఫేటస్ (Niphates) పర్వతాగ్రాన్ని చేరుకున్నాడు.

4. ఈడెన్ తోటలో ప్రవేశించిన సాతాన్

ఈడెన్ తోటలోకి ప్రవేశించిన సాతాను, దేవదేవుడికి మానవుడికి వ్యతిరేకంగా తాను ప్రారంభించిన బృహత్కార్యాన్ని ఎలా ప్రారంభించాలో ఆలోచిస్తూ, అనేక సందేహాలు, అపనమ్మకాలు, ఉద్రేకాలు, భయం, అసూయ, నిరాశ అన్నీ కలగా పులగంగా కలిసి మనసును డోలాయమాన స్థితిలో పడవేయగా, తేరుకుని, విజయానికి దగ్గర దారి ఈవిల్ (చెడ్డదారి–Evil) గా నిర్ధారించుకున్నాడు. ప్యారడైజ్ (Paradise) అంతా చూసే తలంపుతో కొర్మొరాంట్ (Cormorant) పక్షిరూపంలో అన్నిటికన్నా ఎత్తుగా ఉండే జీవవృక్షం (Tree of Life)పై కూర్చుని చుట్టూరా పరికించసాగినాడు. పరమానందకరంగా ఉన్న ఆ ఫలపుష్పవనంలో హాయిగా తిరుగాడుతున్న ఆదిమానవులైన ఆదాం, ఈవ్ (Adam, Eve)లను చూసి ఒకింత ఆశ్చర్యపడినా వాళ్లను పతనం చెందించేందుకే నిశ్చయించుకుంటాడు. చాటుగా వారి సంభాషణను ఆలకించి జ్ఞానవృక్ష ఫలాన్ని (Tree of knowledge) తినరాదన్న దేవుని శాసనాన్ని మీరితే మృత్యుదండన శిక్షగా వున్న సంగతి తెలుసుకున్నాడు. వాళ్లని ఏదో విధంగా ఆకర్షించి దేవదేవుని ఆజ్ఞను మీరేట్లు చేయగలిగితే తాను వచ్చినపని దిగ్విజయంగా అవుతుందని భావించాడు సాతాను.

ఇంతలో సూర్యకిరణాలపై యురియెల్ దేవదూత పారడైజ్ ద్వారపాలకుడైన గాబ్రియేల్ (Gabriel) దగ్గరకు వచ్చి, ఒక దుష్టాత్మ (Evil Spirit) మధ్యాహ్న సమయంలో తానున్న ప్రదేశం నుంచి ఈడెన్ తోటవేపు దేవదూత రూపంలో వచ్చినట్లు, అతడి నిజస్వరూపం పర్వతంపై దిగినప్పుడు తాను గమనించినట్లు హెచ్చరిస్తాడు. గాబ్రియేల్ మరుసటి ఉదయానికల్లా ఆ దుష్టశక్తిని బంధిస్తానని వాగ్దానం చేస్తాడు. ఇంతలో చీకటిపడుతుండగా ఆదాం, ఈవ్‌లు తమ నివాస ప్రదేశానికి వెళ్లి సాయంకాలపు పూజలు నిర్వహిస్తారు.

గాబ్రియేల్ వనరక్షక దళాన్ని పిలిచి హెచ్చరికలు చేసి ఇద్దరు శక్తివంతులైన వనరక్షకుల్ని ఆదాం, ఈవ్‌లు నిద్రపోతున్నపుడు దుష్టాత్మచే వారికి ఎటువంటి కీడు జరగకుండా నియమిస్తాడు. ఈవ్ చెవి దగ్గర జేరి ఆమె కలలో ప్రలోభపెడ్తున్న సాతాన్‌ను పట్టుకుని వాళ్లు బలవంతంగా గాబ్రియేల్ వద్దకు తీసుకువస్తారు. గాబ్రియేల్ ప్రశ్నలకు సరైన సమాధానాలివ్వకుండా, మొండిగా ఉన్నప్పుడు దేవలోకం నుంచి వచ్చిన హెచ్చరికను గమనించినవాడై, సాతాను, పారడైజ్ నుంచి పారిపోయాడు.

ఆ గంభీరమైన ధ్వని, స్వర్గలోకంలో ప్రతిధ్వనించగా ఆది మన ఆది మాతాపితలకు శత్రువు గురించి దేవదేవుడు పంపిన హెచ్చరిక. మహాసర్పరూపంలో (Dragon) మానవుల వినాశనానికి కంకణం కట్టుకున్న సాతాను ఆ భవిష్యద్వాణి (Apocalyps) ధ్వని విని ముందుగా రోషపరవశుడైనా తన ఆగ్రహాన్ని తమాయించుకుని, గత పరాభవాగ్ని దావానలంలా తనను దహించి వేస్తుండగా, ప్రతీకారేచ్ఛతో బలహీనుడైన మానవుడిపై తన ప్రతాపాన్ని, ప్రభావాన్ని చూపించ నిశ్చయించుకున్నాడు.

తన హృదయంలో రగుల్తున్న పగ భయంకరమైన యంత్రంలా తననే కాల్చివేస్తుండగా, భయసందేహాలు మిళితమైన ఆలోచనలు అల్లకల్లోలం చేస్తుండగా, తనలోని నరకం, నరకంలో తానున్నస్థితి, కనీసం అంతకన్నా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితిని, అంచనా వేయసాగినాడు. నిద్రపోతున్న నిరాశను అంతరాత్మ మేలుకొలపగా పాత చేదుజ్ఞాపకాలు తన పూర్వవైభవాన్ని, ఇప్పటి స్థితిని, రేపటి పర్యవసానాల్ని పోల్చి గుర్తుచేస్తూ ఉండగా, సాతాను ప్రశాంతంగా ఉన్న ఈడెన్ వేపు కాసేపు, మండుతున్న సూర్యునివేపు, ప్రకాశవంతమైన స్వర్గం వేపు చూస్తూ నిట్టూర్పులు విడుస్తూ కుమిలిపోసాగినాడు.

"ఓ విశ్వవిజేతా! కీర్తికిరీటాన్ని తలపై ధరించి ఏకైక చక్రవర్తిలా నూతన ప్రపంచాన్ని వీక్షిస్తున్నవాడా! ప్రకాశవంతమైన తారలు కూడా నిన్ను చూసి తలలు వంచి నమస్కరించే నిన్ను పిలుస్తున్నాను, అయితే స్నేహితుడిగా మాత్రం కాదు! ఓ సూర్యుడా! నీకు కూడ అదే గొంతుతో చెబుతున్నాను! నీ కిరణాలను ఎందుకు ద్వేషిస్తానంటే అవి ప్రతిక్షణం నేనున్న అధోగతిని, ఒకప్పటినా ఉచ్ఛస్థితిని గుర్తుచేస్తాయి.

నాలోని అమితమైన గర్వం, ప్రగాఢ వాంఛ స్వర్గాధిపతినే ఎదిరించేలా చేసి నన్ను పతనం చెందించాయి. అయినా ఆతడు నా నుంచి ఏవిధమైన మెప్పుకు అర్హుడు కాడు. అక్కడి నా ఉద్యోగం, నేను చేసిన విధులు కష్టమైనవి కావు. చెయ్యాల్సిందల్లా ఆయన్ని స్తుతించడం, వందిమాగధుల్లా కీర్తించడం, కృతజ్ఞతలు తెలుపుకోవడం. ఏం కష్టముంది దాంట్లో! అయినా ఆతడి మంచి అంతా నాకు చేదుగుళికల్లా ఉండేది. నాలో ఆతడి ఉన్నతిపట్ల అసూయ పెరిగిపెరిగి అత్యున్నత పీఠాన్ని కైవసం చేసుకోవాలనే కోర్కె ప్రబలమై, ఎంతకాలం సేవించినా తరగని ప్రస్తుత ఋణబంధాన్ని తెంచుకోవాలన్న తెగింపుతో, ఆతడు నాకిచ్చినది, ఇస్తున్నదీ మరచిపోయి, ఈ బాధ్యతలకు ఇంతటితో స్వస్తి చెప్పాలనుకుని ఆ తీవ్ర నిర్ణయం తీసుకున్నాను. ఈ విధి పరిణామం ఏదో చిన్నస్థాయి దేవదూతకు జరిగితే ఏమయ్యేదీ కాదు. నేను కాకపోతే మరో ఏదో బలమైన శక్తి తిరుగుబాటు చేస్తే, నేను దేవదేవుడి తరపు పోరాడేవాణ్ణే కదా! అంత బలమైన శక్తులు ఎటువంటి పరిణామాన్నయినా

తొణుకూ బెణుకూ లేకుండా స్వీకరించేవి కావూ! అదిసరే, ఎవరి ఇచ్ఛాశక్తి, సామర్థ్యాలతో ఆత్మప్రబోధాలతో వాళ్లు నడవడం సరిఅయినప్పుడు, నేను చేసిన నేరమేమిటి? ఇప్పటి నాయీ దురదృష్ట స్థితికి ఎవర్ని నిందిచాలి? దైవప్రేమ అందరికీ సమానంగా పంచబడ్తున్నదా! అయినా ప్రేమ ద్వేషం నా దృష్టిలో ఒకటే – అవి శాశ్వత బాధల్ని కలిగిస్తాయి. స్వేచ్ఛాజీవులుగా మమ్మల్ని తయారుచేసాక మేం మా ఆత్మప్రబోధం ప్రకారం నడిస్తే దానికి శిక్ష న్యాయమా? మరి నేనిప్పుడు ఏ దారిని ఎన్నుకోవాలి – అనంతమైన ఆగ్రహాన్నా? అంతంలేని నిరాశనా! నేనెటుపోయినా అది నరకమే! అసలు నేనే నరకాన్ని కదా! అంతుపట్టని అగాధంలో మరో అగాధం నోరుతెరచి నన్ను మింగెయ్యాలని చూస్తున్నది. పశ్చాత్తాపపడుతున్నానా! పశ్చాత్తాపానికి క్షమాభిక్ష ఉంటుందా? క్షమాభిక్ష అంటే లొంగిపోవడమా? లొంగిపోవడమనే మాట నాకు ఏవగింపు కదా! ఆ విజేతను, సర్వవ్యాపకుణ్ణి, చతికిలపడేస్తానన్న నా మాటలన్నీ వ్యర్థ ప్రలాపాలుగా, సమస్త నరక సేనావాహినీ భావిస్తుంది కదూ! నేనన్న ప్రతిమాటనూ అక్షరాల పాటించడానికి ఎన్ని కష్టనష్టాలనైనా నేను భరించడంలేదా!నరకలోకపు సింహాసనంపై రాజోచిత ఛత్రచామరాలతో, రాజదండంతో నేను కొలువుదీరగా అసంఖ్యాకమైన ఆ అనుయాయులందరూ నా మాటలకు జేజేలు పలకలేదా! నేనక్కడ ఎంత ఎత్తుకు ఎదిగితే కష్టాల్లో అంత దిగువకు దిగిపోతున్నాను. ప్రగాఢమైన కోరికకు అదే ప్రతిఫలం కావచ్చును. ఒకవేళ క్షమాభిక్ష వల్ల నేను నా మునుపటి స్థానాన్ని పొందుతాననుకుందాం! కాని కష్టాల్లో ఒప్పుకున్న తప్పులు, కన్నీళ్లలో వ్రాసుకున్న ఒప్పందాలు, ఇష్టంలేని లొంగుబాటు పర్వాలు ఎన్నాళ్లు నిలబడతాయి? ప్రాణాంతకపు ద్వేషగాయాలు సలుపుతుంటే సమాధానపడడం సాధ్యమవుతుందా! తిరగబడ్డ దేవతకు గాయాలు తిరగబెడితే పతనం మరింత పాతాళానికేగదా! తెలివితోనో అతితెలివితోనో కాస్త విరామాన్ని చేజిక్కించుకుని బలపడడమా! అన్నీ ఒక కంట కనిపెట్టే నా విరోధినే కోరుకునే శాంతిని సాగనిస్తాడా! ఆ ఆశలేదు! మా బహిష్కారానికి ఆమోదముద్ర వేసి మా స్థానాన్ని పూరించడానికి ఈ మానవజాతిని ద్విగుణం బహుళం చేయడం ఆతని ఉద్దేశ్యం. అందుచేత 'ఆశా నీకు వీడ్కోలు! ఆశలేనప్పుడు భయమా నీకు వీడ్కోలు! పశ్చాత్తాపమా మరినీకూ వీడ్కోలు! మంచితనమెలాగూ మట్టికొట్టుకు పోయింది. చెడు నడతే నా మంచితనంగా వర్ధిల్లనీ! నీవల్లనన్నా నేను ఈ సర్వంసహా మహాసామ్రాజ్యాన్ని నా విరోధితో కలిసి పంచుకుని, బహుశా సగంకంటే ఎక్కువే – నామాట ఏలుబడిగా ఈ నవ మానవలోకాన్ని పరిపాలిస్తాను"

అలా అతడు మాట్లాడుకుంటున్నపుడే అనేక రకాల భావాలు కోపం, అసూయ, నిరాశ తెరలు తెరలుగా ఆతని వదనాన్ని మసకబారుచేయగా దివ్య

చక్షువులకు ఆతని జాడ కన్పడింది. సాధువు ముసుగులో దాగిన రాక్షసుడిలా, దివ్యకాంతి మందగించగానే సాతాను స్వరూపం యురియెల్ దేవదూత (Uriel)కు అస్సిరియన్ శిఖరం (Assyrian Mount)పైన వికృతంగా కన్పించగానే దేవదూత ఉలిక్కిపడ్డాడు. తననెవ్వరూ గమనించలేదన్న ధీమాతో సాతాను ఈడెన్ దివ్యానంద వనంలో పారడైజ్ (స్వర్గతుల్యమైన-Paradise) సరిహద్దులకు చేరుకున్నాడు. చిన్న గుట్టలాంటి మైదానం చుట్టూ చొరబడడానికి వీల్లేని ముళ్లపొదలూ, లతలు దట్టంగా అల్లుకుని ఉన్నట్లు, ఆకాశాన్ని చుంబిస్తున్నట్లుగా ఉన్న దేవదారు (Cedar), పైన్ (Pine), ఫర్ (Firr) వృక్షాలు, రెమ్మలుగా చీలిన పామ్ (Palm) వృక్షాలు, ఒక దట్టమైన, మనోహరమైన అరణ్యపు దృశ్యం దారు నిర్మిత రంగస్థలంపై ఒకదాని వెనుక ఒకటి అమర్చిన చిత్రిత దృశ్యాల తెరల్లా, వాటన్నిటికీ పైన కన్పిస్తూ పైర్ల పచ్చదనాన్ని తలపించే పారడైజ్ గోడ ఇవన్నీ సాతాన్‌కు మాంచి పసందైన భోజనంలా కనిపించాయి. ఆ గోడలకుపైన బంగారు రంగుతో నిగనిగలాడుతున్న ఫలాలతో నిండిన పండ్లచెట్ల వలయం, సూర్యకిరణాలతో రంగుల్ని విరజిమ్ముతూ ఇంద్రధనుస్సునీ, సాయంకాలపు మేఘవర్ణాల్నీ తలదన్నుతూ ఓ అద్భుతదృశ్యం ఆ అపురూప ఫలపుష్పవనం. అత్యంత స్వచ్ఛమైన గాలి వసంత ఋతు పరిమళాలతో కలిసి తెరలు తెరలుగా వీచి హృదయంలో ఆనందాన్ని నింపి దుఃఖాన్ని తొలగదోస్తుండగా నిరాశ మాత్రం ఎందుకో నిలిచే ఉన్నది. కాసేపు ఉధృతంగా వీచిన పిల్లతెమ్మెరలు పూల సుగంధాల్ని దోచుకుని మరీ ఊసులాడుతూ నలుదిక్కులకూ వ్యాపిస్తున్నవి. హోప్ అగ్రం (Cape of Hope), మొజాంబిక్ (Mozambic)లను దాటి సముద్రంలో నౌకలు ఈశాన్యంగా పయనిస్తున్నపుడు అరేబియన్ తీరాలనుండి ప్రవహించిన (Arabian) సబియన్ (Sabean) సుగంధ పరిమళాలు నావికుల్ని ఉక్కిరిబిక్కిరి చేసినట్లు, ఈడెన్ దివ్యవనం నుండి వీచిన వాయువీచికల కమ్మదనం, ఆ ప్రాంతాన్ని విషపూరితం చేయడానికి వచ్చిన విషపురుగునే ఆకట్టుకున్నాయి. టోబిట్స్ కుమారుడి భార్యను (Tobits) ఆవహించిన అస్మోడియస్ పిశాచం (Asmodeus) చేపల సువాసనకు ఆకర్షితుడై మెడియా (Media) నుంచి ఈజిప్టుకు వెళ్లి బంధితుడైనట్లు, సాతాను కూడా దాదాపు అదే పరిస్థితిలో ఆ దుర్భేధ్యమైన వనం దగ్గర కార్యోన్ముఖుడైనాడు.

ఏ మానవుడూ, జంతువూ చొరలేని ఆ ముళ్లపొదల కంచెను చూసాడు. దూరంగా అవతలివేపు తూర్పుదిక్కున ఒకే ఒక ద్వారం ఉన్నది. అలా రాజమార్గాన పోవడం ఇష్టంలేని సాతాను పడమటి వేపున ఉన్న అంతెత్తు కంచెనూ ఒక్క ఉదుటున గెంతి లోపలకు ప్రవేశించాడు. నిద్రిస్తున్న గొర్రెల మంద మధ్యలోకి, వెనక కంచె మీద నుంచి దూకిన ఆకలిగొన్న తోడేలులా, తలుపులూ, ద్వారబంధాలు బంధించి,

నిశ్చింతంగా నిద్రపోతున్న ధనవంతుడి ఖజానాలోకి కిటికీగుండానో పైకప్పు గుండానో ప్రవేశించిన గజదొంగలా, దేవుడు సృష్టించిన కొత్తలోకంలోకి సాతాను అడుగుపెట్టాడు.

అలా ఎగిరి మధ్యలో ఉన్న అన్నిటికన్నా ఎత్తైన జీవవృక్షంపైన (Tree of Life) కొర్మారెంట్ (Cormarant) అనే మేతకోసం వెదకుతున్న తిండిపోతు పక్షిలా కూర్చున్నా, ఆతని ఆలోచనలు ప్రాణం పోయడం మీదకన్నా అక్కడి వాళ్ల ప్రాణాలు తీయడం మీద; ఆ జీవవృక్షపు గొప్పదనం గురించికాక, దానిమీద కూర్చుని అమరత్వపు ప్రతిజ్ఞను ఎలా భంగపరచాలనే దానిగురించి ముఖ్యంగా ఆలోచిస్తున్నాడా ధూర్తుడు. తన ముందున్న మంచి విషయాల్ని కూడ పాపపు పనులకు వినియోగించడం ఆతనికి వెన్నతో పెట్టిన విద్య.

ఆతడు కూర్చున్న జీవవృక్షం క్రింద భూమిపై వెలసిన స్వర్గలోకం ఈడెన్ దివ్యవనం (Eden), ఆ వనానికి తూర్పున పారడైజ్ (Paradise) ఉద్యానవనం భగవన్నిర్మితమై ఉన్నాయి. తూర్పు సరిహద్దు ఔరన్ (Auran) నుంచి గ్రీకురాజులు నిర్మించిన సెల్యూసియా (Seleucia) కోట బురుజుల వరకూ, ఈడెన్ భూమిపుత్రులు తిరుగాడిన టెలెస్సార్ (Telessar) ప్రాంతమైన ఈ ప్రదేశంలో దేవదేవుడు అద్భుతమైన ఫలవృక్షాలను నాటి వాటి మధ్యలో జీవవృక్షాన్ని పెంచినాడు. అత్యున్నతమై దివ్య స్వర్ణ ఫలాలతో అలరారే ఆ జీవవృక్షం పక్కనే జ్ఞానవృక్షం (Tree of knowledge) ఉన్నది. మంచీ చెడుల విచక్షణతో మానవునికి మృత్యువును స్పృహలోకి తెచ్చిన జ్ఞానవృక్షం అదే!

దక్షిణంగా ఈ దివ్య ఉద్యానవనపు గుట్టకింద అంతర్లీనంగా ప్రవహించే పెద్ద నది, దాని పాయలను కప్పిన పల్చటి చిత్తడినేల దానిమధ్యలో ఉబికిన నీటిబుగ్గ (Fountain), దాన్నుంచి ప్రవహించే నీరు ఆ తోటలోని చెట్లకు అనేక కాల్వలుగా ప్రవహించి అందచేయగా ఆ చిన్ని కాల్వలన్నీ కలిసి ఉధృతమై జలప్రళయం నాడు ఏకప్రవాహంగా మారినా, ఇప్పుడు అది నాలుగు స్వచ్ఛమైన సెలయేర్లుగా బంగారు రంగు ఇసుక నేలపై వెండి ముత్యాల్లా జాలువారుతూ ఆ తోటలోని ఫలపుష్పవృక్ష సంతతికి అమృతతుల్యమైన నీటిని అందిస్తున్నవి. ఆ స్వచ్ఛమైన నీటి ప్రవాహాలపై సూర్యకిరణాలు ప్రతిఫలించగా ఆ తోట అద్భుతంగా తళుకులీనుతున్నది. ఆ వృక్షాల నుంచి స్రవిస్తున్న సుగంధభరిత జిగుర్లు, నూనెలు, స్వర్ణ కాంతులీనుతున్న మధుర ఫలాలు, హెస్పెరియన్ గాధల (Hesperian Fables)ను గుర్తు చేస్తున్నవి. పచ్చిక బయళ్లు, లతానికుంజాల మధ్య లేత చిగుళ్లు మేస్తున్న పశుసంతతి, ఆకుపచ్చని చిన్నిగుట్టలు, గుట్టల మధ్య సకలవర్ణ శోభిత వివిధ పుష్పరాశులు, ముళ్లులేని గులాబీలు ఒక పక్క, చల్లని నీడనిస్తూ, గుత్తులు గుత్తులుగా వేలాడ్తున్న నల్ల ద్రాక్షలతో నిండిన

ద్రాక్షవనాలూ, వాటికి మధ్య గుసగుసలాడుతున్నట్లు ప్రవహించే నీటి ధారలూ, జలపాతాలూ కొండలు గుట్టలపై నుంచి సాగుతూ అవి చివరకు ఓ ప్రశాంత సరోవరాన్ని చేరుతున్నాయి. రకరకాల పక్షులు ఎగుర్తూ, కిలకిలా రావాలు చేస్తూ వీస్తున్న పిల్లతెమ్మెరలకు గాన సహకారం చేస్తూ అద్దం లాంటి సరస్సుపై ప్రతిబింబిస్తున్నాయి. పాన్ (Pan) దేవుడు, గ్రేసెస్ (Graces) మువ్వురితో కలిసి వసంత నృత్యాలు చేస్తున్నప్పటి సందడి అక్కడి వనంలో వెల్లివిరిసి ప్రకృతి పులకరించి పోతున్నది.

అది ఎన్నా పొలాల్లో (Enna fields) ప్రొసర్పైన్ (Proserpine) సుందరమైన పుష్పాలను సేకరిస్తున్నపుడు, పూలలో పూవు లాంటి ఆమెను కూడ డిస్ (Dis=Pluto) చీకటి కమ్మగా, సిరెస్ (Ceres) దేవత ఆమెకై తపిస్తూ లోకమంతా వెదకిన తోటల్లాంటివి కాదు, ఒరొంటెస్ (Orontes) వెదికిన కాస్టాలియన్ నీటిబుగ్గ (Castalian Spring) ఉన్న డాఫ్నె (Daphne) పూలతోట లాంటిదికాదు.

రియాదేవత (Rhea) కంటబడకుండా ఆమె సవతి అమల్థియా (Amalthea), సవతి కొడుకు బాకస్ (Bacchus) లను, అమ్మన్‌లు (Ammons) ఛామ్ (Old Cham) గా పిలిచే లిబియన్ జోవ్ (Libyan Jove) దేవుడు దాచిన– ట్రైటాన్ నదితో చుట్టబడిన (Triton river) నైసియన్ ద్వీపం (Nyseian island) లాంటిది కాదు;

అబాసిన్ (Abasin) రాజవంశస్థులు సదా కాపాడుకునే అమరా (Amara) పర్వతసానువుల్లో, ఇథియోపియన్ తీరాన (Ethiopian line) నైలస్ శిరస్సు (Nilus Head) అని పిలువబడే మెరిసే గుట్టల దగ్గర ఉన్న నందనోద్యానవనం – వీటన్నిటినీ తలదన్నే పారడైజ్ దివ్యానంద ఉద్యానవనంలో అనేక రకాల జంతు, వృక్ష, పక్షి సంతతిని చూసి సాతాను విభ్రమచెందాడు. వాటన్నిటినీ మించి నిటారుగా, పొడవుగా దేవదేవుని రూపంలో ఉన్న ఇద్దరు పూర్తి నగ్నంగా రాజఠీవితో నడుస్తూ, దివ్యకాంతితో అలరారుతూ వారి సృష్టికర్త కాంతులు వారిలో ప్రతిఫలిస్తుండగా, సత్యం, జ్ఞానం, పవిత్రత, స్వేచ్ఛ నిండిన వారి రూపాలు ఒకేరకంగా ఉన్నా, లింగభేదం వల్ల ఆకారాల్లో కొద్దితేడాలతో ఉన్నారు. శౌర్యప్రాక్రమాలు, ఆలోచనలు మూర్తీభవించిన రూపం ఆతడిది. సున్నితంగా, మృదువుగా, ఆకర్షణీయంగా ఉన్న లావణ్యవతి ఆమె. దేవుని కొరకు ఆతడు ఆతనిలో ఉన్న దేవునికి ఆమె! ఆతని విశాలవదనం, విలక్షణతను ప్రస్ఫుటించే నయనాలు పరిపూర్ణ అధికారాన్ని ప్రకటిస్తుండగా వంకీలు తిరిగి మనోహరంగా వేలాడుతున్న నీలారుణవర్ణ శిరోజాలు నుదుటిపై కదుల్తూ, భుజాలవరకు వ్యాపించి ఉన్నాయి. ఆమె శిరోజాలు బంగారు మేలి ముసుగులా భాసిస్తూ నడుంపై లయబద్ధంగా నాట్యం చేస్తుండగా శిరోజాల చివర్లు వంకీలు తిరిగి ద్రాక్ష తీగల్లా కదుల్తున్నవి.

కించిత్ బిడియం, కించిత్ గర్వం, కించిత్ ప్రేమభావాల మేళవింపుతో కూడిన నయగారాలతో ఇద్దరూ తమ దాచబడని జననేంద్రియాలతో నగ్నంగా, ప్రకృతి సహజ ధర్మాన్ని పాటిస్తూ పాపభావన లేని అమాయకత్వపు దైవత్వంతో ఒకరిచేతిలో మరొకరి చేతిని పట్టుకుని, దేవదేవుని, దేవదూతల సన్నిధిని కూడ, అలానే చూడముచ్చటగా ఆ దివ్య ఉద్యానవనంలో విహరించసాగినారు.

ఇరువురి చేతులు కలిసిన ప్రేమ చిహ్నంగా మానవులలో సచ్ఛీలుడైన ఆదాం (Adam), అందాలరాశియైన ఈవ్‌లు (Eve=అవ్వ) పచ్చని చెట్టునీడ క్రింద, జలధార ప్రక్కన కూర్చుని తోటపని వలన కలిగిన శ్రమను పోగొట్టుకునేందుకు జెఫిర్ (Zephyr) పడమటి గాలిని ఆహ్వానించినారు. వారి ఆకలి దాహాన్ని తీర్చేందుకన్నట్లుగా వంగిన పండ్ల కొమ్మలను మృదువుగా స్పృశిస్తూ, మెత్తని రంగుల తివాచీలా ఉన్న పచ్చికపై కూర్చుని చేతికందివచ్చిన మధుర ఫలాల్ని ఆస్వాదిస్తూ, పక్కనే ప్రవహిస్తున్న సెలయేటి స్వచ్ఛమైన జలాల్ని త్రాగుతూ, ఒకరిపై ఒకరు చిరునవ్వులు విసురుకుంటూ, వివాహ బంధంలో ఒదిగిన యువప్రేమ జంటగా సరస సల్లాపాలతో వినోదిస్తున్నారు. వారి పక్కనే స్వేచ్ఛగా తిరుగుతున్న వన్యప్రాణులు, సింహాలు, ఎలుగుబంట్లు, పులులు, అడవిపిల్లులు, చిరుతపులులు, ఏనుగులు అన్నీ శాంతియుత సహజీవనం గడుపుతూ ఉన్నాయి. గంతులు వేస్తున్న పులిపిల్లలు, తొండములను చాచి పూలగుత్తుల్ని దండలుగా నవదంపతులకు ఆందిస్తూ వినోదింపజేస్తున్న ఏనుగులు, బంగారపు దారాల కుబుసంతో మెలికలు తిరిగి కొమ్మకు చుట్టుకున్న సర్పం, పచ్చికపై పరుండి నెమరు వేస్తున్న జంతువులు, పశ్చిమ దిక్కున సముద్ర ద్వీపాల్లోకి అస్తంగతుడవుతున్న సూర్యుడు సాయంకాలాన్ని సూచిస్తూ ప్రత్యక్షమవుతున్న నక్షత్రాలు, వాటన్నిటినీ తదేక దృష్టితో చూస్తున్న సాతాను విస్మయంతో మాటలు రానివాడై, ఎట్టకేలకు తెప్పరిల్లినాడు.

"ఓ నరకమా! విషాదం నిండిన నా కళ్లు పరికిస్తున్న ఈ అద్భుత దృశ్యాలను చూడు! ఈ నూతన జాతి భూమిపుత్రులు ఏ విషయంలోనూ దైవకుమారులకు తీసిపోనివారు. నన్నే ఆశ్చర్యాంబుధిలో ముంచెత్తుతున్నవారు, ప్రేమించదగినవారు, దివ్యత్వంతో, హుందాతనంతో సజీవశిల్పాల్లా ఆ మహాశిల్పి చేతిలో ఒదిగి నిర్మించ బడినవారు, ఆ జంటను చూస్తే నీ మనసు, నీ దుష్టమనసు మారిపోవడంలేదా!

మనసా! ఆగు! దారిమళ్లకు! ఈ దివ్యానందపు తోటలోకి ప్రవేశించిన శత్రువు సత్తువ తక్కువదా! ఈ అందాలజంటను వశపరచుకుని, వారితో తిరిగి, నాతో వాళ్లు, వాళ్లతో నేను; నేనుండడం ఆ దేవదేవుడికెలాగూ నచ్చదుకదా! వాళ్ల సృష్టికర్త వాళ్లకు స్వర్గాన్నిచ్చాడు కదా నేను నరకాన్నిస్తాను. నరకద్వారాలను ఆసాంతం తెరచి వీళ్లని ఆహ్వానిస్తాను. అక్కడి ప్రభువుల్ని ఇక్కడికి పంపి, ఈ అందాలజంట

సంతానానికి, వాళ్ల తరతరాల వారసుల మధ్య నిలిపి నా పగ ప్రతీకారాలు చల్లారేలా నా యుక్తులు నేను పన్నుతాను.

మీ అమాయకత్వానికి, స్వచ్ఛమైన ప్రవర్తనకు నా మనసు కరిగినా, కరగకపోయినా మా తిరగబడ్డ దేవతల గౌరవ ప్రతిష్ఠలకు, మా నరకలోక సామ్రాజ్య పెంపుదలకు ఈ ఆనందలోకాన్ని ఆక్రమించుకొనక తప్పదు.

– సాతాను అలా మాట్లాడుకుంటూ తాను కూర్చున్న జీవవృక్షం పైనుంచి కొర్మోరాంట్ పక్షిలా ఎగుర్తూ ఆడుకుంటూన్న జంతువుల మధ్యలో వాలి, తానూ ఒక చతుష్పాద జంతువుగా మారి, అటుయిటూ తిరుగుతూ రూపాలు మారుస్తూ, తన ఎరకు దగ్గర్లో ఉంటూ, వాళ్ల ప్రవర్తనను మాటలను వినే ఉద్దేశంతో ఒకసారి సింహంలా, మరోసారి పులిలా రూపు మార్చినాడు. ఆ క్రూరవ్యాఘ్రం వీలుచిక్కితే అక్కడ చెట్లనీడన సేదదీర్తున్న ఆ అమాయకపు లేళ్లజంటను అమాంతంగా ఎత్తుకుపోయేంత దగ్గరకు వచ్చి, ఆదిమానవ జంట ఆదాం, ఈవ్‌ల సంభాషణను ఆలకించసాగినాడు.

"ఈ సమస్త ఆనందాలకూ, సంతోషాలకూ భాగస్వామివై వీటన్నిటికన్నా ఎక్కువైన నా ప్రియతమా! మట్టినుంచి మనల్ని సృజించి, పరమానందకరమైన ప్రపంచాన్ని, మంచితనాన్ని, స్వేచ్ఛను మనకు ప్రసాదించిన ఆ దేవదేవుడు మనల్ని ఈ ఫలపుష్పశోభితమైన తోటలోని సమస్త ఫలాల్ని తినవచ్చును కాని ఒక్క జ్ఞానవృక్ష ఫలాల్ని (Tree of Knowledge) మాత్రం అంటుకోరాదని ఆజ్ఞాపించినాడు. జీవవృక్షం పక్కనే మృత్యువృక్షం ఉండడం – అయినా ఆ మృత్యువు ఎలా ఉంటుందో మనకు తెలీదు కదా! బహుశా భయంకరంగా ఉండవచ్చు. ఆ ఫలాల్ని రుచిచూస్తే మరణదండన తప్పదని దేవదేవుడు హెచ్చరించినాడు. అది మన విధేయతకు పరీక్ష. మనకు కట్టబెట్టిన అనేక శక్తులు, సకల భూచర, ఖేచర, జలచరాలపై ఆధిపత్య అధికారాలూ, వీటన్నిటితో బాటు ఉన్న ఏకైక ఆంక్ష అదే. కాబట్టి మనకు ఎంత కోరిక ఉన్నా ఆ వృక్షఫలాన్ని తినే ఆలోచన మన దరిదాపుల్లో రారాదు. మనం ఆ దేవదేవుని సృష్టిని స్తుతిస్తూ, ఆయన మహిమను కొనియాడుతూ, మనకు అప్పగించిన బాధ్యతలైన ఫలపుష్పవృక్షాల్ని పెంచుతూ ఈ దివ్యానందపు తోటలో సుఖిద్దాం!"

ఆదాం మాటలను విని ఈవ్ ఈ విధంగా బదులు పలికింది.

"ఎవరికోసం, ఎవరి నుంచి, శరీరంలో శరీరమై జనించానో, ఎవరు లేకుండా నేను లేనో, నాకు శిరస్సులాంటివాడివి, నా మార్గదర్శి అయిన నా ప్రాణమా! నీవు చెప్పినది సరైనది, ఉత్తమమైనది! మన కృతజ్ఞతలు, స్తుతి ప్రార్థనలు ఆ దేవదేవునికే చెందుతాయి. నీ సహచరిగా సహవాసినిగా నేను పొందుతున్న ఆనందాన్ని

వర్ణించడానికి మాటలు చాలవు. ఆరోజు నాకింకా గుర్తే. నిద్రనుంచి లేచి పూలనీడన నన్ను నేను గమనించుకొని– 'ఎవరు నేను? ఎందుకిక్కడ ఉన్నాను?' అని ఆశ్చర్యపోతున్నపుడు పక్కనే సెలయేటి నీటి గలగలలు, ఓ కొండ గుహ నుంచి వస్తున్న ఆ నీటిప్రవాహం, దాన్ని అనుసరిస్తూ నేనూ ఆ పచ్చని గట్టుమీదుగా నడుస్తూ స్వచ్ఛమైన నీటితో నిండిన ప్రశాంత సరోవరాన్ని, ఆకాశాన్ని ప్రతిబింబిస్తూ మరో నీలాకాశంలా కనపడుతున్న ఆ సరస్సులోకి చూస్తున్నపుడు నాకెదురుగా మరో నాలాంటిరూపం, ప్రతిబింబం కనిపించి భయంతో నేను వెనక్కి తగ్గగానే, ప్రేమతో, ఆరాధన ఉట్టిపడ్తున్న ఆ రూపమూ మాయమయ్యింది. నా కళ్లు ఆర్తితో అక్కడే అతుక్కుపోయి నప్పుడు, నన్ను నీవేకదా హెచ్చరించినది,– 'చూడూ! అది ప్రతిబింబం! నీ రూపమే! నీవు వస్తే వస్తుంది. నీతోనే వెళ్లిపోతుంది. నీవు నన్ను అనుసరించు. నీడలు నిన్ను వెంబడించని ప్రదేశానికి నిన్ను నేను తీసుకువెడతాను'. – అని నీవు– నన్ను రమ్మని పిలిచావు. 'నాతోరా! నన్ను కౌగలించుకో! ఎవరి రూపానివో నీవు అతనితోనే విడిపోని బంధంతో నీలాంటి సంతానానికి జన్మనిద్దువుగాని. అదే మానవజాతిగా నీవు మానవ జాతికి అమ్మగా, అవ్వగా, ఈవ్‌గా పిలువబడుతావు'– అని నీవన్నప్పుడు నేను నీ మాటలు వినబడుతున్న చోటుకువచ్చి నిన్నుచూసి నీకన్నా నీటిలోని నా ప్రతిబింబమే అందంగా, సున్నితంగా, ప్రేమగా ఉన్నదని భావించి మరల అటుపోబోయాను. అప్పుడు నీవు అరిచావు– 'వెనక్కిరా ఓ అందాల ఈవ్! ఎక్కడికి పారిపోతున్నావు? ఎవర్ని వదిలి మిథ్యాబింబాలవేపు మరలుతున్నావు! నీవు ఎవరి శరీరంలో భాగమో, ఎవరి అస్థిమాంసాల్లో భాగమో, నిన్ను రూపొందించడానికి ఎవరి హృదయానికి దగ్గర్లో ఉన్న శరీరభాగాన్నే అర్పించవలసి వచ్చిందో అతడైన నన్ను వదిలి వెళ్లాలనుకుంటున్నావా! నా పక్కన ఉండి నా హృదయానికి స్వాంతన కలిగించి, నా ఆత్మలో భాగానివై నాలో సగభాగానివై నీ సుకుమారమైన హస్తాన్ని నాకందించు'– అన్నప్పుడు ఆనాటి నుంచి నేను నీ సహచరినై అందానికి, జ్ఞానం ఆలోచనలు తోడురాగా వచ్చే ఆనందాన్ని గ్రహించాను"

అలా మనందరి మాత అవ్వ, ఈవ్ అరమోడ్పు కళ్లతో ప్రేమ పారవశ్యంతో ఆదిపిత అయిన ఆదాంపై ఒరిగినప్పుడు, బంగారు శిరోజాల తెరవెనుక దాగిదాగని పాలిండ్లు ఆతనికి తాకి గిలిగింతలు పెట్టగా, ఆతడు ఆ అపురూప లావణ్యవతి అందానికి, ఆకర్షణకు ముగ్ధుడై చిరునవ్వులు రువ్వినాడు. జూపిటర్ (Jupiter) దేవుడు చిరునవ్వులు చిందిస్తూ జునో (Juno) దేవతపై వాలగా మేఘాలనుంచి మేపుష్పాలు (May flowers) కురిసిన తీరుగా, – ఉన్న సందర్భాన ఆదాం ప్రేమతో ఈవ్ పెదాలను చుంబించినాడు. వారిద్దరి మధ్య ఉన్న అవ్యాజమైన ప్రేమను గాంచిన

సాతాను అసూయతో ఉడికిపోతూ వారిపై ద్వేషపు దృక్కులను నిలిపి తనలో తాను మధనపడసాగినాడు.

"ఏమిటీ దృశ్యం! నాకు మనస్తాపాన్ని కలిగిస్తూ, ద్వేషాన్ని రగిలిస్తూ ఏమిటీ విశృంఖల విన్యాసం! ఈ యిద్దరు శృంగారాభిలాషులై ఒకరిచేతుల్లో ఒకరు ఇమిడిపోతూ ఏవిటా చేష్టలు! ఈ దివ్యానందపు ఈడెన్‌లో వాళ్లిద్దరూ సంతోషానంద సుఖాలపై సుఖాలు జుర్రుతుంటే నేను నరకంలో నరకాన్ని అనుభవిస్తూ, ప్రేమ, ఆనందాలు కానరాక, భయంకరమైన కోరిక దావానలంలా కాల్చివేస్తుండగా బాధలు మరింత పేట్రేగి నన్ను బాధిస్తున్నా – ఒకే ఒక్క విషయం – ఇప్పుడే నేను వాళ్ల నోటినుండే విన్న సంగతి నా వీనులకింపుగా తోస్తున్నది. ఈ ఆనందలోకంలో నాకు కొంత ఆటాడే అవకాశం – అదే మృత్యువృక్షం! జ్ఞానవృక్షం పేరున (Tree of Knowledge), వాళ్లకు నిషేధించబడి, నాకు అవకాశాన్నిస్తున్నది. జ్ఞానం నిషేధించబడడమేమిటి? ఏదో గొడవ ఉంది దీంట్లో! ఏదో అనుమానించదగిన విషయమున్నది! కారణం లేదా? ఎందుకు వాళ్ల సృష్టికర్త ఆ నిబంధన నిర్ణయించాడు? తెలుసుకోవడం పాపమా! అది మృత్యువా! అజ్ఞానమే వాళ్ల ఆనందానికి కారణమయితే వాళ్ల విధేయతకు, విశ్వాసానికి ఋజువు వాళ్లు జ్ఞానఫలాన్ని రుచిచూడకుండా ఉండడమేనా! ఆహా!

ఇప్పుడు వాళ్లలో నేను నా మాటలతో ఇంకా తెలుసుకోవాలనే కోరికను రగిలిస్తాను. జ్ఞాన సముపార్జన వాళ్లని దేవుళ్లతో సమంగా చేస్తుంది కనుక అందుకే వాళ్లకు జ్ఞానవృక్షపు ఫలాస్వాదన నిషేధించబడిందని వాళ్ల చెవుల్లో ఇల్లుకట్టుకుని మరీ నూరిపోస్తాను. ఒక్కసారి వారిలో కోరిక రగిలితే వాళ్లే ఆ జ్ఞానఫలాన్ని రుచిచూడ ఉవ్విళ్లూరతారు. అదే వారికి మృత్యు మార్గమవుతుంది. ముందుగా నేను ఈ తోట అంతా తిరిగి, ఏ మూలా శోధించకుండా వదలక, ఎవరైనా దేవదూత కనిపిస్తే కొంత సమాచారాన్ని ఏదో ఒక ఉపాయం చేత రాబట్టుతాను. ఓ నవయువతీ యువకుల్లారా! ఆనందించండి! ఇంకెంత కాలం మీకీ ఆనందక్షణాలు! నేను తిరిగి వచ్చాక స్వల్పకాల సుఖాలదృశ్యమై, దీర్ఘయుగాల కష్టాలు చుట్టుముట్టును గాక! ఈ కాసింత సమయమైనా ఆనందపారవశ్యంలో మునిగితేలండి!"

అతడలా అనుకుంటూ దుంగల మీదుగా, వృధా పదార్థాల మీదుగా, గుట్టల మీదుగా, కాలువల మీదుగా తిరుగుతూ శోధిస్తున్న సమయంలోనే పడమట భూమి సముద్రాలు కలిసే చోట సూర్యుడు అస్తమిస్తూ పారడైజ్ (Paradise) తూర్పుద్వారం వైపు సాయం కిరణాలను విరజిమ్మినాడు. కిరణాలకాంతిలో ఆ అలబ్లాస్టర్ రాతిగుట్ట (Alablaster Rock) మబ్బులను అందుకుంటూ పైకెక్కడానికి వీలులేని విధంగా ఉండి, ఒక్క అంతస్థు మాత్రం నేలపై నుంచి వెళ్లగలిగినట్లున్నది. ఆ రాతిస్తంభాల

మధ్య దేవదూతల నాయకుడు గాబ్రియేల్ (Gabriel), పగలంతా స్వర్గలోకపు యువత నిరాయుధులై తన ముందు యుద్ధవిద్యలు ప్రదర్శించి వెళ్లగా, చీకటి పడ్తున్నపుడు దివ్య కవచాలు, శిరస్త్రాణాలు, బల్లేలు, డాళ్లు స్వర్ణమణిమయమై కాంతులు విరజిమ్ముతున్న వాటిని ధరించి రాత్రి పహారా దేవదూతలు వస్తున్న సమయంలో సాయం సూర్యకిరణంపై అతివేగంగా యురియెల్ (Uriel) దేవదూత, వేగుచుక్కలా గాబ్రియేల్ (Gabriel)ను సమీపించినాడు. శరదృతువు రాత్రివేళ వెలుగులు విరజిమ్ముతూ దిక్సూచితో దిక్కులు గణిస్తున్న నావికునికి తుఫాను గాలుల హెచ్చరిక చేస్తున్న తోకచుక్కలా, యురియెల్ గాభరాగా గాబ్రియేల్ దగ్గరకు వచ్చాడు.

"గాబ్రియేల్! నీ విద్యుక్తధర్మం ఎవరూ ఈ కొత్తలోకంలోకి ప్రవేశించకుండా పహారా కాయడమేనని నాకు తెలుసు. ఈ మధ్యాహ్నం నేనున్న సూర్యకక్ష్యలోకి ఓ దివ్యాత్మలా అగుపించిన దేవదూత దేవదేవుని సృష్టిని శ్లాఘిస్తూ, మానవుడి, ఆతడున్న ప్రదేశపు వివరాలను అడిగినాడు. నేను ఆతనికి సమాధానమిచ్చిన వెంటనే ఇటు వేగంగా వచ్చి ఆతడు ఈడెన్‌కు ఉత్తరాన ఉన్న పర్వతశిఖరంపై వాలగానే ఆతని రూపస్థితుల్లో ఏదో వికృతమైన మార్పు కనిపించగా, నా చూపులు ఆతడిని వెంటాడుతుండగానే ఆతడు ఈ చుట్టుపక్కలనే అదృశ్యమైనాడు. అతడు ఖచ్చితంగా స్వర్గచ్యుతుడైన దేవదూత అని నా అనుమానం. బహుశా నరకలోకపు అగాధం నుంచి ఏవో కొత్తచిక్కులు తెచ్చే దుష్టతలంపుతో అతడు ఇక్కడికి వచ్చి ఉంటాడు"

యురియెల్ వివరణకు సమాధానంగా గాబ్రియెల్ అన్నాడు.

"యురియెల్! నీ నిశిత దృష్టి గురించి మాకందరికీ అవగతమే! ఈ తూర్పుద్వారం నుంచి నా కన్నుగప్పి ఎవరూ లోనికి పోలేరు. ఏదైనా దుష్టశక్తి అటువేపు నుంచి కంచెదూకి లోపలికి వచ్చి ఎక్కడ, ఏమూల దాక్కున్నా రేపు ఉదయానికల్లా నాకు తెలిసితీర్తుంది"

గాబ్రియెల్ సమాధానంతో సంతృప్తిపడిన యురియెల్ సూర్యకిరణాలపైన పయనిస్తూ అజొరెస్ (Azores) వేపు అస్తమిస్తున్న సూర్యుని కక్ష్యలో అదృశ్యమయ్యాడు. స్వర్ణధూమ్ర వర్ణాలతో వెలుగుతున్న మబ్బులతో సాయంకాలం మసకచీకటిని ఆహ్వానిస్తోంది. పశుపక్ష్యాదులు తమ తమ నెలవులకు పోయి నిశ్శబ్దంలో ఒదిగిపోయాయి. ఒక్క నైటింగేల్ మాత్రం రాత్రంతా ప్రేమగీతాలు పాడేందుకు సిద్ధమవుతున్నది. అంతరిక్షంలో నీలమణులు ప్రకాశిస్తుండగా, హెస్పెరెస్ (Hesperus – శుక్రగ్రహం) సంధ్యాతారలా కాసేపు కాంతివంతంగా రాజ్యమేలినాక, మబ్బుల పల్లకిపై వచ్చిన చంద్రిక వెన్నెలలు విరజిమ్ముతూ చీకటిలోకంపై తన వెండి వస్త్రాన్ని సున్నితంగా ఆవరింపజేసింది.

ఆదాం తన ప్రియసఖి ఈవ్‌తో అంటున్నాడు– "ప్రియసతీ! సమస్త జీవకోటి విశ్రాంతి తీసుకునే రాత్రి సమయం వచ్చింది. దేవదేవుడు జీవులకు శ్రమ – విశ్రాంతిని, పగలు–రేయిని మరునాడు నూతనోత్తేజంతో ఉండేందుకు ఇచ్చి అనుగ్రహించినాడు. మన కనురెప్పలు శ్రమభారంతో ఒదిగి మూతలు పడ్తున్నవి. మిగతా జీవులకన్నా మనకు ఎక్కువ నిత్యశ్రమ, విశ్రాంతులను భగవానుడు నిర్దేశించినాడు. వాటి కార్యకలాపాలను ప్రకృతి సహజసిద్ధంగా భావిస్తూ, మనసున్న మానవులమైన మన ప్రవర్తనను ఆతడు అన్నివేళలా గమనిస్తూనే ఉంటాడు. మనం రేపు తెల్లవారు ఝాముననే, సూర్యకిరణాలు తూర్పు ద్వారాన్ని తాకేసరికే, తోట పని మొదలెట్టి, పూలమొక్కలను, పచ్చని కాలిబాటలను సంస్కరిద్దాం. చెట్ల కొమ్మలు విపరీతంగా పెరుగుతూ దారులను మూసివేస్తూ, ఆ పళ్లచెట్లు, ఈ సుగంధ జిగురు వృక్షాలు, అడ్డదిడ్డంగా పెరిగి వన సౌందర్యాన్ని పాడు చేసేట్లున్నవి. రేపు ఆ పని పూర్తిచేయాలంటే మనకు ఈరాత్రి విశ్రాంతి అవసరం"

అందాలరాశి ఈవ్ అతనిపై ఆరాధనగా చూస్తూ సమాధానమిచ్చింది–

"నా జీవన విధాతా! నీవేంచెబితే దానిని నేను మారుమాటాడకుండా అమలు చేస్తాను. దేవదేవుని ఆజ్ఞ ఏదయితే దాన్నే నీవు పాటిస్తావు. నేనూ అంతే! అంతకు మించి తెలుసుకోకపోవడం స్త్రీకి ధర్మం మరియూ గౌరవమూనూ! నీతో ఊసులాడుతూ ఉన్నపుడు కాలం, ఋతువులు మారుతున్న సంగతే మరచిపోయి, అన్నీ ఆనందకరమైన విషయాలుగా తాదాత్మ్యం చెందుతాను. ప్రాతఃకాలపు సురుచిర పవనాలు, పక్షుల కిలకిలా రావాలతో ఉదయసూర్యుణ్ణి ఆహ్వానిస్తున్నపుడు, ఆతడు తన ప్రకాశవంతమైన కిరణాలను ఫలపుష్పభరిత తరుగుల్మలతాదులపై ప్రసరింపచేస్తుండగా, మట్టిగంధపు పరిమళాలు, పచ్చికపై వెండిముత్యాల్లా మెరుస్తున్న మంచుబిందువుల తళతళలు, మనసునెంతో ఆహ్లాదపరుస్తాయి కదా! ఉదయకాలం మధ్యాహ్న సమయం నుంచి నెమ్మదైన సాయంకాలమై నిశ్శబ్దరాత్రి రాగా నైటింగేల్ ఆలాపనలు, చంద్రిక సోయగాలు, తారామణిహారాలతో ప్రకాశిస్తున్న ఆకాశపు సొబగులు ఎంత అద్భుతంగా ఉంటాయీ దృశ్యాలు! అయినా కనులు మూతపడి, నిద్రలోకి ఒరిగాక ఇన్ని సుందర దృశ్యాలు ఉండీ, చూడలేనప్పుడు ఏమిటీ ప్రయోజనం!"

ఆదాం బదులిచ్చాడు– "దేవునికీ, మానవునికీ తొలి పుత్రికా! సమర్థురాలవైన ఈవ్! ఆ దివ్య గ్రహాలకు నిర్దేశించిన కాలగమనం ప్రకారం అవి భూమిచుట్టూ పరిభ్రమిస్తున్నట్లుంటాయి. నూతన లోకాలకు, రాజ్యాలకు వెలుగుచీకట్లనిస్తూ రాత్రింబవళ్లను కాంతిమయం చేసే దివ్యదీపాలవి. వెలుగునే కాక వేడిమినీ సమస్త ఔషధులనూ ఇచ్చేప్పుడు తమ కిరణాలను కోల్పోతూ అవి మానవులతోపాటు సమస్త

జీవరాశులకూ మిత్రులుగా, దిక్సూచిగా వ్యవహరిస్తాయి. దేవదేవుడు వాటిని మన మెప్పుకోసమో ప్రేక్షకుల కోసమో కాదుకదా సృష్టించింది! మనం మెలకువగా ఉన్నప్పుడు, నిద్రిస్తున్నప్పుడూ, మిలియన్లకొద్దీ జీవరాశులు, దృగ్గోచరం అయ్యేవీ, కానివీ రాత్రింబవళ్లూ సృష్టికర్త ఘనతను కీర్తిస్తూ జీవిస్తూ ఉంటాయి. ఎన్నోసార్లు కొండకొమ్మలకు, దట్టమైన వృక్షసంతతులకు తగిలి ప్రతిధ్వనిస్తూ వినబడే దివ్య స్వరాలను మనం ఆశ్చర్యంతో విన్నాముకదా! గుంపులు గుంపులుగా ఎగుర్తూ, నేలపై కదుల్తూ స్తుతిస్తూ చేసే సామూహిక గానాల సుమధుర గీతాంజలి ఆ దేవదేవుని ఉద్దేశించే కదా! ఆ అపాత మధురమైన గీతాలే కదా మన ఆలోచనల్ని దివ్యలోకం వేపు మళ్లించేవి"

అలా మాట్లాడుకుంటూ వాళ్లు పరస్పర కర స్పర్శలతో తన్మయులౌతూ, ఇద్దరూ ఒక్కరుగా నడుస్తూ తమకు దేవదేవుడు నిర్దేశించిన దివ్య నివాసానికి వెళ్లినారు. లారెల్, మిర్టెల్ (Laurel and Mirlte) తమాలవృక్షపు సుగంధ పత్రచ్ఛాయన, మనోహరంగా ఉండే అకాంథస్ (Acanthus) గుల్మాలు ఇరువేపులా కావలి కాస్తున్నట్లు, కంచెలా ఉండగా, ఇంద్ర ధనుస్సులోని సమస్త వర్ణాలను దీప్తించే పూలు విరిసిన 'ఐరిస్' (Iris) మొక్కలు, గులాబీలు, గెస్సామిన్‌లు పూలగుత్తులతో అందమైన మొజాయిక్ (Mosaic)లా ఉన్న తరు నిర్మిత గోడలు, వయొలెట్, క్రొకస్, హయాసింథ్ (Violet, Crocus, Hyacinth) మొక్కల నీలి, కుంకుమ, నీలారుణ వర్ణాలతో, నిగనిగలాడ్తున్న పుష్పాలతో, పట్టు తివాచీలా, ప్రశస్తమైన శిలాసోపానంలా, అత్యంత విలువైన లాంఛనాలకన్నా సుందరంగా ఉన్న నేల, ఏ పశుపక్ష్యాదులూ, క్రిమికీటకాలూ చొరరాని అద్భుతప్రదేశం వారికి దేవదేవుడొసగిన నివాసం అది.

అటువంటి అద్భుతస్థలంలో ఇంతవరకూ పాన్ (Pan) దేవుడు కాని, సిల్వానస్ (Silvanus) కాని, అప్సరసలు (Nymphs) కాని, వనదేవతలు (Faunas) కాని నివసించిఉండరు. ఆ పూలపొదరిల్లులో పూలదండలు, సుగంధ భరితమైన లతాపత్రాలతో ఈవ్ తాము శయనించేందుకు పూలపాన్పును, దివ్యగీతాలు స్తోత్రాలు వీనులకు విందు చేస్తుండగా అత్యంత నైపుణ్యంతో అమర్చుకున్నది. అపురూప లావణ్యవతి అయిన ఈవ్ (Eve) దేవతలందరి కానుకలతో సర్వాంగ సుందరంగా రూపొందిన పండోరా (Pandora) కన్నా అందంగా ఉన్నది. జోవ్ (Jove) దేవుని అగ్నిని దొంగిలించి మానవులకిచ్చిన టాఫెట్ కుమారుని (Taphet) పై ఆగ్రహంతో జోవ్ (Jove) పంపగా హెర్మెస్ (Hermes) తీసుకువచ్చిన 'పండోరా' రూపలావణ్యాలు 'ఈవ్' కాలిగోటికి సరిపోలవు.

అంతటి సౌందర్యరాశి 'ఈవ్' తన సహచరుడు 'ఆదాం'తో కలిసి వారి శయ్యాగృహమున్న అందాల పొదరిల్లు వద్దకు వచ్చినది. ఈ ఆకాశం, అగ్ని, వాయువు,

భూమి, స్వర్గాన్ని సృష్టించి, సూర్యచంద్ర నక్షత్రకాంతులతో పగలురేయిలను కాంతివంతం చేసిన ఆ సర్వశక్తిమంతుడైన భగవంతునికి వారు అంజలి ఘటించారు– "ఓ ప్రభూ! మాయిద్దరి మధ్య ఇతోధికమైన పరస్పర ప్రేమను, సఖ్యతను నెలకొల్పి మాకు పరమానందకరమైన జీవితాలనిచ్చినావు. నీ ఆజ్ఞతో పరిఢవిల్లిన ఈ సుందర ప్రదేశము అతి విశాలమై ఒక మహా జనసమూహానికి అనువైనదిగా ఉన్నది. మీరు మాకిచ్చిన మాటననుసరించి రేపు మా ద్వారా జనించబోయే మానవతెగ అసంఖ్యాకంగా వృద్ధి చెంది తమ గుణగానము చేయగలరు. తండ్రీ! మా ప్రార్థనను స్వీకరించండి! మాకు కానుకగా మంచి నిద్రను ప్రసాదించండి."

అలా ప్రార్థిస్తూ వాళ్లు భగవానునికి అత్యంత ప్రియమైన పూజలు కావించి – మనం పటాటోపాలుగా ధరించే ఉడుపులేవీ వారి శరీరాలపై లేవు కనుక – వారు మూర్తీభవించిన ప్రేమస్వరూపులై ఏకశయ్యాగతులైనారు.

వంచకులు, దంభాచారులు, దైవకార్యాన్ని పాపకార్యంగా, నిర్మలమూ, స్వచ్ఛమూ, అమాయకత్వమూ అయినవాటిని కలుషితంగా, కొంతమందికి వాటిని నిషేధించి, ఎక్కువమందికి అనుమతిస్తారు. మన సృష్టికర్త ప్రేమజీవితాన్ని అనుమతించగా, దేవమానవుల విరోధి సాతాను వాటిని నిషేధించేవేపు అడుగులు వేస్తాడు. భగవంతుడు నిర్దేశించిన మార్మిక న్యాయం, వైవాహిక శృంగారం సద్గుణులైన సంతానోత్పత్తికి దారితీస్తుంది. వ్యభిచారపూరిత కాముకత్వం పాపభూయిష్ట ప్రజోత్పత్తికి ఆలవాలమౌతుంది. విచక్షణ, విధేయత, న్యాయం, స్వచ్ఛత, బాంధవ్యాలు, దయ, స్నేహభావం తండ్రి, బిడ్డ, సోదర భావాలను పెంపొందిస్తాయి. కాని కొందరు సృష్టికార్యం, పాపకార్యంగా భావించి బ్రహ్మచర్యాన్నవలంబించి సాధుసంతులుగా జీవిస్తారు. నిజమైన ప్రేమలోకంలో ఈ నిరోధాలుండవు. దేవుని కరుణ అనే సువర్ణ బాణాలు, ప్రేమతో నిండిన అమ్ములుగా, ఆతని దివ్యకాంతి నుంచి గైకొన్న ప్రేమదీపాలుగా, ఉదారంగు రెక్కలతో ఎగుర్తూ అంతా రాజ్యమేలుతున్నప్పుడు చిరునవ్వుల వెన్నెలలు విరిసి జగమంతా మోహనరాగమే కదా! ఆ చిరునవ్వులు డబ్బిచ్చి వెలయాళ్ల దగ్గర కొనుకున్న జీవంలేని, ప్రేమలేని, పెదాలపై అతకని చిరునవ్వులులా ఉండవు. అవి రాజదర్బారులలోని సామూహిక నృత్యాలలో, అర్ధరాత్రి నాటక ప్రదర్శనల్లోని విశృంఖల వినోదాల్లానో, విరహ గీతాలు పాడుతూ ప్రేయసిని తనవేపు తిప్పుకోడానికి మూర్ఖప్రేమికులు చేసే ఆలాపనల్లానో ఉండవు.

అందాల పూల పొదరిల్లులో ఆదాం ఈవ్‌లు నిద్రిస్తున్నపుడు, నైటింగేల్ పక్షులు తమ మధురగానాన్ని విరమించి నిశ్శబ్దాన్ని ఆహ్వానించినాయి. గులాబీపూలు

తమ రెక్కల్ని నగ్నప్రేమికులపై విరజిమ్మి దుప్పటికప్పగా చంద్రికాకాంతులు మనోహరంగా ఆ పొదరింటిని రజత హర్మ్యంగా మార్చివేసినవి.

"నిదురపో! హాయిగా! ప్రేమకు ప్రతిరూపమా!
దైవ కరుణ చవిగొన్న మానవజాతి దీపమా!"

అలా ఇరువురూ ఒకరైన ఆదిదంపతులు ఆదమరచి నిద్రిస్తున్నారు. ఆ దివ్యవన రక్షకుడైన గాబ్రియేల్ (Gabriel) రాత్రి పహారాదళంను యధావిధిగా సమావేశపరచి ఈ విధంగా పలికాడు.

"యుజ్జియేల్! ఈ దళానికి నాయకుడివి నీవు. సగంమందిని దక్షిణంవేపు, సగం మందిని ఉత్తరంవేపు పంపు! డాలూ, బల్లెం, యోధుడికి ఎలా రక్షణ ఇస్తాయో, అలా వీళ్లు అత్యంత జాగరూకతతో పహారా కాయాలి"

ఆ వీరుల్లో బలిష్ఠంగా ఉన్న ఇద్దరిని పిలిచి గాబ్రియేల్ ఆజ్ఞాపించాడు– "ఇథురియెల్ (Ithurial), జెఫాన్ (Zephon)! మీరిద్దరూ వాయువేగంతో, తోటలోని ఏమూల వదలకుండా వేయికళ్లతో వెదకాలి. ముఖ్యంగా ఆ అందాలజంటకు ఏ ఆపదా రాకుండా అత్యంత జాగ్రత్తగా కాపలా కాయండి. సూర్యుని కక్ష్యలో ఉండే దేవదూత ఇచ్చిన సమాచారం ప్రకారం నరకకూపం నుంచి తప్పించుకున్న ఓ దుష్టాత్మ ఏదో చెడుతలంపుతో మన వనంలోనికి ప్రవేశించిందని అనుమానం!"

అలా చెప్పి వాళ్లను పహారాకు పంపివేశాడు.

పొదరింటివేపు వెళ్లిన పహారాభటులకు కప్పలా 'ఈవ్' చెవివద్ద చేరి భ్రమను, స్వప్నాలను, అనహజమైన భ్రాంతులను, విషపూరితమైన ఆలోచనలను, మృగవాంఛలను, దుష్టతలంపులను, పనికిరాని ఆశలను, తుచ్ఛ కోరికలను, నిరర్థకమైన గమ్యాన్ని ప్రేరేపిస్తూ వాటికి చేదోడు వాదోడుగా ఉండే అహంకార గర్వాల్ని అతిశయింప చేస్తున్నట్లున్న ఆ దుష్టజీవిని ఇథురియెల్ (Ithurial) తన దివ్యబల్లెంతో స్పర్శించినాడు. ఆ బల్లెపు స్పర్శకు ఉలిక్కిపడి నైట్రస్‌పొడి (Nitrous powder) గుట్టకు నిప్పుకణిక తగిలినప్పుడు అది విస్ఫోటనం చెంది నలుదిక్కులకు మంటల్ని విరజిమ్మినట్లై, ఆ దుష్టాత్మ తన నిజస్వరూపంలోకి మారగా, విభ్రాంతులైన ఆ దేవదూతలు తేరుకుని ఏమాత్రం తొణక్కుండా ఆ నరకలోకపు సామ్రాట్టును నిలదీశారు.

"ఎవరు నీవు? నరకంలో పడివుండాల్సిన నీవు ఈ మారురూపంలో ఇక్కడేం చేస్తున్నావు? ఆమె చెవి దగ్గర చేరి నీవు చేస్తున్న దుష్కర్మ ఏమిటి?" అడిగారువాళ్లు.

వాళ్లను అత్యంత తిరస్కారంగా చూస్తూ 'సాతాను' అన్నాడు.

"నేనెవరో మీకు తెలియదా? ఒకప్పుడు నేను మీకెవరికీ అందనంత ఎత్తులో ఉన్నవాణ్ణే! అయినా నా గురించి నీకు తెలియకపోవడమంటే నీ గురించి కూడా నీకు తెలియదన్నమాట. కాబట్టి నీకు చెప్పినా చెప్పకపోయినా ఒరిగేదేమీ లేదు"

జెఫాన్ (Zephon) అలక్ష్యాన్ని, అలక్ష్యంతోనే సమాధానమిస్తూ బదులిచ్చాడు– "చాల్చాలు తిరగబడ్డ దేవతా! నిన్ను నీవు చూసుకోముందు. స్వర్గంలో ఉన్నప్పుడు ఎంత స్వచ్ఛంగా దివ్యకాంతితో ఉండేవాడివో, ఇప్పుడెలా ఉన్నావో! నీలో మంచితనం, దివ్యత్వం అంతా పోయాక నీవుండే నరకకూపంలానే నీవూ వికృతంగా ఉన్నావు. అదంతా తర్వాత! ఇప్పుడు మాతో పాటు మా నాయకుడిదగ్గరకు నిన్ను తీసుకుపోతాము. నీ సమాధానం అక్కడ చెబుదువుగాని!" – ఆ యువ దేవదూత విలాసంగా, తననేమాత్రం లక్ష్యపెట్టకుండా, అజేయంగా కన్పించగా అతనిలో సుగుణాలే ఆతనికా కాంతిని ఇచ్చాయని గ్రహించిన సాతాను తాను కోల్పోయిన దానిని గ్రహించినాడు. అయినా చెక్కుచెదరకుండా అదే ఠీవితో తీవ్రంగా అన్నాడు. "నేను నీతో మాట్లాడను! మాటలైనా చేతలైనా సమఉజ్జీలతోనే తలపడడం నా పద్ధతి! దానివల్ల కీర్తి ఎక్కువ, నష్టం తక్కువ. జెఫాన్ (Zephon) అన్నాడు– "మంచిది. నీభయం, పిరికితనం, మోసం ఇప్పుడు బలప్రయోగం అవసరం లేకుండా చేసాయి! పద! నిశ్శబ్దంగా!"

విపరీతమైన ఆగ్రహం వచ్చినా సాతాను తమాయించుకున్నాడు. కళ్లేలువేసి కదలకుండా పట్టుకున్న జవనాశ్వంలా బుసలుకొడుతూ ఆతడు ఆ పహారాభటులైన దేవదూతల ననుసరించాడు. వాళ్లు పడమటిదిక్కుగా గాబ్రియేల్ (Gabriel) ఉన్నవేపు వెళ్తుండగా ఆతని కంఠస్వరం బిగ్గరగా వినిపించింది.

"మిత్రులారా! నేను మీ అడుగుల చప్పుడు గమనించి ఆగాను. ఇథురియెల్ (Ithuriel), జెఫాన్ (Zephon) తమ మధ్య వన్నెతగ్గినా పొగరు తగ్గని... బహుశా... నరకలోకపు రాకుమారుడు కావచ్చును... జాగ్రత్త... ఆతని కళ్లల్లో అవిధేయత కొట్టవస్తున్నది. ఇటురండి"

వాళ్లు ఆతనిని సమీపించి జరిగిన సంగతి విన్నవించారు. గాబ్రియేల్ ప్రశ్నించాడు– "ఎందుకు నీవు విధించిన సరిహద్దులను దాటి వేరే లోకంలోకి ప్రవేశించి ఇక్కడి వారికి ఇబ్బందులను కలుగజేస్తున్నావు? ఇక్కడ నిద్రిస్తున్నవారికి, దైవరక్షణలో ఉన్నవారికి ఏమి అపాయం చేయబూని ఇక్కడకు వచ్చావు. సమాధానం చెప్పు!"

దానికి సాతాను భృకుటి ముడివడగా అన్నాడు– "గాబ్రియేల్! నేను స్వర్గంలో ఎటువంటి జ్ఞానంలో ఉన్నానో ఇప్పుడూ అలానే ఉన్నాను. కాని, నీ ప్రశ్న నాలో

సందేహాన్ని రేకెత్తిస్తున్నది. బాధలో ఉన్నవాడు నరకం నుంచి శృంఖలాలు తెంచుకుని పారిపోయే స్వేచ్ఛ ప్రయత్నం లేకుండా ఎల్లకాలం అక్కడే పడివుండాలా? ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకుని నరకయాతనలకు దూరంగా ఉండే ప్రదేశం కోసం, ఓ ప్రశాంతమైన దేశం కోసం అన్వేషిస్తూ నేనిక్కడికి చేరుకున్నాను. మంచివాడివి నీకు మంచి మాత్రమే అర్థమవుతుంది. ఒకవేళ విజేతకు మమ్మల్ని ఆ చీకటికూపంలోనే మగ్గేలా చేయదల్చుకున్నట్లయితే నరకద్వారాల్ని ఇనుప తలుపులతో శాశ్వతంగా మూసివేయనీ! మీ భటులు చెప్పిందంతా నిజమే! వాళ్లు నన్నక్కడే పట్టుకున్నారు. నా మనస్సులో ఎవరికీ కీడు, అపకారం చేసే ఉద్దేశం లేదు"

అతని నిర్లక్ష్యాన్ని గమనించిన 'గాబ్రియేల్' నవ్వుతూ అన్నాడు "స్వర్గంలో దివ్యజ్ఞానాన్ని సమీక్షించే అర్హత ఉన్న దేవదూత... దేవదేవునిపై తిరగబడినందుకు, నరకలోకంలోకి నెట్టబడినా కారాగారం నుంచి తప్పించుకుని, మరో లోకంలోకి అనుమతిలేకుండా అడుగుపెట్టి, పైపెచ్చు అక్కడి రక్షకదళంపై కారాలు, మిరియాలు నూరుతున్నావంటే ఆతనికి దివ్యజ్ఞానం ఉన్నట్లా, లేనట్లా అని నాకు అనుమానంగా ఉంది. ఒకవేళ నరకబాధల్ని తప్పించుకోడానికి ఇంతదూరం ఎగిరివచ్చినా, మరలా నరకానికి పోయి ముందు నీ కోపాన్ని నీకున్న దివ్యజ్ఞానంతో ఉపశమింపజేసుకో, ఎందుకంటే ఏ ఘోరమైన బాధకూడా కోపానికి సమం కాదుకదా!

అయినా నీవొక్కడివే వచ్చావా! నరకలోకపు ప్రాణులంతా కట్టకట్టుకుని ఇక్కడకు దిగబడ్డారా! పరిస్థితి చూస్తే నీవొక్కడివే వచ్చినట్లున్నావు. బహుశా నీ బాధ వాళ్లకంటే చాలా రెట్లు ఎక్కువైనా అయి ఉండాలి! వాళ్ల బాధలు, కష్టాలు తక్కువ కాబట్టి వాళ్లు తప్పించుకునే ప్రయత్నం చేసి ఉండరు! అవునా! అందరికి నరకబాధ తీవ్రంగా ఉండిఉంటే నీవొక్కడివే ఇలా దేశభ్రష్టుడిలా నరకలోకం నుంచి పలాయితుడవై ఉండేవాడివి కాదు.

గాబ్రియేల్ మాటలకు సాతాను సమాధానమిచ్చినాడు–

"నన్ను అవమానిస్తున్నావు దేవదూతా! నాకు ఓర్పు తక్కువనో, బాధల్నుంచి తప్పుకుంటాననో అంచనా వేయకు. ఆ ప్రచండ సమరంలో వజ్రసమానమైన ఉరుములు మెరుపులు పిడుగులు మమ్మల్ని వెనుకంజ వేయించాయి... కాని మీ బల్లేలు, కత్తులు కాదు. అయినా నీ వాదన నీ అనుభవరాహిత్యాన్ని తెలుపుతున్నది. సమర్థుడైన నాయకుడు జయాపజయాలను లక్ష్యపెట్టకుండా, తనను విశ్వసించి అనుసరించే వారికి ఆపదలు రాకుండా తాను ముందు నడుస్తాడు. అందుచేత నేనే ముందుగా నరకలోకాన్ని దాటి, అగాధాన్ని అధిగమించి ఈ కొత్తలోకాన్ని

శోధించేందుకు ఒంటరిగా వచ్చాను. వన్నెతగ్గి, మొక్కవోయిన నా శక్తుల్ని ఇక్కడో, మధ్యలోకంలోనో తిరిగి పొందడానికి ప్రయత్నిస్తున్నాను. నీవు నీ బలగాలు నన్నెదిరించదలుచుకుంటే మంచిదే! స్వర్గ సింహాసనంపై తీరికగా కూర్చుని మీరుచేసే స్తోత్రాలతో, పొగడ్తలతో, గీతాలతో ఆతడు తృప్తి పడుతూ ఉండవచ్చు. కదనంలోనే కదా, నీ కథా, నా కథా బయటపడేది."

దానికి వీరుడైన గాబ్రియేల్ తీవ్రంగా స్పందించాడు–

"చెప్పే చెప్పనట్లు చెబుతావు. కాసేపు బాధల నుంచి విముక్తికోసం పారిపోయి వచ్చానంటావు. కాసేపు నూతనలోక శోధన అంటావు! నిజం నీకే తెలియాలి! నాయకుడివా నీవు! అబద్ధాలకోరువి. సాతాన్! విశ్వాసం గురించి నీవా మాట్లాడేది? ఎవరికి విధేయత గురించి చెబ్తున్నావు? తిరగబడ్డ దేవతలకా! విశ్వాసహీనులకా! నీకే క్రమశిక్షణ ఉంటే సర్వోన్నతుడికి ఎదురుతిరిగేవాడివా! పెద్ద స్వాతంత్ర్యయోధుడిగా, స్వేచ్ఛాపిపాసిగా మాటలు పేరుస్తున్నావు. మోసగాడివి కాదూ! నీ దంభాలు ఆపు.ఎవరినైతే సేవించావో పూజించావో ఆ సర్వంసహా చక్రవర్తినే కూలదోసి సింహాసనాన్ని ఆక్రమించాలని ఎత్తుగడవేసి విఫలమయ్యావు. ఇప్పుడు నేను చెబుతున్నాను, విను! తక్షణం ఇక్కడి నుంచి నిష్క్రమించు. ఈ క్షణాన్నుంచి ఈ లోకంలో ఎక్కడన్నా కనబడ్డావా, నిన్ను నేను సంకెళ్లతో బంధించి ఈడ్చుకుంటూపోయి, నరకకూపంలోకి నెట్టి మరలా నీవు బయటపడకుండా నరకద్వారాలను శాశ్వతంగా మూసివేస్తాను"

ఆతడి హెచ్చరికలను లక్ష్యం చేయకుండా ఇనుమడించిన కోపంతో ఊగిపోతూ సాతాన్ గర్జించాడు– "నీకు బందీగానే ఉన్నానుగా, సంకెళ్లను గురించి మాట్లాడే పనేమున్నది గాబ్రియేల్! రా! ఎంత బరువైన శృంఖలాలు వేస్తావో ఈ చేతులకు వేసుకో! వేసి లాక్కెళ్లు! మీ కలవాటేగా స్వర్గాధిపతిని మీ రెక్కలపైన మోసుకెళ్లడం, నీవూ నీ పరివారం ఆతడు కూర్చునే బండి కాడిని మోయడం ఏవన్నా కొత్తా! ఏవిటి? నక్షత్రాల మెట్లపై స్వర్గానికి లాక్కెళ్లడం అలవాటేగా!"

అతడు అలా మాట్లాడ్తున్నపుడే ఆ దేవదూతల దళం మహోగ్రమైన ఎర్రటి కాంతితో ప్రజ్వలిస్తూ పదునైన తమ బల్లేల్ని ఝళిపిస్తూ సాతానును చుట్టుముట్టినారు. కోతకు వచ్చిన గోధుమచేలు గాలికి ఊగుతుండగా, రైతు చేతికి వచ్చిన పంట నేలపాలు కాకుండా కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు... దేవదూతలు సర్వసన్నద్ధులై ఉండగా–

సాతాను తన దేహప్రమాణాన్ని అనేకరెట్లు పెంచి, అట్లాస్ (Atlas)లా, టెనెరిఫ్ (Teneriff)లా పెరుగుతూ ఆకాశాన్నంటినట్లుగా, భయంకర రూపుడై నోపుచుండ... ఇరుపక్షాల మధ్య బీకర సమరం జరిగేదే...

అంతలో నక్షత్రమండలాన, ఏస్ట్రియా (Astrea) వృశ్చికరాశుల మధ్య (Scorpion) ప్రత్యక్షమైన బంగారు త్రాసు (Scales)లో విధి మొదటగా తాను సృష్టించిన సమస్త విషయాలనూ తూచినాడు. ఒకవేపు భూమిని, రెండవవేపు రాజ్యాన్ని, యుద్ధాల్ని వాటి పరిణామాల్ని సూచించే రెండు బరువుల్ని ఉంచినా రెండవవేపు తేలికై త్రాసు దూలాన్నంటుకున్నది.

గాబ్రియేల్ దానిని గమనించి వంచకరారాజు సాతానుతో అన్నాడు– "సాతాన్! నీ శక్తియుక్తులు నాకు, నా బలపరాక్రమాలు నీకు తెలుసును. దేవదేవుని ఆజ్ఞ లేకుండా నీవైనా నేనైనా వట్టి ఆయుధాల ప్రదర్శనతో ఏమీ చేయలేం! చూడు! ఆకాశంలో కనిపించిన దివ్యసంకేతం. నీవు ప్రతిఘటిస్తే ఏం జరుగుతుందో, నీ శక్తిసంపదలెంత బలహీనమో ఆ త్రాసులో గమనించు. ఆనక నీయిష్టం"

సాతాను గగనంవేపు తలెత్తిచూసాడు. పరిస్థితి అర్థమయ్యింది. తనలో తాను గొణుక్కుంటూ వేగంగా అక్కడ్నుంచీ పారిపోయాడు. అతనితోపాటే చీకటి నీడలు కూడా తొలిగిపోయాయి.

5. ఆదాంను హెచ్చరించిన రాఫెల్

ప్రాతఃకాల సమయం. ఈవ్ తనకు వచ్చిన స్వప్నాన్ని ఆదాంకు వివరించింది. ఆదాంకు ఆ స్వప్నవృత్తాంతం నచ్చకపోయినా కలవరపడ్తున్న ఈవ్‌ను అనునయిస్తాడు. ఉదయ స్తోత్రాన్ని గానంచేసి వారు దైనందిన కార్యక్రమాల్ని ప్రారంభిస్తారు. మానవులను తమ ప్రవర్తనలకు బాధ్యులుగా చేసేముందు హెచ్చరికగా దేవదేవుడు రాఫెల్‌ను ఆదాం వద్దకు మానవుడు నిర్వర్తించాల్సిన విధుల్ని, చూపాల్సిన విధేయతను, ఆతనికి ఇచ్చిన స్వేచ్ఛను, ఆతనికి అత్యంత సమీపంలో ఉన్న శత్రువు – ఎవరు? ఎందుకని ఆతడు శత్రువైనాడు? ఇంకా సందేహాలేమన్నా ఉంటే వాటిని నివృత్తి చేయడానికి దేవదూతను పంపినాడు. రాఫెల్ వర్ణన, ఆదాం, ఈవ్‌లు ఆతనికిచ్చిన ఆతిథ్యం, వారి సంభాషణ, రాఫెల్ ఆదాంకు అందజేసిన దేవదేవుని సందేశం, శత్రువు వివరాలు, దేవదూతల తిరుగుబాటు, అబ్దియెల్ దేవదూత శత్రువుని వ్యతిరేకించిన విధానం ఈ భాగంలో వివరింపబడినాయి.

తూర్పువాకిట ఉదయం తన గులాబీ పాదాలతో అడుగిడగా భూలోకమంతా మంచుముత్యాల తెల్లదనంతో మెరవసాగింది. ప్రతి కొమ్మమీద కిలకిలారావాలతో పలకరిస్తున్న పక్షులు, ఆకుల గలగలలు, సెలయేటి ప్రవాహపు హోరు, అరోరా ఉదయ సంధ్యాదేవత (Aurora) తూర్పువీధిని అరుణరాగరంజితం చేస్తుండగా ప్రశాంతమైన నిద్ర నుంచి మేల్కొన్న 'ఆదాం' తన పక్కనే ఇంకా గాఢనిద్రలోనే ఉన్న 'ఈవ్'ను గాంచి ఆశ్చర్యపోయాడు. చిందరవందరగా ఉన్న శిరోజాలు, ఎరుపెక్కిన బుగ్గలు, రాత్రి సరిగా నిద్రపట్టనట్లున్న తీరు, తనపైకి ఒరిగి, ఒదిగిన అందాలరాశి 'ఈవ్' వేపు ప్రేమ నిండిన కళ్లతో చూస్తూ, జెఫిరిస్ (Zephyrus) పడమటి గాలి మలయమారుతం పూలపై వీచినంత మెల్లగా, గుసగుసలాడుతున్నట్లు, ఆతడు ఆమెను పిలిచాడు–"ప్రియతమా! నెచ్చెలీ! దేవదేవుడు నాకొసగిన అత్యంత విలువైన కానుకా! నా సమస్త ఆనంద జీవన ప్రతీకా! మేలుకో! తూరుపు వెలుగుతో పులకరించిన మన పొలాలు మనల్ని ఆహ్వానిస్తున్నవి. వసంతఋతువు మన తోటకు ఎలాంటి శోభనిచ్చిందో, నిమ్మతోట ఎలా ఉన్నదో, గుగ్గిలం (Myrrh) ఎక్కడ నుంచి నేలరాల్తుందో, రెల్లుగడ్డి (Reed) ఎలా పెరిగిందో, ఎలా ప్రకృతి వివిధ వర్ణాల చిత్రాన్ని శోభితం చేస్తుందో, ఎలా తేనెటీగ పూల నుంచి మకరందాన్ని సంగ్రహిస్తుందో ఆ అద్భుత కార్యాల్ని చూద్దాం! మేలుకో! ప్రియురాలా! మేలుకో!"

అతడంత సున్నితంగా చెప్పినా ఆమె పీడకల నుంచి ఉలిక్కిపడి లేచినట్లు లేచి ఆతనిని కౌగిలించుకుని తత్తరపాటుతో ఇలా పలికింది–

"నా ఆలోచనలన్నీ ప్రశాంతతను పొందే నా ఆత్మరూపమా! నా రూపు ఖ్యాతి, సొబగులకు మూలస్థానమా! నిద్రలేవగానే నీ ప్రశాంత వదనాన్ని చూసి స్థిమితపడ్డాను. గడచిన రాత్రివంటి కల్లోలరాత్రిని నేనెప్పుడూ గడపలేదు. బయట అత్యంత ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉన్నా, నిద్రలో కల మీద కల నన్ను కలవర పెట్టినాయి. ప్రతిరాత్రీ వచ్చే స్వప్నాలు సుందరంగా, దైనందిన కార్యాలకు సంబంధించినవై ఉండేవి. ఈ రాత్రివచ్చిన కలల్లో ఏదో విపత్తు, ఆపద, గాయం, ఆటంకం లాంటివి కనిపించి నన్నుక్కిరిబిక్కిరి చేసాయి. ఎవరో పిలుస్తున్నట్లునేను అది నీ గొంతే అనుకున్నాను. ఆ స్వరం ఇలా అన్నది– "ఇంకా నిద్రపోతున్నావా 'ఈవ్!' ఇంత ప్రశాంత రాత్రి, నైటింగేల్ తన మధురస్వరంతో చీకటిని జయిస్తున్న రాత్రి, పూర్ణచంద్రికా కాంతులు వెండివెన్నెలలా విరబూస్తున్న రాత్రి, స్వర్గం కూడా తన విప్పారిన నయనాలతో ఈ సొబగులను తన్మయంగా చూసే రాత్రి, ఇంత మనోహరమైన రాత్రిని, నీవంటి అతిలోకసుందరి ప్రకృతిలో ప్రకృతిలా విహరించక నిద్రపోతూ వృధా చేయడం న్యాయమా!" నీవే ఆ మాటలన్నదనుకుని నేను ఉలిక్కిపడి నిద్రలేచాను. కాని నీవు కాదని గ్రహించాను. మరల కనులు మూతపడగా కలలో నేను అలా అలా నడుచుకుంటూ జ్ఞానవృక్షం దగ్గర, పగటి వెలుగులోకన్నా అత్యంత సుందరంగా ఉన్న ఆ చెట్టుదగ్గర విభ్రాంతితో నిలబడ్డాను. ఆ వృక్షం పక్కనే దేవదూతలా, పూతేనె, చాయలో ఉన్న శిరోజాలు మెరుస్తుండగా, స్వర్ణశోభితమైన రెక్కలతో మనకు ప్రతి దినమూ కనిపించే దేవదూతల్లాంటి వ్యక్తి తానుకూడా జ్ఞానవృక్షాన్ని పరికిస్తూ ఇలా అంటున్నాడు– "ఓ అద్భుత వృక్షమా! మధురమైన పండ్లతో శోభిస్తూ నీవింత మనోహరంగా ఉన్నా ఏ దేవుడూ, మానవుడూ కూడా నీ తియ్యటి ఫలాల్ని రుచిచూడక పోవడం వింతగా ఉన్నదే! జ్ఞానం అంత నిరసించతగ్గ వస్తువు కాదుకదా! నీ ఫలాల్ని స్వాదయోగ్యం కాదని నిషేధించడంలోని అంతరార్థం నాకర్థం కావడం లేదు. అంతటి తినగూడని ఫలాలైతే నిన్ను ఈ సుందర ప్రదేశంలో ఉంచడమెందుకు? ఇంత అందమైన వనంలో నిన్నుంచి, ఇన్ని మధురఫలాల్ని నీవు ఇస్తుండగా వాటిని రుచిచూడకుండా నన్నెవ్వరూ ఆపలేరు" – అంటూనే అతడు తన చేతులు సాచి, ఫలాన్ని కోసి, నేను భయంతో కళ్లుమూసుకుంటుండగానే, అతడు తన్మయంగా ఆరగించసాగినాడు– "ఓ దివ్యఫలమా! ఎంత రుచి! ఎంత మధురం! నిన్ను తినకూడదని ఆంక్షలా! బహుశా దేవతలు మాత్రమే నిన్ను అస్వాదించాలన్నది నియమమేమో! మనుషులే దేవుళ్లయితే, లేక మనుష్యులు ఆరాధించే దేవుళ్లు అసంఖ్యాకమైతే ఆ సృష్టికర్తకే గౌరవం కదా! ఈ ఫలాల్ని తింటే మనుష్యులు దేవుళ్లవుతారా!" – "ఇటుచూడు! ఈవ్! అందాల దేవకన్యా! సంతోషానికి ప్రతిరూపమా! ఈ దివ్యఫలాన్ని రుచిచూడు! జ్ఞానాన్ని పొంది, మంచీ చెడుల విచక్షణతో దేవుళ్లలో దేవతవై, ఈ భూలోకంలోనే కాక దేవలోకంలో కూడా

స్థానాన్ని సంపాదించుకో! దేవతలు అనుభవిస్తున్న సౌఖ్యాలను నీ స్వంత అర్హతలతో సంపాదించుకో!" అంటూనే అతడు ఆ దివ్యఫలాన్ని కోసి నా నోటికి దగ్గరగా ఉంచినాడు. ఆ మధుర ఫలపు సువాసన నాలో తక్షణం ఆకలిని రేకెత్తించగా నేను రుచి చూడకుండా ఉండలేకపోయాను. అంతే నాలో ఏదో కొత్తశక్తి ప్రవేశించినట్లై నేను ఆకాశంలోకి ఎగిరి, క్రింద మరింత విశాలంగా అగుపించి, నన్ను రమ్మని ఆహ్వానిస్తున్న భూమిని అబ్బురపడుతూ చూస్తున్న సమయంలోనే – నాకు మార్గదర్శకుడిగా కనిపించిన దేవదూత అదృశ్యమైనాడు – నేను నేలపై కూలిపడినట్లన్పించి గాఢంగా నిద్రపోయాను. నీ మాటలతో మెలకువ రాగా అదంతా కలగా గ్రహించి ఇప్పుడు ఎంతో భారం తగ్గగా హాయిగా ఉన్నది"

– 'ఈవ్' అలా తన స్వప్నాన్ని చెప్పగా 'ఆదాం' అంతరార్థాన్ని గ్రహించినవాడై విచారంగా ఇలా పలికాడు–

"నాలోని అత్యంత ముఖ్యమైన అర్థభాగమా! నీ కలలోని సంఘటనలు నాలో దుఃఖాన్ని కలిగిస్తున్నవి. ఈ స్వప్నాన్ని నేను ఇష్టపడడం లేదు. అది దుష్టాత్మ నీలో చేరి కలిగించిన భ్రమ. కాని, స్వచ్ఛంగా, పరిశుద్ధంగా రూపొందించబడిన నీలోకి దుష్టాత్మ ప్రవేశించ వీలులేదు కదా! ఆత్మలో ఉండే అనేక వ్యవస్థలలో హేతువు (Reason) లేదా 'వాదం' ప్రథమస్థానాన్ని, భావనాశక్తి లేదా ఊహ (Fancie) రెండవ స్థానాన్ని ఆక్రమిస్తాయి. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు భ్రాంతుల్ని, భ్రమల్ని కల్పించగా 'హేతువు' వాటిని సమర్థించో, ఖండించో ఇచ్చిన తునకల్ని అభిప్రాయంగా, జ్ఞానంగా భావించాక అది మరల తన గూట్లోకి చేరి అదృశ్యమవుతుంది. హేతువు లేని సమయంలో 'ఊహ' ఊయలలెక్కి, దానిని అనుకరిస్తూ అనేక పొంతనలేని విషయాలను సమన్వయపరుస్తూన్నట్లుగా కొన్నిసార్లు కలల్లో అసంభవ దృశ్యాల్ని చిత్రిస్తుంది. నీకు వచ్చిన కల బహుశా మనం నిన్న సాయంకాలపు వాహ్యాళి సంభాషణా ఫలితం కావచ్చు. కాని దీనిలోని చెడు అంశం ఏమిటంటే దుష్టాత్మ మానవునిలోనో, దేవుడిలోనో యధేచ్ఛగా ప్రవేశించవచ్చును, వెళ్లిపోవచ్చును. కాని దాని తాలూకు ఆనవాళ్లు మిగలరాదు. కలలో చూసిన విషయాల్ని ఇలలో నీవు ఆచరించకపోవడం వల్ల ఏ చెరుపూ జరగలేదు. అదే నాకు కొంత ఊరటను, ఆశను కలిగిస్తున్నది. అయినా ఆ స్వప్నం నీలో దిగుల్ని రేపి, నీ కళ్లపై మబ్బుతెరలను కప్పనవసరం లేదు. ఉదయపుకాంతులతో ఈ చీకటిగుబులు తొలిగిపోతుంది సుమా! అనవసరపు వ్యాకులము వలదు. లే! లేచి మనం ఈ తరూలతలవనంలో, స్వచ్ఛమైన నీటిబుగ్గల చెంతన వివిధ వర్ణశోభితమైన పుష్పాలు విరజిమ్ముతున్న సువాసనల మధ్య మన నిత్య విధుల్ని నిర్వహిద్దాం, పద!"

– అని పలుకుతూ ఆదాం, తన నెచ్చెలికున్న భయసందేహాల్ని తొలగిస్తూ ఆమెను ఉత్సాహపరిచాడు. తేరుకున్న ఆమె కనుకొలకుల్నుంచి రెండు కన్నీటి బిందువులు రాలిపడి శిరోజాలలో అదృశ్యంకాగా మరోరెండు కనురెప్పల మూలలందు నిలిచి ఆతడామెను అనునయంగా ముద్దాడినప్పుడు జారగా, తియ్యని పశ్చాత్తాపాన్ని, భక్తిపూర్వక సంభ్రమాన్ని సూచిస్తూ ఆమెలోని అంతర్గత ఘర్షణ అదృశ్యమయ్యింది.

మనసులు తేలికపడ్డాక వారిద్దరూ ఆ పొదరింటి నుంచి బయటకు వచ్చారు. వసంతకాలం. సూర్యుని రథచక్రాలు తూర్పు సముద్రపు అంచులపై నడయాడుతూ, మంచుముత్యాల కిరణాలను 'ఈడెన్' వనమంతా ప్రసరింపజేస్తున్నవి. వారిరువురూ తమ సహజ స్వరాలతో, సుమధురంగా, ఎటువంటి వాద్యసహకారం అవసరం లేని మధుర గీతాలతో ఉదయస్తోత్రాలను పాడినారు.

"సర్వశక్తిమంతుడవైన పరమేశ్వరా! సద్గుణమూర్తి! ఈ నీ అద్భుత సృష్టిని మాకు గోచరింపచేస్తున్నందుకు సర్వదా మేము కృతజ్ఞులము. ఈ మహావిశ్వ నిర్మాణ చతురతను కొనియాడ మాతరమా! స్వర్గంలో అగోచరుడవై ఉన్నా నీ సృష్టిలోని ప్రతి అణువూ నీ రూపాన్ని మాకు ప్రత్యక్ష్యంగా చూపిస్తున్నది. అవి మీ దివ్యశక్తులను, ఆలోచనలకందని మంచితనాన్ని వేనోళ్ల చాటుతున్నవి.

ఓ కాంతికుమారులారా! దేవదూతలారా! మీరు నిరంతరం దేవదేవుని సన్నిధిలో ఉండి స్తోత్రగీతాలు పాడుతూ రేయింబవళ్లు ఆనందిస్తారు. మీరెంతటి పుణ్యాన్ని నోచుకున్నవారో! స్వర్గభూలోకాల్లోని ప్రతిజీవి ఆతననే కీర్తిస్తూ తమ జన్మను సార్థకం చేసుకుంటున్నది. గగనంలోని ప్రతి నక్షత్రమూ, ఈ ప్రపంచపు నేత్రమూ, ఆత్మ అయిన సూర్యుడూ ఆతననే స్తుతిస్తూ తమ విధుల్ని నెరవేరుస్తారు కదా! రాత్రివేళలందు చంద్రిక (Moon) స్థిరమైన నక్షత్రాలతో, సంచరించే గ్రహాలతో మజిలీ చేస్తూ చీకటినుంచి వెలుగును సృష్టించిన ఆ దేవదేవుని ప్రార్థిస్తున్నది. ప్రకృతి గర్భం నుంచి వెలువడ్డ ప్రథమ సంతానమైన మూలకాలూ (Elements) వాయువూ వలయాల్లో పరిభ్రమిస్తూ, అనేక రూపాల, అనేక పదార్థాలుగా, జీవులకు ఓషధులుగా, అన్నాలుగా మారుతున్నాయి. కొండలనుంచి, ఆవిర్లు కక్కుతున్న సరోవరాల నుంచి వెలువడే పొగమంచు సూర్యకిరణాలచే ధూమ్రవర్ణం నుంచి బంగారురంగులోకి మారి ప్రకాశిస్తూ ఆ దేవదేవునికి తమ కృతజ్ఞతాభివందనములు తెలుపుతున్నవి. ఆ విశ్వరచయితను పొగుడుతూ కొన్ని మేఘాలు ఆకాశాన మేఘమాలికలు కాగా, కొన్ని ఆనందాశ్రువులతో ఆతని నూతన సృష్టి అయిన భూమిపై వర్షరూపాన కురుస్తున్నవి. ఆతనిని కీర్తిస్తూ నాల్గుదిక్కులా వాయువులు వీస్తుండగా 'పైన్' మొదలగు వృక్షాగ్రాలు తలలూపుతూ దైవపూజ గావిస్తున్నవి. జలధారలు, నీటిబుగ్గలు గలగలపారుతూ,

పక్షుల కిలకిలారవాలతో కలిసి కీర్తనలు పాడుచున్నవి. ఓ పక్షులారా! ఈ స్తుతిగీతాలను మీరు మీరెక్కలపై మోసుకుని స్వర్గ ద్వారాలవద్దకు కొనిపొండు! ఓ జలచర, భూచర ప్రాణులారా! ఈ ఉదయ, సాయంకాలపు గీతాలు కొండల్లో, లోయల్లో, జలధారల్లో, నీడల్లో ప్రతిధ్వనించగా మనం ఆ విశ్వరూపుడు, ప్రభువులకే ప్రభువు, మనకు ఎల్లప్పుడు సద్బుద్ధిని ప్రసాదించువాడు, కటికచీకటి రాత్రిలో కూడ మనకే ఆపద రాకుండా కాపాడే రక్షకుడు అయిన దేవదేవుణ్ణి స్తుతిద్దాం! కీర్తిద్దాం! జేజేలు పలుకుదాం!"

అలా స్వచ్ఛమైన మనసున్న ఆ అమాయక జీవులిద్దరూ శాంతి పొందిన మనస్సుతో దేవదేవుని స్తుతించినారు. తోటలోకి వెళ్లి ఆపూ అదుపూ లేకుండా పెరిగి దారుల్ని కమ్ముకుంటున్న రెమ్మల్ని సరిచేస్తూ, ఎల్మ్ (Elm) వృక్షానికి, ద్రాక్షతీగకూ పెళ్లి చేసి, ద్రాక్షగుత్తులతో ఆకులు లేని ఎల్మ్ శోభించేలా అల్లుతూ వారు తమ ప్రాతఃకాలపు విధుల్ని, పూల సువాసనల మధ్య, మంచుబిందువుల తుంపరల మధ్య తదేక దీక్షగా చేస్తున్నారు. అదే సమయాన స్వర్గలోకాధిపతి దేవదూత రాఫెల్ (Raphel)ను ఆదేశించినాడు.

"రాఫెల్! ఈ సరికి నీకు తెలిసే వుంటుంది, నరకలోకం నుంచి తప్పించుకుని సాతాను (Satan), చీకటి అగాధాన్ని దాటి పారడైజ్ చేరుకుని మానవజంటను గతరాత్రి కలతపెట్టిన విషయం. బహుశా వీళ్ల ద్వారా అతడు మానవ జాతినే నాశనం చేయ సమకట్టినట్లున్నాడు. వెంటనే వెళ్లి ఆదాంతో స్నేహితుడి రీతిగా మాట్లాడి అతడున్న పరిస్థితిని తెలియజేయి. అతడున్న ఆనందస్థితి ఆతనికి స్వేచ్ఛ ద్వారా సంక్రమించింది. స్వేచ్ఛ ద్వారా అతడు తనకిష్టమైన నిర్ణయాలు తీసుకొనవచ్చును. కాని ఆ స్వేచ్ఛకూ కొన్ని పరిధులున్నాయి. కాబట్టి ఆనందస్థితి, ఇచ్ఛాశక్తి రెండూ వాటిని సక్రమంగా వాడుకున్నప్పుడే లభ్యమవుతాయని వివరించు. ఆతనికి రాబోతున్న అపాయాల్ని విడమరచి చెప్పు. స్వర్గచ్యుతుడైన శత్రువు తాను పతనం చెందినట్లే మిగతావాళ్లనీ పతనం చెందించడానికి కుట్రలు, కుయుక్తులు పన్నుతున్న విషయాన్ని తెలియజేయి. హింసకు పోకుండా మోసంతో, అబద్దాలతో శత్రువు పన్నుతున్న వలలో పడవద్దని హెచ్చరించు. ఇప్పుడు హెచ్చరించకపోతే రేపు హద్దులు మీరి నాకు ఈ అంక్షలు గురించి తెలియదని ఆశ్చర్యాన్ని ప్రకటించే అవకాశాన్ని ఈ తొలి మానవులకు ఇవ్వరాదు"

అందరికీ తండ్రి అయిన దేవదేవుని ఆదేశాలను స్వీకరించి రాఫెల్ వేయి దేవదూతల ఉత్సాహంతో, బ్రహ్మాండమైన తన రెక్కలను విప్పార్చి స్వర్గలోకపు రాజవీధుల గుండా స్వర్గద్వారం వద్దకు రాగా తమంతట తామే తెరచుకున్న

తలుపులగుండా, మబ్బులులేని ఆకాశంలోకి దూసుకువచ్చి, నక్షత్రాలను, గ్రహాలను దాటి, భూకక్ష్యలోకి ప్రవేశించి, ఈడెన్ దైవవనంలోకి, దేవదారు వృక్షాలు కిరీటంగా భాసిస్తున్న పర్వతాలపై చూపు నిలిపినాడు. రాత్రిపూట గెలిలియో అద్దాలతో (Galileo) చంద్రునివేపు చూస్తూ అక్కడి కొండల్ని, మైదానాల్ని పరిశోధిస్తున్నట్లు, విమాన చోదకుడికి అంతెత్తునుంచి సైక్లేడ్స్ (Cyclades), డెలాస్ (Delos), సమోస్ (Samos) ద్వీపాలు చిన్న చుక్కల్లా కనిపించినట్లు ఆతనికి ఈడెన్ వనం క్రమేపీ స్పష్టంగా కానరాసాగింది. ఆతడు అలా ఆకాశంలో దూసుకువస్తూ ధృవపు గాలుల్ని చీల్చుకుంటూ, అల్లంతెత్తున ఎగుర్తున్న గ్రద్దలకు, పక్షులకు ఓ ఫీనిక్స్ పక్షి (Phoenix) సూర్యదేవాలయం నుంచి ఈజిప్టులోని (Egypt) థెబెస్ (Thebes) వద్దకు పోతున్నట్లు – ఆతడు వేగంగా పారడైజ్‌లోని తూర్పు గుట్టపై దిగాడు. అక్కడ రాఫెల్ ఆరు రెక్కలున్న దేవదూతగా తన నిజరూపానికి మారి దివ్యకాంతులు వెదజల్లుతూ, భుజకీర్తులు, కంఠాభరణాలు, రొమ్ముపై అలంకరించబడిన నగలు, నడుముకు పటకా, అన్నీ స్వర్ణమణిమయ ఖచిత దివ్యాభరణాలే! స్వర్ణాంబరాలు, నీలిరంగు ఈకలతో చేసిన కాలిజోళ్లు వీటన్నిటితో రాఫెల్ చూడముచ్చటగా మైయా (Maia) కుమారుడిలా వెలుగొందుతూ తలపై అలంకరించుకున్న శిఖిపింఛం (Plumes) నుంచి వ్యాపించిన సుగంధ పరిమళాలు అన్నిదిక్కులకు వ్యాపిస్తుండగా, పహారా దేవదూతల శిబిరాల్ని దాటి గుగ్గిలపు తోపుల్ని (Myrrh), కాస్సియా (Cassia), నార్డ్ (Nard), బామ్ (Baum) సుగంధ వృక్షసముదాయాల్ని దాటి ఆ దివ్యానందకరమైన వనంలో ఆదాం, ఈవ్‌లు మధ్యాహ్నభోజనానికి సిద్ధమవుతున్న పొదరింటివేపుకు రాసాగినాడు. అతి మధురమైన ద్రాక్ష, బెర్రీ ఫలాల్ని, అమృతతుల్యమైన సెలయేటి నీటిని సిద్ధం చేస్తున్న ఈవ్‌ని పిలిచి ఆదాం అంటున్నాడు– "త్వరగా రా, ఈవ్! తూర్పుదిక్కు నుంచి ఏదో దివ్యాత్మ చెట్ల గుబుర్ల మధ్యగా మనవేపు వస్తున్నట్లు కనిపిస్తున్నది. మిట్టమధ్యాహ్నం మరో ఉదయంలా స్వర్గం నుంచి దిగివచ్చిన దేవదూత కావచ్చును. ఆతడు మన అతిథి. ఆతనికి ఉచిత మర్యాదలు చేసి గౌరవిద్దాం. దేవదేవుడు మన కనుగ్రహించిన ఈ అమూల్య సంపదలను ఆ దేవదూతకు కానుకగా ఇచ్చి ఆతనిని సంతృప్తిపరుద్దాం"

'ఈవ్' బదులు పలికింది– "ఆదాం! దేవదేవుని ఆలోచనా ప్రతిరూపమా! మట్టి నుంచి శిల్పీకరించిన పవిత్ర సాధురూపమా! ఈ వనంలోని ప్రతిచెట్టూ రుచికరమైన ఫలాల్నే ఇస్తున్నది కదా! నేను వెంటనే వెళ్లి రకరకాల మధుర ఫలాల్ని ఏరి కోసుకువస్తాను. మన అతిథియైన దేవదూతకు వాటిని సమర్పించి భగవానుడు ఈ భూమిపై సృజించిన స్వర్గతుల్యమైన సహజ సంపదలను ఆతనికి దర్శింపచేద్దాం" – అని పలికి త్వరత్వరగా తోటలోకి వెళ్లి రుచిలో సాటిలేని ఫలాల్ని, మరల మరల

తినాలనిపించే మధురఫలాల్ని – ప్రకృతిమాత ఇండియా (India) తూర్పు, పడమటి దేశాల్లో, పోంటస్ (Pontus), ఫ్యునిక్ (Punic) తీరాల్లో, ఆల్సినోస్ రాజ్యవనాల్లో పండే తియ్యని ఫలాల్లాంటివి – మృదువైనవి, గట్టి పెంకున్నవి, నూగుతో ఉన్నవి, అన్నిటినీ ఒక చెక్కపై చక్కగా అమర్చి, ద్రాక్షపళ్ల నుంచి చిక్కని ద్రాక్షరసాన్ని, బెర్రీల నుంచి మధుర పానీయాల్ని, గింజలు, టెంకలలోని తియ్యని మీగడను వేరుచేసి వెండిలా మెరుస్తున్న ఆకులపై సర్ది, తమ పొదరింటి నేలపై గులాబిరేకులు, సుగంధ పత్రాలను పరచి అతిథి రాకకై ఎదురు చూడసాగింది.

ఆదాం తమ ఇంటివేపు వస్తున్న దేవదూతను ఆహ్వానించడానికి – రాజులు, రాకుమారులు విచ్చేస్తున్నపుడు వారికెదురేగి ఆహ్వానించే అశ్వికదళం, తళతళలాడే దుస్తులతో ఆయుధాలతో క్రమపద్ధతిలో కవాతు చేస్తూ ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తే తీరుకన్నా–హుందాగా, ఠీవిగా, వినయవిధేయతలు మూర్తీభవించిన సౌజన్యమూర్తిలా 'ఆదాం' తమ అతిథికి ఎదురేగి అభివాదం చేస్తూ అన్నాడు–

"స్వర్గలోక నివాసీ! ఇంత అద్భుతమైన రూపం, వర్ఛస్సూ దేవదూతలకే స్వంతం. ఆ దివ్యలోకాన్ని వదిలి ఇలా రావడం మమ్మల్ని కనికరించడానికేనని మా భావన. ఇక్కడి ఈ విశాల ప్రదేశం, ఈ ఫలపుష్పవనం, విశ్రాంతి స్థలమైన ఈ పొదరిల్లు, ఈ సుందరపుష్పాలు, ఈ మధుర ఫలాలు, దేవదేవుడు మాకు అనుగ్రహించినవే. లోపలికి రండి, మా ఆతిథ్యాన్ని స్వీకరించి, ఈ ఫలాల్ని ఆరగించి, మధ్యాహ్నం ఎండ తగ్గేవరకు విశ్రాంతి తీసుకుందురుగాని! ఓ దివ్య అతిథీ! నీకు మా స్వాగతం!"

సుగుణమూర్తి అయిన దేవదూత సమాధానమిచ్చాడు– "ఆదాం! దేవదూతలు దర్శించదగ్గ స్థలం కనుకనే నేనూ ఇక్కడకు వచ్చాను. పద మీ పొదరింటికి వెళ్లి నాకున్న సమయాన్ని మీతో గడుపుతాను" అన్నాడు. ఇద్దరూ ఆ సుందరవనంలోని లతాకుటీరం వద్దకు వచ్చినారు. పసుపు ఆకుపచ్చల మిశ్రమమై అత్యంత మనోహరంగా ఉన్న 'పొమొనా' పొదరింటి (Pomona's Arbour)లో ఫలపుష్పాలు అతిథి ఆరగింపుసేవకు అమర్చినవి నేత్రానందం కలిగిస్తుండగా, ఇడా (Ida) పర్వత సానువులపై విహరించే నగ్నదేవతలా ఉన్న 'ఈవ్', అతిథిని వినయ వినమ్రాలతో ఆహ్వానించింది. ఆ దేవదూత 'ఈవ్'కు అభివాదములు తెలుపుతూ పొదరింటిలోకి వెళ్లి ఆసీనుడైనాడు. ఈ దేవదూత తర్వాతికాలంలో రెండవ 'ఈవ్' అయిన 'మేరీ' (Marie)ని కూడ ఇలాగే ఆశీర్వదించగలడు.

"మానవజాతికి మాతృమూర్తీ! నీకు నా అభివాదము! దేవదేవుడు ఈ నందనవనంలో సృష్టించిన ఫలపుష్పాదులను సేకరించి ఈ బల్లపై అమర్చినవాటికన్నా

అధికంగా నీ కుమారులు ఈ భూమిపై నడయాడగలరు. పుత్రపౌత్రాదులతో వర్ధిల్లుము తల్లీ!"

పొదరింట్లో ఎత్తైన మట్టిదిబ్బను కప్పిన పచ్చని పచ్చికతో బల్లలా, నలువైపులా కూర్చోవడానికి వీలుగా రూపొందించిన పీఠాలతో ఉన్నదానిపై వారు ఆసీనులైనారు. "దివ్యఅతిథీ! సృష్టికర్త మాకొసగిన ఈ మధుర ఫలాల్ని ఆరగించండి! ఆతడు సృష్టించిన ఆహారపు దినుసుల్లో ప్రశస్తమైనవి, స్వాదయోగ్యమైనవీ భూమిని ఫలవంతం చేయగా, తినడానికి వీలులేనివి ఆత్మలకు నిర్దేశించినవిగా మేము అర్థం చేసుకున్నాము. అన్నీ ఆ సృష్టికర్త నిర్మాణ వైచిత్రిలోని అంశాలే కదా!"

వారి మాటలకు దేవదూత బదులు పలికాడు– "మానవులకు ఆ దేవదేవుడు అత్యంత స్వచ్ఛమైనవీ, ఎన్నిక చేయబడ్డవీ అనుగ్రహించినాడు. అలాగే స్వతంత్రాలోచన, హేతుబుద్ధినీ మానవులకు కానుకలుగా ఇచ్చినాడు. ఈ రెండు గుణాలూ జ్ఞానేంద్రియాలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల సాయంతో వృద్ధి చెందుతాయి. ఆహారమైనా జ్ఞానమైనా రుచిచూడబడి, ఆరగించాక అరిగించుకొని, రస సారాంశంగా అంతర్లోకాలకు అందుతుంది. సృష్టించబడిన ప్రతి జీవికీ అన్నం అవసరం. మూలకాలు పదార్థాలై, నేలనుంచి నీరున్న సముద్రం, నేల, నీటి నుంచి వాయువు, వాటినుంచి అగ్ని, ఆకాశం, ఇంకా పరిణితి చెందని మూలకాలతో చంద్రిక (Moon), ఆ తరువాత అందరికీ వెలుగునిచ్చే సూర్యుడు – ఈతడు అప్పుడప్పుడు సముద్రంతో సహపంక్తి భోజనం చేస్తాడు. స్వర్గంలోని దివ్యవృక్షాలు అమృతాన్ని మకరందాన్ని కురిపించగా, అవి ఉదయకాలాన మంచుబిందువులై ముత్యాలతోరణాలుగా, రాశులుగా కనిపిస్తాయి. అటువంటి అద్భుత సహజ దృశ్యాల్ని దేవదేవుడు మీకొసగినాడు"

మత ధర్మవేత్తలు వర్ణించే పొగమంచు రూపంలో కాకుండా ఆ దేవదూత తన నిజరూపంలో ఉండి, అంతదూరం ప్రయాణించి వచ్చినందుకు కలిగిన జఠరాగ్నిని తీర్చుకొనెంచినాడు. కొలిమిలో కణకణ మండుతున్న బొగ్గులపై ముడిలోహాన్నుంచి రసవాదులు (Alchemist) తయారుచేసే స్వచ్ఛమైన సువర్ణంలా ఆహారపదార్థాలు జఠరాగ్నిలో భస్మమై స్వర్ణతుల్యమైన శక్తిని ఇస్తాయి.

అందరికీ ద్రాక్షసారాయి నింపిన పాత్రలనిచ్చి 'ఈవ్', దేవతలా స్వచ్ఛంగా అరమరకలు లేని అమాయకపు ముగ్ధత్వంతో దేవకుమారులనే మోహింపజేయగల అద్భుత సౌందర్యంతో, అసూయామోహాలు దరికిరాని నగ్నదేహంతో వనకన్యలా నడయాడసాగింది. అందరూ పండ్లూ ఫలాలతో సంతృప్తులైనాక 'ఆదాం' తమకు కలిసి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోదలచినవాడై – స్వర్గనివాసులెలా ఉంటారు.

దేవదేవుని, దేవదూతల విశేష విషయాలను వినగోరి తమ అతిథిగా వచ్చిన దేవదూతను ప్రశంసించినాడు.

"దివ్యలోక నివాసా! మా ఈ చిన్ని గృహానికి తమరు విచ్చేసి మా కొలది ఆతిథ్యాన్ని స్వీకరించి మమ్ములను ధన్యులను చేసినారు. దైవలోకపు విందులకు ఏమాత్రం పోల్చరాని మా చిన్ని ఆతిథ్యాన్ని గౌరవించి మాకు ఆనందాన్ని కలుగచేసినందుకు మేము సదా కృతజ్ఞులం"

ఆ దేవదూత ఇలా పలికాడు– "ఆదాం! ఆ సర్వ శక్తిమంతుడైన దేవదేవుణ్ణించే ప్రతి వస్తువూ, జీవీ జనిస్తుంది. ఆతనిలోనే లీనమవుతుంది. ఒకే మూలపదార్థం నుంచి అనేక రూపాలు, వైవిధ్యాలు కలిగిన జీవ నిర్జీవ పదార్థాల సృష్టికర్త ఆతడు. పదార్థ, జీవతత్వాలను బట్టి వాటికి వేర్వేరు విధుల్ని లోకాల్ని నిర్దేశించి భౌతిక రూపాల్ని, ఆత్మలను ప్రవేశపెట్టినాడు. తెల్లని వేరు నుంచి కాండం, పచ్చని కాండం నుంచి ఆకులు, ఆకుల నుంచి వేర్వేరు రంగులున్న పుష్పాలు, పుష్పగంధాన్ని ఆఘ్రాణించే దివ్యాత్మలు, మానవుల ఆహారం కోసం కాసే ఫలాలు, అలానే మూల పదార్థాల నుంచి జీవరాశులు, జంతు పశుపక్ష్యాదులు, వాటిపైన తెలివి, విచక్షణ, ఆలోచన, హేతుజ్ఞానం ఉన్న మానవుడు పరిణామజీవులుగా దేవదేవుడు రూపొందించినాడు. సంభాషణ, వాక్కు మానవులైన మీకు, అంతర్‌దృష్టి దేవతలమైన మాకు కొద్దితేడాలతో ఇవ్వబడింది.

అందుచేత భగవంతుడు మీకు ప్రసాదించినవేవీ నేను తిరస్కరించబోను. అంతేకాక ఈ మధురఫలాలు, ఖాద్యపదార్థాలే మీకు శక్తినిచ్చి క్రమేపీ మీరు దివ్యాత్మలుగా మారే అవకాశాన్నివ్వవచ్చును. అప్పుడు మీరు కూడా దేవదూతలుగా స్వర్గంలో విహరించవచ్చును. మీరు ఆ సృష్టికర్తకు, సర్వశక్తిమంతుడైన దేవాధిదేవునకు విధేయులుగా ఉండి ఆతని ఆజ్ఞలను జవదాటక, ఆతని నిండైన ప్రేమను పొంది దివ్యానంద స్వర్గంలో తేలియాడండి"

మానవజాతి ఆదిపితరుడు వినయంగా దేవదూతను ప్రశ్నించాడు– "కరుణ కలిగిన దేవదూతా! మాకు సన్మార్గాన్ని చూపించే అతిథీ! ఈ భూలోకపు కేంద్రం నుంచి అంచుల వరకు ఈ ప్రకృతి ఎలా వ్యాపించి ఉన్నదో, ఏ సోపానాలను అధిరోహించి మేము ఆ దేవదేవుణ్ణి చేరుకోగలమో, ఆ విధివిధానాలను తేటతెల్లం చేయగలవా! మీరు పలికిన 'విధేయత'కు హద్దులేమన్నా ఉన్నాయా! వాటిని దాటకుండా మేము తీసుకోవలసిన జాగ్రత్తలేమిటి? మమ్మల్ని మట్టి నుంచి తయారుచేసి ఈ దివ్యవనంలో ఉంచిన ఆ పరమేశ్వరుని కృపాకటాక్షవీక్షణాలను, ఈ అలౌకిక ఆనందాన్ని మించిన కోర్కెలు ఉండే వీలున్నదా!"

దేవదూత అన్నాడు– "స్వర్గ భూలోకాలపుత్రుడా! సావధానంగా విను! నీ ఈ ఆనందస్థితికి కారణభూతుడు ఆ దేవదేవుడు. ఆతని ఆజ్ఞలను మీరకపోవడం, నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వర్తించడమే విధేయతకు గీటురాయి. భగవానుడు మిమ్మల్ని లోపరహితులుగా సృష్టించాడు కాని శాశ్వతులుగా కాదు. మీకు సుగుణాల నిచ్చాడు, కాని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే! మీకు స్వేచ్ఛ ఉన్నది. కాని దానిని దురుపయోగించరాదు. స్వచ్ఛందంగా చేసే సేవలకు, స్వచ్ఛమైన మనసుకు దేవదేవుడు స్పందిస్తాడు. అంతేకాని మొక్కుబడి ప్రార్థనలను, కోరికల పూజలను ఆతడు ఇష్టపడడు. స్వేచ్ఛలేని హృదయాలు మనఃస్ఫూర్తిగా సేవచేస్తున్నాయో లేదో ఎలా చెప్పడం! ఎవరూ కోరని దానిని ఎన్నుకోవడాన్ని విధి ప్రేరితంగా ఎలా భావించడం! నేనూ, నాబోటి దేవదూతలందరం దేవదేవుని సన్నిధిలో, పరమానంద స్థితిని అనుభవిస్తూ మేమక్కడ, నీవీలోకంలో విధేయులమై ఉండడం కన్నా వేరే ఋజువేం కావాలి? మన ప్రేమ స్వచ్ఛమైనది. విధేయత ప్రశ్నించ వీలులేనిది. అవే మన ఉత్థాన పతనాలకు కారణభూతులు. కొందరు అవిధేయులై తిరుగుబాటు చేసి స్వర్గచ్యుతులై నరకలోకానికి పతనం చెందినారు. ఎటువంటి దివ్యానంద స్థితినుంచి వాళ్లు ఎటు దిగజారారో తెలుసా!"

దానికి మన మానవజాతి ప్రజాపతి (Progenitor) బదులిచ్చాడు– "ఓ దివ్య గురుదేవా! మీరు చెప్పిన ప్రతిమాటను అత్యంత శ్రద్ధతో విన్నాము. ఈ చుట్టుపక్కల కొండాకోనల్లో రాత్రి వీచే చల్లని గాలులతో కలిసి ప్రవహించే గంధర్వ గానాల్లా మీ సందేశం మాకు అత్యంత ఆనందాన్నిచ్చింది.

అయితే మేమెప్పుడూ మాటలకు, చేతలకు వ్యత్యాసముంటుందన్న విషయాన్ని గుర్తించలేదు. ఆ దేవదేవుని, సృష్టికర్తను విస్మరించి చరించలేదు. ఆతని ఆజ్ఞను జవదాటలేదు. మీరు ఇంతకుముందు వివరించిన స్వర్గలోకంలోని సంఘటనలపై నాకు కొన్ని సందేహాలు కలిగినవి. మీకభ్యంతరం లేకపోతే ఆ యావత్ వృత్తాంతాన్ని విన కుతూహలమగుచున్నది. సూర్యుడింకా నడినెత్తిమీదనే ఉన్నాడు కనుక మీకు వీలయితే ఆ సంఘటనలను వివరించ ప్రార్థన".

ఆదాం ప్రార్థనను మన్నించిన రాఫెల్ కొద్ది విరామం తరువాత చెప్పనారంభించినాడు– "ఓ మానవజాతి మూలస్తంభమా! నీవడిగిన విషయం అత్యంత విషాదకరమైనది, కఠినమైనదీ. మీ మానవబుద్ధికి అవగతమయ్యేలా ఈ సంగ్రామ చరిత్రనెలా వివరించను? దివ్యలోకపు రహస్య విషయాలను మరోలోకంలోని జీవులకు తెలియజెప్పుట ధర్మసమ్మతమేనా! అగోచరమైన దివ్యాత్మల మధ్య జరిగిన సంగ్రామంలో పతనం చెందిన దేవదూతల గురించి మీకు చెప్పడం మీమంచికే ఉపయోగపడవచ్చు.

దివ్యాత్మలకు దేహరూపాన్ని కల్పించి, స్వర్గపునీడ అయిన ఈ భూమిపై ఉన్న మీకు ఆ పోలికలతోనే ఆ సంఘటన వివరిస్తాను.

అప్పటికింకా ఈ కొత్తలోకం సృజింపబడలేదు. ఈలోకం, స్వర్గం ఉన్న ప్రాంతాలను ఓ మహా అగాధం, అవ్యక్తస్థితి ఆవరించి ఉండేవి. కాలమింకా గణింపబడని ఓ రోజున విశ్వచక్రవర్తి సమస్త దేవదూతల సమావేశాన్ని ఏర్పరచినాడు. స్వర్గలోకపు నలుమూలల్నుంచీ లక్షలాది దేవదూతలు తమ తమ అర్హతలను బట్టి సమస్త లాంఛనాలతో, పతాకలతో కొలువుతీరినారు. అంతర్వలయంలో సమస్త లోకాలకు తండ్రి, ఆతని కుడిప్రక్కన దైవకుమారుడు దివ్యకాంతులతో అగోచరమై ఉండగా, దేవదేవుడు ఇలా పలికినాడు–

"వినండి! దేవదూతలు, కాంతిదీపాలు, సింహాసనాలు, మహారాజ్యాలు, రాజ్యాలు, సుగుణాలు, శక్తులారా! ఇది నా ఆజ్ఞ. ఈ రోజునుంచి నా ఏకైక కుమారుడిని మీ అందరకూ అధినాయకుడిగా ప్రకటిస్తున్నాను. స్వర్గ నివాసులందరూ ఆతనికి ప్రణమిల్లి ప్రభువుగా కొలుస్తారని ఆతనికి నేను చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తున్నాను. దైవకుమారుని నాయకత్వంలో అందరూ ఏకతాటిపై నడచి ఒకే ఆత్మలా ఈ ఆనంద సామ్రాజ్యాన్ని అనుభవించండి. అతడిని వ్యతిరేకించడం నన్ను వ్యతిరేకించినట్లే. ఎవరైనాసరే అవిధేయతకు పాల్పడితే వారు స్వర్గం నుంచి బహిష్కరింపబడి, అంతూ దరీ లేని, తిరిగిరాలేని చీకటి అగాధంలోకి నెట్టివేయబడతారు"

ఆ సర్వశక్తిమంతుడు అలా తన ఆజ్ఞను వినిపించగానే సమస్త సభికులు హర్షధ్వానాలతో తమ నూతన అధిపతిని స్వాగతించారు. (ఎవరో కొందరు మినహా). నృత్యగానాలతో ఆ రోజంతా కాలం గడిపారు. దివ్య పర్వతశిఖరం చుట్టూరా నక్షత్ర మండలం, ఖగోళం, గ్రహాలు పరిభ్రమిస్తూ దివ్యనృత్యం చేస్తున్నట్లుండగా, వెలువడ్డ సుమధుర గ్రహసంగీతాన్ని దేవదేవుడు ఆలకించి ఆనందించినాడు.

దేవలోకంలో సాయంసమయమైంది. (దేవలోకంలోని కాలపు రీతుల్లో పెద్ద మార్పులు కనిపించవు). వలయాలుగా కూర్చున్న సభికులందరి ముందరా దేవదూతల ఆహారం వడ్డించబడింది. ఆ విందులో రత్నమణిమయ స్వర్ణఖచిత పాత్రలలో పూతేనె, అమృతం, ద్రాక్షరసంలు అందించబడినాయి. అందరూ ఆహార పానీయాలను సంతృప్తిగా సేవించి దేవదేవునికి తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. రాత్రి చీకటి లేని స్వర్గలోకపు సంధ్యాకాలపు కాంతులలో అందరూ తమతమ నెలవులకు నిష్క్రమించి, మధురమైన గీతాలు, చల్లని వాయువులతో కలిసి అన్ని దిక్కులకూ వ్యాపిస్తుండగా నిద్రలోకి జారుకున్నారు.

ఒక్క 'సాతాను' (Satan) తప్ప. ఆతని పూర్వనామాన్ని స్వర్గంలో ఇప్పుడెవరూ ఉచ్చరించరు. అధికారంలో, హోదాలో ఆతడు అప్పటివరకు అత్యున్నత స్థానంలో ఉన్నా, దైవకుమారునికి పట్టాభిషేకం కాగానే అసూయతో అట్టుడికిపోయినాడు. ఎప్పుడైతే దైవకుమారుడిని 'మెస్సయ్య' (Messiah)గా – అవతార పురుషుడిగా అభిషిక్తుడిని చేసాడో, అది తట్టుకోలేక గర్వాంధకారం సాతానును ఆవరించగా, తీవ్ర ద్వేషంతో, ఏవగింపుతో అందరూ హాయిగా నిద్రించే అర్ధరాత్రి సమయాన తనకు అనుకూలురైన తన సైన్యంతో దైవసింహాసనాన్ని ధిక్కరించి వెళ్లిపోదలచి నిద్రిస్తున్న తన ఆంతరంగిక సేనానిని లేపి ఇలా పలికాడు– "ఇప్పుడు నిద్రేమిటి ప్రియమిత్రమా! ఎలా నీ కళ్లు ఈ పరిస్థితుల్లో నిద్రకోసం మూతపడ్డాయి? నిన్నటి సాయంకాలం స్వర్గలోకాధిపతి జారీచేసిన ఆజ్ఞ విన్నాక కూడా నీవు ఆదమరచి నిద్రపోతున్నావా! నేననుకుంటున్నాను, నీవు నిద్రపోయినా నీ ఆలోచనలు నిద్రపోలేదని! మెలకువగా ఉన్నపుడు మనిద్దరి ఆలోచనలూ ఒక్కటే అయినప్పుడు నిద్రమాత్రం ఒక్కరికే ఎలా వస్తుంది? కొత్తచట్టాలు, కొత్త న్యాయాలు, కొత్త అధికారులు, కొత్త న్యాయనిర్ణేతలు వస్తున్నప్పుడు మనకీ స్వర్గం మన స్వంత ప్రదేశమెలా అవుతుంది? నీవు మన సమస్త సైన్యాన్ని నా ఆజ్ఞగా రేపు ఉదయాన్నే సమావేశపరచు. ఉత్తరదిక్కున వున్న మన స్థావరంలో కొత్తరాజు, అవతార పురుషుడు మెస్సయ్య (Messiah)కు ఘనస్వాగతం పలికి అతని ఆజ్ఞలను, చట్టాలను అక్కడినుంచే ప్రారంభింపచేద్దాం."

ఆ విధంగా కుటిలబుద్ధితో ప్రధాన దేవదూత తన ముఖ్య అనుచరుడిని పురికొల్పి, అతనిద్వారా సైన్యాన్ని ఉత్తేజపరచాడు. వాళ్లంతా తమ నాయకుడు, స్వర్గలోక పరిపాలనలో ఉన్నతాధికారి అయిన ఆ దేవదూత వదనం నక్షత్రాలగుంపును నడిపించే ఉదయతారలా వెలుగొందగా ఆతని మాయమాటల్ని నమ్మిన స్వర్గసైన్యంలో దాదాపు మూడో భాగం ఆ మోసగాడి ఆజ్ఞలు శిరసావహించడానికి సిద్ధమై ఉన్నారు.

ఈ తతంగాన్నంతా ఈశ్వరుడు తన పీఠంపై కూర్చుని గమనిస్తున్నాడు. తిరుగుబాటు బావుటా ఉదయానికల్లా తలపైకెత్తి ఎన్నిగొంతులతో తన ఆజ్ఞను ఉల్లంఘించనున్నదో అంచనావేసి, చిరునవ్వు నవ్వుతూ తన పక్కనే కూర్చుని వున్న కుమారునితో అన్నాడు– "కుమారా! నా కీర్తి ప్రఖ్యాతులు దేదీప్యమానమై వెలిగే కాంతిపుంజమా! నా మహాశక్తులకు వారసుడా! సర్వశక్తిమంతులమన్న (Omnipotence) మన కీర్తికి పరీక్షా సమయం రానున్నది. ఏ ఆయుధాలు, శక్తుల వల్ల మనమీ దివ్యసామ్రాజ్యానికి ఏలికలుగా ఉన్నామో, అంతటి మనల్ని వ్యతిరేకిస్తూ శత్రువు ఉత్తరదిక్కున మనకు పోటీ సామ్రాజ్యాన్ని నెలకొల్పే ఉద్దేశంతో ఎదుగుతున్నాడు. అంతటితో ఆగకుండా యుద్ధానికే దిగి మన శక్తులేమిటో, హక్కులేమిటో తేల్చుకోదలచినట్లున్నాడు. ఈ అపాయాన్ని ఎలా ఎదుర్కోవాలో, మనకు రక్షణనెలా కట్టుదిట్టం

చెయ్యాలో ఆలోచించి త్వరగా ముందడుగు వేయకపోతే, మనమీ ఉన్నత స్థానాన్నీ, రక్షిత ప్రదేశాన్నీ, ఈ పవిత్ర శిఖరాన్నీ కోల్పోతాం."

జగత్ప్రిత మాటలను శ్రద్ధగా విన్న దైవకుమారుడు, ప్రశాంత చిత్తంతో ప్రశస్తమైన మెరుపుకాంతిలా వెలుగుతూ, మాటలకందని నిర్మలత్వంతో సమాధానమిచ్చినాడు. "తండ్రీ! వాళ్లు నీ నిర్ణయాన్ని అపహాస్యం చేయబూని తొందర పడ్డారు. వారి ద్వేషమంతా నీవు నాకు ప్రసాదించిన కీర్తి, గౌరవాల గురించే! నాకున్న అధికారాలతో వాళ్ల గర్వాన్ని పటాపంచలు చేసి, నా శక్తిసామర్థ్యాలను ఋజువు చేసి మీ నిర్ణయం సరైనదని నిరూపిస్తాను. విరోధుల పీచమణచి మీ గౌరవాన్ని నిలబెడ్తాను"

దైవకుమారుడిలా మాట్లాడ్తున్నప్పుడే అక్కడ సాతాను (Satan) తన అసంఖ్యాక బలగాలతో వాయువేగాన, ఆకాశాన అలుముకున్న నక్షత్ర సమూహాల్లా, ఆకులు, పుష్పాలపై నిలిచిన పొగమంచు బిందువుల శ్రేణిలా, ఒక్కో ప్రాంతాన్ని దాటుతూ ఉత్తరదిక్కున ఉన్న తన ల్యూసిఫర్ (Lucifer) రాజప్రాసాదానికి చేరుకున్నాడు. స్వర్గశిఖరపు గుట్టలాంటి దానిపై, భవనాలు, పిరమిడ్లు, బురుజులతో ప్రకాశిస్తున్న ఆ ప్రదేశంలోని తన భవనంలో తమ కొత్తరాజుకు ఆహ్వానం పలికే నెపంతో రప్పించిన సమస్త సైన్యంతో ఇలా పలికాడు–

"సింహాసనాలు, మహారాజ్యాలూ, రాజ్యాలు, సుగుణాలు, శక్తులారా! మీకున్న ఈ కీర్తికిరీటాన్ని భుజకీర్తులనుకుంటే మంచిదే! నామమాత్రమైన అధికారాల్ని కూడా ఒక్క శాసనంతో ఆతడు తన కుమారుడికి ధారపోసాడు. మనమందరం నిన్న రాజుగా అభిషిక్తుడైన, మన అధికార సూర్యులకు పట్టిన గ్రహణం లాంటి వ్యక్తికి స్వాగతం చెప్పడానికి ఈ అర్ధరాత్రి కవాతు (Mid night March) అత్యవసర సమావేశం జరపవలసివచ్చింది. ఎలా మనం కోల్పోయిన గౌరవాధికారాల్ని తిరిగి రాబట్టుకోవాలీ అనేది చర్చించడానికి మిమ్మల్నిక్కడ సమావేశపరిచాను. అన్నీ కోల్పోయినా మన హక్కుల్ని హస్తగతం చేసుకున్నవాళ్లకు మోకాళ్లు నేలకాన్చి నమస్కరిద్దామా లేక సాష్టాంగ దండప్రణామాలు చేద్దామా! ఇప్పటివరకు ఒకరి ఎదుట వంగివంగి దణ్ణాలు పెట్టింది చాలక ఇప్పుడు ఇద్దరికి శిరస్సు వంచి పాదాభివందనాలు చేయాలి! ఈ బలవంతపు కాడిని (Yoke) ఇంకా మోద్దామా, లేదా మనలోని విజ్ఞులు చర్చించి నిర్ణయించాలి! మీరే చెప్పండి మెడలు వంచి, మోకాళ్లు దించి, తలలు వేలాడేద్దామా! నాకు తెలుసు మీరు సరైన నిర్ణయం తీసుకోగలరని! మీ గురించి మీకు తెలిసివుంటే ఏనాడూ స్వర్గలోకపు నివాసులు, స్వర్గపుత్రులు, హోదాల్లో తేడావున్నా, తమ స్వేచ్ఛను ఎవరైనా అడ్డుకోజూస్తే సహించరని అర్థమవుతుంది. వంశపారంపర్య హక్కుతో చక్రవర్తి తన అధికారాల్ని తన ఇష్టం వచ్చిన వాళ్లకు కట్టబెట్టడం, మనలాంటి వాళ్ల స్వేచ్ఛా

స్వాతంత్ర్యాల్ని కాలరాయడం సహించేదేనా! స్వేచ్ఛ మన హక్కు! హోదాలు, అధికారాల్లో తేడా వున్నా మనమందరం సమానులం. అటువంటి మనపైన తన చట్టాన్ని, శాసనాన్ని ఉపయోగించి, మన స్వేచ్ఛకు సంకెళ్లువేసి మనకున్న రాజలాంఛనాలకు, బిరుదులకు అవమానం కలిగిస్తే, మన రాజ్యాల్లో మనం పాలన చేయాలా, లేక సేవకుల్లా ఊడిగం చేయాలా?"

అలా సాతాను ధారాళంగా, అడ్డూఅదుపూ లేకుండా ఇస్తున్న ఉపన్యాసాన్ని నిలువరిస్తూ అబ్డియేల్ (Abdiel) అనే సెరాఫిమ్ (Seraphim) దేవదూత, దేవదేవుని కిష్టుడు, సాతాను ప్రసంగం నచ్చనివాడు ఆవేశంతో లేచి నిలబడి కోపంగా ఇలా అన్నాడు–

"ఆపు నీ మోసపూరితమైన, తప్పుడు నిందారోపణ! ఇది రాజద్రోహం, దైవద్రోహం. స్వర్గలోక నివాసులెవ్వరూ వినకూడని పదజాలం! అత్యున్నత పదవిలో ఉండి నీవే ఇలా మాటలు మాయాజాలంతో మిత్రులను బురిడీ కొట్టించదలుచుకున్నావా? ఏమిటయ్యా నీకు జరిగిన అన్యాయం! తన ఏకైక కుమారుడు, సమర్థుడు అయిన దైవకుమారునికి, సర్వశక్తివంతుడైన ఈశ్వరుడు పట్టాభిషేకం కావించాడు. తనకున్న అధికారాన్ని విచక్షణతో వినియోగించి తనని గౌరవించినట్లే ఆతనిని గౌరవించమని ఆదేశించినాడు. దీనిలో నీ కడుపుమంటేమిటి? ఎవరైతే స్వర్గశాసనాల్ని రూపొందించాడో, వేర్వేరు హోదాలను, విధులను నిర్దేశించాడో ఆతనికే స్వేచ్ఛ స్వాతంత్ర్యాల గురించి పాఠాలు చెబుదామనుకుంటున్నావా! మనందరికీ తెలుసు ఆతని సద్గుణాలు, శక్తులు, ఆతని కృషి నిరంతరం మనల్ని ఆనందలోకంలో ఉంచడానికి ఆతడు పడే తపన మనందరిని ఏకత్రాటిపై నడిపించే తీరు, అన్యులకు సాధ్యం కాదుకదా! నీవు అన్యాయమని ఘోషిస్తున్నావే ఏమిటది? సమానుల్లో సమానులైన వాళ్లుండగా సార్వభౌమత్వం దైవకుమారుడికేమిటనా! నీలో ఉన్న గొప్పతనం, శక్తియుక్తుల్నీ, సమస్త దేవదూతల్లోని దివ్యప్రకృతిని ఒక్కటిగా గణిస్తే ఎంత మహిమ ఉంటుందో అంతటి మహిమాన్వితుడైన వ్యక్తి ఆతడు. ఆతడి సలహా ననుసరించే దేవదేవుడు సమస్త ప్రకృతినీ, నిన్నూ, నన్నూ, అఖిల దివ్యాత్మలనూ సృష్టించి, సింహాసనాలనూ, మహారాజ్యాలనూ, రాజ్యాలనూ, సుగుణాలనూ, శక్తులనూ సృజించి, లోకసృష్టిని మరింత ప్రకాశవంతం చేసినాడు. అందుచేతనే ఆతని శాసనాలే మనకు శిరోధార్యాలు. ఆతనికిచ్చే గౌరవమే మనకు మనమిచ్చుకునేది. ఈ పనికిరాని కోపాన్ని, ద్వేషాన్ని ఉపశమింపజేసుకో! మిగతా వాళ్లను రెచ్చగొట్టకు! నీపై మండిపడుతున్న జగత్పితను, దైవకుమారుడిని శాంతపరచు. కాలం మించకముందే క్షమాపణ కోరి స్వస్థుడవుకా!"

అబ్డియేల్ అన్న మాటలు సాతాను మాయాజాలంలో మునిగిన ఆ అశేష సేనావాహినికి మింగుడుపడలేదు. ఆతని ఒంటరిపోరాటం వృధా అయ్యింది. ఎవరూ అబ్డియేల్ (Abdiel)ను బలపర్చకపోవడంతో ఆనందించిన సాతాను ఇలా అన్నాడు– "భేష్! చాలా కొత్త సంగతులు చెప్పావు. ఎప్పుడు ఈ సృష్టి జరిగిందో ఎవరు చూసారు? సృష్టికర్త నిన్ను సృష్టిస్తుండగా నీవు చూసావా! అప్పుడు కాలమే లేదుకదా! మనముందు ఎవరున్నారో మనకు తెలుసా! స్వయంభువులమై పెరిగాం! మన ఇంగితం మనదే! మన ఈ కుడిచేయి మనం చెయ్యాల్సిన ఉత్కృష్ట కార్యాల్ని తెలుపుతుంది, ఎవరు మనకు సమ ఉజ్జీనో చాటిచెబ్తుంది. యాచించో, యోచించో, బుజ్జగించో, ముట్టడించో సింహాసనాన్ని ఎలా దక్కించుకోవాలో మేమిక్కడ నిర్ణయిస్తాం. నీవు వెళ్లి అభిషిక్తుడైన నీ రాజుకు ఇక్కడి విశేషాలు వెంటనే విన్నవించుకో! ఆలస్యమైతే నీ ప్రయాణానికి అడ్డంకులు రావచ్చు"

సాతాను మాటలకు అక్కడివాళ్లంతా హర్షధ్వానాలు చేసి తమ సమ్మతి తెలిపారు. ఒంటరైనా ఏమాత్రం బెదరని దేవదూత ధైర్యంగా పలికాడు–

"దైవమార్గాన్ని పరిత్యజించినవాడా! శాపగ్రస్తుడైన దేవదూతా! మంచిని వదిలి నీవూ నీ అనుయాయులు పతనానికే సిద్ధమవుతున్నారు. నీ నమ్మకద్రోహం, విశ్వాసఘాతుకం అంటురోగంలా వ్యాపించి నీ నేరాలను శిక్షలను కప్పివేసింది. ఇంక నీవు అవతార పురుషుని (Messiah) కాడి మోయాల్సిన పనిలేదు. దైవ శాసనాలు, క్షమాభిక్షలు నీకిక వర్తించవు. ఏ స్వర్ణదండాన్ని నీవు తిరస్కరించావో అదే నీ పాలిట లోహదండమై నీ అవిధేయతనూ, నిన్నూ చితకగొట్టి శిక్షిస్తుంది. నీవు వెళ్లిపొమ్మని చెప్పావని కాదు, నేనిక్కడే తాత్సారం చేస్తూవుంటే మహాశక్తివంతుడైన ఆతని కోపాగ్నిలో మీతో ఉన్న నేనుకూడ భస్మీపటలం కావాల్సి వస్తుంది. ఏ క్షణమైనా నీ నెత్తిపై విరుచుకుపడే పిడుగులు, మెరుపుల జ్వాలల్ని తట్టుకోడానికి సిద్ధంగా ఉండు. ఎవరు నిన్ను సృష్టించినందుకు బాధపడ్తున్నారో, అతడే నిన్ను నశింపజేసి ఊరడిల్లుతాడు" అని తీవ్రంగా పలికి అబ్డియేల్ దేవదూత ఆ అవిశ్వాసుల సమూహాన్ని విడిచి, సత్యమార్గంలో, తనని ద్వేషపు చూపుల్తో పొడుస్తున్న విరోధుల్ని లెక్కచేయకుండా, ఎటువంటి భయమూ తనను చేరనీకుండా ఆకాశానికెగిరి, త్వరలో ధ్వంసం కానున్న ఆ నగరాన్ని, బురుజుల్ని దాటి స్వర్గంవేపు ప్రయాణం సాగించాడు.

6. సాతానుపై అవతార పురుషుని (Messiah) విజయం

రాఫెల్ తన కథానాన్ని కొనసాగించాడు – సాతాను, అతని సైన్యంపై మైఖేల్, గాబ్రియేల్‌ల పోరాటం తొలినాటి యుద్ధం. చీకటిమాటున తప్పుకున్న సాతాను సైన్య సమూహం. రెండవరోజు యుద్ధంలో సాతాను ఉపయోగించిన భయంకర యుద్ధ యంత్రాలు మైఖేల్ బృందాన్ని చీకాకు పరచడం, వాళ్లు పర్వతాలను అడ్డంగా నిలిపి యుద్ధయంత్రాలను నిలువరించడం, తిరుగుబాటు ఇంకా అణగకపోవడంతో మూడవరోజున దేవదేవుని ఆశీస్సులతో మెస్సయ్య తనకై ప్రత్యేకించిన విజయసాధనకై ఇరుపక్షాల మధ్యకు అద్భుతమైన రథంలో వజ్రాయుధపు మెరుపులను పిడుగులను కురిపించే ఆయుధాలతో, శత్రువుల మధ్యకు దూసుకువెళ్లి భయభ్రాంతులైన వాళ్లను తరుముతూ స్వర్గలోకపు అంచులవద్ద ఉన్న ద్వారాల నుంచి అగాధానికి అడుగున ఉన్న చీకటి నరకకూపంలోకి, సాతానును అతని సైన్యాన్ని పతనం చెందించడం; విజయుడై మెస్సయ్య, తండ్రివద్దకు రావడం–

రాత్రంతా అలుపులేకుండా అబ్దియేల్ దేవదూత అప్రతిహతంగా తన ప్రయాణాన్ని కొనసాగించి ఉదయానికల్లా స్వర్గద్వారాల వెలుపల వున్న మైదానం వద్దకు చేరుకున్నాడు. పరిభ్రమించే కాలపు గంటలు తమ అరుణహస్తాలతో కాంతి ద్వారాలను తెరవగా ఎల్లెడలా వెలుగే! దైవశిఖరంలో సింహాసనం పక్కనే ఉన్న గుహలో వెలుగు చీకటి ఒకదాని తర్వాత ఒకటి వస్తూపోతూ రాత్రింబవళ్లలా పర్యాయక్రమాన్ని పాటిస్తూ వెలుగు ఈ ద్వారం నుచి నిష్క్రమించగానే క్షణం ఆలస్యం లేకుండా చీకటి ఆ ద్వారం నుంచి ప్రవేశిస్తుంది. స్వర్గంలో చీకటి కూడా సంజెవెలుగులా మందప్రభ (Twilight Zone) లా కొద్దిపాటి వెలుతురుతో ప్రకాశిస్తుంది. ఆ వెలుగు ఉదయపు కాంతులతో ప్రకాశవంతం కాగా అబ్దియేల్ దేవదూత అబ్బురపడిపోయాడు, తన కళ్లముందు కనిపించిన దృశ్యాన్ని చూసి! మైదానం అంతా నిండిన అనంత సేనావాహిని మెరుస్తున్న రథాలు, జ్వాలావలయిత ఆయుధాలు, పొగలు గక్కుతున్న అశ్వాలు, జ్వాలలపై జ్వాలలు, అంచెలంచెలుగా! యుద్ధం! యుద్ధానికి సిద్ధం! అందరూ అప్రమత్తులై ఉన్నారు. అబ్దియేల్ (Abdiel)కు సంతోషం వేసింది. తను అందిద్దామనుకున్న సమాచారం తనకన్నా ముందే దేవదేవునికి చేరిందన్నమాట! అతనిని చూడగానే మిత్రులందరూ జయజయధ్వానాలు చేస్తూ అపరిమితమైన సంతోషంతో అతనిని భుజాలపై ఎత్తుకుని – పతనమైన పదివేల వేలమందిలో చెక్కుచెదరకుండా వచ్చిన ఏకైక వీరుని గౌరవించినట్లు – కేరింతలు కొడ్తూ సర్వంసహా చక్రవర్తి పీఠంవేపు తీసుకువెళ్తున్నారు. అంతలో బంగారుమేఘం మధ్య నుంచి అశరీరవాణి విన్పించింది.

"దైవసేవకా! నీ విధేయతను అభినందిస్తున్నాను. అత్యంత క్లిష్టపరిస్థితిలో కూడా నీ నడవడిక, ప్రవర్తన అందరికీ మార్గదర్శకం. వేలాదిమంది తిరుగుబాటు దారుల మధ్య ఒంటరిగా నీవుచూపిన సాహసం తెగువ అనన్యసామాన్యమైనవి. వాళ్ల ఆయుధాలకన్నా శక్తివంతమైనది నీవెన్నుకున్న సత్యమార్గం. దాన్ని నిరూపించి అందరిదూషణకు గురికావడం, హింసకన్నా అతికష్టతరమైనా సహించి ఇక్కడకు వచ్చి దేవుని దృష్టిలో నిలిచినావు. ఇప్పుడు మీరందరూ రాజద్రోహానికి, దైవద్రోహానికి సమకట్టిన మన శత్రువులను ఎదుర్కొనండి. తన శక్తి ద్వారా రాజపీఠాన్ని అధిష్టించిన దైవకుమారుడు మెస్సయ్య (Messaiah) ఈ యుద్ధాన్ని పర్యవేక్షించగలడు. దేవతల సేనాని మైఖేల్ మరియు గాబ్రియేల్! అపజయమెరుగని వాళ్లై ఆయుధపాణులైన సాధు సంతులతో (Saints) వేలాదిగా, లక్షలాదిగా, తిరగబడ్డ దేవదూతలకు సమానమైన సంఖ్యలో ఎదుర్కొని వాళ్లను తిరుగులేని దెబ్బకొట్టి, వాళ్ల పీచమడంచి ఈ ఆనందకరమైన స్వర్గం నుంచి తరిమి తరిమి, వీళ్లకోసం నోరుతెరచుకు చూస్తున్న టార్టారస్ అగాధంలోకి (Tartarus gulf), జ్వలిస్తున్న అవ్యక్తస్థితి (Chaos) గుండా విసిరికొట్టండి!"

సర్వంసహా సామ్రాజ్యశక్తి అలా పలుకగానే, దైవశిఖరంపై కారుమబ్బులు కమ్మి, మసకచీకటి గుచ్చాలు, ఆరిపోనంటున్న జ్వాలలు, ఆగ్రహ సూచనలు అన్నిదిక్కులా కమ్ముకొనగా స్వర్గలోకపు భేరీభాంకార నినాదాలు ఆకాశపు ధక్కల్ని పగులగొడ్తున్నట్లు ధ్వనించి, ప్రవహిస్తున్న పెను సముద్రపు అలల్లా సర్వసమాయత్తమైన సైన్యం అన్ని దిక్కులనుండి ముందుకు కదలసాగింది. సమర సంగీతానికి అనుగుణంగా కవాతు చేస్తూ ప్రతి అడుగూ అత్యంత క్రమశిక్షణతో, శత్రువుల గుండెలవిసేలా వేస్తూ దేవదేవుని కోసం, ఆతని కుమారుడు 'మెస్సయ్య' కోసం, స్వర్గరక్షణ కోసం, తమకోసం, నిశ్శబ్దంలో నిశ్శబ్ద శబ్దంగా మహాసేనానుల నాయకత్వంలో ఆ ప్రచండ సేనావాహిని నెమ్మదిగా సాగుతున్నది. కొండా గుట్టా వాగూ వంకా అడవీ ఏరూ విడదీయలేని విధంగా వారంతా ఒక సమూహంగా, ఈడెన్ వనానికి రమ్మన్న ఆజ్ఞను శిరసావహించి ఎగురుతూ వస్తున్న పక్షుల గుంపులా, అసంఖ్యాకంగా ఈ కొత్తలోకానికి పదింతలున్న మైదానంలో, ఉత్తర దిక్కుకు కదిలినారు.

ఎదురుగా సాతాను సైన్యం ఈ కొసనుండి ఆ కొసవరకూ ఉత్తరపుదిక్కునంతా ఆక్రమించి, శిరస్త్రాణ, కవచ, బల్లేలతో దుర్భేద్యంగా కన్పట్టసాగింది. మెరుపువేగంతో శత్రువు ఊహించని విధంగా దైవశిఖరాన్ని ముట్టడించి, సింహాసనాన్ని ఆక్రమించుకుందామనుకున్న సాతానుకు (Satan) ఆదిలోనే హంసపాదెదురయ్యింది. ఈ యుద్ధంలో విశేషమేమిటంటే ఇరుపక్షాల యోధులూ దేవదూతలే. ప్రేమ ఆనందపు

ఉత్సవాలలో కలిసి తిరిగినవాళ్లే! ఒకే దేవుని సంతానంగా ప్రత్యేకమైన పేర్లకన్నా దేవదూతలుగా పిలువబడి, ఎల్లప్పుడూ ఆ దేవదేవుని కీర్తిస్తూ సంతోషంగా కాలం గడిపినవారే! కాని ఈనాడు ఒక్కసారిగా ప్రతిధ్వనించిన రణన్నినాదం వాళ్లని చుట్టుముట్టి వారిలోని సోదరప్రేమను అదృశ్యం చేసింది. ఆ సైన్యం మధ్యలో ఆ మతభ్రష్టుడు (Apostat), సమస్త లాంఛనాలతో ప్రకాశిస్తున్న రధంలో దేవునిలా తన చుట్టూరా వెలుగులు విరజిమ్ముతున్న కేతనాలు, స్వర్ణచిహ్నాలతో చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ఆసీనుడైయున్నాడు. రెండు పక్షాల మధ్య దూరం తగ్గింది. తన రధం నుంచి దిగిన సాతాను, – సైన్యం ముందు పెద్దపెద్ద అంగలువేస్తూ వాళ్లకు ఆజ్ఞలు జారీచేస్తున్నాడు. వజ్రసమానమై, సువర్ణ మణిమయమైన ఆయుధాలను ధరించి శత్రువుల గుండెల్లో గుబులు కలిగించే రూపంతో తన సైనికులను ఉత్తేజరుస్తున్న 'సాతాను'ను చూసి దేవతల పక్షాన ఉన్న ప్రముఖ వీరుల మధ్య నిలబడ్డ అబ్దియేల్ (Abdiel) తనలోతాను అనుకోసాగినాడు.

"ఓ దేవలోకమా! రూప పరాక్రమాలలో ఆ దేవదేవుణ్ణి తలపిస్తున్నా విశ్వాసం, లోకజ్ఞానం లేనప్పుడు అవన్నీ వృధాయేకదా? శక్తిసామర్థ్యాలు, సుగుణాలు ఎక్కడ పరాజయం చెందుతాయి? ఎక్కడ బలహీనుడు గెలుస్తాడు? ఎక్కడ ధైర్యవంతుడు విజయం సాధిస్తాడు? ఋజుమార్గంలో నడిచే వ్యక్తికి విజయం లభిస్తుందా? పరాక్రమం, బలం ఇవి శాశ్వతమా! మంచీచెడుల విచక్షణా జ్ఞానం, బలంతో తలపడినప్పుడు ఎవరు గెలిస్తే అదే మంచిగా భావించబడుతుందా! మంచీచెడులకు కొలమానం ఏమిటి?"

అలా ఆలోచిస్తూనే అబ్దియేల్ (Abdiel) తానున్న చోటునుంచి రెండు సైన్యాల మధ్య ఉన్న ఖాళీ స్థలంలోకి వచ్చేసరికి ఆతనికి ఎదురుగా సాతాను కనిపించాడు.

"ఇలా కలిసినందుకు చాలా గర్వంగా ఉంది కదూ! ఎవరూ దైవ సింహాసనానికి రక్షణగా ఉండరు, ఇలావచ్చి అలా ఎగరేసుకుపోవచ్చు అధికార పీఠాన్ని అనుకుని ఎంతో ఉత్సాహంతో వచ్చారు ఘనత వహించిన పెద్దవారు! మిమ్మల్నీ మీ బలగాల్నీ చూసి, మీ మాట నేర్పరితనానికి, భయంతోనో మాయమాటలకో లొంగిపోయి ఈ స్వర్గాన్ని అప్పనంగా తమకు అప్పజెబుతారని అనుకుంటే అంతా తారుమారై పరిస్థితి తలకిందులుగా కనబడుతోందా? తెలివితక్కువవాడా! సర్వశక్తి మంతుడైన దేవదేవుడితోనే తలపడడం అంటే గొర్రెపొట్టేలు కొండను ఢీకొనడంకాదూ! ఆతడు సూక్ష్మవస్తువుల నుంచి సృష్టించిన ఈ అఖండ సేనావాహినిని గమనించావా! ఆతని ఒక్క హస్తం చాలు, అనంతంగా పెరిగి నీ యావత్ సైన్యపటాలాల్ని అణచి

మిమ్మల్ని చీకటిగుహల్లో శాశ్వతంగా సమాధి చేయడానికి! ఇప్పుడు నీవెనక వున్న వాళ్లందరూ నీ విధేయులని నేననుకోను. వాళ్లలో విశ్వాసులైనవారు, దేవుని కరుణ కోరేవారు, నాలా నీ మోసాన్ని గ్రహించినవారు నీకు కనబడకపోయినా నా కళ్లకు కనిపిస్తూనే ఉన్నారు"

తన దారికడ్డుపడి తననే వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్న అబ్దియేల్ (Abdiel) దేవదూతను తిరస్కారంగా చూస్తూ ఆ మహాశత్రువు ప్రత్యుత్తరమిచ్చాడు.

"మూర్ఖుడా! నాశనమైపో! నా ప్రతీకార సమయంలో అందరిముందు నాకు వ్యతిరేకంగా మాట్లాడి, అక్కడ్నుంచి యెకాయెకి ఇక్కడకు ఏదో బంగారుపతకం కొట్టేద్దామని పారిపోయివచ్చావు! దొరికిందామరి ఆ కీర్తికిరీటం! మూడోవంతు దేవతలు తమతమ శక్తిసామర్థ్యాలు తమకుండగా ఒకరిని సర్వశక్తిమంతుడుగా (Omnipotent) ఎన్నికచేసి కీర్తించడం తగదనే భావిస్తున్నారు. స్వర్గలోకంలోని ప్రతి ఆత్మకు స్వేచ్ఛ ఆనందం ఒకటే అని అనుకున్నాను. సోమరితనం పెరిగిపోయి విందూవినోదాలే సేవాకార్యక్రమాలయ్యాయిక్కడ. దాస్యానికి, స్వేచ్ఛకు మధ్య జరిగే ఈ విముక్తి పోరాటంలో ఎవరు విజేతలయ్యేది ఈరోజు తేలిపోతుంది"

అబ్దియేల్ (Abdiel) తీవ్రంగా ప్రతిస్పందించాడు– "మతభ్రష్టుడా! మళ్లీ తప్పు చేస్తున్నావు. ప్రభుసేవకు, దాస్యానికి తేడా తెలియని అజ్ఞానివి. దేవుడు లేదా ప్రకృతిని కొలవడాన్నీ, సేవకవృత్తినీ సమానమని ఎలా అంటున్నావు? దేవుడు ప్రకృతి ఒక్కటే కాదా! ఆ పరిపాలన సర్వోన్నతమైనది! దాస్యమనేది మూర్ఖులకు చేసే ఊడిగం ముఖ్యంగా నీలాంటి వాళ్లకు చేసే సేవ! నీకంటే అత్యున్నతుడిపై తిరుగుబాటుచేసి అదే స్వేచ్ఛ, విముక్తి అని హెచ్చులు పోతావేమి? నరకంలో సంకెళ్లతో పడి అక్కడ నీ రాజ్యాన్ని, నీ పరిపాలనను చక్కదిద్దుకుందువుగాని. ఇక్కడ నేను దేవదేవుణ్ణి సేవించుకునే భాగ్యం కలిగినందుకు సంతోషిస్తూ, పారిపోయివచ్చానన్నావుగా, ఇదుగో నేను నీకిచ్చే స్వాగత సత్కారాన్ని స్వీకరించు"

అలా అంటూనే అబ్దియేల్ (Abdiel) మెరుపులాంటి ప్రహారాన్ని, ఏ కన్నూ పసికట్టలేనంత వేగంగా, సాతాను శిఖపై కొట్టేసరికి అంతటి శక్తిమంతుడూ పది అడుగుల దూరం వెనక్కిపోయి, భూమి అడుగునుంచి విపరీతమైన ఒత్తిడితో ఊబికిన నీటిబుగ్గ పైన్‌వృక్షాలతో నిండిన పర్వతాన్ని పక్కకు ఒదిగించినట్లు, మోకాళ్లపై వంగి పాదాలతో నేలను తట్టుకుని చేతిలోని బల్లెం ఆకాశంవేపు చూస్తున్నట్లుండగా తమాయించుకుని నిలబడ్డాడు. హఠాత్తుగా జరిగిన ఆ పరిణామానికి శత్రుపక్షం దిగ్భ్రాంతులై నిలబడగా, దైవసేవకులందరూ హర్షధ్వానాలతో మిన్నుముట్టేలా

జయజయధ్వానాలు చేసారు. మహాసేనాని మైఖేల్ (Michael) యుద్ధబాకాను (Trumpet) ఊదగా, అది స్వర్గంలోకమంతా ప్రతిధ్వనించి, విశ్వాసులైన దేవదూతలు 'హోసన్నా' (Hosanna) త్రాహి, త్రాహి! అని దేవదేవుణ్ణి ప్రార్థిస్తుండగా ఇరుపక్షాల మధ్య పోరు భయంకరంగా సాగింది. అంతవరకూ స్వర్గంలో ఎన్నడూ జరగని యుద్ధంలో లోహకవచాల, శిరస్త్రాణాల ధ్వనులు, రథచక్రాల సవ్వడులు 'హిస్'మని దూసుకుపోతున్న జ్వాలాబాణాలు, పట్టరాని ఆగ్రహం, ఒకరినొకరు నరుక్కోవాలనే ద్వేషం, యుద్ధపు మౌఢ్యంతో కలిసి స్వర్గలోకం అట్టుడికిపోయింది. అప్పుడే గనక భూమి ఉండివుంటే భూకంపాలతో దద్దరిల్లిఉండేది. ఇరువైపులా ఉన్న లక్షలు, కోట్లు దేవదూతలు పరస్పర హననాలతో, ఎవరికివారు విజయం తన ఒక్కడి మీదే ఆధారపడి ఉన్నట్లు పోరాడుతూ, శత్రువును ఓడించడం మీదనే దృష్టి నిలిపి, నేలపై నడుస్తూ, గాలిలో ఎగుర్తూ, తమ పోరాట జ్వాలలతో గాలిని అగ్నిగుండాలుగా మారుస్తూండగా భీకరంగా యుద్ధం సాగి జయాపజయాల త్రాసు ఇరువైపుల సమానంగా తూగింది. అంతవరకు తనకు సమాన ప్రతిద్వంద్వి దొరకక అసహనంగా వున్న సాతానుకు, తన అసమాన ఖడ్గవిద్వానైపుణ్యంతో దళాలకు దళాల శత్రువులను మట్టికరిపిస్తున్న మైఖేల్ (Michael) కనిపించాడు. వజ్రకఠినమైన డాలును చేబూని తనను నిలువరించ వస్తున్న సాతానును చూసి 'మైఖేల్' సంతోషించాడు. ఈ శత్రునాయకుణ్ణి ఓడించి, బందీగా శృంఖలాబద్ధుణ్ణి చేస్తే ఈనాటితో ఈ గొడవ సద్దుమణుగుతుంది. స్వర్గం మరల ఆనందలోకంగా మారుతుంది.

"దుష్టప్రణాళికా రచయితా! స్వర్గం ఏనాడూ కనీవినీ ఎరుగని ద్వేషపూరిత యుద్ధజ్వాలల్నిక్కడ పాదుకొలిపి, శాంతికి భంగం కలిగించావు. ప్రకృతికి దుఃఖాన్ని, లక్షలాది దేవదూతలలో వైషమ్యాన్ని, కలిగించే చీడపురుగువైనావు. ఇంక నిన్ను సహించేది లేదు. నీ విషధూమాలు స్వర్గంలోకి వ్యాపించేలోపలే నిన్నిక్కడనుంచి శాశ్వతంగా తరిమివేస్తాం! దివ్యానంద స్థానమైన వెలుగులోకంలో హింస, యుద్ధాలకు తావులేదు. నిన్నూ నీ తిరుగుబాటు సమూహాన్నీ ఈ పవిత్ర ఖడ్గంతోనో, దేవదేవుని ప్రతీకారాగ్నితోనో కట్టకట్టి నరకలోకంలోకి నెట్టివేయక తప్పదు!" అని గర్జించాడు మైఖేల్. సాతాను దానికి ప్రతిగా సవాల్ విసిరాడు–

"గాలిమాటలతో, బెదిరింపులతో నాలాంటి కార్యదక్షుణ్ణి బెదిరించలేవు మైఖేల్! నీ ఈ ఊకదంపుడు ఉపన్యాసాన్ని యుద్ధ విన్యాసంగా మార్చుకుంటే కొంత ఉపయోగముండవచ్చు. నీవే ఏదైతే దుష్టప్రణాళికగా ఘోషిస్తున్నావో దానినే మేము విజయగీతికగా ఆలాపిస్తున్నాము. మేం ఎలాగూ గెలవడం ఖాయం. ఆనక ఇది స్వర్గమో, నరకమో, పరిపాలించినా పరిపాలించకపోయినా, ఇక్కడ స్వేచ్ఛగా

తిరుగుతాము. చాతనైతే మీరు మహాశక్తివంతుడని రోజూ కీర్తిస్తూన్నారు కదా ఆ 'ఆల్‌మైతీ' (Almighty)ని సాయంగా పిలుచుకో. నీకూ మంచిది"

సవాళ్లు ముగిసాయి. మాటలు నిశ్శబ్దమై చేతలు చేతులై ఆయుధాల్ని ధరించి ఢీకొన్నాయి. ఆ అద్భుత యుద్ధం వర్ణించ వీలుకానిది. ఇద్దరు ప్రసిద్ధ దేవదూతలు స్వర్గాన్ని పణంగా పెట్టి సమరానికి దిగినప్పుడు వారి ప్రతి కదలిక, ఆయుధ విన్యాసం, భంగిమ చూపరులను కట్టిపడేస్తాయికదా! వారి చేతుల్లోని పదునైన ఖడ్గాలు జ్వాలల్ని చిమ్ముతూ, గాలిలో జ్వాలావలయాల్ని సృష్టిస్తుండగా, వారి డాలులు (Shields) ఎదురెదుగా ఉన్న రెండు సూర్యబింబాల్లా ప్రకాశిస్తూండగా, వారిరువురి ఖడ్గ ప్రహారాలకు దూరంగా తొలగి వలయంగా మారిన సైన్యసమూహాలు – ప్రకృతి ప్రకోపించిన విశ్వవిలయంలో తారామండలాన యుద్ధాలుద్భవించగా, రెండు గ్రహాలు అతివేగంగా ఎదురెదుగా వస్తూ ఆకాశం మధ్యలో ఢీకొనబోతున్నట్లు – ఆ ప్రత్యర్థులిద్దరూ ఒక్కవేటుతో ఎదుటివారిని నేలకొరిగించేంత భీకరమైన దాడులు జరుపుతూ, దెబ్బకు దెబ్బలు తీస్తున్నారు.

మైఖేల్ (Michael) చేతిలోని ఖడ్గం సామాన్యమైనది కాదు దేవుని ఆయుధాల్లో (Armour of God) ఒకటైన ఆ దివ్యఖడ్గం సాతాను ఖడ్గాన్ని తాకి, పక్కగా దూసుకుపోయి ఆతని శరీరాన్ని చీరి గాయం చేసింది. నెప్పితో మెలికలు తిరుగుతూ సాతాను, తన గాయం నుండి స్రవించిన ఇకార్ (Ichor = Nectarous humor) రక్తమై ప్రవహించగా, ఆతని సైనికులు వలయంలా రక్షణగా మారి ఆతనిని మోసుకునిపోయి రథంలో ఉంచినారు. ఒక్కపక్క గాయం బాధ, మరోవేపు అవమాన భారం ఆతనిని కృంగదీయగా పళ్లు పటపట కొరుకుతూ, నెప్పిని భరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆతనికి తాను దేవునికి సమఉజ్జీ అన్న ఆత్మవిశ్వాసానికి ఇది ఎదురుదెబ్బగా తగిలింది.

దివ్యాత్మలకు గాయాలు త్వరగా నయమవుతాయి. మానవుడికిలా వారికి మృత్యుభయం లేదు. శరీరంలోని అన్ని భాగాల్లో, ఇంద్రియాల్లో, జ్ఞానంలో నివసిస్తూ వాళ్లు త్వరితంగా స్వస్థులౌతారు. వారికి కావల్సిన శరీరభాగాల్ని, రూపాల్ని, పరిమాణాన్ని సంతరించుకోగలరు.

మొదటిరోజు యుద్ధంలో ఇంకోచోట గాబ్రియేల్ (Gabriel) భయంకరుడైన మోలోక్ (Moloc)తో తలపడి ఆతనిని తీవ్రంగా గాయపరచగా 'మోలోక్' కుయ్యోమొర్రోమని మొత్తుకుంటూ రణరంగాన్ని వదిలి సురక్షిత ప్రాంతానికి పారిపోయాడు.

యురియెల్ (Uriel), రాఫెల్ (Raphel)లు తమ భీకరయుద్ధంలో అడ్రామెలెక్ (Adramelec), అస్మడాయి (Asmadai)ల కవచాలను చిన్నాభిన్నం చేసి చితకగొట్టగా వాళ్లు వెన్నుచూపి పోయినారు. అబ్డియేల్ (Abdiel), ఏరియెల్ (Ariel), రామియెల్ (Ramiel)లు దేవుని విశ్వసించనివాళ్లని తమ అగ్నిజ్వాలల్లో కాల్చి చీకాకుపరచి పారద్రోలినారు. ఇటువంటి విజయాలు వేలాదిగా చెప్పవచ్చును. దేవదూతలు మానవుల పొగడ్తలను ఆశించరు. కాని నరకంలో ఉన్న వాళ్లకు అవి జ్ఞాపకాలు, సత్యమార్గం నచ్చక, సద్గుణాలు మెచ్చక, అపకీర్తిలో కీర్తిని వెదుకుతూ, కాంతి మార్గాన్ని విడనాడి చీకటి గుయ్యారాల్లో మగ్గ నిశ్చయించుకున్న వాళ్లకు శాశ్వత మౌనమే శిక్షగా విధించబడ్తుంది.

వీరాధివీరులమనుకున్నవాళ్లు గాయాలతో నిష్క్రమించేసరికి యుద్ధరంగ మంతా భీభత్స దృశ్యమయ్యింది. చెల్లాచెదరుగా పడివున్న కవచాలు, ఆయుధాలు, ఎగిరిపడ్డ రథాలు, పొగలు నురుగు కక్కుతున్న అశ్వాలు, గాయాలతో రోదిస్తూ, భయవిహ్వలులై, దేవదేవుని సైన్యధాటికి ఓర్వలేని సాతాను సైనికసమూహం భయం వెనుక బాధ, గాయాల సలపరం, అవమానం అప్పటివరకు తెలియని ఆ దుర్భర అనుభవాలు వెంటాడి వాళ్లు సురక్షితమనుకున్న చీకటి తెరలవేపు పారిపోసాగినారు. అవిధేయులకు, అవిశ్వాసులకు దేవదేవుడు విధించిన శిక్ష అది.

దైవసైన్యం ఘనాకారపు వ్యూహంలో (Cubic Phalanx) శత్రువులను చీకాకుపరచి, తాము చెక్కుచెదరకుండా ముందుకు సాగుతున్నారు. విశ్వాసులకు, విధేయులకు, అమాయకులకు, స్వచ్ఛమైన జీవితం గడిపేవాళ్లకు దేవదేవుడే రక్షణ కవచంలా కాపాడుతాడు. వారికి అలసట, ఆయాసం, గాయాలు, నెప్పులూ దరిచేరవు.

స్వర్గంలో రాత్రిసమయం కావచ్చింది. యుద్ధవిరమణ సూచికలు రాగా ఇరువైపుల సైన్యం నిశ్శబ్దంగా తమతమ శిబిరాలకు మరలినారు. ఆనాటి విజేతలైన మైఖేల్ అతని మిత్రులు శిబిరాలవద్ద కట్టుదిట్టమైన రాత్రిపహారాలను నియమించినారు. సాతాను, అతని అనుయాయులు చీకటిమాటున నిష్క్రమించి, ఆ రాత్రి అత్యవసర సమావేశానికి ఆంతరంగికులకు కబురు పంపినాడు.

"మిత్రులారా! మనం ప్రమాదాలని ఎదుర్కున్నాం! అయినా పూర్తిగా తలవంచలేదు. అనుభవాలే గుణపాఠాలుగా, స్వేచ్ఛకోసమే కాదు ఆత్మగౌరవం, స్వరాజ్యం, ఖ్యాతి, కీర్తిప్రతిష్ఠల కోసం మనం నిరంతర పోరాటం సాగించాలి. శత్రువు వద్ద ఉన్న ఆయుధాలకన్నా శక్తివంతమైనవి రేపటి యుద్ధంలో వినియోగించి దెబ్బకుదెబ్బ తీద్దాం. మనకీనాడు తెలుసు వాళ్లు వాడిన ఆయుధాలు మనల్ని

గాయపరచినా, ఆ గాయాలు వెంటనే నయమై మనకు కొద్దిపాటి బాధనే కలిగిస్తున్నాయి. మనం వాటికన్నా శక్తివంతమైన, క్రూరమైన ఆయుధ సంపత్తితో శత్రువులపై దాడిచేసి మనం అనుభవించిన బాధలకు రెట్టింపు వాళ్లకు కలుగజేసి ప్రతీకారం తీర్చుకుందాం. శత్రువు దగ్గర ఉన్న రహస్య ఆయుధాల గురించి శోధన చేసి మన రక్షణ వ్యూహాన్ని రూపొందించుకొనడానికే ఈ అత్యవసర సమావేశం ఏర్పాటుచేయబడింది"

సాతాను కూర్చోగానే నిస్రాక్ (Nisroc) దేవదూత గణాల్లో ప్రిన్సిపాలిటీ (Principality) అనే గణముఖ్యుడు, యుద్ధంలో అలిసి వచ్చినవాడు లేచి నిలబడి ఇలా అన్నాడు– "కొత్త ప్రభువు పాలన నుండి మిత్రులను విముక్తి చేయతలపెట్టినవాడా! దేవతలుగా మన హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమించిన నాయకా! దేవతలమైన మనమే తక్కువ శ్రేణి ఆయుధాలతో పోరాడడం వలన కలిగిన దుష్ఫలితాలను, బాధలను అనుభవిస్తున్నాము. గాయాల బాధతో పోరాడడం అదీ నెప్పితెలియని వాళ్లతో మరింత కష్టం. ఆనందం లేకపోయినా జీవించగలం. కాని బాధతో క్షణకాలం గడపడమైనా కష్టం. నెప్పి ఉండడం హీనాతిహీనమైన స్థితి. దుష్కర్మలలో చివరిది. నెప్పి ఓరిమికి సహజశత్రువు. ఎలా మన శత్రువుల్ని గాయపరచి వాళ్లకు మనం పడ్తున్న బాధను కలిగేలా చేయగలమో, లేదా మనకు గాయాలు నెప్పులు లేకుండా రక్షణ వ్యూహాన్ని పెంపొందించుకొనగలమో, ఆలోచించడం మన తక్షణ కర్తవ్యం! అదే మన విముక్తి మార్గం!"

సాతాను సమాధానమిచ్చాడు– "అటువంటి ఆయుధాలు మనదగ్గర ఉన్నాయి. రేపటి యుద్ధంలో అవే ముఖ్యపాత్ర వహిస్తాయి. మనం నిలబడి వున్న ప్రాంతానికి దిగువ, ఆకాశంపై ఉన్న ఈథరస్ (Etherous) ప్రదేశంలో అవి సిద్ధంగా ఉన్నాయి. ఫలపుష్పశోభిత వనాలు, అమృతం, మణులు, స్వర్ణరాశులతో ప్రకాశిస్తున్న స్వర్గానికి అడుగున, పొగలుకక్కుతూ, కుతకుత ఉడుకుతున్న ముడిపదార్థం, మన యంత్రాలలో, పొడుగ్గా, గుండ్రంగా ఉండే ఫిరంగులలో ఉంచి కాస్త నిప్పు అంటించగానే భయంకర శబ్దంతో దూసుకువెళ్లి పగతురపై విస్ఫోటించి సర్వనాశనం చేయగలవు. ఉరుములు మెరుపులు పిడుగులతో మనపై ఉరుకుదామనుకునే శత్రువుకు రేపు మన సత్తా యేమిటో తెలిసివస్తుంది. అదిచూసి వాళ్ళు మనం వజ్రాయుధపాణియై మెరుపులు కురిపించే అధినాయకుడిని (Thunderer) నిరాయుధుణ్ణి చేసామని భ్రమించగలరు. ఈలోగా మీరు స్వస్థులై, భయాన్ని విడనాడి, ధైర్యాన్ని పుంజుకొనండి. నిరాశ అవసరంలేదు"

ఆతని ఓదార్పుతో, స్వాంతన వచనాలతో తేరుకున్న ఆ తిరగబడ్డ దేవదూతల సమూహం కొత్తశక్తిని పొందినవాళ్లై, సృష్టికర్తకే తెలియని నూతన మారణాయుధాలను పొగుడుతూ, వాటి నిర్మాణకర్తను కొనియాడుతూ రేపటిమీద ఆశతో విశ్రాంతి తీసుకుంటున్నారు. రాబోయేకాలంలో మానవజాతి ఒకరిపై ఒకరు పగలు పెంచుకుని దాడులు చేసుకునేప్పుడు నిర్మించుకునే యుద్ధయంత్రాలు, తంత్రాలకు ఇదే నాంది కావచ్చును.

మహానేత అనుమతితో సాతాను సైన్యపునిపుణులు దివ్యలోకపు నేల అడుగున దాగివున్న కర్బన ముడిపదార్థాల్ని, గంధకం, నత్రజని (Sulphur, Nitrous Foam)ని విడదీసి మహాచతురతతో వాటిని తగుపాళ్లలో కలపగా తయారైన నల్లటి రేణువుల్లాంటి పొడిని యుద్ధయంత్రపు పొడుగాటి మందమైన గొట్టాల్లో దట్టించి, గుండ్రటి గోళాలను నింపి, మరోచివర నిప్పు అంటుకునేందుకు వీలుగా ఎండు రెల్లుగడ్డిని కూర్చి ఆ మారణ యంత్రాలను యుద్ధానికి రాత్రిమాటున సిద్ధం చేసినారు.

తూర్పువాకిట వెలుతురు అడుగుపెట్టగానే నిన్నటి విజేతలైన దేవదూతలు ఆయుధపాణులై యుద్ధభేరీ భాంకారాలు మోగుతుండగా స్వర్ణకవచధారులై దేదీప్యమానంగా మెరుస్తూ యుద్ధ సన్నద్ధులై నిలబడ్డారు. గస్తీదళ సభ్యులు (Scouts) దూరంగా కనిపిస్తున్న శత్రుశిబిరాలవేపు సమాచారం సేకరించుకు రావడానికి వెళ్లి శత్రు సంఖ్యను, పరిస్థితిని అంచనా వేస్తున్నారు. ఇంతలో జోఫియల్ (Zophiel) దేవదూత శత్రుశిబిరాల వరకు వెళ్లినవాడు వేగంగా తిరిగివచ్చి రొప్పుతూ, గాలిలో ఎగుర్తూ, ఆయాసపడుతూ చెప్పసాగినాడు.

"యోధులారా! వీరాధివీరులారా! ఆయుధాలను చేతబూనండి! పారిపోయా డనుకున్న శత్రువు పక్కనే పొంచి ఉన్నాడు.గాఢ నిశ్చయంతో, ఆత్మవిశ్వాసంతో స్థిరవదనుడై దట్టమైన మబ్బులా కదిలివస్తున్నాడు. వజ్రకఠినమైన కవచం, శిరస్త్రాణం, డాలూ, బల్లేలు ధరించి తన సైనికులను నడిపిస్తున్నాడు. చిరుజల్లుల్లా కాదు శత్రువులపై అగ్నిబాణాలతో పెనుతుఫానులా విరుచుకుపడాలని సైన్యానికి ఉద్బోధిస్తూ అతడు దుర్నిరీక్షుడై ఉన్నాడు. జాగ్రత్త! బహుపరాక్!" అని అందరిని హెచ్చరిస్తూ దేవదూత అన్నివేపులా తిరుగుతూనే ఉన్నాడు.

దైవసైన్యం సిద్ధంగానే ఉన్నది. తన యుద్ధయంత్రాలను కానరానీకుండా రెండువేపులా సుశిక్షిత దళాల్నుంచి దైవసైన్యాన్ని సమీపించగానే సాతాను తన సైన్యపు అగ్రభాగాన నిలిచి ఆజ్ఞాస్వరం ఉట్టిపడ్తుండగా పలికాడు–

"అగ్రదళం (Vanguard) ఎడమకు కొందరు, కుడిపక్కకు కొందరు తొలగండి. మనల్ని ద్వేషించేవాళ్లు మనం శాంతికై ఎంత పరితపిస్తున్నామో, వాళ్లని సాదరంగా రెండుచేతులు చాచి ఆహ్వానిస్తున్నామో గ్రహించాలి. మన ప్రతిపాదనను, రాజీసూత్రాన్ని (Overture) వారంగీకరిస్తే – నేనేమీ ఆశావహంగా లేనుకాని – అంది అందరికీ మంచిది. లేకుంటే మా విధిని మేము నిర్వహిస్తాము. మిమ్మల్ని నడిపించే మీ నాయకుడికి, ఆతని అనుచరగణానికి కనువిప్పు కలుగుగాక!" – అంటూండగానే, ఆతని సైన్యపు అగ్రభాగం రెండువేపులకు చీలిపోగా వారిమధ్యలో అప్పటివరకు కనిపించని యుద్ధయంత్రాలు, ఓక్, ఫర్‌వృక్షాల కొయ్యదిమ్మలతో, చెక్కలతో నిర్మించిన బళ్లు బ్రహ్మాండమైన చక్రాలతో ఉన్నవి; వాటిపైన ఇత్తడి, ఇనుము లాంటి లోహనిర్మిత మందపాటి గొట్టాలు, భయంకరంగా నోరు తెరచుకుని స్వర్గంవేపు ఆకలితో చూస్తున్నట్లుండగా ఆ యంత్రాల వెనుక జ్వలిస్తున్న రెల్లుగడ్డి కాగడాలను చేబూనిన సైనికులు, మేము అవేమిటా అని ఆలోచించేలోపుగానే, వాళ్లు ఆ అగ్నిశిఖలను ఆ యంత్రాల రెండో చివర ఉన్న వత్తులకు అంటించారు. ముందుగా కాస్త మంట, అది అదృశ్యమై అంతటను కమ్ముకున్న పొగ, ఆ యుద్ధయంత్రాలు భీకరంగా త్రేన్చుతున్నట్లు శబ్దం, చుట్టూ ఉన్న గాలిని ఉక్కిరిబిక్కిరి చేసిన విస్ఫోటనం, ఆ యంత్రపు పేగులు కదిలి, తెగి, వాంతులు చేసుకున్నట్లు కక్కిన వమన పదార్థంలో, దుర్వాసన వ్యాపిస్తుండగా పిడుగుల్లా మండుతూ దూసుకుపోతున్న నల్లటి అగ్నిగోళాలు తమకు లక్ష్యమైన దేవదేవుని అణచివేసేందుకు దూసుకుపోతున్నాయి. వాటి క్రిందబడి వేలాదిమంది దేవదూతలు నలిగిపోగా, ఆ విషధూమాల ధాటికి ఉక్కిరిబిక్కిరై ఏమీ తోచని స్థితిలో చెల్లాచెదురు కాసాగారు. ధైర్యంతో నిలబడ్డ వాళ్లపైకి మళ్లీ దూసుకు వస్తున్న అగ్నిగుళ్లు, అవి తగిలి మలమల మాడిపోతూ హాహాకారాలు చేస్తున్న దేవదూతలు, వాళ్లను చూసి ఎగతాళిగా నవ్వుతున్న సాతాను అనుయాయులు రణరంగమంతా భయంకరంగా మారింది. వైరిపక్షం దీనావస్థను చూసి అపహాస్యం చేస్తూ సాతాను అన్నాడు–

"మిత్రులారా! ఇంకా దేనికోసం ఎదురుచూస్తున్నారు? చేతులు సాచి ప్రేమగా ఆహ్వానించినప్పుడు, సంధికోరినప్పుడు అడుగులు ముందుకు పడలేదే! ఇప్పుడు అగ్నిగోళాలు మీదపడ్తుంటే వింత నృత్యాలు చేస్తున్నారా! అప్పుడు శాంతిని ప్రతిపాదిస్తే తిరస్కరించారు. ఇప్పుడు ఇంకొంచెం గట్టిగా చెబితే వింటారేమో!"

ఆ మాటను అందిపుచుకున్న బెలియల్ (Belial) ఆటపట్టించే వేడుకగా అన్నాడు– "నాయకుడా! ఇప్పుడు మనం పంపిన షరతులు చాలా వేడిగా, బరువుగా, శక్తివంతంగా ఉన్నాయి కదా అందుకే కిందామీదాపడి అర్థం చేసుకుంటున్నారు. కాళ్లూ చేతులూ పాపం, ఆడక, నాలుగుకాళ్లమీద పాకుతున్నారు"

అలా సాతాను బృందం తమ యుద్ధయంత్రాలు సృష్టిస్తున్న అలజడిని ఆనందిస్తున్నవాళ్లై విజయం తథ్యమని భావిస్తూ తమ మారణాయుధాల ముందు, ఆ మహాశక్తిమంతుని వజ్రాయుధమైన ఉరుములు పిడుగులు దిగదుడుపే అని తుళ్లిపడసాగినారు.

దేవుని సైన్యం ఒకింత తడవు ఖంగుతిన్నా, తేరుకుని దేవదేవుని ప్రసాదలబ్ధ భుజశక్తితో పక్కనే వున్న కొండల్ని, గుట్టలు, వాగులు, వృక్షాలతో నిండిన ఆ పర్వతాల్ని సమూలంగా పెరికి శత్రుసైన్యంపైకి సునాయాసంగా విసిరినారు. అడుగుభాగంపైకి శిఖరాలు క్రిందికీ ఉండి శత్రుసైన్యంపైకి దూసుకువస్తున్న ఆ పర్వతాలు శత్రువుల గుండెల్లో దడపుట్టిస్తూ, సరాసరి వచ్చి ఆ యుద్ధయంత్రాలపై పడి వాటిని నేలలోకి పాతిపెట్టి పైన నిలబడ్డాయి. వాటి క్రిందబడి కవచాలు అదమగా నలిగి గాయాలై పెడబొబ్బలు పెడుతూ దళాలకు దళాలు సాతానుసైన్యం ఆక్రందనలు చేస్తూ రోదించసాగినారు. మిగతా సైనికులు వాళ్లూ పర్వతాలను పర్వతాలతో ధీకొట్టగా అవి గాలిలో ఒకదానికొకటి తగిలి ప్రయ్యలవుతూ, క్రింద గాడాంధకారాన్ని సృష్టించాయి. చెవులు బద్దలవుతున్న శబ్దాలు, ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి, స్వర్గమంతా శిధిలాలమయం కాగా, స్వర్గశిఖరం వద్ద యుద్ధక్రమాన్ని గమనిస్తున్న దేవదేవుడు, దైవకుమారుని శక్తియుక్తులకు సమయం వచ్చిందని భావిస్తూ తన కుడిపక్క ఆసీనుడైన ఆతనితో ఇలా పలికాడు–

"ప్రియకుమారా! నా కీర్తి ప్రతిరూపమా! అగోచరమైనది కూడా గోచరించే అద్భుత వదనుడా! ఏ శక్తిసామర్థ్యాల వలన నేను దేవదేవుడిగా ప్రస్తుతించబడ్డానో, ఎవరి చేతల ద్వారా నా ఆజ్ఞలను నేను అమలు పరుస్తానో, ఆ రెండవ శక్తివంతుడైన వీరుడా (Second Omnipotence), యుద్ధంలో రెండవరోజు ముగింపుకు రానున్నది. మైఖేల్ (Michael) నాయకత్వంలో విధేయులైన సైనికులు ఆ తిరుగుబాటు దార్లను అడ్డుకున్నారు. అయినా ఒకే విధంగా సృష్టించబడ్డ వీళ్లు అనంతకాలం పోరాడుకునే పరిస్థితి రాకుండా మన జోక్యమిప్పుడు అవసరం. ఈ పర్వత యుద్ధాలు స్వర్గలోకపు పవిత్రతకు, ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నవి. రెండు రోజులు గడిచాయి. మూడవరోజు నీది. నీకోసం నిర్దేశించిన మూడవరోజున నీవు నీ శక్తిసామర్థ్యాలతో ఈ ప్రచండ యుద్ధానికి ముగింపు పలకాలి. నీలోకి నేను ఆ శక్తిసామర్థ్యాలను ప్రవేశపెట్టాను. విజయుడవై స్వర్గనరక లోకాల్లో నీకు సాటి లేరెవ్వరనిపించుకుని స్వర్గ సింహాసనాన్ని అధిష్టించినది వారసత్వం వల్లగాక, స్వంత అర్హతతో అని నిరూపించగలవు. నా రథాన్ని అధిష్టించి, విల్లును, పిడుగులను (Thunder) ఆయుధాలుగా ధరించి, ఖడ్గధారుడవై ఈ అవిధేయులను, చీకటిపుత్రులను స్వర్గపు

పొలిమేర నుంచి నరకలోకంలోకి తరిమికొట్టి; దేవదేవుడిపై, ఆతని కుమారుడైన మెస్సయ్య (Messiah) పై తిరుగుబాటు చేసినందుకు వాళ్లకు తగిన గుణపాఠం చెప్పగలవు"

జగత్పిత అలా పలకగా ఆతని నుండి దైవకుమారునిపై దివ్య కిరణాలు ప్రసరించి వదనం ప్రకాశవంతం కాగా పుత్రోచితమైన పలుకులతో దైవకుమారుడు ఇలా అన్నాడు–

"విశ్వాధినేతా! తండ్రీ! ఆదిపురుషుడవు, అత్యున్నతుడవు, పవిత్రుడవు, సర్వశక్తిమంతుడవైన దేవా! నా ఈ గౌరవం, అభిమానం, హోదా, శక్తిసామర్థ్యాలు అన్నీ నీవొసంగినవే కదా! నీవు ప్రేమించిన వారికి ప్రేమనందిస్తాను. నీ ఆగ్రహానికి గురైన వారిని నీవు కోరిన విధంగానే శిక్షిస్తాను. దివ్యాయుధధారినై, రథాన్నధిరోహించి తిరుగుబాటుదార్ల ఆట కట్టించి వారిని వారికోసం ప్రత్యేకించబడిన నరకకూపంలోకి సంకెళ్లతో బంధించి విసిరివేస్తాను. స్వర్గలోకంలో నీ విశ్వాసులు, సాధుసంతులు అన్నివేళలా నీ గుణగణాలను కీర్తిస్తూ, దైవశిఖరం వద్ద స్తోత్రాలు (Halleluiahs) గానం చేస్తూండగా వారిలో నేనూ ఒకడిగా ఆ ఆనందస్థితిని అనుభవిస్తాను"

అని పలికి తండ్రికి నమస్కరించి దేవకుమారుడు యుద్ధానికి సిద్ధమైనాడు. మూడోరోజు ఉదయపు తొలివెలుగులు ప్రసరిస్తుండగనే సుడిగాలి వేగంతో తండ్రి తనకొసంగిన దివ్యరథంలో, చక్రాల్లో చక్రాలున్నట్లు ప్రకాశిస్తున్న జ్వాలావలయిత రథచక్రాలతో కూడిన ఆ రథానికి నాలుగుపక్కలా దేవదూతలు కొలువుదీరగా, వారి శరీరం, రెక్కలపై మరకతం (Beryl), గరుడపచ్చ రత్నాలు కళ్లలా, వలయాల్లా మెరుస్తుండగా, వాటిమధ్య అగ్నిజ్వాలల కాంతులు, వారి శిరస్సులపై స్ఫటికపు గగనమండలం, దానిపై స్వచ్ఛమైన తృణమణి (Amber) అనబడే పసుపురంగు జిగురుతో తాపడం చేయబడిన నీలి సింహాసనం (Sapphire Throne) ఇంద్ర ధనుస్సులోని రంగుల్ని మెరుస్తూండగా, దివ్యకవచధారుడై, హృదయంపై మెరుస్తున్న మణుల రొమ్ముఫలకం (Urim and Thummim)తో, కుడిపక్క విజయాధిదేవత (Victory) కూర్చుని వుండగా – దైవకుమారుడు – విల్లు, ఉరుములు పిడుగులు కురిపించే దివ్యబాణాలున్న అమ్ములపొది తన పక్కనే మెరుస్తుండగా, పదివేలవేల సాధు సంతులు సాయుధపాణులై అనుసరిస్తుండగా, తన చుట్టూరా అగ్నిజ్వాలలు, పొగలు, నిప్పురవ్వలు వ్యాపిస్తుండగా, ఇరవైవేల దివ్యరథాలు అటు సగం, ఇటు సగం తన వెనకనే వస్తూండగా, దేవదూతల రెక్కల పల్లకిపై దైవకుమారుడు ఈసారి ఒంటరిగా తానొక్కడే నీలి సింహాసనాధీష్ఠుడై, మెస్సయ్య (Messiah) అనే అక్షరాలు

రథపు జెండాపై ప్రకాశిస్తుండగా ఆశ్చర్యానందాలతో అవలోకిస్తున్న తన సైన్యం వేపు వచ్చినాడు. తమ ప్రభువును చూడగానే మైఖేల్ ఆతడు తమ సైన్యాగ్రాన ఉండేట్లు సైనికుల క్రమాన్ని మార్చినాడు. దైవకుమారుని ఆజ్ఞతో తల్లకిందులుగా చెల్లాచెదురుగా పడివున్న పర్వతాలన్నీ యథాస్థానాలకు చేరుకొనగా కొత్తపుష్పాలు విరిసి కొండలు లోయలు అందంగా చిరునవ్వులు రువ్వసాగినాయి. అది చూసి ఓర్వలేని శత్రువులు అంతటి నిరాశలోనూ ఆశావహులై మరల యుద్ధానికి సిద్ధమైనారు. దివ్యాత్మలుగా ఉన్నవారిలో ఏమాత్రం పశ్చాత్తాపం కనిపించకపోగా దైవకుమారుని ఉజ్జ్వల వైభవాన్ని చూసి అసూయతో మరింత పేట్రేగిపోతూ, బలంతోనో మోసంతోనో విజయాన్ని చేజిక్కించుకునే దృఢనిశ్చయంతో దేవదేవుడికి, మెస్సయ్యకు వ్యతిరేకంగా ఆఖరి పోరాటానికి దిగారు. ఆ క్షణాన దైవకుమారుడు తనకిరువైపులా ఉన్న దేవదూతల సైన్యంతో పలికాడు– "సాయుధపాణులైన దేవదూతలారా! ప్రకాశిస్తున్న సాధు సంతులారా! ఈరోజు మీరు విశ్రాంతి తీసుకోండి. దేవదేవుని తరపున శతృవులతో మీరు చేసిన యుద్ధాన్ని, సత్యమార్గ రక్షణకు మీరు భయరహితులై నిలబడ్డ తీరును ఆతడు ప్రశంసించినాడు. ఇప్పుడు ఈ పాపాత్ములకు తగిన శిక్ష విధించాల్సిన సమయం ఆసన్నమైనది. భగవానుని ప్రతీకారజ్వాలల్లో ఈ విషపురుగులు మలమల మాడిపోగలవు. నా ద్వారా దేవదేవుడు ఈ దైవ భ్రష్టులకు విధించే శిక్షను మీ కనులారా చూడండి. ఈ దుష్టాత్మల వైరం, కోపం మీమీద కాదు. దేవదేవుడు తన కుమారుడనైన నాకు అధికారం కట్టపెట్టడం వలన వీరిలో అసూయాద్వేషాలు పెల్లుబికి ఈ తిరుగుబాటుకు కారణమైనాయి. ఇప్పుడు తేల్చవలసింది వారందరూ ఒకపక్క, నేను ఒక్కడినే ఈవేపు. బలాబలాలను శక్తిసామర్థ్యాలను బుజువుచేద్దాం"

దైవకుమారుని వదనం శత్రువులపైని ఆగ్రహంతో భీకరమై ఎర్రగా మండుతున్న అగ్నిజ్వాలలా ప్రకాశించినది. రథానికి నలువైపులా ఉన్న దేవదూతలు తమ నక్షత్రాలతో కూడిన రెక్కలను విప్పార్చగా, జగన్నాథ రథచక్రాలు ముందుకు కదిలి, భీభత్సంగా దూకుతున్న వరద పరవళ్లను తలపిస్తూ శత్రుసైన్యం వేపు దూసుకుపోయింది. ఆ రథచక్రపు తాకిడికి స్వర్గసింహాసనం మినహా మిగతా లోకమంతా దద్దరిల్లగా దైవకుమారుడు సరాసరి శత్రుమధ్యంలోకి చొచ్చుకుని వెళ్లినాడు. పదివేల పిడుగులను కుడిచేత్తో తన ముందున్న శత్రువులపై విసుర్తూ అవి కావిస్తున్న ప్రచండ ఘోషకు శత్రువుల ప్రతిఘటన అంతమై, ఆయుధాలూ, ధైర్యమూ నశించిపోగా, వాళ్లు ఈ బాధకన్నా మరల పర్వతాలు వచ్చి తమపై కూలితే బాగుండునన్న భావనలతో కుములుతూ కకావికలై పారిపోసాగారు. దైవకుమారుడు సంధించి వదుల్తున్న అగ్నిబాణాలు నలుదిక్కులకూ మెరుపుల్లా దూసుకుపోతూ ప్రచండాగ్నిని రగిలించగా

శక్తిని, యుక్తిని, సర్వాన్ని కోల్పోయి శత్రువుల హతాశులైనారు. ఆతడు తన శక్తుల్ని సగం ఉపయోగిస్తేనే శత్రువులకింత దారుణమైన దుస్థితి కలిగింది. తన ప్రచండమైన ఆయుధాల్ని వారిని నశింపచేయడానికి కాక స్వర్గచ్యుతుల్ని చేయడానికి ఉద్దేశించడం చేత, మేకలమందను తరిమినట్లు ఆతడు సాతాను సైన్యాన్ని స్వర్గలోకపు అంచుల వద్ద ఏర్పడిన మహారంధ్రం వేపు తరమగా వాళ్లు భయభ్రాంతులై తమను తరుముకు వస్తున్న ఆ పిడుగుల వర్షంకన్నా ఈ చీకటి గోతిలో పడడం ఉత్తమమని భావిస్తూ తలకిందులుగా మహావేగంతో పతనం చెంది ఆ మహాసైన్యం యావత్తూ తమకై నోరుతెరచుకు చూస్తున్న అడుగులేని కూపంలోకి జారిపోతున్నది.

నరకం ఆ ప్రచండ ఘోషను, ప్రళయకాల ధ్వనులను విని భయంతో తానే పారిపోబోయినా వీలు కుదరక అలానే నిస్తబ్దంకాగా తొమ్మిదిరోజులు అలా సాతాను సైనికులు తలకిందులుగా పడుతూనే ఉన్నారు. తన మధ్య నుండి దూసుకుపోతున్న ఆ దుష్టాత్మలను చూసి కేయాస్ (Chaos-అవ్యక్తస్థితి) పదిరెట్లు అధికంగా ఘోషిస్తూనే ఉన్నది. అంతటి అరాచక స్థితి సాతాను సైన్యాన్ని సాంతం మింగాక నరకం ఆవులించి మరల నోరు మూసుకొనడంతో సద్దుమణిగింది. అంతులేని నరకయాతనలు అనుభవిస్తూ, ఎంతకూ చల్లారని నిప్పుల మధ్య మాడిపోతూ, రోదనలతో కాలం గడిపే దురవస్థకు సాతాను సైన్యం శిక్షింపబడింది.

స్వర్గమంతా దైవకుమారుని విజయానికి హర్షధ్వానాలతో, కైమోడ్పులతో, తమ ఆనందాన్ని ప్రకటించినది. స్వర్గద్వారాల వద్ద ఏర్పడిన మహా వివరము మూసుకుని స్వర్గలోకమంతా వెనకటి అద్భుతరూపును సంతరించుకొనగా ఒంటిచేత్తో శత్రునాశనం చేసిన మెస్సయ్య (Messiah) దైవశిఖరం వేపు తిరిగి వస్తుండగా సాధుసంతులు, దేవదూతలు జేజేలు పలుకుతూ తమ ప్రభువు శక్తిసామర్థ్యాలను కనులారా వీక్షించిన వారు కనుక మరింత ఆనందంతో ఒక మహాప్రదర్శనగా, విజయ దుందుభులు, భేరీభాంకారాలు మోగుచుండగా, కీర్తనలను స్తోత్రాలను గానం చేయుచూ, విజయగీతికలను ఆలపిస్తూ దేవదేవునికి వారసుడు, తమ చక్రవర్తి, పరిపాలకుడు అయిన దైవకుమారునికి అంజలి ఘటిస్తూ వెంటరాగా ఆతడు జగత్పిత ఆసీనుడై ఉన్న సింహాసనం వద్దకు వెళ్లి తండ్రికి అభివాదములు తెలిపి ఆతని కుడివేపు ఆసీనుడైనాడు.

అందుచేత నేను నీకు స్వర్గ విషయాలను భూమిపై ఉన్న విషయాలుగా మార్చి వివరించాను. నీకు సులభంగా అర్థం కావడానికి, నీకు కలగబోయే ఆపదల నుంచి అప్రమత్తంగా ఉండడానికి, అత్యాశ చేసే అపకారాన్ని వివరించడానికి, మానవజాతిపై అసూయాద్వేషాలతో సాతాను ఆతని అనుయాయులు పన్నే మాయలో

పడవద్దని హెచ్చరించడానికి ఇంతగా చెప్పవలసి వచ్చింది. నిన్ను అవిధేయుడిగా, అవిశ్వాసుడిగా పతనం చెందించి, నీనుంచి ఆనంద స్వర్గాన్ని దూరంచేసి తాను పడ్తున్న నరకయాతనలనుంచి స్వాంతన పొందేందుకు, దేవదేవునిపై ప్రతీకారాన్ని తీర్చుకునేందుకు నిన్ను తన మిత్రుడిగా, పావుగా వాడుకుంటాడు కాబట్టి జాగ్రత్త! ఆతడి ఆకర్షణలకు లొంగకు, నీ సహచరిని కూడా హెచ్చరించు. ఈ భయంకర వృత్తాంతం నీకు అవిధేయత వల్ల వచ్చే ప్రమాదాన్ని, నష్టాల్ని, శిక్షను విశదం చేసింది కదా! వాళ్లు ఎంత మొండిగా నిలబడ్డా చివరకు పతనం తప్పలేదు. గుర్తుంచుకో! దేవదేవుని శాసనాన్ని అతిక్రమించకు. బహుపరాక్!"

7. దేవదేవునిచే నూతనలోక సృష్టి

ఆదాం విన్నపాన్ని అంగీకరించి రాఫేల్ (Raphel) ఈ నవలోక సృష్టి గురించి వివరిస్తాడు. సాతాను (Satan)ను ససైన్యంగా స్వర్గం నుంచి బహిష్కరించాక మరో కొత్తలోకాన్ని, కొత్త జాతిని సృష్టించదలచిన దేవదేవుడు, కీర్తిమంతుడైన దైవకుమారుణ్ణి, దేవదూతలనిచ్చి ఆరు దినాల్లో సృష్టికార్యాన్ని పూర్తి చేయిస్తాడు. దేవదూతలు ఆ ఘనకార్యాన్ని వేయినోళ్ల పొగడుతూ స్వర్గానికి తిరిగివస్తారు.

ఓ ఖగోళాధిదేవతా! యురేనియా (Urania)! నీ దివ్యస్వరం స్వర్గం నుంచి దిగివచ్చి, ఒలింపియన్ శిఖరాలపైగా (Olympian Hill), పెగాసియన్ రెక్కల గుర్రాల (Pegasean) మీదుగా వచ్చి నన్నావహించనీ! ఈ కొండలు గుట్టలు, నదీనదాలు ఏర్పడకముందే, సకలకళాధిదేవతలైన తొమ్మిదిమంది 'మ్యూజ్'లు (Muses) తిరుగాడే ఒలింపస్ (Olympus) శిఖరాలవీ రూపొందకమునుపే, ఈ పేర్లు రూపాలు ఆవిర్భవించకముందే ఉన్న ఆ వెలుగులోకమైన స్వర్గంలో జగత్ప్రీత సన్నిధిని నీ సోదరి జ్ఞానదేవత (Wisdom)తో కలిసి గళం కలిపి పాడిన దివ్యగానమై, ఆతడు సంతోషించిన దివ్యగీతికగా ఇక్కడకు దిగిరా! నీతో కలిసి స్వర్గానికి స్వర్గమైన ఆ దివ్యానంద ప్రదేశంలో విహరించిన ఈ భూలోకపు అతిథిని క్షేమంగా ఇలపైకి చేర్చు! నీ అండ లేకుంటే ఈతడు – కళ్లేలు లేని అశ్వంపై స్వారీచేస్తూ పడిపోయిన బెల్లెరోఫాన్ (Bellerophon)లా – దారీ తెన్నూ తెలియని అన్యదేశంలో పడి, మరులుతీగ తొక్కిన వాడిలా సంచరించవలసి వస్తుంది. ఈ మహాగీతంలో సగం పూర్తయ్యింది. కాని పరిధి తగ్గి, రాత్రింబవళ్లతో అలరారే భూమిపై నిలబడి మానవస్వరంతో, ఏ మార్పులూ చేయని నీ దివ్యగీతాన్ని ఆలాపిస్తాను. గొంతున్నా, పోయినా, బొంగురుగొంతుతోనైనా, నిశ్శబ్దంగానైనా, చెడురోజులు నాపై పడినా, నేను చెడురోజుల్లో పడినా, నాపై దుష్టుల నాలికలు దుష్ప్రచారం చేసినా, ఈ కటిక చీకటిలోనూ, చుట్టూరా ప్రమాదాలు పొంచి చూస్తున్నా, ఒంటరితనంలోనూ, నీ రాకతో నిశాదర్శనాలతో, ప్రాతఃకాలపు తూర్పువదనం అరుణవర్ణమైనప్పుడు నా ఒంటరితనం దూరం కాగా నీ అద్భుత శక్తితో ఈ దివ్యగీతాన్ని ముందుకు నడిపించుము, తల్లీ!

యురేనియా! ఈ పాటకు కొద్దిమందైనా చాలు, విజ్ఞులు, అర్హులైన శ్రోతలను అనుగ్రహించు తల్లీ! బాకస్ (Bacchus) అనుచరగణాలు రొడొపె (Rhodope) ద్వీపంలో మధురమైన పాటలతో, వీణానాదంతో వనాన్ని, శిలల్ని అలరించే అద్భుత థ్రాసియన్ (Thracian) గాయకుణ్ణి తమ విశృంఖల ఉన్మత్త గీతాలతో ధ్వనులతో

చీల్చి చెండాడినప్పుడు 'మ్యూజ్' దేవతకూడా నిస్సహాయురాలైనది కదా! అమ్మా! నిన్ను ప్రార్థిస్తున్నాను. ఈ దివ్యగీతం శూన్యస్వప్నం కావద్దు తల్లీ!

"గానం చేయి మ్యూజ్! ప్రధానదేవత రాఫెల్ (Raphael) ఆదాంను ఏమని హెచ్చరించినాడు? మతభ్రష్టుడైన సాతానుకు విధించబడిన శిక్షేమిటి? ఆదాం అతని సంతతి స్పృశించకూడని వృక్షమేమిటి? దేవదేవుని ఆజ్ఞను జవదాటకుండా వారు హాయిగా ఆనందలోకంలో కాలం గడపమని సలహా ఇచ్చిన రాఫెల్ ఇంకా ఏమి చెప్పినాడు? వివరించుము, సకలకళాధిదేవతా!"

ఆదాం తన సహచరి ఈవ్‌తో కలిసి ఈ కథంతా జాగ్రత్తగా విన్నాడు. స్వర్గలోకంలో ద్వేషం, యుద్ధంల ప్రసక్తి విని వారు ఆశ్చర్యపోయినారు. స్వర్గంలో వెల్లువలా తాకిన చెడు నీరు ఆనందవాహినితో కలవకుండా వెంటనే నెట్టివేసిన దివ్యశక్తి ప్రభావాన్ని వారు ప్రశంసించారు. ఆదాం (Adam) తన హృదయంలో మొలకెత్తిన సందేహాలను తీర్చుకోగోరి, దేవదూత రాఫెల్ (Raphael)ను ఈ నూతన లోక సృష్టి విశేషాలను, ఈడెన్ వనం ఎందుకు, ఎలా సృజియింపబడిందో తెలుసుకోగోరి, జ్ఞానదాహం మరింత అధికమవుతుండగా – ఇలా ప్రశ్నించాడు.

"దివ్య జ్ఞానప్రదాతా! అద్భుతమైన విషయాలను మీరు మాకు తెలిపి సన్మార్గ బోధ చేసినారు. దేవదేవుడు మాకు మీ ద్వారా పంపిన హెచ్చరిక, మార్గభ్రష్టులు చెల్లించవలసిన మూల్యము, మాకు తెలియడం వలన, మేము తగు జాగ్రత్తలో ఉండే వీలు చిక్కినది. అందుకు మేము సర్వదా కృతజ్ఞులం. మాయందు కరుణతో మీరు ఈ సందేహాలను నివృత్తి చేయగలరనే ప్రగాఢ విశ్వాసంతో ఈ ప్రశ్నలనడుగుతున్నాను., ప్రకాశవంతమైన అగ్నిజ్వాలలు వలయంగా ఉన్న వెలుగులోకమైన ఈ స్వర్గమెలా ఏర్పడింది? అందాల పూలవనంలా శోభిల్లే భూమికీ, స్వర్గానికి మధ్య ఆవరించిన వాయు విశేషాలేమిటి? సృష్టికర్త ఏ కారణం చేత భూమిని ఇంత ఆలస్యంగా సృజించినాడు? అవ్యక్తస్థితి అయిన కేయాస్ (Chaos) నుంచి ఇవన్నీ ఎప్పుడు ఎలా ఏర్పడ్డాయి? ఈ విషయాల్ని మీకు అభ్యంతరం లేకపోతే వివరించగలరని ప్రార్థన. ఈ జిజ్ఞాస మహాశక్తివంతుడైన దేవదేవుని సామ్రాజ్య రహస్యాలను తెలుసుకోగోరికాదు, ఆతని ఘనతను మనసారా పొగడుటకు మాత్రమే! మీరు వివరించే విషయాల కోసమే ఆ జగత్పరిపాలకుడు ఈనాటి పగటి సమయాన్ని మాకు అధికంగా ప్రసాదించినట్లున్నాడు. అగాధం నుంచి ఆవిర్భవించే ప్రకృతి, సాయంకాలపు నక్షత్రాలు, చంద్రదేవత, రాత్రి, రాత్రిని అనుసరించే నిశ్శబ్దం, నిద్ర మీ మాటలను వినేందుకు వచ్చేట్లయితే, నిద్రను పరిహరించి మీ సంభాషణాగానం అయ్యేంత వరకు మేలుకొని ఉండి ఉదయాన్నే మీకు వీడ్కోలు పలుకగలం"

వినయశీలి అయిన దేవదూత, ఆదాం (Adam) మాటలకు సమాధాన మిచ్చినాడు– "అత్యంత జాగరూకతతో నీవు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఎవరు ఇవ్వగలరు? ఆ సృష్టికర్త మహిమలను వర్ణించ ఎవరితరం! ఏ దివ్యపదాలు, ఏ దేవదూత పెదాలు ఆ అనంత ఘన సృష్టికర్యాన్ని వర్ణించగలవు? దేవదేవుడు నా కొసంగిన అనుమతితో కొన్ని హద్దులకు లోబడి నేను సమాధానమివ్వదలచాను. అంతకు మించి నీవడుగరాదు. అంతేకాక నీవు తయారుచేసిన యంత్రాలతో శోధన చేసి ఆతని ఆగ్రహానికి గురికావద్దు. సర్వవ్యాపకుడు (Omniscient), అగోచరుడైన (Invisible) ఆతని గురించి ఎంతవరకు తెలుసుకోవాలో అంతవరకే తెలుసుకోవడం మంచిది. జ్ఞానం కూడా ఆహారంలా హద్దుల్లో ఉండాలి. అత్యాకలిలా పెరిగే జ్ఞానం విచక్షణను తప్పుదారి పట్టిస్తుంది.

ఒకప్పుడు దేవదూతల్లో అతిప్రకాశవంతమైన, నక్షత్రంలా వెలిగిన ల్యూసిఫర్ (Lucifer) ఇప్పుడు 'సాతాను'గా స్వర్గచ్యుతుడై ససైన్యంగా నరకకూపంలోకి నెట్టబడ్డాక, విజేత దైవకుమారుడు సాధుసంతులతో కలిసి సర్వశక్తిమంతుడైన జగత్పిత వద్దకు వెళ్లినప్పుడు ఆ దివ్యదేవతల సమూహాన్ని గౌరవించి కుమారునితో ఇలా పలికాడు– "అందరూ తనలానే తిరుగుబాటు చేస్తారని భావించి, ఈ సర్వోన్నతమైన సింహాసనాన్ని ఆక్రమించుకోవచ్చునని భావించి, మాయమాటలతో అనేకమందిని తనవేపు తిప్పుకున్న మన శత్రువు పరాజయంపాలై నరకకూపాన మగ్గుతున్నాడు. అతడు ఆతని అనుయాయులు నిష్క్రమించగా మూడోవంతు స్వర్గం ఖాళీ అయ్యిందని అతడు కాస్త సంబరపడవచ్చును. కాని నేను ఆ లోటును పూడ్చేందుకు మరో లోకాన్ని, దానిలో నివసించేందుకు మానవ తెగను అసంఖ్యాకంగా సృష్టిస్తాను. విధేయులై, సన్మార్గంలో జీవించినవారిని అంచెలంచెలుగా స్వర్గంలోకి దివ్యాత్మలుగా ప్రవేశింపజేస్తాను. అందరూ అన్నివేళలా విశ్వాసులై, విధేయులుగా ఉన్నప్పుడు ఆ మానవ లోకాన్ని స్వర్గంగా, స్వర్గాన్ని మానవలోకంగా సమానమైన ప్రతిపత్తులతో గౌరవించి ఈ రెండు లోకాలను దివ్యానంద భరితమైన సామ్రాజ్యాలుగా మారుస్తాను.

ఓ దేవదూతలారా! దైవకుమారా! ఈ సమస్త కార్యాలన్నీ మీ చేతుల మీదుగా నేను నిర్వహిస్తాను. నా వాక్కు, చేతలు మీరే! నేను దివ్యాత్మగా మీ నీడగా ఉండి మీకు కావలసిన సలహాలు ఇవ్వగలను. సర్వవ్యాపకుడనైన నాకు అవసరమో (Necessity), అవకాశమో (Chance) అక్కర్లేదు. నేనేది సంకల్పిస్తే అదే 'విధి' (Fate) నిర్ణయమౌతుంది"

సర్వశక్తిమంతుడైన దేవదేవుడు తనమాట తెలుపగానే దానిని దైవపుత్రుడు వెంటనే అమలు జరిపినాడు. దైవకార్యాలు కాలం, వేగంకన్నా శీఘ్రతరమైనవి.

వాక్కు అవసరం లేనివి. స్వర్గలోకమంతా దేవదేవుని ఆజ్ఞను విన్నవారై సంతోష భరితులైనారు. అత్యున్నతుడైన ఆతనిని కీర్తిస్తూ భవిష్యత్ నూతన లోక నివాసులకు శుభం కలగాలని ప్రార్థించారు. దైవద్రోహులను తన ఆగ్రహజ్వాలలతో తరిమికొట్టి శాంతిని నెలకొల్పిన దేవా! చెడు నుంచి మంచిని వెలికిదీసి, దుష్టాత్మలకన్నా మెరుగైన కొత్తజాతిని సృష్టించి వారితో స్వర్గలోకం లోని శూన్యప్రదేశాన్ని నింపదలచుకున్న సృష్టికర్తకు అభివాదములు!" ఇలా వారు దేవదేవుని కీర్తిస్తున్న సమయంలోనే దైవకుమారుడు తనకప్పగించిన బాధ్యతలను నెరవేర్చే నిమిత్తం జగత్పిత తనకొసగిన దివ్యశక్తులు, ప్రేమ తనలో ఉట్టిపడుతుండగా, ప్రతీహారులు, ప్రభువులు, సింహాసనాలు, సద్గుణాలు, దేవదూతలు, రెక్కల రథాలు తనతో రాగా, స్వర్గంలోని రెండు మహాపర్వతాల మధ్య దాచి ఉంచిన సమస్త పనిముట్లను తీసుకుని దేవదేవుని ఆత్మ, సంకల్పం తమకు తోడు కాగా, స్వర్గద్వారాలు విశాలంగా తెరవబడగా, ఖ్యాతి వహించిన ప్రభువు తన వాక్కు, ఆత్మలను సృష్టిచేయ నియోగించగా స్వర్గలోకపు అంచులపై వద్ద నిలబడి అగాధం వేపు దృష్టిసారించినాడు. ఆ అగాధం మహావిశాలమై అంతూ దరీ కానరాక, తుఫాను గాలుల్తో, పైకెగసిపడ్తున్న అలలతో, భూమ్యాకాశాలను ఏకం చేస్తూ అల్లకల్లోలమైనట్లున్న సముద్రంలా కనిపించసాగింది.

"నిశ్శబ్దం! పేట్రేగిపోతున్న అలల్లారా! శాంతి!! ఓ అగాధమా! నెమ్మది పడండి! విరోధాబాసలాపండి!"

సర్వాంతర్యామి నుంచి "వాక్కు" వెలువడింది. దేవదూతల రెక్కలపై కదుల్తున్న రథం అవ్యక్తస్థితిలోకి చొచ్చుకుపోయింది. దైవ వాక్కు విన్న అవ్యక్తస్థితి కేయాస్ (Chaos) నెమ్మదించగా దైవరథాన్ని అనుసరించిన సమస్త దేవదూతలూ అక్కడికి వచ్చినారు. దైవ ఖజానాల నుంచి తెచ్చిన స్వర్ణ దిక్సూచి (Golden Compass) ని చేబూని దైవకుమారుడు ఒక అడుగు మధ్యనుంచి, మరో అడుగుతో వృత్తాన్ని గీసి "ఓ కొత్తలోకమా ఇవి నీ సరిహద్దులు" అని పలికినాడు. అలా స్వర్గం, భూమి, పదార్థం, శూన్యం ఏర్పడ్డాయి. పెంజీకటి అగాధాన్ని కప్పి ఉంచింది. దేవుని ఆత్మ ఆ అగాధంపై రెక్కలు విప్పారగా వ్యాపించి ఉన్నది. సద్గుణశక్తులు, వేడిమి పదార్థాన్ని మధించగా నల్లగా ఘనీభవించిన ముద్దలు అగాధం నుంచి వెలువడి అన్నిదిక్కులకు దూసుకుపోయి గాలిలో పరిభ్రమించుచుండగా భూమి వాటి మధ్యలో వేలాడసాగింది.

ఇక్కడ కాంతి ప్రకాశించునుగాక! Let there be light! అన్నాడు దేవదేవుడు. అగాధం నుంచి పైకుబికిన వెలుగు తూర్పు నుంచి ప్రకాశించసాగింది. మబ్బుల మందిరంలో ప్రకాశిస్తున్న కాంతిపుంజాన్ని చూసి దేవుడు సంతోషించినాడు. వెలుతురున్న భాగాన్ని దినం (Day) అని, చీకటి ఉన్న భాగాన్ని 'నిశ' లేదా 'రాత్రి'

(Night) అన్నాడు. అది స్వర్గభూలోకాల తొలి పుట్టినరోజు. సంతోష సంభ్రమాలతో విశ్వమంతా నిండిపోయింది. దేవగణాలు భగవంతుని లీలలను కీర్తించాయి.

ఈ నీటి మధ్య గగనమండలం ఏర్పడుగాక! Let there be Firmament amidst the waters! అన్నాడు దేవదేవుడు. ఈ జలసమూహం నుంచి జలసమూహం విడిపోవును గాక! అని విశ్వపు పైకప్పును వేరు చేసినాడు. నీరు, గాలి కలిసి వ్యాపించిన అంతరిక్షమది. క్రింద ఉన్న జలసమూహంలో భూమి ఏర్పడింది. గగన మండలపు వెలుగులోకాన్ని 'స్వర్గం' (Heaven) అని పిలిచాడు అది రెండవరోజు.

భూమి తయారై ఉన్నది కాని ఇంకా జలసమూహపు గర్భంలో ఉన్నది. భగవానుని ఆజ్ఞతో ఉపరితలంపైనున్న నీరు పక్కకు జరిగి మైదానాలు, మబ్బుల్ని చుంబిస్తున్న పర్వతాలు ఏర్పడినాయి. 'ఇప్పుడు పొడినేల ఏర్పడుగాక' అన్న దేవదేవుని ఆజ్ఞననుసరించి పర్వతాలు అధాటున, దుమ్ముపైబడిన నీటిబిందువుల్లా, భూమిపై పడగా కొంత నీరు భూమి అడుగుకు ఇంకి భూగర్భ నదుల్లా, కొన్ని ఉపరితలపు ఏర్లలా, నదుల్లా ప్రవహించసాగినాయి. నీరంతా కలిసి ఉన్న జల సమూహాన్ని 'సముద్రం' (Seas) అని పిలిచాడు. అదంతాచూసి సంతోషించి ఈ పొడినేలపై గడ్డి, పొదలు, మొక్కలు, ఫలపుష్పవృక్షాలు పెరుగును గాక! అన్నాడు. అప్పటివరకు ఎడారిలా ఉన్న ఆ పొడినేలపై ఆకుపచ్చని పచ్చిక, లతలు, గుల్మాలు, పొదలు, అనేక రంగుల పుష్పాలున్న పూలమొక్కలు, రకరకాల పండ్లచెట్లు, అందంగా పాకిన ద్రాక్షలతలు, రెల్లుపొదలు, విరగకాసిన సొరకాయలు, హుందాగా కనిపిస్తున్న గులాబి మొక్కలు, విరగకాసిన పళ్లతో చెట్లు, పూలతో నిండిన వృక్షాలు, కొండల్ని కమ్మేసిన అడవులూ, లోయలూ, జలపాతాలూ, నదులూ వీటన్నిటికి సరిహద్దులుగా మహావృక్షాల వరుసలు – ఇప్పుడు భూలోకం సాక్షాతూ స్వర్గలోకంలా కానవచ్చింది. దేవతలు నడయాడతగిన దివ్యప్రదేశంలా అలరారుతున్న ఆ ప్రదేశంలో వర్షాలు కురియడానికి ఇంకా దేవుడు అనుమతి ఇవ్వలేదు. పొగమంచు భూమి నుండి పైకెగసి నీటిని తెచ్చి వృక్షజాతికి అందిస్తున్నది. ఆ ఫలపుష్పశోభితమైన వనంతో నిండిన భూమిని చూసి దేవదేవుడు సంతోషించినాడు. అది సాయంకాలం, ఉదయం కలిసి మూడవరోజు.

మరలా భగవానుడు పలికాడు– "పగలు, రేయిని విభజించేందుకు, ఋతువులను, కాలమానాన్ని గణించడానికి, భూమిపై వెలుతురు నివ్వడానికి గగనమండలంలో రెండు కాంతిదీపాల్ని వెలగనీ! – అలా రెండు కాంతిదీపాలు సూర్య చంద్రులై వెలిగాయి. నక్షత్రాలను సృజించి వాటిని ఆకాశంలో ప్రతిష్ఠించాడు.

దేవదేవుడు తాను సృజించిన వాటిని చూసాడు. ఆతని మనస్సు ఆనందంతో నిండినది. ఎందుకంటే అత్యంత ప్రకాశవంతమైన సూర్యుని సృజించి వెలుగు భవనంలో ఉంచగా తూర్పు నుంచి బయల్దేరిన ఆ పగటి అధికారి అంతరిక్షపు రాజమార్గంపై తనముందు ప్లియడ్స్ – వృషభరాశిలోని నక్షత్ర సమూహం (Pleiades) నృత్యం చేస్తుండగా పడమటి దిక్కుగా పయనిస్తాడు. కాస్త తక్కువ ప్రకాశవంతమైన చంద్రిక తన కాంతుల్ని సూర్యుడి నుంచి ప్రతిబింబింపచేసుకుని రాత్రిపూట ప్రకాశిస్తుంది. తనతోపాటు వేలాది నక్షత్రాలు ఆకాశవీధుల్లో దివ్యమణుల్లా ప్రకాశిస్తాయి. ఆ సాయంకాలమూ, ఉదయమూ కలిసి నాల్గవరోజు.

దేవదేవుడు అన్నాడు– "ఈ జలాల నుండి సరీసృపాలు (Reptiles), భూమిపైన గాలిలో ఎగిరే పక్షులు సృజించబడనీ! – అలా సముద్రంలో మహా తిమింగిలాలు (Whales) చేపలు, గాలిలో రకరకాల పక్షులు జనించాయి. భగవానుడు వాటిని చూసి సంతోషించి ఆశీర్వదించాడు. సముద్రాలలో, సరస్సులలో, వాగుల్లో, వంకల్లో, నదీనదాల తీరాల్లో గుంపులు గుంపులుగా చేపలు, గాలిలో పక్షులు ఇబ్బడిముబ్బడి అగుగాక!" అన్న విధంగానే నీటిలో చేపలు జంటలుగా, ఒంటరిగా, గుంపులుగా తళతళా మెరుస్తూ పగడ ప్రవాళ (Coral) ద్వీపాల్ని దాటుతూ, ఒక్కొసారి నీటిపైకి వచ్చి సూర్యుణ్ణి పలకరించి ఆతని కిరణాలు సోకి పై పొలుసులు బంగారు, ఇంద్రధనుస్సు వర్ణాలతో మెరయగా సముద్రాన్ని, సరస్సుల్ని శోధిస్తున్నవి. ముత్యపు చిప్పలు, నత్తగుల్లలు రాళ్లదగ్గర నీళ్లపై నిలిచిఉండగా, సీల్ జంతువులు, డాల్ఫిన్స్ (Seal, Dophins) సముద్రంలో అలల్ని సృష్టిస్తున్నవి. జీవజంతువులలోకెల్లా పెద్దదైన లెవియాథాన్ (Leviathan) పెద్దగట్టులా సముద్రపు అడుగున నిద్రిస్తూ, ఈదుతూ, దొప్పల పక్కన నీళ్లను వదుల్తూ కదుల్తున్న మైదానాన్ని తలపిస్తున్నది. సముద్రపు కొండగుహల దగ్గర, చిత్తడి నేలల్లో ఏపుగా పెరిగిన చెట్ల మధ్య పొదగబడిన గుడ్ల నుంచి వస్తున్న రెక్కలుంచి చిన్నపిల్ల పిట్టలు, గ్రద్దలు, కొంగల గూళ్లు చెట్లకొమ్మలపై, కొండ కొమ్ములపై ఋతువులననుసరించి వలసపోయేప్పుడు రకరకాల ఆకారాల్లో గుంపులు గుంపులుగా ఆకాశాన్ని ఆక్రమించుకుంటున్నవి. కొమ్మమీద నుంచి కొమ్మమీదకు ఎగుర్తూ చిన్నిపిట్టల కిలకిలారావాలు, పాటలు పాడే పక్షులు, రాత్రిపూట తన్మయత్వంతో పాడే నైటింగేల్ పక్షులు, ఇంకొన్ని పక్షులు వెండిసరస్సులలో, నదుల్లో స్నానమాడి, రెక్కల్ని విదుల్చుతూ తడియారబెట్టుకుంటున్నవి. అందంగా వంగిన మెడతో రాజహంసలు తమ తెల్లని రెక్కల్ని విప్పారుస్తూ తెడ్లలాంటి పాదాలతో గంభీరంగా ఈదుకుంటూ, కాసేపు సరస్సులను వదిలి ఆకాశంలోకి ఎగిరి క్రింది నేలను వనాల్ని పర్యవేక్షిస్తుండగా, కొన్ని నేలపై నడుస్తూ క్లారియాన్ (Clarion)

బాకా ధ్వనులను చేస్తూన్న మగహంసను వెంబడిస్తూ ఇంద్రధనుస్సు రంగులతో, మెరిసే కళ్లతో ఆరాధనగా చూస్తున్నవి. అలా జలాల్నిండా మత్స్యసంతతి, మీనరాశితో వెలుగొందిన ఆకాశంలా ప్రకాశిస్తుండగా, పక్షులతో కిక్కిరిసిన ఆకాశం తారలతో నిండిన రాత్రిలా ఉండగా – ఆ సాయంకాలం ఉదయం కలిసి అయిదవరోజు.

ఆరవరోజు, ఆఖరిరోజు – దేవదేవుడు అన్నాడు– "భూమి తన గర్భంలో పొదుపుకున్న సమస్త జంతువుల్ని నా ముందుకు తీసుకురానీ" – అలా భూమిపై తిరుగాడే పశువులు, పాకే సర్పాలు వచ్చాయి. క్రూరమృగాలు దట్టమైన అడవుల్లోకి, పశువులు ఆకుపచ్చని మైదానాల్లోకి దారితీసాయి. సింహాలు, చిరుతపులులు, అడవి పిల్లులు, పెద్దపులులు, భూమిని తవ్వి గుట్టలు తయారుచేస్తున్న మోల్ (Mole) జంతువులు, వేగంగా పరుగులు తీస్తున్న లేళ్లు, జింకలు, నేలపై ఉండే జంతువుల్లో పెద్దవైన బెహెమోత్‌లు (Behemoth-ఏనుగు), నీటిగుర్రాలు, మొసళ్లు, పురుగులు, కీటకాలు రకరకాల వర్ణాలు మెరుస్తున్న రెక్కలతో, బంగారు, ఊదా, నీలి, ఆకుపచ్చరంగు మచ్చలతో, అన్ని చిన్నవే కాదు; సర్పజాతికి చెందిన పాములు అతిపొడవైనవి, కొన్ని రెక్కలున్నవి, భయంకరమైనవి; చీమలు సర్వత్రా వ్యాపించినవి. చిన్నశరీరంలో పెద్దగుండెతో కష్టజీవులు; తేనెటీగలు – ఆడ ఈగ, 'డ్రోన్స్' అనబడే (Drones) మగ ఈగలకు తేనెనందిస్తూ తమ చుట్టూ అద్భుతమైన తేనెతుట్టె గదుల్ని మైనంతో నిర్మిస్తున్నవి. వాటి దైనందిన కార్యాలను బట్టి వాటికి పేర్లు ఏర్పడినవి. సర్పం అన్ని జంతువుల్లోకి సూక్ష్మబుద్ధి, కపటోపాయాలున్నది, మెరిసే కళ్లతో, ప్రకాశవంతమైన పొలుసులతో, మీకు విషపూరితం కానిది, విధేయుడిగా ఉండేటటువంటి జంతువే! ఇలా గాలిలో, నేలపై, నీటిలో సమస్త జంతువుల నిర్మాణం జరిగినా ఇంకా ఆరోరోజున వ్యవధి మిగిలే ఉన్నది.

విశ్వనిర్మాణ రచయిత అత్యున్నత నిర్మాణానికి సమయం ఆసన్నమైంది. నాలుగుకాళ్లపై నడవని, క్రూరత్వం కానరాని, వివేచన, జ్ఞానం ఉండి నిటారుగా నిలబడి నడుస్తూ, ఆత్మజ్ఞానంతో, స్వర్గంతో సంభాషించగలిగి, ఆ దేవదేవునికి కృతజ్ఞతాభివందనాలు సమర్పిస్తూ, మనసూ, హృదయం, పలుకూ, చూపూ ఆతనిపై లగ్నంచేసి ఆ మహాశక్తివంతుడిని నిరంతరం కీర్తిస్తూ, పూజిస్తూ, భగవానుడి సృష్టిలోని సమస్త జీవరాశులపై అధిపతిగా ఉండేందుకు నియమించబడిన అత్యద్భుత సృష్టిరూపానికి ప్రాణంపోస్తూ జగత్పిత, తన కుమారునితో అన్నాడు. "ఇప్పుడు మనం మానవుడిని మన రూపంలో తయారుచేద్దాం! Let us now make man in our image! భూమిపై ఉన్న పశుపక్ష్య జలచర భూచర సర్పజాతికి ఆతనిని అధినేతగా నియమిద్దాం!"

'ఆదాం! నిన్ను దేవదేవుడు మట్టి (Dust) నుంచి తయారుచేసి నీ నాసికారంధ్రాలలో ప్రాణవాయువునూదినాడు. తన రూపులోనే నిన్ను నిర్మించి నిన్ను జీవాత్మగా (Living Soul) మగవాడిగా రూపొందించినాడు. నీకు సహచరిని సృష్టించి మీకు ఈ భూప్రపంచంలోని సమస్త జీవరాశులపై ఆధిపత్యాన్ని ఒసగి, మిమ్మల్ని పుత్రపౌత్రాదులతో ఇతోధికంగా వృద్ధిచెంది మానవజాతిని పెంపొందించమని ఆశీర్వదించినాడు. మీరు ఆనందంగా జీవించడానికి అతిసుందరమై మనోహరంగా విలసిల్లుతున్న ఈడెన్ వనాన్ని ప్రశస్తమైన దేవవృక్షాలతో మీ ఆకలితీర్చే అద్భుత ఫలవృక్షాలతో నింపి ఇచ్చినాడు. కాని మంచీచెడుల జ్ఞానాన్ని బోధించే ఆ జ్ఞానవృక్షపు ఫలాన్ని (The Tree of knowledge) మాత్రం మీరు తినరాదు. ఏరోజు మీరు దానిని ఆరగించారో ఆ దినమే మీకు మృత్యువు సంప్రాప్తమవుతుంది. కనుక జాగ్రత్త! ఈ శాసన ధిక్కారానికి శిక్ష మరణదండనే! అందుకనే మీ ఆకలి తీరడానికి మిగతా ఫలాల్ని తినండి! మిమ్మల్ని పాపం ఆకర్షించిందా దాని వెనుకే మృత్యువు పొంచి ఉన్నది"

అని శాసించి దేవదేవుడు తన సృష్టి నిర్మాణాన్ని గాంచి మురిసిపోయాడు. సాయంకాలం ఉదయం కలిసి అది ఆరవరోజు.

ఆరు రోజుల సృష్టి అనంతరం దేవదేవుడు తాను సృజించిన కొత్తలోకం భవిష్యత్తులో ఎలా ఉండేదీ ఆలోచిస్తూ పదివేల హార్ప్ (Harp) వీణలు మ్రోగుతుండగా, దేవదూతల గానంతో భూమ్యాకాశాలు ప్రతిధ్వనిస్తుండగా, గగనమండలం నక్షత్రాలు తలలూపుతుండగా, సదా సంచారులైన గ్రహాలు తమ స్థానాల్లో నిలబడి వింటూండగా, ఉత్సాహ సంరంభాలతో, స్వర్గలోకపు ద్వారాలను దాటి ఆ మహాశిల్పి, విశ్వరచయిత, అద్భుతమైన తన ఆరురోజుల సృష్టి అనంతరం తన నివాస స్థలమైన దైవశిఖరం వేపు అరుదెంచినాడు. ఆ దేవదేవుని నివాసానికి మెట్లు గగనమండలంలోని తారలు, రహదారి స్వర్ణమయమైన ధూళి. పాలపుంత రాజమార్గం.

భూమిపై ఈడెన్ వనంలో అది ఏడవరోజు. ఆ సాయం సమయపు సంధ్యాకాంతులు విరజిమ్ముతున్న సమయంలో తండ్రి సింహాసనపు కుడివైపున దైవకుమారుడు ఆసీనుడైనాడు. ఆతడు తండ్రి పక్కనే అదృశ్యుడిగా ఉండి సమస్త సృష్టినిర్మాణాన్ని పర్యవేక్షించినాడు. ఇరువురూ విశ్రాంతి తీసుకుంటూ ఆ ఏడవరోజును విశ్రాంతి దినంగా ప్రకటించినారు.

హార్ప్ వీణానాదాలు, కొమ్ముబూరల మధురసంగీతం, విపంచి (Dulcimer) పై రాగాలాపన, సుగంధ వాయువులు, సంధ్యాకాంతులతో దైవశిఖరాన్ని దాచిన

బంగారు తెరలు మెరుస్తుండగా దేవదూతల స్తోత్ర గానాలతో స్వర్గలోకం అత్యంత ప్రశాంతంగా అలరారసాగింది.

"జెహోవా! పవిత్రదేవా! అనంతమైనది నీ శక్తి! మాలాంటి సామాన్యులు పొగడతరమా! అందరు శక్తివంతులైన దేవతలకన్నా అధికుడవు. పిడుగులే ఆయుధాలుగా ధరించిన మహాశక్తిమంతుడవు. ధ్వంసరచన కన్నా సృష్టిరచనపైననే నీకు మక్కువ. ఓ ప్రభూ! నిన్ను నిలువరించగలవారెవ్వరు? నీపై తిరగబడి నరక కూపంలో మగ్గుతున్న మత భ్రష్టులకు, దైవద్రోహులకు నీ శక్తిసామర్థ్యాలు తెలిసినవి కదా! నీ ప్రకాశాన్ని తగ్గించడానికి ఎవరు ప్రయత్నించినా ఆ ప్రయత్నాలు విఫలమై నీవు మరింత కాంతివంతుడవవుతావు. ఆ దుష్టకార్యాల నుంచి మరింత మంచిని రూపొందిస్తావు. దానికి ఋజువు ఈ కొత్తలోకం! మరోస్వర్గం! స్వర్గలోక ద్వారాలకు దగ్గరలో ఉన్నదీ, ఇక్కడినుంచి స్పష్టంగా కనబడేదీ, జీవరాశులతో కళకళలాడేదీ, మానవజాతికి నెలవైనదీ, సముద్రజలాలతో చుట్టబడి సురక్షితమైనదీ ఆ మానవలోకం! అటువంటి అద్భుత ప్రదేశంలో మానవులు వారి సంతతి మూడింతలు సుఖంగా జీవిస్తారు. దేవుని రూపంలోనే సృజించబడ్డవారు, తమలోకంలో దేవదేవుని పూజిస్తూ, కీర్తనలతో, స్తోత్రగానాలతో ఆతని వైభవాన్ని, సృష్టినిర్మాణాన్ని శ్లాఘిస్తూ విధేయులు, విశ్వాసులు, న్యాయప్రవర్తకులు పవిత్రజీవనులు అయిన వారితో నూతనలోకాన్ని నింపుదురుగాక! వారి ఆనందం మూడింతలు వర్ధిల్లును గాక! వారిని సత్యమార్గంలో నడుపును గాక!"

అలా వారు గానం చేస్తుండగా స్వర్గసామ్రాజ్యమంతా కీర్తనలను, హలెలూయా (Halleluiah)లను పలికినది. ఏడవరోజైన (Sabbath) శనివారం విశ్రాంతిదినం కాగా, స్వర్గం సంతోషంతో సంతృప్తిచెందింది.

నీవడిగిన ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం దొరికిందని భావిస్తున్నాను. ఈ ప్రపంచ నిర్మాణం గురించి, జీవకోటిసృష్టి గురించి సమస్తమైన విషయాలను నీకు, తద్వారా నీ సంతతికి తెలిపియున్నాను. భగవానుని శాసనాలను మీరకుండా మెలగాల్సిన బాధ్యత మానవజాతిపైననే ఉన్నది."

8. ఆదాంను హెచ్చరించి రాఫెల్ నిష్క్రమణ

జ్ఞానదాహం తీరని 'ఆదాం' (Adam) దేవదూత రాఫెల్ (Raphael) ను గ్రహచలనాల గురించి ప్రశ్నించాడు. అనవసర విషయాలకన్నా నీ దృష్టిని మరింత ప్రయోజనకరమైన వాటివేపు మళ్లించమని రాఫెల్ చెప్పగా ఏకీభవించిన ఆదాం తాను సృష్టింపబడినప్పటి నుంచి తనకు గుర్తున్న విశేషాలను, పారడైజ్‌లో నివాసం, దేవునితో తన సంభాషణ, 'ఈవ్' (Eve) తో పరిచయం, ప్రేమ గురించి రాఫెల్‌కు వివరిస్తాడు. అవన్నీ విన్న రాఫెల్ మరొక్కసారి 'ఆదాం'ను రానున్న విపత్తు గురించి హెచ్చరించి నిష్క్రమిస్తాడు.

"ఈ సుందర ఆనందవనంలో హాయిగా జీవిస్తూ, దేవదేవుని ఆజ్ఞను జవదాటకుండా మెలగాల్సిన బాధ్యత మీపైనే ఉన్నది" అని రాఫెల్ (Raphael) దేవదూత ఆదాంను హెచ్చరించినాడు.

దేవదూత తన అద్భుత ప్రసంగాన్ని ముగించినా తన్మయత్వంతో వింటున్న ఆదాంకు ఇంకా ఇంకా వినాలనే కుతూహలం పెరిగి కృతజ్ఞతాంజలి ఘటించి ఇలా అన్నాడు– "దివ్యచరిత్రకారుడా! ఎన్ని కృతజ్ఞతావందనాలు, ఇంకా ఏమి తమకు సమర్పించి ఈ ఋణం తీర్చుకోగలను? నా జ్ఞానదాహం తీర్చి నన్ను కృతార్థుణ్ణి చేసారు. ఇన్ని మహత్తర మార్మిక విశేషాలు మీరు చెప్పకపోయున్నట్లయితే నాకెన్నటికీ తెలిసేవి కాదుకదా! ఒక్కొక్క సంఘటన నాలో సంభ్రమాశ్చర్యాలను రేకెత్తించి నన్ను ముగ్ధుణ్ణి చేసాయి. ఆ సృష్టికర్త నిర్మాణచాతుర్యాన్ని కీర్తిస్తూ ఆతని ఖ్యాతిని గానం చేస్తాను.

మీకభ్యంతరం లేకపోతే నాకున్న ఈ చిరుసందేహాలను తీర్చగలరు. ఈ స్వర్గ భూలోకాల పరిమాణాలేమిటి? గగన మండలంతో పోలిస్తే ఈభూమి ఓ చిన్ని చుక్క (Spot), ఓ తృణధాన్యపు గింజ (Grain), ఓ ఇసుకరేణువు, ఒక పరమాణువు కదా! తారామండలంలోని నక్షత్రాలు అక్కడే ఎలా ఉంటున్నాయి? ప్రకృతి ఎందుకు, ఏ ఉద్దేశంతో భూమికన్నా ఎన్నోరెట్లు పెద్దవైన గ్రహాలను, తారలను సృష్టించి పరిభ్రమింప చేస్తున్నది? భూమి ఎందుకు ఇలా నిశ్చలంగా ఉన్నట్లు కనిపిస్తోంది? ఈ వేడిమి వెలుగు ఆ గ్రహాల చలన ఫలితమేనా!"

అలా ప్రశ్నిస్తున్న 'ఆదాం' వదనంలో ప్రగాఢమైన ఆలోచనలు ప్రస్ఫుటిస్తుండగా – ప్రక్కనే తీర్చిదిద్దిన శిల్పంలా, మరీమరీ చూడాలనిపించే అద్భుత సౌందర్యంతో అప్పటివరకు మౌనంగా కూర్చుని ఉన్న 'ఈవ్' (Eve) కాసేపు తన

ఫలపుష్ప వృక్షాల మధ్యకు వెళ్లదలచి లేచి నిలబడింది. ఆ సంభాషణ రుచించక కాదు, అవన్నీ ఆమెకు ఆదాం నోటినుండి వినడమే ఇష్టం. తనకున్న సందేహాలను ఇరువురి దేహాలూ ఒక్కటిగా పరవశిస్తున్నపుడు, ఆదాం తనని ప్రేమతో లాలిస్తూ, ముద్దాడుతూ ఉన్నపుడు గోముగా అడిగి తెలుసుకోవడం మరింత యిష్టం. అంతటి గాఢానురాగం ఉన్న ప్రేమజంటను మరెక్కడ చూడగలం? వనదేవతలా, యువరాణిలా, ఆమె తన లావణ్యంతో ప్రకృతిని మంత్రముగ్ధంగా చేస్తూ తోటలోకి వెళ్లి పూలను, లతలను స్పృశిస్తూ పలకరించసాగింది.

రాఫెల్ (Raphael) ఇప్పుడు తనతో ఒంటరిగా ఉన్న ఆదాం (Adam) సందేహ నివృత్తి చేయబూని ఇలా చెప్పాడు– "నీ ప్రశ్నలకు నిన్ను తప్పుపట్టబోను. ఎందుకంటే స్వర్గం దేవుని పుస్తకం (The Book of God) లాంటిది. ఆ అద్భుత సృష్టి నిర్మాణాన్ని చూస్తూ, గంటలు రోజులు నెలలు సంవత్సరాలను ఋతువుల్ని అధ్యయనం చేస్తూ దేవదేవుడు అనుమతించిన మేరకు గ్రహించాలి. సృష్టిరహస్య శోధన నెపంతో విశ్వనిర్మాణాన్ని అంచనావేస్తూ రకరకాల నిర్ణయాల్ని ప్రకటించే వారిని చూసి ఆతడు నవ్వుతూ ఉంటాడు. వాళ్లు మానవులైనా దేవదూతలైనా విశ్వాంతరాళ రహస్యాల్ని రాబట్టుకోడానికి నక్షత్రాలను గణిస్తూ, కాలమానాన్ని గుణిస్తూ, నమూనాల్ని నిర్మిస్తూ కక్ష్యలను, వృత్తాలను, ఉపరివృత్తాలను, కేంద్రక, ఉపకేంద్రక బలాల్ని పరిగణిస్తూ ఏం సాధిద్దామని? సూర్యునితో పోలిస్తే అతి చిన్నదైన భూమి ఫలవంతమైనది, విజ్ఞానులతో కూడినదీ కావచ్చును. కాని వెలుగు కోసం సూర్యునిపై ఆధారపడవలసిందే కదా! అటువంటప్పుడు ఎందరో సూర్యులకు, ఎన్నో లోకాలకు వెలుగునిచ్చే వెలుగులోకం గురించి తెలుసుకునే మితిమీరిన జిజ్ఞాస ఎందుకు? వారు ఎంత కనుక్కున్నా సృష్టి ఇంకా ముందుకు విస్తరించుకుని పోతూనే ఉంటుంది కదా! ఈ ప్రయత్నాలన్నీ వృధాయే! మానవుడు నివసించే ఈ కొత్తలోకం కూడా తనది కాదు! అతడికోసం భూమిలో కొంతభాగాన్ని ప్రత్యేకించి, మిగతాభాగాన్ని సృష్టికర్త తన కిష్టమైన రీతిలో ఉపయోగిస్తాడు. ఆ గ్రహాల చలనవేగం నేను చెప్పలేను కాని ప్రాతఃకాలమే నేను స్వర్గలోకంలో బయల్దేరి, ఇక్కడకు వచ్చేసరికి ఈడెన్ వనంలో మధ్యాహ్నకాలమయ్యింది. వేగాన్ని, దూరాన్ని కొలిచే కొలతలకు పేర్లింకా సృష్టించబడలేదు!

మీకు ఈడెన్‌లో ఎందుకు నివాసమిచ్చినారు అన్న ప్రశ్నకు – దేవదేవుడు తన సృష్టిని, తన దైనందిన కార్యక్రమాలను మానవుల దృష్టికి దూరంగా ఉంచాలని తలపోసినాడు. పరిమితి దాటిన విజ్ఞానం విపరీత ధోరణులకు దారితీస్తుందని ఆతని అభిప్రాయం. అలాగే సూర్యుడే ఈ విశ్వానికి మధ్యలో ఉన్నాడనుకుందాం. ఈ

గ్రహాలూ నక్షత్రాలూ అతని చుట్టూ పరిభ్రమణం, ఆత్మభ్రమణాలతో నృత్యం చేస్తూ, కొంతకాలం ఊర్ధ్వంగా, కొంతకాలం దాక్కుని, కొంతకాలం అధోముఖంగా, కొన్నినాళ్లు స్థిరంగా, ముందుకు, వెనక్కు వ్యతిరిక్త దిశలో ఇలా ఆరురకాలుగా లేక ఏడో విధంగా చలిస్తూ ఏ కార్యాన్ని నిర్వహిస్తున్నవో ఆ ఈశ్వరుడికే తెలియాలి. ఈ పరిభ్రమ ఆత్మభ్రమణాలే రేయింబవళ్లను, దివారాత్ర చక్రాన్ని సృష్టిస్తున్నాయేమో! భూమి తూర్పు దిక్కునకు పయనిస్తున్నప్పుడు వెలుగు వ్యాపించిన ప్రాంతంలో పగలు, దానికి వెనుక భాగంలో చీకటిగా ఉండి రాత్రి సంభవిస్తున్నది కావచ్చును. భూమిపై పడిన కాంతి పరావర్తనం చెంది చంద్రగోళంపై పడగా అది చంద్రబింబమై ప్రకాశిస్తూ పగటి వెలుగుల్లో తాను ఆనందించి, రాత్రివేళల్లో భూమికి వెలుగును అందిస్తున్నదేమో! ఒకవేళ చంద్రగోళంపైని మైదానాల్లో జనులుండి మనకు కనిపించే మచ్చలు మబ్బులై అక్కడ వర్షాన్ని కురిపించగా అక్కడ ఫలపుష్పాలు విరిసి అక్కడి నివాసులు ఆనందంగా జీవిస్తూ ఉండవచ్చును. పురుష స్త్రీతత్వాలైన ధన, ఋణ కాంతుల్తో, ప్రపంచానికి జీవమిస్తూ ఈ విశ్వమే సజీవచిత్రం అవుతున్నది కదా. అంత విశాల విశ్వంలో అనేక కాంతిదీపాలు ఈ ఒక్క చిన్న ప్రదేశానికి వెలుగు ప్రసాదిస్తూ తిరిగి పొందుతుంటే ఎందుకు అన్న సందేహం సమర్థనీయమే! సూర్యుడా లేక భూమి కేంద్రస్థానంలో ఉన్నదా, సూర్యుడు జ్వాలామార్గాన తూర్పు నుంచి పయనిస్తున్నాడా! లేక భూమి పడమటి నుంచి తూర్పుగా, గాలిని వెంట నిడుకుని తన అక్షంపై, నిశ్శబ్దంగా ప్రయాణిస్తున్నదా! ఇటువంటి రహస్య విషయాలను మార్మిక ఘటనలను దేవదేవునికి వదిలి అతనిని భయభక్తులతో సేవించు. మిగతా జీవకోటిని వాటి మానాన వాటిని దైవనిర్ణయానికి వదిలి, నీకు ఆతడిచ్చిన ఈ ఆనందవనంలో 'ఈవ్'తో హాయిగా కాలం గడుపు. స్వర్గంలో జరిగే సంగతులను తెలుసుకోవాలనుకోవడం అనవసర ప్రయాస! నీకేం కావాలో వాటి గురించి, నీ గురించి ఆలోచించు. ఇతరలోకాలు, అక్కడుండే జీవరాశికై కలలు గనడం మానుకో! ఇప్పటి వరకు నీకు తెలిసిన జ్ఞానంతో సంతృప్తిపడు!"

జ్ఞానదాహం తీరినవాడై ఆదాం తన అతిథితో ఇలా పలికాడు– "విజ్ఞానఖనీ! శాంతిదూతా! మీ సమాధానాలు నాకున్న సందేహాలను పూర్తిగా నిర్మూలించినవి. సుఖప్రదమైన జీవనాన్ని భంగపరిచే అనవసరపు ఆలోచనలకు చోటివ్వకుండా, ఆరాటాలు, ఆత్రంతో కూడిన కోరికలు మనసును కల్లోలపరచి ప్రశాంతతను భంగపరచకుండా, పరుగులెత్తే మనసును అదుపులో ఉంచుకుని హాయిగా జీవించడం మంచిదని నాకు అవగతమయ్యింది. పనికిరానివి, అత్యంత క్లిష్టమైనవి, అస్పష్ట విషయాలపై తన్నుకులాడడం కన్నా, మన దైనందిన జీవితాన్ని సుఖప్రదంగా ఉంచే

వాటిపై శ్రద్ధవహించడమే నిజమైన విచక్షణా జ్ఞానమని అర్థమయ్యింది. అనవసర జ్ఞానం, అమితజ్ఞానం పొగవంటిది, శూన్యం లాంటిది, అప్రస్తుతమైనది. అది మనం సిద్ధంగా లేని, అనుభవంలేని కొత్తదారుల్లోకి నడుపుతుంది. అందుకని అటువంటి అస్థిరమైన ఆకాశమార్గం నుంచి స్థిరమైన కాలిబాటలో ప్రవేశించడం ఉత్తమం. అందుకనే నేను నాకు ఇప్పటివరకు జ్ఞాపకమున్న విషయాలను, వాటిలో నాకర్థం కాని వాటిగురించి మీ సలహా కోర్తాను. మీతో కూర్చుని సంభాషిస్తున్నప్పుడు కాలగమనం తెలియడం లేదు. మరింతసేపు మీతో మాట్లాడాలని, కాలం గడపాలని మనసు తహతహలాడ్తున్నది. ఆ ఉద్దేశంతోనే నేను మీకు నా కథ వివరించదలచాను. మీ సన్నిధి నాకు స్వర్గాన్ని తలపిస్తూండగా శ్రమవలన కలిగిన ఆకలిదప్పులను చల్లార్చే మధురమైన ఖర్జూరాల కన్నా తీయగా మీ మాటలు ఉండి, నాకు అమితానందాన్ని కలిగిస్తున్నవి"

ఆదాం మాటలు విన్న రాఫెల్ (Raphael) అన్నాడు– "మానవుల మూలపురుషుడా! సొగసై, ధారాళంగా ప్రవహిస్తున్న నీ పలుకులు వీనులకు విందులే. రూపాన్ని గుణాన్ని కలబోసి ఆ దేవదేవుడు తన రూపులోనే మిమ్మల్ని సృజించినాడు. మానవునిపై దేవుడికున్న ప్రేమ, ఆప్యాయతలు మా దేవదూతలందరికి తెలుసును. నిన్ను సృష్టించిన రోజున నేను అత్యవసర పని నిమిత్తం నరకలోకపు ద్వారాల వద్దకు వెళ్లవలసి వచ్చింది. దేవదేవుడు సృష్టికార్యంలో నిమగ్నుడై ఉండగా నరకద్వారాలను తెరచుకుని, ఎవరైనా గూఢచారి గానీ, విరోధిగాని తప్పించుకోకుండా కట్టుదిట్టం చేయమని ఆతని ఆజ్ఞ. సృష్టినిర్మాణ సమయంలో ఏదైనా విధ్వంసం సంభవించినా సిద్ధంగా ఉండాలని దేవదేవుడు ఆనతీయగా నేను నరకద్వారాల వద్దకు వెళ్లి వాటిని మరింత కట్టుదిట్టంగా మూసి వెనక్కువెళ్లాను. నేను అక్కడి నుంచి వస్తుండగా మధుర సంగీతం బదులు అపశృతుల్లా రోదన, ఆగ్రహం, బాధలతో కూడిన మూలుగులు వినిపించాయి. నేను సబ్బాత్ (Sabbath) సాయంకాలానికల్లా స్వర్గం చేరుకున్నాను. నీకు నా మాటలు రుచించినట్లే నాకూ నీతో సంభాషణ ఇష్టమే!"

అప్పుడు ఆ దేవదూతతో 'ఆదాం' పలికాడు–

"మానవజీవితం ఎలా మొదలయ్యిందో తొలి మానవుడు చెప్పడం కష్టమే! మిమ్మల్ని ఇంకొంతసేపు నిలువరించడానికే నేను నా కథను చెబుతున్నాను. నేను ఆరోజున గాఢనిద్ర నుంచి మేల్కొనినట్లు కళ్లుతెరచి చూసాను. పూలపాన్పుపై పవ్వళించి ఉన్న నా ఒంటినిండా స్వేదబిందువులు ఆవరించి ఉన్నవి. సూర్యుని కిరణాలు సోకగానే అవి అదృశ్యం కాగా నేను స్వర్గంవేపు దృష్టిసారించాను. లేచి నిలబడి మానవ సహజ నైజంతో అటూఇటూ తిరగసాగాను. కొండలు, కోనలు నీడనిస్తున్న అడవులు, ఎండలు

కాస్తున్న మైదానాలు, స్వచ్ఛమైన జలాల్ని ప్రవహిస్తున్న సెలయేర్లు, వాటిల్లో విహరిస్తూ, ఎగుర్తూ, నడుస్తూ ఉన్న అనేక జీవరాశులతో మనోహరమైన ప్రకృతి దృశ్యాలు కనిపించాయి. నా మనసు అనందంతో ఉప్పొంగిపోయింది. ఎక్కడచూసినా పక్షుల కిలకిలారావాలే! మత్తుగొలిపే సుగంధపుష్ప పరిమళాలే! నేనూ నూతనోత్సాహంతో కాసేపు నడుస్తూ, పరిగెడ్తూ, విశ్రమిస్తూ ఎల్లెడలా తిరుగుతున్నానే కాని నా మనసులో ఈ ప్రశ్నలు వేధించసాగినాయి. నేనెవర్ని? ఎక్కడ నుంచి వచ్చాను? ఎందుకిక్కడ ఉన్నాను? తెలియలేదు. మాట్లాడ్డానికి ప్రయత్నించాను. నాలుక కదిలింది. నేను చూసిన ప్రతిదానికి ఒక పేరు పెట్టాను. నేనన్నాను– ఓ సూర్యుడా! కాంతిరూపమా! ఈ లోకాన్ని వెలుగులతో నింపి, కొండల్ని, కోనల్ని, నదుల్ని, వనాల్ని, మైదానాల్ని స్పృశిస్తూ, జీవజాలాన్ని నడిపిస్తూంటావు కదా! నేనిక్కడకు ఎలా వచ్చాను? నేనెవర్ని? నన్ను సృష్టించిన ఆ మహా నిర్మాత ఎవరు? తెలిసినట్లయితే ఆతనికి కృతజ్ఞతలు తెలుపుతూ, నన్ను ఇంతటి ఆనందలోకంలో సృష్టించినందుకు కొనియాడుతాను – అని పలుకుతూ అటుయిటు తిరిగినా సమాధానం లభించక నిరాశతో వివిధ వర్ణశోభితమై పుష్పాలతో ఆకుపచ్చని పచ్చికతో ఉన్న నీడలో విశ్రమించాను. సున్నితమైన నిద్ర నన్ను ఆవహించగా ఇంద్రియజ్ఞానము నశించి కరిగిపోతూ నేను నా మునుపటి ద్రవీభూత స్థితిలోకి మారిపోతున్నట్లనిపించింది. ఆ క్షణంలోనే నా శిరస్సువద్ద ఒక స్వప్నం నిలబడింది. ఆ స్వప్నము దివ్యరూపంతో మరల జీవించినట్లున్న నాతో పలికింది– "నీ నివాస భవనం నీకోసం ఎదురుచూస్తున్నది. ఆదాం! మేలుకో! ఓ తొలి మానవుడా! మానవుల మూలపురుషుడా! నేను నీ నివాసమైన పారడైజ్ ఆనందవనానికి తోడ్కొని పోతాను" – అని పలికి నాచేయి అందిపుచ్చుకునగా, నేనూ అతనితో ఆకాశమార్గాన ఎగిరి జలప్రవాహాలు, పచ్చని పొలాల మీదుగా ఆకుపచ్చని వనాలతో శోభిల్లుతున్న పర్వతం దగ్గరకు వెళ్లినాము. ఆ పర్వతం పైభాగం విశాలమై చదునుగా ఉండి, అనేక వృక్షాలతో, కాలిబాటలతో, ఫలపుష్ప లతలతో తీర్చిదిద్దినట్లున్నది. ప్రతి చెట్టునిండా చేతికందివస్తున్నట్లున్న మధుర ఫలాలే! వాటిని చూసి నా ఆకలి అతిశయించగా ఒక ఫలాన్ని కోసి తినబోయాను– మెలకువ వచ్చి కళ్లు తెరవగా నా కల అంతా వాస్తవమై కనిపించింది. ఇక్కడ నేను ఇలా తిరుగాడుతూ ఉండగా నా మార్గదర్శకుడు (Guide), సృష్టికర్త, దివ్యరూపంతో వృక్షాల మధ్య ప్రత్యక్షమైనాడు. ఆ దివ్యపురుషుని పాదాలపై పడి శరణువేడాను. ఆతడు నన్ను ఆదరించి ఇలా పలికాడు.

"నీవు ఎవరికోసం ఎదురుచూస్తున్నావో ఆ సృష్టికర్తను నేను. ఊర్ధ్వ అధోలోకాలనూ, ఈ సమస్త ప్రపంచాన్ని సృజించిన రచయితను నేనే! ఈ పారడైజ్

(Paradise) భూతల స్వర్గాన్ని నేను నీకిస్తున్నాను. ఈ వనాన్ని పెంచు, పోషించు, ఇక్కడున్న ఫలాల్ని ఆరగించు. అయితే నీ విధేయతకు, విశ్వాసానికి పరీక్షగా నాటిన జ్ఞానవృక్ష ఫలాన్ని మాత్రం తినరాదు. ఆ జ్ఞానవృక్షం తోట మధ్యన ఉన్న జీవవృక్షం (Tree of Life) పక్కనే ఉన్నది. గుర్తుంచుకో నేను చెప్పిన విషయాన్ని! ఏ రోజునైతే నీవు జ్ఞానవృక్ష ఫలాన్ని తింటావో ఆరోజున నా ఆజ్ఞచే నీకు మరణం సంభవిస్తుంది. ఈ ఆనందవనాన్ని కోల్పోయి దుఃఖంతో, బాధలతో నిండిన మరో లోకంలోకి బహిష్కరింపబడతావు" – దేవదేవుడు అంత కఠినంగా పలికిన మాటలు ఇంకా నా చెవుల్లో మారుమోగుతూనే ఉన్నాయి. ఆ కాసేపు తీవ్రంగా ఉన్న ఆతని వదనం మరల కరుణతో నిండగా ఇలా పలికినాడు – "ఈ వనమే కాదు, ఈ భూలోకాన్నంతా మీ మానవతెగకు ఇస్తున్నాను. మీరు ఇక్కడ నివసించే సమస్త జీవరాశులపై అధిపతులై పశుపక్ష్యాదులు, జలచరాలు నేను ఆజ్ఞాపించగా అవి మీ వద్దకు రాగా వాటికి నామకరణం చేద్దువుగాని."

దేవదేవుని ఆనతితో నా ముందుకు జంటలు జంటలుగా వచ్చిన ప్రతి జలచర, ఖేచర, భూచరాలను వీక్షించి వాటి నైజాన్ని గ్రహించి వాటికి తగిన పేర్లు పెట్టాను. ఇంకా నాలో ఏదో సందేహం బాధించగా దేవదేవుని అడిగాను– "ఓ దేవదేవా! ఈ సమస్త జీవకోటిపైన, మానవజాతిపైన, మానవ జాతికన్నా ఉత్కృష్టమైన దివ్యాత్మలపైన, నాకు తెలియని దివ్యలోకాలపైన అధిపతివైన ఓ జగత్పితా! నిన్నేమని కొనియాడగలను! ఓ విశ్వనిర్మాణ రచయితా! ఈ నవలోకంలో అన్నీ సమకూర్చినావు. ఇవన్నీ నాతో పంచుకునేదెవ్వరు? ఒంటరితనంలో ఆనందం, తృప్తి కొరవడుతాయి కదా!"

ఈశ్వరుని వదనం మరింత ప్రకాశవంతమై చిరునవ్వులు వెలయగా ఇలా పలికినాడు– "ఎక్కడిదీ ఒంటరితనం! నీకు తోడుగా ఇన్ని జీవ జంతువులు గాలిలో, నీటిలో, నేలపై నడయాడుతున్నవి కదా! వాటితో ఆడుతూ పాడుతూ వాటి భాషనూ, తీరుతెన్నులనూ గమనించు. అవికూడ నిన్ను అర్థం చేసుకోగలవు. ఇలా ఒక వ్యాపకాన్ని వృద్ధి చెందించుకుని ఈ విశాల సామ్రాజ్యాన్ని పరిపాలించు!" ఆజ్ఞలా భాసించిన దేవదేవుని మాటలను శిరసావహించి వినయంగా ఇలా సమాధానమిచ్చాను.

"నా మాటలు మిమ్మల్ని నొప్పించరాదు, ఓ జగత్పాలకా! సృష్టికర్తా! నా యందు దయ ఉంచి నా మాటలు వినగలరు. నన్ను మీ ప్రతినిధిగా ఈ లోకాన నా కన్నా తక్కువ స్థితిలో ఉండే జంతుకోటిపై అధికారాన్నిచ్చారు. కాని అసమానత్వం ఉన్న జీవులతో ఆనందకరము, కలిసిమెలిసి ఉండే సమాజాన్ని ఎలా నిర్మించగలం? ప్రేమ సంతోషాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకునేవి కదా! అంతేకాక ఒకరికి నచ్చినది

మరొకరికి నచ్చక, ఒకరితో ఒకరికి పొసగక విభేదాలు రావచ్చును. క్రూరజంతువుతో మానవునికి పొసగదు. సింహం, సివంగితో ఆనందాన్ని ప్రేమను పంచుకొనగలదు. కాని పక్షి, పశువులతో, చేప, పక్షితో; ఎద్దు కోతితో; మనిషి జంతువుతో ఎలా సఖ్యంగా ఉండగలరు?"

దేవదేవుడు నాపై కోపించక సమాధానమిచ్చాడు– "నేను వివరించిన ఆనందానికి భిన్నమైన సంతోషాన్ని, ప్రేమను నీవు కోరుకుంటున్నావు. ఆదాం! అనంత కాలం నుంచి నేనున్నది నీవున్న ఏకాంతం లాంటి స్థితిలోనే కదా! నేను సృష్టించిన జీవరాశులతో సంభాషిస్తూ వాటి బాగోగులను గమనిస్తూ ఉన్నట్లే నా రూపులో సృజించబడిన నీవుకూడా ఈ బాధ్యతను నెరవేర్చాలి"

నేను లోగొంతుకతో అడిగాను– "దేవదేవుని ఆలోచనలను తీరుతెన్నులను మానవుడు ఆచరించడం దుర్లభమనిపిస్తున్నది. ఓ మహామహిమాన్వితుడవైన ప్రభూ! సర్వధర్మాలకు అంతిమలక్ష్యమై సంపూర్ణుడవై, లోపరహితుడవైన నీవలె మానవుడు పరిపూర్ణుడు కాడు. మానవుడు తన లోపాల్ని ఇతరులకు సాయపడడంలో సరిదిద్దుకుని, తనజాతి ఇతోధికంగా పెరిగినప్పుడు తనకున్న ఆ లోటును సర్వశక్తిమంతుడైన తమ నుండి ప్రేమను, కరుణను పొంది భర్తీ చేసుకుంటాడు. నాకున్న పరిమితమైన శక్తులతో నేను ఈ గురుతరమైన అధికారాన్ని, బాధ్యతను ఎలా నిర్వహించగలనో తెలియకున్నది ప్రభూ!"

దేవదేవుడు ఇలా అన్నాడు– "ఆదాం! నీవు వెలిబుచ్చిన సందేహం సరియైనదే! జీవజంతువుల గురించే కాక, నిన్ను నీవు తెలుసుకోవడంలో, నీ ఆత్మను స్వేచ్ఛా మార్గంలో నడపడంలో నీకున్న ఉత్సాహానికి భావనలకు సంతోషించాను. నా రూపాన్ని నీకివ్వడం వల్లనే నీవు ఇతర జంతువుల నుంచి విభిన్నంగా ప్రవర్తిస్తూ ఆలోచిస్తున్నావు. అందుకే నీకు నేనిచ్చిన విచక్షణా జ్ఞానాన్ని వినియోగించి నీకేది కావాలో కోరుకోగలిగావు. ఇప్పుడు నేను నీకివ్వబోయేది – నీలానే ఉండి, నిన్ను సంతోషపరుస్తూ నీ హృదయం కోరుకునేదై నీ అర్ధభాగం కాగలదు!"

దేవదేవుడు తన సంభాషణను ముగించిన తరువాత నన్నేదో దివ్యత్వం ఆవహించినట్లై నేనొక అనిర్వచనీయమైన, అలౌకికమైన, ఆనందస్థితిలోకి జారిపోయాను. ఇంద్రియజ్ఞానం స్తబ్దించి, కాలం స్తంభించినట్లై, నేను ఒక అపూర్వమైన నిద్రాస్థితిలో కనులు మూసుకున్నాను. ఆ నిద్రలో నేను చూసాను, దేవదేవుడు నా ఎడమపక్క శరీరాన్ని తెరచి పక్కటెముక (Rib)ను తొలగించి రక్తం స్రవిస్తున్న ఆ గాయం మరుక్షణంలో నయం కాగా, ఆ పక్కటెముక నుంచి మానవస్త్రీని తన

స్వహస్తాలతో తయారుచేసినాడు. ఆమె నాలానే ఉండి అపురూప లావణ్యంతో తొణికిసలాడుతూ నా హృదయంలోకి ఏదో తెలీని మాధుర్యాన్ని నింపింది. ప్రేమతో కూడిన ఆనందం నా అనుభవంలోకి వచ్చింది. కాని ఆమె అదృశ్యం కాగా నాకు మెలకువ వచ్చి ఆమెనే తలుస్తూ, పలవరిస్తూ ఈ వనమంతా కలయతిరిగాను. నా ఆశలన్నీ వ్యర్థమై ఇక ఆమె నాకు కనిపించదనుకున్న క్షణంలో ఆమె మరల నాకు అగుపించింది. అగోచరమైన సృష్టికర్త ఆమెకు దారిచూపుతూ, మాట్లాడుతూ వివాహ పవిత్రతను, కలయికను విశదపరచగా, ఆమె నా వద్దకు, ప్రేమగా, హుందాగా కనులలో స్వర్గం తొణికిసలాడుతుండగా వచ్చి సంతోషంతో ఎగసిపడ్తున్న నన్ను మరింత ఆనందపరచింది. నేను బిగ్గరగా దేవుని స్తుతించాను.

"ఓ అద్భుత సృష్టికర్తా! సమస్త భోగభాగ్యప్రదాతా! నీవు నాకిదివరకు ఇచ్చిన వాటన్నిటికన్నా ఈ కానుక అనేకరెట్లు విలువైనది, ఉన్నతమైనది. నా శరీరంలో శరీరమై, నా అస్థిమాంసాల్లో అస్థిమాంసమై, నేనే నాముందు నిలబడినట్లున్న ఆమెను 'మానవి'గా (Woman is her name, of man extracted) పిలుస్తాను. ఆమెకోసం అతడు తల్లిదండ్రులను వదులుకుని ఆమెను భార్యగా (Wife) స్వీకరిస్తాడు. వారిరువురు ఒకే శరీరం, ఒకే హృదయం, ఒకే ఆత్మగా జీవిస్తారు."

ప్రకృతిలోని అందాలన్నీ కలబోసి, స్వచ్ఛంగా, పవిత్రంగా, అతిమనోహరంగా ఉన్న ఆమె నా మాటలను విన్నది. దివ్యసుందరరూపం, మంగళకరమై, అమాయకత్వం మూర్తీభవించి, సద్గుణాలు సంపదలైన సొబగులు, ఆత్మవిశ్వాసంతో ఉన్న ఆమెను పొందాలని నా మనసు తహతహలాడింది. నేనామెను సమీపించి సహేతుకమైన నా కోర్కెను వెల్లడించాను. ఉదయసంధ్యలా ఎరుపెక్కిన ఆమెను పొదివిపట్టుకుని పొదరింటికి తీసుకువెళ్లాను. స్వర్గలోకం, నక్షత్రరాశులు ఆనందంతో మమ్మల్ని ఆశీర్వదించాయి. భూమి మమ్మల్ని అభినందించింది. కొండలు గుట్టలు హర్షాతిరేకంతో పక్షులతో ఊసులాడగా, గాలితెమ్మెరలు ఈ వనంలోని ప్రతి ఒక్కరికి సంతోషవార్తను తెలియజేసాయి. మా దివ్య సమాగమాన్ని అభినందిస్తూ గులాబీలు విరిసి, సుగంధ వృక్షాలు పరిమళాల్ని వెదజల్లగా, సాయంకాలపు నక్షత్రం కొండశిఖరంపై కాంతి దీపాన్ని వెలిగించేంతవరకు, నైటింగేల్ తన రాత్రిపాటను పాడేంతవరకూ మేము వినోదించినాము."

ఇది మా ప్రణయ వృత్తాంతం. ఈ ప్రేమమాధురి, ఈ ఆనంద లాహిరి ఇక్కడ ఉన్న అన్ని సంపదలకన్నా ఉన్నతమైన నన్ను వివశుణ్ణి చేసింది. సాధారణ విషయాలైన రుచి, దృశ్యం, ఘ్రాణన, లతలు, పొదలు, ఫలపుష్పాలు, సెలయేటి

తీరాన నడకలు, పక్షుల కిలకిలారావాల అపాత మాధుర్యంకన్నా అనేకరెట్లు అధికమైన ఈ ప్రేమానుభవం నన్ను మరోలోకంలోకి కొనిపోయింది. ఆ అపూర్వ లావణ్యవతి క్రీగంటిచూపులకు అన్ని అనుభవాలు అదృశ్యమై అలౌకిక ఆనందం నన్ను చుట్టుముట్టు తున్నది. నాపక్క భాగం నుంచి నిర్మించబడ్డ ఆమె, రూప లావణ్యాలలో అధికమై అలరారుతూ సౌష్టవం రీత్యా నాకన్నా తక్కువగా కనిపించినా, మానసికంగా మరింత ఉన్నత శ్రేణిలో ఉన్నది. ఇద్దరినీ సృజించిన దేవుడు తన రూపంలో నన్ను, కొద్ది తేడాలతో ఆమెను సృష్టించినా ఆమెను నేను సమీపించినప్పుడు ఆమె నాకు పరిపూర్ణ మానవిగా కనిపిస్తుంది. స్వయం నిర్ణయాధికారం, స్వేచ్ఛ, వివేచన, విచక్షణ, తెలివితేటలు ఆమె స్వంతమై ఉన్నత జ్ఞానసంపద ఆమె ముందు వెలవెలబోతున్నది. అనుభవజ్ఞానం వెనకడుగు వేయగా, అధికారం, హేతువు ఆమె ఆజ్ఞకోసం మాయా నాటకాల్లా ఎదురుచూస్తుంటాయి. రాచఠీవి, మానసిక పరిపక్వత ఆమె వదనంలో ప్రస్ఫుటించగా ఆమె తనను చూసేవారికి భక్తిపూర్వక సంభ్రమాన్ని కలిగిస్తున్నది"

ఆదాం మాటలు విన్న దేవదూత భృకుటి ముడివడింది. ఆతడు తీవ్రంగా స్పందించాడు– "ప్రకృతిని నిందించకు. ప్రకృతి తన ధర్మాన్ని తాను నిర్వర్తించింది. నీ విధి నీవు నిర్వహించు. జ్ఞానం గురించి చింతించకు. ఎక్కువమందికి జ్ఞానం అవసరం లేకపోవచ్చు. తక్కువ ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి, ఎవరు నీకాశక్తుల్ని, అవకాశాన్ని ఇచ్చారో వాళ్లను మరచిపోరాదు. నీ ఆనందం, గౌరవం, ప్రేమ అన్నీ ఆమె ఆ స్త్రీతో పంచుకో కాని నీ విధేయత మాత్రం దేవదేవునికే చెందినదై ఉండాలి. న్యాయ ధర్మాల మీద నిలబడ్డ ఆత్మగౌరవాన్ని మించింది లేదు. ఆమె నిన్ను తన శిరోస్థానంగా భావించి నీతో కలిసి ఆనందాన్ని పొందడం మంచి విషయమే. స్పర్శలో ఉండే అనుభవం అంత గొప్పదైతే అదే స్పర్శను దేవదేవుడు, సమస్త జంతువులకూ ప్రసాదించాడు కదా! ఆ స్పర్శానుభవం మానవుని ఆత్మను దారి తొలగించరాదు. ఆమె పొందులో నీవు పొందే ప్రేమానుభవం సహజమైన ఆకర్షణ మాత్రమే! నిజమైన ప్రేమ ఆలోచనల్ని సానబడ్తుంది, హృదయాన్ని విశాలం చేసి, హేతువులో స్థానాన్ని సంపాదించి, ధర్మబద్ధమై, మానవుడిని దివ్యాత్మగా రూపొందిస్తుంది. శారీరక సుఖాలే శాశ్వతసత్యం కాదుకనకనే మానవులకు ఇతర జంతువులతో సహచర్యం సరిపడనిదయ్యింది"

దానికి ఆదాం ఇలా జవాబిచ్చాడు– "ఆమె బాహ్యస్వరూపం ఎంత మనోహరమైనదో, ఆమె ప్రతి కదలిక, కలయిక అంత మధురంగా, మార్మికంగా నన్ను ఆకట్టుకుంటాయి. ఆమె మాటల నుంచి, చేతల నుంచి ప్రవహించే వేలాది భావస్పర్శలు, ప్రేమతో మిళితమై మా ఇద్దరి మనసులు ఒక్కటి కాగా ఇద్దరం ఒకే

ఆత్మగా మారిపోతాం. ఆ మధురభావన చెవులకు వినబడే అన్ని సంగీతపు ధ్వనులకన్నా ఉత్కృష్టమైనది. నేను అనుభవం పొందినదీ, నాకు నచ్చినదీ, మీకు విన్నవించుకున్నాను. ప్రేమలో మునిగితేలుతున్న నన్ను నిందించరని నా విశ్వాసం. మీరే అన్నారు నిజమైన ప్రేమ స్వర్గానికి నిచ్చెన లాంటిదని. అదే మాకు మార్గదర్శకమూ, మార్గమూ కూడా! నేనడిగే ప్రశ్న ధర్మసమ్మతమైతే నన్ను అనుమతించండి– స్వర్గంలో దివ్యాత్మలు ప్రేమను ఎలా వెలిబుచ్చుతారు? చూపులతోనేనా! లేక స్పర్శతోనా? ఊహాలోకంలోనా? ప్రేమ స్థానం ఎలాంటిది?"

ఆ మాటలకు దేవదూత వదనం దివ్యగులాబీ వర్ణంలోకి మారగా నవ్వుతూ సమాధానమిచ్చినాడు– "మేము సంతోషంగా ఉన్నామన్న సంగతి నీకు తెలుసును. ప్రేమ లేనిచోట సంతోషం నిలవదు. మీరు దైహికంగా అనుభవించే ప్రేమను మేము సచ్చిదానంద స్థితిలో దేహ, స్థల, కాల, ప్రదేశ పరిమితులు లేని ఉన్నత స్థాయిలో అనుభవిస్తాము"

అదిగో సూర్యాస్తమయం కావస్తున్నది. సూర్యుడు ఆకుపచ్చని భూ అగ్రాన్ని దాటి పశ్చిమదిక్కున హెస్పెరియన్ (Hesperean) ప్రాంతాన నిష్క్రమిస్తున్నాడు. నేను వెళ్లాల్సిన సమయం వచ్చింది. ధైర్యంగా, సంతోషంగా ప్రేమతో జీవించు! ఆ దేవదేవుని ప్రేమించడమంటే విధేయుడిగా ఉండడం! ఆతని శాసనాన్ని పాటించడం! ఇది నీ ముఖ్య కర్తవ్యం. అప్రమత్తంగా ఉండకపోతే భావోద్రేకాలు నిన్ను దారిమళ్లించి భ్రష్టుణ్ణి చేస్తాయి. నీవు నీ సంతానం జాగ్రత్తగా ఉండి దేవదేవుని ఆజ్ఞలను పాటిస్తూ ఆనందంగా జీవించండి. మీ శ్రేయస్సు, దుఃఖం మీ స్వచ్ఛంద నిర్ణయాలపైననే ఆధారపడి ఉంటాయి. మీరు ఆనందంగా ఉండడమే నేను కోరుకునేది. మీకు శుభం కలుగుతుంది! మరొక్కసారి చెబుతున్నాను. పడడమో, నిలబడడమో అంతా మీ చేతుల్లోనే ఉన్నది. భగవానుని ఆజ్ఞను మీరనంతవరకూ మీకు ఎవరి సాయమూ అక్కరలేదు! జాగ్రత్తగా ఉండండి!"

అని చెబుతూ ఆ దేవదూత వెడలినాడు. ఆదాం ఆతనిని అనుసరించి వీడ్కోలు చెప్పినాడు. "ఓ దివ్యఅతిథీ! నీకు జయమగుగాక! దివ్యవాణిని మాకు వినిపించి కర్తవ్యబోధను చేసినావు. నా సందేహనివృత్తి చేసి నన్ను జ్ఞానవంతుణ్ణి గావించినావు. నీ అనుగ్రహం, దాక్షిణ్యం, నమ్రత నన్ను ముగ్ధుణ్ణి చేసింది. అది ఎల్లప్పటికీ నాలో ఓ అద్భుత జ్ఞాపకమై నిలిచిపోతుంది. మానవజాతి క్షేమం కోరి మరల మరల ఈ లోకాన్ని సందర్శిస్తారని కోరుకుంటున్నాను"

దేవదూత స్వర్గంవేపు వెళ్లిపోగా, ఆదాం తన పొదరింటికి దారితీసినాడు.

9. సాతాను బోధతో జ్ఞానఫలాన్ని రుచిచూసిన ఈవ్

సాతాను ఆ రాత్రి పొగమంచురూపంలో పారడైజ్ (Paradise) కు వచ్చి నిద్రిస్తున్న సర్పంలోకి ప్రవేశించాడు. ఉదయాన్నే లేచిన ఆదాం, ఈవ్‌లు వనంలోకి వెళ్లినపుడు – ఈవ్, తాము చేయవలసిన పనుల్ని వేర్వేరుగా చేద్దామని ఆదాంకు చెబుతుంది. ఆదాం అంగీకరించడు. ఒంటరిగా ఉన్నపుడు తమ శత్రువు అపకారం తలపెడితే జరిగే అనర్థాలను వివరిస్తాడు. ఈవ్ అది తన ఆత్మగౌరవానికి భంగంగా భావించి తన శక్తిని నిరూపించుకునే అవకాశమిమ్మని గట్టిగా అడగడంతో కాదనలేని ఆదాం ఎట్టకేలకు ఒప్పుకుంటాడు. ఒంటరిగా ఉన్న ఈవ్‌ను గమనించిన సర్పం, ముందు ఆమెను తదేకంగా చూస్తూ, తరువాత మాట్లాడుతూ, ఆమెను పొగుడుతూ, ఆకాశానికెత్తినంత పనిచేస్తుంది. సర్పం మానవభాషలో మాట్లాడాన్ని చూసి ఆశ్చర్యపడిన 'ఈవ్' (Eve) దానికి కారణం తెలుసుకోగోరుతుంది. ఈడెన్ వనంలోని ఒక చెట్టుపండును తినడం ద్వారా తనకాశక్తి వచ్చినట్లు, మాట్లాడడమే కాక వివేచనా శక్తి కూడా లభించినట్లు చెప్పడంతో ఆ చెట్టును చూపించమని 'ఈవ్' కోరుతుంది. ఆ చెట్టు నిషేధించబడిన జ్ఞానవృక్షమని (Tree of Knowledge) 'ఈవ్' గ్రహిస్తుంది. సర్పం ఇనుమడించిన ధైర్యంతో మాయమాటలు, వాద సంవాదాలు సలిపి జ్ఞానఫలాన్ని ఈవ్ రుచిచూడ్డంలో కృతకృత్యురాలవుతుంది. అత్యంత మధురంగా ఉన్న ఫలాన్ని ఆదాంకు రుచిచూపించాలా వద్దా అని తర్జనభర్జనలు పడిన 'ఈవ్' చివరకు ఒక నిశ్చయానికి వచ్చి ఆదాం వద్దకు ఫలాన్ని తెచ్చి తాను ఎందుకు దాన్ని రుచి చూడవలసి వచ్చిందో వివరిస్తుంది. మొదట ఆశ్చర్యపడిన ఆదాం, ఈవ్‌ను పోగొట్టుకోవలసి వస్తుందని భావించినవాడై ఆమె తోడే తన జీవితంగా భావించి, నశిస్తే ఆమెతోపాటే నశింపదలచి, దేవదేవుని ఆజ్ఞను మీరుతూ, జ్ఞానఫలాన్ని రుచిచూస్తాడు. జ్ఞానఫలాన్ని తిన్నందువలన వారిలో వచ్చిన మార్పులు, నగ్నదేహాలను కప్పుకోడానికి వారు చేసిన ప్రయత్నాలు, ఇద్దరిలో ఘర్షణ మొదలై ఒకరినొకరు నిందించుకోవడం ఈ భాగంలోని ప్రధానాంశాలు.

అతిథిగా వచ్చిన దేవదూత మానవునితో స్నేహితునిలా, శ్రేయోభిలాషిలా సంభాషించి మానవ సృష్టిమూలాల్ని తెలిపిన ఘట్టం ముగిసింది. నేనిప్పుడు మానవుడు అవిధేయుడై, దైవాజ్ఞను ధిక్కరించి, అవిశ్వాసుడైన విషాద కథావృత్తాంతాన్ని తెలియ బరుస్తున్నాను. స్వర్గమిప్పుడు మానవునికి దూరమై, కొత్తలోకాన్ని తిరస్కరిస్తూ ఆగ్రహంతో తీర్పును ప్రకటిస్తున్నది. తద్వారా భూలోకంలోకి కష్టాలు, పాపం, పాపపు

నీడ – మృత్యువు నడయాడే దీనాతిదీనమైన లోకం ఆవిర్భవించింది. విషాదమే కావచ్చు కాని సాహసవంతమైన ఈ గాథ తన శత్రువును వెంబడిస్తూ మూడుసార్లు ట్రాయ్ (Troy) గోడల బయట పరుగెత్తిన ఎఖిల్లిస్ ఆగ్రహజ్వాలలా (Achilles), లవినియా (Lavinia)తో తిరస్కరించబడిన టర్నస్ (Turnus) కోపంలా, గ్రీకు ప్రజల్ని కలవరపరచిన నెప్ట్యూన్ (Neptune) లేదా జునో (Juno) దేవతల ఆగ్రహంలా, లేక సైథిరియా కుమారుడి (Cytherea's son) కోపంలా, వీరోచితంగా ఉండే ఈ కథా కథనాన్ని సకల కళాధిదేవతలైన 'మ్యూజ్'లు (Muses) నన్నాశీర్వదిస్తూ, రాత్రి స్వప్నాలలో నాకు విశదపరుస్తుండగా, ధారాళంగా సాగే ఈ కవితావాహిని ఎన్నాళ్లనుంచో నాలో నిక్షిప్తమైన కోరికగా ఉండి ఈ శిశిరకాలంలో నా నుంచి ప్రవహిస్తున్నది.

ప్రాక్కథల్లో రాజులు, రాజకుమారులు, వాళ్లు చేసిన అవాస్తవిక యుద్ధాల వర్ణన తప్ప, స్వధర్మరక్షణలో ప్రాణత్యాగం చేసిన వారి సహజశీలత, కార్యదీక్ష, పోరాట పటిమల గురించి వివరణ ఉండదు. పరుగు పందాలు, ఆటలపోటీలు, తిరగబడిన వస్తుసామాగ్రి, ఆడంబరపు కవచాలు, డాలులు, అశ్వ అలంకరణ సామాగ్రి, చెమ్మీదుస్తులు, పెద్దపెద్ద యోధుల ద్వంద్వ యుద్ధాలు, వీధుల్లాంటి వాకిళ్లలో విందులు వినోదాలు, వడ్డించేవాళ్లు, ప్రతీహారులు, వీటిని వర్ణిస్తే పేరు ఖ్యాతి రాదని కాదు. నాకంత నైపుణ్యం లేదు. అంత జ్ఞానమూ లేదు. సహజసిద్ధమైన బాణీలో వచ్చే ఈ కావ్యగీతపు కథావస్తువు ఉన్నతమైనది కాబట్టి అది తన ఉనికిని తానే ప్రకటించుకోగలదు. ఒకవేళ కాలం చెల్లినా, శీతలదృక్కులు ప్రసరించినా, సంవత్సరాలు గడిచినా స్తబ్ధత అలానే ఉన్నా, ఆ తప్పు నాకు సంబంధించినదే కాని నా వీనులకనుగ్రహించిన మ్యూజ్ (Muse) యురేనియా (Urania) దేవతది కాబోదు.

సూర్యుడు అస్తమించాడు. ఆతని వెనుకనే పశ్చిమతార (Star of Hesperus) పగలూ రేయిల మధ్య అవనికయైన సంధ్యాసమయాన్ని భూమిపైకి తీసుకువచ్చి రాత్రి అర్ధగోళాన్ని ఈ చివరి నుండి ఆ చివరి వరకు కప్పివేసింది.

గాబ్రియేల్ హెచ్చరికలతో ఈడెన్ వనం నుంచి నిష్క్రమించిన సాతాను మరల ఉత్సాహాన్ని పుంజుకుని, మానవుని వినాశనానికి కంకణం కట్టుకున్నవాడై, తన మాయోపాయాలకు మరింత పదునుపెట్టి, ఎలా జరిగితే అలా జరగనీ అనే మొండితనంతో, భయం లేనివాడై, రాత్రి ప్రారంభంలో పారిపోయినవాడు అర్ధరాత్రి తిరిగి వచ్చాడు. సూర్యకక్ష్య అధికారి యురియేల్ (Uriel) హెచ్చరికతో రాత్రిపహారా కాసే దేవదూతలు కడు జాగ్రత్తగా ఉండడం చేత ఏడురాత్రుళ్లు వరుసగా చీకటితో కలిసి మూడుసార్లు భూమధ్యరేఖపై, నాలుగుసార్లు ధ్రువం నుంచి ధ్రువం వరకు

సాగే రేఖాంశంపై ఉన్మండలాన్ని (Colure) దాటే ప్రయత్నం చేసినాడు. ఎనిమిదవ నాడు ఏదోవిధంగా లోపలికి చొరబడాలనుకున్నపుడు అనుకోని విధంగా ఆతనికి ఓ అవకాశం చిక్కింది. పారడైజ్ (Paradise) పాదం వద్ద టైగ్రిస్ (Tigris) నది భూగర్భంలోకి చొచ్చుకుపోయి మరల జీవవృక్షం వద్ద నీటిబుగ్గగా (Fountain) ఉబుకుతుంది. సాతాను నదితోపాటు భూగర్భంలోకి దూకి నీటిబుగ్గలో పొగమంచుగా జీవవృక్షం వద్ద ప్రత్యక్షమై, కనబడకుండా ఉండేందుకు అనువైన ప్రదేశం కొరకు ఈడెన్ (Eden) నుంచి పొంటస్ (Pontus) మీదుగా, మయొటిస్ (Maeotes) సరస్సు మీదుగా, ఓబ్ (Ob) నదిని దాటి అంటార్కిటిక్ వరకు, పశ్చిమాన ఒరొంటెస్ (Orontes) నుంచి డరియన్ (Darien) తీరాన్ని దాటి గంగాసింధు నదులు ప్రవహించే మైదానాల వరకు పయనించి, కనిపించిన ప్రతి జంతువునూ తన మాయోపాయానికి పనికి వస్తుందోలేదోనని పరీక్షిస్తూ చివరకు, సర్పాన్ని (Serpent) అనేక తర్జన భర్జనల అనంతరం తన ఆలోచనలకు సరిపడే వాహకంగా నిర్ధారించుకున్నాడు. పిశాచప్రకృతి కలిగి పాకే జంతువైన సర్పాన్ని, ఆవహించే ముందు అతనిలో భావావేశం తీవ్రమై పెల్లుబికింది.

"ఓ భూలోకమా! Earth! స్వర్గలోకంలా దేవతలకు స్థానమై విలసిల్లే ఆలోచన ఉన్నదా! ఏ దేవుడు నిన్నిలా సృజించాడో తెలుసా! భూలోక స్వర్గమా! నీ చుట్టూరా ఇతర గ్రహాలు నృత్యం చేస్తూండగా వాటి కాంతిదీపాలతో నీవు ప్రకాశిస్తావు. వెలుగు దివ్వెలపై వెలుగు దివ్వెలు వరుసలుగా పేర్చబడి తమ కిరణాల్ని ప్రసరిస్తూ తమ పవిత్ర ప్రభావాన్ని నీపై చూపిస్తున్నవి. స్వర్గంలోని దేవుడిలా నీవు మధ్యన ఉండి అన్ని గ్రహకక్ష్యల నుంచి శక్తిని స్వీకరిస్తూ వాటిలో లేని సంపదలను, తరు గుల్మ లతాదులను, పశుపక్ష్య మీనరాశిని, కలిగి ఉన్నావు. వీటన్నిటికన్నా ఎదుగుదల, ఇంద్రియజ్ఞానం, విచక్షణలతో ఉన్నతుడైన మానవుడు నీ నేలపై నడయాడుతున్నాడు. ఈ కొండలు లోయలు, నదీనదాలు, అడవులు మైదానాలు, అక్కడ భూమి, ఇదిగో ఇక్కడ సముద్రం, అవిగో తీరాల పక్కనే కిరీటంలా అరణ్యాలు, రాళ్లు, రప్పలు, గుహలు – కాని వీటిలో నాకు సరైన ఆశ్రయం లభించడం లేదు. ఈ అందమైన ప్రదేశాలూ, భోగభాగ్యాలూ చూసినకొద్దీ నాలో ఘర్షణ పెరిగి నరకయాతన అనుభవిస్తున్నాను. అసూయాద్వేషా లధికమై మంచి అంతా చెడుగా, స్వర్గం నరకంగా కనిపిస్తున్నది. ఈ వైరుధ్యాలు నన్ను ఇక్కడా, స్వర్గంలో కూడా హాయిగా ఉండనీయవు. నేను సుఖపడాలనే దానికన్నా నేనున్న దుర్భరస్థితిలోకి ఇంకొకర్ని లాగడంలో నాకు సంతృప్తి కనిపిస్తున్నది. విధ్వంసం వేపే ఆలోచనలు నన్ను పురికొల్పుతూ నా శత్రువుపైన విజయాన్నో లేక ఆతనికి అమితమైన నష్టాన్నో కలిగించేందుకు నడిపిస్తున్నవి.

ఎవరికోసమైతే ఈ లోకం సృష్టింపబడినదో, ఎవరి సౌభాగ్యం, దుఃఖాలతో స్వర్గాధినేత ప్రతిష్ఠ ముడివడి ఉన్నదో ఆ మానవజాతిని నశింపచేసో, కష్టాలపాలు చేసో నా ప్రతీకారం తీర్చుకుంటాను. ఆ మహాశక్తిమంతుడు ఆరురాత్రిళ్లు పవళ్లు కష్టపడి చేసిన సృష్టిని నేను ఒక్కరోజులో ధ్వంసం చేసి నరకలోకపు శక్తులలో అత్యున్నతుడుగా ఖ్యాతి పొందుతాను. అతడు ఎంతకాలం నుంచో రచిస్తున్న ప్రణాళికను నేను ఒక్క రాత్రిలో ఛిద్రం చేసి, సగం మంది దేవదూతలను నావేపు తిప్పుకుని, తిరుగుబాటు బావుటా ఎగరవేసి, స్వర్గాన్ని దాదాపు ఖాళీ చేయించగా, ఆ శూన్యాన్ని నింపడానికి దేవదూతలను సృష్టించకుండా మాపైని ద్వేషంతో మరో జాతిని ఈ మట్టితో సృష్టించి, వారితో స్వర్గాన్ని నింపాలను కుంటున్నాడు. మా స్వర్గపు సంపదల్ని ఆతనికి కట్టబెట్టాలని నిశ్చయించి అంతవరకు మానవజాతికి భూతలస్వర్గాన్ని, ఈ అందాల వనాన్ని నివాసస్థానంగా ఏర్పరిచినాడు. మానవుడే ఈ లోకానికి అధిపతియట! ఎంత అవమానం! వాళ్లకు దేవదూతలు కాపలా! వాళ్ల కంటిలో పడకుండా నేను పొగమంచు రూపంలో ప్రతి పొదనూ, డొంకనూ వెదకుతూ నా పథకానికి అనువైన సర్పాన్ని గమనించి నిద్రపోతున్న ఆ పాము చుట్టలలో చేరి నా పన్నాగాన్ని విజయవంతం చేస్తాను.

ఎంత ఘోరపతనం! దేవతలలో అత్యున్నత స్థానాన్ని అధిరోహించిన ల్యూసిఫర్, ఈరోజున ఒక నీచ సర్పంలో ఒదిగి ఉండవలసి రావడం, అది కార్చే చొంగలో, బంక జిగుర్లలో – ఛ! ఛ! నేను కోరుకున్నదేమిటి? జరుగుతున్నదేమిటి? పశుప్రాయుడిగా అవతారమెత్తుతున్నానా! ప్రగాఢ కోరిక, ప్రతీకారాలు ఇలా పతనం చెందిస్తాయా? అత్యున్నత స్థానాన్ని ఆశిస్తే అధఃపాతాళానికి జారిపోవడం తథ్యమా! ప్రతీకారం మొదట తియ్యగా ఉన్నా తరువాత చేదై, మొదటికే మోసం వస్తుందా!

సరే! ఏమైతే కానీ, నేను లెక్క చెయ్యను! అత్యున్నతుడైన నా శత్రువునేమీ చేయలేకపోయి ఉండవచ్చు! నాకు అసూయ కలిగిస్తున్న ఈ మానవుడిపై, ఆ స్వర్గాధిపతి ప్రేమను చూరగొన్న ఈ మట్టిమనిషిపై, మాపై ద్వేషం వల్ల సృష్టించబడిన ఇతగాడిపై పగతీర్చుకుని పగకు పగతో సమాధానం చెబుతాను"

అలా అనుకుంటూ సాతాను డొంకలు, పొదలు వెదకుతూ, నల్లటి పొగమంచులా పాకుతూ అర్ధరాత్రి సమయానికి, గడ్డిపొదల మధ్య చుట్టలు చుట్టలుగా చుట్టుకుని మధ్యలో తలనాన్చుకుని ఏమాత్రం భయం లేకుండా నిద్రపోతున్న సర్పాన్ని (Serpent) గమనించినాడు. పొగమంచు రూపంలోనే ఆ సర్పగహ్వరంలోకి చేరిన సాతాను ఆ జంతువుకు క్రూరత్వంతో కూడుకున్న తెలివితేటలు, మాయోపాయాల్ని స్థిరపరచి రేపటి ఉదయంకోసం ఎదురుచూడసాగినాడు.

పవిత్రమైన ఉదయకాంతి తూర్పువాకిటకు రాగా, పుష్పాల నుంచి వెలువడుతున్న సుగంధ పరిమళం, విశాలమైన భూమిపూజాపీఠం నుంచి స్వర్గాని కెగబాకి దేవదేవుని నాసికా పుటాలకు సోకగా ఆతడు ఆ కృతజ్ఞతాపూరిత వాయువులను ఆఘ్రాణిస్తున్న ప్రాతఃకాల సమయంలో మానవజంట తమ స్తోత్రాలను గానం చేసి, ప్రభువును కీర్తించి తమ దైనందిన కార్యక్రమాలలో పాల్గొనసాగినారు. తోటలోని పని రోజురోజుకూ అధికం కావడాన్ని గమనించిన ఈవ్ (Eve), ఆదాంతో (Adam) పలికింది–

"ఆదాం! మనం ఎంతగానో ఇష్టపడి ఈ తోటను క్రమపద్ధతిలో పెంచుతున్నా రోజురోజుకూ పనిభారం పెరుగుతున్నది. మనకు మరికొన్ని చేతుల సాయం దొరికే వరకు మనం ఒకేచోట పనిచేయడంకన్నా పనుల్ని విభజించుకుని నీ అవసరం ఉన్నచోట నీవు, నాకు ఎక్కడ సులభమో అక్కడ నేను విడివిడిగా పనిచేద్దాం. ఈ పొదరింటి చుట్టూ ఈ అడవి తీగెనెలా పాకించాలీ, ఈ ఐవీ (Ivy) గుల్మాన్ని ఎలా పైకెక్కించాలీ ఇలాంటివి నీవు చూడు, గులాబీ గుబుర్ల మధ్య మిర్టిల్ (Myrtle) పూలమొక్క నెక్కడుంచాలి ఇటువంటివి నేను చూస్తాను. ఇలా పని విభజన వల్ల మనం ఎక్కువ పని చేయవచ్చు. అడ్డదిడ్డంగా పెరుగుతున్న మొక్కల్ని అదుపులో ఉంచవచ్చు. ఎప్పుడూ ఒకేచోట ఉండి పనిచేసేకన్నా, ఇద్దరం విడివిడిగా వచ్చిన పని చేస్తూ మధ్యమధ్యలో కలిసి సంభాషించుకుంటూ చిరునవ్వులు విసురుకుంటూ ఆడుతూపాడుతూ పనిచేస్తుంటే మనకు తెలవకుండానే సాయంకాలం వచ్చేస్తుంది"

"సహచరీ! ఈవ్! నా ఆత్మవు నీవు! అన్ని జీవులకన్నా నాకు అత్యంత ప్రియమైనదానివి! మనకు దేవదేవుడు అప్పగించిన బాధ్యతలను ఎంత హుందాగా పూర్తిచేస్తామో దానిని చూసే ఆతడు మనల్ని అనుగ్రహిస్తాడు. తన ఇంటి బాధ్యతలను నెరవేరుస్తూ, తన సహచరునికి తోడ్పడే స్త్రీ కన్నా అందమైనదేమున్నది? అయినా దేవదేవుడు మనకీపనులను నిర్బంధంగా చేసే విధుల్లా నిర్ణయించలేదు. మనకిష్టం వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవచ్చును. ఆహారమో, సంభాషణలో, చిరునవ్వులో, విరిచూపులో మన ఇష్టం. చిరునవ్వులు విచక్షణలో ఉదయిస్తాయి. అవి జంతువుల కివ్వబడని వరాలు. మానవజీవితంలో ప్రేమ, శృంగారాలు అట్టడుగున లేవు.

ఈ పనుల్ని నిర్బంధంగా కాక ఇష్టంతో చేయడానికి దేవదేవుడు మనకప్ప గించినాడు. ఆనందాన్ని విచక్షణతో సంయోగించి ఆతడు మనల్ని సృష్టించాడు. ఈ గుబుర్లను, పొదరిళ్లను, మనిద్దరం కలిసి పనిచేస్తూ, దార్లకడ్డం రాకుండా నియంత్రిద్దాం. మనకు త్వరలో అందివచ్చే బుల్లిచేతులు మనకు సాయం చేసినపుడు మురిసిపోదాం. కొద్దిసేపు ఏకాంతం నాకభ్యంతరం లేదు. విరహమెప్పుడూ తీపి కలయికను తెస్తుంది.

అయితే నాకున్న అనుమానం అంతా ఏదో దుష్టశక్తి నిన్ను నానుంచి విడదీసి అపకారం చేస్తుందేమోననే! మనకు దేవదూతలిచ్చిన హెచ్చరికలు కూడా అవేకదా! మన శత్రువు మనమిలా ఆనందంగా ఉండడాన్ని సహించలేక అసూయతో ద్వేషంతో మనల్ని దొంగదెబ్బ తీయవచ్చును. ఎక్కడో దగ్గర్లోనే ఏదోరూపంలో ఉండి మనల్ని గమనిస్తూ తగిన సమయం కోసం ఎదురుచూస్తూ ఉండవచ్చు. మనం ఒంటరిగా ఉన్నపుడు ఏదో సాయం చేస్తున్నట్లు నటించి మన సానుభూతిని పొంది, మనల్ని మాయోపాయంతో ఆ దేవదేవుని భక్తి నుంచి దారిమళ్లించి మనల్ని అవిధేయులుగా మార్చవచ్చు. లేదా మన శృంగార జీవితానికి చేటు తెచ్చి మనకపకారం చేయవచ్చును. అందుచేత నా ప్రియమైన సఖీ! ఎక్కడైతే అపాయం, అపనింద పొంచివుంటాయో ఆ చోటులలో పతి పక్కనే ఉండడం సతికి మేలు"

దానికి అందాలరాణి ఈవ్ (Eve) స్థిరనిశ్చయంతో ఇలా పలికింది– "స్వర్గ భూలోకాల పుత్రుడా! భూలోకాధినేతా! ఒకవేళ అటువంటి శత్రువే మన నాశనాన్ని కోరి ఈ వనంలో ఉండి నన్ను ఆకర్షించడానికి ప్రయత్నం చేస్తే లొంగిపోయేంత బలహీనురాలినా నేను! మన మిత్రులైన దేవదూతలు ఆ శత్రువు గురించి మాట్లాడినదంతా విన్నాను. అర్థం చేసుకున్నాను. అయినా చెబుతున్నాను... ఆ శత్రువు మోసపూరిత వచనాలను నేను వినబోను. ఆతడు హింసకు దిగితే అమరులమైన మనం వాడికి అంతకంత బుద్ధిచెప్పగలం. వాడు కపటోపాయాలకు దిగినా నీమీద నాకున్న ప్రేమను, విశ్వాసాన్ని కించిత్ కదిలించలేడు. నీ నెచ్చెలిపై, ఆదాం! నీకంత నమ్మకం లేదా!"

నమ్రత గల మాటలతో ఆదాం పలికాడు– "దేవునికి, మానవునికి ఇష్టమైన పుత్రికా! అమరురాలవైన ఈవ్! నిన్ను నిలవరించడం ఎటువంటి దురుద్దేశంతోనో, అనుమానంతోనో కాదు. నానుండి విడిగా నీవున్నపుడు శత్రువు నీకు చేయగల అపకారం గురించి నా చింత. విశ్వాసులు కూడ ఆకర్షణకు లొంగుతారన్న నమ్మకంతోనే శత్రువు తన కుట్రలను నిశ్శబ్దంగా ప్రారంభిస్తాడు. ఆగ్రహం, ఉపేక్ష మంచిసలహాను పెడచెవిన పెడ్తాయి. మనిద్దరి మధ్య విభేదం, వాగ్వాదం కూడదు. ఎంత ధైర్యస్థుడైనా శత్రువు నామీద మొదటిదెబ్బ తీయడానికి జంకుతాడు. దేవదూతలనే తన వాక్చతురతతో దారి మళ్లించగలిగిన మన విరోధి ఆకర్షణా శక్తి ఎంతటిదో మనకు తెలియదు. నీవు నా పక్కన ఉన్నప్పుడు నేను మరింత శక్తివంతుడిగా, చతురుడిగా, రెండింతలు ధైర్యంతో ఏ అపాయాన్నైనా ఎదుర్కొనేందుకు జాగరూకతతో ఉండగలను. నీ శక్తిని పరీక్షించ దలుచుకున్నట్లయితే, ఆ పరీక్ష, నేనున్నప్పుడే ఎందుకు చేయకూడదు? నేనే మంచి సాక్షిని కదా!"

అలా ఆదాం తన ప్రేమతో కూడిన మాటలతో అనునయించగా, 'ఈవ్' మధురస్వరంతో బదులు పలికింది.

"శత్రువుచేత ముట్టడించబడిన ఇరుకువీధిలో నడవడమే మన పరిస్థితి అయినప్పుడు, అతడు మోసపూరితంగానో, దౌర్జన్యంగానో దాడి చేస్తాడేమోనన్న భయంతో ఎన్నాళ్లు మనం హాయిగా ఉండగలుగుతాం! పాపానికి ముందే అపాయము రాదనుకుంటాను. దురుద్దేశంతో శత్రువు మన నిజాయితీని, నిష్కాపట్యాన్ని దెబ్బతీయాలని చూసినప్పుడు మనం ఆతనిని పట్టించుకోకపోతే చాలుగదా, ఆతని కుట్ర ఆతనినే మింగివేస్తుంది. మనల్ని తనవేపు మళ్లించుకోలేక అతని పథకం బెడిసి కొడ్తుంది. ఈ సంఘటనకు సాక్షి అయిన దివ్యలోకం కూడ మనల్ని గౌరవిస్తుంది. అంతేకాదు సద్గుణం, ప్రేమ, విశ్వాసం ఒంటరిగా బేరీజు వేయనప్పుడు వాటికి విలువేమున్నది? మన ఆనందలోకాన్ని ఇంత అరక్షితంగా దేవదేవుడు సృష్టించాడని నేననుకోవడం లేదు. అటువంటప్పుడు ఈ వనం 'ఈడెన్'గా పిలువబడదు"

దానికి ఆదాం తీవ్రంగా స్పందించాడు– "సహచరీ! దేవదేవుడు సృష్టించిన వేవీ అసంపూర్తిగా ఉండవు. మానవుడు కూడా అంతే! మానవుడికి ప్రమాదం బయట శక్తుల వలన కాదు. అతని ఇష్టానికి వ్యతిరేకంగా ఏ అపాయం సంభవించదు. కాని దేవదేవుడు మానవుడి ఇచ్ఛాశక్తికి స్వేచ్ఛనిచ్చాడు. విచక్షణతో కూడిన నిర్ణయాలు తీసుకునేప్పుడు కూడా పైకి మంచిగా కనిపించే మోసపు పనులను దేవదేవుడు నిషేధించినాడు. అపనమ్మకంతో కాదు, ప్రేమతో నిన్ను నేను నిలువరించదలుచుకున్నది. నీవే నేను నేనే నీవు అయినప్పుడు ఈ విడిపొడి మాటలు అనవసరం కాదా! మన శత్రువు ఏ రూపంతో, ఏ మాయతో మనల్ని వెంటాడుతాడో తెలియదు. ఆతడు నా నుంచి నిన్ను విడదీయకుండా ఉంటే చాలు! పరీక్ష అనేది చెప్పకుండా వస్తుంది. ముందు దేవదేవునికి నీ విధేయతను నిరూపించుకో. మనకిచ్చిన హెచ్చరికలకన్నా పరీక్ష చేయబడడం అవసరమని నీవు భావిస్తే వెళ్లు! నీవు నా పక్కన లేకపోవడం నాకు లోటుగానే ఉంటుంది. అమాయకత్వంతో కూడిన సద్గుణాలు నీ సొత్తు. దేవదేవుడు తన పని తాను పూర్తిచేసాడు. నీ ధర్మం నీవు నెరవేర్చు! ఎట్టి పరిస్థితుల్లోనూ ఆతని ఆజ్ఞను జవదాటరాదు"

ఆవిధంగా మానవజాతిపిత ఆదాం (Adam) చెప్పిన సలహాను విన్న 'ఈవ్' నెమ్మదిగా ఇలా పలికింది.

"నీ అనుమతితోనే నేను వెళ్తున్నాను. నీవు ఇచ్చిన హెచ్చరికను మనసులో ఉంచుకుని అనుక్షణం జాగ్రత్తగా ఉంటాను. మన శత్రువు బహుశా మనం ఊహించని

క్షణంలో మనల్ని దెబ్బతీయడానికి ప్రయత్నించవచ్చు. ముఖ్యంగా బలహీనురాలనైన నాపై తన కపట విద్యలను ప్రదర్శించి అపజయం పాలైతే అంతకుమించిన అవమానమే ముంటుంది అతనికి?"

తన సహచరుడి చేతిలోనుంచి తనచేతిని మృదువుగా విడిపించుకుని ఆమె వనకన్య ఒరియడ్ (Oread) లేదా డ్రయడ్ (Dryad)లా, డెలియా (Delia) (ఆర్టెమిస్‌కు మరోపేరు) దేవతలా విల్లు బాణాలకు బదులు తోటపనిముట్లను చేతబూని వనంలోకి నడచింది. వెర్టుమ్నస్ (Vertumnus) నుంచి పారిపోయిన ఫలదేవత 'పొమొనా (Pomona)లా, జోవ్ (Jove)ను వీడిపోతున్న 'ప్రొసర్పినా' (Proserpina)లా 'ఈవ్' తోటలోకి వెళ్లినా ఇద్దరూ మధ్యమధ్యలో కలుసుకుంటూ విడిపోతూ కులాసాగా తోటపనుల్లో నిమగ్నమయ్యేసరికి మధ్యాహ్న సమయమయ్యింది.

ఓ అమాయకురాలైన ఈవ్! ఎటువంటి దురదృష్టకరమైన కపట వ్యూహంలోకి అడుగుపెడ్తున్నావు! మరలా తోటలోకి వెళ్తున్నావా! ఏం జరగబోతోందో కనీసం ఊహించనైనా ఊహించావా! అందాల పూలచాటున, చల్లని నీడ సమీపాన నీరాక కోసమై ఎదురుచూస్తూ, నీ ముగ్ధ అమాయకత్వాన్ని, విశ్వాసాన్ని, ఆనందాన్ని కూలదోసి నిన్ను శాశ్వతంగా పాపకూపంలోకి నెట్టబోతున్న దుష్టాత్మ నీ పక్కనే పొంచిఉన్న సంగతి నీకు తెలుసునా!

ప్రాతఃకాలం రాగానే ప్రస్తుతం సర్పరూపంలో ఉన్న సాతాను తన అన్వేషణ ప్రారంభించాడు. మానవజాతిని తన కడుపులో దాచుకున్న మానవస్త్రీ ఒంటరిగా దొరుకుతుందేమోనన్న ఆశతో, ఎరకోసం తోటలోని దార్లన్నీ వెదుకుతూ, సెలయేటి ఒడ్డున, ఫలవృక్షాల పక్కన, నీటిబుగ్గ దగ్గర అన్వేషిస్తున్న అతనికి సుగంధ పరిమళాల మబ్బుల మధ్య, గులాబి పొదల మధ్య తిరుగాడుతూ 'ఈవ్' ఒంటరిగా కనిపించింది. ఎరుపు, ఊదా, నీలి రంగు పుష్పాల కాండాలకు ఆధారంగా కర్రలను నిలిపి తీగలతో కట్లుకడ్తున్న ఆమెకు – తాను ఇప్పుడు ఏ ఆధారంలేని అందమైన ఒంటరి పుష్పం – అని తెలియదుకదా!

ఒంటరిగా ఉన్న 'ఈవ్'ను చూసి నెమ్మదిగా మెలికలు తిరుగుతూ దేవదారు, పైన్, పామ్ వృక్షాల మధ్యగా ఆమె ఉన్న చోటుకు వచ్చి కాసేపు కనిపిస్తూ, కాసేపు పొదలమాటున అదృశ్యమవుతూ ఆమెనే గమనించసాగాడు. ఎడొనిస్ (Adonis) నడయాడిన వనంలా, లియార్టెస్ (Laertes) కుమారుడు ఆల్సినోస్ తన ఈజిప్షియన్ భార్యతో వినోదించిన తోటలా ఉన్న ఈడెన్ వనాన్ని సాతాను (Satan) మెచ్చుకున్నాడు. ఆతనికి ఆ వనం కన్నా ఎక్కువగా నచ్చినది వనకన్యలా ఉన్న 'ఈవ్'! చిరకాలం

కిక్కిరిసి, దుర్గంధపూరితమైన నగరాల్లో నివసించిన వ్యక్తి, గ్రామీణ వాతావరణంలోకి వచ్చి ఆ స్వచ్ఛమైన గాలిని ప్రశాంతతను అనుభవిస్తున్నట్లు సాతాను ఆనందపరవశుడయ్యాడు. అందాల వనకన్యలా 'ఈవ్' ఒంటరిగా విహరిస్తున్న దేవకన్యలా, అమాయకం మూర్తీభవించి, స్నిగ్ధదరహాసాలను వెదజల్లుతూ సంపూర్ణ స్త్రీత్వంతో తొణికిసలాడ్తున్న ఆమెను చూసి సాతాను సంభ్రమం చెందినాడు. కొద్దిక్షణాలు అతనిలోని దుర్మార్గం, క్రౌర్యం, కపటత్వం, ద్వేషం, ఆగ్రహం, పగ, కసి, ప్రతీకారం అన్నీ నెమ్మదించినా వెంటనే తేరుకున్నాడు. ఆతనిలో నిరంతరం ప్రజ్వరిల్లే నరకాగ్ని ఆతనిలోని ఆనందాన్ని మటుమాయం చేసింది. తనకోసం సృష్టింపబడని అందాలు ఆతనిలో అసూయాద్వేషాలను రగల్చగా ఆతడు తన పూర్వస్థితిలోకి వచ్చినాడు.

"నేనెందుకు ఇక్కడకు వచ్చానో, ఏ ద్వేషమైతే నన్నిక్కడికి రప్పించిందో దాన్ని మరచిపోయేలా ప్రేమపూరితమైన ఈ వనంలో నన్ను అనేక ఆలోచనలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రేమ నన్నిక్కడకు తీసుకుని రాలేదు. నరక లోకానికి ప్రత్యామ్నాయమైన స్వర్గంగా భావించి నేనిక్కడకు రాలేదు. ఇక్కడి ఆనందాలను అనుభవించడానికి నేను రాలేదు. నేను వచ్చింది ఇక్కడి ఆనందాన్ని ధ్వంసం చేయడానికి. విధ్వంసంలో తప్ప ఇంక దేనిలోనూ నాకు ఆనందం కలగదు. ఇప్పుడు నా ముందు చిరునవ్వులతో ప్రత్యక్షమైన ఈ అవకాశాన్ని చేజార్చుకోను. ఈ మానవి, ఈ స్త్రీ నా పన్నాగాలకు అనువైనది. ఆమె భర్త తెలివిగలవాడు, విచక్షణ, ధైర్యం, బలం ఉన్న ధీరోదాత్తుడైన భూమిపుత్రుడు. గాయాలకు లోనుకానివాడు. నేనేమో నరకకూపపు బాధలతో, మునుపటి గాయాలతో వెనకటి దేవదూతలా అంత శక్తివంతుణ్ణికాను. ఈమె దేవకన్యలా సుందర వర్చస్సుతో ఉండి, ద్వేషంతో దరిచేరరానిదై ఉన్నది. కనుక ప్రేమ ముసుగులో, ఆమెను వంచించడమే తక్షణోపాయం!"

అలా అనుకుంటూ సర్పరూపంలో ఉన్న సాతాను– అలల్లా కదుల్తూ మెలికలు తిరుగుతూ మెరుస్తున్న శరీరంతో, శిఖతో ఉన్న శిరస్సును పైకెత్తి, కెంపుల్లా ఎర్రగా మెరుస్తున్న కనులతో, బంగారపు రంగు పొలుసులు మెడపై కాంతులీనుతుండగా, చుట్టలు చుట్టలుగా కదుల్తున్న శరీరాన్ని మనోహరంగా ఆకుపచ్చని పచ్చికపై నర్తింప జేస్తూ, గాలిపై తేలియాడ్తున్న భ్రమను కలిగించి, మరల మరల చూడాలనిపించేంత అందంగా ప్రకాశించసాగినాడు. ఎంత అందమైన సర్పరూపమంటే ఇల్లిరియా (Illyria)లో హెర్మియోనె (Hermione), కాడ్మస్ (Cadmus)ల రూపం కన్నా; ఎపిడారస్ (Epidorus)లోని అమ్మోనియన్ జోవ్ (Ammonian Jove) రూపంలా, కాపిటలైన్ (Capitaline)లో ఒలింపియస్ (Olympias)తో కలిసి స్కిపియో

(Scipio)కు జన్మనిచ్చిన సర్పంకన్నా అందంగా ఉన్నాడు సాతాను ఆ సర్పరూపంలో. నదీ ముఖద్వారంలోకి నౌక ప్రవేశిస్తున్నపుడు నేర్పరుడైన సరంగు గాలివాటుకు పడవను నడిపినట్లు ఆ సర్పరూపుడు తలను అటూయిటూ కదిలిస్తూ, నిక్కినిక్కి చూస్తూ, మెలికలు తిరుగుతూ 'ఈవ్' దృష్టిని ఆకర్షించడానికి తంటాలు పడినాడు. ఆకుల గలగలలు విన్నప్పటికీ 'ఈవ్' తన పనిలో తాను నిమగ్నమై మొదట అంతగా పట్టించుకోలేదు. కాని ఆతడు సర్పరూపంలో ఆమె ఎటువెళితే అటువెళ్తూ, అక్కడ ఉన్న అన్ని జంతువులకన్నా విధేయంగా, ఆమె పిలిస్తే చాలు చెప్పిన పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రవర్తిస్తూ, ఆమె పదముద్రలను ముద్దాడుతూ, 'సిర్సె' (Circe) మంత్రగత్తె పిలుపుకు పరుగెత్తుకుని వచ్చే జంతువుల మందలా ఆతడు కాసేపు ఆమె దృష్టినాకర్షించి, ఇనుమడించిన ధైర్యంతో ఆమె ముందుకు వచ్చాడు. అందంగా మెరుస్తున్న కళ్లతో ఆమెను మెచ్చుకుంటున్నట్లు చూస్తూ, తలవంచి నమస్కరిస్తూ, పడగ విప్పుతూ, ఆమె నడచిన నేలను చుంబిస్తూ, ఎటువంటి భావమూ మోముపై కానరాకుండా మొత్తానికి ఆమె దృష్టి తనపై పడేట్లు చేసుకోగలిగాడు.

ఆమె చూపులు తనచూపులతో కలిసాయి. అంతే, సాతాను పాము నాలుక గాలిలో కదలసాగింది. దుష్టాత్మ తన మోసపూరితమైన ఆకర్షణతో కోరికలను ప్రేరేపించ బోతున్నది.

"ఆశ్చర్యపడకు మహారాజ్ఞీ! నీవే ఒక సుందర సంభ్రమ రూపానివి. నీ కటాక్షవీక్షణాలు స్వర్గలోకపు కిరణాలు. నేను మిమ్మల్ని సమీపిస్తుంటే మీరు ఆగ్రహంతో నన్ను తృణీకరించి కనుబొమలు ముడివడేలా చూస్తూ వెళ్లిపోతారనుకున్నాను. సృష్టికర్త రూపంలోనే మీరు ప్రకాశిస్తూ, సమస్త జీవకోటి మిమ్మల్ని చూసి ఆశ్చర్యంతో తల పంకించేత అందంగా ఉన్నారు. దివ్య సౌందర్యంతో అలరారే మీరు, ఈ చిన్ని వనంలో క్రూరమృగాల మధ్య ఎందుకున్నారో అర్థం కావడం లేదు. ఇంత విశ్వసమ్మోహన రూపాన్ని వీక్షించే అదృష్టం ఒకే ఒక్క మానవునికే దక్కడం శోచనీయం. దేవతల మధ్య దేవతలాంటి నిన్ను అనేకమంది దేవదూతలు సేవిస్తుండగా సకల సౌభాగ్యాలతో తులతూగవలసిన మిమ్మల్ని ఇక్కడ ఇలా చూడడమే ఇబ్బందిగా ఉన్నది" అన్నాడు ఆ మాయావి.

అవతారిక దిగ్విజయంగా ముగిసింది. ఆ సర్పరూపుని మాటలు సరాసరి 'ఈవ్' హృదయాన్ని చేరుకున్నాయి. మాటలకన్నా ఆ సర్పం మాట్లాడే తీరు నచ్చిన 'ఈవ్' ఇలా పలికింది.

"ఏమిటీ వింత! ఒక సర్పం నోట మానవభాష రావడం ఎంత విచిత్రం! క్రూరజంతువు మానవ మనోభావాల్ని వెల్లడించడం, సంభాషించడం, పొగడడం

ఎలా సాధ్యం! సృష్టికర్త జంతువుల్ని సృజించినపుడు వాటికి ధ్వనులే కాని వాక్కును ఇవ్వలేదే! ఇంద్రియజ్ఞానం వాటి చూపుల్లో ఎక్కువగా, చేతల్లో అప్పుడప్పుడూ కనిపిస్తుంది. సర్పానికి బుద్ధితీక్షణత ఉన్నది కాని మానవభాష రాదే! ఓ సర్పమా! నీవే వివరించు! నీకీ శక్తులు ఎలా వచ్చాయి! మిగతా జంతువులకన్నా స్నేహపూర్వకంగా ఉండే నడవడి నీకెలా అబ్బింది! ఇంత అద్భుతమైన విషయాన్ని గమనించకుండా ఎట్లా ఉండగలం!"

'ఈవ్' ప్రశ్నలకు సమాధానంగా కపటోపాయధురీణుడు ఇలా అన్నాడు– "ఈ భూతలస్వర్గపు మహారాణీ! సౌభాగ్యవతి ఈవ్! తమ ఆజ్ఞకు విధేయుడినై నీవడిగిన ప్రశ్నలకు సమాధానమివ్వడం నా బాధ్యత. ఇంతకుమునుపు నేనూ మిగతా జంతువుల్లా ధ్వనులే చేసేవాడిని. ఒకరోజున ఇలానే ఈ వనంలో పాకుతుండగా నాకొకచోట బంగారు ఎరుపురంగు ఫలాలతో తళతళలాడుతున్న ఫలవృక్షం కనిపించింది. ఏవిటా చూద్దామని దగ్గరకువెళితే ఓ అద్భుతమైన సువాసన. నాకు ఆకలి ఎక్కువైంది. తల్లిపాల కోసం అటుయిటు గంతులేసే లేగదూడల్లా, గొర్రెపిల్లల్లా నా మనసు ఆ పండ్లను రుచిచూడ ఉత్సాహపడింది. ఆకలిబాధ తీర్చుకోడానికి ఆ ఆపిల్ పండ్లను తినదల్చుకుని నేను చెట్టుపైకి పాకి 'ఆదాం'కు అందే అంత ఎత్తులో ఉన్న కొమ్మల దగ్గరకు చేరుకున్నాను. చెట్టు చుట్టూ మిగతా జంతువులు చేరినా వాటికా ఫలాలు అందనంత ఎత్తులో ఉన్నవి. నేను నాకందిన ఫలాన్ని కడుపారా భుజించి ఆకలిదప్పులు తీర్చుకున్నాను. ఈ ఫలాల ఆస్వాదన వలన కలిగిన తృప్తి, సంతోషం నాకింతకు ముందెన్నడూ కలగలేదు. నాలో ఏదోమార్పు! ఏదో కొత్తశక్తి నాలో ప్రవేశించిన అనుభవం. మాటలు తన్నుకువస్తున్నవి. నా బాహ్యరూపం మారకున్నా, నా ఆలోచనలు, మానసిక శక్తి అనంతమై స్వర్గ, భూలోకాల్లోని అన్ని విషయాలు అవగతమవుతున్న భావన. అయినా నేను దర్శించిన అన్ని సుందర విషయాలకన్నా మీ దివ్యరూపం, అతిలోక సౌందర్యం నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసాయి. అద్భుత లావణ్యవతియైన మీకు సాటి ఎవ్వరూ లేరు. విశ్వసుందరీ! మిమ్మల్ని ఇలా ఇబ్బంది పెట్టినందుకు క్షమించకోర్తాను. మీ దారికి అడ్డం వచ్చి, మిమ్మల్ని తేరిపార చూస్తూ, మీతో మాట్లాడి, మీ మనసు నొప్పిస్తే క్షమించండి!" అంటూ ఆమెను ఆ చెట్టువద్దకు తీసుకువెళ్లినాడు.

నిష్కల్మషమైన, నిష్కపటమైన ఆ అందాలరాశి ఈవ్ (Eve) అన్నది– "ఈ వనంలోని ప్రతిచెట్టు పండునూ మేం తినవచ్చును. ఒక్క మధ్యలో ఉన్న ఆ చక్కని వృక్షఫలాల్ని ఆరగించకూడదు. దేవదేవుడు ఆ ఫలాల్ని అంటవద్దని, తినవద్దని ఆదేశించినాడు. తింటే మృత్యువు తప్పదని తెలిపినాడు"

ఆమె తన మాటలను పూర్తిచేయకమునుపే, ఇంకాస్త ధైర్యం పుంజుకున్న మాయావి తన మాటల్లో తేనె రంగరించి, మానవునిపై అత్యంత ప్రేమను, ఇష్టాన్ని కనబరుస్తూ, ఏథెన్స్ (Athens), రోమ్ (Rome) నగరాల్లోని ప్రసిద్ధ ఉపన్యాసకుల్లా, ఎటువంటి ఉపోద్ఘాతమూ, ప్రస్తావనా లేకుండా, ఒక చారిత్రక సత్యాన్ని వివరిస్తున్నట్లు ఆతడు మాట్లాడ సాగినాడు.

"పవిత్రమై, విజ్ఞాన సర్వస్వమై, జ్ఞానప్రదాతవైన అద్భుతవృక్షమా! ఇప్పుడు నీ వలన నాలో కలిగిన శక్తిని నేను అర్థం చేసుకోగలుగుతున్నాను. ఉన్నతులైన వారి నైజాన్ని కూడా అంచనా వేయగలుగుతున్నాను. ఈ విశ్వసుందరి, అందాల యువరాణి మృత్యు హెచ్చరికలను నమ్మకుండా ఉంటుందా! ఒకవేళ మృత్యువు రావడం నిజమైతే నేను ఈసరికే చనిపోయి ఉండాలికదా! జీవితాన్ని, జ్ఞానాన్ని ప్రసాదించే ఫలాన్ని రుచిచూస్తే మృత్యువు వస్తుందా! ఎవరివల్ల! ఆ బెదిరించే ఆతని వల్లనా! నన్ను చూడు! ఆ ఫలాన్ని ముట్టుకున్నాను, తినివితీరా ఆరగించాను. బతికే ఉన్నాను. నాకు విధి విధించిన జీవితం కన్నా ఎంతో ఉన్నతస్థితికి చేరుకున్నాను. నాలాంటి క్రూరజంతువులు, పశుపక్షులు తినగలిగిన ఫలాన్ని మానవుడు రుచి చూడకూడదా! అటువంటి చిన్న పొరపాటుకు మరణమే శిక్షగా విధించబడ్తుందా! మంచీచెడుల మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకోవడమే మృత్యురూపమా! మంచి అంటే ఏది మంచి! చెడు అంటే ఏది చెడు! ఎంతవరకు మంచి ఎంతవరకు చెడు! అది తెలియనప్పుడు దేవుడు ఎలా శిక్షించగలడు? మృత్యుభయం భయాన్ని తొలగిస్తే ఈ ఆంక్షలెందుకు? దేవుడు ధర్మమూర్తి న్యాయనిర్ణేత కదా! మీ తప్పేమీ లేకుండా మిమ్మల్నెలా శిక్షించగలడు? అందుబాటులో అందాల ఫలవృక్షాన్ని ఉంచి దాని ఫలాల్ని అంటరాదు, ఆరగించరాదు, తింటే మృత్యుదండన అనడం న్యాయమేనా? అది అన్యాయమైతే, ఆ శాసకుడు దేవుడెలా అవుతాడు? అతనికెవరు భయపడ్తారు? ఎవరు విధేయులుగా ఉంటారు? మృత్యువంటే మీరు భయపడి విధేయులై ఉంటారని ఆతని నమ్మకం. అందుకే తన విశ్వాసులందరినీ అజ్ఞానులుగా, అమాయకులుగా ఉంచడం అతని ఉద్దేశం. అతనికి తెలుసు ఏరోజునైతే మీరు జ్ఞానఫలాన్ని రుచిచూస్తారో ఆనాడే ఇప్పటి వరకు మసక చీకటిని చూస్తున్న మీ నయనాలు విప్పారి మిమ్మల్ని దేవతలను చేస్తాయి. మీకు కూడ మంచిచెడుల తారతమ్యం తెలుస్తుంది.

నన్ను చూడండి! నేనిప్పుడు క్రూరజంతువులో ఉన్న మానవాత్మను. మీరుకూడ జ్ఞానఫలాన్ని రుచిచూస్తే మానవరూపంలో ఉన్న దేవతలౌతారు. బహుశా మరణించాక కావచ్చు కాని అంతకన్నా జరిగే నష్టమేమున్నది. తినకపోతే మనుష్యుల్లా శాశ్వతంగా జీవిస్తారు. తింటే మరణించి దేవతలౌతారు. దేవతలు ఇష్టపడే ఆహారం కళ్ల

ముందుండగా తినకుండా ఉండడం సాధ్యమేనా! ఈ సుందర భూలోకం, సూర్యకాంతిచే వెచ్చదనాన్ని సంతరించుకున్నదై ఈ జీవుల అవసరాలను తీరుస్తున్నది. అందులోనూ మంచీ చెడుల విచక్షణను తెలిపే జ్ఞాన సంపదను ఇముడ్చుకున్న వృక్షఫలాల్ని ఆరగించడానికి అంక్షలెందుకో నాకు అర్థం కాలేదు. జ్ఞానం ఆతడినెందుకు బాధిస్తుందో తెలియరాదు. ఈ సృష్టి అంతా అతనిదే అయినప్పుడు ఆ వృక్షంపై వివక్ష ఎందుకు? అసూయ అనుకుంటే అది దివ్యహృదయాలకు చెందినది కాదుకదా! ఈ అల్పకారణాల్ని తోసిపుచ్చి ఓ మానవ దేవతా! సంకోచించకుండా ఈ మధురఫలాన్ని ఆరగించు!"

తేనె సొనల్లా మధురమైన ఆతని మాటలు ఆ అమాయకురాలి హృదయంలోకి ఏ అడ్డంకి లేకుండా చొచ్చుకుపోయాయి. ఆమె కళ్లు మిలమిలా మెరుస్తున్న ఆ మధుర ఫలాలపై నిల్చినా, ఆమె చెవుల్లో సహచరుని హెచ్చరికలు గింగిర్లెత్తుతూనే ఉన్నాయి. ఇంతలో మధ్యాహ్న సమయం కాగా ఆ సుకుమారి 'ఈవ్'కు ఆకలి కాగా, పక్కనే ఉన్న ఫలాల సువాసన ఆకలిని రెట్టింపుచేయగా, ఆమెలోని కోరిక విచక్షణా జ్ఞానాన్ని తరిమికొట్టి, ఆ ఫలాన్ని స్పర్శించి, రుచిచూడాలనే వాంఛ అంతకంతకూ అధికమవుతుండగా, కనులటూ యిటూ కదుల్తుండగా, ఒకక్షణం తటపటాయించి ఆమె తనలో తాను ఇలా తర్కించుకున్నది– "సందేహం లేదు! ఫలరాజానివి నీవు! మానవుడికి అందనంత దూరంగా ఉంచబడినా, పొగడ్తలకు తగిన దానివి. మూగప్రాణికి మాటనిచ్చి, నాలుకకు మాటలను మించి పొగడ్తలను అద్దిన నీ రుచి మాకెందుకు దూరమయ్యిందో తెలీదం లేదు. నీకు జ్ఞానవృక్షమని పేరిడి, మాకు మంచీచెడుల జ్ఞానాన్ని నిషేధించడమెందుకో! తెలియని మంచితనం చెడ్డదా! తెలిసిన చెడు మంచిదా! ఏది మంచో చెడో ఎలా తెలుసుకోవడం! తెలుసుకోవడమే నిషేధించ బడినప్పుడు మంచిగా, తెలివిగా ఉండడాన్ని ఆ దేవదేవుడు వ్యతిరేకిస్తున్నాడా! మృత్యు దండనాభయం స్వేచ్ఛను నిలువరిస్తున్నపుడు, అంతర్గత స్వేచ్ఛకు విలువేమున్నది? ఈరోజు ఈ ఫలాన్ని ఆరగిస్తే పర్యవసానం మాకు మృత్యువే అయినప్పుడు మరి ఈ సర్పం ఇంతవరకూ చావలేదు కదా! ఆరగించి, అరగించుకుని, మాటలో, జ్ఞానంలో, విచక్షణలో పరిణితి చెందింది కదా! మరి మరణశిక్ష మాకేనా! ఈ జ్ఞాన అన్నం పశుపక్ష్యాదులకేమీ అపకారం చేయదా! రుచిచూసిన సర్పం సంతోషంగా ఉన్నది. మానవునికి స్నేహితుడై మన్ననతో అరమరికలు లేకుండా ప్రవర్తిస్తున్నది. మరి నేనెందుకు భయపడాలి? మంచీ చెడూ, దైవం మృత్యువు, న్యాయం శిక్షల మధ్య తేడా తెలియని అజ్ఞానం గొప్పదా! ఈ ప్రశ్నలన్నిటికీ జవాబు, ఈ దివ్యఫలంలో ఉన్నది. కంటికి నదురై, రుచికి మధురమై, మనసుకు విచక్షణారసమై అలరారుతున్న ఫలాన్ని అందుకుని దేహం, మనస్సుల దాహాన్ని, తృష్ణను చల్లార్చుకుంటాను.

ఆ దుర్ముహూర్తాన ఆమె చేయి చప్పున వెళ్లి ఫలాన్ని కోసి ఇవ్వగా ఏ సంకోచం లేకుండా ఆమె ఆరగించింది. ఆ క్షణానే భూమికి గాయమై ప్రకృతి నిట్టూర్పులు విడవగా సృష్టిలో బాధాపూరక సూచనలు కనిపించసాగాయి. వెంటనే ఆ దుష్టసర్పం దట్టమైన పొదల్లోకి తప్పుకున్నది. 'ఈవ్' మాత్రం ఇదివరకెన్నడూ రుచిచూడని ఆ మధుర ఫలాన్ని ఆస్వాదిస్తూ, దేవుని హెచ్చరికలను మరచి, ద్రాక్షసారాయి మత్తులో ఉన్నట్లు ఉల్లాసంగా, వరమడిగిన వస్తువు దొరికినంత ఉత్సాహంగా సంబరపడుతూ ఇలా అనుకున్నది–

"ఓ అమూల్య వృక్షమా! పారడైజ్‌లోని తరులన్నిటికన్నా గొప్పదానివి నీవు. ఈనాటివరకు నిషేధించబడిన నిన్ను నేటినుంచి ప్రత్యేక శ్రద్ధాభక్తులతో పాలన పోషణ చేస్తాను. నీ ఫలాల్ని అందరికీ అందుబాటులోకి తెస్తాను. తామివ్వలేని దాని గురించి అసూయ చెందడం లోకధర్మం. అన్నీ తెలిసిన దేవతలు తామివ్వరాని బహుమతిని ఇక్కడెందుకు ఉంచారు? ఉంచి ఎందుకు నిషేధించారు? అనుభవమేకదా అక్కరకు వచ్చేది. ఇన్నాళ్లూ అజ్ఞానంలో ఉన్న నాకు, ఏం చెయ్యాలో చెయ్యకూడదో అర్థం అవుతున్నదిప్పుడు. ఇది రహస్యంగా నాలోనే ఉండిపోవచ్చు. అల్లంత దూరాన ఉన్న స్వర్గం, స్వర్గాధిపతి ఆతని గూఢచారులు దేవదూతలు వేరే పనుల్లో తీరిక లేకుండా ఉండి ఇక్కడి సంగతులను చూడమరిచినారేమో! అందుకే నాకీ అవకాశం దొరికి ఉంటుంది.

ఆదాంకు ఈ విషయాన్ని, నాలో వచ్చిన మార్పును ఎలా వివరించాలి? ఈ ఆనందాన్ని నాతోనే ఉంచుకోవాలా, లేదా ఆతనితో పంచుకోవాలా? జ్ఞానాన్ని నాతోనే ఉంచుకుని మానవస్త్రీకున్న లోటును దీనితో భర్తీచేయాలా! ఆ రకంగా అతనితో సమానురాలనవుతాను. లేదా అతనికంటె ఎక్కువ కూడా కావచ్చును. బలహీనుడు స్వేచ్ఛగా ఎలా ఉండగలడు? ఒకవేళ దేవదేవుడు చూసి ఉండి మృత్యువు సంభవిస్తే, ఆదాం మరొక 'ఈవ్'ను పెండ్లాడి అంతే ఆనందంలో సుఖిస్తాడు. నేను అంతర్ధానమై పోతాను. అందుచేత 'ఆదాం' ఈ ఆనందాన్ని నాతో పంచుకోవలసిందే! పర్యవసానం మంచి కానీ, చెడు కానీ! అంతేకాక అతన్ని ఎంత ప్రేమిస్తున్నానంటే ఎన్ని చావులైనా ఆతనితో భరించగలను. అతడు లేని జీవితం వృధా!"

అలా అనుకుంటూ 'ఈవ్' జ్ఞానవృక్షానికి నమస్కరించి, దేవతల ఆహారమైన మకరందం, అమృతపూదేనె (Nectar) తనలో ప్రవహిస్తున్నట్లు భావిస్తూ ఆదాం వేపు బయల్దేరింది. ఆదాం ఆమె రాకకై ఎదురుచూస్తూ రకరకాల పూలతో అందమైన పూలదండను కూర్చి ఆమె కురులలో అలంకరించి ఆమెను వనలక్ష్మిలా చూడగోరి ఉత్సాహుడై యున్నాడు. చాలాసేపయ్యింది. ఆమె తనను వదిలివెళ్లి అనుకుంటూ

ఆమె వున్నవేపు వెళ్లాడు. అప్పుడే జ్ఞానవృక్షానికి అతిసమీపంలోనే ఆమె తనవేపు వస్తూ నూతన ఆనందంతో తొణికిసలాడుతూ కనిపించింది. ఆమె చేతుల్లో అమృత పరిమళాలను వెదజల్లుతున్న ఆకర్షణీయమైన ఫలాలు. అతనిని చూడగానే ఈవ్ ఒక్క పరుగున సమీపించి, ఆలస్యానికి మన్నించమని కోరుతూ ఇలా పలికింది–

"ఆశ్చర్యపడిపోలేదా నీవు, ఆదాం, నా ఆలస్యానికి! నీవు లేని ఈ కాసింత సేపు నాకు యుగాలుగా గడిచినా, విరహం ప్రేమను మరింత వృద్ధిచేస్తుంది కదా! ఈ ఆలస్యానికి ఒక వింతైన, అద్భుతమైన కారణం ఉన్నది. ఈ జ్ఞానవృక్షం ఉన్నది చూసావూ, మనకు ఇన్నాళ్లూ నూరిపోసినట్లు ఇదేమీ అపాయకరమైనదేం కాదు. దాని ఫలాల్ని రుచిచూస్తే చచ్చిపోయేదేమి లేదు. ఏ దుష్టమార్గాలలోకీ దారితీయదు. దాని దివ్యశక్తికి కళ్లు తెరుచుకుని ఆస్వాదించినవారిని దేవతలతో సమానుల్ని చేస్తుంది. క్రూరజంతువైన సర్పం ఆ ఫలాల్ని తిని మాటలు నేర్చి ఉపన్యాసాలిస్తోంది. అది మరణించలేదు సరికదా దాని వ్యక్తిత్వం ఉన్నతమై మానవ సహజమైన వాక్కు, ఇంద్రియజ్ఞానం, విచక్షణ అబ్బాయి. ఆ సర్పం నన్నెంత ప్రోత్సహించిందంటే దాని ప్రోద్బలంతో నేనూ ఆ ఫలాన్ని రుచిచూసి నిజానిజాల్ని గ్రహించాను. ఆ ఫలాన్ని తిన్నాక నా కళ్లు తెరుచుకున్నాయి. హృదయం విశాలమై, ఆత్మ ఆనందంతో గంతులు వేస్తుండగా దేవుడంతటి ఉన్నతస్థితికి చేరుకున్నాను. ముఖ్యంగా నీకు నేను ఈ విశేషాన్ని వివరించి నిన్ను కూడా నేనున్న ఆనందస్థితిలోకి తీసుకువెళ్లాలనేది నా ప్రగాఢ వాంఛ! నీవు లేని ఆనందం నాకు ఆనందంగా అనిపించదు. అందుచేత ఆదాం! ఈ ఫలాన్ని రుచిచూడు. ఈ సంతోషాన్ని సమంగా పంచుకుందాం! లేకుంటే ఈ వ్యత్యాసం మనిద్దరినీ అసమానతలో ఉంచి విడదీస్తుంది. అప్పుడు నేను దేవుణ్ణి ప్రార్థించినా ఫలితముండకపోవచ్చు. ఎందుకంటే విధి అంగీకరించదు"

'ఈవ్' తన బుగ్గలు ఆనందాతిరేకాన కెంపులై మెరుస్తుండగా జరిగిన వృత్తాంతాన్ని చెప్పింది– ఆ మృత్యుసమానమైన కథనాన్ని వినగానే ఆదాం కలవరపడి నిశ్చేష్టుడై నోటమాట రాక నిలబడిపోయాడు. ఒక భయంకర శైత్యం నరాల నిండా ప్రవహించి, వెన్నులో చలి, వణుకు పుట్టుకొచ్చాయి. అతనిచేతిలో ఉన్న పూలదండ ఈవ్‌కిద్దామని తెచ్చినది నేలపై జారి పడిపోగా పూలదండలోని గులాబిపూల రెక్కలు విరిగి నేలపై చెల్లాచెదురయ్యాయి. మాటలే కరవై, మనసు బరువై, చప్పుడు చేయకుండా నిలబడి ఉన్న అతనిలో మొదట అంతర్గత నిశ్శబ్దం బద్దలైంది.

"దేవదేవుని నిర్మాణాలలో ప్రసిద్ధికెక్కినదీ, నూతనమైనదీ అయిన సుందర సృష్టిలోకమా! అందాలన్నీ కుప్పబోసి దానికి స్వచ్ఛమూ, దివ్యమూ, మంచితనమూ,

వినయమూ, తియ్యదనాన్ని రంగరించి అపురూపలావణ్యంతో నిన్ను తయారుచేస్తే ఒక్కక్షణంలో ఆ సుగుణాలన్నిటినీ కోల్పోయి మృత్యువుకు దగ్గరైనావే! నిషేధించబడిన జ్ఞానఫలాన్ని రుచిచూసి దైవశాసనాన్ని ధిక్కరించినావే! శత్రువు మాయోపాయంతో నిన్ను పక్కదారి పట్టించినాడు. నిన్ను, నీతో నన్ను సర్వనాశనం చేసి మన విరోధి విజయగర్వంతో విర్రవీగుతూ ఉండిఉంటాడు. నీవులేని నేను లేను. నీతోనే నేను. నీవు మరణిస్తే నేను మరణించడమూ ఖాయమే. నీవులేని ఈ వనంలో ఒంటరిగా నేను జీవించలేను. దేవదేవుడు నా మరో పక్కటెముక నుంచి ఇంకో 'ఈవ్'ను సృష్టించి ఇచ్చినా నీవులేని లోటు ఎన్నటికీ తీరదు. నీవు నా అస్థి రక్తమాంసాల్లో భాగానివి; సుఖమైనా, దుఃఖమైనా నీతోనే! అదే సహజప్రకృతి కూడా!"

"అలా అనుకుని కాస్త నెమ్మదించిన హృదయంతో, పరిష్కారం కానరాని ప్రస్తుత పరిస్థితిని అంచనావేస్తూ 'ఈవ్'తో పలికాడు.

"సాహసురాలా! ధైర్యంగా దైవాజ్ఞను జవదాటి కష్టాలను కొనితెచ్చినావు. వద్దన్న పనిచేసి, నిషేధించిన ఫలాన్ని ఏదో ఒక నెపంతో రుచి చూసావు. జరిగిందేదో జరిగిపోయింది. గతం గతః! విధివల్లనో, సర్వశక్తిమంతుడు కాని దేవుడివల్లనో నీవు జ్ఞానఫలాన్ని రుచిచూసినా మరణించలేదు. ముందుగా రుచిచూసిన సర్పమూ చావకుండా, మానవశక్తుల్ని సంపాదించుకున్నది. బహుశా మనం జ్ఞానఫలాన్ని తినడం వలన దేవుళ్లం కాకపోయినా కనీసం దేవదూతలమో, చిన్నదేవతలమో అవుతాం! సృష్టికర్త అయిన దేవుడు మనపై ఎంత ఆగ్రహం చెందినా ఈ లోకపు ఆదిదంపతులమైన మనల్ని నశింపచేస్తాడనుకోను. తాను ఎంతో శ్రమతో సృజించిన అద్భుత సజీవ శిల్పాన్ని ఆతడు మట్టిపాలు చేయడనే నేను తలుస్తున్నాను. అది తన విరోధికి విజయం కనుక ఆతడు మరో సృష్టిచేయ సంకల్పించడు. ఎందుకంటే శత్రువు అంటాడు! "దేవుని అనుగ్రహం పొందిన వారి స్థితి చంచలం! ముందు నేను, తరువాత మానవులు నాశనమయ్యారు. రేపు ఇంకెవరికీగతి పట్టనున్నదో!"

ఏది ఏమైనా నేను నీతోనే ఉంటాను. మృత్యువు నిన్ను తీసుకువెళ్తే అదే నాకూ జీవితమౌతుంది. సహజమైన బంధం నన్ను నీతోనే కట్టిపడేస్తూ, నాలోని భాగానివైన, నాదానివైన నిన్ను విడిపోనివ్వకుండా అడ్డుపడుతున్నది. ఒకే ఆత్మ! ఒకే శరీరమైన మనలో నిన్ను కోల్పోవడమంటే నన్ను కోల్పోవడమే కదా!"

ఆదాం మాటలను విన్న 'ఈవ్' ఇలా సమాధానమిచ్చింది–

"నిజమైన ప్రేమకు నిదర్శనమైన సహచరుడా! నీ అడుగుజాడల్లో నడవడానికి ప్రయత్నిస్తున్నా నిన్ను అందుకోవడం కష్టమే. నీలా పరిపూర్ణత్వాన్ని పొందలేను.

అలా అని నీవు లేకుండా బ్రతుకలేను. ఆదాం! నీ శరీరంలో శరీరమై జన్మించి, నీ సహచరిగా జీవిస్తూ, ఒకే హృదయం, ఒకే ఆత్మగా ఇరువురం కలిసి బతుకుతూండగా మృత్యువో లేక మృత్యురూప శాపమో మనల్ని విడదీయదలిస్తే, అదీ ఈ మధుర ఫలాన్ని రుచిచూసినందుకు కలిగే మంచో, చెడో, ఇద్దరం కలిసే అనుభవిద్దాం. ఈ ప్రేమ పరీక్షకు బహుమతి మృత్యువే అయితే నేను ఇప్పటికే ఈ ఫలాన్ని రుచిచూసాను గనుక నేను మృత్యువును సాదరంగా ఆహ్వానిస్తాను. నిన్ను మృత్యుదరికి రానీయను. నీ మనశ్శాంతికి ఇష్టానికి భంగం కలిగించే పని ఏదీ నేను చేయబోను. నీపై గల ప్రేమ సాక్షిగా చెబుతున్నాను. ఈ అద్భుత ఫలాన్ని రుచిచూస్తే మృత్యువు రాదు, ప్రియతమా! ఆ దివ్యరసం మనలో ప్రవహించి, మన కనులను తెరచి, కొత్త ఆశలను చిగురింపజేసి, నూతన సంతోషాన్ని కలుగచేస్తుంది. ఇది నా అనుభవం చెప్పే విషయం! కనుక ఆదాం! ఎటువంటి సందేహం, మృత్యుభయం ఉన్నా వాటిని గాలికి వదిలి ఈ ఫలాన్ని ఆరగించు"

అని పలుకుతూ ఆమె ఆతనిని తన కౌగిలిలో బంధించింది. ప్రేమ నిండిన శరీరంతో అతనిని అల్లుకుపోగా, ఆతడు ఆమెకోసం ఆమె ప్రేమకోసం దేవదేవుని ఆగ్రహానికి కూడా గురికావడానికి, మృత్యుదండన స్వీకరించడానికి కృతనిశ్చ యుడైనాడు. ఆమె తనలో ఒదిగిన ఆతనికి తన చేతిలోని ఆకర్షణాఫలాన్ని ఇచ్చింది. అతనికి మనస్ఫూర్తిగా ఇష్టంలేకపోయినా, స్త్రీమోహమాయాజాలంలో మునిగి జ్ఞానఫలాన్ని, నిషేధించబడిన మృత్యురూపాన్ని ఆస్వాదించినాడు. ఆ క్షణం భూమి తన పేగుల్లో గుద్దిన భావనతో కంపించగా, ప్రకృతి రెండవసారి ఆక్రందన చేసింది. ఆకాశం నల్లనై, ఉరుములు ఉరమగా విషాద సూచకంగా మబ్బుల నుండి జారిన కన్నీళ్లు, మానవజంట ఇద్దరూ కలిసి పూర్తిచేసిన తొలి పాపకార్యాన్ని గుర్తించాయి. ఆదాం మరింతగా ఫలాన్ని తినాలనుకోపోయినా, 'ఈవ్' ఆతనిని బలవంతపెట్టకుండా తన ప్రేమ కౌగిలిలో ఆతనిని బంధించి ఓదార్చసాగింది. ఆ మధురఫలరసం ఇద్దరిలో ద్రాక్షసారాయి మత్తులా వ్యాపించి ఇద్దరిలో నూతన ఆనందాన్ని నింపగా, మత్తైన కొత్తలోకంలో దేవతల్లా విహరిస్తున్నట్లు భ్రమించి, ప్రేమకన్నా కామం ఎక్కువై ఆతడు 'ఈవ్'ను కాంక్షాపూరిత నేత్రాలతో, 'ఈవ్' ఆతడిని కామోద్దీప్త దృక్కులతో తీవ్రమైన కోరిక ఇద్దరినీ అగ్నిజ్వాలల్లా దహిస్తుండగా, ఆదాం, తన ప్రియురాలు ఈవ్‌తో పొందుకోరి ఇలా పలికాడు–

"ఈవ్! మన అభిరుచులు, రుచులూ ఒకటే కావడం మన అదృష్టం. ఈ ఫలమాధుర్యత నీవు చెప్పినదానికన్నా బాగుండి మనమిన్నాళ్లూ ఎంత ఆనందాన్ని కోల్పోయామో తెలియచేస్తున్నది. ఇంత మధురమైన ఫలాన్ని మనకు దేవదేవుడెందుకు

అందకుండా చేసాడో తెలీకున్నది. ఆ ఫలరస మహాత్మ్యమో ఏమో ఈనాడు నీవు నా కళ్లకు మరింత మనోహరంగా కనిపిస్తున్నావు. ప్రియతమా! రా! మనం హాయిగా ఈ ఆనందలోకంలో విహరిద్దాం!"

కాంక్ష, కోరిక, కామం కలగలిసిన దైహికవాంఛ అధికం కాగా ఆదాం, ఈవ్‌ను పొదివి పట్టుకుని పాన్సీలు (Pansies), వయొలెట్లు (Violets), అస్పొడెల్ (Asphodel), హ్యాసింథ్ (Hyacinth) పూలపాన్పుగా, చల్లని నీడలో, పచ్చటి ఆకులే కప్పుగా ఉన్న పొదరింటిలోకి ఆమెను తీసుకునివెళ్లాడు. అక్కడ వాళ్లు ప్రేమతో, కామంతో నిండిన తమకాన్ని సంతృప్తిగా తీర్చుకుని ఉభయులూ సంతృప్తినొందాక నిద్రలోకి జారుకున్నారు. అదేక్షణాన మానవుల తొలి పాపం నిర్ధారించబడినదై, నిద్రిస్తున్న వారు స్వప్నలోకంలో నుంచి బయటకు వచ్చినట్లు ఉలికిపడి లేచి ఒకరినొకరు చూసుకున్నారు. వారి కనులు తెరచుకున్నా, మనసు మేఘావృతమై ఉండి, చెడును తెలియనీకుండా ఇన్నాళ్లూ తెరలా కప్పి ఉన్న పాపరాహిత్యం పటాపంచలు కాగా, వారు తాము నగ్నంగా ఉన్న స్థితిని గమనించి, సిగ్గుతో తమను తాము కప్పుకోసాగినారు. ఫిలిస్తియన్ వేశ్య (Philistian) దలైలా (Dalilah) ఒడిలో నుంచి లేచిన డానైట్ (Danite) వీరుడు హెర్కులియన్ శాంసన్ (Herculean Samson)లా, ఆదాం లేచి తమ పరిస్థితిని గమనించి ఈవ్‌తో అన్నాడు.

"ఈవ్! ఏ దురదృష్ట క్షణంలో నీవు ఆ చీడపురుగు మాటలు విని, మోసపోయావో ఆ క్షణమే మన పతనం ప్రారంభమయ్యింది. మన కళ్లు తెరుచుకున్నాయి నిజమే, మంచీచెడుల విచక్షణ తెలిసింది సరే, మంచి మనల్ని విడిచిపోయింది, చెడు మిగిలిపోయింది. జ్ఞానఫలం చెడు జ్ఞానఫలమై మన కల్మషరహిత జీవితం స్వచ్ఛతను, పవిత్రతను కోల్పోయి పాపమార్గాన ఇప్పుడు పయనిస్తుంది. మన సహజ భూషణాలు నేడు పాపపంకిలమైనాయి. భోగలాలసత, కామవాంచ మన మొహాలపై కొట్టవచ్చినట్లు కానవస్తున్నది. చెడు కార్యాలు చేయడం వలన కలిగే తలంపులు మనల్ని తలదించుకునేలా చేసింది. ఇక దేవుని ఎదుట, దేవదూతల ముందు, సంతోషంగా, ఆనందంగా ఎలా నిలబడగలను? వారి దివ్యకాంతుల్ని నేను ఎలా భరించగలను? ఇక్కడ ఓ అనాగరిక జంతువులా, దట్టమైన అడవుల మధ్య, సూర్యకిరణాలు చొరరాని ప్రదేశంలో అవమానభారంతో బతుకుతాను. ఫైన్, దేవదారు వృక్షాల్లారా! మీ కొమ్మలు ఆకులతో మా సిగ్గును కాపాడండి. ఇవేమీ నన్ను పూర్తిగా దాయగలిగినట్లు లేవే. ఎంత కప్పినా ఎంతోకొంత అనాచ్ఛాదితంగానే మిగిలిపోతున్నది. ప్రస్తుత పరిస్థితిని దాటేందుకు ఏదో తరుణోపాయాన్ని వెదకాలి. ఈ సిగ్గును దాచేందుకు పెద్దపెద్ద ఆకులున్న చెట్టుకొమ్మను తెచ్చుకుని మా నడుం చుట్టూ

కప్పుకోవాలి. లేకుంటే ఈ కొత్తగా వచ్చిన భావం 'లజ్జ' (Shame) మా మనస్సులో ఏదో అపరిశుభ్రతా భావాన్ని కలిగిస్తున్నది."

అలా అనుకొని ఇద్దరూ దట్టమైన అడవిమధ్యలో పెద్దపెద్ద ఆకులున్న అత్తి (Fig) లేదా మర్రిచెట్టు (ఇండియాలోని మలబార్, దక్కన్ ప్రాంతాల్లో బహుదూరం వ్యాపించిన కొమ్మలతో ఉండి, కొమ్మల నుండి సాగిన ఊడ వేళ్లు నేలలోకి దిగి అవి మొక్కలుగా తల్లిచుట్టూ పెరుగుతాయి. వాటి నీడలో ఇండియన్ పశుపాలకులు తమ మందలతోసహా విశ్రాంతి తీసుకుంటారు) ఆకుల్ని కోసి నడుం చుట్టూ కట్టుకునే కటివస్త్రంలా తయారుచేసుకుని తమ సిగ్గుల్ని కప్పుకున్నారు. ఎంత మార్పు! నిష్కల్మషమైన నగ్నతకూ, పాపపంకిలమైన సిగ్గుకూ! పత్రదుస్తులలో వాళ్లెలా ఉన్నారంటే, కొలంబస్ అమెరికా ప్రాంతపు ద్వీపాల వద్దకు వెళ్లినపుడు తమ మొలల చుట్టూరా ఆకులు కట్టుకున్న ఆదివాసుల్లా – ఆదాం, ఈవ్‌లు కనిపించినారు. అయినా మనస్సులో ప్రశాంతత లేక వాళ్లు ఏటిఒడ్డున కూర్చుని ఏడ్వసాగినారు. వాళ్ల కళ్లనుండి ధారాపాతంగా కురుస్తున్న కన్నీటికి తోడు, మనసులో భావావేశాలు, కోపం, ద్వేషం, అపనమ్మకం, అనుమానం, అభిప్రాయభేదాలు పెల్లుబికి, ఒకప్పటి ప్రశాంతతను ఛిద్రం చేయగా అల్లకల్లోమైన మానసిక స్థితిలో, చిరాకు వదనంతో, ఆదాం తన సహచరి 'ఈవ్'తో అన్నాడు.

"నీవు నా మాటలను విని నాతోనే ఉంటే మనకీ దుర్గతి పట్టేది కాదు. నీకే క్షణాన ఒంటరిగా తిరగబుద్ధి పుట్టిందో, ఆ క్షణానే నిన్నేదో ఆవహించిందని నేను అర్థం చేసుకోలేకపోయాను. అప్పటి వరకు ఆనందంగా ఉన్నాము. ఇప్పుడు అన్నీ కోల్పోయి సిగ్గుతో అవమానంతో, నగ్నంగా, దుర్భర పరిస్థితిలో ఉన్నాము. **ఇప్పటి నుంచీ ఎవ్వరూ తాము నమ్మిన మతానికి వ్యతిరేక కారణాలు వెదకరాదు. అదే వారి పతనానికి నాంది అగుగాక!"**

తననే నిందిస్తున్నాడన్న కోపంతో 'ఈవ్' అన్నది– "నీ పెదాల నుంచి ఈరోజున ఎటువంటి మాటలు వస్తున్నాయి, ఆదాం! అంతా నాదే తప్పులా మాట్లాడ్తున్నావేం! నేను ఒంటరిగా వెళ్లడం వల్లనే ఇంత గొడవ జరిగిందంటావు, అదే నీకు జరిగి, ఆ సర్పం నీతోనే మాట్లాడి ఉంటే నువ్వేం చేసేవాడివి? మనిద్దరి మధ్య గొడవల వల్ల నిన్ను నేను విడిచి వెళ్లలేదే! అయినా నీవు నన్నొక జీవంలేని పక్కటెముకగా భావించి నిన్ను వదిలి వెళ్లకుండా ఉండాలనుకున్నప్పుడు నన్ను ఖచ్చితంగా వెళ్లవద్దని శాసించి ఉండాల్సింది. నాకు ప్రమాదం, ఈ మాట పడాల్సిన బాధ రెండూ తప్పేవి. నీవే గనక దృఢనిశ్చయంతో ఉండి నన్ను వారించి ఉంటే నేను వెళ్లేదాన్ని కాను. మనకీ అవస్థ వచ్చేదీ కాదు"

ఆమె మాటలకు మండిపడ్డ ఆదాం అన్నాడు– "ఇదా నీ ప్రేమ! ఇలానా నీవు ఋణం తీర్చుకునేది! కృతఘ్నురాలా ఈవ్! నిన్ను నీవు పోగొట్టుకున్నప్పుడు అలా వదిలేసినా నేను శాశ్వతానంద వనంలో హాయిగా బ్రతికేవాడిని. అయినా నీకోసం స్వచ్ఛందంగా మృత్యువు నాహ్వానించానే, నీవు దారితప్పటానికి నేను కారణమని ఏ నోటితో అంటున్నావు? నేను నిన్ను హెచ్చరించాను, బతిమలాడాను, రాబోయే అపాయం గురించి వివరించాను. శత్రువు గురించి మరీమరీ చెప్పాను. నీమీద దేన్నీ బలవంతంగా రుద్దలేదే. స్వేచ్ఛాజీవనంలో బలం కూడదనే కదా నిన్ను నీ స్వేచ్ఛకు వదిలేసింది? నీవు ఆ క్షణాన ఎంతో ధైర్యవంతురాలిలా, ఏ ప్రమాదాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిన్ను నీవు పరీక్షించుకునే అవకాశాన్నిమ్మని పదేపదే అడిగావు. నా తప్పు అదే! నీవడిగింది ఒప్పుకున్నందుకు నేను నిందితుణ్ణయ్యాను. **ఇకనుంచి ఎవరైతే స్త్రీలను అధికంగా విశ్వసించి వారికి అధికార మిస్తారో వారు పతనం చెందెదరుగాక!** వద్దంటే వినకుండా, తన దారిన తాను వెళ్లి అపాయం జరిగితే అది అతని నియంత్రణలోని పొరపాటంటున్నదీ స్త్రీ!"

అలా వాళ్లు ఒకరినొకరు నిందించుకుంటూ గంటలు గంటలు వృధాగా కాలం గడిపారు. ఎవరూ తమ తప్పుల్నెంచుకోకుండా, ఎదుటివాళ్లను ఎత్తిపొడవడంతో పోటీ పడుతూండగా ఆ వాగ్వాదం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియకుండా పోయింది.

10. అవిధేయతానంతర పరిణామాలు

మానవుడి అవిధేయత గురించి తెలుసుకున్న రక్షక దేవదూతలు 'పారడైజ్'ను వదలి దేవదేవుని దగ్గరకు వెళ్లి సంగతి వివరించారు. సాతానును నిలువరించడం వారికి సాధ్యపడదు కనుక వారి పర్యవేక్షణలో లోపం లేదని దేవదేవుడు వారిని దోషవిముక్తుల్ని చేసాడు. ఆతడి తరపున భూలోకానికి విచ్చేసిన దైవకుమారుడు శాసనోల్లంఘులపై న్యాయనిర్ణయం ప్రకటించాడు. మానవులపై జాలినొందిన మెస్సయ్య వారికి కట్టుకోను దుస్తులనిచ్చి దేవలోకానికి తిరిగి వచ్చినాడు.

సాతాను విజయవార్త విని, సంబరపడిన పాపం **(Sin)**, మృత్యువు **(Death)** నరకలోకపు ద్వారాలను విడిచి కొత్తలోకం వేపు రహదారిని, అవ్యక్తస్థితి మీదుగా వంతెనను నిర్మించారు. తమకు ఎదురైన సాతానును పొగిడి వారు భూమివేపు ప్రయాణిస్తుండగా, సాతాను పాండెమోనియం చేరి మహాసభ ముందు, మానవుడిపై తన విజయాన్ని గొప్పలు చెప్పుకుంటాడు. ఉపన్యాసం ముగిసాక కరతాళ ధ్వనులకు బదులుగా 'హిస్స్' **(Hiss)** శబ్దాలు వినపడగా, తనకెదురుగా అందరూ, తానూ సర్పరూపంలో కనిపించి హతాశుడౌతాడు. అప్పుడే వారిముందు ప్రత్యక్షమైన జ్ఞానవృక్షాన్ని చూసి అందరూ ఫలాలకోసం ఎగబడగా వారి నోటికి ఇంత దుమ్మూ ఇంత బూడిదా అంటుతుంది.

పాపం **(Sin)**, మృత్యువు **(Death)** భూలోకాన్ని చేరుకున్నా వాటిపై దైవకుమారుని అంతిమ విజయాన్ని దేవదేవుడు తన కుమారుడికి వివరిస్తాడు. ప్రస్తుతానికి స్వర్గలోకంలో, మూలపదార్థాల్లో కొన్ని మార్పులను చేయ సంకల్పించి దేవదూతలను నియోగిస్తాడు. అక్కడ తన పతనాన్ని గురించి ప్రతిక్షణం విలపిస్తున్న ఆదాం, ఈవ్ అనునయాన్ని తిరస్కరిస్తాడు. అతికష్టం మీద ఆమె ఆతనిని సమాధానపరుస్తుంది. తాము చేసిన పాపం తమ సంతానంపై పడకుండా ఉండడానికి ఆమె కొన్ని హింసాపూరిత చర్యలను పేర్కొంటుంది కాని అందుకు ఆదాం ఒప్పుకోడు. తమ సంతానం సాతానుపై ప్రతీకారం తీర్చుకోవలసిన అవసరాన్ని చెప్పి ఆమెను అంగీకరింపచేసి తాము ధిక్కరించిన దేవదేవుని క్షమాభిక్షను ఆశిస్తూ పశ్చాత్తాపంతో దాసులౌతారు.

సాతాను పారడైజ్‌లో చేసిన హీనమైన, నీచమైన మోసపు పని – అతడు ఈవ్‌ను మాయమాటలతో ఎలా దారిమళ్లించాడో, ఆమె తన భర్తను ఒప్పించి, ఆ మృత్యు ఫలాన్ని ఎలా రుచి చేసేట్లు చేసిందో – స్వర్గంలో అందరికీ తెలిసిపోయింది.

సర్వజ్ఞునికి తెలియనిదేమున్నది! సర్వవ్యాపకుడైన ఆ దేవదేవుడు, ధర్మాధర్మ నిర్ణేత, మానవుడికి శక్తిని, స్వేచ్ఛలను ఇచ్చి, విరోధి ఆచూకీని కూడా తెలిపి, ఆతని మాయమాటలకు లోబడవలదని హెచ్చరించినా, నిషేధించబడిన జ్ఞానవృక్షపు ఫలాన్ని తిని వాళ్లు భ్రష్టులైనారు. ఈ విషయాన్ని గ్రహించిన పారడైజ్ రక్షణా సిబ్బంది హుటాహుటిన దేవలోకానికి వెళ్లి దేవదేవునితో అంత కట్టుదిట్టంగా తామున్నా ఎలా సాతాను లోపలికి ప్రవేశించగలిగాడో తెలీక ఆశ్చర్యాన్ని ప్రకటించినారు. ఈ వార్తను వినగానే దేవదూతలందరూ విషణ్ణవదనులై, మానవులపై జాలిపడ్డారు. అందరూ దైవశిఖరం వద్ద ఉన్న సింహాసనం వద్దకు వెళ్లారు. వాళ్ల కోర్కెను మన్నించి దేవదేవుడు మబ్బులలో ప్రకాశిస్తూ అవతరించి ఉరుముల ధ్వనితో పలికినాడు–

"సభలో ఆసీనులైన దేవదూతలారా! భూలోకం నుంచి వచ్చిన రక్షకదళ సభ్యులారా! మీ పహారాలో లోపం ఉండబట్టే సాతాను లోనికి వెళ్లగలిగాడని అనుకోవద్దు. ఆ మాయావి మీరూహించని రూపంలో వనంలోకి ప్రవేశించి ఇంత చేటును తేగలిగినాడు. ఎప్పుడైతే ఆతడు అగాధాన్ని దాటి భూమి దిక్కుగా వెళ్తున్నపుడే నేను హెచ్చరించాను. ఏదో కుటిల యుక్తితో మానవుడిని దారిమళ్లించే ప్రయత్నం చేస్తాడని. పొగడ్తలతో, అబద్దాలతో మానవుడిని బోల్తా కొట్టించి ఆతడి విశ్వాసాన్ని పొందినాడు సాతాను. మానవుని స్వేచ్ఛానిర్ణయం పైననే ఆధారపడివున్న మానవ జీవనం మాయావి మాటలకు లొంగడంతో పతనమైంది. ఆతని తప్పుకు శిక్షగా మృత్యువు తప్పదు. కాని మానవుడనుకుంటున్నాడు అంత కఠినమైన నిర్ణయం నేను తీసుకోనని. కాని అతనికి తెలియదు న్యాయమైన తీర్పు అలా గాలిలోంచి ఊడిపడదని. పగలు ముగిసేసరికి విడుదల, దాతృత్వాన్ని తిరస్కరించగానే న్యాయం రావు. సరే వీళ్లని శిక్షించడానికి ఎవర్ని పంపను? ప్రియకుమారా! న్యాయాధికారాల్ని నీకు ఎప్పుడో ధారాదత్తం చేసినాను. ముల్లోకాల్లో (Heaven, Earth, Hell) న్యాయాన్ని, ధర్మాన్ని నిలిపే బాధ్యత నీపైననే ఉన్నది.

నాకు తెలుసు నీవు మానవుడి శుభాన్ని కోరతావని. కరుణామయుడవైన నిన్ను మానవులను శిక్షించమని పంపినా అది అంత తేలికైన పనికాదని నాకు తెలియును. నీవు మానవుల స్నేహితుడవు, మధ్యవర్తివి, స్వచ్ఛందంగా వారికోసం నిన్ను నీవు కుదువబెట్టుకున్న వాడివి, భ్రష్టుడైన మానవుడిపై తీర్పు చెప్పే అధికారివి. అందుకే నీకీ బాధ్యత ఇవ్వబడింది"

జగత్పిత పలుకగానే ఆతని కుడిపక్కన ఉన్న దైవకుమారునిపై కాంతిరేఖలు వెదజల్లబడగా ఆతడు ప్రకాశవంతంగా, మేఘాలడ్డం లేక జ్వాజ్వల్యమానంగా

కనిపించినాడు. తండ్రికి మారుగా కనిపించే ఆ దివ్యకుమారుడు అత్యంత తేజో విరాజితుడై ఇలా సమాధానమిచ్చాడు.

"ఓ జగత్పాలకా! తండ్రీ! నీ ఆజ్ఞప్రకారం స్వర్గ భూలోకాల్లో ధర్మపాలన చేసేందుకు నేను సంసిద్ధుడనై ఉన్నాను. భూమిపై తమ ఆజ్ఞను మీరిన ఆ అవిధేయులను శిక్షించడానికి వెళ్లి, మానవులనలుముకున్న చీకటిని తొలగించి, కరుణతో కూడిన తీర్పునిచ్చి, వాళ్ల పతనానికి కారణభూతుడైన మూడోవ్యక్తిని ఆ సర్పరూపుణ్ణి కఠినంగా శిక్షిస్తాను"

ఆ విధంగా పలికి ఆతడు తన ప్రకాశవంతమైన పీఠం నుంచి లేచి స్వర్గద్వారాల వేపు వస్తుండగా సింహాసనాలు, సామ్రాజ్యలూ, రాజ్యాలూ, అధికార ప్రాంతాలూ ఆతనిని అనుసరించాయి. వారిని వదిలి ఆతడక్కడ్నుంచి దివ్యవేగంతో ఈడెన్ వనంలోకి చేరుకున్నాడు. కాలం మధ్యాహ్న సమయాన్ని దాటి పశ్చిమ దిశవేపు ఒరుగుతున్నది. చల్లని సాయంకాలపు గాలులు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. వాటికంటే చల్లనైన కరుణామయుడైన న్యాయాధిపతి, మధ్యవర్తి ఒకడే అయిన దివ్యమూర్తి ఈడెన్ వనంలో అడుగుపెట్టినాడు. దేవుని గొంతువిన్న ఆ మానవజంట దట్టమైన పొదల చాటున దాగి కనబడకుండా ఉన్నారు.

"Where art thou Adam? ఎక్కడున్నావు ఆదాం! నేను వచ్చినందుకు ఆనందంగా లేదానీకు! నీవు కనబడక నాకు ఆరాటంగా ఉన్నది. I miss you here! నా ఎదుట పడకుండా ఒంటరితనంలో చేసే గొప్పపని ఏమున్నది? నీలో వచ్చిన మార్పుగానీ, లేదా ఏదైనా అనుకోకుండా వచ్చిన అవకాశం కానీ నిన్నిట్లు నిలువరిస్తున్నదా! ఎదుటకు రా!"

ముందుగా ఆదాం, ఆతని వెనుకనే ఈవ్ ఇద్దరూ బయటకు వచ్చారు. ఏదో తప్పు చేసినవారిలా, పాలిపోయిన వదనాలతో, వణికిపోతున్న శరీరాలతో, వారి కనులలో ఇప్పుడు ప్రేమ లేదు. దేవునిపై కాని, ఒండొరులపై గాని ఒకప్పటి స్వచ్ఛమైన ప్రేమ అంతరించి, ఒడలెల్లా నిండిన అపరాధ భావంతో, సిగ్గు, బిడియం, కలవరం, నిరాశ, కోపం, మొండితనం, ద్వేషం, మోసంలాంటి దుష్టభావాలు కలగలుపు కాగా వారిలోని అమాయకత్వం నశించిన శరీరాలతో వారు దేవుని ఎదుట నిలబడినారు. మాటలు తడబడుతుండగా ఆదాం సంక్షిప్తంగా సమాధానమిచ్చాడు.

"తోటలో ప్రతిధ్వనించిన మీ పిలుపును విన్నాను. నగ్నంగా ఉన్న శరీరంతో మీకంట పడలేక పొదలమాటున దాక్కుని ఉన్నాము"

దానికా దయామయుడైన ప్రభువు కోపపడకుండా పలికాడు–

"ఇదివరకు ఎన్నోమార్లు నా గొంతు విన్నావు! ఏనాడూ నీకు భయమనిపించ లేదు. పైపెచ్చు ఆనందంతో ఉరకలేసేవాడివి! మరెందుకు ఆ స్వరము నీకీనాడు భయాన్ని కలిగిస్తున్నది? నీవు నగ్నంగా ఉన్నట్లు ఎవరు నీకు చెప్పారు? నిన్ను తినవద్దని ఆజ్ఞాపించిన జ్ఞానఫలాన్ని, మాట జవదాటి, రుచి చూసినావా?"

దుఃఖంతో పూడుకుపోయిన గొంతును పెగుల్చుకుంటూ ఆదాం అన్నాడు– "ఓ స్వర్గమా! న్యాయాధిపతి ముందు ఇలా పాపపంకిలమైన పాదాలతో నిలబడవలసి వస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. ఈ నేరానికి పూర్తిబాధ్యతను నేనే వహించనా, లేక నా సహచరిని బాధ్యురాలినిగా చేయనా? ఆమె నాలోని భాగమే, నా జీవన భాగస్వామి, నాలో విశ్వాసమున్న నెచ్చెలి కనుక ఆమెపై నెపం వేయకుండా ఉంటాను. దానివల్ల పాపం, పరిణామం రెండూ నా తలపై పడవచ్చును. కాని నేను దాచిన విషయం దేవునికి తెలియకుండా ఉంటుందా! సత్యమార్గమే ఋజుమార్గం కదా! మీరు నాకు సహచరిగా ఇచ్చిన ఈ 'మానవి' దివ్యమైనది, సద్గుణాలరాశి, అనుకూలవతి, నాకు చేదోడు వాదోడుగా ఉన్న నా నెచ్చెలి, తన చేతితో ఇచ్చిన దానిని నేనెప్పుడూ కాదనలేను. ఆమె ఏ పని చేసినా ఆలోచించి, న్యాయబద్ధంగా చేస్తుందనిపించేది. ఆమె జ్ఞానఫలాన్ని ఇవ్వగా నేను ఆ ఫలాన్ని రుచిచూసాను"

ఆ మాటలకు న్యాయనిర్ణేత, విశ్వాధిపతి ఇలా అడిగాడు– "ఆమె నీకు దేవుడికన్నా ఎక్కువగా, దైవాజ్ఞను ధిక్కరించేటంత ముఖ్యంగా అనిపించిందా! ఆమె నీకు నీతో సమానంగా, నీకన్నా ఉన్నతంగా, నీకు సలహా ఇచ్చేటంత స్థాయి ఉన్నదని ఎప్పుడు గమనించావు! దేవుడు నిన్ను ఆమెకు అధికారిగా, మగసిరి కలవాడిగా, నీ నుంచి ఆమెను నిర్మించి, నీకోసం కదా, సంపూర్ణ లావణ్యవతిగా ఆమెను సృజించి ఇచ్చినది? ఆమె నీ ప్రేమను పొందవచ్చు, కాని నీపై అధికారం ఆమెకు ఇవ్వబడలేదు. నీ గురించి నీకు పూర్తిగా తెలిసి ఉంటే ఆమెకిచ్చిన వరాలు, అర్హతలు ఆమెకు పరిపాలనార్హత లేదని అర్థమయ్యేది"

జగత్ప్రభువు 'ఈవ్' వేపు చూసి ప్రశ్నించాడు– "మానవీ! ఏమిటి నీవు చేసిన పని? దీనికి నీ సంజాయిషీ ఏమిటి?"

విచారమైన వదనంతో ఆమె దేవుని ముందు వినయంగా పలికింది–

"ఆ సర్పం నన్ను మాయమాటలతో మోసగించి ఫలాన్ని తినేలా చేసింది"

విశ్వన్యాయనిర్ణేత సర్పం వేపు తన దృష్టిని మరల్చి, దానిని తన మాయోపాయానికి వాహకంగా వాడుకున్న సాతానును పాపాలు పండినాక శిక్షించ

నిశ్చయించుకుని జంతువులలోకెల్లా చురుకైనదీ, కపటబుద్ధి కలిగిన సర్పాన్ని ఇలా శపించాడు– **"నీ ద్వారా ఈ దుష్కర్మ జరిగింది కాబట్టి, జంతువులలో నిందించబడ్డ తొలి ప్రాణివి నీవే కనుక, ప్రతి జంతువూ నిన్ను అసహ్యించుకుంటుంది. నీవు నేలపై పొట్టమీద పాకుతూ జీవితమంతా దుమ్ము తింటూ బదుకుదువుగాక! నీకూ, స్త్రీకి మధ్య, నీకు ఆమె సంతతికి మధ్య విరోధాన్ని కల్పిస్తున్నాను. నీవు వాళ్ల కాళ్లపై కాటువేస్తావు. వాళ్లు నీ తలను చితకబొడిచెదరు గాక!"**

ఈ భవిష్యవాణి (Oracle) తర్వాతకాలంలో రెండవ 'ఈవ్' – మేరీ (Mary) కుమారుడు జీసస్ (Jesus) – సాతాను మెరుపులా మండుతూ స్వర్గం నుంచి పతనం చెందడం – చూసి నిర్ధారించినది. దైవకుమారుడు సమాధి నుంచి పునరుత్థానం చెంది, భ్రష్టుచెందిన రాజ్యాల్ని, శక్తుల్ని పునర్నిర్మాణము చేసి సాతాను ఆక్రమించిన స్థావరాలను విముక్తం చేసి, ఆతడిని నరకానికి పంపడం భవిష్యత్ కథ.

దైవకుమారుడు 'స్త్రీ'–మానవిని ఉద్దేశించి తీర్పు ప్రకటించినాడు.

"నీ దుఃఖాన్ని కాన్పుసమయంలో మరిన్నిరెట్లు ఎక్కువ చేస్తున్నాను. నీ పిల్లలు నీకు దుఃఖాన్ని కలుగచేస్తారు. నీవు నీ భర్తకు విధేయురాలివై మెలుగు! అతడు నీపై అధికారం చలాయిస్తాడు"

ఆదాంకు ఈ విధమైన శిక్ష విధించాడు– "నీవు నీ సహచరి మాటలకు లొంగి జ్ఞానఫలాన్ని రుచిచూసావు. నా ఆజ్ఞను జవదాటావు. నీ మూలంగా ఈ నేల పంకిలమై తుప్పలతో ముళ్లతో నిండిపోతుంది. **దుఃఖం కన్నీళ్ల మధ్య నిరంతరం శ్రమిస్తూ, నేలను సేద్యవంతం చేసి లభించిన అరకొర ఫలితాన్ని అనుభవించెదవు గాక!** నీవు మళ్లీ మట్టిలో కలిసేవరకు నీ స్వేదం వలన, శ్రమవలన ఉత్పత్తి అయిన రొట్టెతో ఆకలి తీర్చుకుని కాలం గడపగలవు. ఏ మట్టినుంచి నీవు తయారు చేయబడినావో ఆ మట్టిలోనే కలిసిపోతావు (ఇదే – నీవు తెలుసుకోవాలనుకున్నావుగా, నీ జన్మరహస్యం). Know thy birth. For dust thou are, and shalt to dust return"

కరుణామయుడైన న్యాయాధిపతి వారికి తక్షణమే మరణదండన విధించకుండా, తనముందు నగ్నదేహాలతో కుంచించుకు నిలబడ్డ, దురదృష్టవంతులైన ఆ మానవజంటను చూసి జాలితో వారి శరీర ఆచ్ఛాదనకు జంతుచర్మాలతో చేసిన వస్త్రాల్ని కప్పినాడు. వారి అంతర్గత నగ్నత్వాన్ని తన ఋజుమార్గ వస్త్రంతో కప్పి దైవకుమారుడు స్వర్గానికి తిరిగివచ్చి తండ్రి కుడిపక్కన ఆసీనుడై దివ్యకాంతులతో ప్రకాశించసాగినాడు.

మాయావి సాతాను నరకం నుంచి వెళ్లినప్పటి నుంచి, కేయాస్‌లోకి భుగభుగమని పొగలు కక్కుతున్న నరకలోక ద్వారం వద్ద ఉన్న, ద్వారపాలకులు పాపదేవత (Sin), మృత్యువు (Death) సంభాషించుకుంటున్నారు.

"కుమారా! అక్కడ మన మూలపురుషుడు సాతాను (Satan) మనకోసం నూతనలోక ద్వారాలను తెరుస్తుండగా, ఇక్కడ మనం సోమరుల్లా ఒకరి ముఖాలు ఒకరం చూస్తూ కూర్చోవడమెందుకు? అతడు ఖచ్చితంగా విజయుడై ఉంటాడు. లేకుంటే వాళ్ల కోపానికి శిక్షగా ఈ నరకకూపంలోనికి మరల నెట్టివేసేవారు కదా! నా మట్టుకు నాకు ఏదో కొత్తశక్తి రెక్కలు తొడుక్కుని నాలో ప్రవేశించినట్లన్పిస్తున్నది. మనకు ఈ నరకలోకానికి మించిన రాజ్యమేదో లభించే సూచన కనిపిస్తోంది. ఆ శక్తి ఏమిటో చెప్పలేను గాని అది అసహజమైనది, మార్మికమైనది. నీవు నా నీడలా అంటుకున్నవాడివి. ఎందుకంటే పాపం, మృత్యువు విడదీయరాని జంటకదా! ఇక్కడ్నుంచి ఆ కొత్తలోకానికి వచ్చి పోయేందుకు వీలుగా అగాధం మీదుగా కొత్త రహదారి నిర్మిద్దాం! అది ప్రస్తుతం అక్కడ ఉన్న సాతాను ప్రభువుకు మనమిచ్చే కానుక కాగలదు. నరకలోక వాసుల ప్రయాణానికి అది అనుకూలంగా ఉండగలదు.

ఆమె మాటలకు నీడలాంటి మృత్యువు ఉరుములా సమాధానమిచ్చాడు "వెళ్లు! పద! ఎక్కడ నీకు ప్రవేశార్హత లభిస్తే అక్కడకు! నేను నీ వెనువెంటనే ఉంటాను. దారి తప్పను కూడా! నీవు ముందు నడుస్తుంటే, విధ్వంసపు ధూమాలు నన్ను పిలుస్తుంటే, వాటి గాఢతను పీలుస్తూ, నా ఆకలి మంటలకు ఆహుతయ్యేవాటిని కబళిస్తూ మృత్యుగంధాన్ని వ్యాపింపజేస్తాను. నీవు తలపెట్టిన పనికి, శ్రమకు సరిసమానమైన సహాయం చేస్తాను! పద ముందుకు!"

అలా అంటూనే అతడు భూమిపై కొత్తగా వీస్తున్న మరణ వాయువీచికలను ఆఘ్రాణించినాడు. ఆకాశంలో ఎగుర్తూ అల్లంత దూరాన్నుంచే రేపటి యుద్ధరంగంలో పడి ఉండబోయే జీవకళేబరాల కోసం గుంపులు గుంపులుగా పోగవుతున్న రాబందుల్లా, ఆతడు తన నాసికా పుటాలను ఎగరవేసి తన ఆహారం ఎంతదూరంలో ఉందో ఉజ్జాయింపు లెక్కవేసినాడు.

చీకటి అగాధం మీది నీటిపై అల్లల్లాడుతున్న శక్తుల్ని, ఉడుకుతున్న పదార్థాన్ని చెరొకపక్క తోసుకుంటూ, పేర్చుతూ; రెండు ధృవపు గాలులు క్రోనియన్ సముద్రం (Cronian Sea)పై ఉధృతంగా వీస్తూ మంచుకొండల్ని తూర్పున పెట్సోరా (Petsora) నుంచి కథయన్ తీరం వరకూ (Cathaian Coast) కదిలిస్తున్న విధంగా, వారిద్దరూ దారి నిర్మించసాగినారు. మృత్యువు తన గదతో పోగుపడ్డ ఆ పదార్థాన్ని మోదుతూ,

గట్టిపరుస్తూండగా డెలాస్ (Delos) లా తేలుతున్న ఆ బంకపదార్థము త్రిశూలపు దెబ్బలకు దృఢంగా తయారైంది. గార్గొనియన్ (Gorgonian) చూపు తగిలి శిలలైనట్లు, ఆతని చూపుల వేడికి ముడిపదార్థం గట్టిపడి, ఆస్ఫాల్ట్ తారు (Asphaltic)తో నునుపు చేయబడి, విశాలంగా నరకపు లోతుల్లోకి పునాది వేయబడగా, దాని నుంచి అగాధంపైకి సాగిన రహదారి వంతెన, ప్రస్తుతం కంచె రక్షణలేని కొత్తలోకపు అంచుల వరకు నిర్మించబడింది. అదెలా ఉందంటే క్జెర్క్జెస్ (Xerxes) రాజు స్వేచ్ఛాప్రియులైన గ్రీకులను తన ఏలుబడిలోకి తెచ్చేందుకు సుసా (Susa) నుండి హెల్లెస్‌పాంట్ (Hellespont) వరకు సముద్రం మీదుగా తన మెమ్నోనియన్ భవనాన్ని (Memnonian Palace) కదిలించి ఆసియా, యూరప్‌లను కలిపి అనేక దేశాలను పీడించడానికి నిర్మించిన వంతెనలా ఉన్నది. ఈ మానవ నిర్మిత కట్టడం మృత్యు రహదారితో పోలిస్తే అణుప్రమాణం, అత్యల్పం.

నరకద్వారాల నుంచి అగాధం వరకు రహదారిని, అగాధం నుంచి భూలోకం వరకు రాతివంతెనను సాతాను వెళ్లినదారిలోనే నిర్మించబూని దృఢమైన అడమాంటైన్ (Adamantine) రాతి పలకల్ని, శృంఖలాలుగా ఒకదానికొకటి సంధించి భూమిని నరకాన్ని అనుసంధానం చేసినారు. సాతాను భూలోకంలో మొదట ఏ ప్రదేశంలో కాలుబెట్టాడో అక్కడివరకు వంతెన నిర్మించబడింది. దానిపై నడుస్తూ పాపదేవత 'సిన్' (Sin) మృత్యుదేవత 'డెత్' (Death) ఇద్దరూ భూలోకపు దరిదాపుల్లోకి వచ్చేసరికి దేవదూత రూపంలో సాతాను– సెంటార్ (Centaur)కు స్కార్పియో (Scorpio) (ధనూ, వృశ్చికరాశులు)కు మధ్య పయనిస్తూ తూర్పున సూర్యుడు 'ఏరీస్' (Aries-మేషం)లో ఉదయిస్తున్న సమయంలో– తమవేపే రావడం గమనించారు.

సాతాను, ఈడెన్‌వనంలో తన మాయమాటలకు మోసపోయిన ఈవ్ జ్ఞానఫలాన్ని రుచిచూడగానే, సర్పం నుంచి విడివడి, వేర్వేరు రూపాలు మారుస్తూ ఎవరికంటా పడకుండా, పరిణామాల్ని గమనిస్తూ, ఆమె భర్త కూడా ఆమె మాటలను విని జ్ఞానఫలాన్ని తినగానే, వారిద్దరూ తామున్న నగ్నస్థితిని గమనించి పొదలమాటున దాగడం, దైవాజ్ఞను ఉల్లంఘించిన వారిని శిక్షించడానికి దైవకుమారుడు వస్తున్నాడని తెలియగానే, భయంతో అక్కడ నుంచి పారిపోయాడు. మరల అర్ధరాత్రి వచ్చి ప్రస్తుతానికి తనకు శిక్షలేదని గ్రహించి, దిగాలుగా ఉన్న మానవ జంటను విడిచి సంతోషంగా నరకలోకం వేపు తిరిగి వస్తున్నాడు. కేయాస్ (Chaos-అవ్యక్తస్థితి) అంచుల దగ్గర సాతాను తనకెదురుగా వస్తున్న పాపదేవత, మృత్యువులను కలిసి అమందానందం చెందినాడు. ఆ అద్భుత వంతెనను చూసి అబ్బురపడి వారిని అభినందించినాడు. అతని కుమార్తె 'సిన్' (Sin) ఇలా పలికింది–

"తండ్రీ! ఇవన్నీ నీ విజయకేతనాలే! నీవి కాదన్నట్లు నీవు చూసిన ఈ మహోద్భుతాల రచయితవు, శిల్పివి నీవే! నా హృదయం ఒక రహస్యబంధనం చేత నీకే అన్వయింపబడి ఉన్నది. అందుకే నేను నా కుమారుడితో నీవున్న వేపుకే బయల్దేరాను. మన ముగ్గురిని కలిపే ఈ అనుబంధానికి నరకలోకపు శృంఖలాలు, పొగలు కక్కుతున్న అగాధం ఇవి ఏవీ అడ్డురాలేవు. ఇప్పటివరకు నరకలోకపు ద్వారాలకే పరిమితమైన మాకు స్వేచ్ఛను, కొత్తలోకాన్ని ప్రసాదించినావు. మేము మాకున్న శక్తులతో ఈ కొద్ది దారిని నిర్మించాము. ఇదంతా మీ సామ్రాజ్యమే! యుద్ధంలో కోల్పోయిన వాటిని యుక్తితో మీరు గెలుచుకున్నారు. స్వర్గానికి బదులు నూతన స్వర్గం! ఇక్కడ మీరే ప్రభువులు. అక్కడ స్వర్గంలో ఆ విజేత ఆనందంగా ఉండనీ! ఈ నూతన లోకాన్ని మీరు స్వాధీనపరచుకుని ఇక్కడ నుంచి స్వర్గలోకానికి అపాయకరంగా పరిణమించవచ్చు"

చీకటి యువరాజు సంతోషించి ఆమెతో అన్నాడు "ప్రియపుత్రికా! నా కుమారుడూ, మనవడూ అయిన మృత్యుదేవతా! సాతాను వంశానికి ఘనకీర్తి తెచ్చినారు మీరు. స్వర్గలోకపు తలుపుల వద్ద ఉన్న మన చీకటి సామ్రాజ్యం, విజయంపై విజయాన్ని సాధించి విజృంభించనీ! ఈ ఘనకార్యంతో రెండులోకాలు నరకభూలోకాలు, ఒకే ఖండంగా మారి రాకపోకలు ఉధృతం అగుగాక! నేనిప్పుడు నరకలోకంలోకి వెళ్తాను. మీరు భూలోకంలోని 'పారడైజ్'కు వెళ్లి ఆనందించండి. అక్కడి జీవరాశికి అధిపతి అయిన మానవుణ్ణి వశం చేసుకుని, ఆడించి చివరకు చంపివేయండి. నా ప్రతినిధులుగా మీరు భూమిపై బహుళంగా వ్యాపించి, మీ ఇద్దరి శక్తియుక్తులతో కొత్తలోకాన్ని నా అధీనంలో ఉంచే బాధ్యత మీదే! పాపం ద్వారా మృత్యువు రావడం నా ప్రయత్న ఫలితమే! మీ ఇద్దరి శక్తులు ఒక్కటిగా పనిచేయండి. నరకలోకపు వ్యవహారాల్ని నేను చక్కదిద్దుతాను. ఎటువంటి భయం లేకుండా ధైర్యంగా ముందుకు నడవండి!"

వారు సాతాను నుంచి వీడ్కోలు తీసుకుని నక్షత్రరాశుల మధ్యగా వెళ్తుంటే నక్షత్రాలు భయంతో పారిపోయాయి. గ్రహాలు వణికి, గ్రహణాలు సంభవించాయి. ఇటు సాతాను కొత్త రహదారిపై వేగంగా పయనించి కాపలాలేని నరకద్వారాల వద్దకు చేరుకున్నాడు. అక్కడ అంతా నిశ్శబ్దంగా ఉన్నది. ద్వారపాలకులు నూతన స్వర్గం వేపు మళ్లగా నరకలోకవాసులు విశ్రాంతి తీసుకుంటున్నట్లున్నారు. సాతాను రాజప్రాసాదం, ల్యూసిఫర్ (Lucifer) పీఠమైన పాండెమోనియం (Pandemonium) లో ఏ అలికిడీ లేదు. అతని ఆజ్ఞననుసరించి అందరూ సాతాను వచ్చేవరకు విశ్రాంతి తీసుకుంటున్నారు. రష్యన్ శత్రువు ఆస్ట్రకాన్ (Astracan) ను తప్పించుకున్న టార్టార్ (Tartar)లా; టారిస్ లేదా కాస్బీన్ (Tauris or Casbeen) నుంచి పారిపోతూ

అలాదులె (Aladule) రాజ్యాని కావలనున్న ప్రాంతాన్నంతా ధ్వంసం చేసిన టర్కిష్ చంద్రవంక (Turkish Crescent) వాసి బాక్ట్రియన్ సోఫి (Bactrian Sophie)లా, సాతాను, తన నగరాన్ని చేరుకున్నాడు. పహారా కాస్తున్న కొద్దిమంది సిబ్బంది ఎప్పుడు తమ నాయకుడు వస్తాడోనని ఎదురుచూస్తున్నారు. ఆ తిరగబడ్డ దేవదూత నరకద్వారాల దగ్గర్నుంచి ప్లుటోనియన్ భవంతి (Plutonian Hall)లోకి అదృశ్యంగా ప్రవేశించి తన సింహాసనంపై కూర్చున్నాడు. కొద్దిసేపటి తర్వాత మబ్బుల్లోంచి ప్రకాశిస్తున్న కాంతికిరణంలా ఆతని శిరస్సు అసలుమెరుపుతోనో నకిలీ కాంతితోనో ప్రత్యక్షం కాగా, అకస్మాత్తుగా కనిపించిన తమ నాయకుణ్ణి చూసిన నరకవాసులంతా హర్షధ్వానాలు చేసారు. కొలువులోని ముఖ్యులంతా ఆతనిని అభినందించడానికి దగ్గరకు రాగా, ఆతడు తనచేతి సంజ్ఞలతో సభికులను నిశ్శబ్దంగా ఉండమని ఈ విధంగా పలికాడు– "సింహసనాలు, సామ్రాజ్యాలు, రాజ్యాలు, సద్గుణాలు, శక్తులు, మిత్రులారా! నేను వెళ్లిన పని దిగ్విజయమైనది, మిమ్మల్నిక్కడి నుంచి విముక్తులను చేసి, హేయమై, శాపోపహతమై, దుఃఖపూరితమై, బాధలతో నిండిన ఈ గోతిలో నుంచి మిమ్మల్ని బయటకు తీసుకువెళ్లి, విశాలమైన, మన పాత స్వర్గంలాంటి మరో కొత్తలోకాన్ని పరిచయం చేద్దామనుకుంటున్నాను. ఎన్నో కష్టానష్టాలతో కూడుకున్న నా యాత్రోద్దేశం ఫలించింది. నేను వెళ్లేప్పుడు అత్యంత దుస్తరమైన మార్గంలో నానా బాధలు పడుతూ భయంకరమైన అగాధాన్ని దాటి కొత్తలోకానికి వెళ్లవలసి వచ్చింది. నేను వెళ్లిన ఆ ఇరుకు త్రోవ స్థానే పాపదేవత 'సిన్', మృత్యుదేవత 'డెత్'లు చక్కటి, విశాలమైన రహదారిని ఇప్పుడు నిర్మించియున్నారు. ఇరుకైన దారిలో పయనించి, నరకద్వారాలను దాటి, అగాధాన్ని అధిరోహించి, రాత్రిగర్భంలోకి దూకి, కేయాస్ (Chaos) అవ్యక్తస్థితిని అధిగమించి నానా అవస్థలు పడి, దేవదూతలను మభ్యపెట్టి కొత్తలోకానికి చేరుకున్నాను. ఆ కొత్తలోకం స్వర్గానికి దాదాపు దీటైనది, అద్భుతంగా నేయబడిన దివ్యవస్త్రంలా భాసిస్తూ, దానిలో ఈడెన్‌వనం, దానిలో పారడైజ్ ఒకదానిని మించి ఒకటి, ఆ పారడైజ్ ఉద్యానవనంలోని మానవుడు ఆతని సహచరిని యుక్తితో నేను (నీవాశ్చర్యపోవచ్చు ఏమిటా యుక్తి అని – ఒక్క ఆపిల్ పండుతో) వాళ్లను బురిడీ కొట్టించాను. దానికాతడు– మన విరోధి ఉగ్రుడై (మీరిప్పుడు హాయిగా నవ్వులు చిందించవచ్చు) తన ప్రియమైన మానవుణ్ణి, ఆ నూతన ప్రపంచాన్ని పాపానికి, మృత్యువుకు ఎర గావించాడు. మనకేం కష్టం లేకుండా 'కాగల కార్యాన్ని ఆతడే నిర్ణయించి' మనకు శ్రమను తగ్గించాడు. నామీద వేయాల్సిన శిక్షను నేనావహించిన సర్పానికి వేసి, నాకు మానవకోటికి మధ్య శత్రుత్వాన్ని స్థాపించాడు. నేను మానవ సంతతి చీలమండను కాటువేస్తే సర్పరూపంలో ఉన్న నా తలను వాళ్లు చితకగొడతారు. నెత్తిమీద ఇంత దెబ్బ తగలకుండా ఏ ప్రపంచమైనా ఎవరికైనా ఎలా దొరుకుతుంది?

నా ప్రతిభను కార్యదీక్షను మీ ముందుంచాను. దేవతలారా! మిత్రులారా! ఇక ఆనందించడం మీవంతు!"

అని తన ప్రసంగాన్ని ఆపి ఒక్కక్షణం కరతాళధ్వనులు, జయజయధ్వానాలు మిన్నుముట్టగా విందామని ఆగాడు కాని అన్నిదిక్కుల నుండి, అనేక నాలుకల నుంచి "హిస్‌స్‌స్" అనే శబ్దమే! అందరూ, ప్రజలూ తిరస్కారానికి వాడే శబ్దం! ఆశ్చర్యంగా! అతడు సభికులపై, తనపై ఏదో తేడా శంకించినాడు. తనలో ఏదోమార్పు. చేతులు పక్కల కంటుకుని, కాళ్లు ఒకదానికొకటి మెలివేసుకొని నిలబడ్డవాడు తపీమని నేలపై పడిపోగా పొట్టమీద పాకుతూ లేవలేక, తనకన్న ఉన్నతమైన శక్తి తనను శాసిస్తుండగా, తాను పాపమొనర్చిన సర్పరూపంలోకి శాశ్వతంగా మారిపోయాడు. మాట్లాడదామని ప్రయత్నించగా 'హిస్‌స్‌స్' అన్న శబ్దమే జవాబు. ప్రతిధ్వని. చీలికల నాలుక నుంచి 'హిస్' అంటూ మిగతా సర్పాలు. అందరూ చిన్నాపెద్దా పాముల గుంపులు. అందరూ తామున్న స్థితిని చూసుకుని చేస్తున్న 'హిస్‌స్‌స్' శబ్దంతో నరకలోకం ప్రతిధ్వనిస్తుండగా అవి రాక్షస సర్పాల్లా భయంకరంగా నరకలోకపు కొండల్లో గుట్టల్లో లోయల్లో తిరుగాడసాగాయి. రకరకాల రూపాలతో వృశ్చిక కందిరీగల సంయుక్త రూపాలు (Scorpio-Wasp), ఏంఫిస్‌బొయినా (Amphis boena)లు, కొమ్ములున్న సెరాస్టెస్ (Horned Cerastes), హైడ్రస్ (Hydrus), ఎల్లాప్స్ (Ellops) డిప్సాస్ (Dypsas)లతో (ఒకప్పుడు గార్గాన్ల రక్తంతో తడిసిన ఒఫియుసా (Ophiusa - ద్వీపంలా) నరకకూపం కుతకుతలాడసాగింది. పిథియన్ లోయలో (Pythian) అతి భయంకర రూపంతో పెరుగుతున్న పైథాన్ సర్పంలా, డ్రాగన్‌లా సాతాను, సర్పరూపంలో ఉన్న తన అనుయాయులు వెంటరాగా చీకటి నుంచి మైదానంలోకి వెళ్లినాడు. వారంతా తమ అధినేత చెప్పబోయే విజయ విశేషాల గురించి వినడానికి ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. కాని వాళ్ల కళ్లకు ఎక్కడ చూసినా సర్పాలే! తాము కూడ సర్పాలమైన సంగతి అవగతమై కొందరు ఆసరికే, కొందరు అప్పుడప్పుడే నడుం నుండి కింది భాగము సర్పరూపంలోకి మారుతూ నేలపైబడి పొట్టలపై పాకుతూ, "హిస్‌స్‌స్" ధ్వనుల్ని చేస్తూ, నేలపై దుమ్మును కాటువేస్తూ, చేతుల్లోని ఆయుధాలు – కత్తి, బల్లెం, డాలూ – అన్నీ నేలపై పడి శబ్దాలు చేస్తుండగా, నేరం చేస్తుండగా పట్టుబడి సామూహిక శిక్షనో, శాపాన్నో అనుభవిస్తున్నట్లు – కరతాళధ్వనులకు బదులు విస్ఫోటనమై వ్యాపిస్తున్న "హిస్‌స్‌స్" శబ్దం! విజయోత్సాహం అవమాన భారంగా మారగా నరకప్రాణులు వణికిపోయాయి. దానికితోడు వారున్న పక్కనే ఓ తోట జ్ఞానవృక్షాలతో నిండినది, అద్భుతమైన ఫలాలతో ఆకర్షణీయంగా ఉన్నది ప్రత్యక్షం కాగా అందరికళ్లూ అటే మళ్లాయి. పారడైజ్‌లోని నిషేధించబడిన వృక్షం, ఈవ్‌ను

మోసబుచ్చడానికి సాతాను ఆడిన నాటకం, మానవజాతిని పతనం చేసిన ఫలవృక్షం వారి కళ్లముందే అసంఖ్యాకంగా వున్న వనంగా కనబడగానే అన్ని సర్పాలు ఆకలితో, దాహంతో అటు పరిగెత్తాయి. దేవదేవుడు తిరగబడ్డ దేవదూతలను మరింత శిక్షించ దలచినాడు గనుక ఆ వృక్షాలు నరకంలో పెరుగుతున్నాయని వారూహించలేదు. ఆ సర్పాలు అమితోత్సాహంతో జ్ఞానవృక్షాలపైకి పాకి కొమ్మలకు చేరి ఫలాల్నంది బుచ్చుకుని రుచి చూడాలని తాతపత్రయపడసాగినాయి. మెగారా (Megaera) సర్పకేశాలకన్నా దట్టంగా అవి జ్ఞానవృక్షపు కొమ్మలపై చేరి, సోడోమ్ (Sodom) భస్మీపటలమైన బిటూమిన్ (Bitumen) రాతినూనె సరస్సు వద్ద ఉన్న మెరిసే ఫలాల్లా– ఉన్న జ్ఞానవృక్ష ఫలాల్ని ఇనుమడించిన ఆకలిదప్పులతో ఆరగించబోయాయి. కొరికన ప్రతిసారి మధురమైన రుచిబదులు నాలుకను కాల్చేస్తున్న బూడిద, నిప్పుమంటలు. కణకణలాడే నిప్పుకణికల్ని నోట్లో వేసుకుంటున్న ధ్వనులు, ఎన్నిసార్లు ప్రయత్నిస్తే అన్నిసార్లూ అదే ఫలితం. 'హిస్'మని శబ్దాలు చేస్తూ అటు ఆకలి తీరక, ఇటు దాహం చల్లారక నిరాశతో, కోపంతో, నిట్టూర్పులతో ఆశలను కోల్పోయి ఆకలి దప్పులతో అలమటిస్తూ అన్నివేళలా 'హిస్' అని బుసలు కొడ్తూ సంవత్సరానికోసారో, కొంతకాలమో తమ పూర్వరూపాలు రాగా, తమ కుయుక్తి ఫలితాన్ని గతకాలపు వైభవాన్ని నెమరు వేసుకుంటూ కాలం గడుపుతారు. (దీన్నే కొందరు ఇతిహాస సంఘటనగా మార్చి సర్పరూపుడైన ఒఫియాన్ (Ophion), ఇక్కడి 'ఈవ్' యూరినొమ్ (Eurynome) – ఒలింపస్ రాణిని ఏమార్చినట్లు; శాటరన్ – ఓప్స్ (Saturn-Ops) ల కలయికలో 'జోవ్' (Jove) పుట్టక మునుపు జరిగినట్లుగా మరో సంఘటననూ, మార్చి వర్ణిస్తారు.) ఈలోగా పాపదేవత 'సిన్' – శక్తిరూపం నుంచి పార్థివరూపంలో, తన వెనుకనే మృత్యువు అనుసరిస్తుండగా భూలోకానికి చేరుకున్నారు. అప్పుడు 'సిన్' ఈ విధంగా అన్నది–

"సాతాను సంతానమా! మృత్యుదేవతా! ఎలా వుంది మన ఈ సామ్రాజ్యం! నరకలోకపు ద్వారాల దగ్గర అంధకారంలో పడి ఉండి, ఊరూ పేరూ లేక సగం ఆకలికూడా తీరక సతమతమైన ఆ దుస్థితి నుంచి, ఈ ఉన్నతస్థితిని చూడు!"

దానికి ఆ రాక్షస మృత్యువు అన్నాడు– "శాశ్వతమైన కరవుతో కృశిస్తున్న నాకు నరకమైనా, పారడైజ్ అయినా, స్వర్గమైనా ఒకటే! ఇక్కడ అంతులేని ఆహారమున్నట్లు కనిపిస్తున్నా నా నోటికి అది అత్యల్పమే!"

దానికి సిన్ – పాపదేవత – సమాధానమిచ్చింది– "ముందు ఇక్కడున్న తరుగుల్మ, లతాదులు, ఫల, పుష్ప, వృక్ష సంపదను తనివితీరా ఆరగించు! ఆ పిమ్మట జంతువుల్ని, జలచర, భూచర, ఖేచరాల్ని కబళించు! ముద్దలు ముద్దలుగా కాదు

గుట్టలు గుట్టలుగా, కాలప్రవాహంలో నీకెదురైన ప్రతి జీవసమూహాన్నీ కడుపారా భుజించు. నేను మానవజాతిలో ప్రవేశించి వాళ్లను భ్రష్టుపరచి, వాళ్ల ఆలోచనలు, చూపులు, పలుకులు, చేతలు అన్నీ రోగభూయిష్టమయ్యేలా చేయగా మానవుడూ ఆతని సంతతి నీకు మధురమైన, ఆఖరి కబళం, ముద్ద, కావాలి!"

అలా నిర్ణయించుకుని అవి అనేక విధాలుగా భూలోకపు జీవరాశుల్ని పీడించడానికి నిర్ణయించుకుని అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు నిరీక్షిస్తున్నాయి. వాటి పోకడలను గమనిస్తున్న మహాశక్తిమంతుడు జగత్ప్రభువు తన చుట్టూ ప్రకాశిస్తున్న సాధుసంతులతో (Saints) ఇలా అన్నాడు– "చూడండి! ఈ నరకలోకపు జాగిలాలు ఎంత వేడిగా వాడిగా కొత్తలోకాన్ని ధ్వంసం చేయడానికి ఉవ్విళ్లూరుతున్నాయో! తొలి మానవుడు తప్పు చేయనట్లయితే ఆ లోకమెప్పటికి భూతల స్వర్గంలా, శాశ్వతానందంతో అమరలోకంలా మృత్యుభయం లేకుండా విలసిల్లేది కదా! ఈ భయంకర పిశాచులు (Furies), నరకలోకపు యువరాజు (Prince of Hell) అతని అనుయాయులు, తేలికగా ఈ లోకంలోకి ప్రవేశించి, నా బలహీనతను ప్రశ్నిస్తున్నట్లు నవ్వుతూ, తుళ్లిపడుతూ, ఉద్రేకంతో వచ్చిన మూర్ఛరోగగ్రస్థుల్లా వాళ్లు ప్రవర్తిస్తుంటే నేనూ అక్కడక్కడ, అప్పుడప్పుడూ వాళ్లు ఆ పిచ్చితమకంలో, ఉన్మాదస్థితిలో ఉండే అవకాశం ఇచ్చాను. ఇంతవరకూ కల్మషరహితంగా ఉన్న నూతన లోకాన్ని వాళ్లు తమ స్రావాలతో అశుద్ధాలతో నింపి, మానవుల్ని, మానవలోకాన్ని దుర్గంధమయం చేసాక, వాళ్ల కాలం తీరగానే, వాళ్ల పాపం పండగానే, దైవకుమారుడి ఒకే ఒక్క వేటుకు పాపదేవత (Sin), మృత్యుదేవత (Death) లిద్దరూ ఒకే శవపేటిలో కేయాస్ అగాధం (Chaos) గుండా విసిరివేయబడి నరకలోక ద్వారానికి మూతగా బిగించబడగా నరకగహ్వరం, శాశ్వతంగా మూసివేయబడ్తుంది. మరల స్వర్గ భూలోకాలు కల్మషరహితమై ప్రకాశిస్తాయి. అప్పటివరకు ఆ రెండు లోకాలకు పట్టిన గ్రహణం కొనసాగుతుంది.

జగత్ప్రభువు మాటలను విన్న సభికులు హల్లెలూయాలు (Halleluiah), హర్షధ్వానాలు తెలిపారు. సముద్ర తరంగాల సవ్వడిలా వారు గానం చేసిన "ధర్మబద్ధమైన పరిపాలన, న్యాయపూరితమైన తీర్పులతో ముల్లోకాలను పరిపాలిస్తున్న అధినేతా! సమవర్తీ! తండ్రీ! నీ కుమారుడు మానవజాతి ఉద్ధారకుడు! ఆతని చేత ఈ స్వర్గ భూలోకాలు తమ ప్రతిష్ఠను తిరిగి పొందగలవు!" స్తోత్రాలు నలుదిక్కులా వ్యాపించినవి.

సృష్టికర్త పేరుపేరునా పిలుస్తుండగా దేవదూతలు ఒక్కొక్కరే వచ్చి తమ తమ మార్చబడిన బాధ్యతలను స్వీకరించినారు. సూర్యుడు తన స్థానాన్ని మార్చి,

ఉత్తరం నుండి శీతల వాయువుల్నీ, దక్షిణాన్నుండి వేడి గాలుల్నీ తెచ్చేలా, చంద్రుడూ, ఇతర గ్రహాలు వేర్వేరు గతులు, భ్రమణాలతో షట్కోణ, చతురస్ర, త్రికోణ, ఎదురెదురు (Sextile, Square, Trine, Opposite)గా, ఉంటూ; గ్రహ, నక్షత్ర సంయోగ వియోగ చలనాలతో, భూమిపైని జీవరాశిపై మార్పులు చేర్పులు తెచ్చేలా దేవదేవుడు తన నిర్ణయాల్ని ప్రకటించినాడు. వాయువులకు అవి వీచే దిక్కులు నిర్దేశించబడినవి. కొందరంటారు దేవదేవుడు తన దేవదూతలను ఆదేశించి భూఅక్షాన్ని, సూర్యుని ఇరుసుకు ఇరవై డిగ్రీలకు పైగా తేడా ఉండేట్లు అమర్చాడని. కొందరి అభిప్రాయం ప్రకారం సూర్యుడు టారస్ (Taurus) వృషభరాశి నుండి సప్త అట్లాంటిక్ కన్యలతో (Seven Atlantic sisters) కలిసి, తరువాత స్పార్టాన్ కవలలు (Spartan Twins) – మిథునరాశితో, కర్కాటకరాశి (Crab) వరకు పయనించి తరువాత అధోముఖంగా సింహ (Leo), కన్య (Virgin), తులా (Scales), మకర (Capricorn) రాశుల్ని దాటుతూ ఋతువులను సృష్టిస్తాడంటారు. వసంత కాలం వచ్చినప్పుడు రేయింబవళ్లు సమానమై, భూమి రంగురంగుల పుష్పాలతో చిరునవ్వులు చిమ్మగా, ధృవాల దగ్గర తూర్పు పడమరలు లేక మందగించిన సూర్యకాంతి, వేడిమిని మంచును పెంపొందించగా ఎస్టోటిలాండ్ (Estotiland) నుంచి దక్షిణాన మాగెల్లాన్ (Magellan) వరకూ అంతా మంచుమైదానమే కదా! థెయెస్టియన్ విందును (Thyestean Banquet) చూడలేక సూర్యుడు పక్కకు తప్పుకోగా చలి, మాడ్చేసే వేడి భూమిపైకి వచ్చేసాయి. వాతావరణంలో ఈ మార్పులు నెమ్మదిగా వచ్చినా క్రమేపీ సముద్రం, భూమి, సౌరజ్వాలలు, ఆవిరి, పొగమంచులలో మార్పును తెచ్చినాయి. నారుంబెగా (Norumbega) ఉత్తరప్రాంతం నుంచి, సమోవా (Samoea Shore) తీరం నుంచి వీచే మంచు తుఫాను గాలులు, వడగళ్ల వానలు, బొరియాస్ ఉత్తరపుగాలి (Borias), కొసియాస్ (Coecias), అర్గెస్టస్ (Argestes), థ్రాసియస్‌లు (Thrascias) (అడవుల్ని సముద్రాల్ని తలకిందులు చేసేవి;) నోటస్ (Notus- పడమటి గాలి), ఆఫర్ (Afer)లు నల్లమబ్బులతో పిడుగుల్ని కురిపిస్తూ సెర్రాలియోనా (Serraliona) నుంచి వచ్చి లెవాంట్ (Levant) మధ్యధరా సముద్రపు తూర్పుప్రాంతాన్ని అతలాకుతలం చేసేవి; సిరొక్కొ (Sirocco), లిబెక్కియో (Libecchio) లను ముంచెత్తే యూరస్ (Eurus–తూర్పుగాలి); జెఫెరిస్‌లు (Zephir-దక్షిణపు గాలులు) వాతావరణాన్ని అలుముకున్నవి.

ఆ విధంగా జీవరహితమైన పదార్థాల నుంచి ఆగ్రహభావనలు ఉధృత మయ్యాయి. పాపదేవత మొదటి కుమార్తె విరోధం (Discord), వ్యతిరిక్త భావంతో దగ్గరయ్యే మృత్యువు భూలోకాన్ని ఆవరించగా జంతువుతో జంతువు, పక్షితో పక్షి,

చేపతో చేప పోట్లాడుకుంటూ ఒకరినొకరు కబళించుకొనసాగినారు. మానవుడిని సంభ్రమంగా చూడడం మాని, పశుపక్ష్యాదులు భయంతో పారిపోతున్నవి. లేదా నిర్లిప్తత నిండిన మొహంతో ఆతని పక్క నుండి వెళ్లిపోతున్నవి. బాహ్యప్రపంచంలో మారుతున్న స్థితులను గమనించిన ఆదాం, దుఃఖాన్ని విచారాన్ని విడిచినా, లోలోన పెరుగుతున్న దిగులు గుండెను పిండేస్తుండగా, తనలోని బాధను తొలగించుకోదలచి ఇలా అన్నాడు–

"ఓ ఆనందంలో విషాదమా! ఈ అద్భుత ప్రపంచానికి అంతిమ క్షణాలు వచ్చాయా! ఈ ఆనంద ఘట్టంలో, కీర్తిలో సరికొత్తవాడినైయుండి దేవదేవుని ఆజ్ఞను దాటి పతితుడనయ్యాను. కోటి సూర్యప్రభల వెలుగొందే భగవానుని ఎదుట పడలేక ఇలా దాక్కున్నాను. ఆనందాన్ని కోల్పోయి, ఇంతటి దుఃఖంలో ఉన్న నాకు ఇంకా శిక్ష ఉన్నదనే అనిపిస్తున్నది. నా ఆహార పానీయాలకూ, నా సంతానానికీ ఈ శాపం ఇలా తరతరాలుగా వ్యాపిస్తూనే ఉంటుంది. "పుత్ర పౌత్రాదులతో, సకల సౌభాగ్యాలతో వర్ధిల్లు" అనేమాటలు ఇప్పుడు రుచించడంలేదు. మృత్యువే అన్నిదిక్కులా ధ్వనిస్తూ, భవిష్యత్ తరాలకు ఆపదలు కొనితెచ్చిన దుష్కీర్తి నాకు దక్కింది. మానవులు తమకు వచ్చిన ఆపదలకు వగస్తూ నా కల్మష ప్రవర్తన వలన వారికి కీడు జరిగిందని నన్ను ఆడిపోస్తారు. ఇగిరిపోతున్న పారడైజ్ ఆనందపు అనుభూతుల్లారా! ఎటువంటి కష్టాలను కొనితెచ్చుకున్నాను? ఓ సృష్టికర్తా! మట్టి నుంచి బొమ్మగా తయారుచేసి ప్రాణం పోయమని నిన్ను నేనడిగానా! చీకటిలోకం నుంచి ఇంత మనోహరమైన వనంలోకి మార్చమని నేను కోరుకున్నానా! నా పుట్టుకలో నా ప్రమేయం లేనప్పుడు, నేను నీవనుకున్నది చేయనప్పుడు మళ్లీ మట్టిలో కలిపేయడం న్యాయం కదా! నేను పొందిందంతా తిరిగి ఇవ్వలేక, నీ ఆజ్ఞలను పాటించక మంచిని సరిగా చూడలేక పోయినప్పుడు, ఈ అద్భుత ఆనందాన్ని కోల్పోవడమే పెద్దశిక్ష కదా! దానికి తోడుగా ఈ అంతులేని బాధలు, మనసును కృంగదీసే వ్యధలు అదనంగా ఎందుకు? చాలా ఆలస్యంగా నేనీమాట అడుగుతున్నాను! నాకు బాధ్యతలను, షరతులను అప్పచెప్పి నప్పుడే అంగీకరించకపోయి వుంటే ఇంత అనర్థం జరిగేది కాదు.

దేవుడు నిన్ను అడగకుండానే సృష్టించాడు సరే రేపు నీ కన్న కుమారుడు అవిధేయుడైతే నీవు ప్రశ్నించినపుడు – నన్నెందుకు కన్నావు? నన్ను కనకపోతే ఈమాట అనకపోయుండేవాడివి – అంటే నీ సమాధానమేమిటి? ఆ జవాబును నీవంగీకరిస్తావా? దేవదేవుడు నిన్ను సృష్టించి, ఒక లోకానికి అధిపతిగా చేసాడు. ఆతని కరుణ నీకు ఇవ్వబడిన కానుక. నీకు విధించబడిన శిక్ష కూడా ఆతని ఇష్టమే!

కానివ్వు! నేను తలొగ్గుతున్నాను! దేవదేవుని నిర్ణయానికి కట్టుబడి వుంటాను. మట్టినుంచి వచ్చాను, మట్టిలోనే కలిసిపోతాను. (The dust I am, and shall to dust return. స్వాగతం! శిక్షపడబోయే సమయం ఆసన్నమైంది! న్యాయాధిపతి తీర్పు అమలుపరచబడేది ఈనాడే కదా! ఇంకా ఎందుకు నేను జీవించి ఉండడం, ఒకపక్క మృత్యువు నన్ను అపహాస్యం చేస్తున్నపుడు, మృత్యువులేని బాధ నన్ను కృశింప చేస్తున్నపుడు? నేను ఎంత త్వరగా మరణించి, నా మాతృమూర్తి ఒడిలోకి చేరుకుంటే అంత త్వరగా ఈ దుర్భర ఘోష అంతరిస్తుంది కదా! అక్కడ ఇప్పుడు దూరమైన నిద్ర, ప్రశాంతత లభిస్తాయి! ఆతని ప్రళయభీకర స్వరం నా కర్ణభేరుల్ని ప్రయ్యలు చేయదు! నా పాప ఫలితం నా సంతానానికి సంక్రమించి వారిని కష్టాలుపాలు చేసానన్న ఆందోళన నన్ను బాధించదు.

నాకో సందేహం! నేను మరణించి ఈ శరీరం మట్టిలో కలిసినా దేవుడు నాలో ఊదిన ఊపిరి, జీవాత్మ నశించదు కదా! సమాధిలోనో మరెక్కడో జీవన మృతుడిగా జీవిస్తానా! ఎటువంటి భయంకరమైన ఆలోచన! ఎందుకని! పాపం చేసిందెవరు? శరీరమా? ఆత్మ అనబడే జీవాత్మా? ఏది మరణిస్తుంది? జీవాన్ని, పాపాన్ని భరించిన శరీరమా! అంటే పార్థివ శరీరానికి ఈ రెండూ లేనట్లే కదా! ఈ సందేహం మానవజ్ఞానంతో తీరేట్లు లేదు. దేవుడు అనంతుడు కదా ఆతని ఆగ్రహమూ అనంతమేనా! మానవునికి మరణం రాసి ఉన్నపుడు, మృత్యువు మానవుడికి అంతం అయినప్పుడు, దేవుని ఆగ్రహం అనంతంగా ఎలా కొనసాగుతుంది? ఆతడు మరణం లేని మృత్యువును సృజించాడా! ఈ వైరుధ్యాలకు సమాధానం మహాశక్తిమంతుడైన దేవుడు ఇవ్వగలడా! మానవునిపై ఆతని ఆగ్రహం అనంతంగా సాగితే అదే ఎంతవరకు? మట్టికన్నా, దుమ్ముకన్నా, ప్రాకృతిక మూలకాలకన్నా, ప్రాథమిక అణువులకన్నా, ఏ పరిధుల్ని దాటి ఎక్కడకు పోతుంది? అయితే ఒక్కవేటున మృత్యువు నన్ను కడతేర్చదనుకుందాం! అప్పుడు ఈ బాధలు అనంతంగా నన్ను కృంగదీయవా! ఇప్పటికీ వాటి ఛాయలు నన్ను అశక్తుణ్ణి చేస్తున్నవి. ఏం చేయను! నేనూ, మృత్యువూ ఇలా శాశ్వతంగా ఒకరి దగ్గర్లో ఒకరు, నేను నానుంచి జనించబోయే మానవతెగతో, ఆతడు వారికోసం ఎదురుచూస్తూ! ఈ ఆలోచన నా తలలో దూరి నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.

పుత్రులారా! శెలవు! ఈ పాపభారాన్ని నేనొక్కడినే మోయగలిగి మీకు అది సంక్రమించకుండా ఉండాలనేది నా ఆశ, కోరిక! ఈ శాపం మీకు తగలకుండును గాక! ఒక్క మానవుని పొరపాటుకు ఆతని జాతి మొత్తం ఎందుకు శిక్షింపబడాలి? అయితే నా సంతానానికి నా మంచీచెడులు రెండూ సంక్రమిస్తాయి కదా! అయినా

సరే! నేను చేసిన పాపం నాతోనే ముగింపబడాలి. నా దుష్కార్యానికి నేనే శిక్షింపబడాలి! గొప్ప కోరిక! భూమి మోస్తున్న భారంకన్నా ఎక్కువగా ఉన్న ఈ పాపభారాన్ని ఆమెతో పంచుకోరాదూ! సాతానులా నేరాన్ని, శిక్షను అనుభవిస్తూ పోవాలా! మనసా! ఎటువంటి భయపు అగాధంలోకి నెట్టినావు నన్ను! ఈ దారీ తెన్నూ దొరకని అగాధంలోకి ఎంత ఆలోచించినా మరింత లోపలికి... మరింతలో లోపలికి...!"

అలా ఆదాం బిగ్గరగా గుండెలవిసేలా రోదన చేస్తూ నిశ్చల రాత్రిలో తన చుట్టూ క్రమంగా వ్యాపిస్తున్న చీకటి తెరలు భయాల్ని ద్విగుణీకృతం చేస్తుండగా నేలమీద వెల్లకిలా పడుకుని తన పుట్టుకను, చావును, ఆలస్యమవుతున్న శిక్షను తనకీ దుర్గతి పుట్టించిన క్షణాలను తిట్టుకుంటూ ఉన్నాడు– "మృత్యువా! తొందరగా! మూడురెట్ల శక్తితో నన్ను చంపి ఈ బాధను చల్లార్చు! సత్యం తన మాట తప్పితే, న్యాయం వేగిరం రాదా! మృత్యువు పిలిచినప్పుడు రానప్పుడు, న్యాయం నా ప్రార్థనలను విని, తొందరపెట్టవచ్చును కదా! ఓ అడవుల్లారా! ఓ నీటిబుగ్గలారా! జలపాతాల్లారా! కొండలు, కోనలు, లోయలు, పొదరిళ్లు, వృక్షాల్లారా! నా సహచరితో కలిసి మీకు ప్రతిధ్వనుల్తో (Echo) మాటలు నేర్పించానే! ఏమైనవి ఆ మాటలూ, పాటలూ!" – ఇలా దుఃఖపడ్తున్న అతనిని ఓదార్చడానికి ఆమె (ఈవ్) సమీపించినా ఆతడు తిరస్కారంతో ఇలా అన్నాడు–

"వెళ్లిపో! ఇక్కడ్నుంచి, నా కళ్లముందు నుంచి తొలగిపో! సర్పమా! నీకూ ఈ పేరే తగినది. మీరిద్దరిదీ ఒకే జట్టుగా ఉండతగినవారు. ఆ శత్రువులా నీదీ మోసమూ ద్వేషమూ! సర్పవర్ణంతో మెరుస్తూ ఇద్దరూ లోపలి విషాన్ని దాచి ఉంచగలరు. పైకి ఆకర్షణీయంగా ఉండేది మిగతా జీవుల్ని ఆకర్షించి వలలో వేసుకోడానికే! నీవు లేనప్పుడు హాయిగా ఉన్నాను. నీ గర్వం, నీ అహంకారం, నేను హెచ్చరిస్తున్నా వినని నీ పట్టుదల నన్నీ స్థితికి దిగజార్చినాయి. నీవు సాతానుచే ఆవహింపబడిన సర్పం వలన, నేను సర్పంచే మోసబోయిన నీవల్ల పతనమయ్యాము. నా పక్కటెముక నుంచి సృష్టింపబడి, నా పక్కన సురక్షితంగా ఉండాల్సిన నీవు ఎటువంటి మోసానికి, హింసకు లొంగబోనన్న ధైర్యాన్ని, పైకి నటించి, తీరా ఒక మోసగాడి పొగడ్తలకు లొంగి దైవాజ్ఞనే ధిక్కరించినావు. ఆ పక్కటెముకలానే నీదీ వంకరబుద్ధి! నా పక్కల ఎక్కువగా ఉన్న పక్కటెముకగా నిన్ను తీసి పారవేస్తే బాగుండేది. ఎందుకో తెలియదు, సృష్టికర్త, స్వర్గంలో ఉన్నవారిని ఆత్మలుగా, పురుషాత్మలుగా సృష్టించి మానవలోకంలో కొత్త విధానం అవలంబించాడు! ఇక్కడకూడా మనుషుల్ని ఆత్మలుగానో, స్త్రీలు లేని దేవదూతలుగానో మరోరకంగానో మానవుల్ని సృష్టించి ఉంటే బాగుండేది. ఈ అపరాధానికి ఆస్కారముండేది కాదు. స్త్రీలు, వాళ్లతో చాటు శృంగారం సృష్టింపబడినాక ఆ ఉచ్చులో చిక్కుకుని, సరైన భాగస్వామి దొరకక అనేక తప్పులు చేసి పాపాలు

పాలవుతాడు గదా మానవుడు. ప్రేమ వల్ల ఇష్టం వల్ల ఆకర్షింపబడి, తిరస్కరింపబడి, కామంతోనో, మోహంతోనో దారితప్పి పాపాలను చేసి జీవితాన్ని అంధకారం చేసుకునే కాలం వచ్చి, ఇంటాబయటా శాంతి నశిస్తే ఆనందమెక్కడ లభ్యమవుతుంది?"

అలా అంటూ ఆతడు ఆమె నుంచి ముఖం తిప్పుకున్నాడు. ఆగిన కన్నీళ్లు, చెదరిన శిరోజాలతో ఈవ్ ఆతని పాదాల వద్ద కూలబడి ఆతడిని తాకి, ఆతనికి మనశ్శాంతి కలిగించే ఓదార్పు వచనాలను పలికింది.

"ఆదాం! నన్ను తృణీకారం చేయకు! నన్ను తిరస్కరించవద్దు! నీమీది ప్రేమ, ఆరాధన శాశ్వతమైనవి, వన్నె తగ్గనివి. స్వర్గం సాక్షిగా నేను ప్రమాణం చేసి చెబుతున్నాను. నేను చేసింది తప్పే! నేను మోసపోయిన మాట వాస్తవం! నీ శరణు కోరుకుంటున్నాను. నిన్ను ప్రార్థిస్తున్నాను. నీ మోకాళ్లు స్పర్శించి మొక్కుతున్నాను. నన్ను విడిచిపోకు! నేను జీవిస్తున్నది నీ చూపుల రక్షణలో, నీ సహాయపు నీడలో! ఇటువంటి కష్టమైన, క్లిష్టమైన, దురదృష్టకరమైన సమయంలోనే నీ సలహా, మార్గదర్శనం అవసరం. మనకు అంతిమ శిక్ష అమలు జరుపబోయే ఈ ఆఖరి క్షణాల్లో, మనిద్దరి మధ్య శాంతి, సఖ్యం, అవసరం. గాయాల్తో సమానంగా బాధపడ్తున్న మనం, మనకీ విషాదస్థితిని కల్పించిన శత్రువుపై కూడా ఒకటిగా పోరాడుదాం! సర్పం వలన నేను, నా వలన నీవు ఇద్దరం పాపులమైనాము. నీ కోపాన్నంతా నాపైన చూపకు. నిన్ను పోగొట్టుకొని, నన్ను నేను పోగొట్టుకుని, ఈ ఆనందలోకాన్ని పోగొట్టుకుని ఇప్పటికే నికృష్టమైన దుఃఖస్థితిలో ఉన్నాను. దేవుని ఆజ్ఞను మీరిన పాపం నీది. దేవుని ఆజ్ఞను, నీ ఆజ్ఞనూ మీరిన పాపం నాది. న్యాయపీఠం వద్ద నీకంటే ఎక్కువగా నాకు శిక్ష విధించబడ్తుంది. దేవదేవుని ఆగ్రహం నాపైననే ఎక్కువగా ఉంటుంది"

అలా పలికి, ఆమె విలపిస్తూ మౌనం వహించింది. దీనంగా ఉన్న ఆమె వదనాన్ని చూసిన ఆదాం హృదయం కరిగింది. తన ప్రాణానికి ప్రాణమైన ఆమెను ఆ దీనస్థితిలో చూసి మనసు కలతనొందగా పశ్చాత్తాప భారంతో కుములుతున్న ఆమె అపరాధాలను క్షమించి, ఆమెను పొదివిపట్టుకుని ఇలా అన్నాడు–

"మళ్లీ అంతే! తెలిసీ తెలియక, ఆ నేరమంతా నీపై వేసుకుని, శిక్షకూడా నీవే భరిస్తానంటున్నావు. నేనుండగా ప్రభువు ఆగ్రహం నీపై ప్రవహించనీయను. ప్రార్థనలు ఆ అత్యున్నతుడిని సంతోషపరచేట్లయితే, నేనే నీకన్నా ముందు అక్కడకు వెళ్లి ఆ శిక్ష అంతా నా శిరస్సుపై పడేట్లు బిగ్గరగా ప్రార్థిస్తాను. నిన్ను ఆ దేవదేవుడు క్షమించి ఆదరించేలా నా కోరికను విన్నవిస్తాను. లే! ఒకరినొకరు నిందించుకొనడం మాని, మనుపటి ప్రేమను స్థిరపరచుకుని, కష్టనష్టాలను పంచుకుని, బరువును

తగ్గించుకుని స్థిమితపడదాం! మృత్యువు మనపై ఒకేసారి రాకుండా, నెమ్మదిగా వస్తూ మనల్ని వీలైనంత ఎక్కువకాలం బాధపెడ్తూ, మన సంతతికి, తెగకూ సంక్రమిస్తుందని నాకనిపిస్తోంది"

హృదయం నెమ్మదించగా 'ఈవ్' ఇలా పలికింది– "ఆదాం! చిన్న ప్రయోగం వికటించి నా మాటలు ఎంత విలువలేనివై తేజస్సును కోల్పోయో నాకర్థమయ్యింది. నీవు మరల పునరుద్ధరించిన స్థానంతో నాలో నమ్మకం మరల చిగురు తొడుగుతున్నది. నా మనసులో మెదుల్తున్న ఆలోచనలను దాచుకోకుండా నీకు చెబుతాను. మనకు కలగబోయే సంతానానికి ఈ శాపం సంక్రమించేట్లయితే, వారంతా మన తప్పిదం వలన మృత్యువుకు 'ఎర' అయ్యేట్లయితే, మనకు మరింత దుఃఖం కలుగుతుంది. మన నుంచి పుట్టినవారు రేపు మృత్యువుకు అశనమయ్యేట్లయితే, వారిని పుట్టకుండా ఆపడం నీవల్లనే కాగలదు. నీవు సంతానం లేకుండానే ఉండిపోవచ్చును. నిరాశపడ్డ మృత్యువు మనిద్దరిని కబళించి తన ఆకలి తీర్చుకుంటుంది. అది కష్టమని నీవు భావించినా, నాతో మాట్లాడుతూ, చూస్తూ, ప్రేమిస్తూ, కౌగిలించుకుంటూ, శృంగారానికి దూరంగా ఉండలేమని భావించినప్పుడు, మనకు సంతానం కలిగి వారందరూ మనతోపాటు శాపగ్రస్తులై నశించేందుకు బదులుగా మనిద్దరమే మృత్యువును ఆహ్వానిద్దాం. మృత్యువు కనిపించకపోతే మనమే అతని ప్రాంగణంలోకి అడుగుపెడ్దాం. భయంతో ఇలా క్షణక్షణం వణికే బదులు, మరణించేందుకు ఉన్న అనేక మార్గాల్లో సులువైనది, అందుబాటులో ఉన్నదీ ఎన్నుకొని రాబోయే విధ్వంసాన్ని విధ్వంసంతో ధ్వంసం చేద్దాం!"

ఆమె అలా మృత్యువు గురించి మాట్లాడ్తున్నపుడు ఆమె లేతబుగ్గలు తెల్లగా పాలిపోయినవి. ఆదాం ఆమె మాటలను అంగీకరించక ఇలా పలికినాడు–

"ఈవ్! నీ మాటల్లో పైకి కనిపిస్తున్న దానికన్నా లోతైన అంతరార్థం ఉన్నట్లు నాకనిపిస్తున్నది. జీవిత సుఖాలను, ఆనందాలను తిరస్కరించడం ఉచితమే అయినా ఆత్మహత్య, స్వనాశనం అంత మంచిది కాదని నా అభిప్రాయం. నీ తిరస్కారమంతా మనం పోగొట్టుకున్న ఆనందాన్ని గురించే అనుకుంటున్నాను. దేవదేవుడు విధించిన శిక్షను అనుభవించకుండా దగ్గర దారిగా భ్రమించి మృత్యువు నాహ్వానించినంత మాత్రాన మనం ఆ శిక్ష నుంచి తప్పించుకోలేము. మన శిక్షలో భాగంగా మన సంతానం ఆ దుష్టసర్పాన్ని తలపై మోది గాయపరుస్తారు. అది మనం ప్రతీకారం తీర్చుకునే భాగమే. మనం మరణించినా, సంతానాన్ని కనకపోయినా ఆ అవకాశాన్ని కోల్పోతాము. అందుచేత హింసను, వంధ్యత్వాన్ని తలపోసి మనకున్న ఆశను పోగొట్టుకోవద్దు. అవి మనలో గర్వాన్ని, పగను, అసహనాన్ని, ఈర్ష్యను పెంపొందించి

దేవునిపై నిర్లక్ష్యాన్ని కలిగిస్తాయి. ఆతని న్యాయపుకాడి మన భుజాలపై మోపబడుతుంది. నీకు తెలుసు ఆతడు మనతో ఎంత మన్నన మర్యాదలతో మాట్లాడి మనపై తీర్పు చెప్పినాడో! అది ద్వేషంతోనో, ఆగ్రహంతోనో విధించిన శిక్షకాదు! నీకు ప్రసవవేదన హెచ్చించినా, అంత బాధ తర్వాత జనించే సంతానం వల్ల కలిగే ఆనందం ఇంకెన్నోరెట్లు ఉంటుంది కదా!

నా శిక్ష శారీరక శ్రమతో జీవించమని. ఆ శ్రమతో స్వేదంతో రొట్టెను సంపాదించుకోమని. దానిలో కష్టమేముంది? తప్పేముంది? సోమరితనం తప్పు. మనం చలికి, ఎండకు తట్టుకునేలా దేవుడు మనకు వస్త్రాల్ని స్వయంగా తొడిగాడు. ఇంత చేసిన వాడు మన ప్రార్థనలను విని, మన కష్టాల నాలకించి కరుణించకుండా ఉంటాడా? అతడే మనం ఎండకు, వానకు, ఉరుములకు, పిడుగులకు, మంచుకు, వడగళ్లకు, తుఫానుకు తట్టుకునే తరుణోపాయాలు తట్టేలా చేస్తాడు. అదిగో చూడు. అప్పుడే వాతావరణంలో మార్పు వస్తోంది. వాయువులు వేడిగా వీస్తూ వృక్షాల కిరీటాలను ఊగిస్తున్నవి. మనం ఇక్కడకన్నా మంచి మరుగు, రక్షణ ఉన్న చోటుకు వెళ్లవలసి వచ్చేట్లుంది. రాత్రి శీతలంగా మారి కాళ్లూ చేతులూ కొంకర్లుపోతున్నాయి. చలి నుంచి కాపాడుకోడానికి రెండు దేహాల్నో, రెండు రాళ్లనో రాపాడించి, నల్లమబ్బులు ఢీకొనగా మెరుపులుద్భవించినట్లు, రెండు ఎండుకట్టెల్ని రాపిడి చేస్తే– గాలి మండి నిప్పు పుట్టి, మన చలిని దూరం చేస్తుంది. మన తప్పుల వల్ల ఏర్పడిన చెడు సంగతుల్ని మనమే తొలగించాలి.

మన ప్రార్థనలను విని ఆతడు కరుణతో మనలను రక్షిస్తూ మనం మట్టిలో కలిసేంతవరకు మన అండగానే ఉంటాడు. మనకిచ్చిన ప్రాంతాన్ని రక్షించుకుంటూ, ఆతని చెంత మన తప్పుల్ని ఒప్పుకుని, ఆతని క్షమాభిక్ష కోరుతూ, కన్నీళ్లతో నేలను కడుగుతూ, మన దుఃఖంతో కూడిన నిట్టూర్పులు ఆకాశానికెగుస్తుండగా, పశ్చాత్తాపంతో, అనుతాపంతో దుఃఖాన్ని ప్రకటిస్తూ, వినయవిధేయతలతో ఆతనిని సేవిద్దాం. ఖచ్చితంగా ఆ కరుణామయుడు మనల్ని క్షమించి ప్రశాంతచిత్తుడై కనికరిస్తాడు. తన కృపాకటాక్ష వీక్షణాలతో, దయతో, ప్రేమతో, మనల్ని ఆదరిస్తాడు."

అలా మన తండ్రి 'ఆదాం', మాత 'ఈవ్' తమ పశ్చాత్తాపాన్ని ప్రకటించి, దేవుడు తీర్పుచెప్పిన ప్రదేశం వేపు వెళ్లి, సాగిలపడి మొక్కి భక్తితో, వినయంతో వారిద్దరూ తమ తప్పుల్ని ఒప్పుకుని, క్షమాభిక్షను అర్థించారు. వాళ్ల కన్నుల నుండి జారిన కన్నీరు నేలను తడిపి ప్రవహించగా, వారి నిట్టూర్పులు ఆకాశానికెగయగా, పశ్చాత్తాపం చెందిన హృదయాలతో, దుఃఖాన్ని ప్రకటిస్తూ వినయవిధేయతలతో వారు చేస్తున్న ప్రార్థనలను ఆ దేవదేవుడు ఆలకించాడు.

11. భవిష్యద్దర్శనం

దైవకుమారుడు ఆదిమానవజంట ప్రార్థనలను దేవదేవునికి విన్నవించాడు. ప్రార్థనలను స్వీకరించిన దేవదేవుడు మానవులు పారడైజ్‌లో ఉండే అర్హతను కోల్పోయారు కనుక వారిని అక్కడ నుంచి పంపివేయవలసిందిగా చెప్పి ఆ కార్యనిర్వహణకై మైఖేల్ (Michael) ను దేవదూతలను పంపుతాడు. దేవదేవుని ఆజ్ఞను శిరసావహించి మైఖేల్ పారడైజ్‌కు వచ్చి భవిష్యత్ సంఘటనలను వివరించేందుకు వస్తుండగా ఆదాం అతని రాకను గమనించినవాడై స్వాగతిస్తాడు. దేవదూత వారు పారడైజ్ నుంచి వెళ్లిపోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలుపగా ఈవ్ దుఃఖిస్తుంది. ఆదాం బతిమలాడ్తాడు కాని సమాధానపడతాడు. మైఖేల్ ఆదాంను ఒక ఎత్తైన కొండవద్దకు తీసుకువెళ్లి, అతని కనుల ముందు ఆరోజు నుంచి జలప్రళయం వచ్చేవరకూ ఏమి జరగనున్నదో దర్శనం (Vision) చేయిస్తాడు.

అలా వారు పశ్చాత్తాపంతో నిండిన హృదయాలతో ప్రార్థించగా శిలాసదృశంగా మారిన జగత్ప్రభువు మనసు కరిగింది. ప్రార్థనారూపమైన ఆత్మ వడివడిగా స్వర్గానికి వెళ్లి ప్రభువు ముందు నిలబడింది. పాత కథలలో చెప్పుకునే విధంగా థెమిస్ (Themis) దేవాలయం ఎదుట నిలబడి జలప్రళయంలో మునిగిపోయిన మానవజాతిని పునరుద్ధరించమంటూ డ్యుకాలియన్ (Deucalion), పైర్రా (Pyrrah)లు భగవానుని వేడుకున్న సంఘటనకన్నా, ఆదాం, ఈవ్‌ల ప్రార్థనలు గాఢంగా తీవ్రంగా ఉండినవి. ఆ ప్రార్థనలు సరాసరి స్వర్గద్వారాలను దాటి స్వర్ణ పూజాపీఠం వద్ద సుగంధభరితమై దైవకుమారుని చేరగా ఆతడు భక్తితో వాటిని దేవదేవునికి సమర్పించినాడు.

"తండ్రీ! జగదానందకారకా! మానవునిలో మీరుంచిన కరుణ ఈరోజు ఫలించి ప్రార్థనల రూపాన సుగంధ పరిమళభరితమై ఇక్కడకు రాగా మీ పూజారినైన నేను మీకీ ఫలాలను సమర్పిస్తున్నాను. పారడైజ్‌లోని అన్ని ఫలాలకన్నా ఇవి దివ్యమైనవి. మానవుని ప్రార్థనలను అతని అనువాదకుడిగా, మధ్యవర్తిగా నేను మీకు అందజేస్తాను. అతని పాపాలను నేను నా మృత్యువుతో శుద్ధిచేస్తాను. కావున తండ్రీ! వీటిని స్వీకరించి శాంతినొంది, మానవుడి జీవన దినాలు లెక్కింపబడగా, ఆతనికి మృత్యువు సంభవించేంత వరకు మంచి జీవితాన్నివ్వండి. నా పునరుత్థానంతో విముక్తులైన మానవులందరూ నాతోకలిసి పరమానందాన్ని పొందగలరు. వారే నేను, నేనే వారు గనుక తండ్రీ, మమ్మల్ని అనుగ్రహించు!

దానికి జగత్పిత ప్రశాంతవదనంతో సమాధానమిచ్చాడు– "కుమారా! నీ విజ్ఞాపన, మానవుల కోసం నీ తపన నేను గ్రహించాను. నీవు చెప్పిన విషయాలే నా శాసనంగా మారును గాక! కాని వారు పారడైజ్‌లో ఉండలేరు. ప్రకృతికి నేనిచ్చిన ఆజ్ఞ దానిని ఒప్పుకోదు. స్వచ్ఛమైన, కల్మషరహితమైన మూలకాలున్న ఆ ప్రదేశం పాపపంకిలమైన వారిని అక్కడ నుంచి నెట్టివేస్తుంది. పాపంతో నిండిన వారిప్పుడు నశించే ఆహారాన్ని మాత్రమే తీసుకుని జీవించగలరు. వారు తొలుదొల్త సృష్టించబడినప్పుడు ఆనందము (Happiness), అమరత్వము (Immortality) వరాలుగా, కానుకలుగా ఇచ్చాను. వారు వాటిని పోగొట్టుకుని శాశ్వత దుఃఖాన్ని స్వీకరించారు. మృత్యువే వారికి ఆఖరి చికిత్స కాగలదు. జీవితాన్ని కఠినపరీక్షలతో సానపరచుకుని, విశ్వాసంతో, సత్కార్యాలతో జీవించినప్పుడు, స్వర్గ భూలోకాల్లోని పాపం, మృత్యువు నశించగా రెండులోకాలు ఒక్కటైన వేళ వారికి ద్వితీయజీవనం పరమానందకరమైనది అనుగ్రహించబడ్తుంది. ఇప్పుడు మనం దేవదూతలను సమావేశపరచగా వారి ముందే నేను నా తీర్పును ప్రకటిస్తాను. అది దేవదూతలలో ఈ మధ్యవచ్చిన 'రుజ'ను నిలువరించి దృఢంగా ఉంచగలదు" – దేవదేవుని మాటలను స్వీకరించిన దైవకుమారుడు సంజ్ఞ చేయగానే దేవదూత సమావేశం ప్రారంభం కావడానికి సూచనగా కొమ్ముబూరను ఊదినాడు. ఓరెబ్ (Oreb) లో మరల నినదించిన ఆ శబ్దాన్ని విన్న దేవదూతలు స్వర్గం నలుదిక్కుల నుండి వచ్చి అక్కడ సమావేశమైనారు. అమరాంతైన్ (Amarantine) నీడలలో, ఆనందపు పొదరిళ్లలో, జీవజలధారాల వద్ద, సెలయేర్ల వద్ద, నీటిబుగ్గల వద్ద, సంతోషసౌభాగ్యాల మధ్య ఆ మహోన్నతుడిని స్తుతిస్తూ ఆనందించే సమస్త దేవదూతలూ సమావేశస్థలికి విచ్చేసినారు. వారి ముందు దేవదేవుడు తన శాసనాన్ని వివరించినాడు.

"కుమారులారా! మనలానే మానవుడు కూడా మంచీచెడుల మధ్య వ్యత్యాసం తెలుసుకునే గుణాన్ని సంపాదించుకున్నాడు. అయితే ఆతడు మంచిని మరచి చెడుపైననే తన దృష్టిని నిలపడంతో దుఃఖం ఆతనిని పీడిస్తున్నది. పశ్చాత్తాపంతో ఆతడు క్షమాభిక్ష కోసం అర్థిస్తున్నాడు. కాని ఆతని హృదయంలో కోరికలు తీవ్రమైతే, ఆతని చేయి జీవవృక్షాన్ని అందుకునిగా, ఆ ఫలాన్ని రుచిచూసి మానవుడు అమరుడు కాగలడు. ఆ పరిస్థితి రాకుండా నేనతనిని పారడైజ్ నుంచి బహిష్కరిస్తున్నాను.

మైఖేల్! నీవు మరికొంతమంది జ్వాలాయుధపాణులైన దేవదూతలను వెంట నిడుకుని పారడైజ్‌కు వెళ్లు. పారపాటున సాతాను వేరే కుయుక్తులు పన్నినా ఎదుర్కొనేందుకు తగిన జాగ్రత్తలు తీసుకో! త్వరగా వెళ్లి పారడైజ్ నుంచి ఆ జంటను అక్కడ నుంచి తరిమివేయి. వారికి నా శాసనాన్ని వినిపించు. వారు తీర్పును

అంగీకరించి దుఃఖంతో మూర్ఛిల్లి, కన్నీళ్లతో తమ పాపాల్ని ప్రక్షాళన చేసుకుని హుందాగా ప్రవర్తిస్తే వారిని అనునయించు. ఆదాంకు భవిష్యత్ దర్శనాన్ని కలుగజేసి, నాతో 'ఈవ్' కుమారులకుండే ఒప్పందాన్ని తెలిపి వారిని అక్కడ నుంచి ప్రశాంతంగా పంపివేయి. ఈడెన్ వనానికి తూర్పున వున్న ప్రాంతంలో నిరంతర పహారాను ఏర్పాటు చేసి, జ్వాలాఖడ్గం వలయంలా తిరుగుతూ ఆ ప్రాంతాన్ని ఎవరూ చొరరానీకుండా ఉండేట్లుచేయి. జీవవృక్షమున్న ప్రాంతానికి వెళ్లే దారులన్నింటినీ దిగ్బంధం చేసి పారడైజ్‌లోకి ఎటువంటి దుష్టాత్మ ప్రవేశించకుండా గట్టిచర్యలు తీసుకో! పాత సంఘటనలు పునరావృతం కారాదు"

దేవదేవుని ఆజ్ఞలను విన్న మైఖేల్ వెంటనే సాయుధులైన దేవదూతలను తీసుకుని పారడైజ్‌కు వేగంగా బయల్దేరినాడు. ఆ దేవదూతలు చతుర్ముఖులై, ఇద్దరు జానస్ (Janus) దేవతల్లా, ఆర్గస్ (Argus)కన్నా అధికంగా ఉన్న నేత్రాలతో, జాగరూకులై, ఆర్కాడియన్ వాద్యాలతో (Arcadian Pipes), హెర్మెస్ చేతిలోని వేణువులా (Pastoral reed) ఉన్నవాటితో ప్రకాశిస్తున్నారు.

ఇంతలో ప్రపంచాన్ని స్వాగతిస్తూ తూర్పు ముఖద్వారాన ల్యూకొథియా (Leucothia) పవిత్రమైన వెలుతురుగా ప్రత్యక్షమైంది. మంచు బిందువులు స్వచ్ఛంగా తళతళ లాడుతుండగా, దుఃఖం ఉపశమనం కాగా, ధైర్యంతో, కొత్తఆశలతో, నిరాశ మధ్య ఆనందంతో, భయంతో కలగలిసిన భావాలు వెంటరాగా ఆదాం, ఈవ్‌తో ఇలా పలికాడు– "ఈవ్! నమ్మకం, విశ్వాసం మనకున్న మంచి గుణాలు. మంచి మనసుతో చేసే ప్రార్థన, క్షమాభిక్ష కోరుతూ విడిచే నిట్టూర్పూ, పాపాలను ప్రక్షాళన చేసే కన్నీటిచుక్కా ఆ దేవదేవుని అత్యంత శీఘ్రంగా చేరుకుని విశ్వాసుల మనోవేదనను వెల్లడిస్తాయి. మన ప్రార్థనలను ఆతడు అంగీకరించి ప్రశాంతవదనుడైనట్లు నాకు గోచరించింది. నా హృదయంలో శాంతి నెలకొన్నది. నీ సంతానం ఆ దుష్ట సర్పాన్ని తలపై మోది గాయపరుస్తారన్న మాట నాకు జ్ఞప్తికి వచ్చినది. ఇప్పుడు నాలో మృత్యువంటే భయం, ఏవగింపు లేవు. మనం ఇంకొన్నాళ్లు జీవిస్తాం. అందుచేత 'ఈవ్'! మానవజాతి ఆదిమాతా! జీవకోటికి తల్లివైన అవ్వా! ఈవ్! నీ వలన మానవుడు జీవిస్తాడు, మిగతావన్నీ మానవుని కొరకు జీవిస్తాయి."

ఈవ్ విచారవదనంతో నెమ్మదిగా పలికింది– "నేనటువంటి మంచి పదానికి తగను. నీకు సహాయం చేయాల్సిన నేను, నీ పతనానికి ఉచ్చులా ఉపయోగపడ్డాను. అపనమ్మకం, తెగడ్తలు నా పాదముద్రలై అనంతకాలం ఆతని కరుణావాహిని కోసం ఎదురుచూస్తుంటాయి. అందరి కుత్తుకలపైకి మృత్యువును తెచ్చిన దానిని, జీవకోటికి తల్లిగా ఎలా మనగలను! ఇంకేదైనా పేరైతే బాగుంటుందేమో! ఉదయవేళలో మనం

చేయాల్సిన పనులను చేద్దాం. నిద్రలేని రాత్రి మనల్ని బాధపెడ్తున్నా ఉదయకాంతి చిరునవ్వులు మన అలసటను పోగొడ్తాయి. ఇకమీదట ఎన్నడూ నిన్ను విడిచివెళ్లను. ఇక్కడే ఇద్దరం కలిసి పనిచేస్తూ శాపోహతులమైనా సంతృప్తిగా కాలం గడుపుదాం!"

'ఈవ్'కు తెలీదు తాము ఇక్కడ ఉండే సమయం ఎక్కువ లేదని, ప్రకృతిలో కనిపించిన ప్రళయకాలపు మార్పులు పక్షుల్ని, జంతువుల్ని, గాలిని ప్రభావితం చేయసాగాయి. ఉదయకాలం కొద్దిగా గడచినాక తూర్పు ఆకాశం నుండి ఓ గరుడపక్షి (Bird of Jove), తనముందు మరో రెండు పక్షులు ఎగుర్తుండగా దూసుకువచ్చింది. లేళ్లజంటను (Hart and Hind) వేటాడబోతున్న వనరాజు సింహంలా అవి పారడైజ్ తూర్పు ద్వారం వద్దకు వెళ్లాయి. ఆ పక్షుల గమనాన్ని వీక్షిస్తున్న ఆదాం తన సహచరి 'ఈవ్'తో ఇలా అన్నాడు.

"ఈవ్! ఇంకేదో ఊహించని మార్పు మనకోసం ఎదురుచూస్తున్నది. స్వర్గలోకపు ఉద్దేశం ప్రకృతిని ప్రభావితం చేయగా కనిపిస్తున్న సూచనలు మనల్ని కొంతకాలం మరణానికి దూరం ఉంచేట్లు అగుపిస్తున్నాయి. ఎంతకాలం, ఎలా ఈ జీవితం గడుస్తుందో ఎవరికి తెలుసు? చివరకు మట్టిలో కలిసిపోవడం మాత్రం తథ్యం. అవిగో చూడు! గాలిలో, నేలపై కనిపిస్తున్న పెనుమార్పులు. తూర్పున ఆవరించిన చీకటి, పశ్చిమ మేఘాలపై ప్రతిఫలిస్తున్న ఉదయకాంతి, నీలి ఆకాశంపై తెల్లని కాంతిపుంజం క్రమేపీ క్రిందకు దిగుతూ దివ్యరూపంలో వస్తున్నది"

ఆదాం భ్రమపడలేదు! సూర్యకాంతిమణిలా మెరుస్తున్న ఆకాశం (Sky of Jasper) నుంచి పారడైజ్‌లోని కొండపై ప్రత్యక్షమైన దివ్యపురుషుని దర్శనం (Apparition) ఆదాం కళ్లను మిరుమిట్లు గొలిపింది. ఆ దర్శనం జాకబ్ (Jacob) మహానైమ్ (Mahanaim) లో దేవదూతలను కలుసుకున్నప్పటి ప్రకాశవంతమైన దృశ్యం కన్నా, సిరియన్ చక్రవర్తి (Syrian king) తన శత్రువుపై దండెత్తినపుడు డోథాన్ (Dothan) లో చూసిన మండుతున్న శిఖరం కన్నా ప్రకాశవంతంగా ఉండింది. అలా వచ్చిన మైఖేల్ ఈడెన్ వనాన్ని తన అధీనంలోకి తీసుకుని తానొక్కడే ఆదాం, ఈవ్‌లు ఉన్న ప్రదేశానికి బయల్దేరినాడు.

అతడు వస్తుండడం గమనించిన ఆదాం, ఈవ్‌తో ఇలా అన్నాడు. "ఈవ్! కొత్త అలలు, కొత్త శాసనాలు వస్తున్న సూచనలు ఇవిగో! నేను ఇందాక నీతో చెప్పిన, ప్రకాశవంతమైన మేఘం బహుశా ఉన్నత బాధ్యతలను నిర్వర్తించే దేవలోకపు అధికారి మైఖేల్ (Michael) కావచ్చును. నేనాతనిని ఆహ్వానిస్తాను. నీవు వెళ్లి విశ్రాంతి తీసుకో!"

ఇంతలో మైఖేల్ (Michael) మానవరూపంతో ఆదాం ఎదుటకు వచ్చినాడు. దేవలోకపు సైన్యాధిపతి ధూమ్రవర్ణపు (Purple) దుస్తులను ధరించి అవి మెలిబోయయన్ (Meliboean) అంగీలను మించి కాంతులీనుతుండగా, సార్రా రేణువుల (Grain of Sarra) కన్నా సుందరమై ఒప్పుచుండగా, ఇంద్రధనుస్సు రంగులు కలబోసిన నేతతో ప్రకాశిస్తుండగా, నక్షత్రాలు అలంకరించబడిన శిరస్త్రాణాన్ని చేతబట్టుకుని, గగనమేఖల రాశిచక్రం (Zodiac) లా తన పక్కన వేలాడుతున్న ఖడ్గంతో, చేతిలో పెద్దబల్లెంతో, హుందాగా నిలబడగా, ఆదాం అతనికి నమస్కరించినాడు.

"ఆదాం! దేవలోకపు శాసనానికి ఉపోద్ఘాతం అవసరం లేదు. నీ ప్రార్థనలను దేవదేవుడు మన్నించాడు. నీకు విధించబడిన మరణశిక్ష అనేక కారణాల వల్ల వాయిదా వేయబడింది. ఆ సమయాన్ని పశ్చాత్తాపంతో సద్వినియోగం చేసుకో! ఒక పొరపాటును సరిదిద్దేందుకు అనేక మంచిపనులు చేయవలసి రావడం సహజమే! నీ వేదనను మన్నించి, దేవదేవుడు మృత్యువునుంచి నిన్ను విడుదల చేయించవచ్చును. కాని ఇక నుంచి నీవిక్కడ ఉండేందుకు వీలులేదు. నిన్ను ఇక్కడ్నుంచి పంపివేయడానికే నేను రావలసివచ్చింది. 'ఈడెన్' వనం నుంచి నీవు బయటకుపోయి అక్కడ శ్రమపడగలవు"

ఆ మాటలు వినగానే ఆదాంకు నిలువెల్లా చలి వ్యాపించి, హృదయం వణికి దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించింది. కనబడకుండా దూరంగా ఉండి ఆ మాటలను విన్న 'ఈవ్' బిగ్గరగా రోదనలు చేయసాగింది.

"అనుకోని విపత్తు! మృత్యువుకన్నా భయంకరమైనది! ఈ పారడైజ్‌ను వదిలి వెళ్లవలసిందేనా! నా మాతృభూమిని, ఈ అందాల వనాన్ని, దేవతలు తిరుగాడే అద్భుతమైన పూలతోటను వదిలి నేనెక్కడకు పోను? మరణించేంత వరకైనా ఇక్కడ గడపవచ్చని తలపోసానే! నా ఆశలన్నీ అడియాసలేనా! ఇక మాకు మృత్యువు తథ్యం. ఓ పూలగుత్తులారా! ఓ లతలారా! మిమ్మల్ని ఈ చేతుల్తో పెంచానే! మొగ్గతొడిగినప్పటి నుంచి మీకు నామకరణం చేసి నా కన్నబిడ్డల్లా చూసుకున్నానే! ఇప్పుడు మిమ్మల్నెవరు ఎండవేపు మారుస్తారు? ఎవరు మీకు నీటిబుగ్గ నుంచి నీరు తెచ్చి పోస్తారు? మా పొదరింటి గృహమా! నిన్ను పరిమళ సుగంధపుష్పాలతో పత్రాలతో అలంకరించేదానినే! నిన్ను విడిచి ఎక్కడికిపోను? ఏ అధోలోకంలో దారీ తెన్నూ లేకుండా తిరగగలను? అమృతతుల్యమైన ఈ ప్రాణవాయువుల్ని పీల్చిన మేము ఇతర గాలుల్నెలా స్వీకరించగలము? అయ్యో! హతవిధీ! ఏమిటి మాకీ దురవస్థ!"

అలా వాపోతున్న ఈవ్‌ను దేవదూత వారించాడు–

"దుఃఖించకు ఈవ్! సహనంతో రాజీపడు. నీవు కోల్పోయినదాని విలువను గ్రహించు. నీదికాని దానిపై ఆశలు పెంచుకోకు. నీవొక్కదానివే ఈ వనం నుంచి పోవడం లేదు. నీకు తోడుగా నీ భర్త ఉన్నాడు. అతనెక్కడున్నాడో ఆ చోటే నీకు మాతృభూమి కాగలదు"

ఆదాం తానున్న దుర్భర శీతలపరిస్థితి నుంచి తేరుకుని చెదరిన మనస్సును కూడగట్టుకుని మైఖేల్‌తో వినయంగా పలికాడు.

"అత్యున్నతమైన దివ్య పదవిలో ఉన్న రాకుమారులలోకెల్లా ఉత్తముడైన రాకుమారుడా! భగవత్ సందేశాన్ని మీరు మాకు తెలిపియున్నారు. దుఃఖం, నిరాశ, నిరుత్సాహం మాలో ప్రవేశించి మమ్మల్ని ఖిన్నులను చేస్తున్నవి. ఈ అందాల వనం తప్ప ఇంకేమి తెలియని మాకు ఇక ఏ ప్రదేశమైనా ఒక్కటే! ఒకవేళ ఎడతెగని ప్రార్థనలు ఆ దేవదేవుని మనసును కరిగించేట్లయితే నేను అలానే చేస్తాను. మానవుని ఉచ్ఛ్వాసం ఎదురుగాలికి వెనక్కిమళ్లినట్లు జగత్‌ప్రభువు శాసనం ముందు ప్రార్థన ఎదురు నిలవగలదా! అందుచేత ఆతని ఆజ్ఞను నేను శిరసావహిస్తాను. నన్ను అమితంగా బాధిస్తున్నది. నేను కోల్పోయిన ఆతని సన్నిధి. ఈ తోటలో దేవదేవుడు అప్పుడప్పుడూ కనిపిస్తూ నాతో మాట్లాడి నా పూజలందుకునేవాడు. ఆ దివ్య సుందర ముఖారవిందం నాకు ఇంకెప్పుడు కనిపిస్తుందో కదా! దేవదేవుడు ఈ కొండపై నాకు దర్శనమిచ్చాడు. ఈ చెట్టు కింద కనిపించాడు, ఈ పైన్ వృక్షాల మధ్య నుంచి ఆతని స్వరాన్ని నేను వినేవాడిని, ఈ జలపాతం వద్ద, ఈ నీటిబుగ్గ వద్ద ఆతనితో మాట్లాడాను– అని నా సంతానానికి చెప్పుకునే భాగ్యం లేదుకదా! ఈ పచ్చికమైదానంలో ఎన్నో పూజాపీఠాలను ప్రతిష్ఠించాను. సెలయేటి నుంచి గుండ్రాళ్లను పోగుచేసి కాలానికి గుర్తులు వేశాను. సుగంధ ద్రవ్యాన్ని, జిగుర్లను, ఫలపుష్పాలను సేకరించి దేవదేవుని ఆరాధించాను. వేరేచోట ఆతని పదముద్రలు నాకెలా లభ్యమవుతాయి? ఆతని సుందరరూపము నాకెలా కనిపిస్తుంది? ఆతని నుంచి పారిపోయినా, నన్నాతడు పిలిచి నా జీవన కాలాన్ని పెంచి, మానవజాతిని పెంపొందించేలా నన్ను ఆశీర్వ దించినాడు. నేనిప్పుడు కడుదూరం నుంచే ఆతని కీర్తిప్రకాశాన్ని వీక్షించి ధన్యత చెందుతాను"

ఆ మాటలు విని మైఖేల్ ఇలా అన్నాడు– " ఆదాం! నీకు తెలుసు ఆ సర్వవ్యాపకుడు ఈ ఒక్క గుట్టపైననే కాదు, భువి, భూమి, నేల, నీరు, గాలి, సముద్రాలపై, సర్వజీవకోటిపైన తన శక్తిని, వెచ్చని ప్రేమను ప్రసరిస్తాడు. నీకు ఈ భూలోకాన్ని సృజించి ఇచ్చి దానికి అధిపతిగా చేసాడు. ఈడెన్ వనం, పారడైజ్ మాత్రమే నీ లోకానికి హద్దులు కావు. బహుశా దీనిని నీ రాజధానిగా ఆతడు

తలపోసి ఉండవచ్చును. ఇక్కడి నుంచి నీ సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరిగి ఈ భూమిపై వ్యాపించి సృష్టికర్తను శ్లాఘిస్తారని, ఈ లోకాన్ని ప్రభు ఆజ్ఞలకు లోబడి పరిపాలిస్తారని భావించి ఉంటాడు. కాని మీ తప్పిదం వల్ల ఈ అందాలవనం నుంచి మైదానాల్లోకి పోవాల్సి వస్తున్నది. అయితే ఒక్క విషయం గుర్తుంచుకో! ఈడెన్ వనంలో ఉన్నట్లే ఆ భగవానుడు నీవు వెళ్తున్న మైదానంలోనూ ఉంటాడు. నీకు అండగా ఉంటూ నిన్ను పుత్రప్రేమతో మన్నిస్తూ తన కరుణాదృక్కులతో నిన్ను కటాక్షిస్తూ తన అడుగుజాడల్ని నీకు తెలియబరుస్తాడు.

నన్ను ఆ దేవదేవుడు నీకు భవిష్యద్విషయాలు తెలుపమని, నీకూ, నీ సంతతికి జరగబోయే మంచీ చెడూ నీవు గ్రహిస్తావని పంపినాడు. మానవుల పాప ప్రవర్తన దేవదేవుని కరుణతో పోటీపడగా, మానవులు నిజమైన సహనాన్ని అలవరచుకుని, ఆనందాన్ని భయ దుఃఖాలతో బేరీజు వేసుకొని, కష్టసుఖాల్ని సమస్థితిలో అనుభవిస్తూ జీవితాన్ని క్రమపద్ధతిలో నడుపుకుంటూ అంతిమ క్షణాలు ఎదురైనప్పుడు ఎటువంటి భయం లేకుండా ఎదుర్కొంటారు. నాతోరా! ఈ గుట్టను అధిరోహించు! 'ఈవ్' నిద్రలోకి జారుకునేలా చేసాను. నీవు నిద్రలో ఉన్నపుడు ఆమెను సృష్టించి జీవమిచ్చినట్లే, ఆమె నిద్రలో ఉండగా నీకు దివ్యదృష్టి ఇస్తున్నాను"

ఆదాం కృతజ్ఞతాంతరంగుడై సమాధానమిచ్చినాడు– "దేవదూతా! మార్గదర్శకుడా! నేను నిన్ను అనుసరించి స్వర్గలోకపు హస్తానికి సాగిలపడి మొక్కుతాను. క్రమశిక్షణతో కూడిన సంస్కరణల వలన బాధను అధిగమించి శాంతిని, ప్రశాంతతను పొందుతాను"

వారు పారడైజ్‌లోని ఎత్తైన కొండనెక్కి చుట్టూరా చూడగా– అటువంటిదే మన రెండవ ఆదాం (Second Adam) జనసంచారం లేని ఎడారిలో (Wilderness) ఉన్నపుడు సాతాను (Satan the tempter) సమస్త రాజ్యాలను ఇవ్వగలనని ప్రలోభపెట్టజూసినాడు. కథయన్ కాన్ (Cathian Can) అనబడే చైనా గోడల లోపలి కంబాలు నగరం (Cambalu), ఆక్జస్, టెమిర్స్ (Oxus, Temirs) ల సమర్ఖండ్ (Samarkhand), సినోయన్ రాజుల (Sinoean Kings) పాక్విన్ (Paquin); మొఘల్ సుల్తానుల ఆగ్రా, లాహోర్‌లు (Agra, Lahore), ఎక్బతన్ (Ecbatan)లో బంగారు ద్వీపకల్పం (Chersonese), పర్షియన్ సామ్రాజ్యం (Persian), హిస్పహన్ (Hispahan)లో లేదా రష్యా జార్ (Tsar) చక్రవర్తుల మాస్కో (Masco), తుర్కెస్తాన్‌లోని బైజాన్స్ (Bizance of Turkistan), నెగస్ (Negus) రాజ్యంలోని ఎర్కొకొ (Ercoco) రేవు పట్టణం, మొంబాజా (Mombaza), క్విలోవా (Quiloa), మెలిండ్ (Melind), సొఫాలా (Sofala) ఒఫిర్ (Ophir),

కాంగో (Congo), అంగోలా (Angola) దక్షిణానికి, నైగర్ వరదప్రాంతం (Niger) నుంచి అట్లాస్ పర్వతం (Atlas Mount) వరకూ, అల్మాన్సర్ (Almansor), ఫెజ్ (Fez), సుస్ (Sus), మొరాకొ (Marocco); ఆల్జీర్స్ (Algeirs), ట్రెమిసన్ (Tremisen); యూరప్‌లో రోమ్ (Rome); మాంటెజుమా రాజ్యమైన (Montezuma) మెక్సికో (Mexico), పెరు (Peru)లోని కస్కో (Cusco) – అతాహుల్పా (Atahalipa) రాజ్యం; గెర్యాన్ల కుమారులచే (Geryon) ఎల్‌డొరాడో (El Dorodo)గా పిలువబడ్డ గయానా (Guiana) ప్రాంతం – ఇలా అనేక నగరాలు, సామ్రాజ్యాలు కనిపించి అదృశ్యమై మరల కనిపించసాగాయి.

జ్ఞానఫలం తినినందువల్ల ఆదాం కళ్లు తెరచుకుని కళ్లపై కప్పిన పొరను మైఖేల్–యూఫ్రసీ (Euphresie), ర్యూ (Rue) ఔషధాలతో తొలగించి కంటినరంపై జీవపు బావినీటిని (Well of life) మూడుచుక్కలు చల్లగా వాటి లోకాతీత శక్తికి అంతర్నేత్రం తెరచుకున్నది. ఆదాం కళ్లు మూతలు పడి కూలబడగా దేవదూత తన సుకుమార హస్తాలతో ఆతనిని లేవనెత్తి ఇలా అన్నాడు–

"ఆదాం! ఇప్పుడు నీవు కళ్లు తెరువు. ఇప్పుడు నీవు నీ పాపకార్యం వలన జనించే కాలుష్యపు హింసాత్మక చర్యలను చూడగలవు"

ఆదాం కళ్లు తెరిచిచూసాడు. ఆతని కళ్లముందు ఒక పొలం సగభాగం దున్నబడి, సేద్యయోగ్యమైనది; మిగతా సగభాగంలో గొర్రెలమందల అడుగుజాడలు నిండి, రెండింటి మధ్యలో పూజాపీఠం (Altar) ఉన్నది. పొలం నుండి ఒక సేద్యగాడు ఫలాల్ని, ఆకుపచ్చని ధాన్యపు వెన్నుల్ని, పసుపురంగు పనల్ని చేతికందినవి అందినట్లు తెచ్చి పూజాపీఠంపై ఉంచినాడు. రెండవ దిక్కునుంచి ఓ గొర్రెలకాపరి తన మందలోని తొలి గొర్రెలలో బలిష్ఠమైనదానిని ఎన్నికచేసి, బలి ఇచ్చి దైవార్పణం చేసి, లోపలి భాగాల్ని, కొవ్వును, సుగంధాలతో జతచేసి, పంగల కర్రలో ఉంచి, పూజాతంతును పద్ధతిలో కావించాడు. గొర్రెలకాపరి సమర్పించిన వాటిని పైనుంచి దిగివచ్చిన పవిత్రాగ్ని భస్మంచేయగా దేవుని మన్ననలను పొందినది. సేద్యగాని సమర్పణ స్వీకరింపబడలేదెందుకంటే అతడు మనస్ఫూర్తిగా విశ్వాసంతో చేయలేదు గనుక. సేద్యగాడికి కోపం వచ్చి మాట్లాడుతూనే పెద్దరాతితో గొర్రెలకాపరి తలబద్దలు కొట్టగా ఆతడు నేలపై పడి ప్రాణాలు విడిచాడు. ఆతని గాయం నుండి కారిన రక్తంతో నేల తడిచి ఎర్రబడింది. ఆ దృశ్యాన్ని చూసి హృదయం చలించగా ఆదాం దేవదూతను ఇలా అడిగాడు– "అధ్యాపకుడా! ఏమిటీ దారుణం! దేవునికి చక్కగా సమర్పణ చేసినవాడు, మర్యాదస్తుడు, ఆతనికి జరిగిన ఈ అన్యాయమేమిటీ! స్వచ్ఛమైన భక్తికి ఇదా బహుమతి!"

మైఖేల్ కూడా ఆ దృశ్యాన్ని చూసి చలించినవాడై ఇలా అన్నాడు. వాళ్లిద్దరూ అన్నదమ్ములు; ఆదాం! వాళ్లు నీ కుమారులే! న్యాయాన్ని అన్యాయం, ధర్మాన్ని అధర్మం జయించడమంటే ఇదే! స్వర్గలోకం తన సమర్పణ (Offering)ను అంగీకరించకుండా తన సోదరుడి భాగాన్ని స్వీకరించడాన్ని భరించలేక అసూయతో భ్రాతృహత్యకు ఒడిగట్టాడు. అయినా నేరంచేసిన వాడు శిక్షింపబడతాడు, అన్యాయానికి బలై రక్తపుమడుగులో పడివున్న విశ్వాసికి దేవుడిచ్చే బహుమతి దక్కుతుంది" అన్నాడు దేవదూత.

ఆదాం అన్నాడు– "కార్యానికి, కారణానికి రెండిటికీ ఫలితం ఉంటుందన్న మాట. నేనిప్పుడు మృత్యువును చూసాను. ఇలానే నేను మరణించి మట్టిలో కలుస్తానా? మృత్యువు ఇంత భయంకరంగా ఉంటుందా! చూడటానికి ఆలోచించడానికి, స్పర్శించడానికి ఇంత దారుణంగా ఉంటుందా మృత్యువు?"

మైఖేల్ సమాధానమిచ్చినాడు– "మృత్యువు మొట్టమొదటిసారిగా మానవ రూపాన్ని రుచి చూసిందప్పుడే. మృత్యువు నడిచేదారులు, ధరించే రూపాలు అనేకం. మృత్యువు బహురూపి. అది లోనికి ప్రవేశించిన తరువాతకన్నా ప్రవేశించక ముందు మరింత భయంకరంగా ఉంటుంది. కొంతమంది నీవు చూసినట్లు హింసాఘాతం వల్ల మరణిస్తే, కొందరు అగ్ని, వరదలు, కరువుకాటకాలు, మితిమీరి తినడం, తాగడం వల్ల, వ్యాధుల్తో, ఇలా అనేక రాక్షస సైన్యరూపాలతో వచ్చిన ఉత్పాతాల వల్ల మరణిస్తారు. ఈవ్ వద్దన్న పనిచేసి తినకూడని ఫలాన్ని తిన్నందుకు వచ్చిన ఫలితం ఇది.

వెంటనే ఆదాం కళ్లముందు మరో దృశ్యం కనిపించింది. నిరుపేద రోగులు, కుష్టురోగులతో నిండి ఉన్న లాజర్‌గృహం (Lazar House) దుఃఖం, బాధ, నెప్పులు, గాయాలు, చీకట్లు కమ్మి అనేక రోగాలతో బాధపడ్తున్న అసహాయులు – కడుపునొప్పి, వెన్ననొప్పి, పార్శ్వనొప్పులతో మెలితిరుగుతూ, గుండెలు చెదరేలా మూల్గుతూ, విషజ్వరాలు, మూర్ఛరోగాలు, సన్నిపాత జ్వరాలు, పడిశెం, జలుబు, పేవుల్లో రాళ్లు, పుళ్లు, భూతప్రేత పిశాచాలు ఆవహించినట్లు ప్రవర్తించడాలు, అపస్మారకస్థితి, ఉన్మాదస్థితి, మానసిక అంటురోగాలు, జలోదరాలు, ఉబ్బసాలు, కీళ్లనొప్పులు, కాళ్లనొప్పులు – లాంటి అనేక రుగ్మతలతో బాధపడుతూ మంచంపై ఎగిరెగిరి పడుతూ, భయంకరంగా మూల్గుతూ, ముక్కుతూ, నరకయాతన పడ్తున్న వారిని విజయగర్వంతో, వికటాట్టహాసంతో పరికిస్తున్న మృత్యువు, తన చేతిలోని వాడి బాణాన్ని రోగులపై గురిపెడుతూండగా, వాళ్లు బాధలను తట్టుకోలేక ఆర్తనాదాలు చేస్తూ– 'మృత్యువా! నన్నెత్తుకుపోవా!' అని ప్రార్థనలు చేస్తుంటే – వాళ్లకు మృత్యువే ఆఖరి ఆశగా కనిపిస్తుంటే

– వాళ్లను చూస్తున్న ఏ కన్ను చెమర్చకుండా ఉంటుంది? – ఆదాం వాళ్ల దుస్థితిని చూసి వలవల ఏడ్చాడు. తల్లిగర్భాన జనించని మానవుడైన ఆదాం, భవిష్యత్ మానవ సమాజపు కష్టాలకు జాలి, దుఃఖం ముంచుకురాగా మాటలను పెగల్చుకుని ఇలా అన్నాడు.

"దురదృష్టవంతులారా! ఎటువంటి పతనం! ఎటువంటి దుస్థితి! మీరు పుట్టకుండా ఉంటేనే ఎంతో బాగుండేది కదా! ఎందుకు మా నుంచి మీకీ దుర్భర జీవితం సంక్రమించడం? ఎందుకు మీరిలా పాపభారాన బాధలు భరించడం? మన జీవితంలో ఎటువంటి విపత్తులు వస్తాయో ముందే తెలిస్తే వాటిని అంగీకరించము, వీలైతే త్యజిస్తాము. ప్రశాంతంగా మనల్ని ఉంచినందుకు సంతోషిస్తాము. దేవదేవుని రూపంలోనే సృజింపబడిన మానవుడు ఒకసారి భ్రష్టుడైతే ఇంత బాధను, కష్టాన్ని అనుభవించవలసిందేనా! ఎందుకని ఆతడికి ఈ విపత్తుల నుంచి, వికారాల నుంచి కొంత విముక్తి లభించదు?"

మైఖేల్ సమాధానమిచ్చాడు– "సృష్టికర్త రూపంలోనే సృజించబడినా మానవుడు తన ఆకలిని అణచుకోలేకపోయినప్పుడు, వాళ్లు ఎవరిని అనుసరిస్తారో, ఎవరి మాయమాటలను వింటారో వారి రూపమే వస్తుంది. ముఖ్యంగా ఈవ్ చేసిన తప్పిదం ఫలమిది. కాబట్టి ఈ వికార రూపాలు మానవుల ఆలోచనా ఫలితమే. ప్రకృతి నియమాలను ఉల్లంఘించిన మానవుడు, ప్రకృతి కోపానికి, శాపానికి గురై రోగాల బారిన పడతాడు. ఎందుకంటే వారు దేవదేవుని రూపాన్ని విస్మరించి నడుస్తున్నారు గనుక"

"నేను మీ మాటలతో ఏకీభవిస్తాను. ఇంకే మార్గమూ లేదా, ఇలాంటి దుర్భర ఇరుకు రహదారిలోనే మృత్యుగహ్వరంలోకి ప్రవేశించాలా! ఆనక మానవ సహజ గృహమైన మట్టిలో ఈ దారిలోనే వెళ్లి మట్టిగా కలిసిపోవాలా!"

మైఖేల్ సమాధానమిచ్చాడు– "వేరే మార్గం లేకపోలేదు. ఆదాం! 'అతి సర్వత్ర వర్జయేత్' అది పాటించాల్సిన నియమం. మితంగా తినడం, మితంగా త్రాగడం, మితంగా ఉండడమే రహస్యం. అత్యాకలి, అత్యాశ రోగకారకాలు. ప్రకృతి నియమాలకు అనుకూలంగా జీవితాన్ని గడిపితే మాగిన పండులా పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించి నేలరాలి, తల్లి ఒడిలో కలిసిపోవచ్చు. అది వృద్ధాప్యం! యవ్వనసౌందర్యం, బలం, అందం అన్నీ నశించి జుట్టు తెల్లబడగా, ముఖాన ముడతలతో, ఇంద్రియజ్ఞానం నెమ్మదించి, సుఖాలపై కోర్కెలు అణగి, వేడి రక్తం స్థానే శీతల రుధిరం వ్యాపించి చివరకు జీవన తైలాన్ని, చమురును కొడిగట్టిస్తుంది"

ఆదాం అన్నాడు "అయితే మృత్యువు నుంచి నేను పారిపోను. జీవితాన్ని పొడిగించుకోను. ఎంత ప్రశాంతంగా, ఎంత స్వచ్ఛంగా జీవించాలో అంతకాలం జీవించి అంత్యకాలాన్ని అంతిమంగా చేరుకుని నా తల్లి ఒడిలో కలిసిపోతాను"

మైఖేల్ పలికాడు– "జీవితాన్ని అమితంగా ప్రేమించకు. అమితంగా ద్వేషించకు. జీవించినంతకాలం సత్యమార్గంలో జీవించు. ఎంతకాలం అనే నిర్ణయాన్ని దేవునికి వదిలేయ్! ఇప్పుడు మరో దృశ్యాన్ని చూడు"

ఆదాం కళ్లకెదురుగా ఒక విశాలమైన మైదానం కనిపించింది. రకరకాల రంగులతో మెరుస్తున్న గుడారాలు, పక్కనే పశువులు పచ్చికబీళ్లలో మందలు మందలుగా సంచరిస్తున్నాయి. మరొక పక్క మధురమైన సంగీతం, వీణ (Harp), హార్మోనియం (Organ) వంటి వాద్య విశేషాలపై పలికిస్తున్న రాగాల వల్లరి. ఉచ్ఛ, మంద్రస్థాయిల్లో, ఒకరి తరువాత ఒకరు అందిపుచ్చుకునే ఫ్యుగు (Fugue) అనే సంగీత రూపకంలా మనోహరంగా వినవస్తున్నది. మరోహపక్క కొలిమి వద్ద ఇత్తడి, ఇనుము గుట్టలు. వాటిని కరిగించి పనిముట్లుగా పోతపోస్తున్న దృశ్యం. కొండల కోనల నుంచి మైదానాల్లోకి వస్తున్న మునుల్లాంటి వాళ్లు, దేవుని గురించి, ఆతని సృష్టి గురించి తపస్సుచేసే వాళ్లు, ఆ గుడారాల వద్దకు రాగానే అందమైన స్త్రీలు వాళ్లను చుట్టుముట్టి తమ రూపలావణ్యాలతో, ఆటపాటలతో మైమరపించగా, వారు ఆ కాముక స్త్రీల చూపుల వలలో చిక్కుకుని తమకు నచ్చిన స్త్రీని ఎన్నుకుని వాళ్లతో సరస సల్లాపాల్లో, కామక్రీడల్లో మునిగిపోయారు. విందులు, వినోదాలతో ఆ గుడారాలు సందడి సందడిగా మారినాయి. ఆ సంఘటన చూడగానే యవ్వనం, సంగీతం, గానం, నృత్యం, పూలదండలు, పుష్పాలు, సమస్తం ఆదాం యవ్వన హృదయాన్ని ఆనందపరచగా ఆతడు ఇలా అన్నాడు–

"నా కనులు తెరపించిన దేవదూతా! ఇదివరకటి దృశ్యాలకన్నా ఈ దృశ్యం చూడముచ్చటగా ఉన్నది. కాస్త ఆనందం, ప్రశాంతత ఈ శిబిరాల్లో నెలకొనియున్నది. మొదటి రెండు దృశ్యాల్లో వరుసగా ద్వేషం, మరణం (Hate, Death) బాధలు కనిపించగా ఇక్కడ ప్రకృతి ప్రశాంతంగా ఉన్నది"

మైఖేల్ అన్నాడు– "ఆనందాన్ని బట్టే మంచీచెడును నిర్ణయించరాదు. సుఖాల్లో ప్రకృతి ఫలవంతమైనట్లు కనిపించినా, పవిత్రమైనదీ, స్వచ్ఛమైనదీ మాత్రమే దివ్యత్వానికి అర్హతను సంపాదించుకుంటుంది. నీవు చూసిన ఆ గుడారాలు పాపంతో, మోసంతో నిండినవి. వాటిల్లో ఉండేది తన సోదరుణ్ణి చంపిన వాడి సంతతి. పైకి శ్రమజీవులుగా కనిపిస్తూ, కళల్లో విద్యల్లో ప్రజ్ఞావంతులుగా కనిపించినా సృష్టికర్తను మరచి చరిస్తారు.

ఇందాక నీవు చూసిన దేవతాస్త్రీల వంటివారు, గృహకార్యాలను విస్మరించి, కామాన్ని తీర్చే వస్తువులై నృత్యగానాల్తో మగవాళ్లని ఆకర్షించి నాలుక, కన్ను చెదరేలా చేస్తారు. దేవుని కుమారులుగా పేరుబడ్డవాళ్లు కూడా వారి ఆకర్షణకు లొంగి ఇప్పుడు ఆనందంతో కేరింతలు కొడ్తారు కాని తరువాత కన్నీటి సముద్రంలో మునిగిపోతారు"

ఆ మాటలకు ఆదాంలోని సంతోషం ఆవిరైపోయింది– "ఎంత అవమానం! అప్పటివరకు సాధుసంతులై గడిపినవారు మధ్యమార్గంలో దారితప్పి కోర్కెల గుర్రాలపై పాతాళాన పడిపోతారు. వీళ్ల పతనానికి కారణం స్త్రీలేనా!"

మైఖేల్ అన్నాడు– "ఇది మగవాడి బలహీనత వలన జరిగే పరిణామం. ప్రతి విషయానికి స్త్రీని నిందించక, తను చేస్తున్న పని తప్పోఒప్పో సరిగా నిర్ణయించుకుని తనకున్న జ్ఞానాన్ని తెలివితేటలను సద్వినియోగపరచుకోవాలి! ఇప్పుడు ఇంకో దృశ్యాన్నిచూడు"–

అక్కడ మరొక విశాలమైన ప్రాంతంలో గ్రామాలు, పట్టణాలు, నగరాలు – పెద్దపెద్ద బురుజులతో ద్వారాలతో, ఆయుధాలతో, యుద్ధానికి తలపడబోతున్నట్లున్న సైనికులతో పొంగి పొర్లుతూ, ఒక చేత్తో నురగలు కక్కుతున్న అశ్వాన్ని అదిలిస్తూ, రెండోచేత్తో పదునైన బల్లేన్ని పట్టుకుని, ఒంటరిగా, దళాలుగా, పటాలాలు పటాలాలుగా, అశ్వికులు, కాల్బలం యుద్ధానికి మొహరించినట్లు; కొందరు సైనికులు ఒక దళంగా పోయి గొర్రెల మందల్నో, పశువుల కాపర్లనో భయపెట్టి గోగ్రహణం చేయగా గోపాలురు, గొర్రెలకాపర్లు తమతమ రాజ్యపు సైనికులతో వచ్చి హోరాహోరీగా పోట్లాటకు దిగినప్పుడు – అంతకుముందు రోజు వరకు పచ్చగడ్డితో పశువుల్తో కళకళలాడిన నేల, శవాలతో, రక్తమాంసాలతో, వ్రక్కలైన ఆయుధాలతో భీభత్సంగా ఉన్నదృశ్యం. కొన్నిచోట్ల కోటలపై దండెత్తి ముట్టడిస్తూ కోట తలుపుల్ని పగలగొట్టి, కోటగోడలెక్కి, కోట బురుజుల్ని కూల్చి చేస్తున్న విధ్వంసక కార్యక్రమాలు, అటువేపు నుంచి దుర్గరక్షణలో విసుర్తున్న ఈటెలు, బల్లేలు, బాణాలు, రాళ్లు, గంధకికామ్ల నిప్పుసెగలు, ఒకరినొకరు నరుక్కుంటూ చంపుకుంటూ... ఇంకోచోట ప్రతీహారులు కోట తలుపుల వద్ద సమావేశాల్ని ఏర్పాటు చేయగా ఇరుపక్షాల్లోని పెద్దలు, గడ్డం మీసం తెల్లగా నెరిసినవాళ్లూ, ఆయుధపాణులైన సైనికులూ సమావేశమై ఆర్భాటంతో కూడిన ఉపన్యాసాలిస్తూ ఎటూ తేలక మరలా యుద్ధాల్లో పాల్గొంటున్న దృశ్యాలు. చివరకు మధ్యయుగంలో ఒక వ్యక్తి మంచీచెడుల గురించి, న్యాయం, మతం, సత్యం, శాంతి, దేవుని తీర్పు వంటి విషయాలను వివరిస్తుంటే నచ్చని చిన్నాపెద్దా ఆతనిని బంధించి, హింసిస్తున్నపుడు ఆకాశంలో ప్రత్యక్షమైన మేఘం ఆ వ్యక్తిని (Enoch)

విడిపించి తనతో తీసుకుపోయిన దృశ్యం, ఎక్కడ చూసినా హింస, రక్తపాతం, అణచివేత, ఆరాచకం, ఖడ్గపాలన!"

ఆదాం మనసు వికలమై కన్నీళ్లు ఏకధాటిగా కారుతుండగా దేవదూతతో అన్నాడు– "వీళ్లంతా ఎవరు? మృత్యుసేవకులా! మానవులైతే కాదు! మానవత్వం మరచి దారుణంగా ప్రవర్తిస్తున్నారు. సోదరుడిని చంపినవాడికన్నా వీళ్ల ద్వేషం పదివేలరెట్లు అధికమైనది. మరి, ఆ వ్యక్తి ఎవరు? సత్యమార్గంలో నడుస్తున్న ఆతనిని స్వర్గం ఎందుకు రక్షించలేదు?"

మైఖేల్ సమాధానమిచ్చాడు– "ఆ క్రూరవ్యక్తులందరూ ఇందాక నీవు చూసిన కాముకుల సంతానం. మంచీచెడులు కలిసి, దుడుకుతనంతో నిండిన వయసుకు మించిన శక్తిసామర్థ్యాలతో ప్రఖ్యాతి గాంచే మహావీరులు. ఈ కాలంలో బలం రాజ్యమేలుతుంది. శౌర్యపరాక్రమాలు వీరోచిత కార్యాలు వేనోళ్ల పొగడబడ్తాయి. యుద్ధాలు గెలిచి, పగవాళ్లను చంపి, అనంత ధనరాశుల్తో ఇంటికి తిరిగివచ్చిన వాళ్లకు కీర్తికిరీటాలు, వాళ్లే మహా సామ్రాజ్యాలను స్థాపించి, చక్రవర్తులుగా, మానవ జాతి నిర్మాతలుగా, శక పురుషులుగా, దేవుళ్లుగా, దైవ కుమారులుగా కీర్తించబడతారు. నిజానికి వాళ్లు మానవజాతి విధ్వంసకులు, చీడపురుగులు. వారి ఖ్యాతి అనంతంగా వృద్ధిచెంది చరిత్రగా స్థిరపడ్తుంది.

నీవుచూసిన ఏడవ దృశ్యంలోని వ్యక్తి – ఆతడు ఈ వక్రించిన ప్రపంచంలో సత్యం కోసం పోరాడుతుంటే, న్యాయబద్ధుడైన ఆతడు ఒంటరిగా ధర్మమార్గాన్ని ప్రజలకు విడమరుస్తుంటే, దేవదేవుడు సాధుసంతులతో వచ్చి అంతిమతీర్పు చెబుతాడని వివరిస్తుంటే అందరూ అతనిని ద్వేషించి, హింసిస్తున్నప్పుడు ఆ దేవదేవుడు ఆకాశాన ప్రచండమైన రెక్కల మేఘంగా అవతరించగా ఆ వ్యక్తి (Enoch) మృత్యువు నుంచి మినహా యించబడి దేవునితో నడిచి స్వర్గలోకానికి స్వాగతించబడినాడు. సత్యమార్గాన నడచిన వాళ్లకు, మంచివాళ్లకు లభించే బహుమతి అదే! ఇప్పుడు ఈవేపు చూడు" అన్నాడు మైఖేల్.

అక్కడ యుద్ధం ముగియగా ఎల్లెడలా విరిసిన సంతోషమే. ఆటలు, పాటలు, విందులు, వినోదాలు, ఆడంబరాలు, దొమ్మీలు, విశృంఖలత, కాముకత్వం, వివాహాలు, వ్యభిచారం, మానభంగాలు, మధుపాత్రల నుంచి కలహాజాతరల వరకూ వివరించిన ఆ ప్రపంచంలోకి పవిత్రవ్యక్తి వచ్చి వారి నడతపై తన అయిష్టాన్ని ప్రకటించాడు. ఆతడు అనేకసార్లు వాళ్ల విజయాల్లో, ఉత్సవాల్లో ప్రత్యక్షమై మార్పును, పశ్చాత్తాపాన్ని బోధించినవాడే! అంతిమ తీర్పు గురించి సోదాహరణంగా వివరించినా అంతా వృథా అయ్యింది. ఇక లాభం లేదనుకుని తన నివాసస్థానాన్ని అక్కడ నుంచి దూరంగా

మార్చుకుని ఎత్తైన వృక్షాలున్న పర్వతం నుంచి కలపను తెచ్చి గొప్ప నావను నిర్మించి క్యూబిట్లతో (Cubits) కొలువబడిన ఆ నావకు తారును పూసి (Pitch) ఒకవేపు ద్వారము ఉంచి బహుదూర ప్రయాణానికి కావలసిన ఆహార పదార్థాలను నిల్వచేయగా ఎంత ఆశ్చర్యం! ప్రతి జంతువు, పక్షీ, కీటకాలు, జంటలుగా (Seven and pairs) ఏడేసి లోపలికి ప్రవేశించాయి. చివరగా అతడు తన భార్య, ముగ్గురు కుమారులు, వాళ్ల భార్యలు మొత్తం ఎనిమిదిమంది నావలోకి ప్రవేశించగా నౌక తలుపు మూయబడింది.

దక్షిణపు గాలి ఉధృతమై, చీకటి రెక్కలు విచ్చుకుని, స్వర్గం నుంచి కమ్ముకున్న మబ్బులు దట్టంగా నలువైపులా వ్యాపించగా, కొండల నుంచి వచ్చిన పొగమంచు, ఆవిరీ మేఘాలతో కలిసి దృఢమైన పైకప్పులా ఉండి ఆకాశపు జలధారలు ఒక్కుమ్మడి నేలపైకి ప్రవహించగా, భూమి మాయమయ్యేంత వరకు కురిసిన పెనువర్షాల్లో అంతా నీటిమయమైన, ఆ జలప్రళయంలో ఆ నౌక అనంతసాగరంలో అలలపై తేలుతూ కొట్టుకుపోసాగింది. ఆ నౌక మినహా మిగతా గుడారాలూ, ఆడంబరాలూ, భవనాలూ, రాజ్యాలూ, మనుష్యులూ, జంతువులూ సమస్తం నీటిపాలై, సముద్రపు జంతువులకు ఆహారమై నశించిపోయాయి. ఆ నౌక అలా వెళ్లి వెళ్లి ఒక పర్వతశిఖరాగ్రం దగ్గర నిలిచిపోయింది. నీ సంతతి అంతా అలా నీటిపాలైనందుకు, ఆదాం! నీవు దుఃఖిస్తూ కన్నీటిసాగరంలో మునిగిపోతున్నావా! నిన్ను దేవదూత తన మృదు హస్తాలతో ఓదారుస్తున్నాడు చూడు"

ఆదాం తనను అనునయిస్తున్న దేవదూతతో అన్నాడు– "నేనెన్నడూ ఊహించని దృశ్యాలివి. ఇంతకంటే వీటిని చూడకుండా ఉండి ఉంటే బాగుండేదేమో. భవిష్యత్తును దర్శించాక నా పాప ఫలితం ఇలా ఎన్ని తరాల్ని సృజించి, నశింపచేసి ఎన్నాళ్లిలా సాగుతుందో! **ఇక నుంచి ఏ మానవుడూ తనకూ, తన సంతతికి ఏం జరుగుతుందో భవిష్యత్తులోనని తెలుసుకునే ప్రయత్నం చేయకుండునుగాక!** తాను నిలువరించలేని విషయాన్ని తెలుసుకోవాలనుకోవడం, తెలుసుకుని జీవితాంతం కుమిలిపోవడం రెండూ వాంఛనీయం కాదు. కీడుకన్నా కీడు జరుగుతుందన్న జ్ఞానం మరింత బాధాకరంగా ఉంటుంది. ఎవరు ఎవరికి హెచ్చరిక చేయగలరు. రేపు నీకు కీడు జరగవచ్చును జాగ్రత్తగా ఉండు అని! కీడు జరగడం తథ్యమైనప్పుడు హెచ్చరిక వలన ప్రయోజనమేమిటి? కరవుకాటకాల్ని తప్పించుకున్న కొద్దిమంది ఎడారుల్లో అయినా కాసిని నీళ్లకు కాళ్లరిగేలాతిరిగి కష్టపడతారే! యుద్ధానంతర విరామంతో శాంతిగా సుఖంగా ప్రజలు జీవిస్తారనుకుంటే యుద్ధంకన్నా భయంకరమైన స్థితిలో తమను తాము కలుషితం చేసుకుంటున్నారీమానవులు. ఓ దేవదూతా! ఈ మానవతెగ ఎప్పుడు అంతర్ధానమౌతుంది?"

మైఖేల్ సమాధానమిచ్చాడు– "నీవు చూసిన వారిలో తొలుదొల్త కనిపించిన వీరాధివీరులే తరువాత భోగభాగ్యాలలో మునిగి పతనమయ్యారెందుకంటే వారిలో సద్గుణాలు లోపించాయి కనుక. భూమిపై రక్తాన్ని చిందించి, అనంత సమయాన్ని ఇతరుల్ని అణచివేయడంలో వృధాచేసి, ప్రపంచ ప్రఖ్యాతిని పొంది, కీర్తికిరీటాలతో, బహునామధేయాలతో వర్ధిల్లినవారు క్రమేపీ భౌతికానందాలకు, సుఖజీవనానికి, సోమరితనానికి, కామానికి లొంగి, తిండిపోతులై గర్వం, అహంకారం తలకెక్కి మదాంధులై ప్రవర్తిస్తారు. ఓడిపోయినవాళ్లు బానిసలై, స్వేచ్ఛను కోల్పోయి, అన్ని సద్గుణాలు నశించి, తమపై దండెత్తిన వారిని ఓడించలేక అణగి చల్లారిపోయిన శౌర్యపరాక్రమాలతో, తమ దుస్థితికి సమాధానపడి ఉన్నదానితో సంతృప్తిచెంది, వాళ్ల యజమానులు ఇచ్చిన దానితో జీవనం గడుపుతారు.

ఇలా విజేతలు, విజితులు అందరూ పతనం చెంది న్యాయం, ధర్మం, ఆత్మనిగ్రహం, సత్యం, విశ్వాసం లాంటి సద్గుణాలను మరచి చరిస్తారు. అటువంటి చీకటిరోజుల్లో, అంధకారయుగంలో ఒకేఒక వ్యక్తి, కాంతిపుత్రుడు – ఆకర్షణలకు, ఆచారాలకు, అణచివేతకు ఆలవాలమైన ఆ యుగధర్మాన్ని వ్యతిరేకిస్తూ, మంచిని పెంపొందిస్తూ, ప్రతీకారాన్ని, తిరస్కారాన్ని, హింసను వ్యతిరేకిస్తూ, ప్రజాపీడకుల్ని హెచ్చరిస్తూ మంచి మార్గాన్ని ప్రభోధిస్తూ తిరిగివస్తాడు. ఆతని ఆజ్ఞతో అద్భుతమైన నౌక నిర్మించబడుతుంది. విశ్వాసులైన వారందరూ ఆ నౌకలో ప్రవేశించిన పిమ్మట, ఎన్నిక చేయబడిన పశుపక్ష్యాదులతో, ఆహార ధాన్యాలతో సురక్షితం చేయబడినాక; ఆకాశం తలుపులు తెరచుకుని రాత్రింబవళ్లు కుంభవృష్టి కురిసి, అగాధపు నీటిబుగ్గలు విస్ఫోటించగా, సముద్రం ఉవ్వెత్తున పొంగి ఎల్లలు లేకుండా వ్యాపించి సమస్త పర్వతాలు జలంలో మునిగిపోగా, పారడైజ్ ఉన్న ఈ పర్వత శిఖరం వేరే చోటుకు వరదల అలల్తో నెట్టివేయబడి, ఇక్కడి చెట్టూ చేమా, ఈ ఆనందవనం చిన్నాభిన్నం కాగా ఒక పెద్ద నదీ ముఖద్వారం వద్ద ఉన్న ఇసుకద్వీపంలో సీల్, ఓర్క్ (Seal and Orcs) సీమ్యూల్స్ (Sea-mules) ఘర్షించే ప్రాంతంలో పాతుకుని ఒకప్పటి పవిత్రతను కోల్పోయి ఎవరూ నివసించని ప్రాంతమవుతుంది. ఇంకేమి జరుగనున్నదో వీక్షించు" అన్నాడు మైఖేల్.

ఆదాంకు ఆ గొప్పనౌక చట్రం (hull) వరదనీటిపై తేలుతూ కనిపించింది. ఆకాశం మబ్బులు లేక నీలిరంగు అర్ధగోళంలా కనిపించింది. ఉత్తరపుగాలి జలప్రళయ వదనంపై ముడతలనేర్పరుస్తుండగా, సూర్యుడు వేడెక్కి మండుతున్న గాజుగోళమై ప్రకాశించగా, అలల్తో కల్లోలమైన కడలి శాంతించి ప్రశాంత సరోవరంగా మారగా, స్వర్గలోకపు జలద్వారాలు మూయబడిన పిమ్మట నౌక నెమ్మదిగా వెళ్లి ఏదో పర్వత శిఖరాగ్రానికి తగిలి నిశ్చలమైనది. క్రమేపీ పర్వత శిఖరాగ్రాలు కనిపించి, వాటికి

అలలు తగిలి చేస్తున్న సవ్వడి వినిపించసాగింది. ఇంతలో నౌక నుంచి ఎగిరిపోతున్న కాకి (Raven), దాని తరువాత పావురం (Dove) దూరంగా ఏదైనా ద్వీపపు జాడకోసం, వృక్షపు ఆనవాలు కోసం వెళ్లగా, పావురం తన ముక్కుతో శాంతికి చిహ్నమైన ఆలివ్ రెమ్మను తీసుకుని రావడం కనిపించింది. పొడినేల కనిపించగా ఆ వ్యక్తి తన పరివారంతో కిందకు దిగి దేవదేవునికి నమస్కరించగా ఆకాశాన ఏర్పడిన ఓ అద్భుత పొగమంచు మేఘం, ఇంద్రధనుస్సు, శాంతికి, నూతన ఒప్పందానికి (Covenant) గుర్తుగా ఏర్పడినాయి. వాటిని చూసిన ఆదాం మనస్సు సంతోషంతో నిండిపోయింది. ఆతడు మైఖేల్‌తో అన్నాడు–

"భవిష్యత్ ఘటనలు మంచి బహుమతి కాకపోవచ్చును! దివ్య అధ్యాపకా! ఈ చివరి దృశ్యాన్ని చూసి నేను తేరుకున్నాను. ఒక మనిషి తప్పిదం వలన ఒక జాతి మొత్తం నశింపజేయబడినదానికన్నా ఒక జాతి ఉద్ధరణకోసం ఒక వ్యక్తి చేసిన బలిదానం, ఆ వ్యక్తి ఔన్నత్యం, కరుణ, ఆతనికోసం భగవంతుడు మరోలోకాన్ని ఇవ్వడం ఆతనికోసం దేవదేవుని ఆగ్రహం ఉపశమించడం నన్ను ముగ్ధుణ్ణిచేసాయి. దేవదూతా! ఇప్పుడు ఆకాశంలో కనిపించిన రంగుచారికల అర్థమేమిటి? ఆ ధనుస్సు తృప్తిచెందిన దేవదేవుని కనుబొమలా ఉన్నదే! అది కరిగి మరలా మబ్బుల నుంచి వర్షాన్ని కురిపిస్తుందా!" –ఆతని ప్రశ్నకు మైఖేల్ సమాధానమిచ్చాడు–

"భగవానుని ఆగ్రహం గురితప్పక దూసుకుపోయే బాణం. మానవుని దుశ్చర్యలకు విసిగిన దేవదేవుడు, క్రిందికి దృష్టిసారించగా భూలోకమంతా హింసతో నిండి, ఒకరినొకరు కలుషితం చేసుకుంటూ ఉండడాన్ని గమనించి మొత్తం మానవ జాతిని నాశనంచేయ సంకల్పించగా, ఆతని దృష్టిని ఆకట్టుకున్న ఒకే ఒక వ్యక్తి నైర్మల్యం, సచ్ఛీలత, ఆతనిని ఆకట్టుకొనగా, ఆతనిని రక్షించి, మిగతా జాతిని నశింపచేసి ఆతనితో నూతన ఒప్పందాన్ని చేసినాడు. ఇకముందు భూమిని జలప్రళయంతో నాశనం చేయబోననీ, సముద్రం తన హద్దులు దాటదనీ, వర్షం ప్రపంచాన్ని ముంచివేయదనీ దేవదేవుడు ఆ వ్యక్తికి హామీ ఇచ్చినాడు. ఎప్పుడైతే ఆకాశంలో వర్షమేఘం, మూడురంగుల హరివిల్లు కనిపించాయో అవి దేవదేవుడు తన ఒప్పందాన్ని మానవులకు గుర్తుచేస్తున్న సంజ్ఞగా భావించాలి. రేయింబవళ్లు, విత్తుకాలం కోతకాలం, మండుటెండలు, శీతల గాడ్పులు యథావిధిగా నడుస్తూ దేవదేవుని అగ్నిజ్వాలలు విజృంభించి అన్నిటిని, స్వర్గభూలోకాలతో సహా పునీతం చేయగా, ఆ ప్రక్షాళన చెందిన లోకంలో సమన్యాయం, ధర్మం పరిఢవిల్లి శాంతి నెలకొంటుంది.

12. పారడైజ్ నుంచి ఆదాం, ఈవ్‌ల బహిష్కారం

దేవదూత మైఖేల్ ఆదాంతో వరదల తర్వాత సంభవించే సంఘటనలను వివరించాడు. అబ్రహం చరిత్ర, ఆదాం ఈవ్‌ల సంతానం, వంశానుక్రమణిక తెలిపిన తరువాత రక్షకుడి పుట్టుక, మరణం, పునరుత్థానం, అధిరోహణం; చర్చి పురోగమనం అతని రెండవ ఆగమనం చెబుతాడు. ఆదాం సంతృప్తుడై మైఖేల్‌తో కలిసి, కొండగుట్ట దిగివచ్చి, 'ఈవ్'ను మేల్కొల్పుతాడు. నిద్రనుంచి మేల్కొన్న 'ఈవ్' ప్రశాంతచిత్తంతో కనిపిస్తుంది. మైఖేల్ ఆదిదంపతులిరువురినీ చెరోచేత్తో నడిపిస్తూ పారడైజ్ బయటకు తీసుకువస్తాడు. వారి వెనుక జ్వాలాఖడ్గం వలయాలుగా పరిభ్రమిస్తూ కాంతిలీను తుండగా దేవదూతలు ఆ ప్రదేశానికి రక్షణగా తమతమ స్థానాలలో నిలబడ్తారు.

మధ్యాహ్న సమయంలో తన ప్రయాణానికి విశ్రాంతినిచ్చి సేదదీర్చుకునే ప్రయాణీకుడిలా, మైఖేల్ తన కథను ప్రపంచ విధ్వంసం, పునరుజ్జీవనంల మధ్య ఆపినాడు. మరల ఆదాం కోరికపై తన ప్రసంగాన్ని కొనసాగించినాడు–

"ఈ ప్రపంచం ఎలా మొదలై ఎలా అంతమౌతుందో నీవు చూసినావు. మానవుని మొదటి తెగ జలప్రళయంలో నశించగా రెండవ తెగ నోవా (Noah) సంతతిగా దినదినాభివృద్ధి చెందుతుంది. మొదట్లో వారికి దేవదేవుని ఆగ్రహం, తీర్పు గుర్తుండగా భయభక్తులతో మెలగుతూ న్యాయబద్ధమైన జీవనం గడిపేవారు. సేద్యం చేస్తూ, అనేక పంటలు పండిస్తూ ధాన్యం, ద్రాక్షారసం, నూనెలను, పశువుల గొర్రెల మందలను పెంపొందించుకుని భగవానునికి ప్రశస్తమైన బలుల్ని సమర్పిస్తూ గిత్తల్ని, గొర్రెపిల్లల్ని, ద్రాక్షసారాయినీ అర్పిస్తూ సంతోషంగా జీవించారు. పితృస్వామ్యవ్యవస్థలో పరిధవిల్లిన ఈ వ్యవస్థలో కొందరు సమానత్వాన్ని భరించలేక, సోదర భావాన్ని మరచి, ప్రకృతి న్యాయాన్ని ధర్మాన్ని మలినపరచి యుద్ధాల వేటతో మనుష్యుల్ని జంతువుల్ని వేటాడుతూ దేవుని స్వర్గం క్రింద తమ సామ్రాజ్యాన్ని స్థాపించసాగారు. తిరుగుబాటు ద్వారా (Rebellion) రాజ్యాన్ని సంపాదించినవాడు, ఇతరులు తనపై తిరగబడ్తున్నారని నిందిస్తాడు. తనలాంటి వాళ్లని కూడగట్టుకుని దండయాత్రలు చేస్తూ ఈడెన్ నుంచి పడమట దిక్కుగా ప్రయాణం చేసి ఒక మైదానాన్ని చేరుకుంటాడు. వాళ్లు అక్కడ నరకలోక ద్వారంలా ఉండి నల్లటి తారు నిప్పులను కక్కుతున్న ప్రదేశంలో కోటను, బురుజుల్ని నగరాన్ని నిర్మించి తమ పేర్లను చిరస్థాయిగా నిలుపుకోవాలని ఆశిస్తారు. కాని దేవవదేవుడు కనిపించకుండా మానవలోకానికి వచ్చి వారు నిర్మిస్తున్న నగరాన్ని, ఆకాశాన్ని అంటుతున్న శిఖరాన్ని చూసి వాళ్ల నాలుకల మీద నడయాడే

సహజ భాషను తొలగించి వేర్వేరు శబ్దాలను, పదాలను ధ్వనించేట్లు ఆ జనాల్ని విడదీయగా ఒకరిభాష ఒకరికి అర్థంకాక గొంతులు బొంగురుపోయేలా అరుస్తూ, కోపంతో, అసహనంతో ఊగిపోతున్న వారిని చూసి స్వర్గంలో నవ్వులు విరబూసినాయి. వారు నిర్మించిన ఆ ఎత్తైన శిఖరమే గందరగోళగోపురం (Tower of Babel).

ఆదిచూసిన ఆదాం ఒక తండ్రిగా బాధపడినాడు– "ఈ మానవజాతిలో సమభావం, సోదరతత్త్వం నశించి, ఎవరివారు తామే అధిపతులమన్నట్లు, అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ దేవదేవుడు తమకివ్వని అధికారానికెగబడుతున్నారు. పశువులపై, పక్షులపై, జలచరాలపై అధికారాన్నిచ్చినా అది దేవుడు మానవులకొసగిన వరం, వితరణం మాత్రమే! మానవులపై మానవులకు ఆధిపత్యాన్ని ఇవ్వలేదు. అది గ్రహించక ఈ తుచ్ఛమానవులు స్వర్గానికెదుగుదామన్న అత్యాశతో ఆకాశాన్నంటే హర్మ్యాన్ని, గోపురాల్ని నిర్మిస్తూ ఏం సాధిద్దామని? ఆ గాలిగోపురాల్లో కూర్చుని తనకు తన సైన్యానికి ఏంపెట్టి పోషిద్దామని? తిండి సంగతి సరే! గాలికూడ కరువే కదా అక్కడ!"

దానికి మైఖేల్ సమాధానమిచ్చాడు– "ఆతడిని నీవు తప్పుపట్టడం సమర్థనీయమే! తోటి మానవుల ప్రశాంతస్థితిని భంగపరుస్తూ వారికి కష్టాలను తెచ్చి, వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు భంగం కలిగించే ఆధిపత్య ధోరణిలో ఆతడు సాగుతున్నాడు. నీ తొలి తప్పిదం తరువాత నిజమైన స్వాతంత్ర్యం అదృశ్యమైంది. స్వేచ్ఛ, వివేకం కవల పిల్లల్లా నడుస్తాయి. వివేకం నశించినా, అణగదొక్కబడినా, మితిమీరిన కోరికలు, అడ్డూ అదుపూ లేని భావావేశాలు విజృంభించి అధికారాన్ని ప్రశ్నించి ఎదిరించి, ఓడిపోతే స్వేచ్ఛా జీవితం నుంచి బానిసత్వానికి దిగజారుస్తాయి. తనకున్న శక్తులతో గర్వించి వివేకాన్ని విస్మరించే వాడు బలవంతుడిగా గుర్తించబడి బాహ్యస్వేచ్ఛను ఆనందిస్తాడు. నియంత నుంచి వచ్చే నియంతృత్వం, ఆజ్ఞలు ఒక్కోసారి సమర్థనీయాలే! రాజ్యాలన్నీ పతనం చెంది, విలువలు నశించి, అరాచకం పెచ్చుమీరినప్పుడు ఏదో ఒక శాపం ఉత్పాతమై వాటిని సర్వనాశనం చేసి నామరూపాల్లేకుండా చేస్తుంది. నావను నిర్మించి మానవజాతిని రక్షించిన వ్యక్తి కుమారుడు తన తండ్రికి చేసిన అన్యాయానికి శపించబడ్డాడు. అతని సంతతి బానిసలకు బానిసలుగా (Servants of Servants) శిక్షించబడినారు. మునుపటి మానవతెగకన్నా వీరు మరింత పతనం చెందటం గమనించిన దేవదేవుడు వారి మధ్య నుంచి తొలగి, వారి మానాన వారు తమ కలుషిత కార్యాలలో మగ్గి మాడనిచ్చాడు. తరువాత ఆ రాజ్యాలన్నిటిలో ఒక రాజ్యాన్నెన్నుకొని, యూఫరెటిస్ (Euphrates) నదికీవల పక్కన విగ్రహారాధకుల మధ్య పెరిగిన ఒక వ్యక్తి ద్వారా తన సామ్రాజ్యాన్ని స్థాపించబూనినాడు.

దేవదేవుని అనుగ్రహంతో జలప్రళయాన్ని వరదల్ని తప్పించుకున్న వ్యక్తి జీవించివుండగానే ఆతని సంతతి తమ మధ్య తిరిగిన పరమాత్మను వదలి తాము నిర్మించిన దారు, శిలా శిల్పాలను, బొమ్మలను పూజించసాగినారు. దేవదేవుడు తాను ఎన్నికచేసిన వ్యక్తికి కలలో దర్శనమిచ్చి మిథ్యాదేవతలను పూజించవద్దని హెచ్చరించి ఆతనిని తన తండ్రిగృహం నుంచి వేరే దేశానికి రప్పించి ఆతని ద్వారా ఓ గొప్ప రాజ్యాన్ని నిర్మిస్తానని వాగ్ధానం చేస్తాడు. దేవుని మాటలను విశ్వసించిన ఆతడు తన దేవుళ్లను, మిత్రులను వదిలి తన దేశమైన 'ఛాల్డియా'లోని ఉర్ (Ur of Chaldea)ను వదలి, హరాన్ (Haran Ford) పాటిరేవును దాటి తన పరివారంతో సంపదలతో కానాన్ (Canaan) చేరుకున్నాడు. మొరె (Moreh) మైదానంలో, సెచెమ్ (Sechem) వద్ద గుడారాల నేర్పరచి దేవదేవుడు తనకు తన సంతతికి ఇచ్చిన బహుమానాన్ని స్వీకరించినాడు. ఉత్తరాన హమత్ (Hamath) నుంచి దక్షిణాన ఉన్న ఎడారి వరకూ, తూర్పున హెర్మాన్ (Hermon) నుంచి పడమట సముద్రం వరకూ, కార్మెల్ పర్వతం (Carmel Mount), రెండు పాయల జోర్డాన్ నది (Jordan) తూర్పున సరిహద్దులుగా ఉన్న ఆతని పుత్రులు సెనిర్ (Senir) గుట్టల వద్ద నివసిస్తూ ప్రపంచంలోని సమస్త రాజ్యాలపై తమ ఆధిపత్యాన్ని సాధిస్తారు. అలా ఆశీర్వదింపబడిన సంతతి సాతాను సర్పపు తలపై మోది గాయపరుస్తారు. ఈతని పేరు అబ్రహం (Abraham). అతనిలానే ఆతని కుమారుడు, మనవడు విశ్వాసులుగా, జ్ఞానులుగా దేవుని కృపకు పాత్రులౌతారు. అబ్రహం మనవడికి పండ్రెండుగురు కుమారులు. ఆతడు తన సంతానంతో కానాన్‌ను వదిలి ఈజిప్టుకు (Egypt) వలసపోతాడు. నైలునది (Nile) ఆ దేశాన్ని రెండు భాగాలుగా విభజిస్తూ, ఏడుపాయలుగా విడిపోయి సముద్రంలో కలుస్తుంది. కష్టకాలంలో ఆతడిని చిన్న కుమారుడు (ఫారో (Pharao) ఆస్థానంలో ముఖ్యపదవిలో ఉన్నవాడు) ఆదరిస్తాడు. కొంతకాలానికి ఆతడు మరణిస్తాడు. ఆతని సంతానం ఈజిప్టులో అసంఖ్యాకంగా పెరగగా, అప్పటి రాజు, వారిని బానిసలుగా మార్చి వారి మగశిశువుల్ని చంపివేస్తాడు. దేవునిచే పంపబడిన ఇరువురు సోదరులు మోజెస్, ఆరాన్ (Moses and Aaron)లు తమ వాళ్లను దాస్యవిముక్తులను చేసి దేవుని వాగ్దాన దేశానికి (Promised land) తీసుకువెళతారు. ఫారొ (Pharaoh) దేవదేవుడిని, ఆతని సందేశాన్ని తిరస్కరించగా అనేక ఉత్పాతాలు కనిపించి, నదుల నీళ్లు రక్తవర్ణంలోకి మారి, కప్పలు, నల్లులు, ఈగలు చీడపీడలతో రాజప్రాసాదం, దేశం నిండగా, పశువులు కుళ్లి మరణించగా, ప్రజల శరీరాలపై మచ్చలు బొబ్బలు వచ్చి బాధ కలిగిస్తుండగా, ఉరుములతో కూడిన వడగళ్లు, వడగళ్ల వానతో కూడిన అగ్గిరవ్వలు ఈజిప్షియన్ భూమ్యాకాశాలను కమ్ముకుని దారికడ్డువచ్చిన

చెట్టూపుట్టా, ఫలపుష్పాలను, ధాన్యరాశుల్నీ భస్మీపటలం చేస్తూంటే, మిడతలదండు మేఘాల్లా దట్టంగా వ్యాపించి భూమిపై ఆకుపచ్చదనం లేకుండా తినివేయగా అంతా చీకటి! మూడురోజుల్లో సర్వనాశనం! ఆఖరిరోజు అర్ధరాత్రి ఈజిప్టు రాజ్యంలోని తొలిచూలు పిల్లలు మరణించడంతో ఆ పదిగాయాలతో పరాజయం చెందిన నైలునదీ రాక్షససర్పం (Dragon) చేసేదిలేక తమదేశానికి పోవాలనుకున్న వారిని వెళ్లేందుకు అనుమతి నిచ్చింది. ఆ తరువాత మరలా పొడిగాఉన్న మంచును ముద్దచేస్తే మరింత గట్టిపడినట్లు, ఆ ఫారో (Pharaoh) మరింత మొండివాడై, తన దేశం విడిచిపోతున్న వారిని వెంటాడబోగా, రెండుగా చీలిన ఎర్రసముద్రంలో, మోసెస్ తన చేతిలో పైకెత్తిన మంత్రదండం సాక్షిగా ఆతని ప్రజలు రెండు స్ఫటికగోడల మధ్య ఉన్న పొడినేలపై నడిచి ఆవలితీరం చేరగా, వారిని వెంబడిస్తున్న ఫారో, ఆతని సైనికులు నీటిలో మునిగిపోయారు. తన విశ్వాసులకు, సాధు సంతులకు దేవుడిచ్చే అద్భుతవరాలు, కానుకలవి. ఒక మేఘంగా, జ్వాలాస్తంభంగా పగలూ, రేయీ వారికి దారిచూపిస్తూ దేవుడు వారికి తోడుగా ఉంటే మూర్ఖుడైన ఆ రాజు తన రథాల్తో సైనికులతో ఈ నిరాయుధులైన ప్రజల్ని హతమార్చబూనినప్పుడు వాళ్లు భయంతో లొంగిపోయి మరలా బానిస బతుకు బతకడానికే నిర్ణయించుకున్నా, దేవదేవుని ఆశీస్సులతో మోసెస్ వారిని క్షేమంగా కానాన్ (Canaan) చేర్చినాడు.

అక్కడ జనసంచారంలేని ఎడారిలో వాళ్లు సమావేశమై తమ పన్నెండు తెగల నుండి ముఖ్యులను ఎన్నుకొన్నప్పుడు, సినాయ్ పర్వతం (Mount Sinai) నుండి ఉరుములు మెరుపుల మధ్య దిగివచ్చిన దేవదేవుడు న్యాయసూత్రాలను ప్రకటించినాడు. ధర్మసూత్రాలు, మతపరమైన విధివిధానాలు, సాతానును అణచే చర్యలను వారికి బోధించి మానవాళిని పాప విముక్తులను చేయ సంకల్పించాడు. దైవవాక్కు మానవ చెవులకు భయాన్ని గొల్పుతుంది కనుక మోసెస్ ద్వారా దైవ నిర్ణయాలన్నీ ప్రజలకు తెలుపబడినాయి. ఇప్పుడు ప్రజలకు దేవుడికి మధ్య వారధి 'మోసెస్'. ప్రజలు దైవాజ్ఞాబద్ధులై చరించడాన్ని గమనించిన దేవదేవుడు తన పూజాస్థలాన్ని (Tabernacle)ను వాళ్ల మధ్య ఉంచడానికి అంగీకరించినాడు. దేవదారు కలపతో చేసిన పటమంటపానికి బంగారురేకు తాపడం చేయగా, దాని లోపల ఒక మందసం (Ark), ఆ పెట్టెలోపల దేవదేవుడు నిర్ణయించి దశశాసనాలు (Testimony), ఒప్పందపు పత్రాలు (Covenant), వాటిపైన బంగారుపీఠం, ఇరువైపులా ప్రకాశవంతమైన చెరుబిమ్‌లు (Cherubim-దివ్యజీవి), ఆ పీఠం ముందు ప్రజ్వలిస్తున్న సప్తదీపాలు, (రాశిచక్రంలోని దివ్య అగ్నుల్లా), ఆ గుడారానికి పైన పగటిపూట ఓ మేఘం, రాత్రిపూట జ్వాలాస్తంభం, వారి వెంటనే ప్రయాణిస్తూ అబ్రహం,

అతని సంతతికి వాగ్దానం చేసిన మైదానం వద్దకు చేరుకునే వరకు అనుసరిస్తూనే ఉన్నాయి.

ఇంకా చాలా చెప్పవచ్చు! ఎన్ని యుద్ధాలు, ఎందరు రాజులు గతించారు ఎన్ని రాజ్యాలు గెలుచుకోబడినాయి, ఒక రోజంతా సూర్యుడు అలా నడినెత్తిన ఎందుకు నిలబడ్డాడు, రాత్రిళ్లు తమ ప్రయాణాన్నెలా వాయిదా వేసుకున్నాయి, సూర్యుడు గిబ్యాన్‌లో (Gibeon) (చంద్రుడు అయలాన్ (Aialon) లోయలో, అలా ఇజ్రాయెల్ (Israel) ఏర్పడేంతవరకూ) అబ్రహం మూడవతరం వాడైన – అబ్రహం కుమారుడు ఇసాక్, ఇసాక్ (Isac) కుమారుని కాలం నాటికి ఎలా కానాన్ విజయం సాధించిందో నీవు చూస్తున్నావు.

ఆదాం మధ్యలో కల్పించుకుని అన్నాడు– స్వర్గం నుంచి మావద్దకు పంపబడిన దేవదూతా! నా అజ్ఞానాన్ని పోగొట్టిన దీపమా! మంచి విషయాలను మీరు నాకు చెప్పినారు. ముఖ్యంగా అబ్రహం, ఆతని సంతతి గురించి, నా కనులు ఇపుడు నిజంగా తెరుచుకున్నాయి. నా హృదయం ప్రశాంతతనొందింది. ఇంతవరకూ నేను నాకూ మానవజాతికి జరిగే కష్టనష్టాల గురించి ఆతృత చెందినాను. ఇప్పుడు నేను కళ్లారా చూసాను. మానవులందరూ, అన్నిదేశాలూ, ఆ కరుణామయుని అనుగ్రహాన్ని పొందుతాయని గ్రహించాను. నేను నిషేధించిన జ్ఞానాన్ని, నిషేధించిన పద్ధతులలో పొంద ప్రయత్నించి భగవానుని ప్రేమకు దూరమయ్యాను. అయినా నాకు అర్థంకానిదేమిటంటే దేవదేవుడు తన ప్రజలమధ్యనే వున్నా ఇన్ని న్యాయ సూత్రాలు, చట్టాలు, విధివిధానాలూ అవసరమా! అనేక శాసనాలు అనేక పాపాలకు శిక్షలను సూచిస్తున్నాయే, ఇటువంటి పాపాల మధ్య దేవుడెలా ఉండగలడు?"

మైఖేల్ సమాధానమిచ్చాడు– "వాళ్లమధ్య పాపం రాజ్యం చేస్తుందనడంలో సందేహం లేదు. నీకది అనుభవమే! ఈ శాసనాలూ, న్యాయసూత్రాలూ పాపాన్ని ప్రతిఘటించడానికి ఉపయోగపడ్తాయికదా! ఎప్పుడైతే ప్రజలు ధర్మం (Law) పాపాన్ని కనిపెట్టగలదు కాని దానిని తొలగించలేదని గ్రహిస్తారో జంతుబలులు, ప్రాయశిత్తాల కన్నా విలువైన రక్తాన్ని మానవవిముక్తికోసం ధారపోయాలని తెలుసుకుంటారో, అప్పుడు అధర్మాన్ని ధర్మంతో, అన్యాయాన్ని న్యాయంతో, ఎదుర్కొంటూ మంచిమార్గాన నడుస్తూ, విశ్వాసులై, అంతరాత్మ శాంతినొందగా దేవదేవుని చేరుకుంటారు. న్యాయసూత్రమైనా, ధర్మమైనా ఒక మార్గదర్శక పథమే గాని నిర్బంధమో, శాశ్వతమో కాదు. మరో ఒడంబడిక దేవునికి, ప్రజలకు మధ్య జరిగేంత వరకూ శాసనపాలన నుంచి కరుణ స్వీకరణను, చట్టాల నుంచి విశ్వాసాన్ని, భయం నుంచి భక్తిని

అంగీకరించే క్రమంలో ఈ ధర్మాలూ, చట్టాలూ, న్యాయసూత్రాలు ఉపయోగపడ్తాయి. అందుచేత ప్రజల్ని కానాన్‌లోకి నడిపించినది. దేవదేవుని అత్యంత ప్రియతముడైన మోసెస్ కాదు, వాళ్ల ధర్మాధికారి లేదా న్యాయాధిపతి.

కానాన్‌లో చేరిన ప్రజలు భాగ్యవంతులై, పాపాలు వాళ్లను శాంతికి భంగం కలిగేట్లు పురికొల్పగా, ముందుగా న్యాయాధిపతులు (Judges), చక్రవర్తులు (Kings), ఆ తరువాత డేవిడ్ (David) కుమారుడైన ఆఖరి చక్రవర్తి (అబ్రహాంకు, చక్రవర్తులకు ముందే చెప్పబడినవాడు) ధనవంతుడు, జ్ఞాని, సూక్ష్మబుద్ధి కలవాడు (A man of wealth and wisdom) దేవుని మందసానికి (Ark of God) ఒక గొప్ప దేవాలయాన్ని నిర్మించాడు. చివరి రోజుల్లో అతడు, అతని తర్వాత వచ్చినవారు దైవదూరులై, విగ్రహారాధనలు చేస్తూ, ఇతర దేవుళ్లను పూజించడంతో ఆగ్రహించిన దేవదేవుడు ఆ నగరాన్ని, దేవాలయాన్ని, పూజామంటపాన్ని, మందసాన్ని విడిచివెళ్లగా ఆ ఎత్తైన గోడలు, నగరం గందరగోళంలో పడినప్పటి నుంచి ఆ నగరాన్ని బాబిలోన్ (Babylon) అని పిలిచారు.

డెబ్భై ఏళ్లపాటు వాళ్లలా జనసంచారం లేని ఎడారుల్లో తిరిగి తిరిగి చివరకు భగవానుని కృపవలన డేవిడ్‌తో చేసుకున్న ఒడంబడిక వలన వారు మరల స్వస్థానానికి చేరుకున్నారు. దేవునికృపతో రాజులు, రాజుల ప్రాపకంలో పూజారులూ క్రమేపీ ధనవంతులై, పూజారులలో వచ్చిన అసమ్మతి, కలుషిత భావనలు దేవాలయాన్ని అపవిత్రం చేసాయి. ఎప్పుడైతే పూజారుల చేతికి రాజదండం (Sceptre) వచ్చిందో వాళ్లు డేవిడ్ సంతతిని లెక్కచేయక కొత్తవాళ్లకు రాజ్యాన్ని అప్పగించడంతో రారాజు మెస్సయ్య (Messaiah) డేవిడ్ వంశంలో పుట్టే అవకాశం కోల్పోయాడు. అయినా ఆతని జన్మదినం నాడు ఆకాశంలో ఉదయించిన నూతన తార, దానిని అన్వేషిస్తూ వచ్చిన ముగ్గురు తూర్పుదేశపు జ్ఞానులు, నూతన శిశువును కనుగొని ఆతనికి సుగంధ ధూపద్రవ్యం (Incense), గుగ్గిలం (Myrrh), బంగారం (Gold) సమర్పించి మొక్కినారు. ఆతని తల్లి పవిత్రకన్యక, తండ్రి జగత్పిత. స్వర్గానికి అధిరోహణం చేసిన పిమ్మట ఆతడే స్వర్గసింహాసనాన్ని అధిష్ఠిస్తాడు. స్వర్గ భూలోకాలను పరిపాలిస్తాడు"

అతడు (క్రైస్తవేతరులు ఈతనిని జీసస్ (Jesus) అంటారు) – తన విరోధి సర్పాన్ని నోరుమూయించి సమస్తలోకాల్లో దారీ తెన్నూ లేక తిరుగుతున్న మానవుడిని, శాశ్వత పరమానందస్థానమైన పారడైజ్‌కు తిరిగి చేరుస్తాడు.

ఆదాం దుఃఖం పటాపంచలై, సంతోషంతో నూతన ఉత్తేజాన్ని పొందినాడు. మాటలు వాటంతట అవే ఊపిరిగా వస్తుండగా పలికాడు–

"దివ్య దేవదూతా! మంచిని తెలిపే మహాప్రవక్తా! ఆశాదీప్తి ప్రదాతా! ఎందుకు మన జాగరణ, ఎదురుచూపులను మానవి బీజంగా (Seed of Woman)లుగా సంభోధిస్తున్నామో అర్థమయ్యింది. ఓ కన్యామాతా! నీకు జయమగు గాక! జగత్పితచే ప్రేమించబడి నా సంతానానికై, నీ కన్యాగర్భాన దైవకుమారుడు జన్మించి, దేవుడిని మానవుడిని ఐక్యం చేయడం. అదేకదా సర్పానికి తగిలే ఆఖరి దెబ్బ! అంతిమ ఘాతం! ఎక్కడ, ఎప్పుడు ఈ యుద్ధం జరుగుతుందో! ఎప్పుడు సర్పం విజేత పాదాన్ని (చీలమండను) కాటేస్తుందో! అంతిమ విజేత దేవుడే కదా!"

మైఖేల్ అన్నాడు– "అది ద్వంద్వయుద్ధమనే భ్రమవద్దు. అలాంటి కల కనకు. కాలికో తలకో తగిలేవి గాయాలూ కావు. సాతాను స్వర్గం నుంచి తలక్రిందులుగా నరకంలో పడినప్పుడే ఆతని తలకు పెద్ద గాయమైంది. నీకతడు మృత్యుగాయాన్ని చేయలేడు. దైవకుమారుడు ఈ లోకంలోకి వచ్చింది సాతానును నశింపచేయడానికి కాదు, సాతాను ప్రభావాన్ని, పనుల్ని, నీలో, నీ సంతతిలో పేరుకున్న కల్మషాన్ని తొలగించడానికి. దేవుని ఆజ్ఞను ధిక్కరించి మరణానికి అర్హుడవయ్యావు. నీ నుంచి వచ్చిన వాళ్లు కూడా నీ పాపం వాళ్లకు సంక్రమించడం వలన వాళ్లూ మరణానికి దగ్గరౌతారు. విధేయత, ప్రేమతో మాత్రమే దైవశాసనాన్ని పాటించడం వీలవుతుంది. నీవు చేసిన పాపాన్ని తొలగించడానికి దైవకుమారుడు మానవజన్మనెత్తి, మృత్యువుకు తన ప్రాణాన్ని ఎరచేసి, తన ప్రాయశ్చిత్తం వలన తమకు పాపవిమోచనం కలిగిందని (Redemption) నమ్మే విశ్వాసులకు జీవాన్నిస్తూ, తన వినయం, విధేయత, సద్గుణ సంపదతో మానవులను పాప విముక్తులను చేస్తాడు. దానికోసం ఆతడు ద్వేషింపబడి, ద్రోహిగా ముద్రవేయబడి, బంధించబడి, తీర్పు చెప్పబడి, మరణదండన విధించబడి, అవమానకరమైన పరిస్థితుల్లో శిలువ వేయబడి తన దేశస్థులే తనను చంపుతుంటే, తనవాళ్లకు జీవాన్నివ్వడం కోసం తానే మరణిస్తుంటే... ఆ దైవకుమారుడు, తన దివ్యశక్తితో శత్రువులను శిలువకు మేకులు కొట్టి, మానవుల పాపాలన్నిటినీ శిలువ వేసి ఎవ్వరినీ నిందించక తాను మరణిస్తాడు. వెంటనే పునరుజ్జీవనం పొంది, మృత్యువుకు ఆతనిపై అధికారం లేదుగనుక, మూడోరోజు ఉదయమే, సమాధి నుంచి బయటకు వచ్చి ఉదయకాంతిలా ప్రకాశిస్తాడు.

అలా నీ తప్పుకు మూల్యం చెల్లించినవాడై, మృత్యువు నుంచి మానవులకు విముక్తి కలిగించి, విశ్వాసులకు మేలుచేసి దైవకుమారుడు, సాతాను సర్పశిరస్సుకు గాయం చేస్తాడు. ఆతని రెండు చేతులైన పాపపుదేవతను (Sin), మృత్యుదేవతను (Death) ఓడించి, తనను నమ్మినవారికి మృత్యువులాంటి నిద్రనిచ్చి, మోక్షాన్ని, శాశ్వత జీవితాన్ని అందజేస్తాడు. పునరుత్థానం తరువాత విశ్వాసులకు అప్పుడప్పుడూ

ప్రత్యక్షమౌతూ, వారు తన జీవితాన్ని, బోధనలను విశ్వవ్యాప్తం చేస్తూ, మానవసంతతిని పవిత్రస్నానం వలన (Baptism) పాపవిముక్తుల్ని చేసి, స్వచ్ఛమైన జీవితానికి అర్హులను చేసేట్లు ఆశీర్వదిస్తాడు. అబ్రహాం సంతతికే కాక, అబ్రహాం మతాన్ని నమ్మిన వారికి కూడా మోక్షాన్ని ప్రసాదించి, అన్ని రాజ్యాలనూ, ప్రజలనూ ఆశీర్వదిస్తాడు. ఆ తరువాత స్వర్గలోకంలోని స్వర్గానికి విజయుడై అధిరోహణం చేసి, సాతాను సర్పాన్ని ఆశ్చర్యంలో పడవేసి, సంకెళ్లతో బంధించి ఈడ్చి, ఆతని నెలవు 'నరకం'లోకి నెట్టివేస్తాడు. ఆనక స్వర్గంలో ప్రవేశించి సింహాసనమున తండ్రికి కుడివేపు కూర్చుని దేదీప్యమానంగా ప్రకాశిస్తాడు.

ఎప్పుడైతే ఈ ప్రపంచాలు అంతరించే స్థితికి వస్తాయో, ఆ అంతిమ దినం నాడు అవిశ్వాసులను శిక్షించడానికి, విశ్వాసులకు కానుకలివ్వడానికి, వారిని దివ్యానందలోకంలోకి, స్వర్గ, భూలోకాలు రెండూ ఒకే స్థితిలో ఉండే ఆ ఆనంద ప్రపంచంలోకి స్వీకరించడానికి దైవకుమారుడు తిరిగివస్తాడు. ఆ ప్రపంచం ఈ ఈడెన్ వనం కన్నా అత్యంత సుందరమై ఒప్పుతుంది"–

ఆ మాటలు చెప్పి మైఖేల్ ఆగినాడు. మానవలోక చరిత్రలో అద్భుత ఘట్టమైన ఆ కాలాన్ని వీక్షించిన ఆదాం అమితమైన సంతోషంతో ఇలా జవాబిచ్చాడు– "అనంతమైన అమితమైన మంచితనంతో వర్ధిల్లే దేవదూతా! చెడులో ఉన్న మంచి వలన చెడు, మంచిగా పరివర్తనం చెందుతున్నది. సృష్టిలో ప్రప్రథమంగా వచ్చిన కాంతి కన్నా ఈ కాంతి మరింత అద్భుతంగా ఉన్నది. ఇప్పుడు నేను చేసిన పాపానికి దుఃఖించనక్కర్లేదు. నా పాపం నుంచే ఇంత లోకాతీతమైన మంచి ఉద్భవించి పాపాన్ని నశింపచేసి ఎల్లెడలా ఆనందాన్ని వ్యాపింపచేస్తున్నది. దేవునికి అఖండ ఖ్యాతిని, మానవులకు అమితమైన మంచితనాన్ని ప్రోవుచేస్తున్నది.

దైవకుమారుడు స్వర్గానికి అధిరోహణము (Ascension) చేసిన పిమ్మట అతని విశ్వాసులు, సంఖ్యలో అత్యల్పంగా ఉన్నవారు – అవిశ్వాసులు, సత్యవిరోధుల మధ్య ఉన్నారు కదా వారినెవరు రక్షిస్తారు? ఆ శత్రువులు వారిని మరింత క్రూరంగా హింసిస్తారు కదా!" అన్నాడు.

దేవదూత సమాధానమిచ్చినాడు– "నిజమే! అందుకనే ఆతడు స్వర్గం నుంచి పవిత్రాత్మ (Holy ghost-Comforter)ను పంపగలడు. జగత్ప్రిత వాగ్దానం ఆ రూపంలో వచ్చి విశ్వాసుల వెంట నంటిఉండి సత్యమార్గాన నడిపిస్తుంది. సాతాను దాడులను, విషబాణాల్ని తట్టుకోడానికి ఆధ్యాత్మిక కవచాన్ని (Spirtual armour) ప్రసాదిస్తాడు. వారి మానసిక శక్తిని, బాహ్య హింసలను భరించే గుండె నిబ్బరాన్ని,

తెగువను చూసి శత్రువులే ఆశ్చర్యపోతారు. ముందుగా అపొస్తలులు (Apostles- దేశదేశాలలో ప్రచారం చేయడానికి దేవుడు పంపిన పన్నెండుగురు దూతలు); ఆ తరువాత పవిత్రస్నానం (Baptism) చేసిన ప్రతిఒక్కరూ అనేక భాషలు మాట్లాడ గలిగినవారై, అనేక అద్భుతాలను (Miracles) చేయగల శక్తులను దేవుడు వారికివ్వగా ప్రచారకులౌతారు. అలా అన్ని దేశాల్లోనూ వారు ఇతోధికమైన విశ్వాసులను రూపొందించి వారికి భగవత్ సందేశాలను, ఆనంద మార్గాన్ని అందజేస్తారు. క్రమేపీ కూటములుగా ఏర్పడి మానవజాతిని ఉద్ధరిస్తారు. అయితే వారు మరణించిన పిమ్మట కొన్ని తోడేళ్లు వక్రబుద్ధితో స్వర్గ శాసనాల్ని తమకనుకూలంగా మార్చుకుంటూ, నిజాన్ని కల్పనలతో, మూఢవిశ్వాసాలతో, అనాచారాలతో కలుషితం చేస్తారు. దేవదేవుని శాసనాలకు విపరీత వ్యాఖ్యాలు చేస్తూ వాటిని తమ కన్వయించుకుని, తద్వారా అధికారాన్ని సంపాదించుకుని, ఆధ్యాత్మికంగా నడుస్తున్నట్లు నటిస్తూనే పరమాత్మను తమ ద్వారానే చేరగలరని ప్రజలను నమ్మించి వంచించి ప్రతి ఒక్కరిపై అనేక మత న్యాయాలను, ప్రవర్తనా నియమావళిని రూపొందించి వాటికి ప్రాయశ్చిత్తాలను ప్రవేశబెడ్తారు. కరుణాత్మను బలంతో నిరోధించి, స్వేచ్ఛకు సంకెళ్లు వేసి, జీవ దేవాలయాలను శిధిలం చేసి, విశ్వాసాన్ని కూలగొట్టి, వారి స్వంత విశ్వాసాన్ని కూడా పోగొట్టుకుంటారు. పరమాత్మను, సత్యాన్ని నమ్మినవారిపై తీవ్ర ఆంక్షలు, హింసాపూరిత చర్యలు, అణచివేత ఒకపక్క, దంబాచారాలు, పూజా పునస్కారాలు, మొక్కుబడి పూజలు మరోపక్క, నిజమైన భక్తివిశ్వాసాల్ని దెబ్బతీస్తాయి. అలా ప్రపంచం, కాలం ముందుకు సాగుతుంటుంది. మంచి మలినం చేయబడి చెడు మెరుస్తూ మతం తన బరువుతో తానే కృంగి మూల్గుతుండగా, దుష్టలను శిక్షించి, శిష్టలను రక్షించేందుకు ఆతడు తిరిగి వస్తాడు. ఈవ్ సంతతిగా, మానవి బీజం (Woman's seed)గా పేర్కొనబడ్డ ఆ రక్షకుడు, ప్రభువు ఆకాశాన మేఘరూపంలో దర్శనమిస్తాడు. తండ్రి ఖ్యాతి నలుదిక్కులా ప్రకాశిస్తుండగా, సాతానును ఆతనిచే ప్రభావితమైన పాపలోకాన్ని అంతం చేయడానికి సృష్టించిన ప్రచండ జ్వాలాగ్నిలో పాతలోకం కాల్చబడి, శుద్ధిచేయబడి, పునీతమై ప్రకాశిస్తుంది. అప్పుడు స్వర్గలోకం, ఈ కొత్త భూలోకం అనంతకాలం వరకు సత్యమార్గాన, శాంతి, ప్రేమలు ఎల్లెడలా వ్యాపించగా ఈ లోకాల్లో అందరూ సుఖశాంతులతో పరమానంద స్థితిని అనుభవిస్తారు"

ఆదాం అడిగాడు– "ఎంత త్వరలో మీరు చెప్పిన విషయాలు నిజ మవుతాయి? మహాజ్ఞానీ! కాలమానం ఈ తాత్కాలిక ప్రపంచానికి చెందినదే కదా! అగాధంలోనూ, స్వర్గంలోనూ కాలం నిశ్చలమా! అనంతాన్ని చూడగల నయనాలెక్క డున్నవి! మీరు బోధించిన విషయాలతో నా మనసు సంతృప్తి చెందినది. శాంతి నొందిన మనసుతో నేనిక్కడ నుంచి నిష్క్రమించగలను. ఈ పాత్ర అంచులవరకు

జ్ఞానంతో నిండినది. అంతకు మించి అడుగుట, పొందుట తగనిది కదా! నేను అర్థం చేసుకున్నాను. విధేయత అన్నిటికన్నా గొప్పది. ప్రేమతో కూడిన భయంతో భగవానుని సేవించినపుడు ఆతని సన్నిధిలో నడయాడే యోగ్యత, అవకాశం లభిస్తాయి. ఆతని కరుణ ఉన్నపుడు చెడుపై మంచి, విజయాన్ని సాధిస్తుంది. చిరుశ్రమతో మహా కార్యాలు నిర్వహించవచ్చును. బలహీనులు బలవంతుల్ని మట్టికరిపిస్తారు. పిరికివాళ్లు ధైర్యవంతులౌతారు. సత్యమార్గాన నిలబడి కష్టాలనెదుర్కొన్నవారు అంతిమ విజయాన్ని పొందుతారు. విశ్వాసులకు మరణమే జీవద్వారాలను తెరుస్తుంది. ఈ విషయాలను తెలుసుకున్న నేను మానవ విముక్తిప్రదాతను మరింత అర్థం చేసుకున్నాను"

మైఖేల్ చివరగా అన్నాడు– "ఆదాం! జ్ఞాన సారాంశాన్ని అర్థం చేసుకున్నావు. అంతకన్నా తెలుసుకోవలసింది లేదు. తారల గ్రహాల విధి విధానాలు, వాయువుల మూలకాల శక్తియుక్తులు, అగాధపు రహస్యాలు, ప్రకృతి నిర్మాణాలు, దేవదేవుని సృష్టిని, స్వర్గ భూలోకాల్లో, గాలి, నేల, నీటిలో, ప్రపంచంలో ఆతడి నిర్మాణ కౌశల్యాన్ని చూసి ఆనందించినావు. ఈ అనంత జ్ఞానానికి విశ్వాసాన్ని జోడించు! అనేకమున్న ఈ ఏకప్రపంచానికి సామ్రాజ్యానికి అధినేతకు విధేయుడవై ఉండు. విశ్వాసాన్ని, సద్గుణాల్ని, సహనాన్ని, సంయమనాన్ని, ప్రేమను, జ్ఞానానికి తోడుగా చేసి తోటి మానవుల పట్ల దయను ప్రేమను (Charity) చూపు! అప్పుడు ఈ పారడైజ్‌ను, ఈ భూతల స్వర్గాన్ని వీడిపోతున్నానన్న బాధకు బదులు, నీలోనే ఇంకో 'పారడైజ్' ఉద్భవిస్తుంది. అది మరింత మనోహరంగా శాశ్వతంగా నీతో నిలిచి ఉంటుంది.

ఇప్పుడు మనమీ జ్ఞానచింతనను ముగించి కొండను దిగి వెళదాం. మనము విడిపోవాల్సిన సమయం ఆసన్నమైంది. అదిగో చూడు. నాతోవచ్చిన రక్షక దేవదూతలు తమతమ స్థానాల్లో నిలబడి వున్నారు. వారి ముందు వలయంగా పరిభ్రమిస్తున్న జ్వాలాఖడ్గం. ఇంక ఇక్కడ నుంచి మనం వెళ్లిపోవాలి. వెళ్లి 'ఈవ్'ను నిద్ర మేల్కొలుపు. ఆమె తీయని స్వప్నాల మధ్య విశ్రమించేలా చేసాను. ఆమె ఆత్మ కుదుటపడి, మనసు స్వాంతన చెందియున్నది. సరైన సమయంలో నీకు అనుభవమైన జ్ఞానాన్ని ఆమెకు తెలియజేయి. ఆమె సంతానమే రేపు మిమ్మల్ని, సమస్త మానవజాతిని విముక్తం చేస్తుందని, తను చేసిన పాపానికి ఆనాడు నిష్కృతి లభిస్తుందనీ వివరించు. ఇద్దరూ ఒకే విశ్వాసంతో చరించి దేవదేవునిపై విశ్వాసముంచి ఆతని కరుణకు పాత్రులై ధ్యానమార్గాన ఆనంద జీవితాన్ని గడుపుదురుగాక!"

అలా మాట్లాడుకుంటూనే ఇద్దరూ కొండ దిగివచ్చినారు. ఆదాం తన పొదరింటికి వెళ్లి కలలుకంటూ నిద్రిస్తున్న ఈవ్ దగ్గరకు వెళ్లేసరికే ఆమె మెలకువగా ఉన్నది. ఆతనిని చూసి ఆమె ఇలా అన్నది– "ఎప్పుడు నీవు వెళ్లావో, ఎక్కడకు

వెళ్లావో నాకు తెలియును. దేవదేవుడు నాకు నిద్రలో కలలో కనిపించి కొన్ని భవిష్యత్ విషయాలను తెలిపియున్నాడు. దుఃఖంతో కలత నిదురతో కలవరపడుతున్న నా మనసుకు ప్రశాంతత లభించినది. నానుంచి ఆలస్యం లేదు, నీతో కలిసి ఉండడం నాకు పారడైజ్‌లో ఉన్నట్లే. అది ఎక్కడైనా సరే! నీవు లేకుండా ఈ వనమైనా నాకు ఉండయోగ్యం కానిదే! నా తప్పుకు నన్ను ఈ వనం నుంచి, స్వర్గలోకపు క్రింద ఉన్న స్థలాలన్నిటినుంచీ బహిష్కరించినా, నా సంతానమే రేపటికాలంలో తిరిగి అన్నిటినీ పొందుతుందని గ్రహించి ఆనందిస్తున్నాను. నాకిక దుఃఖం లేదు. నీతోనే నేను" అన్నది ఈవ్.

ఆదాం చాలా సంతోషించినాడు. ఏమీ మాట్లాడకుండానే ప్రధాన దేవదూత మైఖేల్ ఉన్నవేపు చూసాడు. పక్కనే ఉన్న కొండపై నుండి తమకు నిర్ణయించబడిన స్థలాల్లోకి ప్రకాశిస్తున్న దేవదూతలు వచ్చి నిలబడ్డారు. నేలపైకి దూసుకువచ్చిన ఉల్కల్లా, చిత్తడి నేలల్లో ప్రవహించే నదిపై వ్యాపించిన సాయంకాలపు పొగమంచులా, ఇంటికి తిరిగి వస్తున్న శ్రామికుల సమూహపు పదఘట్టనలకు ఎగసిన ధూళిమేఘాల్లా వారు అక్కడకు వచ్చి నిలబడినారు. వారి ముందు దేవుని ఖడ్గం, జ్వాలల్ని విరజిమ్ముతూ, పరిభ్రమిస్తూ, భయంకరమైన తోకచుక్కలా, లిబియా ఎడారుల్లోని వేడిగాడ్పుల్లా ఉన్న ఆవిర్లను చిమ్ముతూ, ఆ ప్రదేశాన్ని వేడితో దహించసాగింది.

అక్కడే తటపటాయిస్తున్న మన ఆదిదంపతులను చెరొక చేత్తో పట్టుకుని త్వరితంగా నడిపిస్తూ, తూర్పు ద్వారం గుండా, కొండ కింద మైదానంలోకి తీసుకుని వచ్చి దేవదూత మైఖేల్ అదృశ్యమైనాడు. వారిద్దరూ వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ, పారడైజ్ తూర్పు భాగాన్ని, ఒకప్పటి వారి ఆనంద వనాన్ని, ఇప్పుడు జ్వాలావలయిత దైవఖడ్గంతో రక్షింపబడ్తున్న తమ ప్రియతమ పారడైజ్‌ను, ఆ ద్వారాలను కాపలాకాస్తున్న ఆయుధపాణులైన రక్షక దేవదూతల్ని చూస్తూ మరల మరల వెనక్కి తిరిగి చూస్తూ, వారి కనుల నుండి కన్నీటి చుక్కలు రాలగా, వాటిని తుడుచుకుంటూ, క్రమేపీ దూరమౌతున్న తమ వనాన్ని ఆఖరిసారిగా చూసి ముందుకు కదిలారు. ప్రపంచమంతా వారి ముందున్నది. విశ్రాంతి తీసుకోడానికి అనువైన ప్రదేశం కోసం వెదకుతూ అదృష్టమే మార్గదర్శకుడు కాగా చేతిలో చేయివేసుకుని ఆదాం, ఈవ్‌లు నెమ్మది నెమ్మదిగా నడుస్తూ ఈడెన్ వనం గుండా ఒంటరిమార్గాన సాగిపోతున్నారు.

They hand in hand with wandering steps and slow, through Eden took their solitary way.

Paradise Lost - 1 - Him the almighty power

'Dore'



Paradise Lost - 1 - Satan & Beelzebub

Paradise Lost-2- Before the gates sin and death

'Dore'

Paradise Lost-2 - The Journey of Satan

Paradise Lost-3 - Satan upon the firm opacious globe

'Dore'



Paradise Lost-4 - Me Miserable

Paradise Lost-4 - Adam & Eve

'Dore'

Paradise Lost-5 - The arrival of Raphel

Paradise Lost-5 - Raphel with Adam and Eve

'Dore'

Paradise Lost-6 - Hell at last

Paradise Lost-7- and god said let the waters generate

'Dore'



Paradise Lost-8- Adam & Eve

Paradise Lost-9 - Satan sees the snake

'Dore'

Paradise Lost-10 - dreadful was the din

Paradise Lost-11 - Noah's Ark

'Dore'



Paradise Lost-12 - Moses with Ten commandments



THE DOWNFALL OF THE REBEL ANGELS
Headlong themselves they threw
Down from the verge of heaven : eternal wrath
Burnt after them to the bottomless pit.

'Blake'



THE TEMPTATION OF EVE
So saying, her rash hand in evil hour
Forth-reaching to the fruit, she plucked, she eat



THE CREATION OF EVE

Under his forming hands a creature grew,
Man-like, but different sex, so lovely fair
That what seemed fair in all the world seemed now Mean

'Blake'



ADAM AND EVE SLEEPING

Him there they found
Squal like a toad, close at the ear of Eve.



SATAN WITH ADAM AND EVE (BOOK IV)
Ah! gentle pair, ye little think how nigh
Your change approaches

'Blake'



'Father, thy word is passed, Man shall find grace;
And shall Grace not find means, that finds her way,
The speediest of thy winged messengers,
To visit all thy creatures?'

Paradise Regain'd

John Milton



స్వేచ్ఛానువాదం

డాక్టర్ లంకా శివరామప్రసాద్

విషయసూచిక

1. బాప్టిజం పొందిన దైవకుమారుడిని ఎడారిలో కలిసిన సాతాను 203

2. రక్షకుడిని ప్రలోభపెడ్తున్న సాతాను. 212

3. రక్షకుడికి సాతాను చూపించిన సామ్రాజ్యాలూ, భోగాలూ 221

4. సాతానుపై విజయం సాధించిన దైవకుమారుడు 229

1. బాప్టిజం పొందిన దైవకుమారుడిని ఎడారిలో కలిసిన సాతాను

ఒక మానవుడి అవిధేయత వలన చేజారిన స్వర్గం గురించి ఇదివరకు గానం చేసాను. ఇప్పుడు మరో మానవుడు తన విధేయతా ప్రవర్తనతో, మాయావి ఎత్తులను చిత్తుచేసి, ఆతని ఆకర్షణలను తిప్పికొట్టి ఆతనిని సంపూర్ణంగా ఓడించి మానవజాతికి పారడైజ్‌ను తిరిగి అందించి, జనసంచారం లేని విశాలమైన ఎడారిలో మరల ఈడెన్ వనాన్ని నెలకొల్పిన వైనాన్ని గానం చేస్తున్నాను.

ఏ దివ్యాత్మ ఈ కీర్తివహించిన మునిని (Eremite), ఆధ్యాత్మిక శత్రువుపై విజయం సాధించిన ఎడారి మైదానంలోకి తీసుకువెళ్లిందో, దైవకుమారుని గురించి ఋజువును తెచ్చి ఇచ్చిందో, ఆ ఆత్మ నన్ను ఆవహించును గాక! దైవప్రేరణతో స్ఫురించిన ఈ దివ్యగీతం ప్రకృతి శిఖరాలలో, లోయలలో, విప్పారిన రెక్కలతో విహరిస్తూ, ధీరోదాత్తులైన వీరుల గాథలను మించుగాక! యుగయుగాలుగా రహస్యంగా అలిఖితంగా ఉన్న ఈ అద్భుత గీతం దివ్యకాంతులతో ప్రకాశించును గాక!

అప్పుడు బహిరంగ ప్రకటనలు చేసే ఓ మహావ్యక్తి భేరీభాంకార ధ్వనుల్ని మించే ప్రచండమైన స్వరంతో 'పశ్చాత్తాపపడండి! "Repentance!" అని గర్జించాడు. పవిత్రస్నానం చేసిన (Baptized) సేవకులందరూ అక్కడ జోర్డాన్ రేవు వద్ద పోగయ్యారు. నజరెత్ (Nazareth) నుంచి వచ్చిన జోసెఫ్ (Joseph) కుమారుడు అనామకుడిలా, అందరిలో ఒకడిలా, ఏ గుర్తింపూ లేనివాడిలా నిలబడగా, పవిత్రస్నానం చేయించే బాప్టిస్టు (Baptist) ఆతడిని తనకన్నా ఉన్నతుడైన వాడిగా గ్రహించి తన దివ్యస్థానం నుంచి తప్పుకునేందుకు సిద్ధమైనాడు. ఆతని మాట ఋజువు చేయడానికన్నట్లుగా, స్వర్గలోకపు ద్వారాల నుంచి పావురంలా ఓ ఆత్మ దిగిరాగా ఆకాశం నుంచి జగత్పిత స్వరం "ఆ యువకుడు తన కుమారుడు" అని పలికి అదృశ్యమైంది.

ఆ మాటలను విన్న శత్రువు, అక్కడే తచ్చాడుతూ, ఒక సాధారణ మానవుడిని దైవస్వరం ఉన్నతుడిగా చేయడాన్ని ఆశ్చర్యంతో గమనించి, అసూయ కమ్ముకురాగా, కోపంతో తన నివాసానికి పోయాడు. అయినా నిద్రపట్టక వాయుమధ్యాన, మబ్బుల చీకటిలో తన అనుయాయులతో సమావేశమేర్పరచి హతాశుడై ఇలా పలికాడు–

"ఓ ప్రాచీన శక్తులారా! ఈ విశాల ప్రపంచంలో వాయువులు తిరిగే ఈ ప్రదేశాలలో తిరుగాడే ఆత్మలారా! ఈ వాయు ప్రదేశాన్ని మనం ఆక్రమించు

కున్నాం!నరకాన్ని అసహ్యించుకున్నాం! నా మాయమాటలతో 'ఆదాం', ఆతని సహచరి 'ఈవ్' జ్ఞానఫలాన్ని తిని పారడైజ్ స్వర్గాన్ని కోల్పోయినప్పటి నుంచి ఎన్నో సంవత్సరాలు, యుగాలు గడిచినాయి. భూమిపై వాయులోకంపై మన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ మన ఇష్టం వచ్చినట్లు మనం పరిపాలించాము. అప్పటి నుంచి నేను నా తలపై బహద్ఘాతాన్ని కలిగించే మానవుడు– ఈవ్ సంతతి (Seed of Eve) ఎవరా అని భయభయంగా ఎదురుచూస్తున్నాను. అతడి ఉనికి తెలిసింది. మనకు ప్రమాద ఘడియలు ప్రారంభమయ్యాయి. స్వర్గలోకపు శాసనాలు ఇన్నాళ్లపాటు ఆలస్యమైనా, ఇక్కడి దీర్ఘకాలం అతడికి స్వల్పకాల పరిమాణమే. పరిభ్రమించే కాలచక్రపు ఘంటారావాలు మన సమీపానికి వచ్చేప్పటికే మనం ఆ పెద్ద గాయం తగలకుండా తప్పించుకోగలగాలి. ఒకవేళ తలకు గాయమైనా మనశక్తులన్నీ పోవుకనుక భూమిపై, గాలిలో మన ఆధిపత్యం కొనసాగుతుంది. 'ఈవ్' సంతతి దినదిన ప్రవర్ధమానమైనాడన్న చెడువార్త మీకు తెలపాల్సి వస్తోంది. ఆతడు సద్గుణ సంపన్నుడు, జ్ఞాన, రూప శోభితుడు. గొప్పగొప్ప కార్యాలను చేయగల సమర్థుడు. ఆ విషయమే నాలోని భయాన్ని వేలరెట్లు పెంచుతున్నది. ఆతని రాకను తెలపడానికి మరో ప్రవక్త ముందే జనించి ఆగమన సూచకుడై (Harbinger) ప్రజలను పవిత్రజలాలతో అభిషేకించి (Baptism) వారిని శుద్ధిగావించి ప్రభువును స్వాగతించేందుకు సిద్ధం చేస్తున్నాడు. ఆతడుకూడా ఆ ప్రవక్తచే పరిశుద్ధుడై ఉండగా, దైవవాక్కు అందరికీ వినబడేలా– 'ఆతడు దైవకుమారుడని' –పలుకగా అందరూ ఆశ్చర్యచకితులైనారు. ప్రవక్తసైతం ఆతనిని పూజించగా మేఘాలపైని ఆకాశపు స్ఫటిక ద్వారాలు తెరవబడి, స్వచ్ఛమైన పావురం ఆతని తలవేపు దిగివచ్చినది. స్వర్గం నుండి దైవవాక్కు "ఈతడు నా ప్రియకుమారుడు", ఇతని యందు నేను సంతోషించినాను" అని వినవచ్చినది. ఈతని తల్లి మానవస్త్రీ. ఈతని తండ్రి స్వర్గాన్ని పాలించే చక్రవర్తి. తన కుమారుని కోసం ఆతడు చేయలేని కార్యమేమున్నది? ఆతని కుమారుడు మనపై పిడుగుల వర్షాన్ని కురిపించి మనల్ని నరకలోకపు అట్టడుగుకు తరిమిన విషయం మనల్నింకా పుండులా సలుపుతూనే ఉన్నదికదా! ఇతడెవరో మనం తెలుసుకోవాలి! రూపురేఖలు, ముఖకవళికలలో తన తండ్రి కీర్తి, ప్రకాశం కొట్టవస్తున్నట్లు కనిపిస్తున్నది. మనమిప్పుడు ప్రమాదం అంచున ఉన్నాం, దానిలో వివాదం లేదు. మనం చెయ్యాల్సిందల్లా ఆతనిని ప్రతిఘటించడం – బలంతో కాదు – యుక్తితో, కుయుక్తితో! వలల్నివేసి, ఉచ్చుల్ని పన్ని – ఆదాంను ఒంటరిగా ఎలా అయితే పతనం చెందించానో – ఇతన్ని కూడా మరో నెమ్మదైన ప్రయాణంలో ఓడించి విజయం సాధిస్తాను"

అతడు తన ప్రసంగాన్ని ముగించగానే అతని అనుయాయులు తమకు రాబోతున్న ఉపద్రవాన్ని గుర్తించి విషాదంలో మునిగినా, తమ నాయకుని మరో

ప్రయాణానికి మద్దతు తెలిపారు. ఆదాంకు వ్యతిరేకంగా ఆతడు చేసిన ప్రయత్నం వల్లనే వారు నరకకూపపు చీకటినుంచి బయటపడి కాస్త వెలుగులోకి వచ్చారు. రాజులు, పాలకులు, చక్రవర్తులు, చిల్లరదేవతలుగా భూలోకంలో చిన్నచిన్న రాజ్యాలను పాలిస్తున్నారు.

జోర్డాన్ తీరం నుంచి పాముబుద్ధులతో వెదకుతూ ఆ మాయావి మనుష్యులలో మనీషి, దేవుని కుమారుడిగా ధృవపరచబడినవాడు అయిన విరోధిని తన తలపై మోదే లోపలే కాటువేయ సంకల్పించుకొని, తన సామ్రాజ్యాన్ని నాశనం చేయడం కోసం భువిపై అవతరించిన ఆ మానవుడిని తప్పుదారి పట్టించేందుకు బయల్దేరినాడు. అయితే సాతానుకు తెలియనిదేమిటంటే, దేవదేవుని చేత నిశ్చితమైన మహా కార్యానికి ఆ మాయావి స్వయంగా సాయపడుతున్నాడని.

దేవదూతలందరూ సమావేశమైన ఆ సభలో దేవదేవుడు చిరునవ్వు నవ్వుతూ గాబ్రియేల్‌తో ఇలా పలికాడు.

"గాబ్రియేల్! (Gabriel) నీవు, మిగిలిన దేవదూతలు ఎవరైతే మానవుల వ్యవహారాల్ని చూస్తున్నారో వారు, నేను మీద్వారా గెలిలీయో (Galileo)లోని కన్య (Virgin)కు పుత్రసంతానాన్ని కనమని పంపిన సందేశానికి సాక్షులు కదా! ఆతడు పేరుప్రఖ్యాతులతో దేవుని కుమారుడిగా ప్రసిద్ధికెక్కుతాడని వివరించగా, ఆమె కన్యకు సంతానమేమిటని సందేహపడినది. ఆమెను అనుగ్రహించిన పవిత్రాత్మ (Holy Ghost), సర్వోన్నతుడి శక్తిగా ఆమెను ఆవరించగా ఆ కన్యకు జనించిన వాడు నేడింతటివాడైనాడు. ఆతడి జన్మ ఉత్కృష్టతను, ఆతని సద్గుణాలను లోకానికెరుక పరచుటకై నేను ఆతడిని సాతాను ఎదుట పడవేస్తాను. సాతాను తన శాయశక్తులా ప్రయత్నించి ఈతడిని తన వశం చేసుకో ప్రయత్నించి భంగపడనీ! జాబ్ (Job) విషయంలో పరాజయం చెందినా, సాతాను తన మాయల్ని ఈతడిపై ప్రయోగించి, ఓటమి చెంది మరలా నరకలోకానికి నెట్టివేయబడనీ! తొలి మానవుడు మోసం వల్ల కోల్పోయిన దానిని ఆతడు పోటీలో గెలుస్తాడు. మొదట ఆతడు ఎడారిలో దారితెన్నూ తెలియక తిరగనీ! యుద్ధానికి అవసరమైన ఆయుధాలను త్యజించాక, నేను ఆతడిని బద్ధశత్రువులైన పాపదేవత (Sin), మృత్యుదేవత (Death)లను ఓడించడానికి పంపుతాను. అణకువ, సహిష్ణుత (Humiliation, Sufferance)లే ఆతని శక్తులై, ఆతని బలహీనతే సాతాను శక్తిని నిర్వీర్యం చేయగా, పాపభరితమైన శరీరధారులు, ఈ ప్రపంచం, సమస్త దేవదూతలు, శక్తులూ నిజాన్ని గ్రహిస్తారు. ఎటువంటి సద్గుణాల రాశి అయిన సంపూర్ణ మానవుడిని, దైవకుమారుడిని ఎన్నికచేసి మానవజాతిని పాపవిముక్తి చేయడానికి నేను పంపానో తెలుసుకుంటారు.

జగత్పిత అలా పలుకగానే స్వర్గలోకమంతా ఒక్కక్షణం నిశ్చలమై, ఆ తరువాత భగవానుని కీర్తిస్తూ, స్వర్గసింహాసనం చుట్టూరా ప్రదక్షిణాలు చేస్తూ స్తోత్రపాఠాలను గానం చేసినారు.

"విజయం! ఘనవిజయం! దైవకుమారునకు! ఘనమైన ద్వంద్వ యుద్ధంలో ఆయుధాలు లేకుండా, మోసాన్ని జ్ఞానంతో గెలవబోయే మహావీరునికి జయమగుగాక! కుమారుని ప్రతిభ తండ్రికి తెలియును. ఆతని శక్తిసామర్థ్యాలు బహిర్గతమై ఎటువంటి ప్రలోభాన్నైనా, కుయుక్తులనైనా, మోసాన్నయినా అధిగమించును గాక! నరకలోకపు అధినేత ప్రణాళికలన్నిటిని ధ్వంసం చేసి ఆ దుష్టబుద్ధి పన్నాగాల్ని నశింపచేయును గాక!"

అలా దేవదూతలు స్వర్గలోకంలో గీతాలను, భక్తిపాటలను పాడుతూ ఉన్నారు. జాన్ (John) బాప్టిజం (Baptism) చేసిన ఊరు బెతబారా (Bethabara)లో ఉన్న దైవకుమారుడు మానవజాతి సముద్ధరణకు సమకట్టిన బృహత్కార్యాన్ని ప్రారంభించ తలపోసినవాడై ఒంటరిగా, జనసంచారం లేని సమీప ఎడారిలో, కొండలు గుట్టలతో, చీకటి నీడలతో ఉన్న ప్రదేశంలో అడుగుపెట్టి ధ్యాన నిమగ్నుడయ్యాడు.

"ఒక్కసారిగా నాలో సమూహమై ప్రవేశించిన ఆలోచనలు, ఎక్కడి నుంచో వచ్చి, నావిగా అనిపిస్తూ, నావిగా వినిపిస్తూ, నన్ను నేను సరిపోల్చుకునేలా ఉంటున్నాయి. బాలుడిగా ఉన్నప్పుడు కూడా ఆటలకన్నా వేరే విషయాలైన జ్ఞానం, మంచితనం, సేవ, వీటిపై నాకు దృష్టి ఉండేది. బహుశా నా గమ్యం మిగతా వారికన్నా భిన్నమైనదని అనిపించేది. సత్యమార్గాన్ని పరిరక్షించడం, మంచి విషయాల్ని పెంపొందించడం నాకిష్టమైన పనులుగా ఉండి దైవన్యాయం, ధర్మంపై ఆసక్తి పెరిగి ఆ శాసనాలు నాకు అద్భుతంగా తోచేవి. పన్నెండేళ్లకే విందు పండగ (Great feast) రోజున దేవాలయానికి వెళ్లాను. బోధకులు చెప్పిన విషయాలతో నా జ్ఞానాన్ని సరిపోల్చుకుని నేను చెప్పిన విషయాలను వారందరూ ఆమోదించినారు. నా ఉత్సాహం అక్కడితో ఆగలేదు. విజయగాథలు, వీరత్వపు సంఘటనలు, ఇజ్రాయెల్‌ను అణచివేస్తున్న రోమన్ కాడిని (Yoke) తొలగించాలన్న ఆలోచనలు నన్ను నడిపించసాగాయి. ప్రపంచమంతా వ్యాపించి ఉన్న దారుణ హింసను, నియంతృత్వ శక్తుల్ని ఓడించి, సత్యాన్ని విముక్తం చేసి, సమానత్వాన్ని సాధించి, మానవత్వాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో వినే హృదయాలకు చక్కని మాటలను చెప్పి వాళ్లను దైవమార్గం వేపు మళ్లించదలచాను. దారి తప్పుతున్న ఆత్మలను సరైన మార్గంలో నడిపించడానికి నేను చేస్తున్న ఆలోచనలను పసిగట్టిన నా మాతృమూర్తి ఆనంద పరవశురాలై అన్నది–

"కుమారా! నీ ఆలోచనలను సత్యం, సద్గుణాలు ఎంత ఎక్కువ ఎత్తుకు తీసుకువెళ్లగలవో అంత ఎత్తుకు తీసుకునిపో! అయితే చేతలే గీటురాయిగా ఉంటాయి సుమా! మానవులు నిన్ను తమతోటి మానవుడిగానే భావించినా, నీవు దేవిడ్ వారసత్వ సింహాసనంపై కూర్చుని సమస్త ప్రపంచాన్ని పరిపాలించగలవని తెలిపియున్నాడు. బెత్లహెమ్ (Bethlehem) పొలాల్లో తమ మందల్ని కాపుకాస్తున్న గొర్రెలకాపర్లకు దేవదూతలు రక్షకుడు (Messaiah) జన్మించి ఉన్నాడని చెపుతూ ఆతని గుణగణాల్ని గానం చేసారు. ఆ గొర్రెలకాపరులు పశువుల చావడిలో ఉయ్యాలలో నిదురిస్తున్న పసిబాలుడ్ని చూసి ఆనందం చెందారు. అంతవరకూ లేని కొత్త నక్షత్రం ఆకాశాన ఉదయించగా, దానిని గమనిస్తూ తూర్పుదేశాల నుంచి వచ్చిన ముగ్గురు జ్ఞానులు సుగంధ పరిమళద్రవ్యం, గుగ్గిలం, బంగారం తెచ్చి కానుకలుగా సమర్పించి ఇజ్రాయెల్ రాజు జన్మించాడని సంబరపడినారు" అన్నది మేరీమాత.

ధర్మబద్ధుడైన సిమియన్ (Simeon), ద్రష్ట 'అన్నా' (Anna) స్వప్నంలో హెచ్చరించబడినవారై నన్ను దేవాలయంలో చూసి పూజారికి ఉచితమైన దుస్తులను సమర్పించి అనేక విషయాలను మాట్లాడినారు. వెంటనే నేను ప్రవక్తల ధర్మాన్ని, న్యాయసూత్రాలను వివరించే గ్రంథంలో మెస్సయ్య-రక్షకుని గురించి చెప్పబడిన వాక్యాలను గమనించాను. ఆతని మార్గం దుస్తరమై చివరకు మృత్యువుకు దారితీస్తుందని ఉన్నా, వాగ్దానం చేయబడి ఉన్న రాజ్యం కోసం (Promised Kingdom), మానవుల విముక్తి (Redemption) కోసం, మానవుల పాపాలను నా శిరస్సుపై మోయ నిశ్చయించుకుని, దృఢ నిశ్చయంతో సరైన సమయంకోసం ఎదురుచూడసాగాను. నాకంటే ముందు వచ్చిన ప్రవక్త జాన్ (John) నన్ను చూడగానే, దైవవాక్కు ఆతనిని సమర్థించగా, ఈతడు దైవకుమారుడు – నేను ఆతని రాకను హెచ్చరించ వచ్చిన ప్రతీహారిని (Harbinger) అని జాన్ (John) ప్రకటించినాడు. నాకు బాప్టిజమ్ ఇవ్వ నిరాకరించినా నేను ఆతనిని ఒప్పించాను. అంతలో స్వర్గద్వారాలు తెరచుకుని పవిత్రాత్మ నుండి – "ఈతడు నా ప్రియ కుమారుడు. ఈతని వలన నేను సంతోషపడినాను" – అని వినబడగా నేను నా ప్రచారానికి తగు సమయం వచ్చినట్లు భావించినాను. ఇక ప్రచ్ఛన్నంగా ఉండక, స్వర్గం నుంచి నాకు లభించిన అధికారాన్ని వినియోగించదలచుకుని ఏదో బలమైన శక్తి నన్ను ఈ ఎడారిలోకి లాగుకొనిరాగా, కారణం తెలియక, నేను తెలుసుకోనవసరం లేదేమో, దానిని దేవదేవుడే తెలియజేయగలడని నమ్ముతున్నాను"

అలా అనుకుంటూ ఆ చీకటి ఎడారిలో చాలాదూరం నడిచిన మన ఉదయతార అంతూ పొంతూ లేని ఇసుకమైదానంలో జనసంచారం లేని ఆ ప్రాంతంలో

అలా తిరుగుతూనే ఉన్నాడు. బహుశా జనబాహుళ్యంలోకి వెళ్లేముందు ఒంటరితనాన్ని అనుభవించడం ఉచితమని భావించి వుండవచ్చు. నలభై రోజులు గడిచాయి. కొన్నిరోజులు గుట్టలమధ్య, కొన్నిరోజులు లోయల్లో, రాత్రిళ్లు ఓ పురాతన ఓక్ వృక్షం క్రిందో దేవదారు వృక్షం కిందో, మంచు ఎక్కువగా ఉన్నప్పుడు ఏదో గుహలో, విశ్రమిస్తూ, ఆకలిదప్పులు ఆతని చెంతకే రాకుండా ఉండగా అడవి మృగాల మధ్య నిద్రపోతూ ఉండేవాడు. అంతటి క్రూరజంతువులూ ఆతనికే అపకారం చేసేవి కావు. సర్పాలు ఆతనిని చూసి తప్పుకునేవి, సింహాలు, పులులూ దూరంగా నిలబడేవి. అయితే ఇప్పుడు ఆతడిని వయసులో పెద్దవాడు, దారితప్పిన ఆడగొర్రె (Ewe)ను వెదకుతున్న వాడిలా అనుసరించాడు. శీతాకాలపు చలికి తట్టుకోడానికి, సాయంకాలం పొలం నుండీ వస్తూ ఎండుకట్టెలను పోగుచేస్తున్న వాడిలా ఉన్న ఆతడు ఆ ఎడారిలో తిరుగాడుతున్న వ్యక్తిని పలకరించాడు.

"ఆర్యా! మనుష్యులు తిరుగాడే రహదారికి దూరంగా ఉన్న ఎడారి ప్రాంతానికి ఎందుకు వచ్చారు? ఒంటరిగా ఉన్నవ్యక్తి ఇక్కడ ఆకలి దప్పులతో మరణించడం తథ్యం. మిమ్మల్ని అడగడం కాదుగాని మెచ్చుకుంటున్నాను. జోర్డాన్ పాటిరేవు (Jordan Ford) వద్ద ప్రవక్త, పవిత్ర స్నానం చేయిస్తూ (Baptism) దేవుని కుమారునిగా సంభోదించినది మిమ్మల్నే కదా! ఈ కొండల్లో గుట్టల్లో తిరిగే మాబోటి వాళ్లకు దగ్గర పట్టణాల్లో జరిగే వార్తలు తెలుసుకొన కుతూహలం ఉంటుంది. వింతలు విడ్డూరాలతో పాటు పేరు ప్రఖ్యాతులు కూడా మాకు వార్తలుగా అందుతాయి. మీకు దారి చూపించమంటారా!"

దైవకుమారుడు సమాధానమిచ్చాడు– "ఎవరు నన్నిక్కడకు తీసుకురావాలను కున్నారో ఆతడే నన్నిక్కడకు తెచ్చినాడు. వేరెవ్వరి మార్గదర్శకత్వం నాకక్కరలేదు"

"ఇక్కడ మేము దుంపలు, కాయగసుర్లతో కాలం గడుపుతాము. దాహం వేస్తే ఒంటెలు పోయినట్లు చాలా దూరం పోయి నీటిమడుగుల దగ్గర నీళ్లు తాగుతాము. ఇన్ని కష్టాలు పడుతున్నాం! నీవే కనుక నిజంగా దేవుని కుమారుడవైతే ఆ బండరాళ్ల నుంచి రొట్టెల్ని తయారు చేయకూడదా నీకూ, మాకూ ఆకలిబాధ తప్పుతుంది" అన్నాడు సాతాను.

దైవకుమారుడు సమాధానమిచ్చాడు–

"రొట్టెలో అంత బలమున్నదా! మీకు తెలియునుకదా మానవుడు రొట్టెవలన కాదు దైవవాక్కు వలన జీవించునని కదా వాక్యము! మన పెద్దవాళ్లు మోసెస్ పర్వతం వద్ద (Mount Moses) ఆకలితో మాడ్తున్నపుడు ఎవరు వారికి మన్నా

(Manna) ఇచ్చి క్షుద్బాధ తీర్చింది? నలభై రోజులపాటు తిండీ, నీరు లేకుండా ఎలీజా (Elizah) ప్రవక్త నాలానే ఈ అరణ్యమంతా తిరుగాడలేదా! నేనూ అంతే! నీకు నేనెవరో తెలుసు. నాకు నీవెవరో తెలుసు. ఎందుకు నన్ను దేవదేవుడి వాక్కును నమ్మవద్దని చెబ్తున్నావు?"

దానికా బద్ధశత్రువు సమాధానమిచ్చాడు– "నీమాట నిజమే, నేనే ఆ దురదృష్టం వెంటాడిన ఆత్మను. త్వరపడి చేసిన తిరుగుబాటు వలన నేనూ, మిలియన్ల కొద్దీ నా అనుయాయులు పరమానందకరమైన స్వర్గం నుంచి అట్టడుగు అగాధంలోకి పతనం చెందాము. ఆ చీకటి నరకంలో బాధలు సహిస్తూ ఉండలేక ఈ భూలోకంలోని స్వేచ్ఛను అనుభవిస్తూ ఇలా గాలిలో, నేలపై తిరుగుతున్నాము. నేనూ దేవుని కుమారులతో ఉన్నపుడు నాకు ఉజ్జయిన్ జాబ్‌ను (Uzzean Job) అప్పగించి పరీక్షించమన్నప్పుడు ఆహబ్ రాజును (King Ahab) రామోత్ (Ramoth)లో మట్టి కరిపించమన్నప్పుడు దేవదేవుడు ఏమి ఆజ్ఞాపిస్తే అది నిర్వర్తించాను. ఇప్పుడు దేవుని కరుణను పోగొట్టుకొని, వన్నెతగ్గి వున్నాను. అయినా ప్రేమించడాన్ని మానలేదు. మంచిని, సద్గుణాలను మెచ్చుకొనడం మానలేదు. అందుకే దేవుని కుమారునిగా ప్రకటించబడ్డ మిమ్మల్నిచూసి, మాట్లాడి, జ్ఞానబోధను పొంది, మీ ప్రకటిత దైవకార్యాలను మహత్తును వీక్షించే భాగ్యాన్ని నాకు ప్రసాదించకోరుతున్నాను. మానవులు నన్ను మానవజాతికి కీడు కలిగించే వ్యక్తిగా, శత్రువుగా భావిస్తారు. అలా నేనెందుకు చేస్తాను? వారు నాకేమీ అపకారం చేయలేదే! వారివల్ల నాకూ నా పరివారానికీ ఎటువంటి కీడూ జరగలేదే! పైపెచ్చు నేను లాభమే పొందాను. వారితో పాటు ఈ విశాల ప్రపంచంలో గాలిలో, నేలపై భాగస్వామిగా తిరగాడుతున్నాను. నా సహాయాన్ని, సలహాల్ని వారు కోరినా కోరకపోయినా కలలుగా, సంజ్ఞలుగా, సూచనలుగా, జవాబులుగా, దర్శనాలుగా ఇచ్చి నా వంతు సాయం వారికి భవిష్యత్ మార్గదర్శనం చేస్తున్నాను. వారు అనుకుంటారు అసూయద్వేషాలు నాకిష్టమని, వాటిని కలిగినవాళ్లు నా మిత్రులని. మొదట్లో నిజమేమోకాని ఇప్పుడు నాకు అనుభవం మీద తెలిసివచ్చిందేమిటంటే ఎవరిబాధను వాళ్లే అనుభవించాలి. పంచుకున్నంత మాత్రాన దాని బరువు తగ్గదు! నాకు మరింత దుఃఖాన్ని కలిగించే విషయమేమిటంటే, పతనాన్నుంచి మానవుడు ఉద్ధరించబడతాడు. నాకూ నా పరివారానికీ ఆ అదృష్టం లేదు."

సాతాను మాటలకు రక్షకుడు తీవ్రంగా స్పందించాడు– "అబద్ధాలతో మొదలైన జీవితం అబద్దాలతోనే అంతమవుతుంది. నీ పరిస్థితి అంతే! నీకు స్వర్గానికి రావాలనుంటే వద్దువుగాని, కాని సంకెళ్లతో బంధించబడిన నికృష్ట ఖైదీలా,

మహిమాన్వితుడైన ఆ దేవదేవుని సింహాసనం ముందు – ఓడిపోయి, గెంటివేయబడి, జవసత్వాలూడి, బిత్తర బిత్తరగా చూస్తూ, ఎవరూ దయగా చూడక, త్యజించబడి – తిరస్కరింపబడిన శిధిలాల మూటలా, స్వర్గలోకపు అధిపతి ముందు కూలబడుదువు గాని! పరమానందకరమైన స్థానాన్ని కాలదన్ని, అన్నంపెట్టిన చేతినే కరచి, కడుపు మంటతో, అసూయాద్వేషాలతో రగిలే నిన్ను దేవదేవుడెలా గౌరవిస్తాడు? ఎలా సంభాషిస్తాడు? దేవదేవునికి నీ సేవ అంటావా నీలో విధేయత లేదు. ఇతరులలో భయాన్ని రేకెత్తించడం, కీడు చెయ్యడం నీకు ఆనందాన్ని కలిగించే విషయాలు. సన్మార్గుడైన జాబ్ (Job)ను ఎన్నిరకాలుగా వేధించావు? అయినా అతని సహనం, అతని ఓర్పు ఆతనికి గెలుపునిచ్చాయి. ఆహబ్‌రాజు పని అంటావా! అది నీవు కోరుకున్నదే! నాలుగు వందల నోళ్లతో అబద్దాలు మాట్లాడే నీకు అబద్ధాలే గదా ఆహారం! అయినా నిజం మాట్లాడినట్లు భ్రమింపచేస్తావు. కొంచెం నిజానికి కొండంత అబద్ధాలను కూర్చి నిదర్శనాలుగా, దర్శనాలుగా చూపిస్తావు! నిజాల ముసుగులో అసత్యాలను వ్యాపింపజేస్తావు! నీ సమాధానాలన్నీ సూటిగా ఉండవు కదా! మసిపూసి మారేడుకాయను జేసి నీ సలహా అడిగిన వాళ్లను గజిబిజిలో, సందేహాల్లో పడవేస్తావు. అదీ నీవు చేసే సాయం! దేవదేవుడు ఈ రాజ్యాలను నీ మాయలో పడవేయడానికి ఎందుకు అంగీకరించాడో తెలుసా అవి విగ్రహారాధకులుగా మారాయి గనుక. నీ ఆరాధకులు, నీ దేవాలయాలు అన్నీ నేలమట్టమయ్యే కాలం వచ్చింది. నీవు చెప్పే సూచనలు, చూపించే దర్శనాలు అన్నీ వికటించి నీకే ఎదురుతిరుగుతాయి. డెల్ఫాస్ (Delphos) లేదా ఇతర ప్రాంతాల్లో తెలుపబడే దర్శనాలు, పూనకాలు మూగవై, దేవదేవుడు పంపిన జీవ దర్శకుడు, రక్షకుని (Living Oracle) రాకతో మానవులకు కనువిప్పు కలుగుతుంది. అంతిమ నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఆతడు పంపే సత్యరూపమైన దివ్యాత్మ, పవిత్ర హృదయాలలో అంతర్దర్శనమై మానవులకు జ్ఞానమార్గాన్ని బోధిస్తుంది."

ఆ మాటలు విన్న సాతాను ఆగ్రహపరవశుడైనా, తమాయించుకుని పైకి నెమ్మదిగా పలికినాడు– "ప్రతీకారాన్ని తీర్చుకోమని చాలా సున్నితంగా అయినా పదునుగా చెప్పి, నా చేతనయినది చేసుకోమన్న ధ్వనిని కలిగించావు. మంచిదే! సత్యమార్గాన దృఢంగా నీవు నిలబడు. అసత్యాల పుట్టను గదా నేను అసత్యాలనే నీపైకి ఉసిగొల్పుతాను. అప్పుడప్పుడు సత్యం నుంచి దూరంగా వెళ్లడం తప్పుకాదు. నటించడం, పొగడడం, చెప్పడం, మానడం, వదిలేయడం ఇవన్నీ పరిస్థితినిబట్టి సత్యాన్ని వాడే విధాలు. నీవు నాకంటే ఉన్నతంగా ఉంచబడ్డావుగదా, నా ప్రభూ! నేనిక్కడ నుంచి నిశ్శబ్దంగా, అపాయరహితంగా వెళ్తున్నందుకు ఆనందంగా ఉన్నది.

సత్యమార్గం కష్టతరమైనది. వినడానికి అందంగా, మాట్లాడడానికి సులువుగా, పాడటానికి సిల్వన్ పాట (Silvan Song)లా ఉన్నా, నడవడానికి చాలా ఇబ్బందిని కలిగిస్తుంది. సత్యాన్ని మీనోటి నుండి వినాలని ఉబలాటపడ్డాను చాలామంది సద్గుణాలను ప్రేమిస్తారు కాని వాటితో శాశ్వతంగా కాపురం చేయరు. మీరు మాట్లాడేప్పుడు వినడానికి నేను వచ్చేందుకు అనుమతినివ్వండి. పవిత్రుడు, స్వచ్ఛమైనవాడు, జ్ఞానవంతుడు అయిన దేవదేవుడు తన సన్నిధిలో హేతువాది, మోసగాడు తిరగడం సహించడు. బాలాం (Balaam)కు జరిగినట్లు నేను మీ దగ్గరకు వచ్చేప్పుడు తిరస్కరించవద్దు.

రక్షకుడిలా పలికాడు– "నీ మనసులో ఏమున్నదో తెలిసినా నిన్నిక్కడకు రానిచ్చాను. పైవాడి ఆజ్ఞ ఎంతవరకో అంతవరకూ నీవు నీ శక్తిమీరా ప్రయత్నించు. అంతకంటే ఎక్కువేమీ చేయలేవు"

సాతాను తలవంచి నమస్కరించినట్లు కనపడుతూ గాలిలోకి అదృశ్య మయ్యాడు. రాత్రి తన రెక్కలతో ఎడారిని మరింత చీకటిమయం చేసింది.పక్షులు తమ గూళ్లలో నిద్రిస్తున్నాయి. క్రూరమృగాలు అడవుల్లో అటూయిటూ తిరుగుతున్నాయి.

2. రక్షకుడిని ప్రలోభపెడ్తున్న సాతాను

జోర్డాన్ పాటిరేవు వద్ద బాప్టిస్టు జాన్‌తో పవిత్ర సంప్రోక్షణము పొందిన (Baptism) ఆండ్రూ (Andrew), సైమన్ (Simon)లు తమతోపాటు బాప్టిజాన్ని పొంది, జీసస్ మెస్సయ్యగా, రక్షకుడిగా, దైవకుమారుడిగా పిలవబడి తమతోపాటే ఉంటున్న ఆ వ్యక్తి కొద్దిరోజులు కనిపించకపోయేసరికి అనేక సందేహాలతో సతమత మయ్యారు. అలా కన్పించి ఇలా మాయమైన ఆతడు ఎవరు? మరల వస్తాడా, రాడా, అనేటువంటి అనుమానాలు మొలకెత్తగా వాళ్లు – మోసెస్ (Moses) కొండపైకి వెళ్లి, రావడం ఆలస్యమైనప్పుడు, థిస్‌బైట్ (Thisbite) ఎలిజా (Elijah) జ్వాలా చక్రాలపై స్వర్గానికి వెళ్లినపుడు సందేహించిన ప్రజల్లా – వాళ్లూ ఆతనికోసం వెదకసాగినారు. బెతెబారా (Bethebara) దగ్గర్లో ఉన్న ప్రాంతాన్ని, జెరికో, ఈనాన్, సలెమ్, మఛెరస్ (Jerico, Aenon, Salem Old, Machaerus) గెనెజారెట్ (Genezaret) సరస్సుకు ఈవల వున్న దుర్గపట్టణాల్ని, పెరియా (Perea) ప్రాంతాన్ని వెదకి వెదికి తిరిగి వచ్చారు.

జోర్డాన్ ఒడ్డుకు దగ్గర ఉన్న ఓ చిన్న నీటిపాయ, దట్టంగా రెల్లుగడ్డి (Reeds and Osiers) అక్కడ ఇద్దరు చేపలు పట్టేవాళ్లు మామూలు మత్స్యకారులే వాళ్లకు తమతో ఉన్న ఆ అసాధారణ వ్యక్తి ఏమైనాడు? ఏదైనా ప్రమాదం జరిగిందా! అతని ద్వారానే ఇజ్రాయెల్ రాజ్య పునరుద్ధరణ జరుగుతుందని చెప్పబడినదే! ఓ ఇజ్రాయెల్ దైవమా! రక్షకుడు రావాల్సిన సమయం ఆసన్నమైంది. భూమిమీద ఉన్న రాజులారా! ప్రజలను అణిచివేయుట మానండి. వారి భుజాలపై నున్న శ్రమకాడిని తొలగించండి. మనం ఎదురుచూస్తున్న దైవకుమారుడు వస్తున్నాడు! అతని రాక ముందుగానే తెలుపబడింది. ఆతనిని దేవదేవుడు తిరిగి తీసుకునిపోలేదు. మన ఆశ, మన ఊపిరి మనకోసం తప్పక తిరిగివస్తాడు!"

ఆతని తల్లి మేరీమాత (Mother Mary) బాప్టిజానికి వెళ్లిన అందరూ తిరిగివచ్చినా తన కుమారుడు రాకపోవడంతో సహజమైన మాతృప్రేమ, తన కుమారునికేమీ కాదన్న నమ్మకాన్ని జయించగా, అనేకమైన ఆలోచనలు ఆమెను చుట్టుముట్టగా దుఃఖంతో వెక్కివెక్కి ఏడుస్తూ ఇలా పలికింది–

"దేవుని అనుగ్రహం నాపై కలిగినందుకు నేను గర్వపడిన ఆనంద క్షణాలు నా పుత్రుడు రాకపోవడంతో మటుమాయమవుతున్నాయి. నా ప్రియకుమారుడు జన్మించేప్పుడే ఎక్కడా చోటుదొరకని స్థితిలో ఓ పశువుల శాల నాకు పైకప్పును, నీడను, వేడిని ఇచ్చింది కదా! అక్కడ్నుంచి శిశుహంతకుడైన రాజు మరణించే వరకు

ఈజిప్టులో (Egypt) తలదాచుకున్నాము. పసిపాపల రక్తంతో బెత్లెహెమ్ (Bethlehem) వీధులు నిండినాయి అనాడు. ఈజిప్టు నుంచి తిరిగివచ్చాక నజరెత్ (Nazareth) చానాళ్లపాటు మా నివాసగృహమైనది. ఆతని బాల్యం ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా, ధ్యానశోభితమై ఏ రాజుకూ అనుమానం కలగని రీతిలో గడిచింది. ఇప్పుడతడు పెద్దవాడయ్యాడు. ప్రవక్త జాన్ సన్నిధిలోనే, దైవవాక్కు ఆతనిని దైవకుమారుడిగా ప్రకటించింది. ఆ క్షణం నుండి అతనిలో రాగల మార్పును నేనూహించాను. సైమన్ (Simeon) వృద్ధుడు చెప్పినట్లు అతని ఉత్థాన ప్రస్థానాలన్నీ ఇజ్రాయెల్‌లోనే సంభవించగా, ఆత్మను దూసుకుపోయిన కరవాలం గుర్తుగా కనబడి, తాను ప్రేమించిన ప్రజల మధ్యనే కష్టాలపాలై, కష్టాలనుంచే ఆశీర్వదించబడి ఉద్ధరించబడతాడు. అందుకనే నేను దుఃఖించను. వాదించను. కాని ఆతని రాకను ఏమి అడ్డుకొంటున్నది? ఏదో ఒక బలమైన శక్తి ఆతడిని దాచి ఉంచుతున్నది. పన్నెండేళ్లు నా ఒడిలోనే ఉన్నా లేనట్లున్న బాలుడతడు. నేను అతనిని పోగొట్టుకున్నట్లు, అతడు తనని తాను పోగొట్టుకోడుగదా! ఖచ్చితంగా అతడు తన తండ్రి నిర్దేశించిన పని చేయడానికే వెళ్లి ఉంటాడు. వింతవింత ఘటనలు అద్భుత కార్యాలూ జరగనున్న రేపటి రోజుల కోసం అతని రాకకై నేను ఓపికతో ఎదురుచూస్తూ ఉంటాను"

ఆ విధంగా మేరీమాత తన కుమారుని గురించి ఆలోచిస్తూ ఉండగానే, ఎడారిలో ధ్యాన నిమగ్నుడైన మెస్సయ్య – మానవజాతి రక్షకుడు, తన బృహత్ కార్యాన్ని ఎలా ప్రారంభించాలా అని ఆలోచిస్తున్నాడు. అక్కడి నుంచి అదృశ్యమైన సాతాను వాయు ప్రపంచపు మధ్యలో సమావేశమై తన అనుయాయులనుద్దేశించి సంతోష సంభ్రమాలు లేని వదనంతో ఇలా పలికాడు–

"యువరాజులు, స్వర్గపు ప్రాచీన పుత్రులు, ప్రకాశిస్తున్న సింహాసనాలు, నేటి భూతాత్మలూ, మిత్రులారా! మీకివ్వబడిన స్థానాలైన అగ్ని, వాయు, జల, భూ భాగాల్ని పరిపాలిస్తున్న శక్తులారా! ఇప్పుడు మన పదవులకొచ్చిన ముప్పేమీ లేదు. మనపై దాడి చేసేందుకు వచ్చిన కొత్త శత్రువు మనల్ని తిరిగి నరకకూపానికి నెట్టివేయాలన్న కృతనిశ్చయంతో ఉన్నాడు. మీ అందరి అంగీకారంతో వెళ్లిన నేను ఆతడిని కలిసి పరీక్షించి చూసాను. ఆదాం కన్నా ఇతడు గట్టివాడు. ఆదాం తన సహచరి తప్పిదాన్ని పంచుకుని పతనం చెందాడు. ఇతడు తన తల్లివలన మానవుడైనాడు. కాని అతనిలో స్వర్గం ప్రసాదించిన అనేక సద్గుణాలు దివ్యకరుణ, సంపూర్ణత్వము, గొప్పగొప్ప పనులు చేయగల మానసిక స్థైర్యము ఇవన్నీ మూర్తీభవించి వున్నవి. అందుకే నేను వెనక్కి తిరిగివచ్చాను. 'ఈవ్'ను మోసం చేసినంత సులభం కాదీసారి అని మీకు తెలపడం నావిధి. మీరందరు నేను ఏ క్షణాన పిలిస్తే ఆ క్షణాన వచ్చి నేను మీకు చెప్పిన పనులు చేయడానికి సిద్ధంగా ఉండగలరు"

ఆ విషసర్పం అలా పలుకగానే అక్కడున్న భూతాత్మలందరూ పెద్దధ్వనితో తమ ఆమోదాన్ని తెలిపారు. ఆతని అనుమతితో భూతాత్మలలో అస్మోడాయి (Asmodai) తర్వాత అంత ఘనుడు, మొండివాడు, శృంగారప్రీతి ఉన్న స్వప్న పిశాచం (Incubus) బెలియల్ (Belial) తన వంతు సలహా ఇచ్చినాడు.

"మానవకన్యలలో అత్యంత సౌందర్యవతిని ఆతని కళ్లముందు ప్రవేశపెట్టు. దేవకన్యల హొయలు, రూపలావణ్యం ఉండి మిట్టమధ్యాహ్నపు ఆకాశంలా కళ్లు మిరుమిట్లు కొలిపించే సుందరాంగులు తమ మధురమైన వాక్కులతో, శృంగారాన్ని చిలికే చూపులతో, కాముకత్వాన్ని రేకెత్తించే నడకలతో ఎంతటివాడినైనా తమ దాసుడిగా చేసుకుని, దొరికినట్లే నటించి దొరకకుండా తప్పించుకుపోయి ఎదుటివారు తమ వలలో పడి గిలాగిలా కొట్టుకుంటుండగా ఆనందిస్తారు. అటువంటి స్త్రీలు ఎంతటి కఠిన హృదయాన్నైనా కరిగించి మోహవాంఛలను రేకెత్తించి, లోహహృదయాలను అయస్కాంతాల్లా ఆకర్షించి ఎంతవారలైనా కాంతాదాసులే అని బుజువు చేస్తారు. అత్యంత తెలివిగలవాడుగా ప్రసిద్ధికెక్కిన 'సోలోమాన్' (Solomon) చక్రవర్తి సైతం కాంతామోహంలో పడి తన భార్యల దేవుళ్లకు ఆలయాలు నిర్మించి సాగిలపడి మొక్కలేదా."

ఆ మాటలకు సాతాను సమాధానమిచ్చినాడు– "బెలియల్! నిన్నూ ఎదుటివాళ్లను ఒకే త్రాసులో వేసి తూస్తావు! అందరూ నీలా కాంతాకనకాలకు లొంగిపోతారని భ్రమిస్తావు! నీవు స్త్రీల అందాలకు, రూపలావణ్య సౌష్ఠవాలకు లొంగిపోయేవాళ్లను నయానా భయానా లొంగదీసుకునో ఆడవాళ్లంతా ఆటవస్తువులని నమ్మినావు. జలప్రళయానికి ముందు నీ అనుచరులు దేవుని కుమారులుగా దంబాలు పలికినవాళ్లు భూమిపై తిరుగుతూ కంటికి కనిపించిన మానవస్త్రీని వదలకుండా వాళ్లతో కూడి కొత్తతెగను సృష్టించలేదా! ఆ కొత్తతెగలోని వాళ్లు రాజసభల్లో, ప్రాసాదాల్లో, తోటల్లో, అడవుల్లో; నీటి బుగ్గల వద్ద, సెలయేళ్ల పక్కన, పచ్చికమైదానాలలో వనకన్యల్ని జలకన్యల్ని, అప్సరసల్నీ, సముద్రకన్యల్నీ దారికాచి పట్టుకుని అందాలరాశులైన కాలిస్టో, క్లైమెనె, డాఫ్నె, సెమెలె, ఏంటియోపా, అనెమొనె, సిరింక్స్ (Calisto, Clymene, Daphne, Semele, Antiopa, Anemone, Syrinx) ఇంకా ఎంతోమందిని, అపొలో, నెప్ట్యూన్, జూపిటర్, పాన్ (Apollo, Neptune, Jupiter, Pan), సాటిర్, ఫాన్, సిల్వాన్ (Satyr, Fawn, Sylvan) పేర్లతో నీ అనుచరగణం ఆనందించినవాళ్లే కదా! కాని మానవమాత్రులలో ఎవరైనా అందాన్ని దాని ఆకర్షణలనూ చిరునవ్వుతో తిరస్కరించినవాళ్లు లేరా! పెల్లియన్ విజేత (Pellean) – అలెగ్జాండర్ – తన యవ్వనంలోకూడా తూర్పుదేశపు సుందరాంగుల్ని, డరియస్ కుమార్తెలను

గౌరవించలేదా! స్కిపియో ఆఫ్రికానస్ తన చేతికి చిక్కిన ఇబెరియన్ కన్యను ఆమె ప్రేమికుడికి అప్పగించలేదా! సోలోమాన్ (Solomon) సుఖంగా, అనేక సంపదల మధ్య, గౌరవమర్యాదలతో ఉన్నతమైన ప్రవర్తన, విధేయతతో హద్దు దాటకుండా జీవించాడు. అందుకే ఆతడు స్త్రీల ఆకర్షణకు వాగ్దానాలకు లొంగిపోవలసివచ్చింది. కాని మన ఇప్పటి శత్రువు సోలోమాన్ కన్నా అనేకరెట్లు తెలివిగలవాడు. గొప్పగొప్ప కార్యాలను సాధించడానికే జన్మించినవాడు. అటువంటి వాడిని లొంగదీసుకోగలిగిన స్త్రీ ఎక్కడ ఉంది? సౌందర్యానికి ప్రతిరూపమైన అందాలరాణి దేవలోకం నుంచి దిగివచ్చిన వీనస్ దేవత (Zone of Venus) జోవ్ (Jove) దేవుడ్ని తన ఆకర్షణతో వశం చేసుకున్నట్లు అది ఈ మానవుడిపై సాధ్యపడ్తుందా! సద్గుణాల సింహాసనంపై కూర్చున్న ఈ దైవకుమారుణ్ణి ఎంత అందమైనా శక్తి అయినా కదిలించగలదా! బలహీనమైన మనస్సులే అందానికి లొంగిపోతాయి. శక్తివంతుడైన ధీరోదాత్తుడికి అందమే బానిసగా మారి కేవలం ఆటవస్తువుగా మిగిల్తే, స్త్రీ అభిజాత్యానికి దెబ్బ తగుల్తుంది. ఇతన్ని ఓడించాలంటే అందం, శృంగారం, కాముకత్వం ఉపయోగపడకపోవచ్చు. అందుకని గౌరవనీయమైనవి, అందరికీ తెలిసినవి, కీర్తిప్రతిష్ఠలను పెంపొందించే సహజ మార్గాలలోనే ఆతనిని పరాజితుణ్ణి చేయాలి. ఇప్పుడు అతడు ఆ ఎడారిలో ఆకలితో బాధపడ్తున్నాడు. మీరు నన్ను అనుసరించండి. ఏమీలేని ఆ ఎడారిలో ఆతడిని ఏదో ఒకటి చేద్దాం!" అన్నాడతడు. సాతాను మాటలకు అక్కడి భూతాత్మలంతా హర్షధ్వానాలు చేసారు.

కొంతమంది భూతాత్మలను ఎన్నికచేసుకుని సాతాను వాళ్లతో ఎడారివేపు బయల్దేరాడు. అక్కడ ఎడారిలో దైవకుమారుడు నలభైరోజుల ఉపవాసానంతరం ఆకలి అవుతుండగా తనలో తాను ఇలా అనుకుంటున్నాడు.

"ఈ అంతూపొంతూ లేని ఎడారి ఎప్పటికి అంతమవుతుంది? ఇప్పటికి నాలుగు పదిరోజులు ఈ అగమ్యగోచరమైన ఎడారితుప్పల మధ్య తిరిగాను. ఆకలి దప్పులు నన్ను తాకనేలేదు. ఈ ఉపవాసం నేను కావాలని చేసింది కాదు. ఈ ఆకలి నేను కోరుకున్నదీ కాదు. ప్రకృతికి ఏది అవసరమో దానిని దేవదేవుడు అందిస్తాడు. ఇప్పుడు నాకు ఆకలి అవుతున్నది. అది సహజధర్మం. దేవుడు దాన్ని ఏదోవిధంగా తీరుస్తాడు. ఆకలి ఉన్నా నాకు నీరసం రావడం లేదు. కాబట్టి నేను శక్తివంతమైన ఆలోచనలతో నా తండ్రియొక్క నిర్ణయాన్ని అర్థంచేసుకుని ఆకలిని జయిస్తాను"

అలా అనుకుంటూ ఆతడు దట్టంగా ఉన్న చెట్లమధ్య నిద్రించాడు. కలలో ఆకలికి కావాల్సినవేవో అవే సహజంగా కనిపించి ఆకలిని సంతృప్తిపరుస్తాయిలే అనుకుంటూ కలగన్నాడు. తాను ప్రవక్త ఎలిజా (Elijah)లా ఛెరిత్ (Cherith Brook)

వాగు దగ్గర ఉన్నప్పుడు కాకులు తమ ముక్కులతో కరచి తెచ్చిన రొట్టెముక్కలు, మాంసఖండాలు ఇచ్చినా వాటిని కూడా తినకుండా నిగ్రహించుకున్నాడు. ప్రవక్త ఎడారిలోకి పారిపోయి అక్కడ ఓ జూనిపర్ (Juniper-సరుగుడు) చెట్టుకింద నిదురించి, మెలకువ రాగానే వేడినిప్పుల మీద తయారుచేసిన సాయంకాల భోజనం సిద్ధంగా ఉండి పక్కనే దేవదూత తనను తినమని రెండుసార్లు అర్థించడం ఆ ఆహారమే నలభైరోజుల ఉపవాసాన్ని సహించే శక్తినివ్వడం వీటిని దైవకుమారుడు తనకలలో చూసాడు. ఇంకో స్వప్నంలో తాను ఎలిజాతో కలిసి భోజనం చేసినట్లు, మరోసారి డానియెల్ (Daniel) కు అతిథిగా, ఇలా రకరకాల స్వప్నాలతో తెల్లవారిపోయింది. ఉదయపు వార్తలను తెలిపే లార్క్ (Lark-భరత) పక్షి తన పిలుపుతో ప్రాతఃకాలానికి స్వాగతం చెబుతూ ఆకాశంలో ఎగుర్తుండగా మన రక్షకుడు తాను చూసిందంత కలగా గ్రహించి ఉపవాసంతో నిద్రపోయి ఉపవాసంగానే నిద్రలేచినందుకు స్థిమితపడ్డాడు. అక్కడ నుంచి దగ్గర్లోనే కనిపించిన కొండగట్టుపైకెక్కి దగ్గర్లో ఏమైనా గొర్రెలమందలు, పశువుల చావడి కనిపిస్తాయేమోనని చూడగా అల్లంతదూరాన అందమైన వృక్షాలతోపు కనిపించింది. పక్షుల కిలకిలారావాలతో కళకళలాడుతున్న ఆ ప్రదేశానికి వెళ్లి మధ్యాహ్నం అక్కడ విశ్రాంతి తీసుకోదలచుకుని ఆతడు నెమ్మదిగా అక్కడకు చేరుకున్నాడు. అందంగా ఉన్న ఆ వనం వనదేవతలు తిరుగాడే ప్రదేశంలా కనిపించింది. చుట్టూరా పరికించిచూసాడు. ఆతని కళ్లముందు అకస్మాత్తుగా ఒక వ్యక్తి ప్రత్యక్షమైనాడు. రాచనగరిలోనో, ప్రాసాదంలోనో పనిచేసే ముఖ్యవ్యక్తిలా ఉన్న అతడు దైవకుమారుణ్ణి ఉద్దేశించి ఇలా పలికాడు.

"అధికారికంగా శలవు తీసుకుని నేనిక్కడకు వచ్చాను. దైవకుమారుడు ఈ ఎడారిలో ఒంటరిగా తిరుగుతూ ఆకలిగొనియున్నాడని నేను గ్రహించాను. ఇంతకు ముందు కూడా అనేకులు ఈ ఎడారిలో తిరిగినారని జనులు చెబుతూఉంటారు. నెబైయోత్ (Nebaioth) తన తల్లితో ఇలానే ఎడారిలో తిరిగినప్పుడు ఓ దేవదూత వారికి ఆహారాన్ని అందించాడంటారు. ఇజ్రాయెల్ జాతిమొత్తం ఇక్కడనే ఆకలితో నశించి ఉండేది దేవుడు కనక 'మన్నా' (Manna)ను స్వర్గం నుంచి కురిపించి ఉండకపోతే! థెబెజ్ (Thebez) ప్రాంతపు నివాసి, ఆ ప్రవక్త కూడా రెండుసార్లు ఆహారం తీసుకున్నాడు. అతనిని ఏదోస్వరం ఆహ్వానించి ఆతిథ్యాన్నిచ్చింది. నాకు తెలిసి మీరొక్కరే నలభైరోజులు ఇలా ఉపవాసమున్నా ఎవరూ మిమ్మల్ని ఆహారం తీసుకోమని ఆహ్వానించలేదు"

దానికి జీసస్ (Jesus) ఇలా సమాధానమిచ్చాడు– "వాటినుంచి మీరేమి అర్థం చేసుకున్నారు? వాళ్లకు అవసరం (Need) ఉన్నది అందుకని ఆహారం తీసుకున్నారు. నాకులేదు"

"మరి మీకు ఆకలిగా ఉన్నదికదా!" అడిగాడు సాతాను– "ఇప్పుడు మీముందు ఆహారం కనిపిస్తే తినకుండా ఉంటారా!"

"నాకు ఆహారాన్ని ఇచ్చేవాడు నాకు ప్రియమైనవాడైతే తీసుకుంటాను" అన్నాడు జీసస్.

"ఆహారాన్ని తిరస్కరించడానికి అది కారణం కాకూడదు కదా!" అన్నాడు సాతాను. "సృష్టించబడిన అన్ని పదార్థాలపై నీకు అధికారమున్నది. ఈ సమస్త జంతువులు విధిగా నీకు సేవచేయడానికి నిర్దేశించబడినవి. డానియెల్ (Daniel) తిరస్కరించిన 'విగ్రహాలకు సమర్పణ చేసిన' ఆహారం, మాంస పదార్థాల్లా ఇవి అశుభ్రమైనవి కావు. శత్రువు పంపినవీ కావు. మరెందుకు వాటిని తిరస్కరిస్తున్నావు? ఆకలిగా ఉండీ నీవు ఆహారాన్ని తీసుకొనకపోతే ప్రకృతి చింతించదా! దైవకుమారుడివైన నిన్ను తమ ప్రభువుగా, అతిధిగా భావించి ప్రకృతి తనంత తాను ఇస్తున్న ఆహార పదార్థాల్ని స్వీకరించి ఆమెను గౌరవించు"

ఆ మాయావి స్వప్నాన్ని పలకలేదు. ఆతని మాటలు పూర్తయ్యేలోపలే మన రక్షకుని పక్కనే ఉన్న విశాల ప్రదేశంలో చల్లని నీడ క్రింద ఆహారపదార్థాలు చక్కగా అమర్చిన బల్ల – రాజోచిత విందుభోజనం – పళ్లెరాలనిండా – రకరకాల మాంస పదార్థాలు, జంతుమాంసం, పక్షుల మాంసం, కాల్చినవి, వేల్చినవి కూరలుగా వండినవి, మత్స్యాహారం – సముద్రం, నదులు, చెరువులు, రేవుల నుంచి పట్టితెచ్చిన చేపలు, ముళ్లున్నవి, ముళ్లులేనివి, నత్తలు, రొయ్యలు, నీవు ఏ పేరు చెబితే అవి, బహుశా పొంటస్ (Pontus), లుక్రిన్ (Lucrine) అఖాతాల నుండి, ఆఫ్రికాతీరం నుంచి ఎంచి తెచ్చిన రకరకాల చేపలు, ఎంత మంచిభోజనం! పాపం! ఈవ్‌కు దక్కిందేమిటి – ఒక ఆపిల్ – దానికే ఆమె అన్ని కష్టాలపాలయ్యింది. మరి ఇక్కడ! పక్కనే పాత్రలనిండా మధురమైన సువాసనలు విరజిమ్ముతున్న ద్రాక్షసారాయి. వాటిని అందించడానికి సిద్ధంగా ఉన్న యువకులు – గనిమెడ్ (Ganymed) కన్నా, హైలస్ (Hylas) కన్నా అందంగా ఉన్నవారు; ఆ పక్కనే దూరంగా నిలబడి డయానా (Diana) చెలికత్తెలంత అందంగా ఉన్న అప్సరసలు; అమల్థియా (Amalthea) కొండకొమ్ముల నుంచి తెచ్చిన ఫలపుష్పాదులతో జలదేవతలు (Naiades), లాన్సెలాట్ (Lancelot) పెలియాస్ (Pelleas); పెల్లెనొరె (Pellenore) వనాల్లో కలుసుకున్న వనకన్యల్లా ఉన్న లలనామణులు, పక్కనుంచి గాలిలో తేలుతూ వినవస్తున్న అద్భుత సంగీత లహరులు, చక్కటిసువాసనతో కూడిన అరేబియన్ అత్తరు పరిమళాలు, పూలవాసనలు – అంతా మరులుగొలిపే అందమే–

ఆ ఇంద్రజాలికుడు తన ప్రయత్నాన్ని మరల మొదలెట్టాడు–

"దైవకుమారుడు ఇంకా ఎందుకు సందేహిస్తున్నాడో ఆహారం ఆరగించడానికి! ఇవి నిషేధించబడిన ఫలాలు కావు! ఏ శాసనం వీటిని ఆరగించవద్దని చెప్పలేదు. వాటి రుచికి ఏ జ్ఞానమూ అడ్డురాదు. ముఖ్యంగా చెడుజ్ఞానం! ఆహారం వలన ప్రాణం నిలబడ్తుంది. ఆకలి అనే శత్రువుని నాశనం చేస్తుంది. ప్రాణపు తీపును కాంతివంతం చేస్తుంది. వీరందరూ వాయు, వన జలకన్యలు, దివ్యాత్మలు. దైవకుమారులైన మీకు తమ అభివాదములు తెలిపి కానుకలను సమర్పించ వచ్చియున్నారు. మీకింకా సందేహం ఎందుకు దైవకుమారా! ఆసీనులుకండి! ఆరగించండి! తృప్తిచెందండి!"

జీసస్ సమాధానమిచ్చినాడు– "నీవే చెప్పావు నాకు అన్నిటిమీదా అధికారం ఉన్నదని. ఆ అధికారాన్ని నిలుపుదల చేయగలిగినవారెవ్వరు? నా వస్తువులను నేనే కానుకలుగా ఎలా అంగీకరిస్తాను? నాకెక్కడ, ఎప్పుడు కావాలంటే అప్పుడే నేను తెప్పించుకోగలిగినప్పుడు నాకవసరం లేని వాటిని ఎలా స్వీకరించగలను? నీవు ఈ ఎడారిలో ఇంత రాజభోజనం సృష్టించగలిగినప్పుడు, నేనూ దేవదూతలతో కూడిన ఇంతకన్నా ఘనమైన ఆహారపదార్థాల్ని సృజించగలను. నాకు అవసరం లేని వాటిని ఇంత హంగూ ఆర్భాటాలతో సిద్ధం చేయడం ఎందుకు? వృధాప్రయాస కదా! అయినా నా ఆకలికి నీకూ ఏమిటి సంబంధం? నీ ఆడంబరపు విందును నేను తిరస్కరిస్తున్నాను. నీ కాన్కలంటావా అవి కానుకలు కాదు మోసపుటెత్తులు, జిత్తులు"

సాతాను వెంటనే అన్నాడు– "నీవు చూస్తున్నవన్నీ నేను నీకు ఇవ్వగలను. అందుకే నీకు అవసరమేమో అనిపించి స్వచ్ఛందంగా వీటిని నేను నీకు సమర్పిస్తున్నాను. ఎందుకు నీవు వాటిని తిరస్కరిస్తున్నారో తెలియడంలేదు. బహుశా నా ఉద్దేశాన్ని నీవు అనుమానపడుతూ ఉండవచ్చు. అడగకుండా ఇతగాడు అన్నీ ఇస్తున్నాడు ఆనక ఏం అడుగుతాడోనని కావచ్చు. సరే వీటి అవసరం నీకు లేనప్పుడు ఇవి ఇక్కడ ఉండనక్కరలేదు" అన్నాడు. చిటికెలో అవన్నీ అదృశ్యమై రాకాసిపక్షుల రెక్కల గోళ్ల (Harpies) చప్పుళ్లు వినిపించాయి. అక్కడ మాయావి ఒక్కడే ఉండి మన రక్షకుని వంక విస్మయంగా చూస్తూ అన్నాడు.

"ఎంతటి క్రూరజంతువునైనా ఆకలి లొంగదీస్తుంది. నీవు ఆకలిని జయించావు. నీ హృదయం బహుశా అతిలోకజ్ఞానానికి క్రియలకు ఎదురుచూస్తున్నట్లున్నది. వాటిని ఎలా సాధించగలవు? పెద్దపెద్ద కార్యాలు నిర్వహించడానికి అనేక వనరులు కావాలి. నీవా అనామకుడివి! స్నేహితులా లేరు! తక్కువజాతికి

చెందినవాడివి. నీ తండ్రి ఒక వడ్రంగి (Carpenter). పేదరికంలో పుట్టి కష్టాల్లో పెరిగావు. ఎడారిలో దారితప్పి ఆకలితో అలమటిస్తున్నావు. గొప్పవాడివి కావడానికి నీదగ్గర ఏమున్నదని? ఎవర్ని శాసించగలవు! నీ పరివారమేది? నీ సైనికులెవ్వరు? ఒకవేళ జనబాహుళ్యము నీ చుట్టూరా చేరినా వారికి ఆహారపానీయాలెలా సమకూర్చగలవు? ధనం లేకుండా నీవేమీ చేయలేవే! ధనం స్నేహితుల్నీ, గౌరవ ప్రతిష్ఠల్నీ, విజయాల్నీ, రాజ్యాల్ని సాధించిపెడ్తుంది. జూదా (Judah) సింహాసనంపై ఇడొమైట్ (Edomite) ఏంటిపాటర్ (Antepater)ను, అతని కుమారుడు హెరొడ్ (Herod)ను కూర్చోబెట్టిందెవరు? ధనమే! స్వర్ణమే! అందుచేత గొప్పగొప్ప కార్యాలను సాధించదలచుకుంటే ముందు ధనాన్ని సంపాదించు. రాశులకొద్దీ ధనాన్ని పోగుచేయి. అదేమీ పెద్ద కష్టంకాదు. నా మాట విను! అపారమైన ధనరాశులు నాస్వంతం. అదృష్టం నాచేతిలో ఉన్నది. నేను ఇష్టపడినవాళ్లు భోగభాగ్యాల్లో మునిగి తేల్తారు. కాకపోతే వాళ్లలో సుగుణం (Virtue), శౌర్యం (Valour), జ్ఞానం (Wisdom) ఉండవు"

జీసస్ ఓపికగా విని అన్నాడు– "నిజమే! ఆ మూడూ లేనప్పుడు ధనం ఉండీ ప్రయోజనమేమిటి? ఈ భూమిని పరిపాలించిన రాజ్యాలన్నీ ఏమైనాయి? సిరిసంపదలతో తులతూగిన ఆ మహాసామ్రాజ్యాల, చక్రవర్తుల ఆనవాళ్లైనా మిగిలాయా? సద్గుణం, వివేకం, శౌర్యం వున్న మహావీరులు పేదవాళ్లైనా గొప్పగొప్ప కార్యాలను సాధించలేదా! గిడియాన్ (Gideon) జెఫ్తా (Jephtha), గొర్రెలకాపరి కుమారుడు, రేపటిరోజుల్లో జూదా (Judha) సింహాసనం అధిష్టించెడివాడు, అవిశ్వాసుల వీరులైన క్వింటియస్ (Quintius), ఫాబ్రిషియస్ (Fabricius)లు క్యూరియస్ (Curius), రెగ్యులస్ (Regulus)లు అటువంటి వారేకదా! ఎటువంటి ధనసంపదల ఆశను చూపినా వారు తిరస్కరించలేదా! – బహుశా పేదరికంలోనే నేను – ఇంకా ఎక్కువగా కూడా సాధించగలనేమో! ధనాన్ని పొగడవద్దు. మూర్ఖుల శ్రమఫలితం, జ్ఞానులకు సంకటం, ఉచ్చులాంటిది ధనం. సుగుణాల్ని మొక్కవోయేట్లు చేస్తుంది. ధనం, రాజ్యాలమీద అయిష్టతతో నేను వాటిని కాదంటే వచ్చే నష్టమేమిటి? అధికారం స్వర్ణకిరీటంలా పైకి కన్పించినా, నిజానికి అది ముళ్లకిరీటం. ప్రమాదాల్ని, కష్టాల్ని, బాధ్యతల్ని, నిద్రలేని రాత్రుల్ని, తెచ్చిపెడ్తుంది. రాజుగా ప్రజలందరి బరువుబాధ్యతలను తన భుజాలపైకెత్తుకున్న వ్యక్తికి గౌరవం, హోదా, అధికారం, పొగడ్తలు లభిస్తాయి. కాని ఎవరైతే తనని తాను తెలుసుకొని తనలోని భావావేశాల్ని, కోరికలను, భయాల్ని జయిస్తాడో అతడు రాజుకన్నా గొప్పవాడౌతాడు. అతడే జ్ఞాని, వివేకవంతుడు. అవి లేనివాడు మనుష్యులతో నిండిన నగరాల్ని, పొగరుబోతు

జనసమూహాల్ని పరిపాలించ అశక్తుడౌతాడు. తనలోని భావాల్ని అణచుకోలేక అశాంతిపాలు అవుతాడు. ధర్మబద్ధంగా పరిపాలించేవాడు తాను చేసిన తప్పులనుంచి పాఠాలు నేర్చుకుని దేవదేవుని పూజిస్తూ తనలోని ఆత్మని సంతృప్తిపరుస్తూ అంతరాత్మను అదుపులో ఉంచుకుని విజయుడౌతాడు. రాజ్యాన్ని ఇవ్వడమే గొప్ప విషయమైతే దానిని త్యజించడం, తిరస్కరించడం మరింత ఘనమైన కీర్తికదా! అప్పుడు ధనంతో పనేమున్నది? అందుచేతనే రాజదండం కోసం ఆర్రులు చాచడంకన్నా, అదిలేకపోవడమే ఆనందకరమైన విషయం" అన్నాడు రక్షకుడు మాయావి ఆకర్షణను తిరస్కరిస్తూ.

3. రక్షకుడికి సాతాను చూపించిన సామ్రాజ్యాలూ, భోగాలూ...

దైవకుమారుని మాటలను వినగానే సాతాను నోటమాట రాక ఒక్కక్షణం నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. ఏం చెప్పాలో, ఏం వాదించాలో ఆతనికి అర్థం కాలేదు. తన వాదం బలహీనమై దారితప్పుతున్నట్లు తెలుస్తూనే ఉన్నది. చాలాసేపు ప్రయత్నించి అతికష్టంమీద కొన్ని ఓదార్పుమాటలను పలికినాడు.

"నీకు తెలిసిన విషయాలను మళ్లీ నేను చెప్పడంలో అర్థంలేదు. ఏది గొప్పదో చెప్పలేనప్పుడు చెయ్యడం మరింత కష్టం. నీ మాటలు, చేతలు ఒకదానితో ఒకటి అంగీకరిస్తున్నాయి. నీ మాటలు నీ హృదయ ధ్వనులై వెలువడగా, మంచితనం, న్యాయం, వివేకంతో నిండిన నీ హృదయం సంపూర్ణంగా ఉన్నది. రాజులు, రాజ్యాలూ నీ మాటలు వినగోరినప్పుడు, అవి ఆరన్ (Aaron) ఛాతీఫలకం (Breast Plate)పై నున్న యూరిమ్, ధమ్మిమ్ (Urim and Thummim) రత్నాల్లా భవిష్యద్దర్శనం చేయిస్తాయి. నీ శక్తిముందు ఏ రాజ్యశక్తీ నిలువలేదు. ఇటువంటి శక్తిసామర్థ్యాలను ఈ ఎడారిలో వృధాచేయడం న్యాయంకాదు. నీ శౌర్యపరాక్రమాలను చూసి ఈ భూమి మీద ప్రజానీకం యావన్మందీ ఆశ్చర్యంతో తబ్బిబ్బు కావాలి! ఆత్మలకైనా, మనుష్యులకైనా కీర్తి ఆనందాన్నిస్తుంది. భోగభాగ్యాలు, ధనరాశులు, దివ్యాత్మలకు చెత్తతో, గడ్డిపోచతో సమానం. నీకు ఘనవిజయాలు సాధించే వయసు, సమయం వచ్చాయి. సైరస్ (Cyrus) సింహాసనాన్ని, ఆసియా (Asia)ని గెలుచుకున్న మాసిడోనియన్ ఫిలిప్ (Macedonian Philip) కుమారుడు అలెగ్జాండర్‌లా, కార్థజినియన్ (Carthaginian) గర్వాన్ని మట్టిపాలు చేసిన యువకుడు స్కిపియో (Scipio)లా, పొంటిక్ రాజును (Pontic) ఓడించిన పాంపె (Pompey)లా వయసు పెరిగినకొద్దీ రాజ్యకాంక్ష పెరగాలి! కీర్తివాంఛను చంపుకోరాదు! ఘనత వహించిన జూలియస్ (Julius) వయసు పెరిగిన కొద్దీ మరింత కీర్తి గడించాడు. ఇన్నిరోజులు ఏమీ చేయకుండా వ్యర్థం చేసానే అని విలపించాడు. నీవింకా చిన్నవాడివే! ఇదేమీ ఆలస్యం కాదు!"

ఆ మాటలకు మన రక్షకుడు నెమ్మదిగా సమాధానమిచ్చాడు– "నీవు ఎంత ప్రయత్నించినా రాజ్యాలకోసం ధనాన్ని, కీర్తికోసం రాజ్యాల్ని నేను కోరుకునేలా చేయలేవు. కీర్తి అంటే ఏమిటి జ్వలిస్తున్న పొగడ్తలే కదా! ప్రజలు పొగిడినంతమాత్రాన అదే ఘనకీర్తి కాదుకదా! ఒక్కోసారి గుంపులు గుంపులుగా చేరిన జనం ఎందుకూ

పనికిరానివాణ్ణి సైతం అందలం ఎక్కించి కీర్తిగానాలు చేస్తారు. అతడు వాళ్ల నాలుకల మీద నిలిచి వాళ్ల మాటగా రూపాంతరం చెందుతాడు. వీటన్నిటికీ విముఖుడై సత్యమార్గాన నడిచేవాడిని అనుసరించేది కొద్దిమందే అయినా వాడు భగవంతునికి ప్రీతిపాత్రమౌతాడు. వాళ్లకు తెలియని దేవుళ్లను పూజించేవాళ్లు వాళ్లు ఎవరిని ఎందుకు పూజిస్తున్నారో తెలియదు. గొర్రెలమందలా ఒకరితర్వాత ఒకరు పూజాకార్యక్రమాలు జరుపుతూ తమకు తెలియని వ్యక్తిని పొగుడుతుంటారు. దేవదేవుడు భూమివేపు చూస్తూ సచ్ఛీలుడైన వ్యక్తిని గుర్తించి తన దేవదూతలకు ఆతనిని చూపినప్పుడు వారంతా హర్షధ్వానాలు చేసి కీర్తిస్తారు. జాబ్ (Job)ను భగవానుడు గుర్తించి అతనిని ఆదరించగా ఆతడు స్వర్గభూలోకాల్లో ప్రసిద్ధికెక్కినాడు కదా! ఈ నేలపై గొప్పవాడుగా కీర్తించబడే వారంతా మిథ్యా కీర్తివంతులు. నిరంతర యుద్ధాలతో రాజ్యాలను, నగరాలను ధ్వంసం చేసి, ప్రజల్ని చంపి, ఇళ్లను కూల్చి, కాల్చి, దోపిడీలు, హత్యలు, మానభంగాలతో ఆక్రమించుకున్న దేశాల్ని అల్లకల్లోలం చేసి, ఓడిపోయిన వారిని బానిసలుగా మార్చుకున్నాక అక్కడ ఏం మిగుల్తుంది? అంతా శిధిలాలు, శవాల గుట్టలే కదా! వాటిపై నిలబడి వీళ్లంతా మహావీరులు, దేవుళ్లు, మానవజాతి నిర్మాతలు, విముక్తిప్రదాతలు, అనే కీర్తి కిరీటాలను తగిలించుకుని దేవాలయాలు నిర్మించుకుని పూజార్లూ, పండుగలూ, బలులూ! అన్నీ ఆర్భాటాలే కదా! ఒకడు జోవ్ కుమారుడు (Jove), మరొకడు మార్స్ (Mars)కు పుట్టినవాడు; వీళ్లంతా మృత్యువు కౌగిలిలోకి చేరేంతవరకు క్రూరమైన స్వరాలతో ఒకరినొకరు తిట్టుకుంటూ, భయంకరమైన ఆయుధాలతో చంపుకుంటూ, గాయపరచుకుంటూ చివరకు ఘోరమైన చావులు చస్తారు.

అలా కాకుండా యుద్ధాలు, కోరికలు, హింస లేకుండా, శాంతిని, జ్ఞానాన్ని పెంపొందిస్తూ సహనంతో, ఓర్పుతో, మంచిగా జీవించవచ్చును గదా! నేను మళ్లీ జాబ్ (Job) ప్రసక్తి తీసుకువస్తున్నాను. అతనిలానే మరో వ్యక్తి సోక్రటీస్ (Socrates) సత్యం కోసం మృత్యువును కౌగిలించుకుని నీవు చెప్పిన ఆక్రమణదారులకన్నా కీర్తిని గడించలేదా! ప్యునిక్ (Punic) ఆగ్రహజ్వాలల నుంచి తన దేశాన్ని విముక్తికై తపించిన ఆఫ్రికన్ వీరుడు, వీరందరూ ఆదర్శప్రాయులు కాదా! యుద్ధంతో, హింసతో కూడిన కీర్తి నాకు వద్దు. నాకు కీర్తి వద్దు.

సాతాను ఇలా అన్నాడు– "కీర్తిని అంత తేలికగా తోసిపుచ్చకు! ఆ విషయంలో నీకు ఘనతవహించిన నీ తండ్రికి పోలికలు లేవు. ఆతడు కీర్తిని కాంక్షిస్తాడు. అన్నిటికీ సృష్టికర్త అయిన ఆతడు స్వర్గలోకంలోని దేవదూతలే కాక భూమిపైని ప్రతి ఒక్కరూ – మంచివారు, చెడ్డవారు, తెలివిగలవారు, తెలివితక్కువ వారు– అందరూ అతనిని

కీర్తించాలని, బలులు, కానుకలు కన్నా స్తోత్రపాఠాలను గానం చేయాలని కాంక్షిస్తాడు. అన్నిదేశాలు యూదు, గ్రీకు, అనాగరిక దేశాలు సైతం తనను పొగడాలని చివరకు తన శత్రువులమైన మేముకూడా ఆతనిని స్తుతించి కీర్తించాలని కోరుకుంటాడు"

ఆతని మాటలకు మన రక్షకుడిలా సమాధానమిచ్చాడు– "ఆతని వాక్కు వలన సమస్తమూ సృష్టించబడింది. ఆతనిని కీర్తిని పొగడమనడంలో ఉద్దేశం ఆ సృష్టిలోని నెలకొని ఉన్న మంచితనం సర్వజీవకోటికీ తెలియాలనే! అవి కృతజ్ఞతలు మాత్రమే! దేవదేవుడు అన్నిటినీ సృష్టించినప్పుడు ఆతనికి ఏది కానుకగా ఇచ్చినా అది ఆతని సృష్టిలోనిదేకదా! ఆతని వస్తువులను ఆతనికి ఇస్తే అది కానుకెలా అవుతుంది? సులభమైనది, ప్రేమతో కూడినది, మంచిమనసుతో ఇవ్వగలిగిన కృతజ్ఞతా భావాలను ఎందుకు అవమానంగా, అమర్యాదగా, చెడుగా భావిస్తారు? హాయిగా జీవించక, సృష్టిలోని సమస్తపదార్థాలను శాంతిగా అనుభవించక, కీర్తికండూతిలో ఒకరినొకరు చంపుకుంటూ, ప్రకృతిని గాయపరుస్తూ, దేనికోసం ఈ హింసా, ఈ యుద్ధాలూ? మానవుడికి కీర్తి అవసరమేమిటి? తన స్వంతంగా దేనినీ సృష్టించలేడే! హింసలకు, యుద్ధాలకు పర్యవసానంగా, దేవుడి నుంచి ఎన్నో సంపదలను స్వీకరించిన మానవుడు కృతఘ్నుడై, మంచితనాన్ని ధ్వంసంచేసి, ఏదైతే దేవునికొక్కడికే చెందుతుందో దానిని ఆ 'కీర్తిని' తాను పొందాలనుకోవడం తప్పుకాదా! అయినా ఆ కరుణామయుడు తన కీర్తినే మానవులకు కొంత ఇస్తాడు".

దైవకుమారుని మాటలను విన్న సాతాను మరల నిశ్చేష్టుడయ్యాడు. కీర్తికాంక్షతోనే కదా తానూ పతనమయ్యింది. మాటలు కూడబలుక్కుని అన్నాడు– "కీర్తి అవసరమో కాదో ఆ వాదాన్ని ఇక్కడితో ఆపుదాం! డేవిడ్ (David) సింహాసనానికి వారసుడిగా నీ తల్లివైపు నుంచి వచ్చిన వారసత్వాన్ని, నీ తండ్రి స్వర్గాధిపతి అనుజ్ఞతో నీవు వశం చేసుకోవాలన్నా ఇప్పుడదంత సులభం కాదు. ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు తాము ఆయుధాలతో, యుద్ధాలతో గెలుచుకున్న సింహాసనాన్ని గాలిమాటలకు భయపడి వదిలిపెట్టరు. జూదా (Judah) మరియు వాగ్దానం చేయబడిన రాజ్యం ఇప్పుడు రోమన్ల (Romans) పరిపాలనలో అంతర్భాగమై ఒక చిన్న ప్రాంతంగా టిబెరియస్ (Tiberius) ఆజ్ఞలో పాలించబడ్తున్నది. ఎన్నోసార్లు దేవదేవుని ఆలయం ఆక్రమణలకు గురై, అవమానాలకు, అపవిత్రతకు గురైనది. ఇలా తీరికగా కూర్చుని ఆలోచిస్తుంటే సింహాసనం దక్కదు. మకాబియస్ (Machabeus) నీలాగే ఎడారిలోకి వెళ్లాడు కానీ వట్టిచేతుల్తో కాదు. ఆయుధాలు ధరించి సైనికులను కూడగట్టుకుని ఏంటియోఖస్ (Antiochus) బారినుంచి జూదా (Judah)ను కాపాడినాడు. రాజ్యం నిన్ను ఆకర్షింపకపోవచ్చు, ఉత్సాహం, విధి

నిర్వహణ ఇవైనా తీవ్రతరమైతే కార్యసాధన కష్టమేమీకాదు. హృదయపూర్వకమైన నిరంతర ప్రయత్నంతో (Zeal), సేవాధర్మం పట్ల అభినివేశంతో నీ తండ్రి నివాసాన్ని, ఇతరుల ఆక్రమణలో మగ్గుతున్న నీ దేశాన్ని విముక్తిచేసే విధి నిర్వహణలో నిమగ్నుడవై, ప్రవక్తలు జోస్యం పలికిన నీ అనంత సామ్రాజ్యాన్ని ఎంత త్వరలో వీలయితే అంత త్వరగా స్థాపించు, దేనికి ఆలస్యం?"

దానికి మన రక్షకుడిలా సమాధానమిచ్చాడు– "ఏ పని ఎప్పుడు చేయాలో అప్పుడే చేయడం ఉచితం. నీవన్నట్లు భవిష్యద్వాణి నా పరిపాలన గురించి నిర్దేశించి ఉంటే దేవదేవుడు తప్పక ఆ పాలన ప్రారంభమయ్యే దినాన్ని కూడా ప్రకటిస్తాడు. ఆతని ఇచ్ఛ, సంకల్పంతోనే అన్ని ఋతువులూ, కాలమానం పరిభ్రమిస్తాయి. ఆతడు నన్ను అతిసాధారణ స్థితిలో కష్టాలు, అవమానాలు, గాయాలు, దూషణ తిరస్కారాలు, ఉచ్చులు, వలలు, హింస, బాధలు, సుఖాలకు దూరంగా ఉండడం, వీటన్నిటినీ మౌనంగా భరించవలసిందిగా కోరుకున్నట్లయితే ఆతని మనోభీష్టాన్ని, శాసనాన్ని నేనెందుకు కాదనాలి? ఎటువంటి సందేహం, భయం లేకుండా ఎంతటి దుష్కరమైన బాధనైనా అనుభవిస్తూ దేవదేవుని కరుణ కోసం ఎదురుచూడడంలో తప్పేమున్నది? ఎవరైతే ఎక్కువ కష్టాలనోర్చుకుంటారో వారికేగదా రాజ్యం దక్కేది! అయినా నా రాజ్యాన్ని నేనెప్పుడు ఎలా ప్రారంభిస్తానో నీకేమిటి ఉత్సుకత? నీకు తెలియదా నా ఉత్థానమే నీ పతనమని, నా ఉన్నతే నీ నాశనమని!"

దానికి సాతాను ఇలా సమాధానమిచ్చాడు– "ఎప్పుడు వచ్చేది అప్పుడు రాకమానదు! నీ కరుణాదృష్టిలోకి రావడానికి నేను చేసిన ప్రయత్నాలన్నీ వృధా అవుతున్నాయి. ఇంతకంటే ఎక్కువ నాశనం ఏం రాగలదు? ఆశలేని చోట ఇంకెక్కడిది భయం! ఇంతకంటే నాశనముంటే నేను అనుభవించిన నరకయాతనల కన్నా ఇంకా భయంకరమైనవి ఉంటే అవి తట్టుకోడానికి నేను కలతచెందాలి! సర్వనాశనమే నా ఆఖరి మజిలీ అయినప్పుడు నేను దేనికి భయపడాలి! నా తప్పు తప్పే, నేరం నేరమే, మంచి చేసినా చెడు చేసినా నాకు విధించబడే శిక్షో, పర్యవసానమో, ఇదివరకే నిర్దేశించబడినట్లయితే ఇంక నాకు భయమెందుకు? నీవు రాజ్యమేలినా, ఏలకపోయినా నాకు ఇబ్బంది లేదు కదా! ఇప్పుడు నేనూ, నా అనుయాయులూ ఉన్న స్థితికన్నా దారుణమైన స్థితి దాపురించకుండా ఆతని ఆగ్రహానికి మాకూ మధ్య నీ చల్లని ఆశ్రయం ఉంటే మాకు శుభమే కదా! అప్పుడు నీవు నెమ్మదిగా నీ రాజ్యాన్ని స్థాపించి, సమస్తలోకాలకూ నీ కరుణ దృష్టులను ప్రసరింపజేసి, సర్వోత్తముడైన ప్రభువుగా వెలుగొందగలవు. బహుశా నీవు ఈ విశాల సామ్రాజ్యాన్ని పాలించడంలో గల సాధకబాధకాలను అంచనా వేస్తూ ఉండి వుంటావు. ఈ భూమిని సమర్ధవంతంగా

ఏలుకోగల లక్షణాలు నీలో ఉన్నాయి. ఇప్పటి వరకూ నీ జీవితం నీ స్వంతమై రహస్యంగా ఇంటివద్దనే గడిచింది. అప్పుడప్పుడు గెలిలియో పట్టణాలలో, (Gallilean Towns), ఏడాదికొక్కసారి జెరుసలెం (Jerusalem)లో గడిపినా ప్రపంచాన్నంతా చూడలేదు కదా! నీవు చూడని ప్రపంచం ఎంత గొప్పదో, ఎంత కాంతివంతమైనదో తెలుసా! రాజ్యాలు, రాజులూ, కొలువు కూటాలూ, సభలూ, వింతలూ విశేషాలూ ఎన్నెన్నో! అనుభవజ్ఞానం అన్నిటికన్నా గొప్పది. మన అంతర్దృష్టిని విశాలం చేస్తుంది. తెలివిగలవాడికి అనుభవం లేకపోతే గాడిదలు రాజ్యం చేస్తున్నట్లుగా ఉంటుంది. అస్తమానం చీదరించుకుంటూ, పిరికితనంతో వ్యవహరిస్తూ, లోకజ్ఞానం లేనివాడు మొండిగా, దృఢచిత్తం లేకుండా, సాహస నిర్ణయాలు తీసుకోకుండా, నూతిలో కప్పలా పడి వుంటాడు. నేను నీ కళ్లముందు ఈ భూప్రపంచంలోని మహాసామ్రాజ్యాలను వాటి భోగభాగ్యాలను, ఆడంబరాలను, అద్భుతమైన లలితకళల వైభవాలను, రాజకోట రహస్యాలను చూపిస్తాను. వాటిని చూసి నీవు ఎన్ని శక్తులను, ఎంత వ్యతిరేకతను జయించాలో నిర్ణయించుకుందువుగాని"

అలా చెబుతూ ఆతడు దైవకుమారుడిని ఒక ఎత్తైన కొండశిఖరం మీదకు తీసుకునివెళ్లినాడు. ఆ పర్వతపు పాదాల చెంత ఆకుపచ్చని మైదానాలు చుట్టూ విస్తరించి ఉండగా, పక్కనే ప్రవహిస్తున్న రెండు నదులు ఒకటి వంపులు తిరిగి, మరొహటి తిన్నగా, ఆ రెంటిమధ్య విస్తరించిన మైదానం, మొక్కజొన్న తోటలు, నూనె, ద్రాక్షసారాయి తయారీకి కావలసిన సౌకర్యాలు, పచ్చికబయళ్ల నిండా ఉన్న గొర్రెల, పశువుల మందలు, పల్లెటూళ్లు, పట్టణాలు, పెద్దపెద్ద బురుజులు కోటగోడలతో దుర్గనగరాలు, చక్రవర్తుల సభాప్రాంగణాలు, సింహాసనాలు, అక్కడక్కడా ఎడారులు. అవి కనిపిస్తున్న కొండ శిఖరంపైన నిలబడి వాటిని చూపిస్తూ సాతాను అన్నాడు–

"మనం ఇప్పుడు త్వరత్వరగా కొండలు, లోయలు, మైదానాలు, అడవులు, నదీనదాలు, దేవాలయాలు, కోటలు ఎన్ని వీలయితే అన్నిటిని చూద్దాం! అదిగో అది– అస్సిరియా (Assyria) సామ్రాజ్యం. అరాక్జిస్ (Araxis), కాస్పియన్ (Caspian) సరస్సుల మధ్య ఉండి తూర్పున సింధూనది (Indus) పడమట యూఫ్రటెస్ (Euphrates) నదుల వరకు, దక్షిణాన పర్షియన్ అఖాతం, అరేబియన్ సముద్రాలు హద్దులుగా ఉన్నది. ఇది నినస్ (Ninus) చక్రవర్తి స్థాపించిన నినెవీ (Ninevee) దుర్గ నగరం. ఆ కోటగోడల చుట్టూ తిరగడానికే రోజులు పడ్తాయి. సాల్మనస్సార్ (Salmanassar) ఆ రాజ్యాన్ని తన స్వర్ణసింహాసనంపై కూర్చుని పరిపాలించాడు. ఆతని విజయధాటికి ఇజ్రాయెల్ చానాళ్లపాటు ఖైదీగా ఉండింది. అదిగో అది అందరినీ ఆశ్చర్యపరచే బాబిలోన్ (Babylon)! రెండుసార్లు తిరిగి

నిర్మించబడింది. జూడా (Judah) దేశాన్ని, నీ తండ్రి డేవిడ్ నివాసాన్ని, జెరుసలెంను వశపరచుకున్న అతడే దానిని నిర్మించాడు. తర్వాత సైరస్ (Cyrus) దానిని విముక్తం చేసాడు. ఇది పెర్సిపొలిస్ (Persepolis) సైరస్ రాజధాని. అది బాక్ట్రా (Bactra), ఆ పక్కనే ఎక్బటానా (Ecbatana), అది హెకటామ్‌పైలాస్ (Hecatempylos). వంద ద్వారాలున్న పట్టణం. అది సుసా (Susa) ఛొయాస్పెస్ (Choaspes) స్వచ్ఛమైన జలాలు రాజులు తాగేందుకు అర్హమైనవి ప్రవహించే సెలయేరు పక్కన ఇమాథియన్ (Emathian) లేదా పార్థియన్ (Parthian)లచే నిర్మింపబడినది. సెల్యూసియా, నిసిబిస్, అట్రాక్సాటా, టెరెడాన్, టెసిఫాన్ (Selucia, Nisibis, Atraxata, Teredon, Tesiphon) వీళ్లందరూ పార్థియన్లే. ఏంటియోక్ (Antioch) నుంచి అర్సాసెస్ (Arsaces) గెలుచుకున్న ప్రాంతమది.

ఇప్పుడు నీ కళ్లముందే ఉన్న దృశ్యాన్ని చూడు! పార్థియన్ రాజు టెసిఫాన్ (Ctesiphon) దగ్గర స్కిథియన్ (Scythians)ల మదమణచి సొగ్డియానాను (Sogdiana) తిరిగి వశపరచుకోడానికి వేలాది సైనికులతో, యుద్ధసామాగ్రితో, లోహపు విల్లులు బాణాలతో, పారిపోయేప్పుడు, ఎదుర్కొనేప్పుడు కూడా భయంకరమైన యుద్ధం చేసే అశ్వికులతో వివిధ సైనిక వ్యూహాలైన – చతుర్భుజం, గొడ్డలి అంచు, అర్ధచంద్రాకారం, రెక్కల ఆకారాలలో (Rhomb, Wedge, Half-moon, Wings) సైనికులు ఒక క్రమపద్ధతిలో ముందుకు సాగుతున్నారు, చూడు!

అతడు చూసేప్పటికే కోట ద్వారాలు తెరచుకోగా అసంఖ్యాకంగా సైనికులు సన్నని గొలుసుల కవచాలు ధరించినవాళ్లు (Mail), ఆయుధాలు చేబూనినవాళ్లు, తాము తమతోబాటు తమ అశ్వాలకు గూడా దుర్భేధ్యమైన గొలుసు కవచాల రక్షణ నేర్పరచి వస్తున్నవాళ్లు, అనేక దుర్గాల నుంచి, అనేక ప్రాంతాల నుంచి – అరకోసియా, కాండర్, మార్జియానా, హైర్కానియన్ గుట్టలు, కకాసస్, ఇబెరియన్ కనుమలు, ఎట్రోపాటియా చుట్టుపక్కల మైదానాలు, అడియాబెనె, మెడియా, దక్షిణ సుసియానా, బల్సారా (Arachosia, Candor, Margana, Hyrcanian cliffs, Cacasus, Iberian dales, Atropatia plains, Adiabene, Media, South of Susiana, Balsara) ప్రాంతాల నుంచి వస్తున్న సైనికులు, అశ్వికులు, రధికులు; యుద్ధానికి వస్తున్నవాళ్లపై, పారిపోతున్న వాళ్లపై వర్షంలా కురుస్తున్న బాణాలు, రణరంగమంతా లోహమయమే! కాల్బలంతో కాల్బలం, అశ్వికులతో అశ్వికులు, రధికులతో రధికులు, ఏనుగు అంబారీలపై కూర్చుని బాణాలు, బల్లేలు విసుర్తున్న సైనికులు, గొడ్డళ్లు, కత్తులు, బల్లేలు ధరించి పోరాడుతున్న సైనికులు గుట్టలు, మైదానాలు, అడవులు నిండగా, నదులపై, ఏర్లపై వంతెనలు కట్టగా, రహదారుల మీద పోతున్న కంచర

గాడిదలు, ఒంటెలు, రెండు మూపులున్న డ్రొమెడరీ ఒంటెలు, యుద్ధసామాగ్రితో నిండిన బళ్లూ, ఓ పెద్ద సైన్యసమూహం – అల్‌బ్రక్కా (Albracca)ను ముట్టడించిన అగ్రికన్ (Agrican) సైన్యంలా, (అల్‌బ్రక్కారాజు, గల్లాఫ్రోన్ (Gallaphrone)ను ఓడించి ఆతని కుమార్తె, అతిలోక సౌందర్యవతి ఏంజెలికా (Angelica)ను పెండ్లాడినాడు.) ఉన్నదానిని చూపిస్తూ సాతాను మన రక్షకునితో ఇలా అన్నాడు.

"నేను నీ సద్గుణాలకు పరీక్ష పెడ్తున్నానని అనుకోవద్దు. నీ రక్షణను దృష్టిలో ఉంచుకునే చెబుతున్నాను. ప్రవక్త చేత, దేవదూత చేత నీ రాజ్యం వస్తుందని చెప్పబడినా, దానికోసం నీవు కృషి చేయక తప్పదుకదా! డేవిడ్ ఎంత శ్రమ, ఇడుములకోర్చుకుని యుద్ధాలు చేసి ఈ రాజ్యాన్ని నిలబెట్టుకున్నాడో తెలిసిందే! కాబట్టి నీవైనా యుద్ధమో, మంత్రాంగమో ఏదో ఒకటి చేస్తేనే నీ రాజ్యం స్థాపింపబడ్తుంది. ఒకవేళ మాటవరసకి నీ రాజ్యం సమరియన్లు, యూదులు అందరి సమ్మతిని, ఏకాభ్రిప్రాయంతో వచ్చిందనుకుందాం. రోమన్ల, పార్థియన్ల మధ్యన ఉన్న ఈ దేశం సుస్థిరంగా ఎలా ఉండగలుగుతుంది? దగ్గరగా ఉన్న పార్థియన్లు మొదటి దెబ్బ కొడతారు. ఏంటిగోనస్, హిర్కానస్ (Antigonus, Hyrcanus)లను బంధించి తీసుకొనిపోయింది ఈ మధ్యనే కదా! అయినా పార్థియన్లను నీ వశం చేస్తాను. వారితో రోమన్లను ఒడించి నీ రాజ్యాన్ని సుస్థిర పరచుకోవచ్చును. అలా డేవిడ్‌కు సరైన వారసుడిగా, నీ సోదరులను విముక్తిచేసిన వీరుడిగా ఖ్యాతిగాంచు. ఆతని పది తెగలు హాబర్ (Habor), మెడెస్ (Medes) ప్రాంతాల్లో చెల్లాచెదరుగా ఉన్నారు. జాకబ్ (Jacob) పదిమంది కొడుకులు, పరాయి ప్రాంతాల్లో బతుకుతున్న వాళ్లను విముక్తం చేయి. అప్పుడే నీకు డేవిడ్ సింహాసనం అత్యంత కీర్తివంతమై, ఈజిప్టు నుంచి యూఫరేటెస్ (Euphrates) వరకూ రోమ్, సీజర్ల భయం లేకుండా దినదినాభివృద్ధి చెందుతుంది"

ఆ మాటలకు మన రక్షకుడిలా సమాధానమిచ్చాడు–

"నా కళ్లముందు అనేక రకాల బలమైనవి, బలహీనమైనవీ అయిన యుద్ధపు పనిముట్లను చూపించావు. ఈ వ్యూహాలూ, యుద్ధాలూ, కూటములూ, శత్రునాశనాలూ నా దృష్టిలో ఎందుకూ కొరగానివి. నేను యుద్ధం చేయకపోతే రాజ్యాన్ని సాధించలేనని నీవంటున్నావు. నేను అంటున్నది రాజ్యం వచ్చే సమయమింకా రాలేదని. ఆ సమయం వచ్చినప్పుడు నేను నా పద్ధతిలో యుద్ధం చేస్తాను. నీవు చెబుతున్న యుద్ధవ్యూహాలు, యుద్ధసామాగ్రి, యుద్ధతంత్రాలు అవి మానవుల బలాన్ని కాదు బలహీనతను తెలియ జేస్తున్నాయి. ఆ పది తెగల గురించి చెబుతున్నావు. నీకెందుకీ ఉత్సాహం! ఇజ్రాయేల్ కోసమో, డేవిడ్ కోసమో లేక ఆతని సింహాసనం కోసమో అంటున్నావు; కేవలం

మూడు రోజుల్లో డెబ్భై వేల మంది ఇజ్రాయెల్ ప్రజలు మహమ్మారి (Pestilence)తో మరణించినప్పుడు నీవెక్కడున్నావు? ఈ పది తెగల ప్రజలూ దేవదేవుణ్ణి ధిక్కరించి ఆవుదూడల్నీ, ఈజిప్టు దేవుళ్లనీ, బాల్, అష్టారొత్ (Baal, Ashtaroth) లాంటి దేవతల విగ్రహాలను పూజిస్తూ పాపకార్యాలను చేస్తున్నారు. వాళ్లు బందీలుగా ఉన్న దేశాలలో కూడా దేవదేవుని పూజించకుండా ఆతని క్షమను, కరుణను కోరకుండా జీవిస్తున్నారు. వారికి జెన్‌టైల్స్ (Gentiles) అనబడే విగ్రహారాధకులకు పెద్ద తేడా ఏమున్నది? నేను వీళ్ల విముక్తి గురించి ఎందుకు చింతించాలి? వారు స్వచ్ఛందంగానే తండ్రుల సాంప్రదాయాన్ని వదిలి, పశ్చాత్తాప పడక, మారక, పరాయి దేవుళ్లైన బెథెల్ (Bethel), డాన్ (Dan)లకు సాష్టాంగపడుతూ ఉన్నపుడు నేను వాళ్ల గురించి ఆలోచించను. వాళ్లు విగ్రహారాధకులకు బానిసలుగా ఉండడమే సమంజసం. ఎప్పుడైనా వాళ్లకు అబ్రహాం (Abraham) లాంటి వాళ్ల పూర్వీకులు గుర్తుకు వచ్చి, పశ్చాత్తాపపడి వాళ్లంతట వాళ్లు వెనక్కు మళ్లితే మంచిదే! వాళ్లు వచ్చేట్లయితే అస్సిరియన్ సముద్రం కూడా రెండుగా చీలి వారికి దారినిస్తుంది. ఆనాడు వాళ్ల తండ్రులు తిరిగివస్తుంటే ఎర్రసముద్రం (Red Sea) చీలి వాగ్దానం చేసిన దేశంలోకి దారి ఇచ్చినట్లు వీరికీ శుభం కలుగుతుంది. ఆ అదృష్టం, కాలం కలిసివచ్చేంత వరకు వాళ్లను అలాగే వదిలేద్దాం"

ఆ విధంగా ఇజ్రాయెల్‌కు నిజమైన రాజు, సాతానుకు సమాధానమిచ్చినాడు. సత్యంతో మోసం తలబడినప్పుడు కలిగే ఫలితంలానే రక్షకుడి ముందు మోసగాడి ఎత్తులన్నీ వ్యర్థమైనాయి.

4. సాతానుపై విజయం సాధించిన దైవకుమారుడు

తన మాయోపాయం బెడిసికొట్టగా, నిర్విణ్ణుడై, ఏమి చేయాలో పాలుపోని సాతాను, నోట మాటరాక నిలబడ్డాడు. తన వాగ్ధాటితో 'ఈవ్'ను మోసపుచ్చగలిగాడు గాని ఈ మానవుడేమిటి కొరకరాని కొయ్యలా, తన పాఠాలు తనకే చెబుతున్నాడని చింతించి ఇరువురి బలాబలాల్ని మరొక్కసారి బేరీజు వేసుకుని, కుయుక్తులలో సాటిలేనివాడిగా ప్రసిద్ధికెక్కిన తన గొప్పతనాన్ని మరోసారి ఋజువు చేసుకునే ప్రయత్నంలో, ద్రాక్షగుత్తుల్ని ఒత్తే బల్లల దగ్గర గుమికూడే ఈగల గుంపు, తరిమినకొద్దీ మరల మరల ఝుమ్మని వస్తున్నట్లు, సముద్రపు అలలు మరల మరలా వచ్చి బండరాతికి తగిలి నురుగు, తుంపరులుగా విరిగినట్లు సాతాను తన ప్రతి ప్రయత్నమూ వ్యర్థమై చివరకు తననే మౌనంలోకి మిగల్చగా, ఓటమి భరించలేక, మరల ప్రయత్నించ కోరినాడు. దైవకుమారుడిని పర్వతపు పడమటి దిక్కుగా తీసుకుని వచ్చి అటువేపు మరీ అంత వెడల్పు లేకుండా, దీర్ఘంగా ఉన్న మైదానం దక్షిణదిక్కున సముద్రం, ఉత్తర దిక్కున పర్వతాలు ఎల్లలుగా ఉన్న దానిని చూపించాడు. ఆ ఉత్తరపు కొండగట్టు, భూమి మీద ఉన్న ఫలవృక్షాలను సెప్టెన్‌ట్రయాన్ (Septentrion) శీతల గాడ్పుల నుంచి కాపాడుతుంది. ఆ మైదానం మధ్యలో ప్రవహిస్తున్న నది దానికిరువైపులా దేవాలయాలు, కోట బురుజులు, రాజప్రాసాదాలు ఉన్న గొప్ప నగరం ఉన్నది. ఏడుకొండలపై నిర్మించిన అనేక భవనాలు, సభాప్రాంగణాలు, వరండాలు, స్నానాల గదులు, కాలువలు, విగ్రహాలు, విజయతోరణాలు, విజయ చిహ్నాలు, ఫలపుష్ప వనాలు, తోటలు వీటన్నిటితో ఆ నగరం కనులకింపుగా అద్భుతంగా పర్వతాలకన్నా ఎత్తుగా కనపడింది. దానిని చూపిస్తూ ఆ మాయావి మన రక్షకునితో ఈ విధంగా అన్నాడు– "నీవు చూస్తున్న ఆ నగరం రోమ్ (Rome), నగరాలకు మహారాణి, సంపదలకు నిలయం, అన్నిటికన్నా ఉన్నతమై టార్పియన్ (Tarpeian) గుట్టపై శత్రుదుర్భేద్యంగా నిర్మించబడినది. అక్కడి పాలటైన్ (Palatine) పర్వతంపై వున్న రాజప్రాసాదం అత్యున్నతమై అద్భుతమైన కళాసంపదలతో ఉట్టిపడుతూ, మెరుస్తున్న బురుజులతో, గోపురాలతో, వరస వరండాలతో, శంకు శిఖరాలతో (Spires) కాంతులీనుతున్నది. పక్కనే పెద్దపెద్ద భవనాలు, దేవతల హర్మ్యాలూ ఉన్నవి, అద్భుతమైన శిల్పసంపదతో నిండిన స్తంభాలు, పైకప్పులలో విభిన్న కళాకృతులు, చేయితిరిగిన కళాకారులు శిలల్ని, కొయ్యదుంగల్ని తొలిచి చేసిన మనోహర మూర్తులు, దేవదారు కలప, ఏనుగుదంతం, చలువరాయి, బంగారంతో చేసిన ద్వారాలు,

తలుపులు, వాటినుండి వస్తూపోతూ వున్న న్యాయాధిపతులు, రాజప్రతినిధులు రాజప్రతీహారులు, దండనాయకులు, తలారీలు, వారివారి హోదాలకు తగిన దుస్తులను ధరించి అటుయిటూ హడావుడిగా తిరుగుతున్నారు. రోమన్ సైనికులు దళాలుగా, పటాలాలుగా, లెజియన్లుగా, కోహార్ట్‌లుగా (Legions, Cohorts) అనేక సేనా విభాగాలుగా కాల్బలం, అశ్వికదళం, రథాలు కవాతు చేస్తూ ఉండడం కనిపించింది. రోమన్ రహదారులపై. అప్పియన్ వీధిలో (Appian road), ఎయిమిలియన్ (Aemilian) బాటలో, దక్షిణాన ఉన్న సైనె (Syene) – ఇక్కడ నీడ రెండు వేపులా పడుతుంది– మెరో, నిలొటిక్ ద్వీపం, (Meroe, Nilotic Isle) పడమట బాకస్ (Bacchus) సామ్రాజ్యం నుంచి, బ్లాక్‌మూర్ సముద్రం (Blackmoor Sea) వరకూ, ఆసియా రాజులు, పార్థియన్లు, ఇండియా, బంగారు ఛెర్సొనెస్సె (Chersonesse;) చిట్టచివరి ఇండియాద్వీపం టాప్రొబేన్ (Taprobane) – నల్లటి మొహాలపై తెల్లటి సిల్కు తలపాగా ధరించినవారుండే ప్రాంతం, గాలియా, గేడ్స్, పశ్చిమ బ్రిటన్‌లు, జర్మన్లు, స్కిథియన్లు, ఉత్తర సర్మాటియన్లు, డానుబియస్ (Danubius)ను దాటి టారిక్ సరస్సు (Tauric Pool) వరకూ, అన్ని రాజ్యాలూ రోమన్ నగరానికి తమ విధేయతను ప్రకటిస్తున్నాయిప్పుడు. రోమన్ మహాచక్రవర్తి విశాలమైన సామ్రాజ్యంతో అంతులేని సంపద, అధికారం, మాటమర్యాద, ఆయుధాలు, లలితకళలు అన్నిటిలోనూ అత్యున్నత స్థితికి చేరుకున్నాడు. అటు పార్థియన్లు, ఇటు రోమన్లు తప్ప మిగతావన్ని అనాగరిక జాతులే! చిన్నచిన్న రాజ్యాలూ, చిల్లర ప్రభువులూ వాటిని చూడాల్సినంత గొప్పవేమీ కావు! నీకు ఈ ప్రపంచంలోని రాజ్యాలనూ, వాళ్ల కీర్తిప్రతిష్టలనూ చూపించాను. ఆ రోమను చక్రవర్తి వృద్ధుడైనాడు. సంతానం లేదు. అయినా కోరికలు తగ్గలేదు. రోమ్‌ను వదలి కాప్రియా (Capriae) ద్వీపానికి పోయి కంపానియన్ (Campanian) తీరాన తన అనహజ శృంగారపు కోర్కెలను తీర్చుకో ప్రయత్నిస్తున్నాడు. అతని క్రూరత్వానికి, పాపకార్యాలకు విసిగిన ప్రజలు అతనిని ఏ క్షణానైనా తొలగించే ఉద్దేశంలో ఉన్నారు. ఆ రాక్షసుణ్ణి సింహాసనం నుంచి కూలదోసి నీలాంటి సద్గుణ వంతుణ్ణి రోమ్‌కు పరిపాలకుణ్ణి చేయడం సమంజసమని నా అభిప్రాయం. నా సహాయంతో నీవు చక్రవర్తివి కాగలవు. నాకు ఈ అధికారం ఇవ్వబడినది. నీవు అంగీకరిస్తే నేను ఆ అధికారాన్ని నీకు ధారపోస్తాను. కాబట్టి అత్యున్నత స్థానాన్ని లక్ష్యంగా ఎంచుకో! నీవంటి ప్రజ్ఞాశాలికి, డేవిడ్ సింహాసనం కాదు, యూదుల రాజ్యం కాదు, ఈ భూప్రపంచమే తగిన అర్హత కాగలదు”

దానికి దైవకుమారుడు ఏమీ చలించకుండానే సమాధానమిచ్చాడు– “నీవు చూపించిన అద్భుత రాజప్రాసాదాలో, మహానగరాలో, ఏవీ నన్ను చలింప జేయలేవు.

ఈ ఆడంబర జీవితాలు, దివ్యహర్మ్యాలు, ధనసంపదలూ, నీవింతకు ముందు చూపించిన ఆయుధ సంపదలలానే నన్ను ఆకర్షించలేదు. అవన్నీ అత్యాశను, ఎంతకూ చల్లారని ఆకలిని సూచిస్తాయి. సిట్రన్ బల్లలమీద, అట్లాంటిక్ ఫలకాలమీద పేర్చబడ్డ అపారమైన ఆహారపుదినుసులు, వంటకాలు, సెటియా, కేల్స్, ఫాలెర్నె, కియాస్, క్రెటె (Setia, Cales, Falerne, Chios, Creet) నుంచి వచ్చిన ద్రాక్షసారాయిని, బంగారు, స్ఫటిక మణిమయ పాత్రలలో పోసి తాగుతూ, తింటూ ఉన్నవాళ్లని చూపించావు. ఎంత ఉన్నా తిన్నా ఆకలిదప్పులు చల్లారనివాళ్లు వీళ్లు! ఎన్ని రాజ్యాలయితేనేం, ఏ సామ్రాజ్యాలైతేనేం అన్నీ అబద్ధాలు, పొగడ్తలూ, అతిశయోక్తులే గదా! వాటికంత సమయాన్ని వృధా చేయడమెందుకు? ఆ చక్రవర్తి గురించి, ఆ వృద్ధుడైన రాక్షసుడి గురించి చెప్పి వాడిని బహిష్కరిద్దామన్నావు. మరి ఆ చక్రవర్తిని రాక్షసుడిగా మార్చిన పిశాచాన్నేం చేయాలి? ఆతని అంతరాత్మనే అడగమందాం! అతనికోసం నేనిక్కడకు పంపబడలేదు. ఒకప్పుడు సచ్ఛీలుడై ఉండీ ఇప్పుడు వ్యసనాలతో మునిగితేలుతున్న వారిని ఉద్ధరించడానికి నేను రాలేదు. ఒకప్పుడు అతి సామాన్యమైన జీవితాన్ని గడిపి ఇప్పుడు రాజాధిరాజులై జగమేల్తున్న వాళ్లని దించడానికీ రాలేదు. విజయంతో పెరిగిన కోరికలు, ఆడంబరాలు, హింస, రక్తపాతం, మృగాలతో పోరాడిన మానవులు మృగాలై ప్రవర్తించడం, ధనసంపదలు పెరిగినకొద్దీ మరింత ఆశపోతులవడం, దేన్నైతే వ్యతిరేకించి, పోరాడి విజయులయ్యారో ఆ వ్యసనాలకు, చెడు అలవాట్లకు బానిసలవడం ఇవన్నీ యదార్థమే కదా! అంతర్గత బానిసలు స్వేచ్ఛా జీవులెట్లవుతారు? అర్థంచేసుకో! నేను డేవిడ్ సింహాసనాన్ని అధిష్ఠించే సమయం వచ్చినప్పుడు, అది ఒక మహావృక్షమై ఈ భూప్రపంచానికంతా కావలసిన నీడను చల్లదనాన్నిచ్చేట్లు వ్యాపిస్తుంది. ఒక గండశిలలా ఈ రాజ్యాలన్నిటినీ ముక్కలు చెక్కలు చేసి అనంతమైన సామ్రాజ్యాన్ని స్థాపిస్తుంది. ఎలా జరుగుతుందో నీకు తెలియదు. తెలిసిన నేను నీకు తెలియజెప్పబోను"

అయినా సాతాను తన పట్టు వీడకుండా చెప్పసాగినాడు– "నేను నీకేది చెప్పినా దానిని తీసి పడవేస్తున్నావు. దాని విలువ తెలుసు నీకు అయినా ఉచితంగా ఇస్తున్నాననుకుని తిరస్కరిస్తున్నావు. కొంతమందికి ఏమిచ్చి అయినా సంతోష పరచలేము. దేన్నైనా వాళ్లు లోకువగానే చూస్తారు. నేను నీకు ఇవ్వజూపుతున్నది అల్పవిషయం కాదు ఈ ప్రపంచ సార్వభౌమత్వాన్ని. అది నా పరిధిలో, నా శక్తికి లోబడినదే నేను నీకు ఇస్తున్నాను. ఒకటే షరతు నన్ను నీ ప్రభువుగా అంగీకరించు. "Worship me as thy superior Lord" అది అతిసులభంగా చేయగల పని. నీకిచ్చే గొప్ప కానుకకు ఇది చిన్న కృతజ్ఞత మాత్రమే కదా!"

ఆ మాటలకు మన రక్షకుడన్నాడు– "నీ మాటలు నాకెన్నడూ అంగీకారం కావు. అవి నాకు నచ్చవు. అవి నీవిచ్చే కానుకల రూపంలో ఉన్న ఉచ్చులు. నీవు చెబుతున్న అసహ్యకరమైన షరతులున్నాయి చూడూ వాటిని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాను. నేను ఓపికపడ్తున్నది నీకు నాతో మాట్లాడడానికి ఇవ్వబడిన సమయం గడిచేంత వరకూ! అది ముగింపుకు వస్తున్నది. దశాజ్ఞలలో మొదటిది – దేవదేవుణ్ణి మాత్రమే పూజించాలి – అన్న దానిని మరచి దైవకుమారుడినే నీ పూజ చేయమని ఆశలు చూపిస్తున్నావు! ఈ ప్రయత్నం నీవు 'ఈవ్'పై ప్రయోగించిన కుయుక్తికన్నా తీవ్రమైనది, ధైర్యంతో కూడుకున్నది కూడా! ఈ దైవదూషణకు శిక్ష తప్పదు. నీవు చెప్పిన రాజ్యాలూ, సామ్రాజ్యమూ నీచేత మోసపూరితంగా ఆక్రమించుకోబడినవి, ఆ దేవదేవుని అనుజ్ఞ వలన కొంతకాలము నీ అదుపాజ్ఞలలో ఉండేలా నిర్ణయింపబడినవి. అది నిజమైనప్పుడు నీవు ఆ దేవదేవునికి కృతజ్ఞతతో ఉండాలి కదా! నీలో కృతజ్ఞతాభావం ఏనాడో నశించింది. సిగ్గు, భయం లేకుండా దేవదేవుడు నీకిచ్చిన వాటిని దైవకుమారుడనైన నాకు కాన్కలుగా ఇచ్చి పైగా నిన్ను నా ప్రభువుగా అంగీకరించాలనే షరతు పెడ్తున్నావు. నిన్ను నా ప్రభువుగా అంగీకరించాలంటే నేను ఎంత పతనం చెందాలి? పైకి సాధారణుడిగా అగుపిస్తున్నా నీలో సాతాను ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాడు"

దానికి సాతాను సమాధానమిచ్చాడు– "ఇంత మాత్రానికే కోపించవలదు. దైవకుమారా! నీవూ, దూవదూతలమైన మేమూ దేవుని కుమారులమే! నేను నీరాక నా పతనానికి మూలకారణం అవుతుందని చెప్పబడిన జోస్యంలోని నిజానిజాల్ని తెలుసుకొనగోరి ఇలా చేస్తున్నాను. ఈ పరీక్ష నీకేమీ కీడును కలిగించలేదే! పైపెచ్చు నీకు మరింత గౌరవాన్ని, జ్ఞానాన్ని ఇచ్చింది. నాకు ఏ లాభమూ ఒనగూడలేదు. నేను గురిచూసిన లక్ష్యం తప్పింది. అంతే! ఈ తాత్కాలిక విరోధాన్ని మరచిపోదాం! ఈ రాజ్యాలను, ఆధిపత్యాన్ని నేనింక చెప్పబోను. బహుశా ఈ ప్రపంచాధిపత్యం కన్నా విలువైనదేదో నీవు ఆశిస్తూ ఉండి వుండవచ్చు. అందుకే నీవు నీ తల్లి ఒడినుంచి దేవాలయంలోకి వెళ్లి పండితసభలో చర్చలకు కూర్చున్నావు. మోసెస్‌లా కనిపించావు. అందుకే బాల్యంలోనే జీవితపు అడుగుజాడలు కనిపిస్తాయనేది. ఉదయం – రోజంతా ఏం జరగనున్నదో చెప్పినట్లే బాల్యం–తరువాతి జీవితాన్ని విడమరుస్తుంది. జ్ఞానంతో ప్రసిద్ధికెక్కే ఉద్దేశం ఉన్నపుడు దానినే ఈ ప్రపంచమంతా వ్యాపింపజేసి మోసెస్ దశాజ్ఞలు, న్యాయస్మృతులకన్నా అధికమైన జ్ఞానాన్ని ప్రవచించు. ప్రవక్తలు పేర్కొన్న పెంటాట్యూక్ (Pentateuch), జెన్‌టైల్స్ సంపాదించుకున్న జ్ఞానాన్ని, ఇవన్నీ తెలుసుకున్నప్పుడే అందరినీ పాలించగలిగిన సామర్థ్యం వస్తుంది. వాదనతో వాళ్ల

సిద్ధాంతాలను, ఆచారాల్ని, వైరుధ్యాల్ని పూర్వాపరం చేయడానికి ఇతోధికమైన జ్ఞానం అవసరం. ఇదిగో ఇటుచూడు!

ఈ పర్వతానికి నైఋతీ దిశలో (South-West) ఎగియన్ తీరాన (Aegean Shore) ఉన్న గ్రీసుదేశపు నయనం – ఏథెన్స్ (Athens). లలితకళల్లో, వాగ్ధాటిలో, హాస్యచతురతలో, అతిధి మర్యాదలలో ప్రసిద్ధికెక్కిన నగరం. చక్కని కాలిబాటలు, వనాలు, చెట్లనీడలతో అత్యంత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆ ఆలివ్‌తోటలో ప్లాటో (Plato) విద్యాలయం (Academe) ఉన్నది. అక్కడే అటిక్ పక్షి (Attic bird) తన ముక్కుతో వేసవికాలమంతా జ్ఞానాన్ని లిఖిస్తుంది. హైమెట్టస్ (Hymettus) కొండలమీద పూలమొక్కలపై ఎగుర్తూ ఝంకారాలు చేస్తున్న తుమ్మెదలూ, తేనెటీగల సంగీతంతో అక్కడ లలితకళలనభ్యసిస్తూండేవాళ్ల ధ్వనులు, స్వరాలు మిళితమై ఉంటాయి. అక్కడే ఇలిస్సస్ (Elissus) సెలయేరు ప్రవహిస్తూ ఉంటుంది. ఆ పాఠశాలలోనే అలెగ్జాండర్ (Alexander) నాలుగు గోడల మధ్య తన విద్యలను నేర్చుకున్నాడు. లైసియమ్ (Lyceum), చిత్రకళల పుట్టినిల్లు స్టోవా (Stoa), ఎయొలియన్ మంత్ర గీతాలు (Aeolian Charms), డొరియన్ పాటలు (Dorian Lyric odes), అంధుడైన మెలెసిజినెస్ (Melisegenes) అతడే హోమర్ (Homer)గా ప్రసిద్ధికెక్కినవాడు– వ్రాసిన స్వగతగీతం ఫోబస్ (Phoebus); విషాదాంత నాటకాలు, కోరస్‌లు, అయాంబిక్ (Chorus, Iambic)లున్న గణసహిత గీతాలు, కావ్యాలు, మానవ జీవితాన్ని కడు రమ్యంగా చిత్రించిన కథనాలు ఆలకించు! గొప్పవక్తలు, వాళ్ల వాగ్ధాటితో అనాటి రాజకీయాల్ని శాసించినవాళ్లు, గ్రీసు, మాసిడోనియా (Greece, Macedonea)ల నుంచి అర్టాక్జెరెక్జెస్ (Artaxerxes) సింహాసనం వరకూ మంటలను సృష్టించిన వాళ్లూ నివసించిన ప్రదేశాలవే! "To sage Philosophy next lend thine ear" - ఇప్పుడు వేదాంతుల గురించి– స్వర్గం నుంచి సొక్రటీస్ (Socretes) ఇంట్లోకి దిగివచ్చిన వేదాంత జ్ఞానమూ, ఆతని మాటల ప్రవాహం అన్నిదిక్కులకూ వ్యాపించి అనేక విద్యాలయాలకు జ్ఞానపు నీరందించిన తీరూ, పెరిపాటెటిక్స్ (Peripatetics), ఎపిక్యూరియన్లు (Ephicureans), స్టాయిక్స్ (Stoics), వేదాంత రహస్యాలూ చర్చలూ సామ్రాజ్యంతో సమాన ప్రతిపత్తి కలిగినవి, రాజును చక్రవర్తిగా రూపొందించగలిగినవి; వీటిని గ్రహించు"

ఆ మాటలకు మన రక్షకుడు జ్ఞానభావంతో సమాధానమిచ్చినాడు– "ఇవి నాకు తెలిసినవని, తెలియవనీ అనుకోవద్దు. ఎప్పటికి ఎంత అవసరమో అంత జ్ఞానం నాకు ఆ దేవదేవుడు అనుగ్రహిస్తూనే ఉన్నాడు. దైవజ్ఞానం ఉన్నవారికి ఏ

